రససిద్ధాంతము

— ఆంధ్రుల వరివస్య

భాషాప్రవీణ:


డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

తెలుగు లెక్చరర్

ఆంధ్రప్రదేశ గురుకుల కళాశాల

విజయపురి సౌత్ - 522 439

ప్రథమ ముద్రణ : 1981 అక్టోబరు



వెల రూ. **25-00**

ప్రతులకు : 1 T. V. S. గంగాధర కుమార్,
A 58, విజయపురి సౌత్ - 522 439

2 నవోదయ పబ్లిషర్సు
ఏలూరు రోడ్డు - విజయవాడ
అరండల్ పేట - గుంటూరు - 2

Paper is made available at concessional rate
by the Government of India.

రామచంద్రా ప్రింటర్స్, లాలాపేట, గుంటూరు - 3
ఫోన్ : 24842.



డాక్టర్ - తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

విలాసము : తెలుగు ఉపన్యాసకుడు

ఆంధ్రప్రదేశ గురుకుల కళాశాల

విజయపురి సౌత్ - 522 439

తల్లిదండ్రులు - వేరమ్మ, సత్యనారాయణలు.

విద్యాభ్యాసము : 1) శ్రీ మార్కండేయ సంస్కృత కళాశాల, ఆకిరిపల్లి

భాషాప్రవీణ - ప్రథమశ్రేణి - ప్రథముడు - 1957.

2. ఆంధ్రవిశ్వ విద్యాలయము - వాల్తేరు

ఎం. ఎ (తెలుగు) ప్రథమశ్రేణి - ప్రథముడు 1968.

పిహెచ్. డి. 1977, బి. ఇడి. 1966.

ఇతర రచనలు :

1. సంస్కృత భాణసాహిత్యము (సంయుక్తరచన)

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ పోటీలో ప్రథమ బహుమతి పొందినది.

నివేదన

అనంతకాల విశ్వవిశాల సాహిత్యజగత్తునకు అతిప్రాచీన కాలములో భారతీయ ద్రష్టలు ప్రసాదించిన ఒకవరము రససిద్ధాంతము - దేశకాల ప్రకృతుల కతీతముగ మానవజాతి మనస్తత్వమును పరిపాలించు మౌలికభావ వ్యవస్థ ఆధారముగ ప్రతిపాదింపబడిన దీ సిద్ధాంతము - దీనిని మార్గదర్శకముగ చేసికొనియే వివిధ ప్రస్థానములు ప్రవర్తిల్లినవి. తత్ప్రస్థాన ప్రవర్తకుల మధ్య ఎన్ని మతభేదములున్నను సర్వనిబద్ధ సాహిత్య జీవాతువైన రసము యొక్క ప్రాముఖ్యమును గుర్తించినవారే అందరును.

కాని ప్రాచీనభావ సంస్థల యెడల ప్రతిపత్తి సడలి మరకువ పెరిగి ఉపరి అపార్థములకు అపుడే కొణయాచి యగుచున్న ఈ కాలమున రససిద్ధాంత స్వరూపము నావిష్కరించుట యొక సరస్వతీ వరివస్య యగునను ఆశతోడను, విశ్వవ్యాప్తమైన కవితాత్మను సందర్శించినట్లగునను విశ్వాసముతోడను ఈ యుద్యమున కుపక్రమించితిని.

ఆనందవర్ధన ప్రాధాన్యముతో హితోపదేశమును అభినవరీతిలో జగన్నాథపద ప్రసారితమైన రసగంగవలె అందించుట సాహిత్యము యొక్క సమగ్రఫలము, తత్సమగ్రఫలాస్వాదము రసజ్ఞుల సమ్మోదవిధి - ఆ యాస్వాదమునందలి రుచి ప్రకారమును వింగడించి చెప్పి సహృదయులకు ఆనందవర్ధన మొనరించుట ఆలంకారికుల ప్రమోదవిధి - ఈ వింగడింపును పరిశీలించుట అంతర్యమును వెలువరించుట పరిశోధకుల ప్రమాణ విధి.

ఈ నా విధి నిర్వహణమును గూర్చి ఒక్క మాట - ప్రాచీన సంస్కృతాంధ్రసారస్వత ద్రష్టలను స్రష్టలను రససిద్ధాంత ఘంటాపథాధ్వనీనులే. ముందా ద్రష్టలు మాదరించిన సిద్ధాంత సంబంధులగు అభిసంధుల యాంతర్యమును సమీక్షించి తదుపరి ప్రాచీనాంధ్రకవుల రసదృష్టిని గుఱించి యథావకాశముగ ఒక శాస్త్రీక సమాలోచన మొనరించితిని. తద్విషయకమయిన చారిత్రక సమాలోచనమును, ప్రతి రసమునకు నైకముఖీన ప్రతిపత్తికల ఆధునికాంధ్రవాఙ్మయ సమాలోచనమును గ్రంథ విస్తర భీతి చేతను, అవలవి యొక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేక గ్రంథమునకు తగినంత సామగ్రికాగలవను ప్రాజ్ఞతచేతను విడువక తప్పినదికాదు. ఈ గ్రంథవిస్తరో

శీలశోధనే చెప్పవలసినవియును, చెప్పినవియును కొన్ని విషయము లిందుచేర్పవలను పడలేదు, యథావకాశముగ వానిని వెలువరింపగలనని మనవి. ఈ నా పరిశోధన విధిలో ఉషోదయము కల్గించి మార్గోపదేష్టలయినవారు బ్రాహ్మీభూషణ శ్రీరాంభట్ల లక్ష్మీనారాయణ శాస్త్రిగారు, వెనువెంటనే వెలుగునింపి దర్శకులయినవారు శ్రీయస్వీ జోగారావుగారు. ఈ ఇరువురు గురువులకు ముందుగా నా కృతజ్ఞతా వందనములు

పరిశోధనమున అభినవభారతీ పరిశీలనమున మార్గము చూపిన శ్రీ కొల్లూరు లక్ష్మణమూర్తి శర్మగారికి నమోవాకములు. వివిధ గ్రంథ పరిశీలనమునందేగాక ముద్రణ పరిశీలనమునందును వాదోడు చేదోడుగా నున్న ఆత్మీయులు ఉత్తమాధ్యాపకహృదయామతిగ్రహీతలు శ్రీ సూరం శ్రీనివాసులు గారికి నా శుభాభివందనములు.

ఈ సిద్ధాంత వ్యాస పరీక్షకులు 1. ఆచార్య తుండవల్లి లక్ష్మీరంజనంగారు, 2. దాదాల రామయ్యగారు, 3. ఇలపావులూరి పాండురంగారావుగారు - ముువ్వురును ఏకగ్రీవముగ డాక్టరేట్ పట్టప్రదానముతోపాటు సత్వర ప్రచురణావశ్యకమును కూడ సముద్ఘాటించిరి. ఈ పండితత్రయమునకు నా ప్రణామములు.

ఇక నీరాజనమును గూర్చి : నా S. S. L. C. తరువాత కొన్ని క్లిష్ట పరిస్థితులలో నన్ను ఆకిరిపల్లి శ్రీ మార్కండేయ సంస్కృత కళాశాలలో చేర్చి సంవత్సరము తిరుగకుండగనే కన్నుమూసిన మా తండ్రిగారు - నాకు జన్మను ప్రసాదించుటేకాక, అంధకారబంధురమైన జీవనాకాశమున పాలపుంతను చూపినవారు - వారికి నీరాజనము.

ఆకిరిపల్లి విద్యాభ్యాసము నా జీవితమునకే ఒక చక్కని మలుపును ప్రసాదించినది. ఎంతో వాత్సల్యమును ప్రసరింపజేయుచు విద్య ననుగ్రహించిన గురుపరంపరకీ నీరాజనము. (విద్యాభ్యాస సమయమున ఉద్యోగధర్మముతోడనేగాక చెప్పలేని ఆప్యాయతతో అన్నము పెట్టిన అంజయ్యగారిని స్మరింపకుండ ఉండలేను.)

మానసికమైన భయాందోళనములను ప్రశాంతపరచు వైదికమంత్రసాధన మార్గమున గురువులు ఇరువురు. వారికీ నీరాజనము.

ఇక పరిశోధనలో క్రమముగా ఒకరు మార్గోపదేష్టలు, మరొకరు దర్శకులు, వారిరువురకు ఈ నీరాజనము -

ఇంకను ప్రత్యక్షముగను, పరోక్షముగను నా అంతరంగమును పొంగారిన అధ్యాపకులు - వారికి ప్రణామము.

నా పరిశోధనమున పరిశీలనమునకై ప్రతులు ఇచ్చి సహకరించిన ఎందరో మహానుభావులు - అందరికి వందనములు.

దీని ప్రకటనమునకు అనుమతించిన యాజమాన్యమునకును, ఆర్థిక సహాయ మొనరించిన ఆంధ్రప్రదేశ ప్రభుత్వమునకును సర్వదా కృతజ్ఞుడను.

ముచ్చటగా ముద్రించిన రామచంద్రా ప్రింటర్స్ యజమాని శ్రీ కొవల్లి రాఘవేంద్రరావుగారికిని వారి సిబ్బందికిని, అభినందనములు.

తమ అమూల్యమైన అభిప్రాయము లొసగి ఆదరించిన విద్వద్వరేణ్యులకు అభివందనములు.

విశ్వవిద్యాలయమునకు సిద్ధాంత వ్యాసమును సమర్పించునపుడు వ్రాతప్రతుల సిద్ధ మొనర్చుటలో సాయపడిన మిత్రులు సర్వశ్రీ కె. వి. ఆర్. నరసింహాచార్యులు, ఎన్. సూర్యనారాయణ మూర్తి, కె. వి. యస్. సుబ్రహ్మణ్య శర్మ, జె. రామ ప్రసాద్ గారలకు, శ్రీమతి కె. అన్నపూర్ణగారికి, నా నమస్కారములు - చిరంజీవులు హరి. నరసింహశాస్త్రి, ఎ. కె. ప్రభాకర్, కె. వి. లక్ష్మణాచార్యులు శ్రీమతి ఎస్. వి. పరమేశ్వరులకు నా శుభాశీస్సులు.

అన్నింటిని మించి నా పరిశోధన సమయమున తగిన అనుకూల్యము ఘటించిన నా సహధర్మచారిణి శ్రీమతి సీతకు శుభాశీస్సులు.

ఈ గ్రంథమును ఎం. ఏ. (తెలుగు) విద్యార్థులకు పరీక్ష గ్రంథముగా నిర్ణయించుటకు కొంతమంది ప్రాచార్యులు అభిముఖ్యమును సూచించుచున్నారు - వారికిని వారితోడి ఇతర విశ్వవిద్యాలయ ప్రాచార్యులకును ముందుగానే నమస్సుమనస్సులు.

— రచయిత

శ్రీ గురుభ్యో నమః

నాకు ప్రథమ విద్యాగురువులు మాతండ్రిగారు

స్వర్గీయ తిప్పాభట్ల సత్యనారాయణ గారు

విద్యాభ్యాసమున

స్వర్గీయ కొల్లూరి సోమశేఖర శాస్త్రి గారు

" పేరి వేంకటేశ్వర శాస్త్రి గారు

శ్రీ ఖండ్రిక శేషావధానులు గారు

శ్రీ రామచంద్రుల కోటేశ్వర శర్మ గారు

శ్రీ చాడ సుబ్రహ్మణ్య చయనులు గారు

సాధనమున

స్వర్గీయ శ్రీ ఉపాధ్యాయుల నాగేశ్వరరావుగారు

శ్రీ మేడూరి లక్ష్మీనృసింహసోమయాజులుగారు

పరిశోధనమున

బ్రాహ్మీభూషణ - రాంభట్ల లక్ష్మీనారాయణ శాస్త్రిగారు

దర్శక గురువులు డాక్టర్ యస్వీ జోగారావుగారు.

ఇంకను నాకు ప్రత్యక్షముగను,

పరోక్షముగను...,

వివిధ దశలలో నాకు

విజ్ఞాన దీప్తిని — ఆత్మ సంతృప్తిని

అనుగ్రహించిన

గురువర్యులకు

అంకితము

ప్రదీప జ్వాలాభిర్దివసకర నీరాజన విధిః

Prof. S. V. JOGARAO, M. A. Ph. D.

Senior Proffessor of Telugu &
PRINCIPAL, Colleges of Arts, Commerce & Law
(Chairman, Board of Studies & Faculty of Oriental Learning)
Member : Syndicate, Senate; Academic Council, Bd. of Research Studies – Andhra University
(Formerly Proffessor of Telugu, Leningrad State University. USSR)

సహృదయ భూమిక

విశ్వవ్యాప్తమైన కావ్యాత్మను సంభావించిన భారతీయ సారస్వత మహాద్రష్టల స్వాంత సంతానము రససిద్ధాంతము - మానవమనస్తత్త్వమును పరిపాలించు మౌలిక భావసంపద పునాదిగా కళాశైలూషినైపత్యవైవిధ్యము సోపానసరణిగా వెలసిన మహానుభవ సౌధమది. ఈ పరిశోధన నిబంధము ఆ సరస్వతీ సౌధశుద్ధాంత ప్రసాధనము - ప్రాంగణరంగవల్లిక.

రససరస్వతీ సమారాధనములో అగ్రతాంబూలము సంస్కృత వాఙ్మయ స్రష్టలది ద్రష్టలది. రసచర్వణ పరాయణులయిన ఆంధ్రులు వారి వారసులు - రసవత్కవిత వారి వచస్సు యొక్క వర్చస్సు, మనస్సు యొక్క మహస్సు - ఆ రస సిద్ధాంతము యొక్క స్వరూప స్వభావములను సాంగోపాంగముగ నిరూపించి ఆ రససరస్వతికి ఆంధ్రులొనర్చిన వరివస్యను సమీక్షించిన మహత్తర పరిశోధన నిబంధ మీ గ్రంథము.

ఇటీవల వివిధ విశ్వవిద్యాలయములందు సంస్కృతాంధ్ర సారస్వతములలో బహుముఖముగ పరిశోధన పరాక్రమము ప్రదర్శింపబడుచున్నది - కాని భరతాచార్య ప్రోక్తములగు సిద్ధాంతవిషయములపై పరిశోధన కుద్యమించు ధైర్యసాహసముగల అంతర్వాణివరేణ్యులు మిక్కిలి అరుదు. అందును భరతముని ముఖవినిస్సృతము, అభినవభారతీకీర్తము, ధ్వన్యాలోకలోచనామృతమునైన రససిద్ధాంతమును అవగాహనాస్వాదముల పరిధిని దాటి స్పృశించుటయన్న వలంతుల పని గాని యలంతుల పనికాదు. అట్టి యుద్యమమునకు నడుకట్టి మాట దక్కించుకొన్నదిట్ట మా రామకృష్ణమూర్తి.

తాత తాతలనాటి తరతరాల వైదుష్యవైభవోజ్జ్వలమైన సంస్కారము, విల్లి బాయము నుండి క్రమవికస్వర శీలమయిన గురుకుల వ్యాసంగము, ప్రాజ్ఞతకు జీవాతువైన జిజ్ఞాస, అవగాహనమునకు నికషోపలమయిన నిదానము, ప్రతిభకు ఆప్తబంధువైన భావుకత, సత్కార్యసాధనా పాథేయమైన అభినివేశము, వివేచనచణమైన సంప్రదాయ ప్రవణత్వము, సహనసంయమన శీలమయిన కార్యదీక్ష, ఖేదక్షమమైన పరిశ్రమము, అను నీ వ్యక్తిత్వము నందలి ముడిపదార్థములు ఆంధ్రవాఙ్మయ రంగమున అతనినొక గడిదేరిన వస్తాదును చేసినవి

వివిధ దేశ కాలములలో విలసిల్లిన మానవుల బహిరంతరాకృతులలో దేశకాల భేదమును బట్టి ఒక వాసి ఏర్పడినదో - చిత్రము ! - అట్లే దేశకాలభేదాతీతముగ ఒక సమీచీనమయిన సమానత్వమును కలదు. అట్లే వివిధ దేశకాలభేదమును బట్టి భిన్నత నెలకొన్నను తద్భేదాతీతముగ సాహిత్యశబ్దవాచ్యత్వేన సమానతయు ప్రవర్తిల్లించినది. ఆ సమానత ప్రాణస్థాయువుగా ఆవిర్భవించినది రససిద్ధాంతము - అందుకే అది ప్రపంచ వాఙ్మయమునకే భారతీయాలంకారికులందించిన బంధుర సంపద అయినది. కాని ఈ సిద్ధాంత ప్రాశస్త్యమును గూర్చి సమ్యగవగాహనముండియు ఏ అలంకారికుడును కంఠోక్తిగ తత్ప్రాశస్త్యమును ఉద్ఘాటించి యుండలేదు.

రామకృష్ణమూర్తి తన గ్రంథమునకు రససిద్ధాంత ప్రాశస్త్యకథనముతో శ్రీకారము చుట్టియుండుట ముదావహము - రససామగ్రిని, రసానుభవ విషయమున గల మతభేదములను సామాన్య పాఠకుని బోధశాలితకు అనుగుణముగ ఆవిష్కరించినాడు. రససిద్ధాంత వికాస స్వరూపమును నిరూపించుపట్ల చతురస్రమైన చారిత్రక దృష్టినేగాక తత్తదాలంకారికుల కాలములను తారతమ్యమును గూర్చి ఆలోచనతో కూడిన అవగాహనమును ప్రకటించినాడు.

రససంఖ్యా విచారము అనేకాలంకారికులనే ఆమార్గము పట్టించినదని గ్రహించి రామకృష్ణమూర్తి చేసిన సమన్వయము సమగ్ర రమణీయము. రసభేద పరిగణన, రసాభాసాద్యనేక విషయ నిరూపణమును గురించిన సమీక్ష ఈ నిబంధనమున చక్కని లాక్షణిక దృష్టి తోడనేగాక బంధుర భావుకతతో కూడ సాగినది.

ఇక ఈ సిద్ధాంతమునకు ఆంధ్రములోనర్చిన పరివస్యను గురించి యించుక - ఆంధ్రజాతియందు విద్యానాథ జగన్నాథ ప్రభృతులు అతిమాత్ర విదగ్ధులయిన

యాలంకారికులు. సంస్కృతమున అలంకార శాస్త్రవాఙ్మయ ప్రతిష్ఠ పరకోటి ముట్టిన పిదప అవతరించిన వారు కావున ఆ శాస్త్రమున శతశాత సమగ్రమైన విశాలదృష్టి సారించి చక్కని సమన్వయముచేసి విశిష్టరసదృష్టిని ప్రకటించిరి. అట్లే మల్లినాథ ప్రభృతులయిన మహావ్యాఖ్యాతలును తమతమ వ్యాఖ్యానములందు రససిద్ధాంతమును గూర్చిన శాస్త్రీయ దృక్పథమును చక్కగా వెలయించిరి. ఇది గీర్వాణవాణి నాశ్రయించి రససిద్ధాంతమునకు వారొనర్చిన పరివస్య. అంతేగాక ఆంధ్రలాక్షణికులు అనంతామాత్య ప్రభృతులు ప్రత్యేకముగ రసతత్త్వ సమాలోచన గ్రంథము రచించి రాణించిరి. సహస్రవసంతముల చారుచరిత్ర కల్గిన ఆంధ్రవాఙ్మయమునకు ఆది కావ్యము మహాభారతము - అది మూలమున సర్వరసాలవాలము కాకున్నను ఇతిహాస ప్రథాస్పదమైనను మన కవిత్రయము వారిచేతిలో సర్వరసాలవాలమై కావ్య ప్రథాస్పద మైనది. వారి వారసులే అర్వాచీనులయిన సర్వాంధ్ర కవులును - వారి విశిష్టరస దృష్టిని వ్యాఖ్యానించుట యన్న అది ప్రత్యేకము మరియొక పరిశోధన నిబంధమునకు సామగ్రి యగును. అందుచే ఆ విషయ ప్రాశస్త్యము గుర్తించి దానినిందు సంగ్రహముగ సమీక్షించుట జరిగినది. దీనితో గ్రంథము విలువ పెరిగినది. ఈ చూపు తోడనే ఈ మా రామకృష్ణమూర్తి పరిశోధన నిబంధమునకు పరీక్షకులు ముప్పురును పట్టప్రదానముతోపాటు ఏకగ్రీవముగ సత్వరగ్రంథ ప్రచురణావశ్యకతను గూర్చియు సముద్ఘాటించిరి. అంతకన్న దీని ప్రశస్తికి ఇంకేమి కావలయును ?

ఇటీవలి కాలములో ఒక మంచి గ్రంథమును చదివితిమన్న సంతృప్తిని పాఠకులకిచ్చిన మా రామకృష్ణమూర్తి కివే నా మంగళాశాసనములు.

— యస్వీ జోగారావు

బ్రాహ్మభూషణ, సాహిత్య విద్యాప్రవీణ,
ఉభయభాషా ప్రవీణ, రాష్ట్రభాషా విశారద,
రాంభట్ల లక్ష్మీనారాయణశాస్త్రి M. A, P. O. L.
Retd. Pandit, Andhra University
Waltair

సాధువాదము

"రసోవై సః" అని వేదవచనము. అందలి వైకార మవధారణార్థకము. రసమే యాత్మయని యీ వాక్యమున కర్థము. ఆనందమే పరబ్రహ్మమని దీనికి "తాత్పర్యము". "ఆనన్దోబ్రహ్మేతివ్యజానాత్" అనువాక్యము పైదానికి వివరణము. ఇది యాత్మస్వరూపము.

ఈ యాత్మయే యన్ని జీవరాశులందున్నట్లు "అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" అను వేదవచనమును బట్టి తెలియుచున్నది. కాని ప్రాణుల యందున్నప్పు డాయాత్మ యవిద్యాచ్ఛాదితమైయుండును. దీనినిబట్టి ఆనందము సర్వప్రాణి సాధారణమనుట నిర్వివాదము.

ఈ యానందము ద్వివిధము. బాహ్యపదార్థ సంగసంజాతమైన యైంద్రియి కానందము మొదటిది. అవిద్యానాశనమున జ్ఞానులనుభవించు నానందము రెండవది. మొదటిది సర్వప్రాణి సాధారణము. ఇంద్రియ జన్యము, రెండవది యోగులకును జ్ఞానులకును సాధ్యము. అది అతీంద్రియము.

సామాన్య మానవుడు దారపుత్రమిత్రధనాది బాహ్య పదార్థసాంగత్యమున నానందము ననుభవించును. అది యింద్రియ జన్యమగుట వైషయికానందమనం దగును. ఆత్మ నావరించిన యవిద్యను జయించి, త్యజించి, జ్ఞానులనుభవించు నానందము బ్రహ్మానందము. భగ్నావరణచిత్తే బ్రహ్మము, తద్రూపమగుటయే బ్రహ్మానందము.

రూపకాది దర్శనమున సామాజికులకు వాసనారూపమై యంతర్గుప్తమైయున్న ఆనందము ఉద్బుద్ధమగును. ఆనందస్థాయినందుకొనును. కాని యీ యానందము ననుభవించు సామాజికులు రెండు విధములగా నున్నారు. నటకాదులందలి అభి

నేయము - ఆహార్యకము - అంగసౌష్ఠవము – సన్నివేశచమత్కారము - మున్నగు బాహ్య లక్షణములకు ముగ్ధులై ఆనందపరవశులగువారు కొందరు. వారికి రసానందము దూరముగానే యుండును. మఱికొందరు సహృదయులైన సామాజికులు విగళిత వేద్యాంతరమతులై పాత్రలతో తాదాత్మ్యమంది రసవిలీనచిత్తులై రసరూపులగుదురు. వారనుభవించునది రసానందము. దానికే రసమని పేరు. అదియే బ్రహ్మానందస బ్రహ్మచారి.

అట్టి రసస్వరూపమును నిరూపించినవి యాలంకారిక గ్రంథములు. అవన్నియు సంస్కృత భాషలో నున్నవి. వాని నాధారముగఁగొని వ్రాయబడిన వాంధ్రప్రబంధ ములు. ఇట్లు రసస్వరూపమును నిర్ణయించు లక్ష్యలక్షణ ప్రబంధములన్నింటిని గూలంకషముగఁ బరిశీలించి, యీ విమర్శనాత్మక గ్రంథమును లోకమున కందించిన వారు శ్రీ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి గారు,

వీరి కృషి, వీరి రచనావైదగ్ధ్యము, పరిశీలనాత్మక దృష్టి బహుధాప్రశంస నీయములు. ఈ గ్రంథము సర్వసహృదయరంజకమనుట నిర్వివాదము. సంస్కృ తాంధ్రసారస్వతములో నిగూఢముగా నున్న రసతత్త్వము నింతసరళసుగమ మార్గ మున ప్రవచించిన వీరు కృతకృత్యులు, ధన్యాత్ములు. సర్వాంగసుందరముగ సంత రింపఁబడిన యీ రససిద్ధాంతము సాహిత్య జగత్తునఁ జిరస్థాయిగ నుండఁగలదు.

ఇట్టి యుత్కృష్టములైన రచనల నితోధికముగ సాగించు శక్తి సామర్థ్యము లను, శిష్యులైన శ్రీరామకృష్ణమూర్తి శాస్త్రిగారి కా శ్రీ రామకృష్ణులు ప్రసాదించు గాతమని సాధువాదములతో నాశీర్వదింతును.

ఓం తత్సత్

రాంభట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి

6-10-1981.

విశాఖపట్టణము.

డా॥ పి. యస్. ఆర్. అప్పారావు
డైరెక్టర్
సాంస్కృతిక శాఖ
రవీంద్రభారతి బిల్డింగ్స్
హైదరాబాదు - 4.

అభినందన

మిత్రులు డా॥ టి. రామకృష్ణమూర్తిగారి సిద్ధాంత వ్యాసం "రససిద్ధాంతము - ఆంధ్రుల వరివస్య" రసపిపాసువులైన తెలుగు వారికి చక్కని ఆమెత.

అలంకారశాస్త్రం మీద, అందునా రససిద్ధాంతం మీద తెలుగువారికి మక్కువ ఎక్కువ - తెలుగువారు అనేకులు సంస్కృతంలో మూలగ్రంథాలు రచించారు - వ్యాఖ్యలు వెలయించారు. ఆట్లాగే తెలుగులో కూడా మూలగ్రంథాలు, అనువాదాలు, వ్యాఖ్యలు వెలువరించారు - కాగా రససిద్ధాంతానికి ఆంధ్రుల వరివస్య (సేవ) అనుపమానం - మొదటినుంచీ తెలుగుకవులు కూడా రసదృష్టి కలవారే కావటం మరొక విశేషం.

రససిద్ధాంతానికి సంబంధించిన భ్రమలను తొలగించి, సరళమైన భాషలో రసస్వరూపావిష్కరణ చేయటంలో డా॥ రామకృష్ణమూర్తి గారు కృతకృత్యులైనారు. అందుకు వారినీ పరిశోధన పర్యవేక్షకులయిన ఆచార్య యస్వీజోగారావు గారినీ అభినందిస్తున్నాను.

ఈ సిద్ధాంతవ్యాసం సహృదయుల ఆదరాన్ని తప్పక పొందగలదని విశ్వసిస్తున్నాను.

పోణంగి శ్రీరామ అప్పారావు

26.8.81

విషయసూచిక

పుట సంఖ్య

రససిద్ధాంత ప్రాశస్త్యము

మానవ జీవితము సుఖదుఃఖాత్మక మయినది. కాని మానవుడు దుఃఖము నతిక్రమింపవలెననియు సుఖమునే యనుభవింపవలయుననియు సర్వదా సర్వథా యత్నించుచుండును. ఈయత్నమున స్వార్థము చోటుచేసికొనును - అహంకార మావిర్భవించును. అది వృద్ధిపొంది తనవారిపై రాగము, పరులపై ద్వేషము నుద్భవించును. వీనినుండి క్రోధ ముద్భవించును. [1] క్రోధమువలన మోహము, మోహము నుండి స్మృతి విభ్రమము దానినుండి బుద్ధినాశము కల్గును. ఇది యంతయు వినాశ హేతువు. ఇట్టి ప్రవృత్తి గ్రామ్యధర్మప్రవృత్తి. ఇట్లు సంఘము దూషితము గాకుండ, కామలోభ వశంగతులై ఈర్ష్యాక్రోధాది సమ్మూర్ఛితులైన మానవులను సముద్ధరింప వలసిన యావశ్యకమున్నది.

లోకమున వివిధ కార్యకలాపములలో నిమగ్నులై మానవులు జీవించు చుందురు - కొందరు శారీరక కష్టముచే జీవింతురు. మరికొందరు మానసిక కష్ట ముచే జీవింతురు. ఇట్లు అలసినవారికి కొంత విశ్రాంతి కావలయును.

మనస్సు ఆనందధామమునుండి విడివడి శరీరము నాశ్రయించినది. చంచ లమైనది. వివిధ విషయముల ప్రసరించినది. ఇట్టి ప్రసరణమువలన అది అపుడపుడు సంతప్తమగుచుండును. దానికి ఆనంద రాశి స్పర్శ కలిగినచో మరల వికాస మగును. తళ తళ లాడును. అట్టి ఆనంద సాధన మొకటి కావలెను.

లోకమున నెవరైనను మిక్కిలి సంతోషించినపుడు బ్రహ్మానందమనుభ వించినట్లు చెప్పుట కలదు. "నీవు చేసిన యుపకారమున నాతడు బ్రహ్మానంద పడినాడు" ఇత్యాదులైన పలుకుబడులున్నవి. ఎల్లయానందములలో బ్రహ్మానంద ముత్కృష్టముగా నెంచబడుచున్నది. అట్టి బ్రహ్మానందము సర్వులు ననుభవింప సాధ్య మగుటలేదు. అది కేవలము యోగులకే సాధ్యము. సామాన్య మానవులు సంసార దుఃఖితులు, కామ లోభా ద్యరిషడ్వర్గ దూషితులు. వీరికానంద స్పర్శ లేకపోవు చున్నది.

---

1. క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశః బుద్ధినాశా త్ప్రణశ్యతి

— భగవద్గీత. 2.63

సంసార విషవృక్షస్య ద్వేఫలే హ్యమృతోపమే
కావ్యామృత రసాస్వాదః సల్లాప స్సజ్జనై స్సహా

ఈ సంసార మొక విషవృక్షము వంటిది. అందెన్ని విషఫలములున్నను రెండు ఫలములు మాత్రము అమృత ప్రాయములు. మొదటిది కావ్యామృత రసాస్వాదము. రెండవది సజ్జన సల్లాపము. రెండవదైన యీ ఫలము కేవలము లౌకిక సుఖమును మాత్రమే కల్గించును - మరియు సజ్జన సల్లాపము అనగా ² సత్సంగము— పారంపర్యముగా ఆనంద సాధకము. మొదటిదైన కావ్యామృత రసాస్వాదము అలౌకికమైన ఆనందమును కల్గించును. ఈ కావ్యామృత రసాస్వాదమును అందరకు సంభవింపదు. దానికి తగినంత ఛందోఽలంకార భాషాజ్ఞానాదు లావశ్యకములు. అవి తగినంతగా లేని గ్రామ్య ధర్మ ప్రవృత్తులకును ఆనంద స్పర్శకావలెను.

ఇట్టి ఆవశ్యకస్థితియే పూర్వమొకప్పుడు కల్గినది. అట్టి సమయమున రసప్రధానమైన నాట్యశాస్త్ర ముద్భవించినది (దీనిని నాట్యవేదమనియు నందురు). దీనిని సృష్టించినది భరతముని. అలంకారశాస్త్రమున మునిగా ప్రసిద్ధిచెందినవాడితడు- నాట్య శాస్త్రోత్పత్తిని గూర్చి భరతుడు నాట్యశాస్త్ర ప్రథమాధ్యాయమున వచించినాడు. నాట్య వేదోత్పత్తిని గూర్చి ప్రశ్నించిన ఋషులకు సమాధానముగ బ్రహ్మ ఇట్లు చెప్పెను.

పూర్వము కృత త్రేతాయుగముల సంధికాలమునందు ప్రజలు కామ లోభ వశంగతులై ఈర్ష్యా క్రోధాది సమ్మూఢులై గ్రామ్య ధర్మప్రవృత్తి నవలంబించి సుఖ దుఃఖ సమ్మిశ్రితములైన జీవితములను గడుపుచుండిరి. అపుడు జంబూద్వీపమును (భారతదేశము జంబూ ద్వీపమునందు కలదు) దేవతలు గంధర్వులు యక్షులు రక్షో గణములు మహోరగులు ఆక్రమించుకొని యుండిరి. లోకపాలురు ధర్మప్రతిష్ఠాపన పరులై ప్రజలను స్వధర్మ విరతులనుజేసి సుఖపెట్టుటకు యత్నించు చుండిరి. ఈ స్థితిని గమనించి మహేంద్రాది దేవతలు పితామహుని సన్నిధికి వచ్చి,

2. సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః

— శ్రీ శంకర భగవత్పాదులు.

³ "క్రీడనీయక మిచ్ఛామో దృశ్యం శ్రవ్యంచ యద్భవేత్"

దృశ్యము శ్రవ్యమునైన వినోదవస్తువును కోరుచున్నామని ప్రార్థించిరి. బ్రహ్మ వారి ప్రార్థన నంగీకరించినాడు. వారలను పంపివేసి తాను సమాధిగతుడై చతుర్వేదములను స్మరించినాడు.

"జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్ సామభ్యో గీతమేవచ
యజుర్వేదా దభినయాన్ రసా నాథర్వణాదపి"

ఋగ్వేదమునుండి పాఠ్యమును, సామవేదమునుండి గీతమును, యజుర్వేదము నుండి అభినయములను. అథర్వవేదమునుండి రసములను గ్రహించి పంచమ వేదము, లలితాత్మకమునైన నాట్యమును సృష్టించెను.

ఈ నాట్యము నానాభావోపసంపన్నము లోకవృత్తానుకరణము.

⁴ యోఽయం స్వభావో లోకస్య సుఖదుఃఖ సమన్వితః
సోఽఙ్గా ద్యభినయోపేతో నాట్యమి త్యభిధీయతే.

సుఖదుఃఖ సమన్వితమైన లోక స్వభావమే అంగాద్యభినయోపేతమై నాట్యమైనది. కావుననే ఆనందప్రదమైనది. ఇంకొక మూలసూత్ర మిమిడియున్నది. మానవులు కామక్రోధా ద్యరిషడ్వర్గ దోష దూషితులు- లోక సంబంధమైన దుఃఖములచే ఆర్తులయినవారు. కామక్రోధాది భావములచే మోక్షానందములు సాధ్యములుకావు. పైగా అభ్యంతర ప్రాయములు. వీరిలోనున్న భావసామగ్రి అది. దానిచే ఆనందమును కల్పింపవలెను- దానికొక మార్గమును కనుగొనవలెను. ఏ భావమైనను సంపుష్టమై తారస్థాయి నంది నపుడు లేదా పరిణతమైనపుడు లేక పరిణతత్వ ప్రయోజనము నవగత మొనర్చికొనినపుడు ఆ భావమును తజ్జన్యక్లేశమును క్షాళితమగును. అనగా వారికి గల భావములనే విషాకాలుష్యము లొనర్పవలెను. దీని కొక మార్గమును కనుగొనినాడు భరతుడు. అది అనుకరణరూపమైనది. అనుకరణముచే లోకవృత్తములు భావితములై అలౌకికములగును. అపుడవి ఆనందప్రదములగును. మానవుని

---

3. నా॥ శా॥ అ-1 శ్లో 11.
4. నా॥ శా॥ అధ్యా- 1- శ్లో- 119

లోని దోషభూయిష్ఠములైన భావములనే అనుకరణ రూపమున భావనావశమున ఖ్యాతము లొనర్చినాడు. అవి మానవుని హృదయమున స్థిరముగా నెలకొని యుండునవి. కావున స్థాయిభావములని పేరిడినాడు. ఇవి మానవ హృదయమున వాసనారూపమున్న నుండును. వాసనకే సంస్కారమని నామాంతరము. వాసనావాసితమైన యీ భావములు మానవునికి పుట్టుకతో వచ్చినవి. అనుభవ ప్రాయములు. భవము ననుసరించి వచ్చినవని చమత్కారము. భారతీయులు వీని నింతను పూర్వమునకు సమన్వయించి యనేక జన్మల సంస్కారమని వివరించిరి. ఈ స్థిరమైన వాసనా రూపమైన భావముల నుద్బోధ మొనర్పవలెను. దానికి కారణ సామగ్రి యుండవలెను. దానినే విభావాది సామగ్రిగా పేర్కొనినాడు. ఇట్లు మానవునిలోని వాసనారూప భావముల నుద్బుద్ధము చేసి పోషణ మొనర్చి యానంద మనుభవింపజేయుటకు వీలగునని యూహించినాడు ఈ సూత్రము నాధారము చేసికొని రస సిద్ధాంత మేర్పడినది.

అనుకరణ మానందప్రదమగుట లోక సహజమైన స్థితి. ఆంగ్లేయులుకూడ నీ విషయము నుగ్గడించిరి. "Imitation begets pleasure" అని వారి సూక్తి. సాహిత్యదర్పణకారుడగు విశ్వనాథుడును లౌకికములైన శోక హర్షాది కారణముల వలన లోకమునందు శోకహర్షాదులే కల్గును. కాని కావ్యమున నాకారణములే యలౌకిక విభావములను పేర వ్యవహృతములై హర్షమునే కలిగించునని ఈ క్రింది శ్లోకములలో తెలియజేసెను.

హేతుత్వం శోకహర్షాదేర్గతేభ్యో లోకసంశ్రయాత్
శోకహర్షాదయో లోకే జాయంతాం నామ లౌకికాః
అలౌకిక విభావత్వం ప్రాప్తేభ్యః కావ్యసంశ్రయాత్
సుఖం సంజాయతే తేభ్యః సర్వేభ్యోఽపీతి కా క్షతిః ॥

సా॥ ద॥ 3-7

జుగుప్సాకరమైన భావము నయితము అనుకరణకల్పమై కావ్యాశ్రితమగుటచే రమ్యమై ఆనందప్రదమగుచున్నది.

శిరిరి యంగమ్మునఁ దిమ్మిరెత్తకమున్న
ఘొడలెల్ల మున్నుల్గఁ జైదకమున్న

దళ మెక్కి గాత్రంబు చెలువు దప్పకమున్న
బుడుపులు మేన నేర్పడకమున్న
యంత విగ్రహమున సంకరించకమున్న
కాయంబు వెరరూపు గాకమున్న
తనువునం జీమురక్తములు గాకమున్న
దేహ మీగలు మూగి తినకమున్న
శైత్య మడుగంగం బోయిన పట్ల జనులు
చూడ రోయకమున్న కాలాడినపుడు
నడువనెగాక కైలాస నగముం జూడ
హరుని వాక్యంబు శక్యమే పరిహరింప.

కాళహస్తిమాహాత్మ్యము 3-177

ఇందు కుష్ఠవ్యాధి వర్ణనము కలదు. లోకమున నిట్టిస్థితి జుగుప్సావహ మగును కాని కావ్యమున మాత్రము ఆనంద ప్రదమగుచున్నది. కారణము కావ్యాశ్రితమై అనుకరణరూపమగుటయే. ఈ అనుకరణ రూపత్వమే లలితకళ లన్నిటి యందును ఆనందప్రదాత్మకత్వమును స్థిరపరచినది.

ఇట్లు అనుకరణరూపమై ఆనందప్రదమైన నాట్యము అందరు అభిలషింప దగినది. అది సర్వులను అనుగ్రహించునది. ఉత్తమ మధ్యమాధమ ప్రకృతులైన జనులందరకు హితోపదేశము చేసి ధృతిని వినోదమును ఆనందము చేకూర్చునది. ఈ నాట్యము దుఃఖార్తులకు శ్రమార్తులకు శోకార్తులకు తపస్వులకు విశ్రాంతిజనక మయినది.

దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినామ్
విశ్రాంతి జననం కాలే నాట్యమేత ద్భవిష్యతి.

నా॥ శా॥ అధ్యా-1-114

ఇది భరతుని వచనము. ఇందు విశ్రాంతి పదము సంవిద్విశ్రాంతి సూచకము. నిపుణ= నటాభినయమున సహృదయసంభావనము చే దేశకాల ప్రమాతృాదులు నశిం

చును. సాధారణీభావము కల్గును. వితతమైన యీ సాధారణీ భావముచే సామాజికుల కేక ఘనమైన సంవిత్తి కల్గును. ఇట్టి సంవిత్తికి సంభావనా విరహము మొదలగు సప్తవిధ విఘ్నములు కల్గుచుండును. ఇట్టి విఘ్నములను తొలగించుటకు విభావాదు లుపయోగపడును. విఘ్నములు తొలగిపోగా నిర్విఘ్న సంవిదనుభవము కల్గును. ఇట్టి విఘ్న వినిర్ముక్తమైన సంవిత్తియే లోకమందు కూడ చమత్కారము, నిర్వేశము, రసన, ఆస్వాదము, భోగము, సమాపత్తి, లయము, విశ్రాంతి మున్నగు శబ్దములచే చెప్పబడుచున్నదని అభినవగుప్తపాదులు చెప్పియున్నారు. 'సకల విఘ్న వినిర్ముక్తా సంవిత్తిరేవ చమత్కార నిర్వేశ రస నాస్వాదన భోగ సమాపత్తిలయ విశ్రాంత్యాది శబ్దైరభిధీయతే'

కావున విశ్రాంతి యనగా వీతవిఘ్నప్రతీతిక మయిన 'సంవిద్విశ్రాంతి' యని వ్యాఖ్యానించుట దోషముకాదు. వేర్వేరు అనుభవములు అభినివేశము కలవారికి సంస్కారములు కలవారికి కావ్యనాట్యములు ఆనందప్రదములగు చున్నవి.

కావ్యనాటకాది సాహిత్యమంతయు రసప్రాధాన్యమును బట్టి ఆనందప్రద మగుచున్నది. ఈ ఆనందము శబ్దద్వారమున కల్గుచున్నది. ఇది బ్రహ్మానంద సబ్రహ్మ చారికదా! "శబ్దబ్రహ్మణి నిష్ణాత: పరంబ్రహ్మాధిగచ్ఛతి" శబ్దబ్రహ్మోపాసకుడు శబ్దబ్రహ్మమును పొందును. అది రసరూపమైనది. శబ్దబ్రహ్మమును పొంది పరబ్రహ్మమును కూడ పొందుచున్నాడు. "ఆనంద సంవిద్రూపో రసః" అని కదా అభియుక్తోక్తి. మౌలికముగ రసము బ్రహ్మరూపము- శాస్త్రరీతిలోకూడ దానికి తగిన ప్రాశస్త్యము ప్రాచుర్యము కలదు.

సాహిత్య ప్రస్థానములు

భారతీయ సాహిత్యశాస్త్రప్రవంతిలో ఎనిమిది ప్రసిద్ధ ప్రస్థానము లున్నవి.- అవి యివి.

1. రస ప్రస్థానము – భ	2. అలంకార ప్రస్థానము – భా
3. రీతి ప్రస్థానము – వా	4. వక్రోక్తి ప్రస్థానము – కు
5. ధ్వని ప్రస్థానము – ఆ	6. అనుమాన ప్రస్థానము – మ
7. ఔచిత్య ప్రస్థానము – క్షే	8. చమత్కార ప్రస్థానము – వి

ఈ ప్రస్థానములన్నియు సాహిత్య సౌందర్యము నుగ్గడించుట కేర్పడినవే- సంప్రదాయ మార్గములు మాత్రము భిన్నములు. చాలవఱకు నన్నియు రససిద్ధాంతమున కుపోషకములే - రసపర్యవసాయులే - వాని నిట స్వల్పముగ పరిశీలింతము.

1. ర స ప్ర స్థా న ము ;

ఇది భరతునిచే ప్రవచింపబడినది. సర్వ ప్రస్థానములకు ప్రకృతి ప్రాయమైనది మహాప్రస్థాన మన బెల్లును - దీనికి మూలాధారమైన సూత్రము 'విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః' అనునది. ఈ ప్రస్థానమును గూర్చియే యిట వివరింపబడు చుండుటచే నిపుడు దీనిని గూర్చి వచింపనవసరము లేదు.

2. అ లం కా ర ప్ర స్థా న ము

ఈ ప్రస్థాన ప్రవర్తకుడు భామహుడు - 'శబ్దార్థౌసహితౌ కావ్యమ్'-కావ్యమునకు శబ్దార్థములు శరీరమనియు, స్త్రీ పురుషుల శరీర సౌందర్యము నలంకారములు వృద్ధిపొందించునట్లే కావ్యశరీర సౌందర్యమును గూడ వక్రోక్త్యాద్యలంకారములు పెంపొందించు ననియు, కావున కావ్యమున అలంకారములు ప్రధానములనియు వచించెను. ఇతడు రసమునుకూడ రసవదలంకార మను పేరుతో అలంకారముగనే పరిగణించెను.

అలంకారములు కావ్యశరీర సౌందర్యపోషకములు. బాహ్యములు మాత్రమే కావ్యాత్మజోలికి పోనివి. 'హారాదివ దలంకారాః తత్రస్యు రుపమాదయః' అని విద్యానాథుడు ప్రతాపరుద్రీయమున వచించినాడు. అలంకారములే కావ్యాత్మ యవినచో ధ్వన్యాత్మకములై నిరలంకృతములైనవి కావ్యములు కాకపోవలసి వచ్చును. దీనికి మమ్మటాదులే ప్రమాణము. 'తదదోషౌసగుణౌ వనలంకృతీ పునఃక్వాపి' అని మమ్మటుడు కావ్యనిర్వచనమందే అనలంకృతిత్వమును కూడ అంగీకరించెను - భామహాదులు రసము నంగీకరించిరి కాని ప్రాధాన్య విషయమున భేదించిరి. ...క్షణ) మును వివరించుచు మమ్మటుడు '.... ...క్వచిత్తుస్ఫుటాలంకార విర... కావ్యత్వహానిః యథా :

యః కౌమారహరస్స ఏవహి వరస్తా ఏవచైత్రక్షపా
స్తే చోన్మిలిత మాలతీ సురభయః ప్రౌఢాః కదంబానిలా

సాచై వాస్మి తథాపి తత్ర సురత వ్యాపార లీలా విధౌ
రేవా రోధసి వేతసీ తరుతలే చేత స్సముత్కంఠతే.

కావ్యప్రకాశము - ప్రథమోల్లాసము

అత్రస్ఫుటో నకశ్చి దలంకారః రసస్యచ ప్రాధాన్యా న్నాలంకారతా'. ఇచట రసమునకే ప్రాధాన్యము. అలంకారమేదియు స్ఫుటముగ లేదు - అలంకారమే కావ్యాత్మయైనచో రసప్రధానమైన యీ శ్లోకమునకు కావ్యత్వహాని చేకూరును.

3. రీ తి ప్ర స్థా న ము

'రీతిరాత్మా కావ్యస్య' అని వామనుని ప్రవచనము. కావ్యమునకు 'రీతి' ఆత్మ యనియు విశిష్ట పదరచనమే రీతియనియు అతని యభిప్రాయము. ఈ పదర చనావైశిష్ట్యము గుణధర్మము. గుణములు రసధర్మములు. కావున నీ సిద్ధాంతమును 'ఘట్టకుటీ ప్రభాతముగ' రసపర్యవసాయిమై యైనది.

4. వ క్రో క్తి ప్ర స్థా న ము

'వక్రోక్తి రేవ వైదగ్ధ్య భంగీ భణితి రుచ్యతే' అని కుంతకుడు వక్రోక్తి ప్రస్థాన ప్రవర్తకుడయ్యెను. ఇతడు నూతన ప్రస్థానమును ప్రవర్తింపజేసిన వాడ య్యెను రసవిరోధి కాడు. రసాది పరమార్థజ్ఞమైన మనస్సే సంవాద సుందరమైనదని సూచించినాడు అంతటితో తనివి నసక రసము ఇతివృత్తము అనువానిలో రసము చేతనే కవుల వాక్కుల కమృతత్వము సిద్ధించుచున్నదని యుద్ఘోషించినాడు.

నిరంతర రసోద్గార గర్భసౌందర్య నిర్భరాః
గిరః కవీనాం జీవంతి న కథామాత్ర మాశ్రితాః

ఇట్టులు వక్రోక్తి ప్రవర్తకుడును రససిద్ధాంతమునకు పరోక్షముగ పోషకుడే యయ్యెను. వాగ్వైదగ్ధ్యము నాదరించిన అగ్నిపురాణము సయితము 'వాగ్వైదగ్ధ్య ప్రధానేఽపి రసఏవాత్ర జీవితమ్" అని అలంకార చమత్కార మెంతయున్నను కావ్య మునకు రసమే జీవితమని సూచించినది.

5. ధ్వని ప్రస్థానము

'కావ్యస్యాత్మాధ్వనిః' అని అతిగంభీరమైన ధ్వని ప్రస్థానమును నెలకొల్పిన వాడు ఆనందవర్ధనుడు. ప్రత్యేకముగ ధ్వనిస్థాపన మొనర్చిన వాడయ్యును రసము నెడ ఇష్టమైన దృష్టిని కన్పఱచినాడు. వస్త్వలంకార రస భేదములచే ధ్వని మూడు విధము లనియు, నందు రసధ్వని ప్రాధాన్యము వహించుననియు నాతడే వచించినాడు.

వ్యంగ్యవ్యంజక భావేఽస్మిన్ వివిధే సంభవత్యపి
రసాదిమయ ఏకస్మిన్ కవి స్స్యాదవధానవాన్

ధ్వన్యాలోకము - 4-5 శ్లో

రసమునందే కవి దృష్టి నిలుపవలెనని కట్టడి చేసినాడు. కావున ధ్వని సిద్ధాంతము సయితము రససిద్ధాంతమునకు పోషకముగానే నిలిచినది

6. అనుమాన ప్రస్థానము

ఆనందవర్ధనుని ధ్వనిసిద్ధాంతమునకు ఖండనప్రాయమైనది అనుమాన ప్రస్థానము. దీనికి ప్రవర్తకుడు మహిమభట్టు. వ్యక్తివివేకమను గ్రంథమునందు అనుమానము స్థాపించినాడు మహిమభట్టు. 'సర్వ ఏవహి శాబ్దో వ్యవహారః సాధ్య సాధన భావగర్భతయా ప్రాయేణ అనుమానరూపోఽభ్యుపగన్తవ్యః" (ప్రథమ విమర్శము పు. 21 K. S. S Ed) అని అనుమానమును స్థాపించి ధ్వనిని ఖండించిన వాడయ్యును ఇతడు రసప్రాధాన్యమును మరువలేదు. అనుమితిని కూడ వస్త్వలంకార రసాత్మకముగ విభజించి అందు రసానుమితికే పట్టము గట్టినాడు.

కావ్యస్యాత్మని సంజ్ఞిని రసాదిరూపే న కస్యచి ద్విమతిః
సంజ్ఞాయాం సా కేవల మేషాపి వ్యక్తియోగతోఽస్యకుతః

వ్యక్తివివేకము. 1-26 శ్లో

అని కావ్యాత్మ రస మనుటలో నేరికిని భేదాభిప్రాయములేదని స్పష్టపరచినాడు. ఇట్లు అనుమాన ప్రస్థానము సయితము రసపోషకమే

7. ఔ చిత్య ప్ర స్థా న ము

"ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితమ్" అని ఔచిత్య ప్రస్థానమును వెలువరించినవాడు అభినవగుప్తుని శిష్యుడు క్షేమేంద్రుడు. ఈ ప్రస్థానమును రససిద్ధాంతమునకు విరోధికాదు. క్షేమేంద్రుడు "రససిద్ధస్య" అనుచు రససంప్రదాయము నంగీకరించుచునే ఔచిత్య ప్రాధాన్యము నుగ్గడించెను.

8. చ మ త్కా ర ప్ర స్థా న ము

అనుయాయులు లేని కారణముగ ప్రసిద్ధిలోనికి రాక నిలిచిపోయిన మఱియొక ప్రస్థానము చమత్కారమునకు సంబంధించినది. విశ్వేశ్వరుడు తన చమత్కార చంద్రికలో నీ చమత్కారసిద్ధాంతమును ప్రతిపాదించినాడు. చమత్కారముతో గూడిన వాగర్థములే కావ్యమని యాతడు నిర్వచించినాడు. అపై.

చమత్కారస్తు విదుషా మానంద పరివాహకృత్
గుణం రీతిం రసం వృత్తిం పాకం శయ్యామలంకృతిమ్
సప్తైతాని చమత్కార కారణం బ్రువతే బుధా :

చమత్కారచంద్రిక ప్ర. వి. 6.7 శ్లో

అని గుణాదులను చమత్కార కారణములే యనినాడు. రసమునకు చమత్కార కారణత్వము నితడు వచించినను. "రసాన్వయమువలననే కావ్య(కమనీయ మగుననియు. రసోక్తివలననే కావ్యముల గ్రహింపవలెననియు, గుణాదులతో కూడియున్నను నీరసమైన కావ్యము అనురాగములేని దాంపత్యమువలె నుండు ననియు. ఈ కారణములనే అత్యల్పమైనను రసోక్తియే కర్పూరలవమువలె కావ్యమును గుబాళింపఁ జేయు" ననియు [5] పలుకుచు రసప్రాధాన్యము నురరీకరించినాడు.

ఇంకను భిన్న భిన్న స్థలములలో రసప్రాధాన్య మగ్గడింప బడినది. కావ్య నాటకములందలి రసమునకు గాని నాయకునకుగాని అనుచితమైన వస్తువేదియును గ్రాహ్యముకాదనియు, అది అవశ్యము పరిత్యాజ్యమనియు చెప్పుట రసప్రాధాన్యము నుగ్గడించుటయే. నాట్యమునందలి వృత్తులు జాతులు ధ్రువలు మొదలగునవన్నియు రసానుగుణముగనే ప్రయోగింపవలెనని భరతుడు నాట్యశాస్త్రమున తెల్పెను

[5] చమత్కారచంద్రిక - పంచమవిలాస 2. 9. 10. 11 శ్లో

పై సంప్రదాయము లన్నియు సాహిత్య సౌందర్యము నుగ్గడించునవే. అన్నియు ఆనంద ప్రాప్తికి మార్గములు. రససంప్రదాయము మాత్రము వీనికంటె విలక్షణమైనది. ఈ రసము సాక్షాత్తుగా ఆనంద స్వరూపము. మిగిలిన సంప్రదాయములు ఆనంద మార్గములు మాత్రమే. రసము ఆనందస్వరూపమనుటకు "రసో వై సః" అను శ్రుతియే ప్రమాణము.

రసజ్ఞత

సాహిత్యలోకమున సహృదయపర్యాయముగ రసజ్ఞ, రసిక, సరస పదములను వాడుచున్నాము. అంతియేగాని ధ్వనిజ్ఞుడు, రీతిజ్ఞుడు మున్నగురీతిని ప్రయోగించుటలేదు. ఏతత్పద ప్రయోగము నియతము రసప్రాశస్త్యమును సూచించుచునే యున్నది.

ఇంతవరకు అన్వయరూపమున రసప్రాధాన్యము వివరింప బడినది. వ్యతిరేకమునగూడ రసప్రాధాన్యమును దర్శింతము. రస వివేకమును రచించుచు సౌజన్య భూషణానుజుడు అవతరణమున ఇట్లు వచించెను.

దాంపత్యం ప్రేమరహితం మైత్రం హేతుప్రభావితమ్
కావ్యంచ నీరసమితి త్రితయం లోకగర్హితమ్

రసవివేకము శ్లో. 13

ప్రేమరహితమైన దాంపత్యము, హేతు ప్రభావితమైన మైత్రి, నీరసమైన కావ్యము ఈ మూడును లోకనింద్యములు. లోకనింద్యముల నడుగవలెనని భారతము ఘోషించుచున్నది - కావ్యమున నీరసములు పరిత్యాజ్యములు. అవి శవప్రాయములు. కవికర్ణరసాయన [illegible] పద్యాణ

నీరసపు [illegible]

దూరవ్వ [illegible] నీతిజ్ఞుల్

ఇట్లు రసప్రాధాన్యమును ప్రాశస్త్యమును భారతీయ సాహిత్య మందంతట సువ్యక్తమయి యున్ననూ, ఇక దానిప్రయోగ వైశిష్ట్యమును వైశద్యముగ పరిశీలింతము.

రసపదవ్యుత్పత్తి - ప్రయోగములు.

రసతి ఇతి రసః, రస్ధాతువుపై "నందిగ్రహి పచాదిభ్యో ల్యుణిన్యచః" అను సూత్రముచే అచ్ ప్రత్యయముచేయగా రసః అని యగును. లేదా రస్యతే ఆస్వాద్యతే ఇతి రసః, రస - ఆస్వాదనే అను ధాతువుపై "పుంసి సంజ్ఞాయాం ఘః ప్రాయేణ" అను సూత్రముచే ఘప్రత్యయము చేయగా రసః అని ఏర్పడును.

భారతీయ సంస్కృతికి వేదములు మూలకందములు. వేదపరిపాద్యము కాని యంశమేదియు సంస్కృతికోటిని చేరలేదు. అట్టి వేదములలో కూడ ఈ రసపదము ప్రయుక్తమైనది. వైదిక వాఙ్మయమున కాలము ననుసరించి ప్రాథమ్యము వహించునది ఋగ్వేదము. అందే రసపదము కన్పట్టును.

"దధానః కలశే రసమ్" ఋగ్వేదము 9-63-13
"పావమానీర్యో అధ్యేత్యృషిభిః సంభృతం రసమ్
తస్మై సరస్వతీ దుహే క్షీరం సర్పిర్మధూదకమ్" 9-67-32
"యో వః శివతమో రసః" 10-9-2

కాని ఆలంకారికుల పరిభాషలోవలె కావ్యరసముగా కానరాదు. సోమరసము, జలము, క్షీరము అను నర్థములందు కన్పట్టును. అథర్వవేదమునందు రుచి అను నర్థమున పొడకట్టును. ఈ అర్థమును దృష్టియందిడుకొనియే యీ పదమును నాట్యరసపరముగ భరతుడు అన్వయించుకొనియుండును. ఈ క్రింది శ్లోకమీ యభిప్రాయమున కుపబలకముగా నున్నది.

జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్సామభ్యో గీతమేవ చ
యజుర్వేదాదభినయాన్ రసానాథర్వణాదపి

నా॥ శా॥ 1-17

ఋగ్వేదమునుండి పాఠ్యమును, సామవేదమునుండి గీతమును, యజుర్వేదమునుండి యభినయములను, అథర్వవేదమునుండి రసములను గ్రహించినట్లు భరతుడు తెల్పియున్నాడు. ఈ రుచి యను నర్థము ఆస్వాద్యమను నర్థమునకు సన్నిహితమైనది.

ఉపనిషత్కాలమునాటికి రస పదము ప్రధానసారమను నర్థమున రూఢమైనది. ఛాందోగ్యోపనిషత్తునందు "ఏషాం భూతానాం పృథివీ రసః, పృథివ్యా ఆపో రసః, అపా మోషధయో రసః పురుషస్య వాగ్రసో వాచ ఋగ్రస ఋచ స్సామరస స్సామ్న ఉద్గీథో రసః" అని యున్నది. ఈ చరాచర భూతములకు పృథివి యాధారము. (ఇచట రసశబ్దమునకు శంకరాచార్యులవారు గతిపరాయణము, ఉపష్టంభము అను నర్థములను చెప్పిరి. గతియనగా ఉత్పత్తికారణమనియు పరాయణ మనగా ప్రళయహేతువనియు. ఉపష్టంభమన ప్రళయ నిధానమనియు గ్రంథ వివరించెను. మొత్తముమీద ప్రధానము. శ్రేష్ఠము, ఆధారము అను భావ మిందిమిడియున్నది). పృథివికి జలము రసము. జలమునకు ఓషధులు రసము ఓషధులకు పురుషుడు రసము అట్టి పురుషునకు వాక్కు రసము. (పురుషావయవములలో వాక్కు శ్రేష్ఠము) ఆ వాక్కుకంటెను ఋక్కు రసము (సారతరము) ఋక్కుకంటెను సామము రసము - సారతరము. సామముకంటెను ఉద్గీథము (ఓంకారము) రసము.

ఇచట రసపదము అత్యంత సారమను నర్థమున ప్రయోగింప బడినది అందే 'సర్వకర్మా సర్వకామః సర్వగన్ధః సర్వరసః సర్వమిదమభ్యాత్తోఽవాక్యనాదర ఏషమ ఆత్మాన్తర్హృదయ ఏతద్బ్రహ్మైతమితః ప్రేత్యాభిసంభవితాస్మీతి యస్య స్యాదద్ధా న విచికిత్సాస్తీతి హ స్మాహ శాండిల్యః శాండిల్యః' సర్వమును కర్మనుగా కలవాడును, సర్వ రసములు కలవాడును అగు బ్రహ్మము అని రుచియను నర్థమున ప్రయుక్తము. ఇట్లే 'ప్రాణో వా అంగానాం రసః (1-3-19) అని బృహదారణ్యకోపనిషత్తునందు సారభూతమను నర్థమున ప్రయోగింప బడినది.

తైత్తిరీయమున ఆనందవల్లిలో పరబ్రహ్మపరముగ "రసో వై సః రసగ్గ్ం హ్యేవాయం లబ్ధ్వానందీభవతి" అని చెప్పబడినది. సంధ్యావందనమందు సయితము "ఆపోజ్యోతీ రసోఽమృతమ్ బ్రహ్మ" అని బ్రహ్మపరముగ ప్రయుక్తము.

మైత్రేయోపనిషత్తునందును 'తస్యైవ సత్త్వస్వరూప.. తత్సత్యమే వేరితం రసః. స సంప్రాప్నోతివత్" అని ప్రధాన సారార్థమున ప్రయోగింప బడినది.

భగవద్గీత యందు "రసోఽహమప్సు కౌంతేయ! ప్రభాస్మి శశిసూర్యయోః" (విజ్ఞానయోగము-8) అని శ్రీకృష్ణుడు చెప్పియున్నాడు.

ఇట్లు వైదిక సాహిత్యమునందు కన్పట్టు ప్రయోగముల యర్థములలో ఒక ఆనుపూర్వియు ఔచిత్యమును పొడసూపును. మొదట ఋగ్వేదమున రసపదము సోమరస పర్యాయముగ వాడబడినది. తదనంతర కాలమున దానికి ప్రాధాన్య మొసంగింపబడినది. సారతయు శ్రైష్ఠ్యము సంతరింపబడినవి. ఉపనిషత్కాలమునకు రసశబ్దము ప్రధాన సారార్థమును సంతరించుకొనెను. ఆకాలమునకే పర బ్రహ్మ వాచకమైనది. జగత్తునందు ప్రధానమైనదియు, సారభూతమైనదియు, దివ్యమానమైనదియు నగు పరబ్రహ్మపదార్థమై నిలిచినది రసము. ఈ క్రమము నంతటను అనుస్యూతముగ ఆస్వాదత కలదు. అది ఔచిత్యసంపాదకము. అందువలననే భరతుడు నాట్యశాస్త్రమున "రస ఇతి కః పదార్థః" అని ప్రశ్నించుకొని "ఆస్వాద్యత్వాత్" అని సమాధానము చెప్పుకొనినాడు

దీని వ్యాఖ్యానము చేయుచు అభినవగుప్తుడు "మధురాదౌ పారదే విషయే సారే జలసంస్కారే అభిషేకే ద్రవే దేహధాతౌ నిర్యాసే ఇత్యయం ప్రసిద్ధః సత్త్వస్యార్థో" అని వచించెను. రసపదము 1. మధురాదిరుచులు 2. పాదరసము 3 విషయము 4 సారము 5. జలసంస్కారము 6 అభిషేకము 7. ద్రవవిస్పాకము 8. దేహధాతు నిర్యాసము అను అర్థములందు ప్రసిద్ధమైనది. (ఇందు పాదరసము ద్రవవిస్పాకము దేహధాతు నిర్యాసము అనునవి ఆయుర్వేద పరమైన యర్థములు) ఈ యర్థములలో ప్రసిద్ధమైన రసపదము శృంగారాది రస పరముగ సమన్వయించుట ఆస్వాద్యమగుటవలననే యని సమర్థించినాడు.

లౌకిక సాహిత్యావిర్భావ సమయమునకు రసపదము శృంగారాది పరముగ ప్రసిద్ధి వహించెను. లౌకిక సాహిత్యమునకు శ్రీకారము చుట్టినవాడు వాల్మీకి గదా! వాల్మీకి మహర్షిచే రచితమైన రామాయణమున బాలకాండమునందు :-

పాఠ్యే గేయే చ మధురం ప్రమాణై స్త్రిభి రన్వితమ్
జాతిభి స్సప్తభిర్బద్ధం తన్త్రీలయసమన్వితమ్
రసైః శృంగార కారుణ్య హాస్య వీర భయానకైః
రౌద్రాదిభిశ్చ సంయుక్తం కావ్యమేత దగాయతామ్

అని ప్రయోగము. ఇందు శృంగారాది రసపరముగ ప్రయుక్తము. తరువాతి కాలమున నీ పదము రాగము, గుణము అను నర్థములందు నయితము కన్పట్టును. రాగమను నర్థమున నీ క్రింది శ్లోకమున ప్రయోగింపబడినది.

కపిలా కోపిల పనితా
రసపతి గారః రసేన మిళితా
సా యది దుర్జన హస్తే
పతితా ప్రతిపదభగ్నా సంశయమగ్నా

(ఉద్ధృతము దం శబ్దకల్ప ద్రుమము)

ఇట్లు రసపదము వైదిక సాహిత్య కాలమునుండి లౌకిక సాహిత్య కాలము వరకు ప్రయోగములలో వివిధరీతుల గోచరించుచు దాని ప్రాశస్త్యమును చాటుచున్నది.

బ్ర హ్మా న ం ద మీ మాం స

"బ్రహ్మానంద సబ్రహ్మచారీ రసః" రసము బ్రహ్మానంద సబ్రహ్మచారి యని యార్యోక్తి. కావున బ్రహ్మానంద మెట్టిదో తెలిసికొనినచో సబ్రహ్మచారి యయిన రసానందమెట్టిదో తెలియును. బ్రహ్మవిద్యా ఉద్బోధిత స్వాంతులైన ఋషి పుంగవులు బ్రహ్మానంద మీమాంస చేసిరి దానికొక ప్రమాణము నేర్పరచిరి. మానుషానందమును మొదలు ప్రమాణ మేర్పరచి దానననుసరించి బ్రహ్మానందమును సమ్యగ్గణనము చేసిరి. తైత్తిరీయోపనిషత్తునందు ఆనందవల్లిలో ఆనందమీమాంస యిట్లున్నది.

"సైషానందస్య మీమాంసా భవతి - యువాస్యాత్ సాధు యువాధ్యాయకః - ఆశిష్ఠో ద్రఢిష్ఠో బలిష్ఠః - తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణాస్యాత్ - స ఏకో మానుష ఆనందః - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శతం మానుషా ఆనందాః - స ఏకో మనుష్య గంధర్వాణామానందః - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శతం మనుష్యగంధర్వాణామానందాః - స ఏకో దేవగంధర్వాణా మానందః - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శతం దేవగంధ

ర్వాణా మానందాః - సఏకః పితౄణాం చిరలోక లోకానామానందః - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శతం పితౄణాం చిరలోక లోకానా మానందాః - స ఏక ఆజానజానాం దేవానామానందః - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శత మాజానజానాం దేవానా మానందాః - స ఏకః కర్మ దేవానాం దేవానామానందః - యే కర్మణా దేవానపి యన్తి - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శతం కర్మదేవానాం దేవానామానందాః - సఏకో దేవానామానందః - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శతం దేవానా మానందాః - స ఏక ఇన్ద్రస్యానంద - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శత మింద్రస్యానందాః - సఏకో బృహస్పతే రానందః - శ్రోత్రియస్య చాకామహతస్య-తే యే శతం బృహస్పతేరానందాః - స ఏకః ప్రజాపతే రానందః - శ్రోత్రియస్య చాకామహతస్య - తే యే శతం ప్రజాపతే రానందాః - స ఏకో బ్రహ్మణ ఆనందః"

యువకుడును సాధుస్వభావుడును స్వరము వచ్చిన అధ్యాపకుడును (బాగా సమాప్త వేదము నేర్చినవాడు) ఆశిష్ఠుడును (ఆరోగ్యవంతుడును మిక్కిలి శక్తైనవాడు సర్వాప రంజకుడును మూడవ్వులు పిచట సాహసులు) ద్రఢిష్ఠుడును బలిష్ఠుడు నైనవాడు కావలెను. అతనికి పృథివి యంతయు విత్తపూర్ణము కర్మసాధన సంపన్నము నగును - అనగా సుఖహేతువుగా కన్పట్టును. అతనికి దుఃఖము కల్గు లౌకికస్థితి యేమియు నుండదు. ఇట్టి ఉత్తమ లక్షణములు కల్గిన మానవుడు పొందు ఆనందము మానుషానందము. ఇట్టి సల్లక్షణములు కలిన మానవుడెవ్వడేని యుండునా? పూర్వమెవడేని కలడా? అను ప్రశ్నకు సమాధాన ప్రాయముగ శ్రీ శంకరులు యుధిష్ఠిర చక్రవర్తియొక్క ఆనందము మానుషానందము యొక్క ప్రమాణమని వచించిరి. ప్రమాణభూతమైన ఈ యానందములు ఉత్తరోత్తరోత్కర్షను పొందుచు బ్రహ్మానంద స్థాయిని చేరు విధాన మిట్టిది. వంద మానుషానందములు ఒక మనుష్య గంధర్వానంద మగును. మనుష్యులై కర్మవిద్యావిశేషము చేత గంధర్వత్వము కల్గినవారు మనుష్య

గంధర్వులు. వారు అంతర్ధానాది శక్తిసంపన్నులు యాత్మకార్యపరులు. వారికి విఘ్నము లల్పములు. వారికి వ్యంద్వప్రతిహారశక్తి యుండును వారి సాధన సంపత్తి యట్టిది వారి చిత్తవృత్తి ప్రసాద మాయున్నది. ఇట్టి ప్రసాద విశేషముచే ఫలవిశేషాభివ్యక్తి కలుగును.

'ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోప జాయతే
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధి పర్యవ తిష్ఠతి"

అని భగవద్గీత నుడువుచున్నది. ఈ చిత్త ప్రసాద విశేషమే ఆనంద విషయమున ఉత్తరోత్తరము ఉత్కర్షాధాయకమగుచున్నది బ్రహ్మానంద ప్రమాణము ఇట్లు నిరూపింప బడినది.

100 మానుషానందములు — 1 మనుష్యగంధర్వానందము
100 మనుష్యగంధర్వానందములు — 1 దేవ గంధర్వానందము
100 దేవ గంధర్వానందములు — 1 పితృదేవతానందము
100 పితృదేవతానందములు — 1 ఆజానజ దేవతానందము
100 ఆజానజ దేవతానందములు — 1 కర్మదేవతానందము
100 కర్మదేవతానందములు — 1 దేవతానందము
100 దేవతానందములు — 1 ఇంద్రానందము
100 ఇంద్రానందములు — 1 బృహస్పత్యానందము
100 బృహస్పత్యానందములు — 1 ప్రజాపత్యానందము
100 ప్రజాపత్యానందములు — 1 బ్రహ్మానందము

లెక్క వేసినచో పది లక్ష కోటి కోట్లు మానుషానందములు (100000000000000000000) ఒక బ్రహ్మానందమగును. ఇది అనుభవజ్ఞులైన మహర్షుల ప్రవచనము. ఇదే బ్రహ్మానందమునకు మహత్వమైన బ్రహ్మానందము.

రసానందము

బ్రహ్మానంద ప్రమాణమేమో తెలిసికొంటిమి. ఈ బ్రహ్మానందము పొందుటకు వివేచనా శక్తిగల యోగులు మాత్రము యత్నింతురు. వానికి దీర్ఘకాలికమైన సాధనము కావలయును - ఒక్కొక్కకోటి యెన్ని జన్మలు ఎదింపవలె పరిపు ష్టి యానందము లభింపకపోవచ్చును. అది వాని సంస్కారమును బట్టి యుండును

అదియును గాక దేనియునికి తనకు తెలియదో దానిని గూర్చి మానవుడు ప్రయత్నింపడు - ఇది లోకసహజమైన స్థితి - సామాన్యమానవులు బ్రహ్మానందమనుభవించుటకు శక్తి చాలదు - యోగులైన వారేమో చెప్పుదురు. అది సామాన్యమానవునకు అనుభవదూరమైనది - అంతమాత్రమున ఆ యానందమునకు తాను దూరుడు కావలసినదేనా ? కానక్కరలేదు - ఆ బ్రహ్మానంద మెట్లుండునో యని చూపునదింకొకటి యున్నది - అదియే రసానందము. అది బ్రహ్మానంద సబ్రహ్మచారి. అది కావ్యామృతాస్వాదము వలన కలుగును. దీనిని సాధించుటకు బ్రహ్మానందము కొరకు కావలసినంత సాధన మక్కరలేదు తానెంత శబ్దార్థ జ్ఞానమునకు తోడు ఉచితహృదయ సంవేదన ముండిన చాలును.

ఈ రసమును గూర్చియు తదాస్వాదము వలన కలు నానంద విశేషమును గూర్చియు మొదట వ్రాసినవాడు భరతముని అతడు నాట్యశాస్త్రమున 'విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తి' అని రసనిర్వచన మొసగి తదాస్వాదమునకు దృష్టాంతము నిట్లిచ్చినాడు

కథ మాస్వాద్యతే రసః యథా హి నానావ్యంజన సంస్కృత మన్నం భుంజానా రసా నాస్వాదయంతి సుమనసః పురుషా. హర్షాదీంశ్చాధి గచ్ఛన్తి - తథా నానాభావాభినయ వ్యంజితాన్ వాగంగసత్త్వోపేతాన్ స్థాయిభావా నాస్వాదయంతి సుమనసః ప్రేక్షకాః హర్షాదీం శ్చాధిగచ్ఛన్తి తస్మా న్నాట్యరసా ఇత్యభివ్యాఖ్యాతః-

యథా బహుద్రవ్యయుతై ర్వ్యంజనై ర్బహుభి ర్యుతమ్
ఆస్వాదయంతి భుంజానా భక్తం భక్తవిదో జనాః

భావాభినయ సంబద్ధాన్ స్థాయిభావాం స్తథా బుధాః
ఆస్వాదయన్తి మనసా తస్మా న్నాట్యరసాః స్మృతాః

బహుద్రవ్యములతోడను నానావ్యంజనముల తోడను సంస్కృతమైన యన్నమును తినుచు సుమనసులైన పురుషులు రసముల నాస్వాదించుచు హర్షాదులను పొందునట్లే వాగంగసత్త్వోపేతములై, నానాభావాభినయవ్యంజితములైన స్థాయిభావముల నాస్వాదించి సుమనసులైన ప్రేక్షకులు హర్షాదులను పొందుచున్నారు. కావున ఇవి నాట్యరసములైనవి.

ఈ యుపమానమున మూడు విషయముల సాదృశ్యము కలదు. 1. భోగ్యసాదృశ్యము 2. భోక్తృసాదృశ్యము. 3. ఫలసాదృశ్యము. వ్యంజన సంస్కృతమయిన అన్నము ఆస్వాద్యమై యుండును. అట్లే అభినయ వ్యంజితమైన శబ్దముచే వ్యపదిష్టమైన రసము ఆస్వాద్యమానమై యుండును. ఇది భోగ్యసాదృశ్యము. ఏకాగ్రమనస్కుడైన భోక్త ఆస్వాదయిత యగును. అన్యమనస్కుడైన భోక్తకు ఆస్వాదాభిమానము కల్గదు. అట్లే ఏకాగ్రమనస్కుడైన సామాజికుడు తన్మయీభావము చెంది ఆస్వాదయిత యగును. ఇది భోక్తృసాదృశ్యము. ఏకాగ్రమనస్కుడైన భోక్తకు ప్రహర్షము, ఆప్యాయము, జీవనపుష్టి, బలము, ఆరోగ్యము కల్గును. అట్లే తన్మయతతో ఆస్వాదము చేయువానికి హర్షప్రధానములైన ధర్మాదివ్యుత్పత్తులు వైదగ్ధ్యాదులు కల్గును. ఇది ఫలసాదృశ్యము.

'హర్షాదీం శ్చాధిగచ్ఛన్తి' అను వాక్యములోని ఆదిపదముచే శోకాదులు కూడ గ్రహింపనగునని కొందరందురు. కాని అది యుక్తముకాదు. నాట్యము హర్షైకఫలమే గాని శోకాది ఫలముకాదు. కావున శోకాదులు గ్రహింపరాదు. ఆది పదముచే హర్షప్రధానములైన వ్యుత్పత్త్యాదులు గ్రహించుట యుక్తము. ఇంకను కొంద రిచట ఆది పదరహితముగ "హర్షాంశ్చాధిగచ్ఛన్తి" అని పఠింతురు.

ఇచట రసనావ్యాపారము కంటె ఆస్వాదనము భిన్నము. రసనావ్యాపారము కేవలము భోజనక్రియ. ఆస్వాదనము మానసవ్యాపారము. భోజనక్రియ కంటె

అదియు విలక్షణము నైనది. ఈ మానసవ్యాపారము అవికలమైనది. విశేషము ఆనందప్రద మైనది అంతియే అలౌకికము.

ఆస్వాదక్రమము కూడ ఇట్లు నిరూపింప బడినది. భావుకులు భావములను సంధానము చేయుదురు. వారికి హృదయ సంవాదక్రమముచే తన్మయీభావము కలుగును ప్రమాతృగామి సంయోజింతురు అనాదివాసనా ప్రతిష్ఠితమైన స్థాయి భావము లవిచ్ఛిన్న స్వరూపములు. ఆ స్థాయిభావములు పూర్తిగా సాధారణీకృతము లగును వానికి విఘ్నప్రతిపత్తి కలదు ఇంద్రియాంతరములచే కూడ విఘ్నసంధానము కలదు. అట్టి శుద్ధసత్త్వస్వభావము మనసునకు కల్గును. అట్టి మనసుచే ఆ స్థాయి భావము ఆస్వాద్యమానము అగును. ఆ సమయమున స్వపరవివేక శూన్యమైన స్థాయి చమత్కార ముదయించును. ఈ చమత్కారము పారవశ్యమున హృద్యతాతిశయమైన సంవిచ్చర్వణము కలుగును. ఇట్టి విధమైన సంవిచ్చర్వణముచే భావముల నాస్వాదింతురు. ఇది నాట్యరసాస్వాదప్రక్రియ

నాట్యరసాస్వాదప్రక్రియ యనుటచే కావ్యమున నిట్టి ప్రక్రియను శంకింప నవసరములేదు. కావ్యార్థవిషయమున ప్రత్యక్షకల్పమైన సంవేదనము కలిగి రసోదయ మగునని భట్టతోతుని వచనముగా అభినవగుప్తుడు పేర్కొనినాడు.

ప్రయోగత్వ మనాపన్నే కావ్యే నాస్వాదసంభవః
వర్ణనోత్కలికాభోగ ప్రౌఢోక్త్యా సమ్యగర్పిత
ఉద్యానకాంతా చంద్రాద్యా భావాః ప్రత్యక్షవత్స్ఫుటా
(అభినవ భారతి పేజి 291)

ప్రయోగత్వమును పొందని కావ్యమందు ఆస్వాదము కలదు వర్ణనముల చేతను ప్రౌఢోక్తుల చేతను ఉద్యానములు, కాంతలు, చంద్రాదులు సమ్యగర్పితములై ప్రత్యక్షకల్పములుగా స్ఫుటము లగును

మరికొందరు అలంకార సౌందర్యాతిశయముచే కావ్యమునందును రస చర్వణము కలదని ఈ విషయమున అభినవగుప్తుడు తన అభిప్రాయమును ఇట్లు వివరించినాడు 'ఈ రసముయొక్క స్ఫుటత్వాస్ఫుటత్వములు శ్రోతల హృదయ సంవాద తారతమ్యము ననుసరించి యుండును. లోకమున కొందరు స్వభావముచే నిర్మల ముకురహృదయు లుందురు. వారు సంసారోచిత క్రోధమోహాభిలాష పరవశ

మనస్సులయందు కూడ నిమగ్నుడు కూడ సాధారణరసనాత్మక చర్వణ గ్రాహ్యమై నాట్య లక్షణమైన రససంవదము వారికి స్ఫుటముగ భాసించును. ఏతత్పూ భావరూపులను ప్రత్యక్షీకరించు నిర్మాణము కల్గను. వారి కొరకు నటాదిప్రక్రియ నావంపి వచ్చుచున్నది. స్వగతమైన క్రోధశోకాదియుతమైన హృదయగ్రంథిభంజనము కొరకు గీతాదిప్రక్రియ మరియే రచింపబడినది. కనుకనే కావ్యము నాట్యమే యగుచున్నది ”

ఈ రసానంద స్వరూపమును వివరించుచు మమ్మటుడిట్లు వచించెను. “లోకే ప్రమదాదిభిః .... వక్ష్యమాణైరప్రాక్ విభావాది జీవితావధిః పానక రసన్యాయేన చర్వ్యమాణః పుర ఇవ పరిస్ఫురన్, హృదయమివ ప్రవిశన్, సర్వాఙ్గీణ మివాలింగన్, అన్యత్ సర్వమివ తిరోదధత్, బ్రహ్మాస్వాద మివానుభావయన్ అలౌకిక చమత్కారకారీ రసః” ఈ రసము విభావాది జీవితావధియై పానక రసన్యాయముచే చర్వ్యమానమై, ఎదుట ప్రకాశించుచున్నట్లు హృదయమును ప్రవేశించుచున్నట్లు, సర్వాంగములను ఆలింగనము చేసికొను చున్నట్లును, విభావాది వ్యతిరిక్తమైన వాని కప్పిడించుచు బ్రహ్మాస్వాదమువలె నిరానందము ననుభవింప చేయుచు అలౌకిక చమత్కారకారి యైనది. అభినవగుప్తుని యభిప్రాయమును కవిరాస్వర్గ కలిపించి మమ్మటుడు రసానందాను భవమును వ్యక్తపరచినాడు. ఇదియు సంపూర్ణము కాజాలదు

విశ్వనాథుడు సాహిత్యదర్పణమున ఇట్లు రసాస్వాదనమును గూర్చి వచించినాడు.

సత్త్వోద్రేకా దఖండ స్వప్రకాశానంద చిన్మయః
వేద్యాంతర స్పర్శశూన్యో బ్రహ్మాస్వాద సహోదరః,
లోకోత్తర చమత్కార ప్రాణః కైశ్చి త్ప్రమాతృభిః
స్వాకారవ దభిన్నత్వే నాయ మాస్వాద్యతే రసః.

సా ద-3-2,3

రజస్తమోభ్యా మస్పృష్టం
మనస్సత్త్వ మిహోచ్యతే

రజస్తమోగుణస్పర్శలేని మనస్సు సత్త్వ మనబడును. సత్త్వోద్రేకముచే అఖండ స్వప్రకాశానంద చిన్మయమును, వేద్యాంతర స్పర్శ శూన్యమును, బ్రహ్మాస్వాద సహోదరమును, లోకోత్తర చమత్కారప్రాణము నగు రసము కొంతమంది ప్రమాతలచే స్వాకారమువలె అభిన్నముగా ఆస్వాదింపబడును. ఇందు రసతత్త్వము కొంత ప్రపంచింపబడినది. రసము స్వయంప్రకాశమాన మనియు, ఇతరజ్ఞాన ముండ దనియు, లోకోత్తర మైన దనియు నిందు విశ్వనాథుడు వివరించెను.

జగన్నాథుడును "రమణీయార్థ ప్రతిపాదకశబ్దః కావ్యమ్" రమణీయార్థ ప్రతిపాదక శబ్దము కావ్యమని తెల్పి అందే యీ భావము నిమిడ్చినాడు. రమణీయత్వమనగా లోకోత్తరమైన యాహ్లాదమును కల్గించు జ్ఞానమునకు విషయమగుటయే యనియు, లోకోత్తరమనుటచే నీయాహ్లాదము లౌకికానంద భిన్నమనియు, నదియే చమత్కార మను వింకొక పేరుతో పిలువబడుననియు, నది సహృదయ బృందారకుల ప్రత్యక్షానుభవమే యనియు చెప్పినాడు.

బ్రహ్మానంద రసానందముల తారతమ్యము

రసము బ్రహ్మానంద సబ్రహ్మచారి యని నుడివిరి. సబ్రహ్మచారి యనుటచే రెండును భిన్నములని తెలియుచున్నది. ప్రధాన మైన ఆనంద విషయమున పోలిక యున్నను కొన్ని భేదములు నున్నవి. అవి పరిశీలనార్హములు.

బ్రహ్మానందము నిత్య మైనది. రసానందము తద్వ్యతిరిక్తము. శబ్దనిత్యత్వము వంటిది రసానంద నిత్యత్వము. బ్రహ్మానందము నిరుపాధికము. రసానందము రత్యాద్యుపాధ్యవచ్ఛిన్నము. బ్రహ్మానందము ఆలంబనము నపేక్షింపదు. ఈ రసానందమునకు ఆలంబనాపేక్ష కలదు.

రసానందము లౌకికానందము కంటెను బ్రహ్మానందము కంటెను విలక్షణ మైనది. లౌకికానందము అనిత్యము. బ్రహ్మానందము నిత్యము. బ్రహ్మానందము కేవలము యోగిగమ్యము. విషయసుఖములు నానారుచిసమాశ్రితములు. ఈ రెంటికి నడుమ నుండునది రసానందము. కావున అసారమైన సంసారమున సారరూప మైనది రసానందము. దానివలన దినదినము అపరిమితానందము కల్గును. ఈ భావమును రసరత్నప్రదీపిక నుడువుచున్నది. ఇందలి సుఖపదము ఆనంద పర్యాయము.

సుఖం ద్విధైవ కథితం నిత్యానిత్య విభేదతః
నిత్యం తద్బ్రహ్మరూపం హి అనిత్యం విషయోద్భవమ్
కేవలం యోగిభి ర్గమ్యం బ్రహ్మానంద మముం విదుః
ప్రచారో విరల స్తస్య లోకే౽స్మిన్ విషయో న్ముఖే
యత్సుఖం విషయోత్థం హి నానారుచి సమాశ్రయమ్
తదేవ బహుధా భిన్నం ప్రాప్తే నైవాతి సుందరమ్
రసరూపం సుఖం యత్తు తద్ద్వయో రపి మధ్యమమ్
అనిర్వాచ్యతయా యత్తు పూర్వాచార్యై ర్నిరూపితమ్
తస్మా దసారే సంసారే సారరూపో రసో మతః
యత్ర ప్రీతి స్సువిపులా వర్ధతే హి దినే దినే
ప్రత్యక్షా ఇవ దృశ్యన్తే యత్ర రామాదయో౽పి చ

....

ఇత్థంవిచిత్రా భావా స్తు హర్షోత్కర్ష ప్రదాయినః
నిమజ్జయ న్తి మనుజాన్ నిస్సీమ సుఖసాగరే

విచిత్రమైన భావములు హర్షోత్కర్ష ప్రదములు. మనుజులను నిస్సీమమైన సుఖ సాగరమున నోలలాడించును.

రసరత్నప్రదీపిక - ద్వితీయ పరిచ్ఛేదము

ర సా నం ద ము ఒక అ ను భ వ ము

ఈ రసానందము ఎట్లు అనుభూయమాన మగునో మమ్మటుడు కొంత వివరించి నట్లు పూర్వము చెప్పబడినది. ఆ యనుభవ విశేషమును భవభూతి ఉత్తరరామచరిత్రము నందు హృద్యమైన రీతిలో స్పష్టపరచినాడు. శ్రీరాముడు సీతాదేవిని స్పృశించి పొందిన యానంద మిట్లు వర్ణింపబడినది.

వినిశ్చేతుం శక్యో న సుఖ మితి వా దుఃఖ మితి వా
ప్రమోహో నిద్రా వా కిము విషవిసర్పః కిము మదః

తవ స్పర్శే స్పర్శే మమ హి పరిమూఢేంద్రియ గణః
వికారశ్చైతన్యం భ్రమయతి సమున్మీలయతి చ

ఉత్తర రామచరిత నాటకం - ప్రథమాంకము

— సీతా. నీయొక్క పునః పునః స్పర్శ వలన నేను పరిమూఢేంద్రియగణుడ నగుచున్నాను. ఇది సుఖ మని కాని దుఃఖ మని కాని నిశ్చయించుటకు వీలులేకున్నది. ఇది ప్రమోహమా నిద్రయా! విషవిసర్పమా! మదమా! ఇది యొకవికారము. చైతన్యమును భ్రమింప జేయుచున్నది అంతేకాక వికసింప జేయుచున్నది కూడ.

ఇచట ఇంద్రియగణము పరిమూఢ మగుచున్న దనగా విషయములపై ప్రవర్తించుట లేదని యర్థము. (విగళితవేద్యాంతరమైనది). ఒకవిధ మైన అసమర్థత ఇంద్రియములకు కలుగుచున్నది. అనగా కనులు చూడలేవు. ముక్కు మూర్కొనలేదు. చెవులు వినలేవు. ఇట్టి స్థితి సుఖమని కాని దుఃఖమని కాని తెలియుట లేదు. చైతన్యమును మాత్రము భ్రమింప జేయుచున్నది. ఇది అంతఃకరణమున్న మైనది. దానిని జీవచైతన్య మనుట అన్వయమునకు 'సమున్మీలయతి' అనుటచే ఉల్లాసమును పొందుచున్నట్లున్నది. వికసించుచున్నట్లున్నది. ఇది ఆనందముయొక్క లక్షణము. ఇంద్రియ సంపాదితలక్షణ మీ సమయమున లేదు. ఆనందము మాత్ర మున్నది. ఈ ఆనంద మైనను శరీరమున లేదు. ఇంద్రియములలో లేదు. కాని చైతన్య ముల్లాసమును పొందుచున్నది. అనగా ఆనందాంశ మైన చైతన్యము ఆనందధామమున రమించుచున్నది.

కించిదూనముగా ఇట్టి ఆనందమే ప్రసిద్ధాంగ్లకవి "కీట్సు" పొందినట్లు 'నైటింగేల్'లో నిట్లు వ్రాసినాడు

My heart aches and a drowsy numbness pain
My sense as though of hemlock I had drunk
Or emptied some dull opiate to the drains
One minute past and lathe - wards had sunk

నా హృదయము బాధపడుచున్నది. నా యింద్రియములు ఒక నిద్రామాంద్యమున బాధపడుచున్నవి. అనగా ఒక నిద్రవలె నున్నది. ఒక మొద్దుబారిన తన మున్నది. విషమును త్రాగినట్లున్నది. నల్లమందు తిన్నట్లున్నది. అధః పాతాళమునకు పోవుచున్నట్లున్నది.

శ్రీరాముని యొక్కయు, సీతయొక్కయు అనుభవములు సుమారు సమానముగ నున్నవి - ప్రమోహము, నిద్ర, విషవిసర్పము, మదము, పరిమూఢేంద్రియ గణము - ఈ లక్షణము లన్నియు సమానములే కాని భేద మొకటో యున్నది. సీత తాను అంధకారమున పడి పోవుచున్నానని యనుకొన్నాడు. అనగా తత్కాల మందు అనుభూత మగుచున్న సుఖమును గుర్తింపలే దని యర్థము. భవభూతి (రాముడు) ఆ సుఖమును గుర్తించెను. గుర్తించినట్టు "సమున్మీలయతి చ" అను పదము చెప్పు చున్నది.

సమాధియందు సుఖాంశభావ మున్నట్లు వేదాంతులును, రసచర్వలయందు సుఖాంశభావ మున్నట్లు ఆలంకారికులును సప్రమాణముగ నిరూపించిరి. ఆ సుఖాంశ మును భవభూతి గుర్తించినాడు

ఇచట ఒక విషయము అప్రస్తుతము కానేరదు. రససిద్ధాంతము పలువు రాలంకారికులచే ప్రవచింపబడినది. కాని అందరు సిద్ధాంతపరముగ శాస్త్రపద్ధతిలో చెప్పినవారే. అట్లు గాక కావ్యనాటకముల ద్వారమున సామాజికులకు రసానందమును చవిచూపుచు వ్యంగ్యమర్యాదతో రససిద్ధాంతమును బోధించినవాడు భవభూతి. ఉత్తర రామ చరిత్రము ప్రథమాంకమున

అద్వైతం సుఖదుఃఖయో రనుగతం సర్వా స్వవస్థాసు య
ద్విశ్రామో హృదయస్య యత్ర జరసా యస్మిన్నహార్యో రసః
కాలే నావరణాత్యయాత్ పరిణతే య త్స్నేహసారే స్థితం
భద్రం తస్య సుమానుషస్య కథ మప్యేకం హి త త్ప్రార్థ్యతే

అని యున్నది.

ఇది రాముని వచనము - సీత రాముని యురమున నొరిగి నిద్రించుచున్నది. పైగా కలవరించుచున్నది. ఆ సమయమున సీతారాములు తప్ప ఇతరు లెవ్వరును రంగమున లేరు. ఇట్టి స్థితిలో రాముడు వాక్రుచ్చిన శ్లోక మిది. కేవలము ప్రేక్షకులకు పాఠకులకు ఉద్దేశింపబడినది. ప్రకరణము ననుసరించినచో ఈ శ్లోకము దాంపత్య స్వభావమునకు సంబంధించినది. అది కేవలము వాచ్యార్థము. దానిని మించి రమణీయ మైన వ్యంగ్యార్థము మరొండు కలదు. భవభూతి యిచట అద్వైతమూల స్తంభము లపై నిర్మింపబడిన రస సిద్ధాంతమును ప్రతిపాదించినాడు. ఈ శ్లోకమున ప్రతిపదము

ను రససిద్ధాంతమునకు సమన్వయింప దగును. ఆ సమన్వయ విధాన మిట్టిది.

అద్వైతం సుఖదుఃఖయోః :- సుఖదుఃఖముల ద్వంద్వము లేనిది. అనగా రసానందము లౌకిక సుఖదుఃఖముల కతీత మైన దనుట. అద్వైత సిద్ధాంత భూమికను స్ఫురింప జేయును.

అనుగతం సర్వాస్వవస్థాసు యత్ :- అన్ని యవస్థల యందును అనుసరించునది. ఎట్టి క్లిష్ట పరిస్థితులలోని వారి కైనను గోచరించునది. దుఃఖార్తులకును ఆనందప్రద మనుట

విశ్రామో హృదయస్య యత్ర :- మనస్సు దేనియందు విశ్రాంత మగునో అది. ఈ విశ్రామ శబ్దము సంవిద్విశ్రాంతి సూచకము. ఆనందధామ మైన రసము నందు హృదయ విశ్రాంతి

జరసా యస్మి న్నహార్యో రసః :- ఇచట జరశ్శబ్దముచే దీర్ఘకాలికానుభవము సూచితము. ఎంతకాల మనుభవించినను తరుగని దనుట. రసపదము సంయుతము ఇందు ప్రయుక్తము.

కాలే నావరణాత్యయాత్ పరిణతే యత్స్నేహసారే స్థితమ్ :- ఇచట స్నేహసార మనగా జ్యోతిస్స్వరూపమైన రసము. అది స్వయం ప్రకాశమానము. అట్లు ప్రకాశించుటకు అజ్ఞానావరణము భంగము కావలయును. అపుడు పరిణత మైన జ్యోతిస్స్వరూపము వెలుగొందును.

భద్రం తస్య సుమానుషస్య కథ మప్యేకం హి తత్ప్రార్థ్యతే :-
ఇచట మానుష, భద్రశబ్దములు మానుషానందమును సూచించునవి. మనుష్యుడు పొందదగినది రసానందము. అది ఎట్లయినను ప్రార్థింప దగినది. ఏక మన ప్రధానమైనది, సారభూత మైనదియు నగు ఆ ఆనందము.

భవభూతి యీ యర్థమును మనసు నందిడుకొని వ్రాసెనా ? అని ప్రశ్నింప వచ్చును. దానిపై చాల పూర్వపక్ష సిద్ధాంతములు చేయవచ్చును. కాని ఒక విషయమును విజ్ఞులు గ్రహింపకపోరు. రసతపస్వియైన భవభూతిసంస్కారమునకు ఈ అర్థము అనుసాల్యమును హృద్యతను సంతరింపక పోదు.

ర స సా మ గ్రి

"విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః" అని భరతుని రస సూత్రము. విభావాను భావ వ్యభిచారి భావముల సంయోగము వలన రసనిష్పత్తి జరుగు నని సూత్రమునకు స్థూలమైన యర్థము. విభావానుభావవ్యభిచారిభావములలో మూడిటి యందును భావపదము ప్రయోగింప బడినది ఆ భావ మను పదమున కర్థ మేమో ముందు తెలిసికొనదగును.

భావ మనగా నేమి ?

వ్యుత్పత్తి ప్రదర్శకరీతి ననుసరించినచో భావపదము భూధాతువునుండి నిష్పన్నమైనది. భావయతి చింతయతి పదార్థాన్ ఇతి భావః, భూ + ణిచ్ + పచాద్యచ్, మానసవికారః అని శబ్దకల్పద్రుమము నుడువుచున్నది.

రససిద్ధాంత ప్రవక్తలలో ప్రథముడు, ప్రధానుడు నయిన భరతుడు భావములను గూర్చి ప్రత్యేకముగ నొక యధ్యాయమున వివరించినాడు. రసాధ్యాయము మరొకటి. భావముల కిట్టి ప్రత్యేక ప్రతిపత్తి మరే గ్రంథ మందును లేదు. భావముల గూర్చి భరతు డీవిధముగ ప్రశ్నించుకొని సమాధాన మిచ్చినాడు.

భావా ఇతి కస్మాత్ ? కిం భవన్తీతి భావాః ? కిం వా భావయన్తీతి భావాః ? ఉచ్యతే- వాగంగసత్త్వోపేతాన్ కావ్యార్థాన్ భావయన్తీతి భావాః

భావము లని పేరెట్లు వచ్చినది ? కలుగునవి పుట్టునవి గనుక భావములా ? లేక భావింపజేయునవి గనుక భావములా ? అనగా ఇట్లు సమాధానము. వాగంగ సత్త్వోపేతము లైన కావ్యార్థములను భావింప జేయునవి కనుక భావము లైనవి. ఇచట కావ్యార్థము లనగా రసములని యర్థము. రసములను భావింపజేయునవి కనుక భావము లైనవి. ఈ విషయము ఇంకను ప్రపంచించి నిర్వచించుచు భరతు డిట్లనెను.

భూధాతువునకు కరణ మర్థము. అందుచే భావితము, వాసితము, కృతము అనునవి ఏకార్థకములు లోకము నందును, " అహో . ఈ గంధముచే లేదా ఈ రసముచే సర్వమును భావిత మైనది" అని యనుట ప్రసిద్ధమే. [1] ఈ అర్థమును బట్టి భావశబ్దమునకు వ్యాప్తి యర్థ మగును.

---

1 నా శా॥ 7 అ, పు 344

దీనిని బట్టి భావ పదమునకు రెండు అర్థము లున్నట్లు స్పష్టము. 1. భావనము 2. వ్యాపనము (వాసితము). ఇందు భావన మను మొదటి యర్థము కవినటులను దృష్టియం దిడుకొని చెప్పినది. ఇచ్చట భరతుడు అనువంశ్యము లైన శ్లోకములను సాక్ష్య మిచ్చు చున్నాడు.

[1] విభావై ర్నాహృతో యోఽర్థో హ్యనుభావైస్తు గమ్యతే
వాగంగసత్త్వాభినయైః స భావ ఇతి సంజ్ఞితః

విభావములచే నాహృతమై, అనుభావముల చేతను, వాగంగసత్త్వాభినయములచేతను గమ్యమాన మగు నర్థము భావ మనబడును.

రెండవ దగు వ్యాపన మను నర్థము (వాసితము) సామాజికులను దృష్టియం దిడుకొని చెప్పబడినది.

[2] వాగంగముఖరాగేణ సత్త్వే నాభినయేన చ
కవే రంతర్గతం భావం భావయన్ భావ ఉచ్యతే
నానాభినయసంబద్ధాన్ భావయంతి రసా నిమాన్
యస్మా త్తస్మా దమీ భావా విజ్ఞేయా నాట్యయోక్తృభిః.

తన్నిర్వచనమును కూడ నిట ననుసంధించుట యనౌచిత్యము కాదు. * 'నిర్వికారాత్మకే చిత్తే భావః ప్రథమ విక్రియా' అని సాహిత్యదర్పణకారుడు పేర్కొనెను. నిస్తరంగ నిరాకరము వలె నున్న సామాజికుని మనస్సునందు కలుగు ప్రథమ వికారమే భావ మని యర్థము. ఏ కారణము లేనపుడు ఏ ప్రచోదనమును లేనపుడు మనస్సు వికారరహితమై యుండును. ప్రశాంతావస్థలో నుండును. దాని నేదే నొక వస్తువు స్పృశించుటతోడనే సంచలనము కలుగును. అదియే చైతన్యము. ఆ చైతన్యరూప మైన ప్రథమ వికారమే భావము.

---

[1] నా॥ శా॥ అ 7 శ్లోకము 1

[2] నా॥ శా॥ అ 7 శ్లోకము 2, 3

* సా॥ ద॥ 3 అ॥ శ్లో॥ 93

ఈ చైతన్యమునే సాధారణార్థమున నిపుడు వివరింపబడు భావసామాన్యము ననును నన్వయింప దగును. రత్నాపణకర్త [4] "కావ్యే నాభినయేన వా నివేద్య మాన రామాది సుఖదుఃఖాద్యనుభవజనితవాసనా రూప స్వంస్కారాపర పర్యాయ స్సామాజిక మనోవికారో భావః, తదుక్తం :- సుఖదుఃఖాదికై ర్భావై ర్భావ స్తద్భావ భావనమ్. తస్య భావుకస్య భావ శ్చిత్తం తస్య భావనం వాసితత్వమ్ తద్భావభావనమ్" అని అనినాడు - భావుకుని చిత్త వాసితత్వమే భావ లక్షణము. ఇతడును అభినవ గుప్తుని యనుపసు ఘంటా పథమున పయనించినాడు.

భావము మనోవికార రూప మనుటకు సాహిత్య దర్పణ కారుడు మనోహర మైన యుదాహరణము నిచ్చినాడు

[5] స ఎవ సురభిః కాలః స ఏవ మలయానిలః
సై వేయ మబలా కింతు మనోన్య దివ దృశ్యతే.

కాలము పూర్వము వలెనే సురభిళ మైనది. మలయానిలయమును అదే. నాయి కయును ఆమెయే. కాని ఆమె మనస్సు మాత్రము మరొకరీతి నున్నది. అనగా వికారరూప మైన చైతన్యమను కలిగిన దన్నమాట

వాగంగముఖరాగాత్మకమును, సాత్త్వికము నైన యభినయముచే కవియొక్క అంతర్గతమైన భావమును భావింపజేయునది కావున భావ మైనది. అనగా ఆస్వాద యోగ్యముగా చేయునది

వాగంగాది వివిధాభినయ సంబద్ధము లయిన రసములను భావింపజేయుచు ప్రేక్షకులచే ఆస్వాదింప జేయునది కాన భావ మైనది.

"వాగంగముఖరాగేణ" అను శ్లోకమునకు అభినవుడు చక్కని వ్యాఖ్యానము చేసినాడు. వర్ణనానిపుణు డైన కవి అనాది ప్రాక్తన సంస్కార ప్రతిభానమయ మయిన రాగాదులను వర్ణించును. ఇట్టి కవ్యంతర్గత భావము దేశకాలాది భేద రహి తమై ఆస్వాదయోగ్య మగును. ఇట్లు కవిచే వర్ణింపబడిన భావికము సామాజిక చిత్త వృత్తులను రసన యోగ్యములుగా చేయును. అనగా కవిగతములైన రాగాదు

---

[4] ప్ర రు॥ రత్నా - రసప్రకరణము.

[5] సా ద 3 ఆ। 93 శ్లో ఉదాహరణము.

లను సామాజికగతములుగా చేయు చిత్తవృత్తివిశేషమే భావ మని సారాంశము. శ్రవ్యకావ్యపరముగ నైనచో పాఠకగతములుగా చేయు చిత్తవృత్తివిశేషము భావ మని ఫలితార్థము ఇదియే వ్యాపనార్థము. కస్తూరి కట్టిన వస్త్రమునందు ఆ కస్తూరి వాసన వ్యాపించునట్లు భావములును సామాజిక హృదయములను వ్యాపించును.

రసతరంగిణీకారు డగు భానుదత్తుడు భావ మనగా రసానుకూల మగు చిత్త వృత్తి విశేష మని నుడివెను

విభావాదులలో ననుగతముగ నున్న భావపదము యొక్క అర్థవివేచన మిపుడు చేయబడినది. ఇది గాక భావహావాది శృంగార చేష్టలలో మొదటి దగు భావ మొకటి కలదు.

ఈ వివేచన వలన తేలిన సారాంశ మేమన భావ మనగా మనోవికార రూప మైన చైతన్యము లేదా ఒకానొక చిత్తవృత్తి విశేషము. భరతుని దృష్టిలో ఈ భావముల విషయమున నొక వైశిష్ట్యము కలదు. అత డీ భావములను సంఖ్యా పూర్వకముగ నిర్దేశించెను. ఈ భావములు ఏకోనపంచాశతములు. శమమును గాని, నిర్వేదమును గాని శాంతరస స్థాయిగా పరిగణించు వారి మతమున నేబది భావములు అవి వ్యభిచారి భావములు. 33 స్థాయిభావములు 8 సాత్త్వికభావ ములు. 8 = 49 ఇందు విభావాను భావములు గ్రహింప కుండుట గమనింప దగి నది. ఇట్లు గ్రహింపకుండుటకు కారణ మవి చిత్తవృత్తి విశేషములు కాకుండుటయే. కావున భావపదముచే చిత్త వృత్తి విశేషములు మాత్రమే గ్రహింపదగును. ఈ యర్థము నభినవ గుప్తు డీ క్రింది పంక్తులలో సూచించు చున్నాడు.

« భావశబ్దేన తావ చ్చిత్త వృత్తి విశేషా ఏవ
వివక్షితాః, ... తేషాంతు యోగ్యతావశా
ద్యథాయోగం స్థాయి, సంచారి, విభావా,
నుభావరూపతా సంభవతి - యే త్వేతే ఋతు,
మాల్యాదయో విభావా బాహ్యాశ్చ బాష్ప,
ప్రభృతయోఽనుభావా ఏకాంత, జడ,
స్వభావా న, భావశబ్ద వ్యపదేశ్యాః

విభావము

విభావః - పుం (విశేషేణ భావయతి రసం సామాజికా నితి - (వి + భావి + అచ్) రసస్య ఉద్దీపనాదిః. అని శబ్దకల్పద్రుమము.

ఈ విభావపదము ఋగ్వేదమున కూడ ప్రయోగింపబడినది. అందిది వివిధ ప్రకాశవంత మను నర్థమున ప్రయుక్తము. 'న చిత్రం వపుషే విభావమ్' (1-148-1 ఋగ్వేదము) విభావము = వివిధ ప్రకాశవంతం ఇతి తద్వ్యాఖ్యే సాయణః. ఈ యర్థమునే గ్రహించి భరతుడు విభావ పదమును పారిభాషిక మొనర్చెను - ఆతడు విభావ పదమునకు నిర్వచనము నిట్లు చూపెను.

అథ విభావ ఇతి కస్మాత్ ? ఉచ్యతే - విభావో విజ్ఞానార్థః (పాఠాంతరము - విజ్ఞాతార్థః) విభావః కారణం నిమిత్తం హేతు రితి పర్యాయాః - విభావ్యతేఽనేన వాగంగ సత్త్వాభినయా ఇత్యతో విభావః - యథా విభావితం విజ్ఞాత మిత్య నర్థాంతరమ్ - అత్రశ్లోకః

బహవోఽర్థా విభావ్యంతే వాగంగాభినయాశ్రయాః
అనేన యస్మా త్తే నాయం విభావ ఇతి సంజ్ఞితః

విభావ మనగా నేమి ? విభావ మనగా విజ్ఞానము. విభావము కారణము, నిమిత్తము, హేతువు అను పదములు పర్యాయపదములు - వాగంగసత్త్వాభినయములు దీనిచే విభావితము లగును కాన ఇది విభావ మైనది - దీనికి మరొక యర్థము నిట్లు చెప్పుచున్నాడు. విజ్ఞాత మగుట కాన విభావ మనబడుచున్నది. విజ్ఞాత మను పదము విభావిత మను పదము నేకార్థకములు - వాగంగాభినయాశ్రయములైన యర్థములు దీనిచే విభావితము లగుటచే అది విభావమని శ్లోకార్థము. దీనినే యభినవ గుప్తుడు.

[8] "వాగాదయోఽభినయా యేషాం స్థాయి
వ్యభిచారిణాం తే వాగాద్యభినయసహితా విభా
వ్యంతే విశిష్టతయా జ్ఞాయన్తే యై స్తే విభావాః"

---

[6] అభినవభారతి, సప్తమాధ్యాయము. పుట 342

[7] నా. శా పు 346

[8] అభినవ భారతి పు 347.

అని నుడివియున్నాడు.

ఈ పర్యాయపదములలో కారణము హేతువు, నిమిత్తము అనునవి లోకములో ప్రయోగింపబడుచున్నవి. విభావ మను పదము లోకములో వీనికి పర్యాయముగా ప్రయోగింప బడుటలేదు.

అట్లైనో అనగా లోక సిద్ధము కనపుటు, వానిలో నీ విభావ పదమునకు సమానార్థకత ఎట్లు చేకూడ సని ప్రశ్నింప వచ్చును. దానికి సమాధాన మిది లోకమున నాయికా నాయకుల చేష్టలు ఎన్నియో కనిపించుచుండును. కటాక్ష భ్రూ విక్షేపాదులను చూచుచుందుము. అచ్చట నాయికానాయకు లాలంబన కారణములు ఆ యా దేశకాలాదు లుద్దీపన కారణములు. అవే నాటకమున నటుని శిక్షనైపుణ్యముచే ప్రదర్శింపబడును. కావ్య మందైనచో శబ్దోపహితమైన రూపమును పొంది బుద్ధివిషయము లైన రామాదులను సాధనచే ప్రత్యక్షములను వలె భాసింపజేయును. ఇది సామాజికమనోధర్మము. ఇట్లు కావ్య నాటకాది వశమున సామాజికాంతఃకరణమున వ్యాపించి సామాజికనిష్ఠమై ఆలంబన విభావ మనియు, ఉద్దీపనవిభావ మనియు పిలువబడును. ఈ నామధేయము కేవలము కావ్యనాటకగతమై వర్తిల్లును. ఈ విశేషముచేతనే అనగా కావ్యనాటక వ్యాపార మనెడి విశేషముచేతనే భావింపబడుచుండుటచే విభావ మను పేరును సార్థకమైనది. దీనినే దశ రూపక కారుడు -

* జ్ఞాయమానతయా యత్ర విభావో భావపోషకృత్
ఆలంబనోద్దీపనత్వప్రభేదేన స చ ద్విధా"

అని వివరించినాడు.

ఈ విభావముయొక్క ప్రయోజనమును అభినవగుప్తు డీ విధముగ తెల్పినాడు. సామాజికులు నటుల చేష్టలను చూచుచుందురు. అభినయములను గ్రహించుచుందురు. ఆ అభినయములు, అనుభావములు అనేకహేతువుల ననుసరించి కల్గుచుండును. హాసము అనునది హర్షము మొదలగు వాని వలన కల్గును. అట్లే బాష్పము కేవలము ఒక్క శోకము చేతనే కల్గదు. ధర్మమువలన గాని,

* దశరూపకము. చతుర్థప్రకాశము.

ధూమము వలన గాని, రోగము వలన గాని కలుగవచ్చును. అందుచే వీనివలన సామాజికునకు స్పష్టప్రతీతి కలుగదు. కాని విభావ సాహాయ్యమున నది వెంటనే సామాజికుని మనస్సున స్ఫురించి నిశ్చయింపబడును. ఇదియే విశేషభావనము యొక్క ప్రయోజన మని యభినవుని యభిప్రాయము. ఈ అభిప్రాయము నీ క్రింది పంక్తులలో గమనింపదగును.

[10] " అభినయానా మనేకహేతుజత్వమ్ - తద్యథా
హర్షాదిభ్యో హాసః, ఘర్మధూమరోగాదిభ్యో
బాష్పః తద్వ్యాప్త్యాత్మకం ప్రతీయతామ్ -
విభావా త్తు ఝడిత్యేవ నిశ్చయః అత ఏవ .. ....

(ఇక దీని తరువాత అభినవభారతి దొరకుట లేదు.)

వాసనారూపమున ఆస్వాద్యములు కాక యున్న రత్యాది స్థాయిభావములను విభావములు విభావించును. అనగా నీ విభావజ్ఞానము భావనాద్వారమున సాధారణీకరణమహిమచే సహృదయుల హృదయములందు ప్రవేశించి అట వాసనారూపమున నున్న రత్యాది స్థాయిభావములను ఇంచుక అభివ్యంజించును అనగా రసాస్వాదాంకురయోగ్యత కల్పించును. (విభావ్యంతే ఆస్వాదాంకుర ప్రాదుర్భావ యోగ్యాః క్రియన్తే సామాజిక రత్యాది భావాః) ఈ విభావములకు సమగ్రరసాభివ్యక్తి కల్గించు శక్తి లేదు. అనుభావ వ్యభిచారులలో కలసిన గాని యట్టి శక్తి కల్గదు. కావున అస్వాదాంకురయోగ్యత కల్గించును. కావ్యార్థభావనమునందు తొలిమెట్టు విభావ మని తేలినది.

మొత్తము మీద రత్యాది స్థాయి భావముల సముద్బోధకము లైనవి విభావములు అని సారాంశము. ఈ పరిభాష కావ్యనాటకములందే వర్తిల్లును. లోకమునం దైనచో కారణాది పదములచే చెప్పబడును. తెలుగున కావ్యాలంకారసంగ్రహ కర్త వీనిని "రసముల కుత్పాదనకారణ" మని వచింపగా, కావ్యాలంకార చూడామణికర్త "నవరస విస్ఫుటకరణ ప్రవణములనియు, నిఖిలరస నిబోధ నిర్మాణకరణము" లనియు సారాంశభూతముగ వచించెను.

---

[10] అభినవభారతి పు 347

ఈ విభావము రెండు విధములు 1) ఆలంబన విభావము 2) ఉద్దీపన విభావము. ఈ రెండును రసోత్పాదక కారణములే. అందు రససమవాయ కారణ మాలంబనవిభావము ఇతర మైన కారణజాత మంతయు నుద్దీపన విభావము.

ఆ లం బ న వి భా వ ము :—

ఆలంబన మనగా నాధారము. ఇది రసభేదము ననుసరించి వివిధ రీతుల నుండును

శృంగారమున నాయికా నాయకు లాలంబనము లగుదురు. వారి నాధారము చేసికొని సామాజికునిలో రసోదయ మగును. ఇది జ్ఞాన కారణమైనది దీనినే ప్రతాప రుద్రీయ కర్త రససమవాయకారణ మనినాడు. అనగా దాని ప్రాధాన్య ముగ్గడింపబడినది. రౌద్రము నందిట్లే నాయకప్రతినాయకు లాలంబనము లగుదురు. ఇట్లు రసభేదము నాశ్రయించి ఆలంబనము మారుచుండును

ఉ ద్దీ ప న వి భా వ ము –

విమలాంతఃకరణుడగు సహృదయుడు కావ్యార్థభావనము చేయుట యందు తోలిమెట్టు విభావము. అందు నాయికానాయకు లాలంబనములు - తత్కార్యార్థ భావనమున కుత్కర్షహేతువు ఉద్దీపనవిభావము. "ఉద్దీపనం తదుత్కర్ష హేతుస్తత్తు చతుర్విధమ్".

[11] ఆలంబన గుణాశ్చైవ తచ్చేష్టాతదలంకృతిః
తటస్థాశ్చేతి విజ్ఞేయాః చతుర్థోద్దీపనక్రమః

ఇట్లు శృంగారతిలకమున చెప్పబడినట్లు ప్రతాపరుద్రీయము నుడువుచున్నది. ఈ ఉద్దీపన విభావము నాల్గు విధములు. 1) ఆలంబన గుణములు 2) చేష్టలు 3) అలంకారములు 4) తటస్థములు.

ఆలంబన గుణము లనగా నాయికానాయకుల రూపయౌవనాదులు - వీనిని వివిధ భేద పురస్సరముగ ప్రస్తరించి చూపినవాడు సింగభూపాలుడు. (వివరము లకు చూడుడు అనుబంధము) అత డీ గుణములను సోదాహరణముగ వివరించెను.

---

[11] ప్ర రు రసప్రకరణము.

ఆలంబనచేష్టలు నాయికానాయకుల అంగవిలాసములు - ఇవి లీలావిలాసాదులు ఇవియే అనుభావములు నగును. అందువలన గాత్రజములుగా పరిగణింప బడును-(వివరములకు చూడుడు అనుభావము)

ఆలంబనాలంకృతులు వాసోభూషమాల్యానులేపనాదులు.

తటస్థములు ఆలంబనముతో సంబంధము లేకయే ఉద్దీపకము లైనవి - ఇవి వసంతోద్యానచంద్రోదయాదులు వీనిని పదునారింటిని సింగభూపాలుడు రసార్ణవ సుధాకరమున శోభాహేతువులుగా పరిగణించెను. తెలుగున అలంకారగ్రంథములను వ్రాసిన వారిలో కావ్యాలంకారసంగ్రహకర్త ఉద్దీపనవిభావముల విషయమున నొక విశేషమును తెల్పినాడు. ఉద్దీపన వస్తువులలో మన్మథుని నాలంకారికు లెవ్వరును జేర్పలేదు. కాని కవులు తమప్రబంధములలో నాయికావిరహావస్థాప్రకరణములందు ఉద్దీపకవస్తువు లగు మలయానిల చంద్రాదిదూషణములతో పాటు మన్మథదూషణము కూడ చేసిరి అందుచే నీ గ్రంథకర్త మన్మథుని కూడ ఉద్దీపన విభావముగ పేర్కొనెను

(కావ్యాలంకారసంగ్రహవ్యాఖ్య-సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి)

అ ను భా వ ము -

అనుభావః-పుం-అనుభావయతి బోధయతీతి-అను+భూ+ణిచ్ కర్తరి అచ్... భావబోధకః కటాక్షాదిసూచకగుణక్రియాదిః - ... లోచనచాతుర్యభ్రూక్షేప ముఖరాగాదిరూప శబ్దకల్పద్రుమము

భరతు డీ విధముగా తెల్పియున్నాడు

[1] అనుభావ్యతేఽనేన వాగంగసత్త్వకృతోఽభినయః,
వాగంగాభినయే నేహ యస్త్వర్థోఽనుభావ్యతే
శాఖాంగోపాంగసంయుక్త స్త్వనుభావ స్తతః స్మృతః

---

1 నా శా 7అ శ్లో 5

వాసనా సత్త్వస్థిత మైన యభిప్రాయము దీనిచే అనుభావింపబడును, కాన అనుభావ మైనది విభావములచే నాహృతమైన యర్థము ననుభావములచే గమ్యమాన మగును. విభావములు స్థాయిభావము నుద్బోధింపును. తద్భావమును సంవేదనము చేయునవి అనుభావములు. విభావము కారణరూప మైనచో అనుభావము కార్యరూపము.

[1] కార్యభూతోఽనుభావ స్స్యాత్ కటాక్షాది శ్శరీరజః

అని విద్యానాథుడు - లౌకికరత్యాదులకు కార్యభూతము లైన కటాక్షభ్రూవిక్షేపాదులు అభినయమున్నారమున భావకులకు ప్రతిబింబితము లై సహృదయహృదయస్థితము లైన రత్యాదిస్థాయిభావములను అనుభావితము చేయును.

అనుభావ మను పదమునకు మరియొక వ్యుత్పత్తి కలదు - అను = పశ్చాత్ భావః ఉత్పత్తిః యేషాం అనుభావయం ఇతి - స్థాయిభావము ననుసరించి తరువాత పుట్టునవి కనుక అనుభావము లైనవి - లేదా స్థాయిభావము ననుభవింప జేయుట వలన కూడ అనుభావ మనబడుచున్నది.

ఈ పై వ్యుత్పత్తి ననుసరించినను "కార్యభూతోఽనుభావ స్స్యాత్" అను వాక్యము ననుసరించినను ఉత్తరకాలభావిత్వము గమ్యమాన మగుచున్నది- ఈ యుత్తరకాల భావిత్వము రసమునకా? లేక స్థాయికా? అని ప్రశ్నించుకొని రత్నాపణకర్త ఇట్లు వివరించినాడు. "విభావై రను భావైశ్చ" అని కరణ తృతీయా ప్రయోగముచే పూర్వవర్తిత్వము స్పష్టమగుచున్నది. ఈ భావములు రెండును పరస్పర విరుద్ధ భావస్ఫోరకములై యున్నవి. దానికి సమాధానముగ - లౌకిక రత్యాదులకు ఇవి కార్యములే యనియు, అలౌకికముల కివి కారణములే యనియు, తెల్పి తన యభిప్రాయమునకు పోషకముగ నీక్రింది శ్లోకము నుదహరించెను.

[14] భ్రూవిక్షేప కటాక్షాది వికారో హృదయస్థితః
భావం వ్యనక్తి యస్సోఽయ మనుభావ ఇతీరితః

ఈ యర్థమునే రసగంగాధరకారుడును ప్రపంచించినాడు.

---

[13] ప్ర. రు॥ రసప్రకరణము.-

[14] రత్నాపణము రసప్రకరణము

ఈ యనుభావములను పలువురు 1) అంగజములు 2) స్వభావజములు 3) సాత్త్వికములు అని మువ్విధములుగా వివరించిరి. కాని సింగభూపాలుడు రసార్ణవ సుధాకరమున నాలు విధములుగా విభజించెను.

1) చిత్తారంభములు 2) గాత్రారంభములు 3) వాగారంభములు 4) బుద్ధ్యారంభములు - ఇట్లు విభజించియు సాత్త్వికములను వేరుగా చెప్పియున్నాడు.

సాత్త్విక భావములు

సాత్త్వికః - త్రి (సత్త్వేన నిర్వృత్తః, తేన నిర్వృత్తమితి అణ్) సత్త్వ గుణ నిష్పాదిత ఇత్యమరః. సత్త్వం మనో వా ఆశయో వా. తేన నిష్పాదితః సాత్త్వికః అని శబ్ద కల్పద్రుమము.

సత్త్వముచే నిర్వృత్తమైన భావము సాత్త్విక భావము. సత్త్వమనగా మనః ప్రభవమైన ఒకానొక స్థితియని భరతుని నిర్దేశము.[15] ఇహ హి, సత్త్వం నామ మనః ప్రభవమ్ తచ్చ సమాహిత మనస్త్వా దుచ్యతే - మనసః సమాధౌ సత్త్వ నిష్పత్తి ర్భవతి". సమాహిత మనస్సే సత్త్వము మనస్సమాధియందు సత్త్వము నిష్పన్న మగును.

ఈ సత్త్వ నిర్వచనమును పలువురు చేసియున్నారు. అందు కొందరి నిర్వచనము నటపరముగను, కొందరి నిర్వచనము సామాజికపరముగను మరికొందరిది తదుభయాత్మకముగను నిర్ణయింప సమర్థముగ నున్నవి. పై నుడివిన భరతుని నిర్వచనము కేవలము నట పరముగ తెలుపబడినది. అతడే దానిని వివరించుచు

[16] "తస్య చ యోఽసౌ స్వభావః రోమాంచాశ్రు వైవర్ణ్యాది లక్షణో యథాభావోపగతః స న శక్యోఽన్య మనసా కర్తు మితి - లోక స్వభావానుకరణ త్వాచ్చ నాట్యస్య సత్త్వమీప్సితమ్ - కో దృష్టాంతః ?- ఇహ హి నాట్య ధర్మ ప్రవృత్తాః సుఖ దుఃఖ కృతా భావా స్తథా సత్త్వ విశుద్ధాః కార్యాః యథా సరూపా భవన్తి - తత్ర దుఃఖం నామ రోదనాత్మకం తత్కథమదుఃఖితేన ? సుఖంచ ప్రహర్షాత్మకమసుఖితేన వాఽభినేయమ్ ?- ఏతదేవాస్య సత్త్వమ్ - యద్దుఃఖితేన సుఖితేన వా అశ్రు రోమాంచౌ దర్శయితవ్యౌ ఇతి కృత్వా సాత్త్వికా భావా ఇత్యభి వ్యాఖ్యాతాః" అనినాడు.

---

[15] నా శా పు 374

[16] నా శా పు 375

ఈ సత్త్వము యొక్క స్వభావమే రోమాంచాశ్రు వైవర్ణ్యాదులు. వీని నన్య మనస్కుతో నభినయింప శక్యము కాదు. లోక స్వభావము ననుకరింపవలసి యుండుటచే (సహజముగను, ఔచిత్య సంపాదకముగను) నాట్యమునందు సత్త్వ మావశ్యకమైనది - నాట్యధర్మిప్రవృత్తములైన సుఖదుఃఖ కృతభావములు సత్త్వవిశుద్ధములైనచో సహజములుగా భాసించును. దుఃఖము రోదనాత్మకము. అట్టి భావము అదుఃఖితుడైన నటునిచే ఎట్లభినయింపబడును ? అట్లే ప్రహర్షాత్మకమైన సుఖము అసుఖితుడైన నటునిచే ఎట్లభినయింపబడును? ఈ యభినయమునకే సత్త్వమావశ్యకము. ఇట్టి సాత్త్వికాభినయముచే రోమాంచాదులను నటుడు సహజములుగ ప్రదర్శించును. ఇది కేవలము నటపరముగ చెప్పబడిన సోదాహరణ నిర్వచనము.

సరస్వతీకంఠాభరణమునందు భోజుడు సత్త్వము నిట్లు నిర్వచించెను. [17] రజస్తమోభ్యామస్పృష్టం మనస్సత్త్వ మిహోచ్యతే రజస్తమో గుణములచే స్పృశింపబడని మనస్సే సత్త్వ మనబడుచున్నది. అనగా సత్త్వగుణ విశిష్టమైన మనస్సే సత్త్వ మగును- తన్నిర్వృత్తములైన భావములు సాత్త్విక భావములు-ఇది సామాజిక పరమైన నిర్వచనము. విమలప్రతిభానశాలి సహృదయుడు విభావచర్వణముచే రజస్తమము లంతరింప సత్త్వోద్రేకము నొందును. కావుననే ఇది సామాజిక పరమనుట. నటపరముగ నట్టి విశేషమును భోజుడు వచించినట్లు కన్పట్టదు.

ఉభయాత్మకముగ చెప్పినవాడు విద్యానాథుడు. ప్రతాపరుద్రీయమున నతడు సత్త్వము నిట్లు నిర్వచించెను.

[18] "పరగత సుఖ దుఃఖాది భావనయా భావితాంతః కరణత్వం సత్త్వం-తతో భవా స్సాత్త్వికాః" పరగతమైన సుఖదుఃఖాదులయొక్క భావనచేత భావితమగు అంతఃకరణధర్మము సత్త్వము తద్భవములు సాత్త్వికములు. ఈ నిర్వచనము నట సామాజికోభయాత్మకమైనదిగ కన్పట్టును. నటపరమున నన్వయింపవలె నన్నచో సుఖదుఃఖములు పరగతములు. అనగా రామాది గతములు- వాని భావనము నటునిది - వానిచే భావితమైన అంతఃకరణత్వము నటునికి సంబంధించినదే యగును - అనగా అభినయమున కవసరమైన సత్త్వస్థితి. (భరతునిచే సాత్త్వికాభినయము శ్రేష్ఠమైనదిగా చెప్పబడినది) సామాజిక పరముగ నన్వయింప వలె నన్న

---

17 సరస్వతీ కంఠాభరణము 5వ అధ్యాయము

18 ప్రతాపరుద్రీయము-రసప్రకరణము

నో - ఎఖుమిఃఖుమాయ పరగితము - అనా నటగతము సామాజికులు వానిని చూచి భావించుచున్నాడు. ఆ భావము ఉత్తమాలమైన అంతఃకరణము సామాజికునిది. ఆ అంతఃకరణ ధర్మమే సత్త్వము ఇట్లు రెండు విధముల సముత్పన్నమందిన యుత్తమ నిర్వచనము విన్యాసించిరి. తద్వ్యాఖ్యాత కుమారస్వామి సోమ పీథియు నిట్లు వివరించినాడు [19] అభినయాదిముఖేన అన్యగత సుఖ దుఃఖాది భావనాయాం ప్రాతికూల్య అత్యంతానుకూలత్వాం సత్త్వమిత్యర్థః ఈ వివరణము సుఖయాత్మకమై నిలిచియున్నది

మొత్తముమీద నిపుణముగ సమాహిత మనస్త్వమే సత్త్వమని యుద్దిష్టము. ఈ సత్త్వము ద్వివిధము 1) అభ్యంతరము 2) బాహ్యము - సంవేదన భూమి యందు (మనస్సునందు) ప్రాణ భూమియందు (దేహము ప్రసరణ మార్గమును) సంక్రమించి యుండునది అభ్యంతరము. ఇక దేహ సంక్రాంతమైనది బాహ్యము ఇది ఘర్మ రోమాంచాది గుణరూపమున నుండును. ఈ బాహ్య మనునది లోపలి సంవేదన రూపమైన అభ్యంతరము యొక్క ఫలమే - ఇట్టి ద్వివిధమైన సత్త్వముచే నిర్వర్తితమైన యభినయము సాత్త్వికాభినయ మగును. ఈ సాత్త్వికాభినయము యొక్క ప్రాధాన్యము నెఱిగించుచు భరతు డిట్లు చెప్పెను - సాత్త్వికాభినయమునందే నాట్యము ప్రతిష్ఠితమై యున్నది - కావున దానిని గూర్చి ప్రయత్నపూర్వకము చేయవలెను. సాత్త్వికాభినయము అధికముగా గల అభినయము జ్యేష్ఠాభినయ మనబడును. ఇతరాభినయములతో సమానముగ ఉన్నచో అది మధ్యమాభినయ మనబడును వాచికాంగికాభినయము అధికముగా సాత్త్వికాభినయము తక్కువగా ఉన్నచో అది అధమాభినయ మనబడును"

ఇట్లు సత్త్వ నిర్వచన విషయమున నాలంకారికుల భిన్నాభిప్రాయములను వ్యక్తీకరించితి. సాత్త్వికభావము లనగా సత్త్వ నిర్వృత్తములని గదా. ఆ సత్త్వముచే నిర్వృత్తములగు రీతి, క్రమము ఎట్లో రత్నాపణ కర్త వివరించినాడు.

భావప్రకాశమునం దిట్లు కలదని యాతడు తన యభిప్రాయమునకు పోషకముగ నీ క్రింది రీతిని వివరించినాడు. తదుక్తం భావ ప్రకాశే

[20] 'పరస్య సుఖదుఃఖాదే రనుభావేన చేతసి

---

[20] రత్నాపణము-రసప్రకరణము

అత్యంతే నాను కూల్యేన యేన తద్భావ భావనమ్
తత్సత్త్వం - తేన నిర్వృత్తా స్సాత్త్వికా ఇత్యుదీరితా
అత్ర తద్భావ భావనమ్ నామ తన్మయత్వేనావ స్థానం

పరులయొక్క సుఖదుఃఖాదుల యనుభావముచే మనసున తద్భావభావనము జరుగును. ఇట తద్భావభావనమనగా తన్మయీ భావము. తన్మయత్వమునకు అత్యంతము అనుకూలమగు మనస్థితి సత్త్వమనబడును తన్నిర్వృత్తములు సాత్త్వికములు - తద్భావ భావన మన నేమో యాతడె ఇట్లు వివరించెను

[21] రామాద్యాశ్రిత దుఃఖాదేరను భూతే స్తదాత్మనా
సామాజికస్యమనసో భావ స్తద్భావభావనమ్

రామాదుల నాశ్రయించిన దుఃఖాదుల యనుభూతిచే సామాజికుని మనస్సు పొందు తాదాత్మ్యభావమే తద్భావభావనము -

ఈ నిష్పత్తిక్రమము నిట్లతడు వివరించినాడు "ఏవంచ విభావాదిదర్శనజన్యా అనురాగనిర్వేదాదిమనోవృత్తయో విభావాదితన్మయీభవనరూపేణ సత్త్వశబ్దాభిధేయేన సామాజికమనసో౽త్యంతానుకూల్యజన్యే నాసాధారణకారణేన అవస్థాంతర మాపన్నా స్తంభాదయో భావాః సాత్త్వికభావా భవంతితే చ స్వకార్యభూతై రత ఏవ సాత్త్వికపద ప్రతిపాద్యై ర్బాహ్యై ర్జడై ర్భౌతికై శ్శారీరై స్స-భావభ రనుభావై స్సూచ్యంతే.తథా చ రతినిర్వేదాదిభావా ఏవ సూచితా భవంతీతి ఫలితం. తదుక్త మాచార్యహేమచంద్రేణ

"బాహ్యా స్తు స్తంభాదయ శ్శారీరధర్మా అనుభావా స్తే చాంతరాళికాన్ భావాన్ గమయంతః పరమార్థతో రతినిర్వేదాదిగమకా ఇతి స్థితమ్."

మొత్తముమీద తేలిన సారాంశము నిట్లు భావింపవచ్చును. విభావాదుల దర్శనమును నటుడు అభినయించును.విశేష మైన అనుభావములను ప్రదర్శించుటకు కేవల

---

[21] రత్నాపణము-రసప్రకరణము

నైపుణ్యము శిక్షణలము నటునికి చాలదు. వానికి కొంత సమాహితమనస్త్వము కావలెను. అది సత్త్వము.ఆంతరమైన యట్టి సత్త్వముచే గ్రాహ్యము లైన రోమాంచాదులను నటుడు ప్రదర్శించును. (ఈ ప్రదర్శనమునందు నటునికి సమాహితమనస్త్వము తోడ్పడును) అది లేకి యీ భావములను నటుడు సమగ్రముగ ప్రదర్శింపజాలడు. అనుభావాత్మకములు భావసంసూచనాత్మకము లైన నటుని చేష్టలను చూచి సామాజికుడు తదాంతర భావములను భావించును.అట్టి భావనమునకు అనుకూల్య మైన మనోవ్యాపారమే సత్త్వము. అట్టి సత్త్వస్థితిచే భావింపబడిన భావములు(చిత్తవృత్తివిశేషములు) సాత్త్వికభావము లనబడును.విభావాదులచే సువ్యక్తము లైన సామాజికునివాసనాస్థిత సందరి రత్యాదులు రసత్వము పొందు దశలో సాత్త్వికభావములు రత్యాదులను రసత్వమును ప్రాపింపజేయుచున్నవి. అనగా రత్యాదులు రసత్వమునందుటలో నొక స్థితి సాత్త్వికభావములని యర్థము.వీనిచే రత్యాదులే సూచితములు పరిపుష్టములు నగుచున్నవి.

అనుభావములు - సాత్త్వికభావములు

"కార్యభూతో నుభావస్స్యాత్"కార్యభూతమైనది యనుభావము, స్థాయివ్యభిచారు లైన చిత్తవృత్తివిశేషములకు జ్ఞాపకములు,ఆవిష్కారములును,అనుమాపకములు నైన కార్యములు అనుభావములు.కావుననే భావసంసూచనాత్మకము అనుట. ఇట్టి యనుభావములు (1)స్వాభావజములు(2)అంగజములు(3)సాత్త్వికము లని ముప్విధములు.ఈ త్రైవిధ్యమును బట్టి అనుభావములందే సాత్త్వికము అంతర్భవించునట్లు స్పష్టము. అట్లైనను వానిని వేరుగా నిర్దేశించుటలో గల యుద్దేశ మిట వివరింపబడుచున్నది.

సాత్త్వికభావములు అనుభావములలో నేకదేశమే కావచ్చును.కాని వాని కొక వైశిష్ట్యము కలదు.అవి సత్త్వజములు.మిగిలిన యనుభావములు సత్త్వజములు కావు. ఈ సత్త్వము చిత్తవృత్తివిశేషము కావున నివి 49 భావములలో చేరును. భరతుడు నిర్దేశించిన ఏకోనపంచాశద్భావములలో సాత్త్వికము లెనిమిదింటిని చేర్చెను.కావుననే వీనికి పృథగుపాదానము.

అనుభావత్వసామాన్యే సత్యప్యేషాం పృథక్తయా
లక్షణాం సత్త్వజత్వాద్ధి తే చ స్తంభాదయః స్మృతాః

వీనికి సామాన్యమైన అనుభావత్వ మున్నను వేరుగా లక్షణము చెప్పుటకు కారణము అవి సత్త్వజము లగుటయే అని భావము. కావున అనుభావములలో వీనిని బ్రాహ్మణపరివ్రాజకన్యాయమున గ్రహింపదగునని కుమారస్వామిసోమపీథి వచించినాడు

సాత్త్వికభావనిష్పత్తి - మతాంతరము

ఈ సాత్త్వికభావనిష్పత్తివిషయమున హేమచంద్రుడు భిన్నమతమును ప్రతిపాదించెను

(సీదత్యస్మిన్ మన ఇతి వ్యుత్పత్తేః సత్త్వగుణోత్కర్షాత్ సాధుత్వాచ్చ ప్రాణాత్మకం వస్తు సత్త్వమ్-తత్ర భవాః సాత్త్వికాః భావా ఇతి వర్తన్తే, తే చ ప్రాణభూమిప్రసృతరత్యాదిసంవేదనవ్యక్తయో బాహ్యజలరూపశోకనేత్రజలాదిలక్షణా విభావేన రత్యాదిగతైర్వా ఇతిచర్వణాగోచరేణాహృతా అనుభావైశ్చ గమ్యమానా భావా భవన్తి. తథా హి పృథ్వీభాగప్రధానే ప్రాణే సంక్రాన్త శ్చిత్తవృత్తిగణః స్తంభో విష్టబ్ధిచేతనత్వమ్, జలభాగప్రధానే తు బాష్పః తేజస్తు ప్రాణనైకట్యాదుభయథా తీవ్రాతీవ్రత్వేన ప్రాణానుగ్రహ ఇతి ద్విధా, స్వేదో వైవర్ణ్యం చ తద్ధేతుత్వాచ్చ వ్యపదేశః ఆకాశానుగ్రహే, గతచేతనత్వం ప్రలయః వాయుస్వాతంత్ర్యే తు తస్యమందమధ్యోత్కృష్టావేశాత్ త్రిధా రోమాంచవేపథుస్వరభేదభావేన స్థితిః ఇతి భరతవిదః బాహ్యాస్తు స్తంభాదయః శరీరధర్మా అనుభావాః తే చాంతరాలికాః సాత్త్వికాన్భావాన్ గమయంతః పరమార్థతో రత్యనిర్వేదాదిగమకాః ఇతి స్థితమ్)

మనసీదతి(సత్త్వమునందు) మగ్న మగును. సత్త్వగుణముయొక్క ఉత్కృష్టిచేతను, సాధుత్వముచేతను ప్రాణాత్మకమైన వస్తువే సత్త్వము. దానినుండి పుట్టినవి సాత్త్వికభావము లనబడుచున్నవి. రత్యాదిసంవేదనవ్యక్తులు ప్రాణభూమి

కావ్యానుశాసనమ్

ప్రస్ఫుతములై, బాహ్యజడత్వాదినేత్రజలాదిలక్షణములై పత్యాగిగతమును, అతి దర్వదాగోచరమును ఆగు విభావముచే ఆహృతములై విభావానుభావములచే గమ్యమానములై భావములగును.

పృథ్వీభాగప్రధాన మైన ప్రాణమందు సంక్రాంతమైన చిత్తవృత్తిగణము స్తంభ మగును. విష్టబ్ధచేతనత్వము దీని లక్షణము. జలభాగప్రధాన మైన ప్రాణమందు సంక్రాంత మైన చిత్తవృత్తిగణము బాష్ప మగును. తేజస్సనకు ప్రాణముతోడి సామీప్యముచేత ద్వైవిధ్యము సంభవించును. తీవ్ర మైన ప్రాణానుగ్రహముచే స్వేద మును,అతితీవ్ర మైన అనుగ్రహముచే వైవర్ణ్యమును జనించును.ఆకాశభాగప్రధాన మైన ప్రాణమునందు సంక్రమించిన రత్యాదిగణము ప్రళయ మగును.గతచేతనత్వము ప్రళయలక్షణము.వాయుస్వాతంత్ర్యముచే ప్రాణమునకు మంద, మధ్యమ,ఉత్కృష్ట వేగములు కల్గును. దానితో సంక్రమించిన రత్యాదులు వరుసగా రోమాంచము, వేప మథు,స్వరభేదము నగును.ఇది భరతవిదుల యభిప్రాయము.బాహ్యములు, శరీరధర్మ ములు. అనుభావములు నైన ఈ స్తంభాదులు ఆంతరాళికము లైన స్తంభాదులను సూచించును.పరమార్థముచే కలినిర్వేదాదిసూచకము లగుచున్నవి.

సాత్త్వికవ్యభిచారిభావములు

ఈ రెండును భావములే-చిత్తవృత్తి శేషములే భరతుడు అనుభావమును భావ ములలో చేర్పకపోయినను సాత్త్వికములను మాత్రము పరిగణించెను. చిత్తవృత్తివిశేష మున సాదృశ్యము కల్గినను వీనికి కొంత-భేదము కలదు. వ్యభిచారిభావములు బాహ్య కారణజన్యములు సాత్త్వికము లాంతరకారణజన్యములు-కావుననే సమాహితమనస్త్వము సాత్త్వికమునకు కవసరమని భరతుడు నుడివియున్నాడు. వ్యభిచారులు నానారసము లందు వ్యభిచరింతురు. సాత్త్వికములు ప్రతిరసభిన్నములుగ నుద్భవించును.

సాత్త్వికముల ననుసరించి రసాస్వాదము కలుగు. అట్లయ్యెను భృత్యుని పెండ్లియందు తదనుగుణుడై రాజున్నట్లు.దును దప్ప వ్యభిచారులవలె స్వాతంత్ర్య గ్రంథము నివి భజింపవు. (హే-కా)

సాత్త్వికశబ్దము-వేదాంతశాస్త్రానుగుణ్యము

మానవప్రకృతి గాని, ప్రవృత్తి గాని త్రిగుణాత్మక మైనది. సత్త్వరజస్తమో

గుణములకు లోబడి మానవుల సర్వకార్యములు నిర్వహింపబడుచుండును. ఈ గుణములు మూడింటియందును సత్త్వము శ్రేష్ఠ మైనదగును జ్ఞానప్రకాశ మైనదిగను భగవద్గీత నిర్వచించుచున్నది. మిగిలిన రెండుగుణములు నడగి సత్త్వ ముద్రేకించిననే గాని మోక్షము కలదని మనుస్మృచున్నది. సత్త్వలక్షణమును ఇట్లు నిరూపించుచున్నది భగవద్గీత.

> [28]తత్ర సత్త్వం నిర్మలత్వా త్ప్రకాశక మనామయమ్
> సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ
> సత్త్వం సుఖే సంజయతి . .. .
> రజ స్తమ శ్చాభిభూయ సత్త్వం భవతి భారత

సత్త్వము నిర్మల మైనది. జ్ఞానప్రకాశ మైనది. ఉపద్రవరహిత మైనది. సుఖాసక్తిచేతను, జ్ఞానాసక్తిచేతను జీవుని బంధించుచున్నది. సత్త్వము సుఖమునందు చేర్చుచున్నది రజస్తమోగుణములను రెంటిని అణచివేసి సత్త్వము ప్రకాశించును. అనగా త్రిగుణములలో సత్త్వము శ్రేష్ఠమైనట్లుగా మోక్షమునకు సహాయావస్థ సత్త్వస్ఫురణముచే కల్గు ననియు తెలియుచున్నది.

భగవంతుడు యోగమాయాసమావృతుడు ఈ ఆవరణము సత్త్వోద్రేకముచే తొలగును. అపుడే ఆనందస్వరూపు డైన పరబ్రహ్మ గోచరించును.

సాహిత్యమునందును భగ్నావరణరూప మైన జ్ఞానమే రస మని జగన్నాథుడు ప్రకటించును. "భగ్నావరణా చిదేవ రసః" ఈ ఆవరణభంగము విభావాదిచర్వణమువలన కల్గును. అందు సాత్త్వికములు రసమునకు సమీపస్థములు. విభావాదులచే సముద్బుద్ధమై యనుభావములచే వ్యక్తమై వ్యభిచారులచే పరిపుష్ట మైన రత్యాదులు రసీభావ మొందుటలో మధ్యమందు సాత్త్వికభావోదయ మైనంత తదనంతరము రసానుభవము కల్గును. ఈ క్రమవికాస మంతయు వేదాంతుల ఆనందమార్గము ననుసరించియే జరిగెను.

ఇదియును గాక సర్వప్రవృత్తులయందు త్రిగుణాత్మక మైన భేదమును పాటించుచు,అందు సాత్త్వికముల ప్రాధాన్యమును సంఘటించుచు భగవద్గీత యీ క్రింది

---

[28] భగవద్గీత.

వానిని వివరించినది. సాత్త్వికకర్మము, సాత్త్వికశ్రద్ధ, సాత్త్వికప్రియాహారములు, సాత్త్వికయజ్ఞము, సాత్త్వికతపస్సు, సాత్త్వికదానము, సాత్త్వికత్యాగము, సాత్త్విక జ్ఞానము, సాత్త్వికకర్త, సాత్త్వికబుద్ధి. సాత్త్వికధైర్యము, సాత్త్వికసుఖము మున్నగునవి.

వ్యభిచారి భావములు :

రససూత్రమునందు మూడవపదము వ్యభిచారిశబ్దము-వీనికే సంచారిభావము లనియు నామాంతరము-ఈ శబ్దమునుగూర్చియు, తదర్థమునుగూర్చియు భరతుడు నాట్యశాస్త్రమున వివరించెను.

[24] (వ్యభిచారిణ ఇతి కస్మాత్! ఉచ్యతే-వి-అభి ఇత్యేతా వుపసర్గౌ చర ఇతి గత్యర్థో ధాతుః వివిధ మాభిముఖ్యేన రసేషు చరంతీతి వ్యభిచారిణః వాగంగసత్త్వోపేతాన్ ప్రయోగే రసా న్నయంతీతి వ్యభిచారిణః

వి,అభి అనునవి యుపసర్గములు-చరధాతువు గత్యర్థకము. రసములందు వివిధరీతుల నాభిముఖ్యముతో చరించును గనుక నివి వ్యభిచారులు. వాగంగసత్త్వోపేతము లైన రసములను ప్రయోగమున చరింపజేయును అనగా తీసికొనిపోవును. సహృదయాస్వాదయోగ్య మొనర్చును. ఈ కొనిపోవుటనుగూర్చి భరతుడే యిట్లు సోదాహరణముగ తెల్పుచున్నాడు.

[25] కథం నయంతీతి-ఉచ్యతే-లోకసిద్ధాంత ఏషః,యథా సూర్యః ఇదం దినం నక్షత్రం వా నయతీతి,న చ తేన బాహుభ్యాం,స్కంధేన వా,నీయతే,కింతు లోకప్రసిద్ధ మేతత్ యథేదం సూర్యో నక్షత్రం దినం వా నీయతీతి,ఏవ మేతే (ప్రయోగంనయంతీతి) వ్యభిచారిణ ఇత్యవగంతవ్య.

---

[24] నా॥ శా॥ అధ్యాయము 7 పు 355

[25] నా॥ శా॥ పు 356

సూర్యుడు ఈ దినమును లేదా నక్షత్రమును తీసికొనిపోవుచున్నా డనుట. లోకమందు ప్రసిద్ధప్రయోగముగా కానవచ్చుచున్నది. అచట సూర్యుడు పై వానిని బాహువులతోగాని, స్కంధముచేగాని, మోసుకొనిపోదుకాని తీసికొని పోవుచున్నాడప మాత్ర మందుడు. అట్లే ఈ వ్యభిచారి భావములు రసములను కొనిపోవును. పొం దించు నని భావము.

సూర్యుడు(వాసరమును)దినమును సముల్లసింపజేయుచు ప్రకాశప్రద మొనరిం చును- మేఘవ్యాప్తమును సూర్యరహితము నైన దివసము ప్రకాశము కాదు గదా! అందుచేతనే సూర్యుడు వాసరమును తీసికొనిపోవుచున్నా డను వ్యవహార మేర్ప డినది- ఇట్లే వ్యభిచారిభావములును రసరూపోపచయమునందు స్థాయిభావముల కుపక రించుచున్నవి. ఉపకరించి నశించుచున్నవి కూడ- ఈ విధముగా ఆధిముఖ్యమును వరిం చుచున్నవి. ఇట్లు రసపరిణామపదవిని పొందింపజేయునని భావము. [40]

ఈ వ్యభిచారిభావముల స్వరూపాదికమును గూర్చి యభినవుడు ఈ క్రింది రీతిని వివరించెను.

తస్మాత్ స్థాయిరూప చిత్తవృత్తి సూత్రస్యూతా ఏ వామీ వ్యభిచారిణః స్వాత్మాన ముదయాస్తమయ వైచిత్ర్యశతసహస్రధర్మా ణం ప్రతిలభమానా రక్తనీలాది సూత్రస్యూత విరళభావో(గో)పలంభన సంభావిత స్ఫటికసహస్రసంస్కృ స్ఫటిక కాచ భ్రామక పద్మరాగ మరకత మహానీలాదిమణిగోలకవ త్తస్మిన్ సూత్రే సంస్కారవైచిత్ర్య మనివేశ యంతోఽపి తత్సూత్రకృత ముపకారసందర్భం బిభ్రతః స్వయం చ విచి త్రాత్మస్థాయి సూత్రం చ విచిత్రయంతోఽంతరాంతరా శుద్ధ మపి స్థాయి సూత్రం ప్రతిభాసావకాశ ముపనయంతోపి పూర్వాపర వ్యభిచారిరత్న చ్ఛాయాశబలిమాన మవశ్య మానయంతః ప్రతిభాసంత ఇతి వ్యభిచారిణ ఉచ్యంతే (అభినవుని వ్యాఖ్య-నాట్యశాస్త్రము పు 283)

స్థాయిరూపచిత్తవృత్తిసూత్రమున ఎడమెడముగా గ్రుచ్చబడిన యీ వ్యభిచా రులు, ఉదయాస్తమయాదివైచిత్ర్యకృత శతసహస్రధర్మముల నొందుచున్నవై రక్త

[40] నాట్యశాస్త్రము పు 356

నీలాదిపర్ణసూత్రములు కట్టబడి విరళభావోపలంభనసంభావితభంగి సహస్రసంస్కృతము లైన స్ఫటిక, కాచ, భ్రామక, పద్మరాగ, మరకత, మహానీలాదిమయగోళికములవలె ఆ సూత్రమంతయు తన సంస్కారవైచిత్ర్యము తెలియకొల్పకయు, ఆ సూత్రంపు ప్రవాహంబు స్వయముగ విచిత్రార్థమైన (పలువన్నెలపొల్పు) స్థాయిసూత్రమును మరింత విచిత్రముసేయుచున్నవై నడుమ నడుమ స్థాయిసూత్రమునకు ప్రతిభాసావకాశము కలుగునట్లు(ఉపాధివంతముగ జేయుచు)పూర్వోత్తరవ్యభిచారిరత్నముల కాంతులచే శబలిత మొనర్చుచు ప్రకాశించును కావున వ్యభిచారిభావము లనబడుచున్నవి. (ధ-వేం-సు-రసగంగాధరము)

మొత్తముమీద వీని సారాంశమును దశరూపకకారుడు

విశేషా దాభిముఖ్యేన చరంతో వ్యభిచారిణః
స్థాయిన్యున్మగ్ననిర్మగ్నాః కల్లోలా ఇవ వారిధౌ

అని వ్రాసెను. రత్యాదిస్థాయిభావములు రసత్వపరిణామ మొందునవి. ఇవి ఆభిముఖ్యమున చరించును. వీనిని వారిధియందలి యలలతో పోల్చిరి. ఇవి అప్పటి కప్పుడు పుట్టి నశించునవే కాని స్థిరముగా నుండునవి కావు. ఈ భావములు ప్రత్యేక రసమునకే యను నియమము లేక సర్వరసములందును వ్యభిచరించుటచే కూడ వీనిని వ్యభిచారులందు రని యందురు.

స్థా యి భా వ ము లు :

స్థాయీ (న్) పుం—తిష్ఠతీతి—స్థా + ణినిః—భావభేదః (శబ్దకల్పద్రుమము) స్థిరముగా నిల్చు భావములు గనుక స్థాయిభావము లైనవి. ఇవి సామాజికుని మనస్సున స్థిరరూపమున నెలకొని యుండును. విభావాదులచే సుప్రబుద్ధమై సంచార్యాదులచే పరిపుష్టమై రసీభావము నొందును. వీనికి ప్రేరణ లేనపు డివి మనస్సున సంస్కారరూపమున నుండును. ఇవి జన్మాంతరములనుండియు సంక్రమించు నని భారతీయ సాహిత్యవేత్తల సిద్ధాంతము. జన్మాంతరము నొప్పని యాధునికులు జన్మసిద్ధ మైన వాని నంగీకరింతురు.

ఇవి సహృదయుని హృదయమున వాసనారూపమున నెలకొని యుండుటను ఆలంకారికులు అపచితావస్థ యనిరి. విభావాదులచే సుప్రబుద్ధమై రసత్వ మొందుట ఉపచితావస్థ యనిరి. అపచితావస్థ యనగా సూక్ష్మవాసనారూపదశ. అప్పుడీ స్థాయి

భావముల కాస్వాదయోగ్యత లేదు ఉపచితమై రసావస్థ నొందినపుడే వానికి స్వాదుత్వము సంక్రమించును ఈ వాసనారూపమున నుండు భావములు ప్రతిమానవునకును నుండును

ఈ స్థాయిభావముల స్వరూప స్వభావములగూర్చి భరతుడు ఇట్లు వచించెను (ఈ స్థాయిభావముల ప్రసక్తి రససూత్రమున భరతుడు చెప్పలేదు. చెప్పకపోవుటయె వాని ప్రాధాన్యమునకు నిదర్శక మని వ్యాఖ్యాతయు నుడువుచున్నాడు. ప్రకృతిరస మగు శాంతరసమునుగూర్చి భరతుడు నుడువనట్లే)

యథా హి సమానలక్షణా స్తుల్యపాణిపాదోదర శరీరాః సమానాంగప్రత్యంగాః అపి పురుషాః కులశీలవిద్యాకర్మశిల్ప విచక్షణత్వా ద్రాజత్వ మాప్నువంతి. తత్రైవ చాన్యేఽల్పబుద్ధయ స్తేషా మే వానుచరా భవంతి తథా విభావానుభావవ్యభిచారిణః స్థాయిభావా నుపాశ్రితా భవంతి. బహ్వాశ్రయత్వాత్ స్వామిభూతాః స్థాయినో భావాః తద్వత్ స్థానీయ పురుషగుణభూతా అన్యే భావా స్తాన్‌గుణత యాశ్రయ న్తే-స్థాయిభావా రసత్వ మాప్నువంతి పరిజనభూతా వ్యభిచారిణో భావాః (అత్రాహ కో దృష్టాంత ఇతి) యథా నరేంద్రో బహుజనపరివారోపి స ఏవ నామ లభతే నాన్యః సుమహానపి పురుషః తథా విభావానుభావవ్యభిచారిపరివృతః స్థాయీ భావో రసనామ లభతే-భవతి చాత్ర శ్లోకః

యథా నరాణాం నృపతిః శిష్యాణాం చ యథా గురుః
ఏవం హి సర్వభావానాం భావః స్థాయీ మహా నిహ.[27]

పురుషు లందరు తుల్యములైన హస్తములు, పాదములు, ఉదరము, శరీరము కలవారై సమాన లక్షణములు కలవారైనను, కొందరు కులశీలవిద్యాకర్మశిల్పవిచక్షణత్వముచే రాజత్వమును పొందుచున్నారు అల్పబుద్ధు లైన ఇతరులు వారికే అనుచరు లగుచున్నారు. అట్లే విభావానుభావవ్యభిచారులు స్థాయిభావముల నాశ్రయించుకొని యుండును-బహ్వాశ్రయము లగుటచే స్వామిభూతము లైనవే స్థాయి భావములు

[27] నాట్యశాస్త్రము. అ. 7- శ్లో 8

లన్యభావములు స్థాయిభావమును గౌణముగా నాశ్రయించి యుండును. స్థాయిభావముచే రసత్వ మొందుచున్నవి. వ్యభిచారులు పరిజనభూతములు- (దీనికి దృష్టాంత మిట్లు చెప్పుచున్నాడు) ఇతడు ఎంత గొప్పవా డైనను రా జనిపించుకొనడు. బహుజనపరివారయుక్తు డైన వాడే నరేంద్రు డనిపించుకొనును. అట్లే విభావానుభావవ్యభిచారిపరివృత మైన స్థాయిభావమే రసత్వమును పొందుచున్నది – సాహిత్యదర్పణకారుడు మరొక విశేషమును చెప్పినాడు.

[28] అవిరుద్ధా విరుద్ధా వా యం తిరోధాతు మక్షమాః
ఆస్వాదాంకురకందోఽసౌ భావః స్థాయీతి సమ్మతః.

విరుద్ధావిరుద్ధభావములచే తిరస్కరింపబడని ఆస్వాదాంకురకందమే స్థాయిభావము-రసజ్ఞాన మనెడి తరువునకు ఈ స్థాయిభావము మూలభూత మైనది. ఇట్లు చెప్పి సాహిత్యదర్పణ కారుడు తన భావములకు ప్రాచీనసమ్మతిని ఉదాహరణరూపమున నిట్లు చెప్పినాడు

[29] స్రక్సూత్రవృత్త్యా భావానా మన్యేషా మనుగామకః
న తిరోధీయతే స్థాయీ తై రసౌ పుష్యతే పరమ్

మాలాంతరగత మైన సూత్రమువలె అన్యభావములకు వ్యంగ్యరూపమున అనుసరణకారి యై ఆ అన్యభావములచే తిరోహితము గాక యుండుటయే గాక వానిచే పుష్టి నందునది స్థాయిభావము ఈ విధమైన సాదృశ్యముచే తేలిన ఫలితము "పూలదండ స్థానీయ మైనది రసము - సూత్రమువంటిది స్థాయిభావము-ఆ సూత్రమునకు గ్రుచ్చబడిన మణులవంటివి అనుభావాదులు"

కుమారస్వామి రత్నాపణమందు ఈ స్థాయిభావమును గూర్చి యింకను నిట్లు వివరించినాడు"పటం ప్రతి తంతువ ద్రసం ప్రత్యాకారమాత్రవ్యవహితః స్థాయిభావ ఇత్యుచ్యతే-తస్య సాక్షా ద్రసభావ ప్రతిపాదనాత్".

---

[28] సా ద 3-174

[29] సా ద 3-174 కారిక.

పటమునకు (వస్త్రమునకు) తంతువు లెట్లో రసమునకు స్థాయిభావ మట్టిది- కేవల మాకారభేదమే కాని వేరుకాదు- ఇది సాక్షాత్తూ రస మగును. తన యీ భావమునకు అరుదు ప్రాచీనసమ్మతిని కూడ చూపినాడు

దీనికే శ్లోక రూపమున వచించినాడు. నరులలో నృపతివలె, శిష్యులలో గురువు వలె సర్వభావములందును స్థాయిభావము గొప్పది-మహత్తము మైనది.

చరమసమయపర్యంతము అనగా రసస్ఫూర్తి పర్యంతము నిల్చునది కావున దీనికి స్థాయిభావ మని పేరు కలిగిన దని సంగరంగిణీకారుడు పేర్కొనెను. వ్యభిచారాద్యములు చరమసమయ పర్యంతము నిలువవు. బుద్బుదములవలె తక్షణమే నశింపును ఈ విషయమును దృష్టాంత పూర్వకముగ దశరూపకకారుడు చెప్పినాడు

[30] విరుద్ధై రవిరుద్ధై ర్వా భావై ర్విచ్ఛిద్యతే న యః

ఆత్మభావం నయ త్యన్యాన్ స్థాయీ స లవణాకరః

విరుద్ధభావములచే గాని, అవిరుద్ధభావములచే గాని, విచ్ఛిత్తిని పొందక అన్యము లైన నదీజలమును లవణ ఆత్మభావమునే కలిగించు లవణాకరమువలె యుండునది స్థాయిభావము ఈ భావమే మరొక తీరున

సజాతీయై ర్విజాతీయై రతిరస్కృతమూర్తిమాన్

యావద్రసం వర్తమానః స్థాయీ భావ ఉదాహృతః

సజాతీయవిజాతీయ భావములచే తిరస్కారమును పొందనిదై రసస్ఫూర్తి పర్యంతము నిల్చునది స్థాయిభావము. కుమారస్వామి సజాతీయవిజాతీయములను గూర్చి యిట్లు వచించినాడు.

[32] కస్యాంచి న్నాయికాయా మనురాగస్య నాయి

కాంతరవిషయానురాగ స్సజాతీయః తత్ర భీతత్వాదిర్విజాతీయః

---

[30] ద రూ॥

[31] ద రూ॥

[32] రత్నాపణము,

ఒకానొక నాయికయందున్న యనురాగమునకు నాయికాంతరవిషయ మైన యనురాగము సజాతీయము–బీభత్సాదులు విజాతీయములు.

[33] "ప్రకృష్యమాణో యో భావో రసతాం ప్రతిపద్యతే ।
స ఏవ భావః స్థాయీతి భరతాదిభి రుచ్యతే

ఇంతియగాక విశదార్థ మిట్లు వివరించినాడు

ఏతేన సామాజికమనోవికారవిశేషోపాధి ర్బ్రహ్మానందసబ్రహ్మ
చారిణో రసస్య సన్నిహితః పూర్వావస్థావిశేషః
స్థాయిభావః ఇతి ఫలితం"

సామాజికమనోవికారవిశేష మనుపాధిగా కల్గి, బ్రహ్మానందసబ్రహ్మచారి యైన రసమునకు సన్నిహిత మైన పూర్వావస్థావిశేషమే స్థాయిభావ మని ఫలితము. వస్తుతః బ్రహ్మానందము కేవలమాత్రాకారరహితము. నిరుపాధికము నైనది కదా! రసము బ్రహ్మానందసబ్రహ్మచారి గదా. అట్టి రసమునకు అవస్థాసంబంధ మెట్లు కుదురునని యూశంకించుకొని యిట్లు సమాధానము చెప్పినాడు. గగనమధ్యమం దున్న చంద్రునకు ఉదయాద్యుపాధిసంబంధ మెట్టిదో రసమునకు స్థాయిభావోపాధి యట్టిది. దీనినే కొందరు ఆలంకారికులు స్థాయి రసములకు ఉపాధ్యుపధేయభావముగా చిత్రించిరి. ఆకాశము సర్వవ్యాపకము. నిరుపాధికము. అదియే ఘటాంతర్భాగమున చేరి పరిచ్ఛిన్నమై ఘటాకాశ మనిపించుకొనుచున్నది. సోపాధికమగుచున్నది. ఇట్లే రసము రత్యాదు లనెడి యుపాధిచే పరిచ్ఛిన్నమై శృంగారాదివ్యపదేశముల నొందుచున్న దని సారాంశము.

భావములు – స్థాయిత్వము

భావము లన్నియు చిత్తవృత్తివిశేషములే కదా! చిత్తవృత్తు లన్నియు ద్విక్షణమాత్రము లని సిద్ధాంతము కదా– వీటికి స్థైర్య మెట్లు సంభావిత మని రసగంగాధరకారుడు ఆశంకించుకొని యిట్లు సమాధానము చెప్పినాడు.

---

[33] రత్నాపణము - రసప్రకరణము

[34] అన్తఃకరణవృత్తిరూపస్య రత్యాదే రాశువినాశిత్వేఽపి
సంస్కారాత్మనా చిరకాలస్థాయిత్వాత్
యావద్రసప్రతీతికాల మనుసన్ధానాచ్చ స్థాయిత్వమ్ (ప్రదీపప్రభా)

రత్యాదు లంతఃకరణవృత్తిరూపము లగుటచే త్వరగా నశించున వైనను సంస్కారరూపమున చిరకాలము సామాజికమనస్సులం దుండుటచేతను రసప్రతీతి వరకు అనుసంధాన ముండుటచేతను ఈ భావములకు స్థాయిత్వప్రతీతి కల్గుచున్నది. వాసనారూప మైన స్థిరత్వము వ్యభిచారులకును కలదు. కాని యొకభేదము ఇట గమనార్హము వాసనారూపము లైన స్థాయిభావములకు యావద్రసప్రతీతికాల మంతయు మాటిమాటికి అనుసంధానము కల్గుచుండును. ఇట్టి పునఃపునరభివ్యక్తి వ్యభిచారి భావములకు లేదు. మెఱుపువలె మెఱిసి నశించును. కావున వ్యభిచారిభావములకు కాదాచిత్కత్వమే గాని స్థాయిత్వము లేదు.

ఈ స్థాయిభావములు సర్వప్రాణిసహజము లైనవి. అయినను వీనిలో కొన్ని కొంతమందిలో అధికముగను, కొన్ని కొంతమందిలో అల్పముగాను భాసించుచుండును. అనగా సమపరిణామ మొందవు. గంధర్వులలో రతి యధికము. క్రోధాదులు అల్పము. ఋషులలో శమము ఉత్కృష్టము రత్యాదులు అపకృష్టములు రాక్షసులలో క్రోధ మధికము. భయము అసత్కల్పము. ఈ భేదము అవస్థలను బట్టియు కల్గుచుండును. బాలురయందు రతి యసద్భూతము. బ్రహ్మజ్ఞానియందు నష్టప్రాయము. యువకులయందు ప్రకృష్టముగ నుండును.

స్థాయిభావలక్షణములను అంశాత్మకముగ నిట్లు వివరింపవచ్చును

1) ఇవి సామాజికమనస్సులందు వాసనారూపమున నుండును.

2) సర్వప్రాణిసహజములు (న్యూనాధికభేదముతో)

3) అ). సజాతీయవిజాతీయభావములచే తిరస్కృతములు కావు
ఆ). వానిచే పరిపుష్టము లగును

4) ఇతరభావము లన్నిటిని తమలో ఇముడ్చుకొనును. స్వాత్మత్వమును వానికి సంక్రమింపజేసి రసీభావమునకు సిద్ధపడును.

---

[34] ప్రదీపప్రభా

5) పీనికి రసప్రతీతిపర్యంతము ముహుర్ముహురభివ్యక్తి యుండును.

6) వివిధాధికమైన రసమునకు ఉపాధిని కల్గించినవి.

7) సర్వభావములందును మౌళిభూతములు
   అ) రత్నలలో సరేంద్రమునివంటివి
   ఆ) పూసలలో దారమువంటివి
   ఇ) వస్త్రమునందు దారపుపోగుల వంటివి
   ఈ) శిష్యులలో గురునివంటివి

8) బహువిధావజములు - ప్రరూఢములు

స్థాయిభావములు - వ్యభిచారిభావములు

ఇవి రెండును భరతుడు పేర్కొనిన 49 భావములలో చేరినవే. చిత్తవృత్తి విశేషములే. కాని వీని కీ భేద మెట్లు కల్గు ననగా అభినవగుప్తుడు ఈ సమాధాన మొసగెను.

[35] గ్లానోఽయ మిత్యుక్తే కుత ఇతి హేతుప్రశ్నేన స్థాయీ తస్య సూచ్యతే-న తు రామ ఉత్సాహశక్తిమా నిత్యత్ర హేతుప్రశ్న మాహుః,అత ఏవ విభావా స్తత్ర ఉద్దీపకా స్సంతః స్వరూపోపరంజకత్వం విదధానా రత్యుత్సాహాదే రుచితానుచితత్వమాత్ర మావహన్తి-న తు తదభావే సర్వథైవ తే నిరుపాఖ్యాః, వాసనాత్మనా సర్వజంతూనాం తన్మయత్వే నోక్తత్వాత్ - వ్యభిచారిణాం తు స్వవిభావాభావే, నామాపి నాస్తీతి.

ఇతడు గ్లానుడు(గ్లానికల్గినవాడు)అని అనగానే ఎందువలన అని హేతుప్రశ్న కల్గును - కాని రాము డుత్సాహశక్తిమంతుడు-అని అనగానే అట్టి హేతుప్రశ్నకు తావులేదు. కావుననే ఉత్సాహము స్థాయి యైనది స్థిరముగా మానసమున నెలకొని యున్నది—గ్లాని అట్టిది కాదు. ఏదో హేతువుచేత కల్గినది. అందుచే విభావాదులు ఉద్దీపకములై స్వరూపోపరంజకత్వము కల్గించును. రత్యుత్సాహాదులకు ఉచితాను

---

[35] అభినవ భారతి పు 283

చితత్వ మావహించును. స్థాయిభావములు విభావాదులు లేనప్పుడు స్వతహా నిష్పాదితములు కావు. సంస్కారజన్యములగు వాసనాత్మకములుగా నీ భావము లుండును. వ్యభిచారిభావములు మాత్రము విభావాదులు లేనపుడు పేరైన లేక యుండును.

బహువిభావప్రవాహములు స్థాయిభావములు. అల్పవిభావ ప్రవాహములు వ్యభిచారిభావములు. ఇదే భావ మీ క్రింది శ్లోకము చెప్పుచున్నది

[36] రత్యాదయః స్థాయిభావాః స్యుర్భూయిష్ఠవిభావజాః
స్తోకై ర్విభావై రుత్పన్నా స్త ఏవ వ్యభిచారిణః

---

[36] శార్ఙ్గదేవుడు - సంగీతరత్నాకరము

రసానుభూతి

"విభావానుభావవ్యభిచారిసంయోగా ద్రసనిష్పత్తిః" అని భరతుని రస సూత్రము. ఇది వ్యాఖ్యానసాపేక్షము నాట్యశాస్త్రవ్యాఖ్యాతలు పలువురు దీనిని వ్యాఖ్యానించిరి. వారి వ్యాఖ్యానములు భిన్నరీతుల నున్నవి. నిజమున కా వ్యాఖ్యానములు ఏవియు నేడు కానవచ్చుటలేదు. కాని అభినవగుప్తుని "అభినవభారతి" లో వీరి వాదము లన్నియు వివరింపబడి ఖండింపబడినవి. అందు ప్రథమమతము భ ట్ట లో ల్ల టు ని ది. ఇతడు మీమాంసకుడు.

రససూత్రమందలి సంయోగ, నిష్పత్తిపదముల యర్థము స్పష్టముగ ప్రతీత మగుటలేదు. సంక్షిప్తముగ అనేకార్థస్ఫోరకముగ నుండి భిన్నవిధముల వ్యాఖ్యానింపబడిన . అందు భట్టలోల్లటుడు ఈ క్రింది విధముగ వ్యాఖ్యానించెను.

విభావాదిభి స్సంయోగః-అర్థాత్ స్థాయినః-తతో రసనిష్పత్తిః-తత్ర విభావః చిత్తవృత్తేః స్థాయ్యాత్మికాయా ఉత్పత్తౌ కారణమ్. తేన స్థాయ్యేవ విభావానుభావాదిభిరుపచితో రసః-స్థాయీభవత్యనుపచితః-స చోభయో రపి-ముఖ్యయా వృత్త్యా అనుకార్యే-అనుకర్తర్యపి చ అనుసంధానబలాత్

విభావాదులు స్థాయితో సంయోగము చెందుటవలన రసము నిష్పన్న మగును. స్థాయ్యాత్మక మగు చిత్తవృత్తివిశేషము ఉత్పన్న మగుటకు విభావము కారణము. కావున స్థాయియే విభావాదులచే ఉపచితమై రస మగుచున్నది. ఉపచితము కానిచో స్థాయియే అనబడును. ఈ రసము ఉభయులయందు నుండును. ముఖ్యవృత్తిచే అనుకార్యు లయిన రామాదులయం దుండును. అనుసంధానబలముచే అనుకర్తలైన నటులయందును భాసించును. [1]

పూర్వులైన వారికి నీ పక్షమే యభిమత మని తన వాదమునకు ప్రోద్బలకముగ నీ క్రింది సాక్ష్యము చూపుచున్నాడు భట్టలోల్లటుడు.

"చిరంతనానాం చ అయ మేవ పక్షః-తథాహి దండినా స్వాలంకారలక్షణే ఒభ్యధాయి-"రతిః శృంగారతాం గతా రూపబాహుళ్యయో

గేన" ఇతి కావ్యాదర్శే" (2-28) "అధిరుహ్య పరాం కోటిం కోపో రౌద్రాత్మతాం గతః" ఇత్యాది చ" (2-283)

దండి తన అలంకారలక్షణమునం దిట్లు వచించినాడు. రూపబాహుళ్యయోగముచే రతి శృంగారత్వమును పొందినది.

కోపము(క్రోధము) పరాకోటిని పొంది రౌద్రత్వమును పొందినది. అనగా స్థాయి ఉపచితమైన రస మగు ననుట దండికిని ఇష్ట మని భట్టలోల్లటుడు వచించినాడు.

భట్టలోల్లటుని వాదమునందు ముఖ్యాంశాత్మకముగ ఈ క్రింది విషయముల గ్రహింపదగును

1) విభావాదులు స్థాయియొక్క ఉత్పత్తికి కారణములు

2) రసము ముఖ్యముగ అనుకార్య లయిన రామాదులయం దుండును.

3) అనుసంధానబలముచే నటుని (అనుకర్తల) యందు భాసించును.

4) స్థాయి,విభావాదులచే ఉపచితమై రస మగును ఇది పూర్వాలంకారిక సమ్మతము.

[1] అనుసంధాన మన నేమో ఈశ్వర ప్రత్యభిజ్ఞానమున నిట్లు వివరింపబడినది

కాదాచిత్కావభాసే యా పూర్వాభాసాదియోజనా

సంస్కారాత్ కల్పనా ప్రోక్తా సాపి భిన్నావభాసినీ

ఈశ్వర ప్రత్యభిజ్ఞాన వివృతి విమర్శినీ పు 156

దీని కు నవగుప్తుని వ్యాఖ్యానము -

కాదాచిత్కః కదాచి ద్భవః అజ్ఞాతదేశకాలాకారః అవభాసః యస్య దేహాదేః స్వలక్షణరూపస్య-తత్రయా పూర్వాభాసేన కాలాదిశక్త్యాభాసేన యోజనా "యోఽహం బాలః స ఏవాద్య యువా" ఇత్యనుసంధానమ్

తత్తద్దేశకాలజ్ఞానమందు పూర్వదేశకాలజ్ఞానమును సంయోజనము చేయుట అనుసంధానము. పూర్వము బాలుడనైన నేను ఇపుడు యువకుడను. ఇప్పటి స్థితిలో నేని జ్ఞానమును పూర్వావస్థనుండి యోజనచేయుట

(శ్రీ) శంకుకుడు భట్టలోల్లటుని మతమును ఖండించిన విధము :-

శ్రీశంకుకుడు భట్టలోల్లటుని వాదమును ఖండించి తన వాదమును ప్రకటించెను. ముందు అతని పూర్వవాదఖండన విధానమును పరిశీలింతము.

స్థాయిభావములనే మొదట చెప్పియుండవలయును

భరతుని రససూత్రమును వ్యాఖ్యానించుచు భట్టలోల్లటుడు ఇట్లనెను 'విభావము స్థాయిభావముయొక్క ఉత్పత్తిలో కారణము' అనుచో విభావాదులు చేరినచో స్థాయియే అవగతము కాదు. అదియును గాక విభావములచే ఉత్పన్నములై అనుభావములచే సూచితములై సంచారులచే పుష్టములై సంయోగమున స్థాయులే రసీభావ మొందు చేని స్థాయిభావములే మొదట చెప్పియుండవలెను.[2] కాని భరతుడు అట్లు చెప్పలేదు కావున పై భట్టలోల్లటుని వ్యాఖ్యాన ధానము సరికాదు.

మందతర తమ మాధ్యస్థ్యాదిలక్షణ్యాపత్తి

స్థాయి ఉపచిత మైనచో రస మగు ననుట పొరపాటు లేనిచో భావ మగు ననుటయు-స్థాయిభావము ఉపచిత మగుటలో కల అవస్థాభేదము చేతను స్థాయి-భావస్వభావముచేతను, స్థాయిభావములను మంద మనియు మందతర మనియు మంద తమ మనియు ఇటు అనేకావస్థ లేర్పడి ఆనంత్యము సంభవిల్లును.[3] ఇది ముని సమ్మతము కాదు.

హాస్యరసమునందు షోఢాత్వము కలుగదు [4]

భరతుడు హాస్యరసమును వివరించుచు అందు "షడ్భేదాశ్చాస్య విజ్ఞేయా స్తాంశ్చ వక్ష్యా మ్యహం పునః స్మిత మథ హసితం విహసిత ముపహసితం చాపహసిత మతిహసితమ్"- నా శా-6-51 "ద్వౌ ద్వౌ భేదౌ స్యాతా ముత్తమ మధ్యమాధమ ప్రకృతౌ, 6-52.

---

[2] విభావాద్యయోగే స్థాయినోలింగాభావేన అవగత్యనుపపత్తేః భావానాం పూర్వ మభిధేయతాప్రసంగాత్- స్థితిగ్రహణాం లక్షణాంతరవైయర్థ్యాత్

[3] మందతర తమ మాధ్యస్థ్యానాం ఆపత్తేః.

[4] హాస్యరసే షోఢాత్వాభావప్రాప్తిః

హాస్యకే మూరువిధము లనియు, 1) స్మితము, 2) హసితము, 3) విహసితము, 4) ఉపహసితము 5) ప్రహసితము, 6) అతిహసితము - అను ఆరును ఉత్తమ, మధ్యమ, అధమప్రకృతులయం దుండునని యు వ్యాఖ్యానించెను. పై చెప్పినట్లు స్థాయిభావములకు ఆనంత్యమే ఘటిల్లినచో హాస్యరస మూరువిధము లనుటయు తగదు.

దశవిధకామావస్థలయందును అసంఖ్యాక-భేదము లేర్పడును. అదె తగదు.

దశవిధకామావస్థలలో ఉత్తరోత్తరము ప్రకర్షతారతమ్య మున్న దవిరి. ఆ కామావస్థ లివి - 1) అభిలాషము 2) అర్థచింతనము 4) అనుస్మృతి 4) గుణకీర్తనము 5) ఉద్వేగము 6) విలాపము 7) ఉన్మాదము 8) వ్యాది 9) జడత 10) మరణము. ఈ దశవిధావస్థలలో ప్రకర్షతారతమ్యముచే ఉపచయావస్థాభేదముచేతను అనంతములైన శృంగారరసభావము లేర్పడును. [5]

స్థాయి ఉపచయము పొందిననే రస మగు ననుటయు తగదు.

ఉపచితావస్థయందు స్థాయి రసమగు నవియు. ఉపచితము కానిచో స్థాయియే యగునవియు భట్టలోల్లటుడనెను. ఇది సరికాదు.

శోకము అను స్థాయిభావము కలదు. ఇది కరుణరసస్థాయిభావము. ఇష్టజనవియోగము విభావముగా శోక ముత్పన్న మగును. ఇది మొదట తీవ్రముగ నుండును. క్రమముగ ఉపశాంత మగునే కాని ఉపచయము కాదు. ఉపచయ మను నది ఇచట కన్పట్టదు. కావున స్థాయి ఉపచిత మయినచో రస మగు నను వ్యాఖ్యానము సరికాదు. [6]

అపచయావస్థ :

క్రోధము, ఉత్సాహము, రతి అను స్థాయిభావములు తమతమ విభావములచే ఉత్పాదితము లగును. కాలవశమున (క్రమమున) అవి తమత్వమును మాంద్యమును పొందును. స్థిరముగ నుండవు. క్రోధమందు అమర్షము ఎంతో కాల ముండదు.

---

[5] కామావస్థాసు దశస్వసంఖ్యారసభావాదిప్రసంగాత్

[6] శోకస్య ప్రథమం తీవ్రత్వం కాలాత్ తనుమాంద్యదర్శనం

త గ్గిపోవును. ఉత్సాహమునందు స్థైర్యమును రతియందు సేవనమును (ఉపచారము) ఎంతోకాల ముండవు. వీనిలో అపచయమే గోచరించుచున్నది. ఇది పై సిద్ధాంత మునకు వ్యతిరేకముగ నున్నది. కావున స్థాయి ఉపచితమై రస మగు ననుట తగదు.¹

(శ్రీ)శంకకుని వాదము.

హేతుభి ర్విభావాద్యైః, కార్యై శ్చానుభావాత్మభిః సహచారి రూపై శ్చ వ్యభిచారిభిః ప్రయత్నార్జితతయా కృత్రిమై రపి తథా అనభిమన్యమానైః అనుక ర్తృస్థత్వేన లింగబలతః ప్రతీయమానః స్థాయిభావో ముఖ్యరామాదిగత స్థాయ్యనుకరణరూపః అనుకరణరూపత్వా దేవ చ నామాంత రేణ వ్యపదిష్టో రసః

విభావములు హేతువులు. అనుభావములు కార్యములు. వ్యభిచారులు సహచారి రూపములు. ఇవి ప్రయత్నార్జితము లగుటచే కృత్రిమము లైనను అట్లు భావింపబడవు. ఇవి (స్థాయిభావములు) అనుకర్త(నటుని)యం దుండును. ముఖ్యముగా రామాదిగత మైన ఈ స్థాయిభావమునకు అనుకరణరూపమై లింగబలముచే ప్రతీయమాన మైనదే రసము. ఇది అనుకరణరూప మైనది. అనుకరణరూప మగుటచేతనే నామాంతర వ్యపదిష్టమై రస మనబడుచున్నది.

స్థాయిభావ మభినేయమే కాని అభిధేయము కాదు.

విభావములు కావ్యబలముచే అనుసంధింపదగినవి. అనుభావములు శిక్షబల ముచే అవగమింపదగినవి. వ్యభిచారిభావములు కృత్రిమ మైన నిజానుభావార్జనబల ముచే గ్రహింపదగినవి. స్థాయిమాత్రము కావ్యబలముచే కూడా అనుసంధేయము- (సంయోజనముచేయదగినది) కాదు. రతి శోకము మొదలగుపదములు రత్యాదిస్థాయి భావములను వచించునవే గాని ప్రతీయమాన మొనర్చునవి కావు.

"వివృద్ధాత్మా ప్యగాధోఽపి
దురంతోఽపి మహానపి

¹ క్రోధోత్సాహరతీనాం అమర్షస్థైర్యసేవావిపర్యయే హ్రాసదర్శన మితి విపర్యయస్య దృశ్యమానత్వాచ్చ

శాడశే నేవ జలధిః
శోకః క్రోధేన పీయతే॥
శోకేన కృతః స్తమ్భః తథా స్థితో యోఽ నపస్థితాక్రందైః
హృదయస్ఫుటనభయార్తై రర్ధితు మభీష్యతే సచివైః

ఇత్యాదులందలి శోకము కేవలము అభిధేయమే కాని అభినేయము కాదు. అనగా స్థాయిభావములు అభినయింపదగినవి, సూచింపదగినవే కాని వాచ్యములు కారాదని భావము. ఈ క్రింది యుదాహరణము నందట్లు కానరాదు.

"స్థాతి పతితో లిఖంత్యాః తస్యా బాష్పాంబుశీకరకణౌఘః
స్వేదోద్గమ ఇవ కరతలసంస్పర్శా దేష మే వపుషి"

రత్నావళి - (2-22)

ఇందు ఉదయనగతమై సుఖాత్మ యైన రతి అను స్థాయిభావము అభినయింప బడుచున్నదే కాని వాచ్యము కాలేదు.

రససూత్రమున స్థాయిపదము ఏందులకు లేదు ?

స్థాయి ఎన్నడైనను అవగమింపబడదగినదే కాని వాచ్యము కారాదు. అవగమనశక్తి యనగా అనభినేయము. ఇది వాచకత్వశక్తికంటె భిన్నమైనది. స్థాయి సూచ్యమును అభినేయమును కాదగినదే కాని వాచ్యము కారాదు. కావుననే భరతుడు రససూత్రమున భిన్నవిభక్తికముగ కూడ స్థాయిపదమును పేర్కొనలేదు.

రతి అనుకరింపబడి శృంగార మనబడుచున్నది అనుకరణ మానందప్రద మగుచున్నది-లేనిది ఉన్నట్లనుకరించుటవలన ప్రయోజనము కల్గునా అని ఆశంక కలుగవచ్చును. లేని అనగానే అది మిథ్యాజ్ఞానమే అగును. మిథ్యాజ్ఞానము ప్రయోజనకారి కాదు. అందుచే అనుకరించుట ప్రయోజనకారి యగునా? అని శంక పొడమును. దానికి సమాధానముగా మణిప్రదీపన్యాయమును చూపుచున్నాడు. (8)

మణియొక్క ప్రభను చూచి యొకడు మణి యనుకొన్నాడు. దీపముయొక్క

8 మణిప్రదీపప్రభయో మణిబుద్ధ్యాఽభిధావతోః।
మిథ్యాజ్ఞానావిశేషేఽపి విశేషోఽర్థక్రియాం ప్రతి॥

ప్రభను చూచి మరియొకరు మణి యనుకొన్నారు. ఇద్దరును భ్రాంతులే-ఇద్దరిది మిథ్యాజ్ఞానమే. ఇద్దరును దానికొఱకై పరుగులు తీసిరి. కాని ఒందొకనికి మణి దొరకినది. మరొకనికి దొరకలేదు. కారణము వారి భ్రాంతులలో కొంది భేదము కలదు. మొదటి వానిది సంవాదిభ్రాంతి. రెండవవానిది విసంవాదిభ్రాంతి. సంవాది భ్రాంతి యర్థకారి యైనది. విసంవాదిభ్రాంతి అర్థకారి కాలేదు. దీనిని బట్టి మిథ్యా జ్ఞానమును అర్థకారి యగునని తేలుచున్నది. ఇది లోకసహజ మైనది. కావున అను కరణమును ఆనందప్రద మగుచున్నది.

జ్ఞానచతుష్టయవిలక్షణము :

ఈ రసవిషయమున కల్గు జ్ఞానము జ్ఞానచతుష్టయవిలక్షణ మైనది. లోకమున ప్రసిద్ధ మైనవి నాల్గు జ్ఞానములు. సమ్యక్జ్ఞానము, మిథ్యాజ్ఞానము, సంశయజ్ఞానము, సాదృశ్యజ్ఞానము. ఈ రసవిషయమున మాత్రము ఈ నాలుగు జ్ఞానములును కలుగవు. ఈ నాల్గు ప్రతీతులకు భిన్న మైన ప్రతీతి మరొకటి కలుగును. ఈ ప్రతీతులను వివరింతుము.

సమ్యక్జ్ఞానము : సత్య మైన జ్ఞానమునే సమ్యక్జ్ఞాన మందురు. రాముడే ఇతడు "రామ ఏవాయం" అనునది సమ్యక్జ్ఞానము.

మిథ్యాజ్ఞానము : సమ్యక్జ్ఞానము కలిగిన ఉత్తరక్షణమునందే బాధావతరణము కలిగిన జ్ఞానము-"స రామోఽయ మిత్యుత్తరకాలికే బాధే రామోఽయ మితి" ఇతడు రాముడు కాడని ఉత్తరక్షణమునందే బాధ కలుగుచుండగా 'ఇతడు రాముడు' అనుజ్ఞానము మిథ్యాజ్ఞానము.

సంశయజ్ఞానము : ఇతడు రాము డగునా? కాడా? అనునది సంశయజ్ఞానము. సంశయజ్ఞానము ఉభయకోటికము. మనసు రెండు పక్షములయందును ఊగులాడును. కొన్ని కారణములచే అగు నని మరికొన్ని కారణములచే వెంటనే కాదని సంశయ మొదవుట. 'రామః స్యాద్వా న వా' ఇతడు రాముడు అగునా కాడా? అనునది సంశయజ్ఞానము.

సాదృశ్యజ్ఞానము : రామసదృశు డీతడు. "రామసదృశోఽయం" అను జ్ఞానము సాదృశ్యజ్ఞానము ఇది కించిద్భేదసహిష్ణువు. పోలిక మాత్రమే గమ్య

మాన మగును కాని భేదము తెలియుటనేయుండును. "రాముడు" "ఇతడు" వేర్వేరు వ్యక్తు లను జ్ఞాన ముండును.

చిత్రతురగ ప్రతీతి – సామాజికులకు కలుగు ప్రతీతి ఈ నాల్గుజ్ఞానములకంటెను విలక్షణము. సామాజికుడు నటుని చూచి అ) 'రామ ఏవాయం' అను ప్రమాత్మక మైన సమ్యక్జ్ఞానమును పొందడు ఆ) "ఇతడు రాముడు కాడు' అను మిథ్యాజ్ఞానమును పొందడు. ఇ) రాముడగునా? కాదా? అను సంశయజ్ఞానమును పొందడు. ఈ) "రామసదృశు డితడు" అను సాదృశ్యజ్ఞానమును పొందడు కాని విలక్షణమైన ప్రత్యక్షజ్ఞానమును పొందును చిత్రమందు లిఖితమైన తురంగమును చూచి మనము "ఇది తురంగము' అని ప్రత్యక్షప్రతీతిని పొందుచున్నాము అట్లే నటుని చూచి సామాజికుడు 'ఇతడు రాముడు' అను ప్రతీతిని పొందును.

భట్టతోతుడు

శ్రీశంకుక మతఖండనము.

ఇతడు అభినవగుప్తుని పరమగురువు. ఇతడు 'కావ్యకౌతుక' మను గ్రంథమును వ్రాసెను. నాట్యశాస్త్రవ్యాఖ్యానమైన 'అభినవభారతి'లో అభినవగుప్తుడు ఇతనిని పలుచోటుల పేర్కొనినాడు ఇతరస్థలములందు స్వల్పముగనే పేర్కొనినను రససూత్రవ్యాఖ్యానావసరమున మాత్రము అభినవగుప్తుడు గురువుగారి అభిప్రాయమును సవిస్తరముగా తెల్పుచున్నాడు భట్టతోతుడు శ్రీశంకుకుని వాదమును ఈ విధముగా ఖండించుచున్నాడు

---

[1] తన ఈ అభిప్రాయమునకు శ్రీశంకుకుడు పూర్వసమ్మతిని సంక్షేపముగ శ్లోకరూపమున ఇచ్చినాడు.

శ్లో॥ (1) ప్రతిభాతి న సందేహో న తత్త్వేన న విపర్యయః

ధీరసావయ మిత్యస్తి నాసావేవాయ మిత్యపి

(2) విరుద్ధబుద్ధిసంభేదా దవివేచిత సంప్లవః

యుక్త్యాపర్యనుయుజ్యేత స్ఫురన్ననుభవః కయా ?

రసము అనుకరణస్వరూప మని శ్రీశంకుకుడు అనినాడు. అట్లనుట తగదు. శ్రీశంకుకుని వాదము విమర్శసహము కాదు. అది యంత సత్త్వశూన్య మైన వాదము. రస మనుకరణరూప మనుట, అ) సామాజికప్రతీతి ననుసరించి పొసగదు. ఆ) నటాభిప్రాయము ననుసరించియు అనుకరణరూప మనుట లేదు. ఇ) వ్యాఖ్యాతల ననుసరించియు కుదురనిది. ఏ దృక్కోణమునుండి (చూచినను) పరిశీలించినను భరతముని వచనానుసారము రసము అనుకరణరూప మనుట తగనిది.

అనుకరణస్వరూపము :- ఏ కొంచె మైనను ప్రమాణోపలబ్ధమైన దానినే అనుకరణ మనవచ్చును. ఉదా: పూర్వ మొకటి సప్రమాణముగ నిరూపితమై యున్న ఏకరూప మైన దానిని ఇప్పు డనుకరించుచున్నా డనిన పొసగును. ఉదా - ఒకడు పాలు త్రాగుచున్నాడు. అతడు ఆ పాలు మరల త్రాగినట్లు త్రాగుచున్నాడు. ఇతడు మరల త్రాగుట ప్రాప్తి మొదటిదే. ఇది ప్రమాణోపలబ్ధ మైనది. ఇప్పుడు ప్రత్యక్షముగ త్రాగుచున్నది సమయసారము. కాని సురాపానము ననుకరించుచు త్రాగుచున్నాడు. సురాపాన మెట్లు చేయునో యట్లు నయనసాన మొనరించుచున్నాడు. అనుకరణ మనునది క్రియారూప మైనది. సురను త్రాగినట్లు నయనసాన మను క్రియ చేయుచున్నాడు. ఇది అనుకరణస్వరూపము. ఇచ్చట యట్టి ప్రమాణోపలబ్ధ మైన దేదియు అనుకరణరూపముగ గోచరించుటలేదు.

నాట్యమునందు రామాదుల శరీరము, ప్రతిశీర్షకాదులు, రోమాంచగద్గదికాదికము, భుజక్షేపవలనము, ప్రక్షేపకటాక్షాదులు రతికి చిత్తవృత్తిరూప మైన అనుకారములుగా నెవరికిని కన్పట్టుట లేదు. అట్లు కన్పట్టక పోవుటకు కారణ మిది. రతి యనునది చిత్తవృత్తిరూప మైనది. చైతన్యగమ్యము. కాని ప్రతిశీర్షకాదులు జడములు. చిత్తవృత్తిరూప మైన రతిని జడరూప మైన ప్రతిశీర్షకాదికముతో అనుకరించుట పొసగనిది. అంతియు గాక రతి చిత్తవృత్తిరూప మగుట మనస్సుచే గ్రహింపదగినది.

ప్రతిశీర్షకాదులు నేత్రేంద్రియగ్రాహ్యములు. అనగా చక్షురింద్రియగ్రాహ్యములు. చిహ్నాదికరణములు. అట్టివాని ననుకరణము లనుట అనౌచిత్యము. అదియును గాక ప్రమాణోపలబ్ధ మైనది దృష్టపూర్వ మైననే దాని ననుకరించుట పొసగును. రాముని రతి ననుకరించుచున్నా డనినచో ఆ రాముని రతి దృష్టపూర్వ మైనది కాదు. రాముడు ఈ కాలమునకు ఎందరినాటి వాడో ఎప్పుడో త్రేతాయుగము వాడు. అతనిని

ఎవరును ప్రత్యక్షముగ చూచియుండరు. అనగా దృష్టపూర్వుడు కాడు. కావున అతని రతియును ఉపలబ్ధపూర్వము కాదు. అందుచే నటుడు రామానుకారు డనుటకూడ పొసగదు.

శృంగారము రత్యనుకరణము కాదు - రత్యాకారమే

'నటగత మైన చిత్తవృత్తియే సామాజికునిలో ప్రతిపన్నమై రత్యనుకారమై శృంగార మగును.' అనినచో ఇందును దోషమున్నది.

సామాజికుడు నటునియొక్క చిత్తవృత్తిని భావించి ప్రతిపన్నము చేసికొనును అప్పు డది సామాజికుని యొక్క భావనమే యగును. రతియే యగును కాని రత్యను కరణము కాదు. ప్రమదాదికారణములచేతను కటాక్షాదికార్యములచేతను, ధృత్యాది సహచారులచేతను తెలిసికొనదగినదై లౌకికము కారణకార్యసహకారిరూప మైన చిత్త వృత్తియే ప్రతీతియోగ్యమై (తదాత్మ్యముగ) అనుకరణాత్మకముగ నటచిత్తవృత్తి ప్రతిభాసించు ననుటయు తగదు. అట్టి చిత్తవృత్తి సామాజికునిదే యగుటచే అది రత్యాకారముగనే గోచరించును కాని రత్యనుకరణము కాదు.

కృత్రిమవిభావములచే రత్యవగతి కాదు.

విభావాదులు అనుకార్యులైన రామాదులయందు పారమార్థికములు. (విభా వములు-సహజములు). అనుకర్తలైన నటులయందైనచో అట్లు కాదు. ఇదియే ఇందలి విశేష మన్నచో అదియు సమంజసము కాదు.

ఆ విభావములు ఆతత్కారణములు. ఆ అనుభావములు అతత్కార్యములు ఆ సహచారి భావములు అతత్సహచారి రూపములు. అయినను కావ్యబలోప కల్పితములై కృత్రిమము లగును కదా! అప్పు డవి సామాజికునిచే కృత్రిమములుగనే, గ్రహింపబడును గదా! కృత్రిమములుగా గ్రహింపబడిన విభావాములచే రత్యవగతి కలుగదు.

నటుడు కోపము మొదలగు భావములు లేకున్నను క్రుద్ధుని వలె భాసించు చున్నాడు గదా! ఇట్లు భాసింపచేయుటయే అనుకరణ మందుమా? సత్యమే.- (ఇది అర్ధాంగీకార సూచకము తాత్కాలిక అంగీకారమును ప్రకటించి ఖండించు టను సూచింపనదే.) నటుడు క్రుద్ధుడు కాడు. క్రుద్ధసదృశుడు. భ్రుకుట్యాదుల

వలన సాదృశ్యము వ్యక్త మగును. ముఖాదులు సమానముగా నుండుటచే గవయ మృగమును చూచి గో వనుకొనుచున్నాము. ఇచట కేవలము సాదృశ్యమే గోచరించు చున్నది. కాని అనుకరణము కాదు

సామాజికులకు నటునిపై సాదృశ్యబుద్ధి లేదనుటయు తగదు. ఉంతియ కాదు - భావశూన్య మైన ప్రతిపత్తి నటునిపై సామాజికులకు కలుగు ననుటయు సంగతము కాదు. అనగా ప్రతిభాన ముండు ననుటయు పొసగనిది.

రామత్వము - సామాన్యరూపము

శ్రీ శంకుకుడు చిత్రతురగన్యాయమును చెప్పుచు "యః సుఖీ రామః అసా వయ మితి ప్రతీతి రస్తి" సుఖి యైన రాము డితడు అను ప్రతీతి కలుగునని చెప్పి నాడు. దాని నీతడు ఖండించుచు న్నాడు. "యస్త్వుక్తం రామో యమిత్యస్తి ప్రతి పత్తి" ఇత్యాది వాక్యములచే - ఖండించినాడు) — ఇతడు రాము డను ప్రతిపత్తి కలిన దన్నచో అది తాత్కాలిక మైనది. ఏ జ్ఞాన మైనను అనంతరకాలమందు బాధక జ్ఞాన ముదయించినచో ఆ జ్ఞానము మిథ్యాజ్ఞాన మగును. అట్టి బాధకజ్ఞానము కల్గనిచో తత్త్వజ్ఞానమే యగును. కాని వాస్తవమునను ఇచట బాధకభావము కలుగకపోయినను ఇది మిథ్యాజ్ఞానమే యగుచున్నది. "తేన విరుద్ధ బుద్ధిసంభేదా దిత్యసత్" మరొక నర్తకుని చూచి నపుడును ఇతడు రాము డను ప్రతిపత్తి కలుగుచున్నది అనగా రామత్వము సామాన్యరూప మని తెలుచున్నది.

విభావములు కావ్యబలాను సంధేయములు అనుట తగదు.

"విభావా హి కావ్యబలాను సంధేయాః" అని శ్రీ శంకుకు డనిన మాట ఒప్పనుచున్నాడు భట్టతోతుడు. నటునకు స్వాత్మీయముగా "ఈ సీత నాది" అను జ్ఞానము కలుగదు కదా నటుడు సామాజికునిలో అట్టి జ్ఞానమును భాసించునట్లు చేయుచున్నాడు. అనిచే అనుసంధాన మనవచ్చును. అట్లనినచో స్థాయియందే ఆ యనుసంధాన మొనర్చుట తగును. స్థాయియే ముఖ్య మైన దగుటచే ఈతనియందు ఈ స్థాయియున్నది అను ప్రతిపత్తి సామాజికునకు కల్గును అంతియే కాని విభావాదులయం దనుసంధానము నద్యఃఫలదము కాదు. ఈ కారణములచే సామాజిక ప్రతీతి కనుసరించి స్థాయ్యనుకరణమే రస మనుట అసంగతము.

నటుని నటనము అనుకరణము కాదు.

నటుడు నటించునపుడు నియతముగా ఒకనినే అనుసరించడు. లోకమందు ఉత్తమ ప్రకృతి యైన వాని శోకమునే అనుకరించుననుట చింత్యము. రాముని శోకము అనుకరించుట ఎట్లు పొసగును. రాముని శోకమును నటుడు తన శోకముతో అనుకరించుచున్నాడందుమన్న నటుని యందు శోకము లేదు కదా. నటునిలో శోకము లేదు. శోకకారణము లేదు. కాదా అశ్రుపాతాదులచే రాముని శోకమును నటుడు అనుకరించుచున్నాడనినచో రాముని అశ్రుపాతాదులు వేరు. నటుని అశ్రుపాతాదులు వేరు. రెండును విలక్షణములు. లేదా "ఉత్తమ ప్రకృతి యైన లోకానుభావము ఎట్లుండునో దానిని నేను అనుకరించుచున్నానని నటునికి ప్రతిపత్తి కలుగును" అని చెప్పవచ్చును. ఉత్తమ ప్రకృతి యనగానే 'ఎవరో ఒక ఉత్తముని అనుకరించుట' అనుట పొసగదు. ఏ ప్రకృతి యైనను విశిష్టత నొందే బుద్ధియందు ఆరోపింపవలెను. ఎవరో ఒకరిని భావించుచని సామాన్య రూపముగా అనుట పొసగని మాట. విశిష్ట లక్షణములను బట్టి బుద్ధ్యారోపణము అశక్యము. ఇట్లు శోకించుచున్న వారెవరో అట్టి 'ఆ విశేషలక్షణములచే దాని ననుకరించుచున్నాను' అని నటుని భావము కలుగును 'అనుటలో మరొక దోషము తప్పక వచ్చుచున్నది. అట్టి భావమునందు నటుని ఆత్మగాఢ అనుప్రవిష్టమైనదనుటచే అనుకార్యానుకర్తృభావము శిథిల మగుచున్నది.

నటుడు శిక్షావశము చేతను తన విభావములను స్మరించుటచేతను, హృదయ సంవాదము చేతను కేవలము అనుభావములను ప్రవర్తింపజేయు నాట్యమునందును కావ్యము నందును, వాక్యార్థముల ఉపస్కారమునే పఠించుచు నటించును. ఇంత మాత్రమే అచట కల్పనము కాని అనుకరణము స్పష్టముగా లేదు. చక్రవర్తి వేషమును అనుకరించినంత మాత్రముచే "రామునియొక్క చేష్టలయొక్క అనుకరణము' అనుట తగదు.

వస్తువృత్తానుసారముగ నిది యనుకరణము కాదు.

'నాపి వస్తువృత్తానుసారేణ తదనుకారిత్వమ్ - అనుసంధేయ్యమానస్య వస్తువృత్తత్వానుపపత్తేః - యద్వా వస్తువృత్తం - తద్దర్శయిష్యామః'

ఇందు వ్యాఖ్యాతదృష్టి ననుసరించియు అనుకరణము కాదని ఖండించుచున్నాడు. వస్తువృత్తానుసారముగా కూడ అనుకరణము కాదు అనుసంధేయ్య

మానసమైన విషయమునకు వస్తుప్రవృత్తిత్వము కుదరదు కదా - అనగా పూర్వము తెలిసి నదే కదా దానినిపుడు అనుకరణ మనదగును.

ఈశ్వర ప్రత్యభిజ్ఞా వివృతి యందును "సంవేదన తిరస్కారిణీ కా ఖలు యుక్తిర్నామ ఉపపత్తిః భాషమాణస్య కా వా భవిష్యతి" అని సంవేదనము కలిగినపుడు అనుపపత్తి తప్ప మరేమియు కలదని వివరించినాడు.

భ ర తా భి ప్రా య వి రు ద్ధ ము

అభినవగుప్తుడు భరతగ్రంథ విరుద్ధము లని స్థాయి అనుకరణమే రస మని ఎన్నడును వచింపలేదు సరిగదా సూచింపనైన లేదు. పైగా ధ్రువాగాన, తాల, వైచిత్ర్య, లాస్యాంగోపజీవనాదులు నిత్యజీవితానుకరణములు కావని సంధ్యంగాధ్యాయమున అభినవగుప్తుడు చెప్పినాడు.

కాని ప్రథమాధ్యాయమున భరతుడు

"సప్తద్వీపానుకరణం నాట్యమ్" అని చెప్పినాడు. ఇచట అనుకరణ శబ్దము మరొక విధముగ అర్థము చెప్పుకొనవలెనది అది "అధ్యవసాయము" - 'అనువ్యవసాయము' అనబడునని అభినవగుప్తుడు ప్రథమాధ్యాయమున వివరించినాడు.

మరికొందరిట్లందురు - (R. Gnoli అభిప్రాయము ననుసరించి) - వర్ణముల సంయోజనముచే గోవు భాసించుచున్నది. అట్లే ఇచట నాడ విభావాదుల సంయోజనముచే స్థాయి భాసించుచున్నది. అనవచ్చును. కాని ఇచట గోవు అభివ్యజ్యమాన మనుట పొసగదు చీకటిలో నున్న గోవు దీపముచే అభివ్యజ్యమాన మగుచున్నది. అట్లు వర్ణముల సంయోజనముచే అభివ్యజ్యమాన మగుటలేదు కాని తాదృశమైన సమూహ విశేషము గోచరించుచున్నది.

విభావాదులు రతి సాదృశ్యజ్ఞానమునకు గ్రాహకము లగుట కుదరదు. అందుచే భావానుకరణము రసమనుట అసంగతము.

మరికొందరు - సాంఖ్యులు - వీరి దృష్టిలో సుఖదుఃఖస్వభావము రసము. సుఖదుఃఖముల జనింపజేయు విషయసామగ్రి యంతయు బాహ్యమైనదే. ఆ సామగ్రిలో తత్స్థానీయములు విభావములు అనుభావవ్యభిచారులు సంస్కా-

రకములు. స్థాయిమాత్రము ఆ సామగ్రి నుండి పుట్టిన అంతరమైన సుఖదుఃఖములు స్వభావముగా కలిగినది

ఇట్లనుట భరతగ్రంథ విరుద్ధము - భరతుడు - 'స్థాయి భావాన్ రసత్వము పనేష్యామః" అనిన వాక్యము వీరి పక్షమున సమన్వయింప బడదు.

వీరి దృష్టిలో స్థాయి భావమునకును రసమునకును భేదము కల్పిత్తము. కాని భరతుడు ఈ రెండిటికిని భేదమును వ్యక్తపరచినాడు. కావుననే 'స్థాయిభావాన్ రసత్వముపనేష్యామః" అనినాడు.

భ ట్ట నా య క మ త ము

ఇతరమతఖండము

ఇతడు సాంఖ్యుడు. ఇతడు పూర్వమతములను విమర్శించి తన మతమును ప్రతిపాదించెను. ఇతని దృష్టిలో రసము (అ) ప్రతీతము కాదు. (ఆ) ఉత్పాద్యము కాదు. (ఇ) అభివ్యక్తము కాదు.

రసము స్వగతముగా కాని, పరగతముగా కాని, ప్రతీతమగుననుట యసంగతము. స్వగతముగ ప్రతీతము కాదనుటకు ఈ క్రింది ఉపపత్తులను చూపుచున్నాడు.

1. రసము స్వగతముగ ప్రతీతమైనచో కరుణమందు దుఃఖమే కలుగవలసి వచ్చును. కాని రససిద్ధాంతమట్లు చెప్పుటలేదు. కరుణాదులందు గూడ ఆనందమే కలుగుచున్నది.

2. సీతాదులు సామాజికులకు విభావములు కారు. అట్టిచో సామాజికులకు రసప్రతీతి ఎట్లు కలుగును ? కలుగదు.

3. సీతాదులయందు స్వకాంతాస్మృతిసంవేదనము కల్గదు. స్వకాంతాస్మృతి సంవేదనము కల్గనిదే రతి యభివ్యక్తము కాదు.

4. దేవతాదులయందు సాధారణీకరణము కలుగదు. సాధారణీకరణము కల్గినేకాని రసాస్వాదము కలుగదు.

5) సముద్రలంఘనాదులు అసాధారణకృత్యములు. సాధారణ మానవులు దానిని సాధారణముగా తలపలేరు. కావున సాధారణీకరణ మనునది అసాధారణములలో అశక్యము.

6) 'ఇచట కేవలము తత్త్వదు ణవిశిష్టుడైన రామునియొక్క స్మృతియే కలుగుచున్నది." అని చెప్పవలనుపడదు. స్మృతి యనగనే పూర్వ మొకప్పుడు చూచి యుండవలయును. అట్టి యనుభవము పూర్వ మెవరికిని లేదు. కావున స్మృతిరూపమైన ప్రతీతి యనుటయు తగదు. పోనీ శబ్దానుమానములచే అట్టి ప్రతీతి కలుగుచున్నచో అట్టి ప్రతీతియందు సరసత లేదు. ప్రత్యక్షమే సరసత నాపాదించును గాని ఇతరము కాదు. అంతియేగాక నాయికానాయకుల శృంగారమును లోకమున ప్రత్యక్షముగ చూచినపుడు లజ్జాజుగుప్సాదులు కలుగుచున్నవి.

పై కారణములచే రసము స్వగతముగ ప్రతీత మగు ననుట యసంగతము. పరగతముగ ప్రతీత మగు నననచో తాటస్థ్య మను దోషము సంభవించును. ప్రతీతియం దే దోషములు కలవో అవియే ఉత్పత్త్యభివ్యక్తులయందు కలవు. కావున రససూత్రమును భట్టనాయకుడు వేరొక విధముగ వ్యాఖ్యానించెను

ఇ త ని వా ద ము.

ఇతని వాదమునందలి మూలపంక్తుల నిచట పొందుపరతును. "తస్మాత్ కావ్యే దోషాభావ గుణాలంకారమయత్వ లక్షణేన నాట్యే చతుర్విధాభినయరూపేణ నిబిడనిజమోహసంకటకారిణా, విభావాదిసాధారణీకరణాత్మనా ఽభిధాతో ద్వితీయే నాంశేన భావకత్వవ్యాపారేణ భావ్యమానో రసో ఽనుభవస్మృత్యాదివిలక్షణేన రజస్తమో ఽనువేధవైచిత్ర్యబలాత్ ద్రుతివిస్తారవికాసలక్షణేన సత్త్వోద్రేకప్రకాశానందమయ నిజసంవిద్విశ్రాంతిలక్షణేన పరబ్రహ్మాస్వాదసవిధేన భోగేన పరం భుజ్యతే" ఇతి,

ఇది అభినవభారతిలోనిది. ఇక లోచనమునందలి దీ క్రిందిది–
"ననూక్తం భట్టనాయకేన "రసో యదా పరగతతయా ప్రతీయతే తర్హి తాటస్థ్య మేవ స్యాత్–న చ స్వగతత్వేన రామాదిచరితమయా

తాటస్థ్యాత్ అసౌ ప్రతీయతే స్వాత్మగతత్వేన చ ప్రతీతౌ స్వాత్మని రసస్యోత్పత్తి రేవ అభ్యుపగతా స్యాత్-సా చాయుక్తా. సీతాయాః సామాజికం ప్రత్యవిభావత్వాత్. కాన్తాత్వం సాధారణం వాసనావికాసహేతు విభావితాయాః ప్రయోజక మితి చేత్-దేవతావర్ణనాదౌ తదపి కథమ్? న చ స్వకాన్తాస్మరణం మధ్యే సంవేద్యతే. అలోకసామాన్యానాం చ రామాదీనాం యే సముద్రసేతుబన్ధనాదయో విభావాః తే కథం సాధారణ్యం భజేయుః? న చ ఉత్సాహాదిమాన్ రామః స్మర్యతే-అననుభూతత్వాత్-శబ్దా దపి తత్ప్రతిపత్తౌ న రసోపజనః, ప్రత్యక్షా దివ నాయకమిథున ప్రతిపత్తౌ. ఉత్పత్తిపక్షే చ కరుణస్యోత్పాదాత్ దుఃఖిత్వే కరుణప్రేక్షాసు పున రప్రవృత్తిః స్యాత్. తన్న ఉత్పత్తి రపి నాప్యభివ్యక్తిః-శక్తిరూపస్య హి శృంగారస్య అభివ్యక్తౌ విషయార్జనతారతమ్యప్రవృత్తి స్స్యాత్. తత్రాపి కిం స్వగతో అభివ్యజ్యతే రసః పరగతో వేతి పూర్వవ దేవ దోషః. తేన న ప్రతీయతే నోత్పద్యతే నాభివ్యజ్యతే కావ్యేన రసః. కిం త్వన్యశబ్దవైలక్షణ్యం కావ్యాత్మనః శబ్దస్య త్ర్యంశతాప్రసాదాత్. తత్రాభిధాయకత్వం వాచ్యవిషయమ్. భావకత్వం రసాదివిషయమ్. భోగకృత్త్వం సహృదయవిషయ మితి త్రయోంశభూతా వ్యాపారాః. తత్రాభిధాభాగో యది శుద్ధః స్యాత్ తత్తన్త్రాదిభ్యః శాస్త్రన్యాయేభ్యః శ్లేషాద్యలంకారాణాం కో భేదః? వృత్తిభేదవైచిత్ర్యం చ అకించిత్కరమ్. శ్రుతిదుష్టాదివర్జనం చ కిమర్థమ్? తేన రసభావనాఖ్యో ద్వితీయో వ్యాపారః, యద్వశా దభిధా విలక్షణైవ-తచ్చైతద్భావకత్వం నామ రసాన్ప్రతి యత్కావ్యస్య తద్విభావాదీనాం సాధారణత్వాపాదనం నామ. భావితే చ రసే తస్య భోగః యోఽనుభవస్మరణప్రతిపత్తిభ్యో విలక్షణ ఏవ ద్రుతివిస్తరవికాసాత్మా రజస్తమోవైచిత్ర్యానువిద్ధసత్త్వమయనిజచిత్స్వభావనిర్వృతివిశ్రాన్తిలక్షణః పరబ్రహ్మాస్వాదసవిధః-స ఏవ చ ప్రధానభూతోంశః సిద్ధరూప ఇతి, వ్యుత్పత్తి ర్నామ అప్రధానమే "వేతి".

భట్టనాయకుని అభిప్రాయము.

ఇతడు పూర్వుల వాదములను ఖండించి రసాస్వాదవిధానమును వివరించినాడు. ఈతని పద్ధతి ననుసరించి సహృదయునకు రసాస్వాదము కలుగుటలో రస సాక్షాత్కారమునకు మూడు వ్యాపారములు(శక్తులు) కలవు. అభిధ, భావన, భోగీకృతి.

శబ్దసంకేతితార్థమును తెల్పు శక్తి అభిధ. అభిధాశక్తిచే నివేదింపబడిన దుష్యంతాదులు. రత్యాదులు తత్తద్దేశకాలాద్యవస్థలతో కూడినవై భాసించును. నాట్యమునందు ఇంద్రియార్థసన్నికర్షముచే దేశకాలాదిధర్మసహితముగ గోచరించును. ఇంతవరకు అభిధాశక్తి చేయు పని. తరువాత భావనాఖ్యవ్యాపారము ప్రారంభమగును. అప్పుడు రసవిరోధి యైన అగమ్యాత్వజ్ఞానము పోవును. (ఈమె నాచే పొందదగని కాంత (అగమ్య) అనునది అగమ్యాత్వజ్ఞానము ఇది రసవిరోధి. ఈ జ్ఞానము పోవలెను ఈమె నాకు అగమ్యకాని కాంత అను జ్ఞానము కలుగవలెను) ఇది రసానుకూల మైనది. అపుడు విభావాదులు సాధారణీకరణము నొందును. శకుంతలాదిధర్మములు పోయి కాంతాత్వాది ధర్మములు సాధారణములుగా గోచరించును. దేశకాలవయోఽవస్థాదులు గోచరింపవు. ఇది శకుంతల రతి యని గాని దుష్యంతునిరతి యని గాని లేక, విశేషరహితముగ 'రతి'మాత్రముగా గోచరించును. ఇట్లు విభావానుభావవ్యభిచారులయు, స్థాయియొక్కయు విశేషధర్మములు గోచరింపవు. సర్వసాధారణ రూపమున భాసించును. ఇంతవరకు భావకత్వవ్యాపారము నిర్వహించును. అనంతరము భోగకృత్త్వవ్యాపారము ప్రారంభమగును. ఈ వ్యాపారమహిమచే సత్త్వగుణము ఉద్రేకించును. రజస్తమోగుణములు అడగిపోవును. సామాజికునకు సంవిద్విశ్రాంతి కలుగును. ఈ విధానము ద్రుతివిస్తారవికాసలక్షణయుక్త మైనది. స్వప్రకాశరూప మైన యానందము కలుగును. పరబ్రహ్మాస్వాదసహోదరమైన దీ భోగము.

ఇట్లు సర్వప్రామాణికముగ అంగీకరింపబడుచున్న అభివ్యక్తివాదమునకు శస్ప పస్థ మైన అభిప్రాయమును వెలువరించినవాడు భట్టనాయకుడు. రసము సామాజికనిష్ఠము - అను సిద్ధాంతమును ప్రతిపాదించిన ప్రథము డితడు. సాధారణీకరణమును ప్రవచించినదియు నీతడే - ఇతని సహృదయదర్పణము నుండి అభినవుడు ఎన్నియో విషయములను గ్రహించియుండును. రససిద్ధాంతమునకు తుదిరూప మిచ్చిన అభినవగుప్తునకు భట్టనాయకుని వాద మెంతయో తోడ్పడియుండును. పరబ్రహ్మాస్వాదసహోదర మైన భోగకృత్త్వవ్యాపారమును, ప్రతిపాదించినవా డితడే.

అ భి న వ గు ప్తు ని మ త ము

రసము-కావ్యార్థము - రసతత్త్వము అపూర్వ మైనది కాదు. భరత మునియే [1] "వాగంగసత్త్వోపేతాన్ కావ్యార్థాన్ భావయంతీతి భావాః"అని నిర్వ చించియున్నాడు. కనుక కావ్యార్థమే రసము. వివిధములైన విభావానుభావాదుల చేత పరిపుష్టి కావింపబడి ఆస్వాద్యమాన మగునది కావ్యార్థమే. అదియే రసము. పదార్థవాక్యార్థము లన్నియు గలసి కావ్యార్థము లేక ప్రబంధార్థము నందు పర్యవసితము లగును. పదార్థవాక్యార్థము లప్రధానములు. కావ్యార్థము ప్రధానము. మహాభారతాదులలో పదార్థవాక్యార్థము లెన్ని యున్నను (రసములుగా నున్నను) [2] శాంతము ప్రధాన రస మనుటలోని అంతర్యము కావ్యార్థప్రాధాన్య స్వరూపమే. కావున కావ్యార్థమే రసము.

మీమాంసకోదాహరణము -

"రాత్రి మాసత" "తా మగ్నౌప్రాదాత్" మొదలగు వాక్యముల ద్వారమున ప్రాథమికావస్థలో ఆ యా ప్రయోజనముల నాశించి ఆ యా క్రియల నెరవేర్చిన అధికారివ్యక్తికృతి జరుగు. అందు నది శ్రోతకు లేక పాఠకునకు ప్రరోచనా [3] ప్రాయ మగును. ఆ తర్వాత నది ద్వితీయావస్థను పొందును. ఆ ద్వితీయావస్థలో దేశకాలాదికార్యాదిసమస్తవిశేష ములు (భూత-ప్రథమ పురుషాదులు) కొంతమార్పును పొందును.

అది వర్తమానకాలవిషయకముగా పరిణమింపగా పాఠకునకు దానిపైన ఒక విధమైన ప్రతిపత్తి (విశ్వాసము) కలుగును. ఆ పై తాను నది చేయ వలయునను ఆలోచనను గ్రహించును. ఇట్లు ప్రథమపురుషాదులలో నున్న సూత్రములు ఉత్తమపురుషరూపముగ అవగమన మగుటకు ఆధారమయిన ద్వితీ యావస్థను [4] భావన యని యందురు. లేదా వినియోగాదిపదములను కూడా ఉపయోగింతురు. ఈ తత్త్వమే కవిత్వమున కూడ జరుగును. ఇందు అధికారికి ఒక వైశిష్ట్యము కలదు

---

[1] నాట్యశాస్త్రము-సప్తమాధ్యాయము 342 పుట.

[2] ధ్వన్యాలోకము. చతుర్థోద్యోతము

[3] ఉన్ముఖీకరణం తత్ర ప్రశంసాతః. ప్రరోచనా - దశరూపకము.

[4] అభినవభారతి - ప్రథమభాగము-పు 279

కావ్యమున అధికారి –

విమలప్రతిభాశాలి యైన హృదయము కలవాడే అధికారి. నిర్మలమైన అంతఃకరణము కలిగియుండవలెను. ఆపై వాసనాత్మకములైన ఆయా సంస్కారములు కలవాడు కావలయును. ఇది లేనిచో రసాస్వాదన మనుపపన్నము.

'సవాసనానాం సభ్యానాం రసస్యాస్వాదనం భవేత్
నిర్వాసనాస్తు రంగాంతః కాష్ఠకుడ్యాశ్మసన్నిభాః "

వాసనాత్మకత లేనివారు రంగమునందలి రాయి, చెక్కల వంటివారు. ఈ సంస్కారమే కాక అభ్యాసము కూడా ఆవశ్యకమే. కావ్యోత్పత్తికి వలె రసాస్వాదనమునకు కూడ ప్రతిభావ్యుత్పత్తు లవసరమే - ప్రతిభయే వాసన. ఇక అభ్యాసము –

"యేషాం కావ్యానుశీలనాభ్యాసవశాత్ విశదీభూతే మనోముకురే వర్ణనీయతన్మయీభవనయోగ్యతా తే ఏవ సహృదయసంవాదభాజః" కావున ఇట్లు వాసనాభ్యాసములు గల విమలప్రతిభాశాలి హృదయము కలవారు ఇందు అధికారులు. ఆ అధికారులు కావ్యార్థమును భావింపగలరు.

కావ్యార్థానుభూతి –

[5] గ్రీవాభంగాభిరామం ముహురనుపతతి స్యందనే బద్ధదృష్టిః
పశ్చార్ధేన ప్రవిష్టః శరపతనభయాద్ భూయసా పూర్వకాయమ్
దర్భైరర్ధావలీఢైః శ్రమవివృతముఖభ్రంశిభిః కీర్ణవర్త్మా
పశ్యోదగ్రప్లుతత్వాద్ వియతి బహుతరం స్తోకముర్వ్యాం ప్రయాతి.

[6] ఉమాపి నీలాలకమధ్యశోభి విస్రంసయన్తీ నవకర్ణికారమ్
చకార కర్ణచ్యుతపల్లవేన మూర్ధ్నా ప్రణామం వృషభధ్వజాయ

---

[5] అభిజ్ఞాన శాకుంతలం - ప్రథమాంకము 7 వ శ్లో.

[6] కుమారసంభవం 3 – 62 శ్లో.

[7] హరస్తు కించిత్పరివృత్తధైర్య శ్చంద్రోదయారంభ ఇవాంబురాశిః
ఉమాముఖే బింబఫలాధరోష్ఠే వ్యాపారయామాస విలోచనాని॥

మొదలగు శ్లోకములను పాఠకుడు చదువును ఇందలి మొదటి శ్లోకమునందలి రసానుభూతిని వివరింతము.

దుష్యంతుడు జింకను తరుముచు వేట చేయుచున్నాడు. అది పరుగెత్తుచున్నది ఆ జింక భయము కలిగియున్నది ఇది శ్లోకమునందలి విషయము ఆ శ్లోకమును చదివినంత ఆ వాక్యమువలన అభిధావ్యాపారముచే ముందు వాక్యార్థప్రతిపత్తి కలుగును అట్లా మృగభయమును కవి వర్ణించిన విధానము అవగత మగును. ఆ వాక్యార్థప్రతీతి యైన తరువాత మానసికమై సాక్షాత్కారస్వరూపమై వేరొక ప్రతీతి యేర్పడును.

ఈ ద్వితీయప్రతీతియందు ఆ కాలము, ఆ దేశము, ఆ వ్యక్తి. ఆ ప్రకరణము మొదలైనవన్నియు ఉపహసితము లగును అట్లా నశించును అదియే సాధారణీకరణము. అందు కేవల మొక మృగపోతకము మాత్రమే భాసించును అది నిర్విశేషము. అందు త్రాసకుడును ఆకారమూర్తిగాడు భాసింపడు. ఆ సమయమునను దేశకాలాదులచే స్పృష్టము కాని భయము మాత్రమే భాసించును.

భయము భయానకమగుట :-

భయప్రతీతిపర్యాంత దేశకాలాదులు అస్పృష్టము లగుటచే "భయపడినది నేను, నేను కాదు, లేక శత్రుడు, లేక మరెవ్వరో" మొదలగు ప్రతీతుల కన్న విలక్షణ మైన ప్రతీతి యేర్పడును. ఆ సమయమున లౌకికము లైన సుఖదుఃఖములు కాని, ఆ సుఖదుఃఖములచే నేర్పడిన ఉపాదాన హానాదులు కాని గోచరింపవు. అట్టి లౌకిక సుఖదుఃఖములచే నేర్పడెడి ప్రతీతులు విఘ్న ప్రతీతులు. రసప్రతీతులు అవిఘ్నరూపములు. నిజసుఖదుఃఖాది వివశీభావము రసప్రతీతివిఘ్న మని చెప్పబడును. కావున ఈ విఘ్నసాహిత్యముకన్న విలక్షణమై నిర్విఘ్న మైన ప్రతీతి యొకటి ఏర్పడును. ఆ ప్రతీతిచే గ్రహింపబడునదియే రసము. ప్రకృతమున భయానకరసము. అది హృదయమున ప్రవేశించును. కనులయందు విపరివర్తమానమై నాట్యము చేయుచుండును.

---

7 కుమారసంభవం 3 - 67.

ఈ విధమైన భయానకప్రతీతిలో స్వాత్మ కాని పరాత్మ కాని, తిరస్కృతము కాని పురస్కృతము కాని కాదు. స్వపరాదివిభాగము కాని, పురస్కార తిరస్కారాది భేదముకాని గోచరము కాని సాధారణప్రతీతి ఇది. ఈ సాధారణ ప్రతీతి అపరిమిత మైనది. ఇట్లే మిగిలిన జ్ఞానముల విషయమును తెలియదగును.

మరియొక ఉదాహరణము గమనింతము. అభిమన్యుడు మరణించినాడు. అర్జునుడు మృత తనయుని తలచి విలపించుచున్నాడు.

[8] హా! యను ధర్మరాజతనయా యను నన్నెడబాయ నీకుఁ జ
న్నే యను దల్లి నేఁడు జనునే యను గృష్ణుఁడు వీఁడె వచ్చె రా
వే యను నొంటి పోక దగవే యను నే గతిఁబోవువాడనే
నో యభిమన్యుఁడా! యనుఁ బ్రియోక్తుల నుత్తరఁ దేర్పవే! యనున్॥

ఈ పద్యమున అభిధావ్యాపారముచే వాక్యార్థప్రతీతి యేర్పడిన తర్వాత మానసికమై సాక్షాత్కారస్వరూప మైన మరియొక ప్రతీతిచే శోకము మాత్రమే గోచరించును. అపరిమిత ప్రమాతృత్వముచే నా శోకము విశేషముల నన్నింటిని తొలగించుకొని నిర్విఘ్న మైన కరుణరసప్రతీతిగా పరిణమించును.

సాధారణ్యముయొక్క అపరిమితత్వము .-

ఈ సాధారణ్యము పరిమితము కాదు. అపరిమితము. వితతము. ధూమాగ్నుల యొక్క వ్యాప్తిగ్రహము వంటిది. పలుతావుల ధూమాగ్నులను సన్నియోగవిశేషము లనుచూచి ఎక్కడ ధూమముండునో అక్కడ అగ్ని యుండునని సిద్ధాంతము చేయుదుము. అది వ్యాప్తి. అది అపరిమితము. ధూమాగ్ను లన్నిచోట్ల సాధారణములు. అట్లే ఈ సాధారణ్యము కూడా అపరిమితము. వితతము. ఇట్టి అపరిమితసామగ్రి సాక్షాత్కరించుట కుపకరించెడిది నటాదిసామగ్రి. కావ్యాదృతములై వస్తుసత్తాతో భాసించెడి దేశకాలాది సమస్తనియమహేతువులును, పరస్పరప్రతిబంధబలము వలన దూరము కాగా నటసామగ్రియు దేశకాలాదులు ప్రతిభాసింపక సాధారణీభావమే పుష్ట మగును. అదియే మిక్కుటముగ పోషింపబడునది. కనుకనే సామాజికులకు

---

8 భారతము - ద్రోణపర్వము-ద్వితీయాశ్వాసము- 242.

ఏకఘనమైన ప్రతీతి యేర్పడుచున్నది. ఇది అనాది "వాసనా" చిత్రీకృతచేతస్కు
లకు మాత్రమే కలుగును. అది నిర్విఘ్నమైన అనుభూతి దాని నుండియే చమ
త్కారముదయించును. ఇదియు అపరిమితమే కంపాదులకు హేతువగును

చమత్కారస్థితి

[9] అద్యాపి హారి చమత్కరోతి కథయిత్వా మందరేణ దళితాని
చంద్రకరాదర్శసచ్ఛాయాని లక్ష్మ్యై అంగాని

తనివి తీరగ, మందర దళితములని
శశికరాదర్శసచ్ఛాయమౌ రసములని
లక్ష్మి యంగకములను పల్కంగ సాగి
హారి చమత్కరించెడును నేడైన గాని

చమత్కారమనగా ఒక భోగావేశమనంబడు సంవిన్మగుట. అది ఎన్ని మార్లు లీనమైనను తృప్తిని కలిగించలేదు. పునఃపునః స్మర్యమాణమై భోగావేశమును కల్పించుచునే యుండును. అట్లు అనుభవించెడి వానియొక్క 'అత్యద్భుత' మైన భోగమునను స్పందించెడి మనస్తత్త్వము చమత్కారము. అది సాక్షాత్కార స్వభావమే యగును. మానసికాధ్యవసాయమాత్రమే యగును. సంకల్పమైన నగును. లేక స్మృతి యైన నగును. లేక అట్టిదే ఒక అనిర్వచనీయ సాక్షాత్కార స్వభావము

సాక్షాత్కారమెట్టిది?

ఆ సాక్షాత్కారమును గురించి తెలియవలెనన్న ఈ క్రింది కాళిదాసు శ్లోకమును పరికింతము.

11 రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితోఽపి జన్తుః
తచ్చేతసా స్మరతి నూనమబోధపూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని ॥

రమ్యములను చూచియు, మధురశబ్దములను వినియు జంతువు (ప్రాణి) సుఖములననుభవించుచున్నవాడైనను, పర్యుత్సుకుడై భావస్థిరములైన జననాంతర

[9] అభినవ భారతి పుట 279, [10] శ్రీ సూరం శ్రీనివాసుల ఆంధ్రానువాదము.

సౌహృదము లను అబోధపూర్వకముగా (ముందు తెలియనట్లుగా) మనస్సుతో స్మరించును.

ఇందలి స్మరణము తార్కిక [12] సమ్మతము కాదు. ఇంతకు ముం దీ విషయ మనుభవింప బడలేదు. కనుక (అబోధ పూర్వం) అనుభూతపూర్వ మైన దానిని స్మరించుట స్మృతి కాదు. (ఇట కొందరు - అది గతజన్మలలో అనుభూత పూర్వమే - అని అందురు) అయినచో నెట్లు కుదురును ?

అనగా అది ప్రతిభానత్వ మను మారుపేరు గల ఒకానొక సాక్షాత్కారమే కాని వేరొండు కాదు. కనుకనే చమత్కారమును విలక్షణ సాక్షాత్కార మనవలసి వచ్చినది. ఈ సాక్షాత్కారమునందు ఆస్వాదాత్మకమైన ప్రతీతి మాత్రమే భాసించును. ఆ ప్రతీతియందే ప్రకృతము రతి ఆస్వాద్య మగును. ఏ విశేషములతోడను కూడనిది కావుననే లౌకికము కాక, మిథ్య కాక అనిర్వాచ్యము గాక, లౌకికతుల్యమును గాక, లౌకికాదుల ఆరోపరూపమును కాక, సాక్షాత్కారస్వరూపమున రసనీయ మగు చున్నది.

ఇందు దేశకాలాది నియంత్రణ మే మాత్రము నుండదు కావున రత్యుప చయావస్థలలో నొక్కటి కానిది నిలవవచ్చును. భావానుగామి యను హేతువుచే అనుకారముగా కూడ దీని ననవచ్చును. విజ్ఞానవాద సిద్ధాంత మాలంబన మగుటచే దీనికి విషయసాము యున్నను నుండవచ్చును ఏ కోణమునుండి ఆలోచించి చెప్పినను రసాత్మకమై వీతవిఘ్నప్రతీతిగ్రాహ్యమే రసము.

రస ప్రతీతి విఘ్నములు ;

ఈ రసప్రతీతి నిర్విఘ్నముగా గలుగవలసినది ఇందు విఘ్నములు రసప్రతీతి భంజకములు ఏడుండును. అవి - సంభావనావిరహము, స్వగతత్వపరగతత్వవి యమను స్వసుఖదుఃఖ వివశీభావము, యోగ్యోపాయ వైకల్యము, అస్ఫుటత్వము, అప్రధానము, సంశయ యోగమును. ఈ విఘ్నవాగురనుండి బయటపడినచో రస ప్రతీతి కలుగును.

---

11 అభిజ్ఞాన శాకుంతలమ్ - పంచమాంకము 2 శ్లో॥

12 సంస్కార మాత్రజన్యం జ్ఞానం స్మృతిః

కారణాదులు - విభావాదులు

లోకమున కారణ, కార్య, సహచరాత్మకములైన సంకేతములను హేతువులను చూచినపుడు తదాకారముగ పరగతమైన స్థాయిని అనుమానింప వచ్చును. ఎక్కడ కారణాదిశాత మున్నదో అక్కడ స్థాయి కలదని నిశ్చయింప వచ్చును. ఈ ప్రకారము ఊహించి నిర్ణయించుటలో అభ్యాసము పాటవము గల వ్యక్తి కావ్య నాట్యములయందు వేరొకరీతి భావించును. లౌకికముగ కారణములైన ఉద్యానాదులు, కార్యము లగు కటాక్షములు సహచరములైన చింతాదులు కావ్యమున లౌకికతత్త్వమును తద్భూమిని అతిక్రమించినవై విభావానుభావవ్యభిచారి శబ్దవ్యపదిష్టము లగును. అవి విభావత్వాది ప్రాణమాత్రములు కనుక లౌకికదశను సంపూర్ణముగా పరిత్యజించును. ఇది అలౌకికదశ. ఈ అలౌకికదశ నివి పొందినను ప్రాచీన కారణతాది సంస్కారమును మాత్రము వీడి యుండవు. ఇట్లు విభావాది శబ్దవ్యపదిష్టము లైన ఇవి పర్యాయభేదము ననుసరించి ప్రాధాన్యాప్రాధాన్యముల నందుచుండును

రసచర్వణము

ఇట్లు ఏర్పడిన విభావాదులు సామాజికుని మనస్సులో సమ్యగ్యోగమును పొంది సత్సంబంధమును ఏకాగ్రతను కలుగజేయును. వీనిచే అలౌకికమును నిర్విఘ్నమును అయిన చర్వణమును సంపాదించి పెట్టును. ఇది ప్రాగుక్త రీతిగా సంవేదనాత్మకము. ఈ చర్వణమునందే రసము గోచరించును. ఆ చర్వణ విషయమైన పదార్థమే రసమని వ్యవహరింతురు. ఈ రసము చర్వ్యమాణైకసారము అనగా ఆ చర్వణ మున్నంతవరకే ఈ రస ముండును. చర్వణ లేకున్నచో నది గోచరము కాదు. సాక్షాత్కరింపదు.

స్థాయి - రసము

రసము స్థాయికన్న విలక్షణమైనది. ప్రాచీనులు కొందరు స్థాయియే రస మనిరి. విభావాదులచే ప్రతీయమానమైన స్థాయియే రసమానమై రసత్వమును పొందునని తదభిప్రాయము. కాని అది సరికాదు. స్థాయి రసము కాదు. రెండును విలక్షణములే. స్థాయియే రస మన్నచో లౌకికముగా కూడ రస ముండవలసి వచ్చును. అయథార్థము కృత్రిమము నైన నాట్యమందే రసానుభూతి ఏర్పడినచో, యథార్థమై అకృత్రిమమైన లోకమున రస మెందుల కుండ దనవలసి వచ్చును వారి మతము ననుసరించి స్థాయిప్రతీతి యగునే కాని రసప్రతీతి కాదు స్థాయి

లౌకికము కనుకనే విభావాది రససూత్రమున స్థాయిపదగ్రహణము చేయుటలేదు. స్థాయి పదమునే రససూత్రము నందుంచి యుండిన అది రససూత్రమునకు శల్యప్రాయ మగు. లేదా స్థాయిగతము లైన కారణాదులు చర్వణ నుపకరించును విభావాదిత్వమును పొందుచున్న. కాన ఔపచారికముగా స్థాయి రసత్వమును పొందుచున్న దని పలుకుటకే ఉచితము కాని యథార్థముగా స్థాయి రసము కాదు. లౌకిక చిత్తవృత్తిరూపమైన సుఖాదియందు రసత్వ ముండదు కదా! అట్లయిన రసము అలౌకిక చమత్కార రూపము. లౌకిక సంవేదనము కన్నను విలక్షణమే.

అలౌకిక సంవేదనా వైలక్షణ్యము

లౌకికము లైన అనుకారములచే సంస్కరింపబడిన కాంతాదివిభావములు (కారణములు) సహృదయుని కసంబద్ధములుగా తటస్థములుగా గోచరించును. సహృదయత్వబలము వలన భవిష్యత్తులో ఆనందరూపమున పరిణమించు రసాస్వాదము యొక్క అంకురరూపమున చర్వణాప్రాణ స్వరూపమున గోచరించును. సహృదయత్వ మన్నచో హృదయసంవాదరూపము. అనగా తన్మయీభావము. దాని కాధారము వాసనలకునే కాంతాదికము చర్వణాప్రాణ మగును. ఇందు స్మృత్యనుమానాదుల కవకాశము లేదు. ఈ చర్వణము తాత్కాలికమే గాని అనుభూతపూర్వకము కాదు కనుకనే ఇందు స్మృతి ఉండదు. లౌకిక ప్రత్యక్షాది ప్రమాణ ప్రవృత్తి యేమాత్రము లేక అలౌకిక విభావాది సంయోగ ప్రవృత్తిచే ఇందు కన్పట్టును. ఈ రసచర్వణ ప్రత్యక్షము అనుమానము, ఆగమము, ఉపమానము మొదలుగా గల లౌకికప్రమాణముల వలన కలిగిన రత్యాదిబోధకన్న విలక్షణమైనది. అట్లే యోగిప్రత్యక్షమువలన కలిగిన [13] తటస్థమైన పరసంవిద్విజ్ఞానము కన్న భిన్నము. విషయానందములేని పరయోగి పొందెడి ఆత్మానందరూప మైన ఘనానుభవము కన్న భిన్నము.

---

[13] Telepathy the knowledge of other People's mind is one of the Yogin's Powers (Yoga Sutra III - 19), ప్రత్యయస్య పరచిత్త జ్ఞానమ్ This Sutra is quoted and commented by A. G. in I [illegible] 1,2, 4, 5). This Phenomenon, observes A. G.

పై మూడింటిలో అనుభూతి ప్రతిబంధకము లైన విఘ్నము లున్నవి. సద్యఃకాలికేష, తాటస్థ్యము వలన విశ్వాసమునకు అస్ఫుటత్వము, విషయావేశ వైవశ్య మున వివశత్వమును రసానుభవము నందున్నవో లేవో సందేహింపవచ్చు. ఇది స్వాత్మైక గతము కావలెనన్న నియమము లేదు. కావున విషయావేశ వివశత్వముండదు. స్వాత్మానుప్రకాశ మున్న కారణమునను, పరగతత్వ నియమము లేని కారణమునను తాటస్థ్యము కాని కష్టత్వ మైయున అస్ఫుటత్వము కాని లేదు. విభావాది సాధారణ్య కారణమున తనలో రసాత్మకముగా నున్న రత్యాది సంప్రదాయ మేర్పడును. కావున మరెట్టి విఘ్నము లేర్పడుటకు నవకాశము లేదు.

రసము యొక్క అలౌకికత

రసమునకు విభావాదులు రసనిష్పత్తిహేతువులు కావు. విభావాదుల జ్ఞాపకత్వంబునను రసనిష్పత్తి యుండును కదా! లేక విభావాదులు రసజ్ఞాపకము లందుమా? అదియు కాదు. సిద్ధమయిన ప్రమేయమయిన రసపదార్థ మొకటి యుండినచో విభావాదులు జ్ఞాపకము లగును. కాని అట్టి సిద్ధపదార్థము లేదు ... ఉత్పాదకములును జ్ఞాపకములును కానిచో విభావాదుల స్వభావ మెట్లుండును? అది ఎట్లు పొసగునన్నచో అది లోకోత్తరత్వమును పోషకమే కాని దూషకము కాదు.

రసచర్వణ యుపయోగపడెడి ఈ విభావాదివ్యపదేశము అలౌకికమై లోకోత్తరమే గదా. ... అట్లు చెప్పుటకు కూడ అలౌకికత్వ మాధారమే. సాధారణీకరణముతో తన్మయ మేర్పడినచో పాఠకులు తన్మయులగుదురు ...

---

is an order entirely different from the Aesthetic experience. In it, in fact, the distinction between one's own self and the Self of others. (స్వపర విభాగ) continues to exist while the Aesthetic experience postulates the generalisation of the mental states and therefore the suppression of every limited self. The Aesthetic experience according to Abhinavagupta P 89.

యుండును కదా - అయినచో రసమును ప్రమేయ మనవలయును కానిమ్ము. అయినచో నష్ట మేమియు లేదు. రస్యమానతయే ప్రాణముగా గల ఇది ప్రమేయాది స్వభావముకన్న విలక్షణమే. అయినచో సూత్రమున "రసనిష్పత్తి" అని నిష్పత్తిపద ప్రయోగమేల ? అది రసపరము కాదు రసనాపరము. ఔపచారికముగా రసనా నిష్పత్తిని ఆ రసనయే జీవితముగా గల రసనిష్పత్తిగా పలుకుట దోషము కాదు. ఆ రసన ప్రమాణజన్యము కాదు. కారకజన్యమును కాదు. ఉభయమును కాక అప్రామాణిక మందుమా ? అనరాదు. అది స్వసంవేదనసిద్ధము కదా! ఇది సంబోధరూపము-కాని లౌకికము లైన ఇతర బోధలన్ని విలక్షణము. తదుపాయము లైన విభావాదులు లౌకికత కన్న విలక్షణములు కదా! అట్లే తజ్జన్యబోధ విలక్షణమే. కావున. "విభావాది సంయోగమువలన రసన నిష్పన్నము కాగా ఆ రసనాగోచర మైన లోకోత్తరార్థమే రసము." అని తాత్పర్యము.

రస్యరూప సంతృప్తి,

నాటకదర్శన సమయమున నటునియందు నటత్వబుద్ధి కలుగదు. ముందట ప్రత్యర్థికాదులు వాని భంగించును. రామాదిబుద్ధి కూడ కలుగును సహృదయునికో గల గాఢమైన ప్రాక్తనత్వ సంస్కార కారణమే కావ్యబల మెంతగా పనిచేసినను దానిని నిరోధించును. ఇట్లు నటాదిబుద్ధి కాని రామాదిబుద్ధి కాని కలుగమి ఉభయ దేశకాలాదులును విస్మరింపబడును. రతి ప్రతీతి హేతువు లయిన రోమాంచాదులును సుస్పష్టములై దేశకాలాదినియమములను విడనాడినవై రతిని భాసింపజేయును. రతి కూడ వాసనావశత ఆత్మను ప్రవిష్టమగును. కనుకనే రతి పటస్థ మనిపించదు. అర్జునాభిషంగాది సంభావన చేయుటకు వలసిన నియత కారణత్వము నందుండదు. దుఃఖద్వేషాద్యుత్పత్తికి హేతు వయిన నియతపరాత్మక బుద్ధియు నుండదు కావున సాధారణీకృతమై పరంపరాయుత మైన ఒకానొక సంవిద్గోచరమైన రతియందే శృంగార సాక్షాత్కారము జరుగును. లేక అట్టి రతియే శృంగారము.

జగన్నాథుని పరిశీలనము ;

ఈ అభినవసిద్ధాంతమును జగన్నాథుడీ క్రింది రీతిని సంక్షేపించి నాడు.

"సముచితలలితసన్నివేశచారుణా కావ్యేన సమర్పితైః సహృదయ హృదయం ప్రవిష్టైః తదీయ సహృదయతాసహకృతేన

భావనావిశేషమహిమ్నా విగళిత దుష్యంతరమణీత్వాదిభిః అలౌకిక విభావానుభావవ్యభిచారి శబ్దవ్యపదేశ్యైః శకుంతలాదిభిః ఆలంబన కారణైః, చంద్రికాద్యుద్దీపనకారణైః, అశ్రుపాతాదిభిః కార్యైః చింతాదిభిః సహకారిభిశ్చ సంభూయ ప్రాదుర్భావితేన అలౌకిక వ్యాపారేణ తత్కాలనివర్తితానందాంశావరణజ్ఞానేన అత ఏవ ప్రమృష్ట పరిమిత ప్రమాతృత్వాది నిజధర్మేణ ప్రమాత్రా స్వప్రకాశతయా వాస్తవేన నిజస్వరూపానందేన సహ గోచరీక్రియమాణః ప్రాగ్వినివిష్ట వాసనారూపో రత్యాదిరేవ రసః (రసగంగాధరము – ప్ర–ఆ)

దీనిని సంక్షిప్తముగా "భగ్నావరణ చిద్విశిష్టో రత్యాదిరేవ రసః" అని నిర్వచించెను. కాని "రసో వై సః, రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి," మొదలగు శ్రుతివాక్యస్వారస్యమునే 'భగ్నావరణా చిదేవ రసః' అని విపరిణమించెను.

అభినవాదుల సిద్ధాంతము ననుసరించి రత్యాదులు విశేష్యములు. భగ్నావరణమైన చిత్తు (జ్ఞానము) విశేషణ మైనది. ఆ విషయముననే జగన్నాథుని యభిప్రాయము ననుసరించి భగ్నావరణమైన చిత్తు విశేష్యము. రత్యాదులు విశేషణములైనవి ఇంతియే భేదము.

న వ్య మ త ము

ఈ పై చెప్పినవి నాలుగును ప్రసిద్ధమైనవి. ఇవి గాక రసగంగాధరమున జగన్నాథుడు మరి కొన్నింటిని ప్రపంచించెను. అందులో ఒక దానిని పండితులు జగన్నాథుని వాదముగా పాఠప్రవచనము చేయుదురు. ఈ విషయము రసగంగాధర వ్యాఖ్యాత లెవ్వరును లక్షితపూర్వకముగ వివరింపక పోయినను ఆంధ్రదేశము నందలి పఠన పాఠనములలో నీ విషయము సంప్రదాయ మైనది. అది ఇచ్చట పొందుపరచ బడినది —

న వ్యా స్తు :

"కావ్యే నాట్యే చ కవినా నటేన చ ప్రకాశితేషు విభావాదిషు వ్యంజనావ్యాపారేణ దుష్యంతాదౌ శకుంతలాది రతౌ గృహీతాయాం అనంతరం చ సహృదయతోల్లాసితస్య భావనావిశేషరూపస్య దోషస్య మహిమ్నా కల్పిత దుష్యంతత్వావచ్ఛాదితే స్వాత్మన్యజ్ఞానావచ్ఛిన్నే శుక్తికాశకల ఇవ రజతఖండః సముత్పద్యమానో ఽనిర్వచనీయః సాక్షిభాస్య శకుంతలాది విషయక రత్యాదిరేవ రసః.

కావ్యమందు కవిచేతను నాట్యమందు నటునిచేతను విభావాదులు ప్రకాశితము లగును. ఈ పని అభిధావ్యాపారము వలన కలుగును. తరువాత వ్యంజనావ్యాపారము ప్రవర్తిల్లును. ఈ వ్యంజనావ్యాపారముచే "శకుంతలయందు దుష్యంతుడు అనురక్తుడు (రతిమంతుడు)" అను విషయమును సహృదయుడు గ్రహించును. అనంతరము సహృదయుని సహృదయతచే కల్గిన భావన కలుగును. ఇది కేవలభావన కాదు. భావనా విశేషము. అనగా కావ్యార్థమును పునఃపునః అనుసంధానము చేసికొనుట. ఈ మతము వారలు దీని నొక దోష మందురు. ఈ భావనావిశేషము అను దోషముయొక్క మహిమచే సహృదయుని ఆత్మ దుష్యంతత్వముచే అవచ్ఛాదిత మగును. అనగా సహృదయుడు తాను దుష్యంతుడ ననుకొనును. అపుడు శుక్తికాశకలమునందు రజతఖండమువలె ఉద్భవించినదై అనిర్వచనీయమును, సాక్షిభాస్యమును అగు శకుంతలాదివిషయక మగు రతియే రసముగా ఆస్వాదింపబడును.

••

ఈ మతమునందు రసము సదసద్విలక్షణము, అనిర్వచనీయము, సాక్షిభాస్యము.

ఇందు మొదట సదసద్విలక్షణమన నేమో తెలిసికొందము. సామాజికునకు తాను దుష్యంతుడ ననుజ్ఞానము కలుగును. ఇది భ్రాంతిజన్యము. ఈ భ్రాంతి భావనావిశేష మను దోషముచే కలుగును. లోకమునందు భ్రాంతి యనునది సదసద్విలక్షణము. ఇందు రెండు పదము లున్నవి. సద్విలక్షణము, అసద్విలక్షణము. సద్విలక్షణ మనగా సత్తుకంటె (ఉన్నదానికంటె, సరియైన జ్ఞానముకంటె) విలక్షణము. అసద్విలక్షణ మనగా అసత్తు (లేనిదాని) కంటె విలక్షణము. ఏ పదార్థ మైనను లోకమున సద్విలక్షణము కాని, అసద్విలక్షణము కాని అగును. రెండును అగుట అసంభవము. కాని ఇట రెండును అగుచున్నది. కావుననే భ్రాంతి అదియే దోషము. ఆ దోష మిట్లు—ముత్యపుచిప్పను ఎండలో చూచి రజతము (వెండి) అనుకొనుచున్నాము. నిజమున నచట రజతము లేదు. కావున అది సద్విలక్షణము. (ఉన్నదాని కంటె విలక్షణ మైనది-అనగా లేనిది) కాని మన కచట నది కన్పట్టుచున్నది. ప్రత్యక్షముగా గోచరించుచున్నది కావున అసద్విలక్షణము. ఇట్లే సామాజికునకు వాస్తవముగా శకుంతలాదులందు రత్యాదులు లేవు. ఇది సద్విలక్షణము. కాని భావనావిశేష మను దోషముచే ఉన్నట్లు భాసించుచున్నది. ఇది అసద్విలక్షణము కావున రసము సదసద్విలక్షణము.

రసము అనిర్వచనీయము :-

శకుంతలాదివిషయకరతి సామాజికులలో లేదు. కాని భావనారూప మైన దోషప్రభావమువలన రతి యున్నట్లనిపించును. కనుక యథార్థమునకు లేకయు ఉన్నట్లు ప్రకాశించెడి సామాజికులలో గల శకుంతలావిషయకరతి అనిర్వచనీయము. సదసద్విలక్షణ మైన దేదియు లోకమున కన్పట్టదు గదా-అట్లు కన్పట్టుటయే రసము అనిర్వచనీయ మనుటలో హేతువు. ఇది భావనారూపదోషజన్యము.

సాక్షిభాస్యము -

బాహ్యవిషయజ్ఞానము కలుగుటకు అంతఃకరణవృత్తి బయల్వెడలును. విషయములు బాహ్యములుకానప్పుడును, భ్రాంతికల్పితము లైనపుడును అంతఃకరణ

వృత్తి బయల్వెడల నవసరము లేదు. ఆత్మచైతన్యముచేతనే సాక్షాత్తుగా భాసించును. ఇట్లు భావించుటే సాక్షిభాస్యత. సుఖదుఃఖాదులు అంతఃకరణధర్మములు. అట్లే రత్యాదిస్థాయిభావములును. ఇది సాక్షాత్తు ఆత్మచైతన్యముచేతనే భాసించును. కావున సాక్షిభాస్యము.

భావనావిశేషమను దోషము అభినవగుప్త సమ్మతమే.

రసప్రపంచమునందు అభినవగుప్తపాదుల మతము సిద్ధాంతముగ పరిగణింపబడుచున్నది. అందుచే ఈ మతమువారు తమ మతమునం దంగీకరించిన (భావనావిశేషమను) దోషము అభినవగుప్తపాదులకును సమ్మత మని తెల్పుచు తమ మతమునకు ప్రామాణ్యమును సంఘటించుకొనిరి.

అభినవుని మతమునందు సాధారణీకరణము కలదు. అనగా కావ్యము నందలి శకుంతలాదిశబ్దములు అభిధావ్యాపారముచే శకుంతలాదులుగా (విశేషధర్మము కలవిగా) గోచరించును. తరువాత సామాన్యములుగా విశేషధర్మమును వదలి కేవలస్త్రీ వలె సాధారణ్యమును ఘటించును.

ఇది సాధారణీకరణము. ఈ సాధారణీకరణము విలక్షణభావన అనెడి దోషము లేనియెడల కుదరదు. అందుచే సాధారణీకరణమును చెప్పిన అభినవుడు దోషము నంగీకరించినట్లే యగుచున్నది.

పరే మతము (దోషవాదము)

ప్రాచీనులు రసమును వ్యంజనావ్యాపార మనిరి. నవీనులు అనిర్వచనీయ మనిరి. వీరి రెండింటిని అంగీకరింపరు. ఈ రెండును అక్కరలేకయే భావనా విశేష మనెడి దోషముచే రస ముత్పన్న మగునని వీరితలంపు.

"పరే తు వ్యంజనావ్యాపారస్య అనిర్వచనీయఖ్యాతేశ్చ అనభ్యుపగమేఽపి ప్రాగుక్తదోషమహిమ్నా స్వాత్మని దుష్యన్తాదితాదాత్మ్యావగాహీ శకుంతలాదివిషయకరత్యాదిమదభేదబోధో మానసః కావ్యార్థభావనాజన్మా విలక్షణవిషయతాశాలీ రసః. స్వప్నాది ష్టు తాదృశ

బోధో న కావ్యార్థచింతనజన్మే తి న రసః. తేన తత్ర న తాదృశా హ్లాదాపత్తిః"

(రసగంగాధరము - ప్రథమాననము.)

సహృదయుడు కావ్యార్థమును భావించును. ఈ భావన అవిది ఒక దోషము. ఈ దోషమువలన తాను (సహృదయుడు) దుష్యంతుడ ననియు, తనకు శకుంతలపై రతి కలిగిన దనియు తలచును ఈ తలపు (జ్ఞానము) మానసికము. బహిరింద్రియముల సంపర్కము దీని కక్కరలేదు. మనస్సే ఇంద్రియములను కల్పించుకొనును. స్వప్నమందు విట్లే జరుగును.

అందుచే నీ భావన భ్రమాత్మకము. దోషము. ఇది కావ్యార్థభావనచే కల్గుటచే అలౌకికము. చమత్కారజనకము. అందువలన ఆస్వాదయోగ్యమైన రస మగుచున్నది.

ప్రతీ ర్థ క మ త ము లు

ఈ మతములను గూర్చి ప్రథమమున తెల్పినవాడు అభినవగుప్తుడు. అతడు లోచనమున వీనిని పేర్కొనినాడు. ఈతని కథనము ననుసరించియే జగన్నాథుడు మరింత స్పష్టముగ వీనిని వివరించినాడు. కావున నిచట జగన్నాధుని భాషణమే యనుసరించితిని. ఇవి యేవియు విమర్శక్షమములు కావు. కేవలము అభిప్రాయ ములు మాత్రమే. అభినవగుప్తునిదే సిద్ధాంతము.

"విభావానుభావవ్యభిచారులు మూడును కలసి, రస మగు" నని కొందరు. ఈ మూడును పానకరసన్యాయముచే సహృదయులకు ఆస్వాదయోగ్యమై రస మగు నని ఈ వాదతాత్పర్యము. ఇందు స్థాయిభావప్రసక్తి లేకపోవుట దోషము.

"విభావాదయః త్రయః సముదితాః, రసః, ఇతి, కతిపయే"

"మూడును కలసి కాదు. మూటిలో ఏది చమత్కారియో అది రసము. కానిచో మూడును కావు" అని పరుపుర వక్కణ.

"త్రిషు య ఏవ చమత్కారీ స ఏవ రసః అన్యథా తు త్రయోఽపి న ఇతి బహవః"

అన్యులు కొందరు "భావ్యమానమైన విభావమే రస" మందురు. భావన యనగా పునఃపునరనుసంధానము

"భావ్యమానో విభావ ఏవ రసః" ఇత్యన్యే

"అనుభావమే భావ్యమానమై రస మగునని" ఇతరులు. "అనుభావస్తథా" ఇతీతరే.

'వ్యభిచారియే రసముగా పరిణత మగునని' కొందరు. "వ్యభిచార్యేవ తథా తథా పరిణమతి" ఇతి కేచిత్. ర. గం- ప్ర. ఆ.

ఈ యభిప్రాయము లన్నియు ఏకదేశములు. అవ్యాప్తములు. భరతుని రససూత్రమునకు విరుద్ధములు. సహృదయాంగీకార్యములు కావు. అభినవగుప్తుని యభివ్యక్తివాదమే సిద్ధాంతముగా అవ్యాహతముగా పరిగణింపబడుచున్నది.

రసము - 'నేతి' వాద నిర్వచనము

రసానందమునకు అలౌకికప్రాధాన్యమును అలౌకికత్వమును సాధింపదలచిన ఆలంకారికులు దానికి లౌకికప్రమాణములకన్న మిక్కిలి వైలక్షణ్యమును కల్పించిరి. ఆ రూపమగు ... లౌకికప్రామాణ్యనిషేధమును చేయుటయే 'నేతి' వాదమని వ్యవహరింపబడుచున్నది. రస ... విషయప్రాధాన్యమును బట్టి ... ప్రమాణములవి యగునని ... లౌకికతను నిరూపింతము

మొదటగా అభినవగుప్తుడు ఆస్వాదన విషయమున గల అలౌకికతను లౌకికస్మృతిప్రమాణముకంటె భిన్నమని అభినవభారతిలో నిట్లు చూపినాడు[1]

—స చ సాక్షాత్కారస్వభావో మనసోఽనువ్యవసాయో వా సంకల్పో వా, స్మృతి ర్వా, తథాత్వేన స్ఫురన్నస్తు. యదాహ -

రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితోఽపి జంతుః
తచ్చేతసా స్మరతి నూనమబోధపూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని

అత్ర స్మరతీతి 'యా స్మృతి' రుపదర్శితా సా న తథారూపా ప్రసిద్ధపూర్వా మేవ స్యాత్ ... అనుభూతత్వాత్ - అపి తు ప్రతిభానాపర పర్యాయ సాక్షాత్కార స్వభావో ... యమితి) సర్వథా తావదేషాస్తి ప్రతీతి రాస్వాదాత్మా యస్యాం రతి రేవ భాతి. తత ఏవ విశేషాంతరానుపహితత్వాత్ సా రసనీయా సతీ న లౌకికీ న మిథ్యా, నానిర్వాచ్యా, న లౌకికతుల్యా, న తదారోపాది రూపా ...

1 అభినవభారతి - ప్రథమభాగము - పు 279-280 ...

అవిఘ్న మయిన రసచర్వణము వలన ఏర్పడెడి చమత్కారము అద్భుత భోగస్పందనము ననుభవించెడి వాని మనఃకరణము రసనీయమై లౌకికము, మిథ్య, అనిర్వాచ్యము, లౌకిక తుల్యము, తదారోపము మొదలగు వానికంటె భిన్న మగును.

రసము అభిధావ్యాపారజము కాదు - త్రివిధ ధ్వని ప్రభేదములలో రసము ప్రధానము. ధ్వని యెప్పుడును వాచ్యము కారాదు. విశేషించి రసధ్వని విషయమున అది నిషిద్ధము. విభావానుభావవ్యభిచారిభావము లున్నచో అన్వయవ్యతి రేకముల వలన రససిద్ధియే కాని రస మెప్పుడును స్వశబ్ద నివేదితము కాదు [2]

అభిధచే సిద్ధించని ఈ రసము లక్షణావ్యాపార సిద్ధము కాదు. ధ్వని సిద్ధాంతము శక్తిలో నంతర్భవించ దని తెలుపుచు ఆనందవర్ధనుడు అతివ్యాప్తి, అవ్యాప్తి మున్నగు దోషము లుండుట చూపినాడు [3]

రస మెపుడును లక్షితము కాదు. కాని ధ్వనులలో లక్షణామూలధ్వని ప్రభేదము మాత్ర ముండును. కనుక రసాస్వాదనవ్యాపారము లాక్షణికము (లక్షణ) కాదు.

రసాస్వాదనము కార్యము కాదు. కార్యము కారణ మున్నంత వఱకును మాత్రమే ఉండును. కారణ విచ్ఛేదన మేర్పడినచో కార్యమును విచ్ఛిన్నమగును. రసము కార్య మన్నచో విభావాది స్థితి పర్యంతమే రసస్థితి యుండవలయును. కాని అనుభవ విషయమున నట్లు కాదు విభావాది వినాశానంతర స్థితిలో గూడ రసచర్వణ జరుగును [4]

అంతియే గాక విభావాదులకు లౌకిక కారణములకన్న వైవిధ్యమును కల్పించి రసమును కార్య మనుట తగని దేమో. కార్యము కారణజన్యమే గదా. రస మన్నచో విభావాది జన్యము.

---

[2] ధ్వన్యాలోకము - ప్రథమోద్యోతము - పు 84

[3] అతివ్యాప్తే రథావ్యాప్తే ర్న చాసౌ లక్ష్యతే తయా-ధ్వన్యాలోకము ప్ర - కారిక - 14

[4] న చ న కార్యః విభావాదివినాశే ఽపి తస్య సంభవ ప్రసంగాత్ - కావ్య ప్రకాశ - చతుర్థ-పు 38

కార్యము కానిచో రసము జ్ఞాప్య మందుమా ? ఇది జ్ఞాప్యమును కాదు. రసము జ్ఞాప్య మన్నచో విభావాదులు జ్ఞాపకములు కావలసి వచ్చును. సిద్ధము కాని రసమును జ్ఞాపకము చేయుట అసంభవము[5] లౌకిక వస్తుజాతము సమస్తము కారక జ్ఞాపకములలో నొకదానిలో చేరియే తీరును. తదుభయము కాని రసస్థితి యెట్లు పొసగు నని సంశయింప నవసరము లేదు. ఉభయము కాకపోవుటచేతనే లోకోత్తర మైనది.

రసము నిర్వికల్పకము సవికల్పకము నుభయము కాదు. అనగా నిష్ప్రకార కత్వప్రతీతి గాని సప్రకార కత్వప్రతీతి గాని రసములో లేవు. విభావాది పరామర్శ రసాస్వాదన విషయమున ప్రధాన మగుటచే నిష్ప్రకారక ప్రతీతి యనలేము. నిష్ప్రకారక సప్రకారక జ్ఞానభిన్నము మరి యేది లభింపదగు నన్నచో అది లోకోత్తరత్వమునకు పోషకము గాని దూషకము గాదు.[6]

రసము సమ్య, ఙ్మిథ్యా, సంశయ, సాదృశ్య, ప్రతీతుల కన్న విలక్షణము. శ్రీ శంకుకుడు తన రససిద్ధాంతమునకు ప్రధానాధారముగ స్వీకరించినది ఈ వైలక్షణ్య ప్రతీతినే. అది విరుద్ధబుద్ధి సంభేదజన్య మని, అవివేచిత మయిన సంప్లవ మనియు ఇతని యభిప్రాయము.[7]

ఏతత్సర్వ భిన్నముగా గోచరత ఎట్లనగా అది చిత్రతురగ న్యాయజన్య మని శ్రీ శంకుకుని మతము.

రసము ప్రత్యక్ష ప్రమాణముకన్న విభిన్న మయినది. 'రస మహం ప్రత్యక్షీ కరోమి' మొదలగు వ్యవహారము లుండినను డుండవచ్చును. అదియు నౌప చారికమే. రసము చర్మచక్షుర్గోచరము కాదు. అందు స్వసంవేదితత్వము, సాక్షిభాస్యత్వము ప్రధాన ధర్మములు. అంతియే గాక రసాస్వాదన వేళలో పరిమిత ప్రమాతృత్వము నశింపవలయును. లౌకిక మయిన ప్రత్యక్షప్రమాణగోచర మయిన జ్ఞానములో ఈ అవసరము లేదు.

---

[5] నాపి జ్ఞాప్యః సిద్ధస్య తస్య అసంభవాత్ - కావ్యప్ర - చతుర్థ పు 38

[6] కావ్యప్రకాశము - చతుర్థ - పు 38

[7] అభినవ భారతి - ప్రథమభాగము పు 273

రసము అనుమాన సిద్ధము కూడ కాదు. వ్యాప్తి సాధ్యమయిన లౌకికానుమితిలో రసభావ ముండదు. అలౌకికానంద ప్రతిపత్తి సైత ముండదు. ధూమాదుల వలన అగ్న్యాదులను అనుమాన ప్రమాణముచే గ్రహించినచో అందు లౌకికానందమున కవకాశము లేదు. అకృత్రిమమైన కారణజాతము లౌకికానుమానమున నుండును. కావ్యమునం దన్నచో కృత్రిమ విభావాది జన్యమా జ్ఞానము అంతియే గాక సహృదయుని వ్యంజనాసాధారణ్యము అలౌకికానుమానము నపేక్షించును. కావ్యమం దన్నచో వక్తృప్రకరణ వైశిష్ట్యమును బట్టి సహృదయ మనమునకు కావ్యానుమితికి హేతువే యగును. అందువలననే దానిని కావ్యానుమితి యని దాని నాదరించిన వారు వర్ణనహరించిరి.

రస ముపమానప్రమాణ సాధ్యము కాదు. సాదృశ్య జ్ఞానప్రయుక్తమే యుపమానప్రమాణము. "గోసదృశము గవయము" అన్నచో ఉపమితిప్రమాణము ఆహ్లాద హేతువు గాదు. కేవలము తద్వస్తుతత్వము మాత్రమే తెలియును. అట్లే "సీతారాముల ప్రణయము-రాధాకృష్ణుల ప్రణయము వంటిది" అన్నచో అందు శృంగారాభివ్యక్తి లేదు. కేవలము సీతారాముల-రాధాకృష్ణుల ప్రణయములకు గల సాదృశ్య ప్రతిపత్తి మాత్రమే సూచితము. కేవలము సాదృశ్య ప్రతిపత్తి రసపోషకము కాజాలదు గదా!

రసాస్వాదనము శబ్దప్రమాణసాధ్యమును కాదు. లౌకికవ్యవహారములో స్త్రీపురుషుల ప్రణయమును కన్నపుడు విన్నపుడు ఆనందము కలుగక పోగా అహృద్యత కలుగును. అట్లే రసము శబ్దసాధ్య మన్నచో అదియు సహృద్యము కావలసివచ్చును.* అంతియేగాక రసమునకు వ్యంగ్యమర్యాద సిద్ధింపదు.

రసాస్వాదన మర్థాపత్తి సాధ్యమును కాదు. అర్థాపత్తి అనుమాన ప్రమాణమునం దంతర్భావింప జేయబడినది. కావున అనుమానప్రమాణవిషయమే ఇందును అనువర్తితవ్య మగును. ఇక ఐతిహ్యప్రమాణమును శబ్దప్రమాణసదృశమే. కనుక ఆ రీతినే ఇందును ప్రవర్తింపజేయవలయును.

---

* కిం చ కేయం ప్రతీతిః ప్రమాణాంతరానుపస్థానాత్
శాబ్దీతిచేత్ న, వ్యావహారికశబ్దాంతరజన్యనాయకమిథునవృత్తాంతవిత్తానామి
వాస్యా అప్యహృద్యత్వాపత్తేః.

రసగంగాధరము-ప్రథమ-పు 105

రసము మానసీవ్యాపారమును కాదు. 'చందనము సౌరభము కలది' మొదలగు వాక్యములు వినుటవలన జ్ఞానలక్షణ మైన అలౌకిక సన్నికర్షముచే సౌరభాదులను స్మరించుట మాత్రము జరుగును. అంతియే గాని దానివలన చమత్కారము కలుగదు. కావ్యవ్యాపార విషయమునం దన్నచో చమత్కారము గూడ కలుగు నను ట ఇందు విశేషము.

(చంద్రికా—రసగంగాధరవ్యాఖ్య - ప్రథమాననము పు 106)

ఒక అభిప్రాయమున రసాస్వాదనము దోషము. అయినను ఇది లౌకిక దోషములకన్న భిన్నము లౌకికదోషము లోకచో సత్ఫలితములకు హేతువు లయినను వానికి సత్ఫలదానము నియతము కాదు కావ్యవ్యాపారరూప మయిన దోషమం దన్నచో అది నియతముగా సత్ఫలప్రదాయియే కావలయును.

ఆభాసవిషయమును గూర్చి ఆలోచించినను ఇది లౌకికాభాసము లయిన హేత్వాభాసాదులకన్న విభిన్నము. ఈ విషయము రసాభాస ప్రకరణమున వివరింపఁబడినది

పర్యంతమున ఇది బ్రహ్మానందముకన్న భిన్నము. కాని బ్రహ్మానంద సదృశము. భావాదిసంవలితత్త్వము-విభావాద్యసంవలితత్త్వ మను నీ భేదము కావ్యానందబ్రహ్మానందములలో నుండును. కావున నిది బ్రహ్మానందసబ్రహ్మచారి కాని బ్రహ్మానందము కాదు. బ్రహ్మానందము ఉపనిషత్తులలో ఇట్లే 'నేతి' వాదముతో ప్రపంచింపబడినది,

భావధ్వని

రస మెప్పుడును వ్యంగ్యమే యగును. అనగా ధ్వనిరూపముననే ప్రకాశించును. కావుననే రసధ్వని కావ్యాత్మగా పరిగణింపబడినది. రసము ధ్వని రూపమున ప్రకాశించుట రసధ్వని యనబడుచున్నది. అట్లే భావము ధ్వన్యాత్మకముగా నున్న భావధ్వని యగును. రస ముద్దీప్త మగు విధానమున నేదేని వ్యభిచారిభావమువలన చమత్కారాతిశయము కల్గవచ్చును. అపు డది భావధ్వని యగును ఈ భావధ్వని ప్రధానముగ రసధ్వనికి పోషక మగును. ఇట్లు ఒక్కొక్కప్పుడు భావములే అనగా వ్యభిచారిభావములే ప్రాధాన్యము వహింతును. ప్రాధాన్యము సాపేక్ష మయ్యును తాత్కాలికము. కావ్యమున సామాన్యముగ రసము ప్రాధాన్యము వహించును. తదపేక్షచే భావమునకు ప్రాధాన్యము నెట్లు వచింపగల మను శంక పొడమ నవసరము లేదు సర్వత్ర దేశమందు రాజా ప్రాధాన్యము వహించును. కాని భృత్యునకు పెండ్లి జరుగుచున్నపుడు రాజభృత్యులలో భృత్యునకే ప్రాధాన్యము. అట్లని రాజునకు ప్రాధాన్యము లేదని కాదు. ఈ భృత్యప్రాధాన్యము తాత్కాలికము. రాజప్రాధాన్యము శాశ్వతము. అట్లే రస ప్రాధాన్యము శాశ్వతము. భావప్రాధాన్యము తాత్కాలికము. కావున విభావానుభావములచే వ్యభిచారిభావము పరిపుష్టమై ఆస్వాద్య మగుచో నది భావధ్వని యనబడును.

భావోదయము

భావ ముదయించుటయే భావోదయము. ఇచట భావశబ్దముచే విభావానుభావములు గాని, సాత్త్వికములు గాని గ్రహింప వలనుపడదు. కేవలవ్యభిచారిభావములు మాత్రమే గ్రహింపదగును. ఈ భావమునకు ఉదయము, శాంతి, సంధి, శబలత యన్న నాల్గుదశలు కలవు. ఉదయశాంతులకు మధ్య 'స్థితి'ని వచింపలే దను శంక యనావశ్యకము. భావస్థితి భావమే. దానిని వేరుగ వచింప నవసరము లేదు. కావున భావమునకు నాల్గే యవస్థలు. వానిలో ఉదయము మొదటిది.

స్వోత్పత్త్యవచ్ఛేదేన నిర్వేదాద్యన్యత మోదయత్వం భావోదయత్వం.

వ్యభిచారి భావములు సహృదయునిలో సంస్కార రూపమున పూర్వమే యుండును. వాని నుద్బుద్ధ మొనర్చుటచే యుదయము. అదియే భావోదయము.

ఉ దా హ ర ణ ము ;

అల గోత్రస్ఖలితంబు కర్ణముల డాయన్ బోయినన్ బ్రక్కచా
యల కేతెంచియు వెన్కకే మఱలె శయ్యన్ జేరినన్ దొర్లిగిం
తలె ! శైథిల్యము నొంది శాపాలు వటు ఉత్తంభైనఁ దన్వంగి చ
న్నులఁ గ్రుమ్మన్ జనలేద పో ప్రియు నురమ్మున్ దక్త
సంకోచయై.

ఇందు అమర్ష మను భావముయొక్క ఉదయము ప్రధానముగ చమత్కా-
రిస్తై చర్వితమగుచున్నది. రసాభరణ కర్త అనంతామాత్యుడు ఈ భావోదయమున
కిట్లుదాహరణ మిచ్చెను.

తెలివాలిక కన్నుల క్రో
మ్మెలుగులుఁ గుచకరినతయును మెచ్చులె వారికి
న్నెలమినై తాఁ బేలై
ఏలలె నతండనిన నింతి వదనము వంచెన్.

ఇచట నయితము లజ్జాభావమే వ్యంజిత మైనది.

భా వ శాం తి

ఉదయించిన భావము ప్రశమించుట లేదా నశించుట భావశాంతి యనిపించు
కొనును.

"స్వోత్పత్త్యవచ్ఛేదన నిర్వేదాద్యన్యతమధ్వంసత్వం భావశాంతిత్వమ్"
అని సాహిత్యసారము మడువుచున్నది. ఇట్లే రసార్ణవసుధాకరకర్త సర్వజ్ఞ సింగ
భూపాలుడు "అత్యారూఢస్య భావస్య విలయః శాంతి రుచ్యతే" (మిక్కిలి పరిపుష్ట
మైన వ్యభిచారిభావనాశమే భావశాంతి యగును.) అని వచించెను. అన్యభావాపేక్షచే
పూర్వభావమునకు శాంతి కల్గుచుండవచ్చును. లేక ఏ భావాపేక్షయు లేక భావశాంతి
కల్గవచ్చును. కాని ఉదయించిన భావమునకే శాంతి కల్గును. అనగా విభావానుభావవ
ముత్పన్న మగు వ్యభిచారిభావమునకు శాంతియే భావశాంతి. ఇది భావధ్వని
ప్రభేదమే.

ఉ దా హ ర ణ ము :

అదుగుఁ దమ్ములందుఁ బడి వేడు పతి నీవు
చిన్ని కోపము దెక్కి చెలఁగి యోఁడ
నలుక యెంత తగని దయ్యును నిల్లాలి
మోము నందు నవ్వు మొలిచె నపుడు.

(గాథాసప్తశతి)

ఇందు ఉగ్రతా ప్రశమము చమత్కార హేతువు కాగా ప్రశమత్వావచ్ఛిన్న ముఖాన ఉగ్రత చర్వ్యమాణమగు చున్నది.

కొందరు భావశాంతివలె రసశాంతి సంభవించునా ? లేదా? అని వితర్కించిరి. జగన్నాథుడు రసశాంతి సంభవింప దని పల్కెను.

"రసస్య తు స్థాయీమూలకత్వాత్ ప్రశమాదేరసంభవః సంభవే వాన చమత్కార ఇతి న న విచార్యతే"

(రసగంగాధరము - ప్రథమాననము పు 393)

భా వ సం ధి .

రెండు భావముల సంధి. భావసంధి ఈ భావములు రెండును అభిభవనము చెంద దగినవి కావలయును. కాని అనభిభూతములుగా నుండవలయును. రెండిటికి సామానాధికరణ్య ముండవలయును. రాజభృత్యన్యాయమున గాని, అంగాంగి భావమున గాని యీ రెండుభావములు నుండరాదు. సమస్కంధములుగా నుండవలెను. రెండును స్వతంత్రములై యుండవలయును. అనగా సమానస్థితి గల్గిన రెండు స్వతంత్ర భావములు, అభిభవన యోగ్యము లయ్యును, ఏకాధికరణము లయ్యును అనభిభూతములై చమత్కారరూప మగు నాస్వాదమును ఘటిల్లజేయు నేని వానిసంధి భావసంధి యనబడును. "భావసంధిస్తు భావానాం తుల్యానాం వ్యర్గోగ్యతా యది" అని కావ్యదర్పణము.

ఉ దా హ ర ణ ము :-

మోముకనగవును కోపంబు చెలువుఁ బలుకు
తళుకుఁజూపులు చూపులఁ దర్జనముల

వక్రితభ్రూలతో తాండవంబు సిరుల
మిగులఁ గెరలించె ప్రియు మది మెఱయు మరుని.

(కళాపూర్ణోదయము. ఆ, 5-ప 51)

ఇందు హర్ష-అమర్షముల భావసంధి చర్వణావిషయ మగుచున్నది. ఈ భావసంధివిషయమున ఆంధ్రు డగు సర్వజ్ఞసింగభూపాలుడు మరొక విశేషమును తెల్పినాడు. ఇంతవరకు చెప్పబడిన భావములు రెండును వేర్వేరు భావములే కావలయును. ఒకే విధ మగు రెండు భావములయొక్క సంధి భావసంధి యనబడదు. రెండు భిన్నభావముల సంధియే భావసంధి యని ప్రాచీనుల యుక్తి. కాని సింగభూపాలుడు ఒకే వ్యభిచారిభావము రెండు వేర్వేరు రసములకు అంగభూత మగునపుడును భావసంధి యనబడును అని వచించెను. అనగా ఒక మోహమే రెండు వేర్వేరు రసములకు అంగ మగుచో, పోషక మగుచో నచటి భావము మోహమే యయ్యును రెండు రసముల దృష్టితో నిది భావసంధి యగును. దీని లక్షణ మాత డిట్లు వివరించెను.


"సరూప మసరూపం వా భిన్నకాలికకల్పితమ్
భావద్వయం మిలతి చే త్స సంధి రితి గీయతే"

రెండు భావములు సరూపము లయినను అసరూపము లయినను ఏకకాల కల్పితములై మిళితము లగుచో నది భావసంధి యనబడును. దీనికి

అరిప్రజానా మనపోతసింగ
ఖడ్గప్రహారై రవనిం గతానామ్
ప్రియాజనాంకగ్రహితాంగకానాం
భవంతి నేత్రాంతనిమీలనాని.

అని సింగభూపాలుడు స్వీయోదాహరణమునే యిచ్చెను.

సింగభూపాలుని ఖడ్గప్రహారములచే నేలగూలిన వారికిని, ప్రియురాండ్ర కడకు పంపబడిన వారికిని (మోహములచే) కన్నులు మూతపడినవి. ఇచట ప్రతినాయకులకు మోహములు కల్గినవి. ఇవి సరూపభావములు. వస్తురూపముచే



సామానాధికరణ్యము లేదు. కాని సర్వాధార మగు కాలరూపముచే సామానాధి కరణ్యము కలదు. రెండు మోహములును ఏకకాలమున కల్గినవి.

ఇట్లే అసరూపము లగు భావములకును సింగభూపాలుడు స్వీయోదాహరణమునే స్వీకరించెను

"శ్రీ సింగభూపప్రతినాయకానాం
స్విద్యంతి గాత్రాణ్యతివేపితాని
తత్తూర్య సంవాదిషు గర్జితేషు
ప్రియాభి రాలంబితకంధరాణామ్"

సింగభూపుని శత్రువులకు తూర్యనాదములవంటి మేఘగర్జనములు వినబడినవి. వానిని విని శత్రువులు ప్రియురాండ్రను కౌగిలించుకొనిరి. గర్జనశ్రవణముచే త్రాసము, ప్రియాలింగనముచే హర్షము నను రెండు భావములు ఏట వ్యజ్యమానము లగుచున్నవి కాన ఇది భావసంధి.

ఈ యభిప్రాయముచే (సరూపభావముల సంధి) రసాభరణకర్త యగు అనంతామాత్యుడు సమ్మతము పేర్కొనెను. అతడు భావసంధి లక్షణమును "సమ్మోద మొగిన్ రసద్వయము పుట్టి జనించుట భావసంధి" యని నిర్వచించెను. దాని కుదాహరణముగ నీ క్రింది పద్యము నిచ్చెను

అసురలపై దండెత్తిన
యసి శార్ఙ్గాయుధుని నిశ్చలాంగములను రెం
పెసగ నుదయించె పులకము
లసమపటహానినదము లప్రియావచనములన్ ,

ప్రతాపరుద్రీయమున నయితేము భావసంధి కిట్టి యుదాహరణమే యీయబడినది.

ప్రతాపరుద్రస్య దిగంతజైత్ర
యాత్రాప్రభూతై: పటహప్రణాదై: ,

ప్రియానులాపైశ్చ తథా ఘటానాం
రోమాంచవర్మావృత మంగ మాసీత్ "
అత్ర వీరశృంగారకృతయో ర్హర్షయో స్సంధి

భా వ స బ ల త

" (ప్రహ్లాద విధేయ) భావశబలత్వమగు న్బహుభావ సూచనన్" బహు భావములు సూచింపబడుట భావశబలత్వము.

కొందరు పూర్వాపూర్వభావ ముత్తరోత్తరభావముచే హతమగుట భావ శబలత యనిరి. కాని జగన్నాథుడు ఉపహన్యగూనతను అసాధారణముగ గ్రహింప లేదు. అతడు భావశబలతను వివరించుచు -

భావశబలత్వం భావానాం బాధ్యబాధక భావ మాపన్నా నాముదాసీనానాం వా వ్యామిశ్రణమ్

అని బాధ్యబాధకము లేక ఉదాసీనతను పొందియున్న భావముల సమావేశ మును సయితము భావశబలతగ అంగీకరించినాడు.

ఉ దా హ ర ణ ము

శివ నన్నె వ్రాసియిచ్చిన పిఱుమునను లే
ఖనని మిత్తము వేరె కలుగునొక్కొ ?
కలు గనంతఃపుర కన్యకట్టిది భర్త్ర
పరతదక్క ఘటిల్లు టరుదుగాన
అది యట్లయైనను దడఖీష్టయువపరీ
ణా మాత్రఫలక మై జాఱునొక్కొ
జాఱ దీశ్వరియిచ్చె సత్కృపనని జాల
వేడ్కఁ జూచుట తెప్పవింటిఁగాన
నిట్టిగతి చెల్వకును వెడ్డులెట్టు నొక్కొ

వెట్టదది తా సృజించిన బిడ్డగాన
లొంకగుచునంత కిదియ ద్రోపు వడునొక్క
పడ దజుడు చెప్పెనని విన బడియె గాన

(ప్రభావతీ ప్రద్యుమ్నము - 3 ఆ. 10 వ)

ఇందు ప్రద్యుమ్నుని పరిచింతనమున విషాదహర్షములు దైన్యస్మృతులు. శంకాధృతులు, నిర్వేదమతులు పరస్పరము విరుద్ధములయ్యును పర్యంతమున వితర్కమున కంగము లగుచున్నవి.

ఈ భావోదయాదులలో ఉదయాదులకు ప్రాధాన్యమని ప్రాచీనుల యభిభాషణ. కాని జగన్నాథుడు భావోదయాదులలో సయుతము భావమునకే ప్రాధాన్యమని వానికి భావధ్వనివ్యవహారమే యుక్తమని వివరించినాడు. స్థితి - ఉదయ-శాంతి - సంధి - శబలతలు అవస్థాభేదములు కాగ స్థితిని భావమే ప్రధానమైనపుడు ఉదయాదులలో కూడనట్లే కావలయును గదా! స్థిత్యవచ్ఛిన్నత్వము - ఉత్పత్త్యవచ్ఛిన్నత్వము శాంత్యవచ్ఛిన్నత్వము మొ॥ రీతిగా నన్నియు సమకక్షగతములే. కావున భావోదయాది ధ్వనులకును భావధ్వని వ్యవహారమే యుక్తమని నిర్ణయించినాడు.

అట్లంగీకరింపనిచో ఉదయాదులు వాచ్యములై భావము వ్యంగ్యమగు పలు తావుల రసదోష మనవలసి వచ్చును. వ్యంగ్యము వాచ్యము కాకూడదు గదా! అందు భావమునకే ప్రాధాన్యము నంగీకరించినచో ఉదయాదులు వాచ్యములయినను భావము వ్యంగ్యమే కనుక దోషములేదు. జగన్నాథుడీ విషయమును సచమత్కారముగ నిరూపించినాడు

స హృ ద య త

"కవిః కరోతి కావ్యాని రసం జానంతి పండితాః" అని అర్యోక్తి. కవి కావ్యరచనము గావించిన పండితుడు రసాస్వాదనము చేయగలడు. కావ్య రసాస్వాదనమును చేయుట రెండువిధములుగ నుండును. మొదటి విభాగము పిండీభూతముగా సదసన్నిర్ణయము. రెండవ విధానము హేతుబద్ధముగా సదసన్నిర్ణయము. లౌకికములయిన మధురామ్లాది రసములలోగూడ పదార్థనిర్ణయము చేయునపుడు కొందరు బాగున్నదీ లేనిదీ మాత్రమే చెప్పగలరు. హేతునిర్ణయము చేయలేరు. రెండవ రకము మనుష్యులు హేతుపురస్సరముగా లవణమో, కారమో తక్కువగుటచే అది బాగుండలేదని నిర్ణయింతురు. అట్లే కావ్య విషయమున ఈ మొదటి తెగవారికి రసాస్వాదనశక్తి యున్నచాలును. రసవివేచన శక్తి యక్కరలేదు. రెండవ తెగవారికి రసవివేచనశక్తి యెక్కువ. రసాస్వాదన శక్తి దానికి సహకరించును మొదటి తెగవారిని సహృదయులు లేక సామాజికు లనియు, రెండవ తెగవారిని విమర్శకులనియు అందురు.

విమర్శకుడు – సహృదయుడు :

విమర్శకులు కూడ ఇరుతెగుల నుందురు. అవి కాలభేదమును, కాలాను సారి భేదమునుబట్టి యేర్పడినవి. ప్రాచీనకాలమున, సంస్కృత సాహిత్యమునను తన్మూలకముగ ఆంధ్రసాహిత్యమున నేర్పడిన వ్యాఖ్యానములు ప్రథమ విమర్శవిధానము. రెండవది ఆధునిక విమర్శతత్త్వము.

"అలంకార గ్రంథములందు గూడ మనకు విమర్శనాత్మకములగు భాగములు కన్పట్టుచుండును. కాని ఆ విమర్శలు కూడ నేటి విమర్శలవంటివి కావు. అవికూడ ఇంచు మించుగ శ్లోకములకు వ్యాఖ్యప్రాయములే. ఏదైనను నొకశ్లోకమును గైకొని శాస్త్రానుసారముగ వ్యాఖ్యానించుటయే వారి పద్ధతి ఇది యెప్పుడు ఖండనాత్మకముగ నుండును. కావ్యశిల్పమునందలి అఖండ సౌందర్యమును వివరించుటకు గాని పాత్రౌచిత్యముల సన్నివేశ కల్పన ప్రకృతి చిత్రణాదులయందు కవికిగల సామర్థ్యమును వ్యక్తీకరించుటకు గాని ఆలంకారికు లెన్నడును ప్రయత్నించలేదు." 8

---

8. సాహిత్య దర్శనము - K. V. R. నరసింహం - 5 పుట

పై పంక్తులలో ప్రాచీనార్వాచీన విమర్శకత్త్వములు రెండును చూపబడినవి ఇట్లు విమర్శింపవలయునన్న ఉభయ విమర్శకులకును కొన్ని ప్రత్యేకలక్షణములు లేక గుణములు అవశ్యకములు.

"సద్విమర్శకునకు కవితా శిల్పరహస్యములు కరతలామలకములై యుండును మనకు దుస్సాధ్యములై యున్న యంశము లనేకము లాతనికి సుసాధనములై యుండును.' *

కావున అట్టి లక్షణములుగల వ్యక్తియే విమర్శలఁ జేయుట కర్హత పొందును ఇక సామాజికునకన్నచో ఇట్టి లక్షణములు ఉన్నను, లేకున్నను నష్టములేదు " మృగ మీలనగఁ జాలు తెగగీలుకొను వాలుకనుగవ కొకవింత కాంతి యొదవె" c అన్నచోట అను ప్రాసాలంకారము - శబ్దాలంకారము ప్రయోగింప బడినదని అతనికి తెలియకున్నను దోషములేదు. ఆతడు రసాస్వాదనము చేయగలడు. కనుక విమర్శకునికన్న సహృదయుడు లేక సామాజికుడు భిన్నుడు. విమర్శకుడు సహృద యుడై యుండవలయునే కాని సహృదయుడు విమర్శకుడు కావలసిన అవసరము లేదు. అట్లే ఆయినచో సాహిత్యము అంగుళీగణ్య సంఖ్యాకులకు మాత్రమే ఉపయోగ పడెడి ప్రక్రియ అనవలసి వచ్చును.

సహృదయ లక్షణము :

అలంకారికులు ఈ సహృదయునకు కూడా లక్షణములను వచించిరి. అభినవ గుప్తుడు నాటకమున లేక కావ్యమున అధికారిని గూర్చి ఇట్లనినాడు -

"అధికారీ చాత్రవిమల ప్రతిభానశాలి హృదయః " b

"యేషాం కావ్యాను శీలనాభ్యాస వశాత్ విశదీభూతే మనోముకురే వర్ణనీయ తన్మయీభవన యోగ్యతా తే సహృదయ సంవాద భాజః." c

---

* సాహిత్య దర్శనము - పు 27

a పారిజాతాపహరణము - ప్రథమాశ్వాసము

b అభినవభారతి - I Vol - 279 Page

c ధ్వన్యాలోక లోచనము.

నిర్మలాంతః కరణము కలిగి యుండవలెను. కావ్యానుశీలనాభ్యాసవశమున మనోముకురము నిర్మలమయి యుండవలయును. అపై తన్మయీభావమును పొందుటకు యోగ్యుడై యుండవలయును. ఇందు కావ్యానుశీలనా భ్యాస మనునది కేవలము కావ్యమునకు పరిమితమయి యుండనోపు. నాటక దర్శనవిషయమున ప్రథమపర్యాయము ఐయినను రసాస్వాదనమునకు ఏమియు భంగముండదు. కావ్యవిషయములో నన్నచో నట్టిభంగమేర్పడును అది బుద్ధిగ్రాహ్యముకావున. చక్షురింద్రియ గ్రాహ్యమయిన నాటకమున నట్టి కష్టసాధ్యత లేకపోవచ్చును. కావ్యనాటకములు భయములందును నిర్మలాంతఃకరణత్వ మావశ్యకమే. ప్రధానమయినది తన్మయీభవనయోగ్యత - అనగా తాదాత్మ్యము పొందగల శక్తి.

తాదాత్మ్యము – సానుభూతి

ప్రాచ్యాలంకార శాస్త్రము ననుసరించి ఆలోచించిన సహృదయుడు నటునితో తాదాత్మ్యమును పొందవలసియుండును. ప్రాచ్యరససిద్ధాంత వ్యాఖ్యాత లెందరో అభేదబుద్ధిని సామాజికుడు పొందునని నిర్వచించి యున్నారు. కనుక తాదాత్మ్యము అనునది భారతీయ సాహిత్యశాస్త్రమయిన రసానుభూతిలో ప్రధాన విషయము. పాశ్చాత్యుల సిద్ధాంతమునను సరించి ఆలోచించినచో ఈ తాదాత్మ్యము తదుక్తము కాదు. వారు సానుభూతిని పొందవలయునందురు. అందుకే సామాజికునకు Tragedy చూచుటకు ముందు Pity and pear లకు భయపడు స్వభావ ముండునవియు, Tragedy చూచిన కారణముగా వారు దానికి భయపడు స్వభావమును వదలి ప్రక్షాళితత్వముచే ఆనందము ననుభవింతు రనియు వారి సిద్ధాంతము. కావున ప్రాచ్యుల Ident ty - తాదాత్మ్యతకు ప్రాధాన్యము నీయగా పాశ్చాత్యులు Sympathy - సానుభూతికి ప్రాధాన్యము నొసగిరి.

వా స న :

తాదాత్మ్యము నందవలయునన్నను సామాజికునకు ప్రాక్తన మైనది కాని ప్రాకృతిక మైనది కాని వాసన లేక సంస్కారము ఉండవలయును. అభినవగుప్తుని రససిద్ధాంతమున ప్రాధాన్యము పొందిన విషయ మిదే. వాసనాత్మకములుగ సర్వస్థాయులు సహృదయునిలో నుండు ననియు, అవి ఉద్బుద్ధములై రసస్థితి నందు ననియు అతని యభిప్రాయము కావున అట్టి వాసనను తప్పక సహృదయుడు కలిగియుండవలెను.

"సవాసనానా సభ్యానాం రసస్యాస్వాదనం భవేత్
నిర్వాసనాస్తు రంగాంతః కాష్ఠకుడ్యాశ్మసన్నిభాః " a

అని ధర్మదత్తుని శ్లోకము వాసన లేని సామాజికులకు రంగస్థంభములోని రాయి, రప్పలకు ఏ విధమైన భేదము కన్పట్టదు. కావున అట్టి వాసన సామాజికులకు అత్యావశ్యకము

" న జాయతే రసాస్వాదో వినా రత్యాదివాసనామ్"

కా ఈ వాసన, నిర్మలాంతఃకరణత్వము, తాదాత్మ్యశక్తి కలిగియుండుట సహృదయుని సామాజికుని) ప్రధానలక్షణము. ఇట్టి లక్షణములు గల సామాజికుడు నాట్యదర్శనమున నాయకునితో సమానమైన అనుభూతిని పొందగలడు. "నాయకస్య కవేః శ్రోతుః సమానోఽనుభవః స్మృతః" అని భట్టనాయకుని వాక్యము. పాశ్చాత్యవిమర్శకులలో Plato కూడ ఇట్టి అభిప్రాయమునే వ్యక్తీకరించియున్నారు.

Plcto - in h s I on has recognised that the Psycho-physical condition of the spectator consequent on witnessing a dramat c Presentation, is all most the same as that of the dramatist at the t me of Production and of the actor at the time of representation. b

భరతుడు నాట్యశాస్త్రమున సహృదయలక్షణము యిట్లు వచించి యున్నాడు.

అవ్యగ్రై రింద్రియైః శుద్ధః ఊహాపోహవిశారదః ।
త్యక్తదోషోఽనురాగీ చ స నాట్యే ప్రేక్షకః స్మృతః ॥ c.

యస్తుష్టౌ తుష్టి మాప్నోతి శోకే శోక ముపైతిచ
క్రోధే క్రుద్ధో భయే భీతః స శ్రేష్ఠః ప్రేక్షకః స్మృతః ॥ d.

---

a సాహిత్యదర్పణము - తృతీయ — పు 117
b. Compar tive Aesthetics-Vol II P 89 K. C. Panday
c. నాట్యశాస్త్రము - 27 — 54.
d. నాట్యశాస్త్రము - 27-61, 62

ఆనందవర్ధనుడు సహృదయతను గురించి చక్కని విమర్శ చేసినాడు. సహృదయత్వ మనగా కావ్యమునకు సంబంధించిన యేవో కొన్ని విశేషములను తెలిసి యుండుటయా? లేక రసభావాదిమయమగు కావ్యస్వరూపమును తెలిసి యుండుటయా? అని వికల్పించి రసభావాదిమయమగు కావ్యస్వరూపమును తెలిసి యుండుటయే యని నిర్ధారించినాడు a.

సహృదయుని సమాదరణమును కాంక్షించు వాడు ప్రాచ్యులేకాక పాశ్చాత్యుడుకూడ. ఈ విషయమున "బాబర్ట్" మహాశయుడు ఇట్లు అభిప్రాయ పడినాడు. మనలో కొంతకవిత్వము అనగా కవిహృదయతత్త్వము లేనిదే మన కెచ్చటను కవిత్వము గోచరము కాదు b ఇది యభినవగుప్తుని సహృదయత్వ లక్షణముతో దగ్గర సంబంధము కలది. జీవితములో ప్రతివ్యక్తియు నెప్పుడో ఒకప్పుడు కవిహృదయసంవాదియైన కావ్యానందమును పొందవలె నని లేక రస ప్రసుప్తమైన కవిహృదయధర్మమును కలిగియుండవలె ననియు లేనిచో ఆజీవితము నీరసము నిరర్థక మనియు లేమర్ బెయిన్ వచియించినారు. c.

రసానుభూతికి కవితాతత్త్వవేత్తృత అత్యంతావశ్యక మని ఈ క్రింది శ్లోకము చమత్కారముగా వక్కాణించుచున్నది

> నైవ వ్యాకరణజ్ఞ మేతి పితరం న భ్రాతరం తార్కికమ్
> దూరా త్సంకుచితేవ గచ్ఛతి పున శ్చండాలవచ్ఛాందసమ్
> మీమాంసానిపుణం నపుంసక మితి జ్ఞాత్వా నిరస్యాదరాత్
> కావ్యాలంకరణజ్ఞమేవ కవితాకన్యా వృణీతే స్వయమ్.

కవితాకన్య ఒక్క కావ్యాలంకారజ్ఞుని మాత్రమే వరించునని అన్యశాస్త్రము లలో విశేషమైన పాండిత్యమును పొందిన వ్యక్తి నైనను ఆదరింపదనియు తద్భావము.

---

a. ధ్వన్యాలోకము - తృతీయ - పు 394.

b. You will find Poetry no where unless you bring some with you

c. Sad is his lot who once at last in his life has not been a Poet

రససిద్ధాంతము - ఉత్పత్తివికాసములు

భారతీయసాహిత్యము అతిప్రాచీనము అనంతము నైనది. అది సాగరము వంటిది. అట్టి దాని నిస్సీయ మగు తాత్త్వికచింతన మనెడి మందరముతో మథించి రసామృతము నుద్భవింపజేసి సకలభారతీయులకు పంచి యిచ్చిన వాడు భరతుడు. రసప్రవచనమునకు ప్రాథమ్యము ప్రాచుర్యము కల్గించినవాడు భరతుడు. ప్రవచించిన రససిద్ధాంతము సర్వవిమర్శకాంగీకృతమై ప్రామాణికమై నిలచినది. అర్వాచీన కాలమున నెన్నియితర సిద్ధాంతములు వెలువడినను నిలువలేకపోయినవి. కొన్ని నిల్చె నన్నచో దీని నాధారము చేసికొనియె నిల్చినవి. ప్రమాణభూతము, సామి కాభ్రాయము, ప్రాచీనతమము నైన రససిద్ధాంతముయొక్క అడుగుజాడలలో నడుచుటచేతనే ధ్వని, ఔచిత్యాది సంప్రదాయములు నిలువబడగలిగినవి. వానికిని రస సిద్ధాంతమున కున్నంత ప్రామాణికత్వము, సర్వజనాదరణము లే వనుట స్పష్టము. సాహిత్యసారప్రవక్తలలో భరతునకే అగ్రాసనాధిపత్యము లభించినది. అతని నాట్యశాస్త్రము సర్వాలంకారగ్రంథములకు శిరోధార్య మైనది. అందు రససిద్ధాంత విశ్లేషణమునకు 6, 7 అధ్యాయములు ప్రత్యేకింపబడినవి.

రససిద్ధాంతము ఒక్కుమ్మడిగా భరతుని వాగ్ద్వారము నుండి వెలువడినదా? దానికి ఆధార మేదేని కలదా? భరతునికి ప్రాచీనకాలమున నున్న సాహిత్యమునందు రససిద్ధాంతనిర్వచనమునకు తగిన పోషకసామగ్రి యెంతవరకు లభ్య మగుచున్నది? అది యితరులకు గాక భరతునికే లభ్య మగుటకు గల కారణ మేమి? అను సంశయము లిట పరిశీలనార్హములు.

ఇందు మొదటి శంకకు తేలికగా సమాధానము చెప్పవచ్చును. ఏ శాస్త్రము నం దైనను ఏ సిద్ధాంత మైనను లోకప్రవృత్తికి మానవబుద్ధికి వ్యతిరిక్తముగ నుండ రాదు. ఒకచో అట్టి అభిప్రాయ మొకరేని ప్రవచించినను అది సిద్ధాంతముగా పది కాలముల పాటు నిలువజాలదు. సార్వకాలికము కానిది పూర్వ పక్షకోటికే చెందును. ఏ సిద్ధాంతమున కైనను లోకప్రవృత్తికి తద్వ్యాప్తమునకు సంబంధించిన యనుభవము భూమికాప్రాయమై యుండును. ఇచట భరతుడు సాహిత్య సార నివేదన మొనరించి యొక సిద్ధాంతము ప్రవచించినాడు. అత డెంత ఋషి యైనను అనుభవరహితముగ అతని వాగ్ద్వారము నుండి ఈ సిద్ధాంతము

ఉద్భవించిన దనుట హేతువాదము ముందు వీగిపోవును. ఆత డెంతయో సాహిత్య వివేచనానుభవము కలిగి ఉండవచ్చును అంత మాత్రమున గాక ఈ సిద్ధాంతము సిద్ధాంతముగా కాకపోయినను అభిప్రాయముగా నైనను తనకు పూర్వులలో గాని సమకాలికులలో గాని తప్పక యుండి యుండవలయును. అభిప్రాయములుగా నున్న యీ విషయములను తన మేధాశక్తితో విశ్లేషణ మొనరించి నిగ్గు తేల్చి సిద్ధాంతీకరించిన వాడు భరతుడు. ఈ యంశమున సహోద్బలకముగ నీ క్రింది నాట్యశాస్త్రపంక్తులు సాక్ష్య మిచ్చుచున్నవి.

భవన్తిచాత్రశ్లోకాః - నానాభినయసంబద్ధాన్ .... [1]

తన యభిప్రాయమునకు ప్రామాణ్యమును స్థిరపరచుకొనుటకై భారతీయ విమర్శకులు ప్రాచీనసమ్మతిని వక్కాణించుట యనూచానముగ వచ్చుచున్న సంప్రదాయము. అది అలంకారశాస్త్రమున నూటికి నూరుపాళ్ళు ఆదరింపబడినది. దానికి బీజప్రక్షేపము చేసినవాడు భరతుడు. ఆతడు తన యభిప్రాయములను విశదపరచుచు మధ్యమధ్య తన యభిప్రాయములకు పోషకములని కొన్ని శ్లోకములను ఆర్యలను సంగ్రహించినాడు. ఇవి భరతునకు పూర్వుల వైనను కావలయును లేదా ప్రామాణికులైన సమకాలికుల వైనను కావలయును. సమకాలికుల వనుటకంటె పూర్వుల వనుట సత్యసన్నిహితము ఈ యభిప్రాయమునకు భరతుని

'అత్రానువంశ్యే ఆర్యే భవతః' [2]

అను పాఠము పోషకముగ నున్నది అనగా భరతునికి పూర్వమే రస సిద్ధాంతమునకు సంబంధించిన వివేచనము ప్రారంభ మైన దని చెప్పవచ్చును. ఆ వివేచనమే భరతునికి భూమికాప్రాయ మైన దనియు వక్కాణింపవచ్చును. ఇది లక్షణమునకు సంబంధించినది. లక్షణవివేచనము ప్రారంభ మగుటకు విస్తృతము లగు లక్ష్యము లుండవలయును. లక్ష్యము లేక లక్షణ ముద్భవించుట యనుభవ దూరము కదా! కావున ఆ లక్ష్యము లేవియో కూడ తెలిసికొనదగును.

---

1. నా. శా. 6-34.

2. నా. శా. 5-49.

అత్యభూత ప్రాతిపదిక:

మానవుడు సంఘజీవి ఇతరమానవులతో ఎన్నియో యనుబంధము లుండును. ఈ యనుబంధము లన్నియు సమగ్రముగ నిర్వర్తింపబడుటకు మానవుడు భాష నాశ్రయించును. అనగా మానవుడు తన హృదయము నందలి యభిప్రాయమును వాగ్రూపమున నభివ్యక్త మొనర్చును. ఇతరప్రాణులకంటె మానవునకు గల వర మది. ఇతరప్రాణులు తమ యభిప్రాయములను వెలువరింపగల్గినను వానిలో స్పష్టత, సమగ్రత లోపించును. కాని మానవుని భావాభివ్యక్తిలో స్పష్టత, సమగ్రత మూర్తీభవించును. ఈ రెండుగుణములను భాష మానవునకు ప్రసాదించినది. మానవుడు భాషాముఖమున నెన్నియో ప్రయోజనముల నందుచున్నాడు. వాని నన్నిటిని సమకూర్చుకొనిన తరువాత మానవునకు సౌందర్యపిపాస యంకురించును.

మానవుని యింద్రియము లన్నింటికి నీ సౌందర్యాస్వాదన మనెడి తృష్ణ యున్నది. ఒక సుందర మగు దృశ్యమును గాని, రమణీయస్వరూపమును గాని ఒకసారి చూచినపుడు కనులు మరల నా దృశ్యమును గాని రమణీయస్వరూపమును గాని చూడవలెనని యాకాంక్షించును. ఒక మధుర మగు శ్రావ్య మగు సంగీతమును వినవలెనని శ్రోత్రేంద్రియ మభిలషించును. పరిమళయుత మగు పుష్పసౌరభము నాఘ్రాణింప ఘ్రాణేంద్రియము వాంఛించును. అవనిలో 'శీతలవాతపోతమును స్పృశింప త్వగింద్రియ మభిలషించును. ఈ యింద్రియములకు గల తృష్ణ ఆనందాకాంక్షతో కూడినది అట్లే జిహ్వేంద్రియమును ఆనంద మభిలషించును. ఈ యింద్రియము ఇతరేంద్రియములకంటె విలక్షణ మైనది. ఇతరము లగు చక్షురాదీంద్రియములు ఒకే వ్యాపారమును నిర్వర్తించును. కనులు చూచును, చెవులు వినును, ముక్కు మూర్కొనును, చర్మము స్పృశించును. కాని జిహ్వేంద్రియము రెండు వ్యాపారములను నిర్వర్తించును జిహ్వ భుజించును రుచిని గ్రహించును. ఇది సర్వప్రాణిసామాన్య మైన కర్మము. మానవునకు వరప్రాయ మైన మరొక క్రియను ఈ జిహ్వేంద్రియము నిర్వర్తించుచున్నది. అదియే భాషోచ్చారణము. మానవుడు భాషాద్వారమున తన భావములను స్పష్టముగ సమగ్రముగ వ్యక్తీకరించుటయే కాక సుందరముగ సయితము వ్యక్తపరచ యత్నించును ఇట్టి స్థితి మానవునకు అత్యంతప్రాచీనకాలమునుండియు నేర్పడి యుం

డును. ముందుగా సమగ్రతకొఱకును, తరువాత స్పష్టతకొఱకును, ఆ తరువాత సౌందర్యముకొఱకు మానవుడు ప్రయత్నించును. ఈ మూడును మానవుని భావనములో నెపుడు చోటు చేసికొనినవో అపుడే యీ రససిద్ధాంతమునకు లక్ష్యభూతమైన ప్రాతిపదిక యేర్పడిన దని చెప్పనొప్పును.

విశ్వసాహితిలో వేదవాఙ్మయము ప్రాథమ్యము నార్జించినది. అందు ఋగ్వేదము అతి ప్రాచీన మైనదని చారిత్రక నిర్ణయము. ఆ కాలమున మానవుని జీవితములో, ప్రవృత్తిలో, బాహ్యోన్ముఖత్వముకంటె అంతర్ముఖత్వము అధికముగ నున్నట్లు కన్పట్టును. స్వీయశ్రేయస్సాధనకై దివ్యులను స్తోత్ర మొనరించుట యిచట ప్రధానముగ కన్పట్టును. మానవుడు దివ్యులకు తన విన్నపమును స్పష్ట సమగ్ర సుందరము గ చేయుటకు ప్రయత్నించును ఆ యే తోడి మానవుల సంభాషణలు అందును ప్రవేశించును. ఆ సంభాషణాత్మక మైన విధానము తెలియుటకు మనకాధారములు లేవు. కాని దివ్యులను ఆత్మశ్రేయోభిలాషముతో చేయు స్తోత్రములు లబ్ధి సుందరతతో కూడినవి పలువిధములుగ ఋగ్వేదమునందు కన్పట్టుచున్నవి. ఆ విధాన మంతయు ఎదుట వారి సున్ముఖులుగా చేసికొనుటకుగానే యందు కన్పట్టు వచ్చును. కాని అందు సాహితబీజ మున్నది. అతర్కితముగ రససిద్ధాంతమునకు బీజము విక్షేపింపబడినది. అట్టి స్థితి ఆనాటి మానవ మనస్తత్వము మూలముగా నేర్పడినది. రససిద్ధాంతము మానవ మనస్తత్వము మీద నాధారపడినదే. దాని మీద నాధారపడిన చిత్తవృత్తులు అనగా భావాదికములు ప్రపంచింపబడినవి. అవి పరిపుష్టము లయిన నే రసస్థితి కలుగుచున్నది.

కావున ఋగ్వేద కాలముననే రససిద్ధాంతమునకు లక్ష్యభూతము లైన ఋక్కులు కన్పడుచున్నవి. వాని నిట పరిశీలింతము. ఋగ్వేదమునందు ఉషస్సూక్తమునందు శృంగార రసస్ఫోరక మైన ఋక్కులు కలవు. ఇట్లే ఇంద్ర సూక్తమున వీరరసవ్యంజక మైన యింద్రుని వర్ణనము కన్పట్టును

యః పృథివీం వ్యథమానా మదృంహాత్
యః పర్వతాన్ప్రకుపితా నరమ్ణాత్ !
యో అన్తరిక్షం విమమే వరీ యో
యో ద్యా మస్తభ్నా త్స జనాస ఇన్ద్రః " ౧

౧. ii. 12.

దీనికి Arthur Anthony Macdonell యొక్క అనువాదము Who made firm the quaking earth, who set at rest the agitated mountains, who measures out the air more widely, who supported heaven, he, O men is Indra.

ఇట్లు వేదకాలమునందే రససిద్ధాంతమునకు లక్ష్యములు కన్పట్టుచున్నవి. ఈ విషయమును ఆంధ్రుడైన పాండురంగ ధర్మసూరి తన సాహిత్యరత్నాకరమున నిట్లు వచించినాడు.

"సంత్యేవ హి ప్రాకృతే వేదేప్యపి కావ్యలక్షణాని లక్షితాని అదోషాణి సగుణాని సాలంకారాణి వాక్యాని – (గుణావక్ష్యమాణ లక్షణా అర్థవ్యక్త్యాదయః, తేచ" యదేకస్మిన్ యూపే ద్వే రశనే" ఇత్యాది వాక్యేషు సంభవన్తి – అలంకారా ఉపమాదయః "అతే గర్భో యోని మేతు పుమాన్ బాణ ఇవేషుధిమ్" ఇత్యాది షూపమా. "త్రిగ్ శదస్యా జఘనిం యోజనాని" త్యాదావతిశయోక్తిః "ప్రాణా ఉపసవాహానూ అధిపవణే." ఇత్యాదౌరూపకమ్) "యస్యాము శంతః ప్రహరామ శేపం ఉపోపయే పరామృశ జాయేన పత్య ఉశతీమువాసా" ఇత్యాదిషు శృంగారరసః "తేషామ సురాణాం తిస్రః పుర ఆసన్" ఇత్యాదిషు వీరరసః "యో వా అస్యపశుమత్తి మాగ్సగ్సోత్తి" త్యాదౌ బీభత్స రసః "కో మోహః కః శోక" ఇత్యాదౌ శాంత రసః ఏవ మన్యేపి గుణాలంకార రసాస్తత్ర తత్ర ద్రష్టవ్యాః

ఇట్లు సర్వరసములు వేదములందే లక్ష్యభూతములైన మంత్రములు కన్పట్టుచున్నవి. మరి యట్లైనచో భరతుడు "రసానాథర్వణాదపి" అని పేర్కొనుటలో గల యాశయమును పరిశీలింప వలయును.

భారత వర్షము కర్మభూమి. ధార్మికమగు కర్మాచరణమునకు భారతీయులు తరతరముల నుండి అలవాటు పడియున్నారు. వివిధాధ్వర నిర్మల ధర్మకర్మ దీక్ష పరతంత్రులు భారతదేశ మందంతటను వ్యాపించి యున్నట్లు విన్న మొన్నటి సాహిత్యము సయితము సాక్ష్య మిచ్చుచున్నది. అట్టి ధర్మకర్మలకు ప్రమాణ ప్రాయమైనది వేదము. 'వేదోధర్మ మూలమ్" అని కదా ఆర్యోక్తి కావున ఏ సిద్ధాంత

మైనను ఎట్టి శాస్త్రమైనను వేదప్రామాణ్యము సిద్ధింప జేసికొననిచో అది ప్రజామోదమును బడయజాలదు. అట్టి సిద్ధాంతము విశ్వాస్యము కాదని భారతీయుల భావనము. కావున ఎట్టి సత్యసిద్ధాంతమైనను వేదప్రామాణ్యమును సంతరించుకొని తీరవలసినదే

ఇంతియేకాక ఇచట మరియొక విషయము కూడ సుస్ఫుటించుట యవసరము. ఏ శాస్త్రమైనను ఏ సిద్ధాంతమైనను ఏ విద్యయయినను ప్రజలలో ప్రామాణ్యము సంతరించుకొనుటకు మరియొక పద్ధతి యవలంబించుట భారతీయులకు పరిపాటి యయినది. ప్రజలకు తన సిద్ధాంతముపై గురి యేర్పడుటకు తన సిద్ధాంతము దివ్యదత్తమని ప్రవచించుచుండును. పాణిని అష్టాధ్యాయి వ్రాయుచు ముందు మాహేశ్వర సూత్రములను వ్రాసినాడు. అవి మహేశ్వరుని నుండి వచ్చినవట. మహేశ్వరుడు నృత్తావసానమున పదునాలుగు మారులు తన ఢక్కను ప్రయోగించెననియు, ఆ నాదము నుండి "అఇఉణ్" ఇత్యాది సూత్రము లుద్భవించెననియు అవి శివసూత్రము లనబడుననియు, సంప్రదాయజ్ఞుల భావన. శివుడు సర్వజ్ఞుడు కదా! అతని నుండి ఈ సూత్రజాల ముద్భూతమైన దనుటచే వ్యాకరణ శాస్త్రముపై గురి ఏర్పడునని తచ్ఛాస్త్రకర్తల భావనమై యుండును.

అట్లే భరతుడు సహితము తన నాట్యశాస్త్రము ద్రుహిణ ప్రోక్తమని వచించినాడు. ఇట్లనుట ప్రేక్షకులకు గురి ఏర్పడుటకే యని భావించుట హేతువాదుల స్వభావము. అట్లే వేదప్రామాణ్యము సయితము తన గ్రంథమునకు కల్పింప నెంచి నాట్యశాస్త్రమం దిట్లు వచించెను.

జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్ సామభ్యో గీతమేవ చ ।
యజుర్వేదాదభినయాన్ రసానాథర్వణాదపి ॥[4]

ఋగ్వేదమునుండి పాఠ్యమును సామవేదము నుండి గీతమును, యజుర్వేదము నుండి యభినయములను, అథర్వవేదము నుండి రసములను గ్రహించెను.

భరతుడు కంఠోక్తిగా రసముల నాథర్వణమునుండి గ్రహించితినని చెప్పుచుండగా ఋగ్వేదాదులయందు రససిద్ధాంతమునకు ప్రాతిపదికయుండెననుట ఎట్లు పొసగునని శంక పొడమవచ్చును. ఆ ప్రాతిపదిక లక్ష్యభూతమైన ప్రాతిపదిక. ఈ

4. నా. శా. 1. 17.

కంఠోక్తి లక్షణసూచకము. రసలక్షణము నిర్వచించినవాడు భరతుడు. ఆలక్షణ నిర్వచనమునకు మూలమైనది అథర్వవేదము. అంతియేగాని అతఃపూర్వము లక్ష్యభూతమైన సాహిత్యము లేదనుటకాదు. ఇదియేకాదు. బ్రాహ్మణములు, రామాయణము. భారతము మున్నగు ప్రాచీన సాహితీ స్రవంతి యప్రతిహతముగ కనవచ్చుచున్నది దాని నాధారముగ చేసికొనియే భరతుడు లక్షణనిర్దేశ మొనరించినాడు. అందును "రసానాథర్వణాదపి" అని యనుట మెంతేని సమంజసము. అపి శబ్దము సాభిప్రాయము. కావున లక్షణప్రాయమైన రసశబ్దగ్రహణము అథర్వవేదమునుండి యొనర్పబడినదనుట యుక్తిదూరముకాదు. అట్లు గ్రహించుటకు వేదప్రామాణ్యమును సంతరించుకొనుట నుద్దేశ్యమేగాక అథర్వవేదము యొక్క విషయ స్వరూపముకూడ కారణమై యుండవచ్చును. అథర్వవేదమునందలి విషయము రసలక్షణనిర్దేశమునకు సూచకమైనది.

అ థ ర్వ వే ద ము :-

వేదములు మొదట మూడుగా విభజింపబడినవనియు తరువాత పై మూడు వేదములందలి మంత్రములను సంగ్రహించి అథర్వవేద మొనరించిరని సంప్రదాయాభిజ్ఞులయూహ. అథర్వవేదమును పరిశీలించినచో అందలి మంత్రములన్నియు ఆదిభౌతికప్రాధాన్యము కలవి. భౌతికమైన బాధానివారణము కొఱకైన యంత్రములు, స్త్రీవశీకరణోపాయములు, అభిచారమంత్రములు, దాంపత్య జీవనము సుఖముగా సాగుటకు కావలసిన అభిచార మంత్రములు, శత్రునిరాసనమునకు కావలసిన మంత్రములు, వైద్యసంబంధమైన రసనస్మేళనములు మున్నగునవి కలవు. వీనిలో గల భౌతికప్రాధాన్యమును దాంపత్యమును దృష్టియందిడుకొని వైద్యమును దృష్టియందిడుకొనియే భరతుడు లక్షణనిర్దేశవిషయమున రసములను అథర్వవేదము నుండి గ్రహించితినని వక్కాణించి యుండును. కావున లాక్షణికముగ అథర్వవేదము రసమునకు మూలము కావచ్చును.

(చూడుడు - 'రసానాథర్వణాదపి' - ఋషికల్పన్యాసః)

లాక్షణిక నైఃధ్యము :-

భరతునికి పూర్వము సాహిత్యమునకు లక్షణ నిర్వచన మొనర్చు గ్రంథములు గాని నాటక లక్షణ గ్రంథములుగాని కన్పట్టుట లేదు. అట్టిచో భరతునకు సూచనామాత్రముగనైన పోషకములైన లక్షణ గ్రంథములు లేవా యనునది పరిశీలనార్హము.

భరతుడు దశావస్థలను చెప్పుట   వైశికశాస్త్రకారైశ్చ
దశావస్థాభిహితా, తాశ్చ సామాన్యాభినయే వక్ష్యామః

అని వచించినాడు. కాబట్టి భరతునికి పూర్వమే కామశాస్త్రము వర్ధిల్లినట్లు స్పష్టపడుచున్నది. కావున భరతుని రససిద్ధాంతమునకు కామ సూత్రములు అనుపాంగ్యములై యుండును. ఈ కామ సూత్రములకు పూర్వము లాక్షణిక నైపథ్యము అథర్వవేదమే యగుచున్నది. *అథర్వవేదము అతి లౌకిక విషయప్రాధాన్యము కలిగినది. కావుననే తద్దృష్టితోడనే 'రసానాథర్వణాదపి' అనియు వచించి యుండును. తరువాత కామ సూత్రములు అనుసరణీయములై యుండును. లాక్షణికు లందరును శృంగారరసము నకు మాత్రమే యుదాహరణములను ప్రపంచించి మిగిలినవి ఇట్లే యూహ్యములని వచించుటలో గల యాంతర్యము గూడ కామశాస్త్రనైపథ్యమే యనుట దోషము కాజాలదు. దీనినిబట్టి నాట్యశాస్త్రమునకు లాక్షణికనైపథ్యముగ అథర్వవేదము కామ సూత్రములు, నాట్య శాస్త్రము - ఈ పరంపరను గ్రహింప వచ్చును

లక్ష్యాత్మక సాహిత్యము :-

వేదములలో పడిన సాహిత్యరసబీజము బ్రాహ్మణములలో మారాకు వేసినది. శతపథబ్రాహ్మణము, ఐతరేయబ్రాహ్మణములలో రసస్ఫూర్తిని కల్గించు ననేకగాథలు కలవు. అవి అర్వాచీనకాలమున కాళిదాసుని చేతిలో పరమసుకుమారముగ శృంగారనాటకములుగ ప్రసిద్ధి కెక్కినవి. విక్రమోర్వశీయము, అభిజ్ఞానశాకుంతలముల మూలములు శతపథబ్రాహ్మణము నందే కలవు. ఇట్లే యైతరేయ బ్రాహ్మణమునందు శునశ్శేపోపాఖ్యానము మున్నగు కథలు విస్తరిల్లినవి. తదుపరి కాలమున సాహిత్యము శాఖోపశాఖలుగ విస్తరిల్లి యుండును. వాని సారముగ రామాయణము వెలసి యుండును. ఉత్తమోత్తమ కావ్యముగ ప్రసిద్ధి కెక్కిన ఆదికావ్యము సర్వరసములకు నాకరమై వెలసినది కావ్యవిఖ్యాతి నార్జించిన ప్రాచీనగ్రంథ మిదియే. ఆ తరువాత మహాభారతము వెలసినది. సంస్కృతమున ఉపదేశప్రధానమైన భారతమునందు సయితము రసస్ఫోరకములైన సన్నివేశము లెన్నియో గలవు. ఇవియే గాక భాసనాటకములు గూడ భరతునికి పూర్వ

*. వా. శా, 1. పు 304.

కొనసాగే వెలసియుండును. నాటకలక్షణ లక్షితము లైన భాసుని నాటకములు పయ... భరతునికి ఉపాశ్రితము కానోపును. భరతు డెచటను భాసుని నామమును పేర్కొనలేదు. ఇది కేవలము పాక్షికమైన అభ్యూహము మాత్రమే.

"నాటకాంతం హి సాహిత్యమ్" అని సాహిత్యమునందు నాటకమునకు మిక్కిలి ప్రాధాన్యము కలదు ఇది రసదృష్టితో పల్కిన భాషణమే అట్టి నాటకమునకు లక్షణము వ్రాయుటకు పూర్వము నాటకములే లే వనుట హేతు భాంగికార్యము కాజాలదు. భరతునికి పూర్వ ముండదగిన నాటకసాహిత్యము భాసుని నాటకములు తప్ప తక్కినవి కానరావు. ఇంకను ఇతరుల నాటకము లున్నచో కాలగర్భమున కలసిపోయి యుండును. కాన దొరకి నంతవరకు భాసుని నాటకములే భరతుని లక్షణమునకు లక్ష్యములుగ నిల్చియుండునని యూహింప బడినది

భ ర తు డు – ము ని

రససిద్ధాంతమును ప్రవచించిన భరతునికి పూర్వము లక్ష్యభూత మైన సాహిత్యము పుష్కలముగ నున్నది. మేధావులును పుష్కలముగ నుండియుందురు మరి యట్టిచో వారి వివేచనములు గాని సిద్ధాంతములు గాని లేవలేదా? లేక వారు సాహిత్యరసవివేచనము చేయలేదా? వారి కట్టి నైపథ్యము లేదా? అట్టి వివేచనాత్మకనైపథ్యము భరతునకే గలదా? అను సంశములిచట ప్రస్తావనార్హములు.

ఇతరుల కట్టి శక్తి లే దనుటకంటె భరతునిలో నట్టి శక్తి పుష్కలముగ నుండుటయే యట్టి వివేచనము నొనరించుటకు కారణ మనుట సమంజసము. భరతుడు మనీషిమాత్రుడు కాడు మహర్షి కూడ. మహర్షులు బ్రహ్మానందసాధనము చేయువారు ఆ యానందసాధనమునకు వారు నిత్యము యత్నము చేయుదురు. అది వారి కనుభవపూర్వమై యుండును అట్లే భరతుడు మహర్షి యైన వాడు. కావుననే తరువాతి కాలమున అలంకారశాస్త్రమునందు అతడు ముని శబ్దవాచ్యుడైనాడు. బ్రహ్మానందసాధనాత్మక మైన నైపథ్యము అతనికి కలదు. అంతియగాక యతడు సాహిత్యవేత్త అభ్రదచిత్తుడు. లోకజ్ఞుడు లోకస్వభావ మెప్పుడును సుఖైకకాంక్షియై యుండును. కాని లోకము దుఃఖ భూయిష్ఠము యట్టి లోకము నుద్ధరించుటకు తన కడ నొక సాధన మున్నది. ఆ బ్రహ్మానంద... కల్గింప జేయు తపశ్చర్య అది సామాన్యు లాచరింప వీలులేనిది. సామాన్యప్రజ కట్టి

శక్తి చాలదు. కావున వారి నుద్ధరించుటకు తన కడనున్న రెండవ సాధన మేమేని యుపకరించునేమో యని వివేచన మారంభించినాడు. ఆ యుపకరణము సాహిత్యము. సాహిత్యమువలన ఆనందము పొందదగునా యని వివేచన మొనర్చినాడు. మార్గము దొరకినది. యోగులు పొందు ఆనందముతో సదృశ మైన ఆనందము సాహిత్యముఖమున పొందదగు నని నిశ్చయమునకు వచ్చినాడు. దానికి రస మని పేరు పెట్టినాడు. ఇచట బ్రహ్మానందముకై యోగు లొనరించు ప్రయత్నమును తత్సదృశ మైన సహృదయభావనమునకు గల సాదృశ్యము నించుక పరిశీలింప వలయును.

అ ను భ వ వి ధా న ము

యోగులు మహర్షులు బ్రహ్మానంద మనుభవించుచున్నట్లు చరిత్రలు, సంప్రదాయము నుడువుచున్నవి. వారు ఆనందము పొందు విధానమునకును, సామాజికుడు రసానందము పొందు విధానమునకును పోలికలు కలవు. చిత్తవృత్తి మిగుల చంచల మైనది. ఇంద్రియముల ద్వారమున మనస్సు అనేక తృష్ణలను పెంచుకొనుచుండును. వానికొరకై యత్నించుచుండును. లౌకికవిషయాసక్తి మనస్సునకు మిగుల ప్రబలుచుండును. అట్టి మనస్సును బంధించి ఆత్మప్రవేశ మొనరించి బ్రహ్మానంద మనుభవించువారు యోగులు. మనస్సునకు బాహ్యపరిధిలో ఇంద్రియము లుండును. మనస్సునకు దాకాశ మధికముగ నుండును. ఈ మనస్సును నిరోధించి అంతర్ముఖ మొనరింప వలయును. ఈ మనస్సునకు లోపల భాగమున ఆనందధామ మైన ఆత్మ యుండును. అది స్వయంప్రకాశమై యుండును. అజ్ఞానముచే ఆవరింపబడి యుండును. దానిలో ప్రవేశించుటకు ఒకే ఒక పెద్ద ద్వార మున్నది. అది మనస్సునకు వెనుక భాగమున కలదు. మనస్సునకు బహిర్ముఖత్వము, పురోభాగిత్వమే కాని అంతర్ముఖత్వము పశ్చాద్భాగిత్వము అరుదుగా నేర్పడును. ఈ అంతర్ముఖత్వము సిద్ధించుటకే యోగులు సాధన మొనరించు చుందురు. మనస్సునకు ఈ అంతర్ముఖత్వము సిద్ధింపజేయుటయే చిత్తవృత్తినిరోధ మని శాస్త్రకారులు పేర్కొనిరి. "యోగశ్చిత్తవృత్తినిరోధః" అని శాస్త్రము నుడువుచున్నది. యోగులు మనస్సును బహిర్ముఖము కాకుండ నిరోధింతురు. అనగా ఇంద్రియములనుండి బహిర్గతము కానీయరు. మనస్సునకు ఇంద్రియములకు నడుమనున్న మార్గమును బంధింతురు.

అపుడు మనస్సు స్వకీయ మైన ఆకాశమున మాత్రము పరిభ్రమించును. యోగు లపుడు మనస్సును అంతర్ముఖము చేయ యత్నించుదురు. అట్లు మనస్సు బాహ్య విషయపరిజ్ఞానమును వదలి వెనుకనుండి ఆత్మయందు సంలీన మగును. ఆత్మ పరబ్రహ్మస్వరూపము నందధామము గదా! అపు డది బ్రహ్మానంద మనుభ వించును. బాహ్యవిషయస్పర్శ ఏ మాత్రము ఉండదు. ఇట్లు సాధన చేయుటచే యోగులు చాలాకాలము మనస్సును ఆత్మయందు లగ్న మొనర్చి యానందము నొందగల్గుచున్నారు. ఇట్లే రసానందము నయితము ననుభవింతురు. మనస్సు నకు రెండుభాగము లుండును. ఊర్ధ్వభాగము, అధోభాగము. ఊర్ధ్వభాగమును ప్రాపించినచే గాని యోగానందము లభ్యము కాదు. అట్లు మనస్సు ఊర్ధ్వభాగ మును ప్రాపింప నక్కరలేకయే ఆనందధామమును ప్రాపించు విధానమే రసానుభవ విధానము. ఈ ఆనందము పొందుటకు ఇంద్రియములు ఉపరతములు కానక్కర లేదు. బాహ్యవిషయశ్రవణ దర్శనములు ఆటంకములు కావు. సరికదా పోషక ములు బహిర్ముఖ మైన మనస్సును ఈ యింద్రియజ్ఞానము భావనాస్థితికి కొని పోవును. మనస్సునకు సహజముగ భావనాశక్తి గలదు. ఆ శక్తి నుద్బుద్ధ మొనరించునవి బాహ్యము లైన విభావాదులు. ఆ భావనాశక్తిచే మనస్సు భావ సూత్రమున సంలీన మగును. ఇట్టి స్థాయిభావ సూత్రములు మనసున వ్యాపించి ఆత్మలోనికి ప్రవేశమును కల్గియున్నవి. ఆ భావసూత్రములు ప్రవేశించి నంతనే వ్యభిచార్యాదులు తమతమ శక్తి ననుసరించి మనస్సును ఆనందధామమైన ఆత్మలో ప్రవేశపెట్టుటకు ప్రేరకము లగును. దీనినే చర్వణ మనుచున్నాము. భావసూత్రము నందలి మనస్సును ఆత్మలోనికి ప్రవేశించుటకు బహిర్భాగమునుండి వ్యభిచార్యా దులు ఒత్తిడి చేయును. అపుడు మనస్సు ఆనందధామమును ప్రవేశించుచున్నది. వెనుకనుండి యొత్తిడి యున్నంతకాలము అనగా చర్వణము జరుగు చున్నంత కాలము మనస్సు ఆనందము ననుభవించును. అపుడు దానికి బాహ్యవిషయపరి జ్ఞాన ముండదు. కాని స్థాయిభావ సూత్రము లుపాధిభూత ములై యుండును. వాని చర్వణ ఎపుడు లోపించునో అపుడు మరల మనస్సు భావసూత్రమునుండి యథా స్థానమును చేరును. బహిర్ముఖ మగును. ఈ ఆనందానుభవసమయమున ఇంద్రి యము లుపరత మగుట లేదు, సరికదా ఇంద్రియజ్ఞానముచే కల్గిన పోషణచే, చర్వణచే మనస్సు ఆనందము నొందుచున్నది. కావున బ్రహ్మానంద రసానందములు సమానములే యయ్యును మార్గవిషయమున భేదిల్లుచున్నవి.

ఆనందము సర్వప్రాణిసామాన్యము :

మానవుడు రసానందము పొందు విధానము ఇచ్చట సూచింపబడినది. ఇట్టి యానందము నితరప్రాణులు పొందగలవా? లేవా? యను ప్రశ్న యుదయించును. మానవుడు భాషావేత్త, శబ్దార్థ పరిజ్ఞాత భావనా సౌలభ్యము కలవాడు. కావున సాహిత్యము నాశ్రయించి యానందమును పొందుచున్నాడు. ఇతర ప్రాణులకు మనస్సు ఉన్నను, ఆత్మయున్నను భావనావిశేషము, భాషాప్రాగల్భ్యము, సహితము కాదు. కావున నవి సాహిత్యము నాశ్రయించి యానందమును పొందజాలకున్నవి. అయ్యును అవి ఆనందమునకు దూరము కాలేదు. సంగీతము వలన అవి ఆనందమును అనగా రసానందమునే పొందుచున్నవి. సంగీతము ఆపాతమధురము. సాహిత్యము ఆలోచనామృతము.

సంగీత మపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయమ్
ఏక మాపాతమధుర మన్య దాలోచనామృతమ్ ॥

అని కదా ఆర్యోక్తి. వాని కాలోచించు శక్తి లేదు. అనగా భావన లేదు మనము భావన వలన ఆనందామృతమును గ్రహించుచున్నాము. సంగీతమున భావన అక్కరలేదు. నాదము చెవిలో పడినంతనే మనసు తన్మయత చెందును. దానికి స్వర లయా పరిజ్ఞాన మక్కరలేదు. సాహిత్యమున కైనచో శబ్దార్థ పరిజ్ఞాన మావశ్యకము రాగతాళాదులు తెలియనివారు సయితము శ్రావ్యమైన సంగీతమును విని అనిర్వచనీయమైన ఆనందము ననుభవించుచున్నారు. ఆ సమయమున విగళిత వేద్యాంతర మైన యొకానొక యనుభవ విశేష మేర్పడుచున్నది. అట్టి సంగీతము నుండి పొందదగిన యానందమును సయితము రస మనవచ్చును. కావుననే -

"శిశు ర్వేత్తి పశు ర్వేత్తి వేత్తి గానరసం ఫణీ"

అని గానము రసముగా పేర్కొనబడినది. ఇది సర్వప్రాణి సులభ మయిన శక్తి కావుననే కాళిదాసు సయితము.

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి య త్సుఖితోఽపి జన్తుః"

అని 'జన్తు' పదమును సాభిప్రాయముగ వాడినాడు.

ఇచట నొక విశేషము. సాహిత్యమునుండి పొందదగిన యానందమునకు విధాన మంతయు స్పష్టముగ నుండును. మార్గము స్పష్టముగ తెలియును. కారణము స్పష్ట మైన భాష, స్పష్ట మైన భావనము, విభావాను భావాదులు, వీని పరిపోషణము, ఆవి కొంత విశ్లేషణ మొనరించు విధానము కల్గియుండుట సంగీత మట్టిది కాదు. శ్రావ్య మైన నాదము చెవిని బడి నంతనే మనస్సు ఆనంద ధామమును చేరుచున్నది. దీనిలో విశ్లేషణము సాధ్యము కాదు. కావుననే ఆపాత మధురము. ఆపాతమధురము — ఆలోచనామృతము ననుటలో నొక విశేషము కలదు. మధురము అని గుణమును, అమృతము అని గుణిని ప్రయోగించినాడు గుణము కంటె గుణి విశిష్ట మైనది. సామాన్యముగ తియ్యని పదార్థములను మధుర మైనవని యందుము. అమృత మని మిక్కిలి తియ్యనైన దానినే యందుము. సాహిత్యముయొక్క వైశిష్ట్యమీ పోలికలో స్పష్టముగా గోచరించుచున్నది. అమృత శబ్దోపాదానమునే సాహిత్య పాథోనిధి మథనము, సారభూత మైన రసామృతము కూడ స్ఫురించు చున్నవి

గానరసమును తిర్యక్కులు సయితము ననుభవింప గలవని ఈ క్రింది పద్యము సాక్ష్యమిచ్చుచున్నది -

ముదితా మోములు మీది కెత్తుకొని రోమంథంబు సారించి హ్రా
త్కమలాగ్రంబులఁ గృష్ణు నిల్పి మురళీగానామృతశ్రేణిక
ర్ణములం గ్రోలుచు మేత మాని గళితానందాశ్రులై చిత్రితో
పమలై గోవులు సూచుచున్న వవిగో పద్మాక్షి! వీక్షించితే

దీనికి వేదవ్యాస వి మూల మిట్లున్నది -

గావశ్చ కృష్ణ ముఖనిర్గతవేణుగీత
పీయూష ముత్తభితకర్ణపుటైః పిబన్త్యః।
శావాః స్నుత స్తనపయః కబలాః స్మ తస్థుః
గోవిన్ద మాత్మని దృశాశ్రుకలాః స్పృశన్త్యః॥

(భాగ. ద. పూ. 21 అ. 13)

రససిద్ధాంతమునకు లక్ష్యభూతము లైన యిట్టి శ్లోకములే భరతుని రసలక్షణ నిర్దేశమునకు ప్రేరకములు పోషకములు నైన ననుట సమంజసము.

రసానందము – ఇంద్రియములు

మనస్సు ఇంద్రియములవలన రసానంద మనుభవించుచున్నది గదా! ఆ ఇంద్రియములు లేవి? ఎన్ని ఇంద్రియములు రసానందము నీయగల్గినవేవి? లేక కొన్ని యేవి? అనునది యిట పరిశీలనార్హము.

సామాజికుడు నాటకమునందు చక్షురింద్రియము వలనను, శ్రవణేంద్రియము వలనను ఆనందమును బొందుచున్నాడు. కావ్యపఠనావసరమున భావుకుడైన పాఠకుడు నిర్మలమకురహృదయుడై శ్రవణేంద్రియమువలన నానందమును బొందుచున్నాడు. జిహ్వేంద్రియము రెండు వ్యాపారములు నిర్వహించుచున్నది. అందు భోజనవ్యాపారముచే రసానందము నందీయలేదు. వ్యాహారవ్యాపారముచే జిహ్వా పాక్షికమగు రసానందము నందీయగలదు. అది పరోపకృతిశీలమైనది. జిహ్వా వాగుచ్చారణముచే నితరులకు రసానందమును కల్గించును. ఇతరులకును శ్రవణేంద్రియ మట నావశ్యకమగుచున్నది. కావున శ్రవణేంద్రియము వలన రసానంద మనుభవించుటకు జిహ్వా ప్రేరకమగుచున్నది. కావున పాక్షిక మనబడినది. మిగిలిన రెండింద్రియములు ఘ్రాణము చర్మము.

ఘ్రాణేంద్రియద్వారమున సయితము నానందము బొంద వీలు కలదు. మల్లె, సంపంగి మున్నగు పుష్పములు మూర్కొనినపుడును, కస్తూరి మున్నగు సుగంధ ద్రవ్యముల పరిమళము సోకినపుడును తన్మయత్వ మావహిల్లుచున్నది. స్వారోచిష మనుసంభవమునందు ప్రవరునకు మగువ పొలుపు తెలుపు మారుత మొలసినది

మృగమదసౌరభవిభవ
ద్విగుణిత ఘనసారసాంద్రవీటీగంధ
స్థగితేతరపరిమళమై
మగువ పొలుపు దెలుపు నొక్క మారుత మొలసెన్

ఇట్లు ఘ్రాణేంద్రియమువలన అనిర్వచనీయమైన తన్మయత్వము కల్గుచున్నట్లు తెలియుచున్నది.

త్వగింద్రియమువలన సయితము ఆనందమును పొందినట్లు సాహిత్యము నుడువుచున్నది. ఉత్తరరామచరితమున రాముడు సీతాస్పర్శముచే పొందిన యమ మీతి ఆనందధామమును ముట్టినది కదా.

వినిశ్చేతుం శక్యో న సుఖ మితి వా దుఃఖ మితి వా
ప్రమోహో నిద్రా వా కిము విషవిసర్పః కిము మదః
తవ స్పర్శే స్పర్శే మమ హి పరిమూఢేంద్రియగణో
వికారశ్చైతన్యం భ్రమయతి సమున్మీలయతి చ.

ఇట్లే ఆంధ్రమహాభారతమున దుష్యంతునకు శకుంతల తన్నెరిగించు సమయమున తనయుని నాలింగన మొనరింపు మని నుడువు సందర్భమున పుత్రాలింగన సౌఖ్యమెట్టిదో వివరింపబడినది.

విపరీతప్రతిభాష లేమిటికి సర్వేనాథ! యీ పుత్రగా
త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహారకర్పూరసాం
ద్రపరాగప్రసరంబు చందనము నాంద్రజ్యోత్స్నయుంబుత్రగా
త్రపరిష్వంగము నట్లు జీవులకు హృద్యంబే కడుం శీతమే.

ఇట్లు మనస్సును సర్వేంద్రియములును సంవేదనము సాధనమును వేరనులుచున్నవి. కాని వాని వాని శక్తులను బట్టి ఆనందవిశేషమున తారతమ్యము లేకపోదు. ఇట్టి విశిష్టమైన యానందము నందింపగల సాహిత్యములో రసవివేచన మెట్లు జరిగినదో పరిశీలింతము.

భ ర తు డు - ర స సి ద్ధా ం త ము

భరతుని దృష్టి నాట్యమునందు నాటినది. అందు రసములు ప్రధానము లని మాత్ర మతడు వచించెను రస సూత్రమును వివరించుచునే ఉపోద్ఘాత పూర్వకముగ నతడు 'న హి రసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే' అని కంఠోక్తిగ చెప్పినాడు మరియు భరతు డొకచో రసశబ్దమును ప్రధాన శబ్దవ్యపదిష్ట మొనర్చెను నాట్యమునందు రసమునకు గల ప్రాధాన్యమునే ఇట్లు భరతుడు వ్యంగ్య మర్యాదతో తెల్పెను. ఇచట నొక విషయము గమనార్హము. ఆనంద వర్ధనుడు ధ్వని సిద్ధాంతమును ప్రతిపాదించినాడు. ఆతనికి సమకాలమునందే యాతని సిద్ధాంతమునకు అభావవాదులు బయలుదేరిరి. వారి యభిప్రాయములను ఖండించి తన సిద్ధాంతమును

ప్రతిపాదించుకొన వలసిన స్థితి ఏర్పడినది ఆనంద వర్ధనునకు. అంతియ గాక ఇతని తరువాత మహిమభట్టు వ్యక్తి వివేకమున ధ్వని మతమును పూర్తిగ ఖండించినాడు. ధ్వనిసిద్ధాంత మక్కరలేదనియు అది యంతయు తార్కికుల అనుమానమునందే గతార్థ మగు ననియు సోపపత్తికముగ నిరూపించినాడు. (ఇది సహృదయామోద మును సంతరించు కొనెనా ? యనునది ప్రత్యేక ప్రశ్న.) ఇట్టి అవాదముల వెడద భరతుని రససిద్ధాంతమున కిసు మంతయు కళ్లలేదు. పైగా ధ్వనిసిద్ధాంతమును ఖండించి యనుమానమున సంతర్భవింప జేసిన మహిమభట్టు సయితము రససిద్ధాం తము నంగీకరించినాడు. అనంతర కాలమున రుచిభేదమును పురస్కరించుకొని యాలంకారికులు ఇతర సిద్ధాంతము లన్నియు రస సిద్ధాంతమును తిరస్కరించినవి కావు. అనుషంగికముగ నైనను అంగీకరించినవే. ఉనికిని మాత్రము త్రోసిపుచ్చ లేదు. మానవుడు, ఒక్క మాటలో చెప్పవలె నన్నచో మనస్సు ఉన్నంతకాలము సాహిత్యమున రస సిద్ధాంతమునకు క్షతి లేదు.

"విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః" అని భరతుడు రస నిర్వచన మొనరించినాడు. ఈ సూత్రమే యాలంకారికు లందరకు రస నిర్వచన మున ప్రమాణ మూర్ధన్య మైనది. అతడు నాట్యశాస్త్రము 6 వ అధ్యాయమున రసమునుగూర్చియు, రసభేదములను గూర్చియు, జన్యజనకరసములను గూర్చియు, రసవర్ణదైవతములను గూర్చియు ప్రపంచించెను. ఏడవ అధ్యాయమున భావ ములను గూర్చి కూలంకష మైన చర్చ యొనరించినాడు. ఆనాడు అతడు చెప్పిన భావములకు వాని సంఖ్యకు నీనాటివరకును మార్పు లేకుండుట గమనార్హము.

భరతుని నాట్యశాస్త్రము తర్వాత కొంతకాలము వరకును రస విషయక మైన స్వతంత్రగ్రంథము రాలేదు. అందరును నాట్యశాస్త్రమునకు, తన్మూలమున రస సిద్ధాంతమునకు వ్యాఖ్య వ్రాయ బొరకొనినవారే. నాట్యశాస్త్రమునకు వ్యాఖ్యానములు చాలమంది వ్రాసినట్లు తెలియుచున్నది. అవి యన్నియు కాలగర్భమున కలసి పోయినవి. కాలమున కెదురీది భారతీయుల అదృష్టమునకు ప్రతీకగా నిలిచినది అభినవగుప్తుని వ్యాఖ్య. ఇది కవిగాంపరాక్రమకో ఆంధ్రమునకీర్తికి పతాకగా నిలిచి వెలసినది. అతఃపూర్వము నాట్యశాస్త్రమునకు భట్టోద్భటుడు, భట్టలోల్లటుడు మాతృ గుప్తుడు, శంకుకుడు, భట్టనాయకుడు. భట్టయంత్రుడు మున్నగువారు వ్యాఖ్యలు వ్రాసినట్లు అభినవుని వ్రాతలే నుడువుచున్నవి. అభినవునివ్యాఖ్య వలననే భట్టలో ల్లటుడు, శ్రీశంకుకుడు, భట్టనాయకుడు మున్నగువారి యభిప్రాయములు సూచనా

మాత్రములుగ గోచరించుచున్నవి. అందు మొదట పేర్కొనదగినవాడు భట్టలోల్లటుడు.

భ ట్ట లో ల్ల టు డు :-

ఇతడు మీమాంసకుడు. భరతుడు రసముల స్థితిమాత్రము వచింపగా భట్టలోల్లటుడు రసముయొక్క స్థానమును వచింప నారంభించెను. ముఖ్యముగా రామాద్యనుకార్యులయందు రస ముండునని యితడు వ్యాఖ్యానించినాడు. అనుసంధాన బలముచే అనుకర్తయందు సయితము భాసిల్లునని యితని ఆశయము. ఇతని మతమున రసము ఉత్పాద్యము. రససూత్రమందలి సంయోగపదమునకు ఉత్పాద్యోత్పాదక భావము, గమ్యగమకభావము, పోష్యపోషకభావము అర్థములు. నిష్పత్తి పదమునకు ఉత్పత్తి, అభివ్యక్తి, పుష్టి అని యర్థములు.

రసము లనంతము లయ్యును పార్షదప్రసిద్ధిని బట్టి ఎనిమిది మాత్రమే ప్రయోజ్యము లని యితని అభిప్రాయ మైనట్లు ఈ క్రింది యభినవభారతి వంక్తులు నుడువుచున్నవి.

తేనానన్త్యేఽపి పార్షదప్రసిద్ధ్యా ఏతావతాం ప్రయోజ్యత్వ మితి యద్భట్టలోల్లటేన నిరూపితం తదవలేపనాపరామృశ్యేత్యలమ్"

(ప్రథమభాగము. పు 299)

సర్వభావములును రసస్థితిని పొందదగు నని ఇతని అభిప్రాయ మైనట్లు తోచును. ఇట్లితడు రసము యొక్క స్థానమును రససంఖ్యను గూర్చి వివరించి నట్లు ఉపలబ్ధ మైన అభినవభారతివలన తెలియుచున్నది.

శ్రీ శం కు కు డు :-

ఇతడు నైయాయికుడు. ఇతడును రససిద్ధాంతవిషయకముగ స్వతంత్రగ్రంథ మేదియు వ్రాయలేదు కాని నాట్యశాస్త్రమునకు వ్యాఖ్యానము వ్రాసినాడు. రససూత్రము నితడు వ్యాఖ్యానము చేయుచు రసము అనుకర్తృనిష్ఠమని తెల్పినాడు. ఇతడు సంయోగపదమునకు గమ్యగమకభావము లేక జ్ఞాప్యజ్ఞాపకభావము అని అర్థము చెప్పినాడు. నిష్పత్తిపదమునకు అనుమితి, జ్ఞప్తి యని అర్థము చెప్పినాడు.

ఈతని సిద్ధాంతము అనుమితి వాదముగా ప్రసిద్ధి వహించినది. ఇతడు ముఖ్యముగా రసమును సామాజికదృష్టితో నిరూపించెను. సామాజికుడు నటుని యభినయము వలన రసము ననుమానించు నని యీతని యభిప్రాయము. రత్యాదులు వాచ్యములు కారాదని గమ్యమానములే కావలయునని యీతడు వచించెను. కావుననే భరతుడు రససూత్రమున స్థాయిపదమును ప్రయోగింపలే దనియు వ్యాఖ్యానించినాడు.

రు ద్ర టు డు :-

కాలక్రమము ననుసరించి చూచినచో శంకుకుని తర్వాత రుద్రటుడు పేర్కొనదగినవాడు. ఇతడు కావ్యాలంకారమను స్వతంత్రగ్రంథము వ్రాసినాడు. విజ్ఞులకిది యలంకారప్రధాన మైన గ్రంథమైనను రససిద్ధాంతమునకు ఇత డెంతయో పుష్టి చేకూర్చినాడు. భరతుడు రసములను నాట్యపరముగా నిర్వచించినను రుద్రటుడు మున్ముందు కావ్యపరముగ ప్రవచించినాడు.

"తస్మా త్తత్కర్తవ్యం యత్నేన మహీయసా రసై ర్యుక్తమ్"

(కావ్యాలంకార. 12.

రుద్రటుడు రససిద్ధాంతమునకు కొనర్చిన పుష్టిని అంశాత్మకముగ నిట్లు పేర్కొనవచ్చును.

1. భరతుడు అష్టరసములనే పేర్కొనినాడు. అప్పటికే శాంతరసము కూడా నాట్యశాస్త్రమున చేర్పబడినదనుకొన్నచో 9 రసములను భరతుడు చెప్పినట్లగును. కాని రుద్రటుడు ఈ తొమ్మిది రసములనే గాక ప్రేయోరసమును కూడ పేర్కొనినాడు.

శృంగారవీరకరుణాః బీభత్సభయానకాద్భుతా హాస్యః।
రౌద్రః శాన్తః ప్రేయా నితి మన్తవ్యా రసా స్సర్వే॥

(కావ్యాలంకారము 12-3)

రససంఖ్యను పెంచుటలో ప్రాకారము దుట్టినవాడు రుద్రటుడని చెప్పవచ్చును.

2 భరతుడు శృంగారమును సంభోగ, విప్రలంభము లని మాత్రమే పేర్కొనినాడు రుద్రటుడు సంభోగశృంగారమునందు నాయికానాయకుల సంభోగమే

ప్రధానము కాదనియు ఆలోకన, వచనాదులు నయితము సంభోగ శృంగారమునే సూచించు ననియు వివరించినాడు. భరతుడు విప్రలంభమునకు లక్షణము వచింపలేదు. మున్ముందు విప్రలంభశృంగారమునకు రుద్రటుడే లక్షణము వివరించినాడు. తరువాత భోజుడు ఈ లక్షణమును మరింత దీప్తిమంత మొనర్చెను. విప్రలంభము నాల్గు విధము లని విభాగించిన మొదటి యాలంకారికు డితడే ఇతడు విప్రలంభము 1. ప్రథమానురాగము 2. మానము 3. ప్రవాసము 4. కరుణము అని నాల్గువిధములుగ విభజించెను.

"అథ విప్రలంభనామా శృంగారోఽయం చతుర్విధో భవతి ప్రథమానురాగ, మాన, ప్రవాస, కరుణాత్మకత్వేన"

(కావ్యాలంకారము 14-1)

ఇట్లు భేదములను వచించుటే గాక వానికి సోదాహరణముగా నిర్వచించినాడు.

ఇట్లే వీరరసమందు మూడు విభాగములు తెల్పినాడు. 1. యుద్ధవీరము 2. ధర్మవీరము 3. దానవీరము. ఈ భేదములను అర్వాచీనులు ఇంకను కొన్ని టిని ప్రపంచించినారు.

3 భరతుడు శృంగారరసమును మాత్రమే నిర్వచించినాడు. కాని రుద్రటుడు శృంగారరసాభాసమును నయితము పేర్కొనెను. తరువాతి ఆనందవర్ధనాదులకు ఈతని శృంగారాభాస నిర్వచనమే మూల మైనట్లు తోచును.

శృంగారాభాసః స తు యత్ర విరక్తేపి జాయతే రక్తిః
ఏకస్మి న్నపరోఽసౌ నాభాష్యేషు ప్రయోక్తవ్యః

(కావ్యాలంకారము 14. 36)

నాయికానాయకులు పరస్పర మనురక్తు లైనచో నే శృంగార మనబడును. అట్లు గాక నాయికానాయకులలో ఒకరికి మాత్రమే అనురాగ ముండి మరియొకరికి లేనపు డది శృంగారాభాస మనబడును. ఈ శృంగారాభాసము ఉత్తములయందు ప్రయోగింపరగదు. ఈ నిర్వచనమే "ఏకత్రైవానురాగ శ్చేత్" ఇత్యాదిలక్షణముగా రూపుదిద్దుకొని యుండును.

ఇంతగా రససిద్ధాంతమునకు పుష్టి చేకూర్చిన వా రగుటచేతనే అభినవగుప్తునకు నయితము అభిమానపాత్రు డైనాడు. రుద్రటుడు భావలంకారమున కిచ్చిన

యుదాహరణములు రెంటిలో ఒకటి మమ్మటు డుదహరింపగా మరియొకటి యతి నవుడు సుదాహరించెను.

ఇతడు రసములకు ఆనంత్యము నంగీకరించినవాఁడయ్యును దశరసములనే పేర్కొనినాడు.

“రసనా ద్రసత్వ మేతేషాం మాధుర్యాదీనా మివోక్త మాచార్యైః
నిర్వేదాదిష్వపి తన్నికామ మస్తీతి తేఽపి రసాః”

అపి నిర్వేదాదులగు వ్యభిచారులు నయితము రసములు కావచ్చు నని యంగీకరించినాడు. రసానంత్యవిషయమున నితడు భట్టలోల్లటుని సిద్ధాంతము ననుసరించినట్లు తోచును.

రుద్రభట్టు :—

రుద్రుడు, రుద్రటుడు, రుద్రభట్టు అను పేరులతో మరియొక అలంకారికుడు సుమారు ఇదే కాలమున కన్పట్టుచున్నాడు. వీరిద్దరు నొకరే యని కొందరు వచించుచున్నారు. ఏమైనను వారు సిద్ధాంతమునను గూర్చిన దృష్టిమాత్రమే యిచట పర్యాలోచింపదగినది. ఇతడు శృంగారతిలక మను గ్రంథమును వ్రాసినాడు. పేరునుబట్టియే ఇది శృంగారమునకు ప్రాధాన్య మిచ్చినట్లు అవగత మగుచున్నది. హేమచంద్రుడు మున్నగువారు శృంగారతిలకమును పేర్కొని యున్నారు. ఇది మూడు పరిచ్ఛేదముల గ్రంథము. మొదటి పరిచ్ఛేదమున నవరసములు, భావములు, నాయికానాయకభేదములు తెల్పబడినవి. రెండవ పరిచ్ఛేదమున విప్రలంభశృంగారము దశావస్థలు, షడుపాయములు వివరింపబడినవి. మూడవ పరిచ్ఛేదమున ఇతరరసములను నాల్గువృత్తులను పేర్కొనెను. రుద్రభట్టు తాను రసములను కావ్యపరముగ జెప్పితి నని వక్కాణించినాడు

ప్రాయో నాట్యం ప్రతి ప్రోక్తా భరతాద్యై రసస్థితిః
యథామతి మయాప్యేషా కావ్యం ప్రతి నిగద్యతే.

(శృం. తి. 1-5)

శృంగారతిలకము లేనిదే రసాగమమే లేదని చెప్పిన యాతని గ్రంథమందలి చివరి శ్లోకము మనోహరముగ నున్నది.

కన్యా కావ్యకథాకీర్ణ వైదగ్ధ్యే కో రసాగమః
కిం గోష్ఠీమండనం హన్త శృంగారతిలకం వినా॥

శృంగార రసాభాసమునకు ప్రఖ్యాతలక్షణ మైన ఈ కింది శ్లోకము శృంగార తిలకమునందలిదే.

ఏకత్రైవానురాగ శ్చేత్ తిర్యఙ్మ్లేచ్ఛగతోఽపి వా
యోషితో బహుసక్తి శ్చే ద్రసాభాస స్త్రిధా మతః॥

ఆ నం ద వ ర్ధ ను డు -

రుద్రటుని తర్వాత పేర్కొనదగిన రసపోషకుడు ఆనందవర్ధనుడు. ఇతడు వ్రాసిన గ్రంథము ధ్వన్యాలోకము. సాహిత్యలోకమున మిక్కిలి ప్రచారము నందిన గ్రంథము. ధ్వనిసిద్ధాంతమును స్థాపించిన వా డితడు. ఇతడు ప్రపంచించినది ధ్వనిసిద్ధాంత మయ్యును రసమునకు అనంత ప్రాధాన్య మిచ్చినాడు. వస్తు, అలంకార, రసధ్వనులలో రసధ్వనికే అత్యంతప్రాముఖ్యము నిచ్చినాడు. వీని తరువాత నుండి రసము, ధ్వని రెండు సిద్ధాంతములును అన్యోన్యాశ్రితములుగ వెలసినవి.

1. కవి యైనవాడు రసమునందే దృష్టి నిల్పవలె నని శాసించినాడు

వ్యంగ్యవ్యంజకభావేఽస్మిన్ వివిధే సంభవత్యపి
రసాదిమయ ఏకస్మిన్ కవి స్స్యాదవధానవాన్

(ధ్వన్యా. 4-5)

2. కావ్యమున ఇతివృత్తము నందుకంటె రసమునందే కవి శ్రద్ధవహింపవలెననియు ఇతివృత్తము ప్రాతదైనను రసపరిగ్రహముచేత కావ్యమున నూత్నముగ భాసిల్లు ననియు పేర్కొనినాడు.

దృష్టపూర్వా అపి హ్యర్థాః కావ్యే రసపరిగ్రహాత్
సర్వే నవా ఇవాభాన్తి మధుమాస ఇవ ద్రుమాః

ద్రుమములు ప్రాచీనములే యయ్యును మధుమాసములో నూత్నముగా భాసించి నట్లు కావ్యమున రసపరిగ్రహము నూత్నముగా భాసిల్లు నని రసమునకు ప్రాధాన్యమును భంగ్యంతరమున నుపదేశించినాడు.

3. భరతాదులు రసములను కేవలము పింగడించి లక్షణనిర్దేశము నొనరించిరి. ఇతడు రసాస్వాదమునకు రసపరిపోషణమునకు అనువైన సామగ్రి నంతయు వివరించినాడు.

రసవ్యంజకనియమములను వివరించినాడు. కావ్యమున రస మభివ్యక్త మగుటకు పాటింప వలసిన విషయములను పేర్కొనినాడు. అలంకారనిబంధనము నయితము రసానుగుణముగనే ప్రయోగింపవలెనని యాతని శాసనము.

4. రసము లక్ష్యక్రమ మనియు, అది ఒకానొకచో సుప్తిఙాదులచే నయితము ద్యోత్య మగు ననియు వచించినాడు. సుప్ప్రత్యయములు, తిఙ్ప్రత్యయములు, వచనము, సంబంధము, కారకశక్తి కృత్తు, తద్ధితము, సమాసము అను వానిచే అసంలక్ష్యక్రమము ద్యోత్యమగుచుండును.

సుప్తిఙ్వచనసంబంధై స్తథా కారకశక్తిభిః
కృత్తద్ధితసమాసైశ్చ ద్యోత్యోఽలక్ష్యక్రమః క్వచిత్॥

(ధ్వన్యా. 3-16)

5. రసవిరోధమును పూర్వు లెవరును వచింపలేదు. రసవిరోధములను తత్పరిహారములను నయితము ఇతడు వచించినాడు. అన్ని రసములును ఆనందదాయకములే యయ్యును, రసము పోషించి మరొక రస ముపాదేయము కావలె నన్నచో నా రెండు రసములకు అవిరోధ ముండవలె ననియు ఒకచో నా రెండు రసములు విరుద్ధములే యైనచో రెంటింటికి నడుమ మరియొక అనురూపరసవ్యవధానము ఆవశ్యక మనియు పేర్కొనెను. ఈ యభిప్రాయమునే అర్వాచీనకాలమున మమ్మటాదులు విశదీకరించిరి. (చూడుడు-రసవిరోధములు)

6. భరతుడు జన్యజనకరసములను వివరించినాడు గాని అంగాంగిరసవివేచనము స్పష్టముగా చేయలేదు. పూర్వు లెవ్వరును అంగాంగిరసవివేచన మొనరింపలేదు. అట్టి వివేచన మొనరించిన వారిలో ప్రథముడు ఆనందవర్ధనుడు.

ప్రసిద్ధేఽపి ప్రబంధానాం నానారసనిబంధనే
ఏకో రసోఽఙ్గీకర్తవ్య స్తేషా ముత్కర్ష మిచ్ఛతా

(ధ్వన్యా. 3-21)

కావ్యనాట్యములలో విప్రకీర్ణముగా అంగాంగిభావముతో పలురసములు నిబంధింపబడు ప్రసిద్ధి యున్నను ప్రబంధాతిశయత్వమునకై యీ రసములలో నొకటి అంగిగా నిబంధింపబడవలెను. రసాంతరములు అంగిరసమును మ్రింగివేయునవిగా నుండరాదు. అంగిరసపోషకము లైన రసములే అంగరసములుగా నిబంధింపబడవలెను.

7. అలంకారనిబంధనము సయితము రసపరిపోషకముగానే యొనరింపవలెననియు, అంతటను రసమే అంగిభావమును పొందవలెననియు, అలంకార మెన్నడును అంగిత్వమును పొందరాదనియు వచించుచు అలంకారవినివేశనసమీక్షను ప్రదర్శించినాడు.

వివక్షా తత్పరత్వేన నాంగిత్వేన కదాచన
కాలే చ గ్రహణత్యాగౌ నాతినిర్వహణైషితా
నిర్వ్యూఢావపి చాంగిత్వే యత్నేన ప్రత్యవేక్షణమ్

8. అన్నిటిని మించి సాహిత్యలోకమున కానందవర్ధనుడు ప్రసాదించిన విషయ మింకొకటికలదు. అది విమర్శనపద్ధతి. ప్రాచీనకాలమున సయితము ఉత్తమవిమర్శ యున్నదనుటకు తగిన సాక్ష్య మీతని ధ్వన్యాలోకము. ఏ విమర్శ యైనను కావ్యమునంతను దృష్టియం దిడుకొని తత్ప్రధాన మగు రసమును దృష్టియం దిడుకొని చేయవలెనని యీతని యాశయము. రసపరిశీలనము చేయు విధానము నానందవర్ధనుడే విశదీకరించెను. భారతమున అంగిరస మేది యని చర్చ చేసినాడు. ప్రమాణపద్ధతిలో చర్చించి భారతమందలి అంగిరసము శాంత మని నిరూపించినాడు. అద్వితీయ మైన యీతని విమర్శన ధోరణి సర్వులను ఆకర్షించును. అర్వాచీనవిమర్శకు లందరు ఈతని చర్చావిధానమునకు ముగ్ధులు కావలసినదే.

9. ప్రాచీనాలంకారికు లందరును కేవలము రసలక్షణనిర్దేశ మొనరించి సంతృప్తి చెందిరి. కాని యీతడు రసమును సోదాహరణముగ ప్రపంచించినాడు. ఆదికావ్యరచనమునకు భూమిక యైన వాల్మీకి యితివృత్తమును ఉదాహరణప్రసంగ మొనర్చినాడు. కరుణరసస్ఫోరక మైన యా యుదంతము సప్రపంచముగా నిరూపింపబడినది. రామాయణమున సయితము అంగిరసము కరుణ మని యీతని యాశయము. రసాస్వాదవిధానమును సోదాహరణముగ వివరించిన ప్రథమాలంకారికు డీతడే.

ఇట్లానందవర్ధనుడు రసమునుగూర్చి ప్రత్యేకగ్రంథమును వ్రాయకపోయి నను పలువిధముల రససిద్ధాంతమునకు పుష్టిని చేకూర్చెను. రస, ధ్వనిసిద్ధాంత ములను మిశ్రిత మొనర్చినాడు రసధ్వని ఉత్తమమైన దని నిరూపించినాడు కూడ.

భట్టతోతుడు.

ఇతడు కావ్యకౌతుకమును రచించెను. దాని కభినవుడు వివృతిని వ్రాసి నాడు. కాని ఈ రెండును ఇపు డలభ్యములు. అయ్యును ఒకినవుని లోచనము, అభినవభారతీ వ్యాఖ్యానములవలన తోతుని యభిప్రాయములు కొన్ని తెలియు చున్నవి. వానివిబట్టి అతనికి గల రసవిషయక మైన యూహలను తెలిసికొనవచ్చును.

శాంతరసవిషయమున గల పూర్వుల యభిప్రాయమును క్రోడీకరించి తద్వ్యతి రిక్తుల యభిప్రాయములను పూర్వపక్షమొనరించి శాంతస్థాపనము సిద్ధాంతీకరించిన వా డభినవుడు. అత డభినవభారతిలో శాంతరసస్థాపనము చేయకముందే యాతని గురువు భట్టతోతుడు కావ్యకౌతుకమున శాంతము సర్వరసములలోను ప్రధానతమ మని నిరూపించినాడు. ఈ విషయమును సైతము అభినవుడే ఈ క్రింది లోచన పంక్తులలో చెప్పియున్నాడు.

"మోక్షఫలత్వేన చాయం (శాంతోరసః) పరమపురుషార్థ నిష్ఠత్వాచ్చ సర్వరసేభ్యః ప్రధానతమః. స చాయ మస్మదుపా ధ్యాయభట్టతోతేన కావ్యకౌతుకే, అస్మాభి శ్చ తద్వివరణే బహుతర కృతనిర్ణయపూర్వపక్షసిద్ధాంత ఇత్యలం బహునా"

(ధ్వన్యా - లోచనము - 3-26)

ప్రీత్యాత్మక మైనదే రస మనియు, రసమే నాట్యమనియు, నాట్యమే వేద మనియు తోతుని యభిప్రాయము.

భరతుడు రసములను నాట్యదృష్టితోడనే వచించెను. భట్టతౌతుడు కావ్య ములందును ప్రత్యక్షకల్పసంవేదనము కల్గి నపుడు రసోదయ మగు ననియు, ఉద్యా నాదివర్ణనాత్మకము లైన భావములు ప్రత్యక్షములవలె స్ఫుటములై రసోత్పత్తిని కలిగించుననియు వచించినాడు.

భరతుడు "తస్మా న్నాట్యే రసాః స్మృతాః" అనినదానికి వ్యాఖ్య వ్రాయుచు అభినవుడిట్లనును.

"రససముదాయో హి నాట్యమ్, న నాట్యే ఏవ చ రసాః, కావ్యేఽపి నాట్యాయమాన ఏవ రసః, కావ్యార్థవిషయే హి ప్రత్యక్ష కల్పసంవేదనోదయే రసోదయ ఇత్యుపాధ్యాయాః. తదాహుః కావ్య కౌతుకే

"ప్రయోగత్వ మనాపన్నే కావ్యే నాస్వాదసంభవః" ఇతి
"వర్ణనోత్కలికాభోగప్రౌఢోక్త్యా సమ్యగర్పితాః
ఉద్యానకాంతాచంద్రాద్యాః భావాః ప్రత్యక్షవత్ స్ఫుటాః" ఇతిచ॥
(అభినవభారతి భా 1, పు 291-292)

మోక్షముమీద తోతుని ప్రభావము అభినవుపై ఎక్కువ పడినది. అభినవుని అభిప్రాయములకు చాలవరకు తోతుని యూహలే మూలములై యుండును. కావున రససిద్ధాంతమున కితడు పరోక్షముగా మిగుల పుష్టి నిచ్చినవారిలో నొకడు.

నాయకుడు, కవి, శ్రోత మువ్వురకును సమానమైన యనుభవము కల్గునని తోతుని యాశయము. "నాయకస్య కవేః శ్రోతుః సమానోఽనుభవ స్తతః" అని లోచనమునందు ఉపాధ్యాయుని వచనముగా కలదు. ప్రతిభానిర్వచనము "ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభా మతా" అనునది ఇతనిదే.

భామహుడు - దండి - వామనుడు :-

భరతుని తర్వాత కాలక్రమము ననుసరించి పేర్కొనదగిన యాలంకారికులు భామహుడు, దండి, వామనుడు. వీరు రససిద్ధాంతమున కంతగా పుష్టిని చేకూర్చలేదు. కాని రసవిరోధివాదులు మాత్రము కారు. రసము నానుషంగికముగ నంగీకరించినవారే వీరిలో భామహుడు, దండి, అలంకారములకు, వామనుడు రీతికి ప్రాధాన్యము నొసంగిరి.

భా మ హు డు :-

1. రసవత్ప్రేయోర్జస్వి అలంకారములను గూర్చి వచించినాడు. రసవదలంకారమున శృంగారమునకు మాత్రమే యుదాహరణ మిచ్చెను అదియు నసరిపుష్టముగ నున్నది. ఇతడు శాస్త్రము నయితము సారళ్యమును పొందుటకు కావ్యరసోన్మిళితము కవలె నని వచించినాడు.

స్వాదుకావ్యరసోన్మిశ్రం శాస్త్రమప్యుపయుఞ్జతే
ప్రథమాలీఢమధవః పిబన్తి కటు భేషజమ్॥

(కావ్యాలంకార 5-3.)

దీనినిబట్టి యీతడు రసములకు వస్తుస్థితిని మాత్రమే కల్పించినాడు కాని ప్రాధాన్య మీయలే దనుట స్పష్టము

దండి:-

ఈతడు ఎనిమిది రసములను పేర్కొనెను. రసవదలంకారమునకు శృంగారమునే గాక ఎనిమిది రసములను ఉదాహరించెను. రత్యాదుల నామములను పేర్కొనెను. విభావాదుల నుదాహరణమందు స్పష్టపరచెను. భామహునివలెనె ఈతడు రసము నానుషంగికముగ పోషించినాడు.

కామం సర్వో౽ప్యలంకారో రస మర్థే నిషించతి।
తథా ప్యగ్రామ్య తైవైనం భారం వహతి భూయసా॥

(కావ్యాదర్శ 1-62)

అలంకారము లన్నియు అర్థమున చమత్కారములను కల్గించినను (రసమును కల్గించినను) అగ్రామ్యతయే చమత్కారభారము నధికముగ వహించును.-

ఇట్లు భామహునికంటె దండి రససిద్ధాంతమునకు మరింత దగ్గరవైనాడు.

వామనుడు.-

ఇతడు రీతి రాత్మా యనినాడు. 'రీతి రాత్మా కావ్యస్య' అని యీతని సూత్రము. అయినను రసమును విడనాడినవాడు కాదు. కాంతిగుణమును నిర్వచించుచు

"దీప్తరసత్వం కాన్తిః"

(కా. సూ. 3-2-15)

అని రసము నానుషంగికముగ నంగీకరించినాడు. దీప్తరసత్వమునకు శృంగారము నుదాహరించి మిగిలిన వాని నూహలకు వదలినాడు.

ఉద్భటుడు.

వీరి తరువాత పేర్కొనదగినవారు ఉద్భటుడు. ఇతడు నాట్యశాస్త్రమునకు వ్యాఖ్యానము వ్రాసినాడు కాని అది అలభ్యము. ఇతరుల వ్రాతలను బట్టి తెలియదగిన యంశములు కొన్ని కన్పట్టుచున్నవి. భరతుడు అష్టరసములను పేర్కొనెననియు శాంతరసమును మొట్టమొదట వచించినవా డీతడే యనియు, భరతుని నాట్యశాస్త్రమున శాంతరసగ్రంథమును ప్రక్షిప్త మొనరించిన వాడీతడే యనియు కొందరి యభిప్రాయము. ఇతడు 'కావ్యాలంకారసారసంగ్రహము' అను ప్రత్యేక గ్రంథమును వ్రాసినాడు. అందు రసవదలంకారసందర్భమున నవరసములను పేర్కొనెను.

శృంగారహాస్యకరుణా రౌద్రవీరభయానకాః
బీభత్సాద్భుతశాంతాశ్చ నవ నాట్యే రసాః స్మృతాః॥

సరిగా ఇదే శ్లోకము నాట్యశాస్త్రమునందు నయితము పాఠాంతరముగ కన్పట్టుటచేతను, ఉద్భటుడు నాట్యశాస్త్రమునకు ఒక వ్యాఖ్య వ్రాసినట్లు తెలియుచుండుటచేతను ఈ శాంతరసభాగము నాట్యశాస్త్రమున నీతనిచేత ప్రక్షిప్తమయ్యెనని యూహింపబడుచున్నది. అనౌచిత్యప్రవృత్తయు లయిన రసభావము లూర్జస్వి యలంకారమగు ననియు వచించెను.

ఇట్లు భరతుని తర్వాత యాలంకారికులలో కొందరు రసమునకు ప్రాధాన్యమీయరైరి. కాని రసమును విరోధించినవారు కారు.

కుంతకుడు.

ఇతడు ప్రత్యేకప్రస్థానప్రవర్తకుడు. వక్రోక్తి నాదరించినాడు. వక్రోక్తిజీవిత మను గ్రంథమును రచించినాడు. స్వభావోక్తిని నిరసించినాడు. అయ్యును రసమును నిరసించినవాడు కాదు. ప్రకరణవశమున రసప్రసక్తిం గాంచినాడు. రసముయొక్క యునికి గుర్తించినాడు. (ఆనందము చమత్కారరూపమని, ఆ చమత్కారము వైచిత్రి ననుసరించు ననియు అది వక్రోక్తిసాధ్య మనియు నీతని తలంపు.) రసము వక్రోక్తిసాధక మని యీతని యూహ.

కవిప్రస్థానహేతువు లైన మార్గముల సూచించు నపుడును, ప్రకరణ, ప్రబంధ, వక్రతావివరణ లందును రసమును గూర్చి వచించినాడు. మరియు కథ, రసములో రసమే ప్రధానస్థాన మాక్రమించు నని వచించినాడు.

నిరంతరరసోద్గారగర్భసౌందర్యనిర్భరాః
గిరః కవీనాం జీవన్తి న కథామాత్రమాశ్రితాః॥

రసవదలంకారవిషయమున గూడా నీ ప్రసక్తి చెప్పినాడు. రసయుక్త మైనది రసవదలంకార మని వచించినాడు.

రసా పరమార్థజ్ఞాన మైన మనస్సు సంవాదసుందర మైనది అని కుంతకుని యభిప్రాయము. ఇట్లు కుంతకుడు వక్రోక్తి ప్రస్థాన ప్రవర్తకు డయ్యును రసవిరోధి కాడు.

క్షేమేంద్రుడు :

ఇతడు ఔచిత్యప్రస్థాన ప్రవర్తకుడు. ఔచిత్య విచారచర్చ యొనరించినాడు. కుంతకాదులవలె ప్రత్యేక ప్రస్థాన ప్రవర్తకు డయ్యును రసమును విస్మరించిన వాడు కాడు

ఔచిత్యస్య చమత్కారకారిణశ్చారుచర్వణే
రసజీవితభూతస్య విచారం కురుతేఽధునా

ఈ ఔచిత్యము రసజీవితభూత మనినాడు - ఔచిత్యరుచిర మైన రసము మధుమాసము అశోకమును వలె మనస్సు నంకురిత మొనర్చు ననినాడు. మధుర క్షారాదు లయిన రసములు నేర్పుగా కలపబడి విచిత్రమైన ఆస్వాద్యతను పొందును. అట్లే శృంగారాదులును. కావ్యమందున ఔచిత్యము పరిరక్షింపబడ వలెను. అనౌచిత్యజన్య మైన రససంకరము సమ్మతము కాదు. ఈ రసవిషయకము లైన ప్రియాభిప్రాయములను వివరముగా తన గ్రంథ మగు ఔచిత్యవిచారచర్చలో తెలియజెప్పినాడు

యథా మధురతిక్తాద్యా రసాః కుశలయోజితాః
విచిత్రాస్వాదతాం యాన్తి శృంగారాద్యాస్తథా మిథః

తేషాం పరస్పరాశ్లేషా త్కార్యా దౌచిత్య రక్షణాం
అనౌచిత్యేన సంస్పృష్టః కస్యేష్టో రససంకరః

ఔచిత్య విచారచర్చ 1-17,18

ఔచిత్యవిచారచర్చయందే గాక కవికంఠాభరణము నందును రసప్రసంగ మొనరించినాడు క్షేమేంద్రుడు. తృతీయసంధి యందు చమత్కారకథనము చేయుచు చెప్పినాడు

* "గుణము, రీతి, రసము వృత్తి, పాకము, శయ్య, అలంకారము అను వి యేడును, చమత్కారకారణములు. ఈ చమత్కారము పదివిధములు, 1) అవిచారిత రమణీయము 2) విచార్యమాణ రమణీయము 3) సమస్తసూక్తవ్యాపి. 4) సూక్ష్మైదేకదృశ్యము. 5) శబ్దగతము. 6) అర్థగతము. 7) శబ్దార్థగతము 8) అలంకారగతము 9) రసగతము 10) ప్రఖ్యాత వృత్తిగతము.

విశిష్టశబ్దరూప మైన కావ్యమునకు చమత్కృతి ఆత్మభూత మైనది. దాని శంగములలో రసము నుగ్గడించినాడు. ఇట్లు రససిద్ధాంతము ఔచిత్యప్రస్థానమునకు పరిధ్య మైనది.

---

* గుణం రీతిం రసంవృత్తిపాకం శయ్యా మలంకృతిమ్ సప్తైతాని చమత్కారకారణం బ్రువతే బుధాః "తత్ర దశవిధ శ్చమత్కారః - అవిచారితరమణీయః, విచార్యమాణ రమణీయః, సమస్తసూక్తవ్యాపీ, సూక్ష్మైకదేశదృశ్యః, శబ్దగతః, అర్థగతః, శబ్దార్థగతః, అలంకారగతః, రసగతః, ప్రఖ్యాతవృత్తిగత శ్చ

అ భి న వు ని స రి వ స్య

భరతుని రససూత్రమును వ్యాఖ్యానించుచు, పలువురు పలు రీతులలో తమ వ్యాఖ్యానముల వెలార్చిరి. దురదృష్టవశమున అవన్నియును లుప్తములు. కాని అభినవగుప్తుడు, తాను రససిద్ధాంతమును వ్యాఖ్యానించుచు తన కన్న పూర్వులైన రససూత్రవ్యాఖ్యాతల వ్యాఖ్యానముల నన్నింటిని అందజేసినాడు.

ఈ అభినవగుప్త ఖండనజేసిన భట్టలోల్లటాదుల సిద్ధాంతములే రససిద్ధాంతము యొక్క క్రమవికాసమును సూచించుచున్నవి. రససిద్ధాంతమున రసము దుష్యంతాది నాయకగత మనుట అపై దుష్యంతాదుల ననుకరించెడి నటగత మనుట, ఆ తరువాత తనకు గాని విభావముల ద్వారమున తాను రసము ననుభవించుట యెట్లను శంక పొడముటచే నది సామాజికగత మనుట, ఈ మూడును రససిద్ధాంతముయొక్క క్రమవికాసమును వ్యక్తీకరించుచున్నవి. ఈ వికాసస్వరూపము భట్టలోల్లటాదుల సిద్ధాంతముల లేనిది వేద్యము కాదు, కావున రససిద్ధాంత క్రమ వికాసము తెలియుటకు హేతువు అభినవుడు ఖండించిన స్వపూర్వుల రససిద్ధాంతముల సారమే.

ఇతడు సర్వరససిద్ధాంతమున నిరాకరించుటయే గాక తన దైన రససిద్ధాంతమును ప్రవర్తింపచేసినాడు. అది తని సిద్ధాంతమే గాక అర్వాచీన సకలాలంకారిక సమ్మతసిద్ధాంత మయినది. అభినవుని రససిద్ధాంతము ప్రకటిత మైన తర్వాత మరెవ్వరును దానిని ఖండించుటకు ప్రయత్నించలేదు. అంతటి దీర్ఘచర్చకును జగన్నాథుడు తప్ప మరెవ్వరును ప్రయత్నించలేదు

ధ్వని సిద్ధాంత మానందవర్ధనునిచే సంస్థాపింపబడిన తరువాత సైతము దానిని ఖండించుటకు విమర్శకులు ప్రయత్నించెడి రోజులలో సాహితీరంగమున అభినవుడు ధ్వని స్థాపనకై నిలిచినాడు. లోచనమునందును, అభినవభారతి యందును భట్టనాయకాదుల ధ్వన్యభావవాదముల ఖండించి అర్వాచీనులకు ఆదర్శప్రాయు డైనాడు. ధ్వని రససిద్ధాంతములకు సుస్థాపన అభినవుని చేతిమీదుగా జరిగినది.

రసానుభవముతో పాటు రససంఖ్యానియమము, శాంతరసస్థాపనము అభినవుని శిష్టకర్మలలో విశిష్టకర్మ. భరతుని నుండి సంశయాత్మస్థితిని పొందిన శాంత సౌధమునకు ఆనందవర్ధనుడు పునాది వేయగా అభినవుడు సౌధమును పూర్తి చేసి వెల్లవేసినాడు. అసంఖ్యాకము లయిన శాంతాభావవాదములను, అంతర్భావ వాదములను చూపి సాదరముగా తృణీకరించినాడు.

దానికి తగిన స్థాయిని నిర్ణయించుటలో సైతము "జుగుప్సా విస్మయ శమాః స్థాయిభావాః ప్రకీర్తితాః" అను పాఠమును ఆదరించినవా డయ్యును స్వతంత్ర వివేచనము చేసి 'తత్త్వజ్ఞానమే శాంతస్థాయి' అని నిర్ణయించినాడు. [illegible]

భావములకు వాసనాత్మకతను కల్పించిన వైశిష్ట్యము సయిత మితనిదే. అట్లు కల్పింపవలసిన అవసరము లోకసిద్ధము. సకలభావములు అంతర్వివరవర్తమానములై యుండు నవియు, అది ఆ యా ఆలంబనవైశిష్ట్య వశమున రసస్థితిని పొందునవియు వివరించినాడు. లోకమునందు సర్వవిభావములు సర్వసహృదయములకు ఆలంబనములు కాకపోవుట, ఒకే సహృదయునకు సర్వవిభావములు ఆలంబనములు కాకపోవుట, ఆలంబనస్థితికి నియత ప్రతిపత్తి లేకపోవుట, మొదలగునవన్నియు కారణముగా సమ్యక్పరిశీలనము చేసి వాసనాత్మకతను కల్పింపవలసిన యవసరము ఎంతేని గలదు. దానిని సాధించినవాడు అభినవగుప్తుడు.

రససిద్ధాంతమునకు అద్వైతతత్త్వసాదృశ్యమును ప్రకటించినవాడు అభినవగుప్తుడు. యోగిచిత్తవృత్తి సమాధిలో అనుభవించెడి ఆనందసదృశమే రసానందమని - తన్మయీభవనప్రతిపాదనద్వారమున నిరూపించినాడు. ఏతదంగములనుగా ఆనందాంశావరణభంగమును, ప్రమృష్టపరిమితప్రమాతృత్వమును, స్వప్రకాశకత్వమును ప్రతిపాదించినాడు. ధ్వనిసిద్ధాంతమును ఖండించుటకు ప్రయత్నములు జరిగెడి కాలములో రసము ఉత్పత్త్యనుమితి భుక్త్యాది విలక్షణమని, దానికి వ్యంగ్యవ్యంజకభావసంబంధమూలముగ అభివ్యక్తిని స్థాపించినాడు. ఈ అభివ్యక్తిసిద్ధాంతతత్త్వమే అన్యూనానతిరిక్తముగ అనువర్తిత మగుచున్నది. సహృదయుడొకచో రసాస్వాదనము చేయకుండుటయు జరుగును. పలువు రానందముగా నున్న పర్వదినమున ఏ యొక్క వ్యక్తియో ఖిన్నుడై యుండుట కన్పట్టును. దానికి కారణముగా ఆ ఆనందమునకు నితనికి వ్యవధాన మేదైన నుండి తీరవలయును. దానిని గుర్తించి అభినవగుప్తుడు రసప్రతీతివిఘ్నములను కల్పించినాడు. ప్రతిపత్త్యయోగ్యత, సంభావనావిరహాదులివి. ఇట్టి విఘ్నములు లేని సమయమున రసము నాస్వాదించగల సహృదయులలో సైతము తరతమభావములను ఏర్పరచినాడు. భావకూటములలో ఏకాగ్రత నొందిన వారైనను కొందరు విభిన్నరీతుల రసము నాస్వాదించుటచే ఇట్టి నియమవిధాన మావశ్యకమైనది.

రసములకు ప్రకృతివికృతిభావమును కల్పించినవాడు అభినవగుప్తుడు. భరతుడు "శృంగారాద్ధి భవేద్ధాస్యః" మొదలగు శ్లోకము లాధారముగా ప్రకృతివికృతితత్త్వమును చూపినాడు. అభినవగుప్తుడు "శాంత మొక్కటే ప్రకృతిరసమని, మిగిలిన వన్నియు వికృతిరసము లని" వచించి, శాంతమునకత్యంతప్రాధాన్యము నిచ్చియున్నాడు.

నాట్యములో ప్రధాన మైనది అనుకరణము. ఈ అనుకరణమునకు పలువురు ఆలంకారికులు పలురీతులలో నిర్వచనము నిచ్చియున్నారు. అయినను అభినవ గుప్తుడు ఆరోపాధ్యవసాయాది సకలాను కరణములకన్నను భిన్నతను చూపి అను కరణపదార్థవై శిష్ట్యమును వ్యక్తీకరించినాడు.

ఇట్లు అభినవుడు రససిద్ధాంతానుకూలము లైన అనేకవిషయములలో కూలంకషచర్చ చేసి అర్వాచీనులకు మార్గదర్శకు డైనాడు.

అ ర్వా చీ ను లు.

అభినవుని తర్వాత రససిద్ధాంతములో అతని విధానముకోని విస్తృతి కాని, విచారణ కాని జరగలేదు. పలువురాలంకారికులు కావ్యాలంకార గ్రంథములను వెలయించిరి. మమ్మటుడు, విద్యానాథుడు, విశ్వనాథుడు, సర్వజ్ఞసింగభూపాలుడు మొదలగువా రెందరో అలంకారగ్రంథద్వంసహారము గావించిరి కాని వారందరును సమాహారగ్రంథరచనము గావించిరే గాని స్వతంత్రవిచారము వారి గ్రంథములలో తావు నొందలేదు. రససిద్ధాంతవిషయమున కూడ వీరు భట్టలోల్లటాదిగా అభినవునివరకు గల సిద్ధాంతసారములను రసకాసారములో నింపిరి కాని వర్షామేఘములై రసమును పెంచలేదు.

కాగా రససిద్ధాంత వికాసము అభినవునితో చాలకాలము ఆగి మరల జగన్నాథుని వరకును పునరుద్దీప్తి నొందలేక పోయినది. మరల అలంకారశాస్త్రమునకు, రస సిద్ధాంతమునకు కూడ నూతనచైతన్యమును కల్గించినవాడు జగన్నాథుడు. అనన్య సామాన్య మైన రసగంగాధరగ్రంథమును సాహిత్యాధి దేవతకు సమర్పణ గావించి నాడు.

జగన్నాథుని ఆలోచన, ఆవేశము, శైలి నైతము నాన్యతోదర్శనీయ ములు. ఉపక్రమణ మాదిగా ఉపసంహారము వరకును నర్వవిషయములయందును, లక్షణనిరూపణవేళలో తనకు అసమ్మత మైన ప్రాచీనవిషయ వ్రాతము నంతటిని సమూలముగ ఖండించుట ఇతని పరిపాటి. రససిద్ధాంతవిషయమునను ఇతని పరి వస్య మిక్కుట మైనది. అభినవగుప్తుని తరువాత ఇంతగా చర్చించిన వాడు ఇతడే. విషయప్రాధాన్యము ననుసరించి అనేకవాదుల రససిద్ధాంతములను ప్రథ

పించుచు నవ్యమత మని, పరమత మని రెండు నూతనసిద్ధాంతముల విశద మొన ర్చినాడు. అంతే గాక ధ్వన్యాలోకలోచనమున అభినవగుప్తుడు చూపిన అప్రసిద్ధములు, అప్రధానములు, అనంగతములు అయిన మరికొన్ని సిద్ధాంతములను కూడ సమీకరించినాడు. లోచనమునందలి ఆ సిద్ధాంతము లివి.

"అన్యే తు శుద్ధం విభావం, అపరే శుద్ధ మనుభావం, కేచిత్తు స్థాయిమాత్రం, ఇతరే వ్యభిచారిణం, అన్యే తత్సంయోగం ఏకే అనుకార్యం, కేచన సకల మేవ సముదాయం రస మాహుః" (ధ్వన్యాలోకము-లోచనము పు 196, 197)

ఈ వాదములను అభినవుని తరువాత మరల స్పృశించిన దీతడే. వీని నాధారముగా గొని జగన్నాథుడు చెప్పిన రససిద్ధాంతములు ముందే వివరింపబడినవి.

కావ్యవ్యాపారభావన దోష మనుటచే రసానుభూతి ఒక దోష మనవలసి వచ్చినది. అయినను ఫలము సుఖాత్మకము, నిర్దుష్టము, అపరిహరణీయము, నష్టవ్యతిరిక్తము. కావున దోష మున్నను తప్పుకాదేమో. భావనను దోషముగా మరే మతమును అంగీకరింపదు.. (ఆంధ్ర. రసగం. శర్వాణీవ్యాఖ్య. పు 128)

అభినవాదులును రసానుభూతి నిర్వికల్పసవికల్పాదుల కన్న విశిష్టమై లోకోత్తరత్వమునకు పోషకమనిరి గాని దోష మని అంగీకరించలేదు. అంతియే గాక 'రసో వై సః' మొదలుగా గల శ్రుతుల నాధారము చేసికొని రసానందమునకు బ్రహ్మానందసబ్రహ్మచారిత్వమును కల్పించి తత్కారణమును దోషమనుట యుక్తమా? అయినచో బ్రహ్మానందమును దోషప్రాయము కాదా? అందలి భావన కూడ దుష్టము కాదా? కావున భావన దోష మనుటయే తగదని శ్రీ పేరాల తిరువేంగళాచార్యుల వారి యభిప్రాయము. (ఆంధ్ర. రస గం. శర్వాణీవ్యాఖ్య పు 128)

రత్యాదులు అభినవాదుల సిద్ధాంతానుసారముగ విశేషణములు మాత్ర మైనవి. జగన్నాథుడు 'రసో వై సః' అను శ్రుతిస్వారస్యమున 'రత్యాద్యవచ్ఛిన్నా భగ్నావరణా చి దేవ రసః' అని రత్యాదులకు విశేష్యత్వమును గూడ కల్పించినాడు.

భావశాంత్యాదిధ్వనులు కూడ భావధ్వనులే యగు నని సచమత్కారముగా నిరూపించి అవిదంపూర్వ మైన సిద్ధాంతమును స్థాపించినాడు. స్థిత్యవచ్ఛిన్నత్వమున భావము చర్వ్యమాణ మగునట్లు, ఉత్పత్త్యవచ్ఛిన్నత్వ, ప్రశమాభిభూతత్వ, సంధీయమానత్వ, శబలత్వావచ్ఛిన్నము లైన స్థితులందును భావమునకే ఉపస్థితి గావున అవియు భావధ్వనులే యని ఈతని అభిప్రాయము.

రసాభాసవిషయమున ఇతని లక్షణము సర్వరసాభాసలక్షణసమాహారరూపము. 'అనుచితవిభావాలంబనత్వం రసాభాసత్వమ్' (రస గం. ప్రథమా. పు 366)

"ఏకత్రైవానురాగ శ్చేత్ తిర్యఙ్ మ్లేచ్ఛగతోపి వా"

అని ప్రాచీనులు తిర్యగ్గతత్వమును రసాభాస మనగా ఇతడు తిర్యగ్గతత్వమునకు రసత్వ మంగీకరించి నట్లే కన్పట్టును.

భావధ్వనులను సోదాహరణముగా నిర్వచించుచు, మోహమున నుదాహరణగా నీ క్రింది శ్లోకమును చూపును.

"శుండాదండం కుండలీకృత్య కూలే కల్లోలిన్యాః కించి దాకుంచితాక్షః, నైవాకర్ష త్యంబు నైవాంబుజాలిం కాంతాపేతః కృత్యశూన్యో గజేంద్రః"

ఇందు మోహము తిర్యగ్గతముగా వర్ణింపబడినది. దీనినాధారముగా పరిశీలించిన తిర్యగ్గత మైన రసము రసాభాసము కాదను విద్యాధరుని (ఏకావళీకర్త) యభిప్రాయముల నితడు అంగీకరించినట్లు కన్పట్టును. కనుకనే అనుచితవిభావాలంబనత్వమునే ఇతడు రసాభాసలక్షణముగా తెలిపినాడు. కాని పూర్వుల లక్షణములను గాని తదేకదేశములను గాని గ్రహించలేదు. రసాభాసోదాహరణములలో తిర్యఙ్ మ్లేచ్ఛగతత్వమునకు ఉదాహరణములను చూపలేదు కూడ.

ఒక్క రససిద్ధాంతవిషయముననే గాక తనరోని సమస్తవిషయముల వైవిధ్యము, వైశిష్ట్యములవలన గూడ నితని రసగంగాధర మద్వితీయాలంకారికగ్రంథమై యలరారుచున్నది. ఇట్టిగ్రంథము సాహిత్యశాస్త్రములో న భూతో న భవిష్యతి అన్నను అతిశయోక్తి కాదేమో.

జగన్నాథుని యనంతరము ఆలంకారికుల దృష్టి తద్వ్యతిరిక్తము లైన నూతనవిషయదర్శనక్షమము కాలేదు. కనుక ఆ తరువాత సరి యైన అలంకారిక గ్రంథములు వెలువడలేదు. ఒకటి రెండు వెలువడినను అవి వానికి అనుకరణరూపములై వ్యక్తిత్వమును కోల్పోయినవే గాని, స్వతంత్రముగా నిలువలేక పోయినవి. కనుక రససిద్ధాంతవికాసమే కాక అలంకార (సాహిత్య) శాస్త్రవికాసమే ఆ తరువాత కుంటు వడినదనుట నిర్వివాదాంశము. ప్రపంచసాహిత్యశాస్త్రములో ప్రత్యేకతను నిలుపుకొనగలిగిన సంస్కృతాలంకారశాస్త్రవికాసము జగన్నాథునితో ఆగిపోవుట అదృష్టము, దురదృష్టము కూడ.

ర ప స ం ఖ్య

లౌకికప్రాచుర్యము ననుసరించి రసములు తొమ్మిది యని ప్రవచింపఁబడు చున్నవి. నవరసము లనియు, నవరసభరితకావ్య మనియు పదబంధములు సాహితీలోకమున వినవచ్చుచున్నవి. కాని సిద్ధాన్తపరముగ పరిశీలించినచో ఆలంకారికులలో అభిప్రాయ భేదములు పొడకట్టుచున్నవి రససిద్ధాన్తప్రవక్తలలో ప్రథమ స్థాన మాక్రమించిన భరతుడు ఎనిమిది రసములనే పేర్కొనెను ఆ ఎనిమిదిరసము లివి [1] 'శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, వీరము, భయానకము, బీభత్సము, అద్భుతము'. ఈ ఎనిమిదింటిని రసములుగా అంగీకరించుటలో ఆలంకారికు లెవరికి ఎట్టి విప్రతిపత్తియు లేదు. వీనిని మించి శాంతాదులను రసములుగా అంగీకరించుటలో పలువు రాలంకారికులు మతభేదములను ప్రదర్శించిరి. శాంతమును తొమ్మిదవరసముగా అంగీకరించిన వారు కొందఱు దీనికి ఇంకను వాత్సల్యము, ప్రేయస్సు, భక్తి స్నేహము మున్నగువానిని చేర్చి వీని సంఖ్యను పదమూడుగ పెంచినవారును కలరు. మరికొందఱు, సంచారిభావము లన్నిటికి తీవ్రపోషణచే రసత్వమును నయితము కల్పించిరి. పరిపోషభేదమును బట్టి రసములకు ఆనంత్యమును సిద్ధింపజేసినవారును లేకపోలేదు. వీరి మతము లన్నిటిని సమీకరించి సమీక్షించుటయే యీ యధ్యాయ మందలి ప్రధానాంశము.

రససంఖ్యావిషయక మైన చర్చలో ప్రధానస్థాన మాక్రమించినది శాంతము. కావున ముందుగా శాంతరసమును గూర్చిన వాద ప్రతివాదములను సమీక్షింతును. ఇందు కొందఱు శాంతము రసముగా నంగీకరింపదగదని వచింపగా మరికొందరు శాంతమును తప్పక రసముగా నంగీకరించి తీరవలయు ననిరి. మరికొందరు ఇతర రసములలో దీని నంతర్భవింప జేయవచ్చు నని తలచిరి. ఈ క్రింద వారి వారి యభిప్రాయములను ప్రోటంకింతును. ప్రథమమున శాంతము రసము కా దనువారి యభిప్రాయములను అంశాత్మకముగ నరయుదము.

---

[1] శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
బీభత్సాద్భుతసంజ్ఞౌ చేత్యష్టౌ నాట్యే రసాః స్మృతాః
ఏతే హ్యష్టౌ రసాః ప్రోక్తాః ద్రుహిణేన మహాత్మనా.

నా. శా. 6 అధ్యా - 15, 16శ్లో.

(i) రససిద్ధాంతమునకు ప్రథమప్రవక్త భరతుడు. ఆతడు తన నాట్యశాస్త్రమునందు అష్టరసములనే పేర్కొనినాడు. 'అష్టౌ రసా' అని ఆతడు కంఠోక్తిగా చెప్పినాడు. మరియు రసముల కన్నిటికి స్వరలయగుణాలంకారవృత్తులను వివరించిన భరతుడు శాంతరసమునకు వానిని వివరింపలేదు. స్థాయిభావములను సయితము ఎనిమిదింటినే పేర్కొనినాడు [1]

(ii) కవికులతిలకు డైన కాళిదాసు[2], ఆలంకారికశేఖరు డైన దండి మహాకవియు అష్టరసములనే పేర్కొనినారు.

(iii) శాంతరసమును గూర్చి ప్రప్రథమముగా విపులము నాధికారికము నైన ప్రస్తావన మొనర్చినవాడు ఆనందవర్ధనుడు. అతడు భరతునిపై ప్రామాణ్యబుద్ధి గలిగినవాడు. అతడు శాంతరసమును స్థాపించి భారతము శాంతరసప్రధానగ్రంథమని ధ్వన్యాలోకమున వివరించినాడు. అట్టిచో అతడు శాంతస్థాపనకు స్వీయ మైన ఉపపత్తులనే ప్రదర్శించినాడు గాని భరతుని వాక్యములను సాక్ష్యముగా చూపలేదు. భరతుడే శాంతరసమంగీకరించి యుండినచో ఆనందవర్ధనుడు తనవాదమునకు బలకముగ భరతుని శ్లోకము నుదాహరించి యుండెడివాడు. కావున భరతునకు శాంతరసము సమ్మత మనరాదు.

(iv) రత్యాదిస్థాయిభావములు వ్యభిచారి పరిపుష్టములై రసీభావము పొందినట్లు శాంతస్థాయి రసీభావము నొందజాలదు. ప్రపంచ మంతయు రాగద్వేషమయము. అవిద్యామోహమూర్ఛితము. అనాదికాలప్రవాహముచే వచ్చుచున్న రాగద్వేషముల విడనాడుట సాధ్యము కాదు. కావున శాంతము రసస్థితిని పొందజాలదు.

---

1 రతి ర్హాస శ్చ శోక శ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయ శ్చేతి స్థాయిభావాః ప్రకీర్తితాః

నా. శా. 6 అధ్యా

2 మునినా భరతేన యః ప్రయోగో భవతి ష్వష్టరసాశ్రయో నియుక్తః
లలితాభినయం త మద్య భర్తా మరుతాం ద్రష్టుమనాః సలోకపాలః

విక్రమో - II - 18

V మఱియొందు శాంతరసము లేదనుట కిట్టి యుపపత్తిని తెల్పుదుము. శాంతమునకు శమము స్థాయిభావము కావలెను శమసాధ్య మైనది శాంతము. అట్టి శమము నటునికి అభినయసాధ్యము కాదు అనగా నటునిలో శమము అసంభవము. కావున శాంతము రస మనరాదు (ఇది రస మనుకర్తృనిష్ఠ మనువారి యూహ)

VI శాంతరసప్రధాన మైన కావ్యములు గాని నాటకములు గాని భారతీయసాహిత్యమున కానరావు. శాంతము రసముగా ప్రసిద్ధి వహించినచో శాంతరసగ్రంథములు వెలువడియుండును. కాన శాంతము రస మనరాదు

VII దృశ్యకావ్యములందు గీతవాద్యాదిప్రతిబంధకత్వ ముండును. అవి చిత్తవిక్షేపకరములు. శమవిరుద్ధములు విషయవైముఖ్యాత్మక మైనది శాంతరసము కదా అట్టిచో చిత్తవిక్షేపకరము లైన గీతవాద్యములు శాంతరసప్రతిబంధకములు. కావున దృశ్యకావ్యమున శాంతరస మంగీకరింపదగదు

VIII శాంతము సర్వజనానుభవగోచరము కాదు. అనగా అందరును దీని నాస్వాదింప జాలరు. కావున దీని రస మనరాదు

IX రసము లన్నియు చిత్తమునకు విక్రియాజనకములు మిగిలిన యెనిమిదియు నీ లక్షణమునకు లోబడి యున్నవి. కాని శాంత మట్టిది కాదు. కావున శాంతము రసము కాదు

పై జెప్పిన యభావవాదాంశము లన్నియు శాంతరసవాదులచే నిట్లు ఖండింపబడుచున్నవి


1 నేడుపలభ్యమానము లగు గ్రంథములలో నాట్యశాస్త్రము 6వ అధ్యాయమున నవరసపాఠమె కన్పట్టుచున్నది ఆ పాఠ మిట్లున్నది

---

1. శాంతస్య శమసాధ్యత్వాత్ నటే చ తదసంభవాత్

అష్టావేవ రసా నాట్యే న శాంత స్తత్ర యుజ్యతే.

— (దశరూపకము)



శృంగారహాస్యకరుణా రౌద్రవీరభయానకాః
బీభత్సాద్భుతశాంతాశ్చ నవ నాట్యే రసా స్మృతాః
రతి ర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయ శమాః స్థాయిభావాః ప్రకీర్తితాః

దీనినిబట్టి భరతునకు శాంతరస మిష్ట మైనట్లు తోచును. కాని ఇది ప్రక్షిప్తపాఠము శాంతరసాభిమానులు ఈ పాఠమును నాట్యశాస్త్రమున చేర్చియుందు రని విజ్ఞుల యభిప్రాయము. ఈ శాంతరసప్రస్తావన మొదట చేసినవాడు వాసుకి యని కొందరును కోహలు డని కొందరును ఎంచుతురు. ఎవ రైనను వారి గ్రంథ మిపుడు లభ్య మగుటలేదు లభ్య మైన గ్రంథములలో ఉద్భటుని కావ్యాలంకారసంగ్రహము మొదటిది. అందు అతడు తొమ్మిదిరసముల నుదాహరించినాడు. అతడు నాట్యశాస్త్రమునకు ఒక వ్యాఖ్యానము నయితము (అలభ్యము) వ్రాసి యుండుటచే నీ నవరసపాఠమును నాట్యశాస్త్రమున చేర్చినవా డితడే యనియు కొంద రూహించుచున్నారు.

భరతుడు ప్రత్యక్షముగ శాంతమును ప్రవచింపకపోయినను శాంతము రస మగు ననుటకు అతనికి అభ్యంతరము లే నట్లు కన్పట్టును. అనగా పరోక్షముగ నాతనికి శాంతము రస మనుట యభిమతమే. అతడు నాట్యప్రయోజనముల నుగ్గడించుచు నిట్లనెను నాట్యము ఒక్కొకచో ధర్మమును మరియొకచో వినోదమును ఇంకొకచో అర్థమును ఇంకను ఒకచో శమమును కల్గించును. ఒకొక్కపుడు హాస్యము, ఒకొక్కపుడు యుద్ధము, కామము, వధ మున్నగునవి సూచింపబడును దుఃఖార్తులకు, తపస్వులకు ఈ నాట్యము విశ్రాంతిజనక మైనది. ఈ నాట్యమునందు సర్వము ఇమిడియున్నది. ఇందు లేని జ్ఞానము గాని, శిల్పము గాని, విద్య గాని, కళ గాని యోగము గాని, (యుద్ధాది కర్మ గాని లేదు. సప్త ద్వీపము లందలి ప్రవృత్తులకును నిది ఆదర్శప్రాయము. అందుచే దీని దేవతలు, అసురులు,

రాజులు, కుటుంబులు, బ్రహ్మర్షులు, మున్నగువారలందరు చూడవలెను. ఇది నానాభావోపసంపన్న మైనది [1]

ఇందు శమము ప్రదర్శింపబడు ననుటచేతను, తపస్వులకు విశ్రాంతిజనక మగు ననుటచేతను, సర్వము నిం దిమిడియున్న దనుటచేతను, బ్రహ్మర్షులు సయితము చూడదగిన దనుటచేతను, నానాభావోపసంపన్న మనుటచేతను పరోక్షముగ భరతుడు శాంతము నంగీకరించె ననియే వచింపవలసియున్నది. భరతునకు శాంత రసవిషయము తెలియదనుట కూడ అసమంజసము. దీని విషయమున డాక్టర్ రాఘవన్ సముచిత మైన ప్రసంగ మొనర్చినారు. సర్వజగత్తును ఆలంబనముగా చేసి మహోన్నతముగా మానవమనస్తత్వవిశ్లేషణ మొనర్చిన భరతుడు శాంత రసము పరిధిగా గల మానవ మనస్తత్వమును పూర్తిగా తెలియదనుట విస్మయావహము.

---

[1] క్వచి ద్ధర్మః క్వచి త్క్రీడా క్వచి దర్థః క్వచి చ్ఛమః
క్వచి ద్ధాస్యం క్వచి ద్యుద్ధమ్ క్వచి త్కామః క్వచి ద్వధః
1 - 107

దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినామ్
విశ్రాంతిజననం కాలే నాట్య మేత ద్భవిష్యతి
1 - 114

న తజ్జ్ఞానం న తచ్ఛిల్పం న సా విద్యా న సా కలా
నాసౌ యోగో న తత్ కర్మ నాట్యే ఽ స్మిన్ య న్న దృశ్యతే
1 - 116

దేవానా మసురాణాం చ రాజ్ఞా మథ కుటుంబినామ్
బ్రహ్మర్షీణాం చ విజ్ఞేయం నాట్యం వృత్తాంతదర్శకమ్
1 - 118

నానాభావోపసంపన్నమ్ నానావస్థాంతరాత్మకమ్
లోకవృత్తానుకరణం నాట్యమేత న్మయా కృతమ్
1 - 112

"Bharata handles the who e wor d and analyses human Psychology to a great extent and t wou d be strange If he is to be entirely s ent on that part of human act vity wh ch is the sphere of Santa Rasa.

(The number of Rasas Page 17)

2 కాళిదాసాదులు ప్రసంగవశమున అష్టరస ప్రసక్తి యొనర్చిరి. అంత మాత్రమున వారికి నవమ మగు శాంతరసము అభీష్టము కా దనుట పొసగదు. అట్లే భావించినచో శంకరాచార్యులు సౌందర్యలహరిలో స్వవచోవ్యాఘాతకము లగు రెండు అభిప్రాయములను వెలిబుచ్చి నగవలసియుండును. అతడు సౌందర్య లహరి 41వ శ్లోకమున "నవరసమహాతాండవనటమ్" అనియును, 50వ శ్లోకమున "నవరసాస్వాదతరళౌ" అనియును నవరసములను పేర్కొనినాడు. వెన్వెంటనే 51 వ శ్లోకమున

శివే శృంగారార్ద్రా తదితరజనే కుత్సనపరా
సరోషా గంగాయాం గిరిశనయనే విస్మయవతీ
హరాహిభ్యో భీతా సరసిరుహసౌభాగ్యజయినీ
సఖీషు స్మేరా తే మయి జనని దృష్టి స్సకరుణా.

అని ఎనిమిదిరసములనే సూచించినాడు. ఇట్లు వచించుట స్వవచోవ్యాఘాత మనరాదు. రససంఖ్య విషయము అప్పటికి వివాదాస్పదమై యున్నది. వివాదాస్పద మైన విషయమును గూర్చి ప్రసంగించు నపుడు సందర్భానుసారముగ అనుకూలసంఖ్యను గ్రహించుట కవుల పరిపాటి. అంతమాత్రమున దానిని స్వవచోవ్యాఘాత మనుటకంటె వివాదసూచకమును, అనుకూలసంఖ్యాగ్రహణసూచకము ననుట సమంజసము, సముచితము.

3 ఆనందవర్ధనునకు భరతునిపై ప్రామాణ్యబుద్ధి లేకపోలేదు. అతనికి భరతుని శాంతరస(గ్రంథము)పాఠము దొరకియుండక పోవచ్చును. ఒక రుదాహరింపనంత మాత్రమున నా రసము లేదు అనుట యనుచితము. భరతుని సాక్ష్యము కేవలము వృద్ధసమ్మతి మాత్రమే యగును. దీనికంటె బలవత్తరము లైన యుప

వస్తులను ప్రదర్శించియుండుటచే వాని ముందు సాక్ష్యప్రదర్శనము అనుషంగికమే యగును కావున నాతడు భరతుని సమ్మతిని ఉదాహరింపక యుండవచ్చును. అంత మాత్రమున శాంతము రసము కా దనరాదు

4 రత్యాదుల వలె శాంతస్థాయి రసీభావము పొందజాలదు అనుట యను చితము. దాని నాస్వాదింపవారు నుండజాల రనుటయు సముచితము కాదు. భావము రసస్థితిని పొందుటకు ఈ విషయము లావశ్యకములు

1 భావము మానవునిలో స్థిరరూపమున (స్థాయిగా) నుండుట

2 విభావానుభావసంచారులచే పరిపుష్ట మగుట

3 సామాజికుడు తత్తద్రసానుకూలహృదయసంవాదమును కల్గియుండుట.

ఈ మూడు పరిస్థితు లనుకూలించినచో నా భావము రస మగును. శమము గాని, వైరాగ్యము గాని నిర్వేదము గాని మనసులో స్థిరరూపమున నున్న మానవులు కొలదిమంది యయినను ఉందురు. యమనియమాదులు జపతపోధ్యానములు మున్నగువానిచే పరిపుష్ట మగును తదనుకూలాభినయముచే సామాజికునిలో శాంతరసమై భాసించును. కావున దాని నాస్వాదించు సామాజికు లుండ రనుట తగదు. ఐహికసుఖవిముఖు లైన వీతరాగులు కొంతమంది యుందురు మోక్ష పురుషార్థప్రధానము లైన నాటకములు వారిని రంజింపజేయును. ఈ భావమున నుపబలకముగ భరతుడు 27వ అధ్యాయమున

తుష్యన్తి తరుణాః కామే విదగ్ధా స్సమయాశ్రితే
అర్థే ష్వర్థపరా శ్చైవ మోక్షే ష్వథ విరాగిణః

అని విరాగులు మోక్షప్రధాన మైన యితివృత్తముల నాస్వాదింతురు, అనినాడు. అభినవగుప్తుడు వయితము 'హృదయసంవాదోఽపి తథావిధతత్త్వజ్ఞానబీజసంస్కార భావికానాం భవ త్యేవ యద్వక్ష్యతే "మోక్షే చాపి విరాగిణః" ఇతి'(అభినవభారతి దా – I పు 340) అని వచించినాడు నాట్యము సర్వభావోపసంపన్న మని భరతుడు వచించుట గూడ శాంతరసపోషకమే. కావున శాంతము రసమే,

5 నటునిలో శమము సాధ్యము కాదు కావున శాంతము రసము కా దనిరి. దాని పక్షమున నట నను కర్తృనిష్ఠ మనవలసి వచ్చును. ఇది సిద్ధాంతము కాదు రసము సామాజిక నిష్ఠము కాని యనుకర్తృనిష్ఠము కాదు.[1]

నటు డందు శమము లేదు కావున శాంతము రసము కాదు అను వాద మసంగతము. రసము నటనిష్ఠము కాదు కదా! సామాజికులు సహృదయులు, శాంతులు తత్త్వవివేచనాపరులు కావున వారికి రసోదయ మగుటలో విప్రతిపత్తి లేదు.[2]

సంగీతరత్నాకరమందును ఈ భావము ఖండింప బడినది. నాట్యరసము కానిదే అని కొందరు వచించిరి కాని యది యసాధువు. రసమును నటు డాస్వాదింపడు గదా.[3]

6 శాంతరసగ్రంథములు వ్యంగ్యము లనుటయు పొసగని మాట. భారతమే శాంతరసప్రధాన మైన దని ఆనందవర్ధనుడు సామాజిక మైన చర్చ చేసినాడు. మరియు నాగానందము, సౌందరనందము (బుద్ధచరితము) మున్నగు నవియు కలవు. ప్రాధాన్యమును బట్టి చూచినచో బీభత్సభయానకాదులు కూడ అంగిరసముగా వ్యంగ్యములే అయినను అవి రసములే గదా.

7 నాటకమున గీతానృత్యములు ప్రతిబంధకములు కాజాలవు. ఫలాను రోధముచేత అవి శాంతరసవిరోధులుగా సహృదయులచేత పరిగణింపబడుట లేదు. అట్లు విరోధములుగానే పరిగణింపబడినచో సంసారానిత్యత్వమును కుద్దీపన మైన

నటే శమస్యైవాభావా దితి హేతు రసంగతః
నటే రసాభివ్యక్తి స్తు నైవ స్వీక్రియతే యతః. (కావ్య-సం-స.సూ.శా.)

2 సామాజికా స్సహృదయా శ్శాంతా స్తత్త్వవిచక్షణాః
అత స్తేషాం రసోద్బోధే శమవత్త్వా న్న బాధకమ్ (పైది)

3 అష్టావేవ రసా నాట్యే ష్వితి కేచి దచూచుదన్
తదచారు యతః కించి న్న రసం స్వదతే నటః

సంగీతరత్నాకరము VOL IV

పురాణశ్రవణాదులయందు శాంతరసనిష్పత్తియు కావలసివచ్చును. అది సహృదయ అంగీకరింపదగినది. లోకమునందును భజనకీర్తనాదులలో వాద్యాదులు శాంతరసప్రతిబంధకములుగా దోచుట లేదు. పైగా ఆ వాద్యాదులు తద్రసపోషకములుగా నున్నవి. కావున గీతవాద్యములు మొదలగునవి ప్రతిబంధకము లనగాదు[1].

8 శాంతమునకు సర్వజనానుభవగోచరత్వము లేదనుట తగదు. అలౌకికసామాన్యమహానుభవము గలిగిన వారందరును. వారు వీతరాగులు. వారు శాంతరసము నాస్వాదింతురు. దీనిని భగవానుడు సయితము అంగీకరించినాడు. పురుషార్థప్రాధాన్యమును బట్టి వేర్వేరు వ్యక్తులచే నాస్వాదింపబడును. రసికులు కామమందును. విదగ్ధులు సమయాశ్రితమైన ధర్మమందును అర్థపరులు అర్థమందును, విరాగులు మోక్షవిషయమందును సంతుష్టు లగుచుందురు. కావున తత్త్వజ్ఞానబీజసంస్కారభావితు లైన వారికి అట్టి హృదయసంవాద ముండును. అందరకు నట్టి హృదయసంవాదము, అనుభవము లేనంత మాత్రమున దానికి రసత్వ మంగీకరింపకుండుట సమంజసము కాదు. అట్లే యగుచో వీతరాగు లైన వారికి హృదయసంవాద ముండక పోవుటచేతను చమత్కారజనకము కాకపోవుటచేతను శృంగారము సయితము రసము కా దనవలసివచ్చును. వీరి దృష్టిలో భయానకము రసము కాకపోవలసివచ్చును. కావున శాంతమునకు తగిన హృదయసంవాదము గల స్థితప్రజ్ఞులుండుటచే దానిని రస మనియే తీరవలెను.

9 విక్రియాజనకములే రసము లనుట మిగిలిన వాని విషయమున పొసగును. అవి వికృతి రసములు. శాంతము ప్రకృతిరసము. కావున ఆ లక్షణ మిట అన్వయింపదు.

---

1 —నాట్యే శాంతరస మభ్యుపగచ్ఛద్భిః ఫలబలాద్గీతవాద్యాదేస్తస్మిన్ విరోధితాయా అకల్పనాత్ విషయచిన్తాసామాన్యస్య తీవ్రవిరోధిత్వ స్వీకారే తదీయాలంబనస్య సంసారానిత్యత్వస్య తదుద్దీపకస్య పురాణశ్రవణ సత్సఙ్గపుణ్యవనతీర్థావలోకనాదే రపి విషయత్వేన విరోధిత్వాపత్తేః.

రసగంగాధరము ప్రథమాననము పు 134.

శ్రవ్య కావ్య పరిమితము

ఇది యిట్లుండ కొంద రాలంకారికులు శాంతరసచర్చ యందు మాధ్యస్థ్య మవలంబించి విశిష్ట మైన యభిప్రాయములను వెలిబుచ్చిరి దశరూపకకర్త ధనంజయుడు

"శమ మితి కేచి త్ప్రాహుః పుష్టి ర్నాట్యేషు నైతస్య"- శమమును కొందరు పేర్కొందురు కాని, దానికి నాటకమందు పుష్టిలేదు అని పేర్కొనినాడు. దశరూపకావలోక కర్త యైన ధనికుడు దీనిని వ్యాఖ్యానించుచు శాంత మభినయింప శక్యముగాక పోవుటచే నాట్యమున నుండక పోవచ్చును ఎంత సూక్ష్మవస్తువుల గూర్చి యైనను వచించుటకు శబ్దము సమర్థమే. కావున శ్రవ్యకావ్యమున శాంతము నిబంధింప వచ్చును [1] అని శాంతమును శ్రవ్యకావ్యపరిమిత మొనర్చెను

అంగరసము

ఆనవగుప్తునకు పూర్వము ధ్వన్యాలోకమునకు చంద్రిక యను నొక వ్యాఖ్య వ్రాయబడెను. ఆ చంద్రికాకారుడు శాంతరసచర్చాసందర్భమున ఒక వింత యభిప్రాయమును వెలిబుచ్చెను [2]

శాంతము రసముగా అంగీకార్యమే కాని అంగిరసముగా కాదు. అంగరసముగా మాత్రమే చెప్పవలయును. నాగానందమున శాంతరస మంగరసమే. ఈ యభిప్రాయమును అభినవుడు ఖండించి శాంతము అంగిరసముగా కూడా నుండదగు నని సిద్ధాంతీకరించినాడు.

అంతర్భావవాదము:-

భరతు డష్టరసములనే పేర్కొనె ననియు, ప్రామాణికమూర్ధన్యుడైన యాతని సంఖ్య నతిక్రమించుట సంప్రదాయాతిక్రమణ మగు నని భావించి కొందరు శాంతము

---

[1] నను శాంతస్య అభినేయత్వాత్ యద్యపి నాట్యేఽనుప్రవేశో నాస్తి తథాపి సూక్ష్మాతీతవస్తూనామ్ సర్వేషా మపి శబ్దప్రతిపాద్యతాయాః విద్యమానత్వాత్ కావ్యవిషయత్వమ్ న వార్యతే.

[2] ఆధికారికత్వేన తు శాంతో రసో న నిబద్ధవ్య ఇతి చంద్రికాకారః తచ్చేహాస్మాభి ర్న పర్యాలోచితమ్

ఇతరరసములలో సంతర్భవింప జూతురు. అందు కొందరు శాంతమును దయా వీరమున నంతర్భవింప జూచిరి కాని అది పొసగదు. శాంతమునకు స్థాయిభావము నిర్వేదాదులు దయావీరమున కుత్సాహము రెండింటికిని వైరుధ్యము ప్రసిద్ధము నిర్వేదము అహంకార ప్రశమరూపము. ఉత్సాహము అహంకారోల్బణరూపము. కావుననే యీ యభిప్రాయమును సాహిత్యదర్పణకారుడు విశ్వనాథుడు శాంతము నిరహంకారరూప మనియు, కావున దయావీరమున నంతర్భావింపజేయ దగదని [1] విస్పష్టగా చెప్పినాడు. మరియు దయావీరమే శాంతమందు అంతర్భవింప వచ్చు నని విపర్యయమాపవాద మొనర్చినాడు [2]

ఈ అంతర్భావవాదమును ఉపలభ్యమాన మైనంతలో మొదట ప్రస్తావించిన వాడు ఆనందవర్ధనుడు శాంతరసస్థాపనవిషయమున నతడు ఈ ప్రస్తావన తెచ్చెను. దాని వఠనవగుప్తుడు మిగుల ప్రపంచించినాడు. ఆనందవర్ధనుడు

"న చ వీరే తస్యాంతర్భావం కర్తుం యుక్తః తస్యాభిమాన మయత్వేన వ్యవస్థాపనాత్" అస్య చాహంకారప్రశమైకరూపతయా స్థితేః తయోశ్చ ఏవం విధ విశేషసద్భావే ఽపి యద్యైక్యం పరి కల్ప్యతే తద్వీరరౌద్రయో రపి తథా ప్రసంగః, దయావీరాదీనాం చ చిత్తవృత్తివిశేషాణాం సర్వాకార మహంకారరహితత్వేన శాంతరస ప్రభేదత్వమ్ ఇతరథా తు వీరప్రభేదత్వ మితి వ్యవస్థాప్యమానే న కశ్చి ద్విరోధః తదేవ మస్తి శాంతో రసః -

అని వచించినాడు.

వీరమునందు శాంత మంతర్భవింప జేయుట యుక్తము కాదు వీర మభి మాన మయము. శాంతము అహంకారప్రశమైకరూపము. ఇట్లున్నను అంతర్భ

---

[1] నిరహంకారరూపత్వా ద్దయావీరాది రేష నో

సా. ద. 3 - 249

[2] సర్వాకార మహంకార రహితత్త్వం వ్రజంతి చేత్

అత్రాంతర్భావ మర్హన్తి దయావీరాదయ స్తథా

సా. ద 3 - 250

వింప జేసినచో అట్టి స్థితియే వీరరౌద్రములనుగూడ నేల సంక్రమింప జేయరాదు. అనగా వీరరౌద్రములను కూడ ఒకటిగా అంతర్భవింప జేయదగును కదా దయా వీరాదులందు కూడ అహంకార ప్రశమిత యుండును గదా శాంతమును దయా వీరమునందంతర్భవింప జేయవచ్చు ననినచో శాంతము సర్వాకారముగా అహంకార రాహిత్యము కల్గియుండును గావున శాంతమునందే దయాదికము నంతర్భవింప జేయ వచ్చును. అట్టి అహంకారము వదలినచో వీరమువంటే యగును. కావున శాంతము రసమే.

ఇందు దయావీరాదు లని ఆనందవర్ధనుడు అదిపదమును గ్రహించినాడు. దానిని వ్యాఖ్యానించుచు అభినవుడు బీభత్సమును గూడ పేర్కొనెను [1] శాంతము విషయజుగుప్సారూపము. అందుచే బీభత్సమునందు శాంతము నంతర్భవింప జేయ వచ్చు నని శంకింపరాదు. ఆ జుగుప్స శాంతమునకు వ్యభిచారిభావమే యగును. కాని స్థాయిభావము కాజాలదు చిట్టచివరకు అది సమూలముగ నశించును. కావున బీభత్సము నందును అంతర్భవింప జేయదగదు.

శాంతరస మంగీకరించిన వారు

భరతుడు ప్రత్యక్షముగ కంఠోక్తిగ శాంతము నంగీకరింపక పోయినను వ్యంగ్యధోరణిలో (ప్రాధాన్యమును దృష్టియందు దిడుకొని) పరోక్షముగ నంగీక రించినాడు ఈ విషయము నభినవగుప్తుడు బహుధా ప్రపంచించినాడు. భరతుని నాట్యశాస్త్రవ్యాఖ్యాతలలో భట్టలోల్లటుడు ఆనంత్యమునే యంగీకరించిన వాడగు టచే శాంతము నంగీకరించె ననియే వచింపవలసియున్నది శాంతమును గూర్చి శ్రీశంకుకుని యభిప్రాయము తెలిసికొనుటకు తగినన్ని సాక్ష్యాధారములు లేవు. శాంత రసస్థాయిని గూర్చి యభినవుడు దాహరించిన నాట్యశాస్త్రవ్యాఖ్యాతల యభిప్రాయ ముల బట్టి శంకుకుడు శాంతరసము నంగీకరించె ననియే యూహింపవచ్చును.

(చూడుడు Number of Rases Page 43)

---

1 విషయజుగుప్సారూపత్వాత్ బీభత్సే ఽన్తర్భావః శంక్యతే సా త్వస్య వ్యభిచారిణీ భవతి న తు స్థాయితా మేతి పర్యంతనిర్వాహే తస్యా మూలత ఏవ విచ్ఛేదాత్.

ఉద్భటుడు కావ్యాలంకారసంగ్రహమున శాంతమును సంగ్రహముగ పేర్కొనినాడు. రుద్రటుడు తన కావ్యాలంకారమున శాంతరసమునంగీకరించినాడు. సమ్యగ్జ్ఞానము లేక తత్త్వజ్ఞానము దాని స్థాయిభావ మనియు నాతడు వచించినాడు. తద్వ్యాఖ్యాత యగు నమిసాధువు శాంతరసప్రత్యాఖ్యాన మనుచిత మని విమర్శించినాడు.[1]

ఆనందవర్ధనుడు (శాంతమును రసముగా) విపులచర్చ యొనర్చి శాంతరస స్థాపన మొనర్చినాడు. ఇతడు తృష్ణాక్షయసుఖము స్థాయిభావ మని వచించినాడు. ఉదాహరణప్రాయముగా నాగానందమును సూచించినాడు.

ఉపలభ్యమాన మైన రాజశేఖరుని కావ్యమీమాంసయందు రసాధికారము కన్పట్టదు. ఆ రసాధికార ముత్పన్నమై యుండు నని విజ్ఞుల యభిప్రాయము గదా! లభ్యమాన మగు నాతని గ్రంథమును పరిశీలించినచో రాజశేఖరుడు చాల విషయము లందు రుద్రటుననుసరించి నట్లు కన్పట్టును. కావున రససంఖ్యావిషయము నందును రుద్రటుని యభిప్రాయమునే గ్రహించియుండు నని భావించినచో రాజశేఖరుడును శాంతము నంగీకరించినవాడే యగును.

భట్టతోతుడు అభినవుని గురువు. కావ్యకౌతుక మను గ్రంథమును వ్రాసిన వాడు. దానికి అభినవుడు వ్యాఖ్య నయితము వ్రాసినాడు. లోచనములో అభినవుడు ఆ ప్రస్తావన తెచ్చి భట్టతోతుడు నయితము శాంతము నంగీకరించె నని సూచించెను

భట్టనాయకుడును శాంతము నంగీకరించిన వాడే అతడు నాట్యశాస్త్రము నకు వ్యాఖ్యానము వ్రాసినట్లు అభినవభారతి వలన తెలియుచున్నది. నాట్యశాస్త్ర మంగళశ్లోకమును వ్యాఖ్యానించుచు భావనాత్మకముగ నది శాంతరసవ్యంజక మని నుడివి యున్నాడు. భట్టనాయకుడు భరతగ్రంథ మందలి శాంతరసప్రకరణము ను యథార్థముగనే పరిగణించినట్లు కన్పట్టును. (N. R. P 44)

అభినవుడు విపక్షవాదములను ఖండించి శాంతరసమునకు ఉన్నతస్థానమును సంక్రమింప జేసినాడు. లోచనమునందును అభినవభారతియందును అతడు చేసిన

---

1 కైశ్చిచ్ఛాంతస్య రసత్వం నేష్టమ్. తదయుక్తమ్
భావాదికారణానా మత్రాపి విద్యమానత్వాత్
రుద్ర - కావ్యాలంకార - పు 166

చర్చ తలస్పర్శముగా నున్నది. అర్వాచీనులకు ఆదర్శప్రాయ మైన సిద్ధాంతము నొసర్చినాడు. శాంతరసస్థాపనమే గాక శాంత మొకటే ప్రకృతిరస మనియు మిగిలినవి వికృతిరసములనియు వర్ణించినాడు ఇతని శిష్యు డగు క్షేమేంద్రుడును శాంతరస మంగీకరించిన వాడే అలంకారశాస్త్రమున ఎన్నియో విలక్షణాభిప్రాయములను తెల్పి తన ప్రత్యేకతను నిలబెట్టుకొనిన భోజుడు కూడ శాంతము నంగీకరించినాడు.

శాంతరసస్థాయి

అభినవగుప్తుడు శాంతరసమును స్థాపించుచు దానికి స్థాయిభావమును నిరూపించుటకు ముందు వివిధాలంకారికుల యభిప్రాయములను వివరించి వానిని ఖండించినాడు. అతడు ఇతరుల యభిప్రాయములను నామరహితముగ తెల్పియున్నాడు. అందుమొదటి వాదము శమమును గూర్చినది.

శ మ ము - [1] శాంతము శమస్థాయిభావాత్మక మని కొందరందురు దీనిని ఇతరులు నొప్పుకొనరు. శమశాంతములు పర్యాయములే గదా! అంతియే గాక ఏకోనపంచాశద్భావములను సంఖ్యయు నసంగత మగును

స మ్య క్ జ్ఞా న ము - రుద్రటుడు కావ్యాలంకారమున సమ్యక్‌జ్ఞానము శాంతరసమునకు ప్రకృతి యని పేర్కొనెను. తద్వ్యాఖ్యాత యగు నమిసాధువు సమ్యక్‌జ్ఞానము స్థాయిభావ మనియే స్పష్టీకరించెను.

సమ్యక్‌జ్ఞానప్రకృతిః శాంతో విగతేచ్ఛనాయకో భవతి
సమ్యక్‌జ్ఞానం విషయే తమసో రాగస్య చాపగమాత్ [2]

సమ్యక్‌జ్ఞానం - స్థాయిభావః (నమిసాధువు)

రుద్రటుడు శమమును పరామర్శింపక సమ్యక్‌జ్ఞానమును స్థాయిగా చెప్పుటచే బట్టి అతడు భరతుని గ్రంథములో చేర్పబడిన శాంతరసవిషయమును చూచి

---

[1] అభినవభారతి పు 332

[2] రుద్రటాలంకార XVI - 15

యుండ దనదగును. కాని అతనికాలము నాటికే ఇది వివాదాస్పదవిషయమై యుం డుటను బట్టి స్వతంత్రస్థాయిని పేర్కొని యుండవచ్చును.

తృష్ణాక్షయ సుఖము - ఆనందవర్ధనుడు శాంతరసమునకు తృష్ణాక్షయ సుఖము స్థాయి యనినాడు. "శాంతశ్చ తృష్ణాక్షయసుఖస్య యః పరి పోషః తల్లక్షణో రసః ప్రతీయతే"[3] శమాదులను కాదని ఆనందవర్ధనుడు తృష్ణాక్షయసుఖమునే శాంతరసస్థాయిగా నిరూపించుటను బట్టి ఆనందవర్ధనుడు కూడ శాంతరసగ్రంథమును చూడకే దనవచ్చును. తృష్ణాక్షయసుఖమును స్థాయి యనుటను బట్టియు భారతమున ప్రధానరసము శాంతము అనుటను బట్టియు[4] ఇతడు వ్యాసప్రభావితుడై ఇట్లనినా డనవచ్చును. తృష్ణను సర్వభావముల కుప లక్షకముగ గ్రహించినచో తృష్ణాక్షయసుఖ మనగా శమమే కావచ్చును, లేదా సర్వ చిత్తవృత్తి ప్రశమము కాదగును. ఒక విధముగా నిది శమతుల్యమే, అని

అస్య చ శాంతస్య అహంకారప్రశమైకరూపతయా స్థితేః[5]

అను వాక్యమును బట్టి తెలిసికొనవచ్చును. అహంకారప్రశమ మనగా నిరీహత్వ మని అభినవుడు తెల్పెను. ఈ ఇరువురకు నేకలవ్యశిష్యుడైన హేమచంద్రుడు తృష్ణాక్షయమును, శమమును సమాన మని నడివినాడు.

తృష్ణాక్షయరూపః శమః స్థాయిభావః చర్వణాం ప్రాప్తః శాన్తో రసః[6]

సర్వచిత్తవృత్తి ప్రశమము :-

ఈ స్థాయి నెవరు తెల్పినారో వారి పేరు తెలియదు. కాని ఈ క్రింది లోచనవాక్యముల ద్వారా యీ భావ మెరుకపడుచున్నది.

---

3. ధ్వన్యాలోకము – తృతీయోద్ద్యోతము పు 176

4. ధ్వన్యాలోకము - చతుర్థోద్ద్యోతము

5. ధ్వన్యాలోకము - తృతీయోద్ద్యోతము పు 177

6. కావ్యానుశాసనము - పు. 80

"అన్యే తు సర్వచిత్తవృత్తిప్రశమ ఏవాస్య స్థాయీతి మన్యన్తే తచ్చాసత్ భావస్య ప్రసజ్యప్రతిషేధరూపత్వే చేతోవృత్తిస్వభావేన భావత్వాయోగాత్ - పర్యుదాసే తు అస్మత్పక్ష ఏవ."

ఇచట సర్వభావప్రశమము అనుచో ప్రసజ్య ప్రతిషేధము నంగీకరించినచో భావమే యుండదు కావున భావత్వమే లేనిచో స్థాయిభావత్వ మనుచితము. కావున ప్రసజ్య ప్రతిషేధ మంగీకార్యము కాదు. పర్యుదాస మన్నచో నది అభినవుని యభిప్రాయమే.

నిర్విశేష చిత్తవృత్తి --
(అనుపజాత చిత్తవృత్తి)

కొందరు నిర్విశేషచిత్తవృత్తినే (అనుపజాతచిత్తవృత్తి) శాంతమునకు స్థాయిగా పేర్కొనిరి. లోచనము ద్వారా తెలియుచున్నది.

ఇతి శాంతవాద్యాం దృష్టవన్తః సర్వరససామాన్యస్వభావం శాన్త మాచక్షాణా అనుపజాతవిశేషాన్తరం చిత్తవృత్తిరూపం శాంతస్య స్థాయిభావన్న మన్యన్తే

అనగా పుట్టని చిత్తవృత్తి అనుపజాతచిత్తవృత్తి. అనగా చిత్తవృత్తికి ప్రాగభావము మొదట నున్న తృష్ణ క్రమముగా తిరిగి సుఖ మొందుట తృష్ణాక్షయము. ఇది ప్రధ్వంసాభావము. ఈ రెంటికిని ఈషన్మాత్రభేద మున్నది. కోరిక యుండుట మానవ స్వభావసిద్ధము. అవి క్రమముగా అనుభవము పెరిగిన కొలది క్షీణించును కాన తృష్ణాక్షయమే ప్రకృతి సిద్ధ మనుట సమంజసము.

ధృతి

భోజుడు సరస్వతీకంఠాభరణమున ధృతిని శాంతరస స్థాయిగా చెప్పినాడు. ధృతి స్థాయిభావః వస్తుతత్త్వాలోచనాదిభిః వ్యభిచారిభావైః వాగారంభాదిభి రస పఠ్యమానః నిష్పన్నః శాంత ఇత్యభిగీయతే -

---

లోచనము - పు 177

భోజుని యీ యభిప్రాయము సాహిత్యమీమాంస (TSS149 P59) లో చెప్పబడినది తాను శాంతము నంగీకరింపకున్నను సాహిత్య మీమాంస కర్త యీ విషయమును తెల్పినాడు.

అంటియె గాక శమము గూడ ధృతి విశేషమే యని దానిని ధృతిలో అంతర్భావింప జేసెను.

అన్యే పున రస్య శమం ప్రకృతి మాహునంతి న తు ధృతే రేవ విశేషో భవతి.

భోజుని యభిప్రాయమున ధృతి యనగా సంతుష్టి, సంతృప్తి (Cantand ment) అని అట నిచ్చిన ఉదాహరణము ద్వారా ఎరుకపడు చున్నది. శమమును భోజు డిందు శాంతస్థాయిగా అంగీకరింపలేదు. ఇతరుల మతముగా చెప్పినాడు. భరతుడు తెల్పిన 49 భావములలో శమము లేకుండుటయే దీనికి కారణము కావలయును. ఈ భావములలో ధృతి కలదు

కాని శృంగారప్రకాశమున భోజుడు ధృతిని విడచి శమమునే శాంతస్థాయిగా నిరూపించినాడు.

అత్ర చ శమ ప్రకృతి శ్శాన్తః [9]

నిర్వేదము

భరతుని 49 భావములలో శమము లేకుండుటచే నిర్వేదమును శాంతరస స్థాయిగా కొందరు ప్రతిపాదించిరి. దానికి కారణము వ్యభిచారులలో అమంగళ ప్రద మగు నిర్వేదమును ముందుగా చెప్పుటయే యని వారి భావము :-

తత్త్వజ్ఞానజో నిర్వేదో ఽస్య స్థాయీ - ఏతదర్థ మేవ ఉభయ ధర్మోపజీవిత్వఖ్యాపనాయ అమంగళ భూతోఽ ప్యసౌ పూర్వం నిర్దిష్టః [10]

యా చాసౌ తథా భూతా (మోక్షాభిధానపరమపురుషార్థోచితా) చిత్తవృత్తిః సైవాత్ర (శాంత) స్థాయిభావః- ఏతత్తు చిన్త్యమ్- కిం

---

[9] శృంగార ప్రకాశః Mad - Ms Vol I PP 377 - 8

[10] అభినవభారతి పు 269, 270

నామాఽసౌ -తత్త్వజ్ఞానోత్థితో నిర్వేద ఇతి కేచిత్ - తథాహి-దారిద్ర్యాదిప్రభవో యో నిర్వేదః తతో ఽన్య ఏవ - హేతో స్తత్త్వజ్ఞానస్య వైలక్షణ్యాత్. స్థాయిసంచారిమధ్యే చ పఠతదర్థ మేవాయం పఠితః అన్యథా మాంగళికో మునిః తథా న పఠేత్" [11]

నిజమునకు భరతుడు నిర్వేదమును స్థాయిగా వచింపలేదు. కాని స్థాయిభావములను ప్రవచించి వెనువెంటనే వ్యభిచారులను తదాదిని అమంగళప్రేరక మగు నిర్వేదమును వివరించుటలో వానికి ప్రత్యేకాశయ మొండు కలదని వీరివాదము.

భరతునిచే నిర్వేద మిట్లు నిర్వచింపబడినది

"తత్ర నిర్వేదో నామ దారిద్ర్యవ్యాధ్యవమానాధిక్షేపాకృష్ట క్రోధతాడనేష్టజనవియోగ తత్త్వజ్ఞానాదిభిః విభావై రుత్పద్యతే"

అందు తత్త్వజ్ఞానోద్భవ మైన నిర్వేదము మాత్రమే శాంతరసస్థాయి కాగలదు. ఇతర మైన కారణములచే సుద్భవ మైన నిర్వేదము వ్యభిచారిమాత్ర మగును.[12]

ఈ నిర్వేదమును అభినవుడు — తత్త్వజ్ఞానజశ్చ నిర్వేదః స్థాయ్యంతరోపమర్దకః - భావసైచిత్ర్యసహిష్ణుభ్యో రత్యాదిభ్యో యః పరమః స్థాయిశీలః స ఏవ హి సాయ్యంతరాణాముపమర్దకః" అని వచించెను.

నిర్వేదమును శాంతరసస్థాయిగా నంగీకరించు వారిలో మమ్మటుడు ఒకడు. ఇతడు దీనిని అమంగళ మని యనక అమంగళప్రాయమే యని తెల్పినాడు.[13]

---

11 అభినవ భారతి - పు 334

12 - నాట్యశాస్త్రము భా - 1, పు 357

13 "నిర్వేదస్య అమంగళప్రాయస్య ప్రథమ మనుపాదేయత్వేఽపి ఉపాదానం వ్యభిచారిత్వేఽపి స్థాయిత్వాభిధానార్థమ్. తేన నిర్వేదః స్థాయిభావాఖ్యః శాంతోఽపి నవమో రసః"

కాని తద్వ్యాఖ్యాతు డగు భట్టగోపాలుడు నిర్వేదమును అమంగళప్రాయ మగుట తగ దనియు సీదు మిక్కిలి మంగళప్రాయమే యనియు తెల్పినాడు. [14]

స్థాయివ్యభిచారుల మధ్యమున అమంగళప్రాయ మైన నిర్వేదమును భరతుడు "దేశాశీదీపన్యాయము"న పఠించినాడు అనగా అది స్థాయియు వ్యభిచారియు రెండును అగును. అట్లయిన అమర్షము క్రోధమువలె రౌద్రమునకు, విషాదము శోకము వలె కరుణమునకు స్థాయిలు కావచ్చును. కాని వీనిని భరతు డట్లు పేర్కొనలేదు.

ఈ వాదమున సందేహింప దగిన యంశ మొంతు కలదు. వ్యభిచారి యని కంఠోక్తిగా పేర్కొనిన నిర్వేదము స్థాయి యగుట తగునా? ఇది భరత సమ్మతమా? అని. కాని ఏతద్వాదపోషకులు భరతుని కిది సమ్మతమే యందురు. భరతుడు రతికి వ్యభిచారులను నిర్దేశించుచు

"వ్యభిచారిణశ్చాస్య ఆలస్యౌగ్ర్యజుగుప్సావర్జ్యాః"[15]

అని పేర్కొనెను. ఇట జుగుప్సను కూడ పేర్కొనుటచే ఒక్కొకచో స్థాయి భావము వ్యభిచారి కాదగునని భరతుని యాశయము.

ఈ విషయమును అభినవుడు పూర్వపక్షముగా ప్రవచించినాడు అతడు నిర్వేదమును శాంతస్థాయి కా దనును. నిర్వేద మనగా తత్త్వజ్ఞానోద్భూత మైనది కదా! అనగా నిర్వేదము స్థాయి, తత్త్వజ్ఞానము విభావము కావలయును. అప్పుడు ఇతరము లైన వైరాగ్యము సమాధి మున్నగునవి కారణము లగుటచే వానిని కూడ విభావము లనదగును ఇట్లయినచో కారణమునకు కారణమైనది (ప్రత్యక్షకారణము కాని మూలరూపమున కారణ మైనది) విభావము కానేరదు. మోక్షము కూడ సాక్షాత్తు తత్త్వజ్ఞానము వలననే కల్గును కాని తత్త్వజ్ఞానము వలన ముందు నిర్వేదము తరువాత మోక్షము కల్గు ననుట సరికాదు. తత్త్వజ్ఞానమే మోక్షము నిచ్చును. అదియు శమమునందే అంతర్భవించు ను.

---

14 తత్త్వచింతాయాం తు నిర్వేదస్య న కించి దమంగళప్రాయత్వమ్.
ప్రత్యుత మంగళప్రాయత్వ మిత్యాహ - TSS Edn కావ్యప్రకాశః
పు 138

15 నాట్యశాస్త్రము - 1, పు 300

ఉ త్సా హ ము .-

ఉత్సాహమను శాంతస్థాయిగా అంగీకరించెడి వారు ఇసుకతో మేడలు కట్టిరి. వారి వాద మేమో వారికే తెలియదు. ప్రతిపక్షులు శాంతమును వీరములో నంతర్భ వించుచున్నారని అర్థము చేసికొనిరి. భరతుడు చెప్పిన ఆష్టరసములలో నెందైనను ఈ శాంత మంతర్భవించు నని యొక పూర్వపక్షము. దాని సూచించి ఆనంద వర్ధనుడు సమాధాన మిచ్చును.

'న తస్య వీరేఽన్తర్భావః కర్తుం యుక్తః తస్య అభిమానమయ త్వేన వ్యవస్థాపనాత్ అస్య చాహంకారప్రశమైకరూపతయా స్థితేః ... " ఇత్యాది, మరియు తయోశ్చ ఏవంవిధవిశేషసద్భావేఽపి యద్యైక్యం పరికల్ప్యతే తద్వీరరౌద్రయోరపి తథా ప్రసంగః [16]

దశరూపకావలోకము కూడ ఇట్లనును.

"అన్యేతు వీరబీభత్సాదావంతర్భావం వర్ణయన్తి"

ప్రాధాన్యమును జేసి ఉత్సాహముతో సంపూర్ణసంబంధము గలది వీరరసము. ఇది యుద్ధ ధర్మ, దాన, దయా, భేదములచే చతుర్విధము దయా, ధర్మవీరములే శాంత మని కొందరి వాదము. కాని శాంతము విస్తృత మైనది. దానియందే దయా, దానవీరము లంతర్భవించును. దానిచే నది తిరోహితము కాదు. దాన వీరము శాంతమున కంగము. ఇవి యీ విషయము ధ్వన్యాలోకమున శాంతరస స్థాపన ప్రసంగమందు విస్తృతముగ వివరింపబడినవి. [17]

జగన్నాథుడు పేర్కొన్న క్షమావీరాదులు కూడ దీని కంగములే కావున ఉత్సాహము శాంతము కాకపోగ శాంతము అనేకోత్సాహభేదములను తనలో చేర్చు కొనును. అనగా చిత్తద్రుతిని కల్గించెడి కొన్ని ఉత్సాహములు శాంతమున వ్యభి చారిత్వము నందగలవు దయాదానోత్సాహాదులు ఎప్పుడూ శాంతరసమున వ్యభిచా రులుగా సూచితములే.

---

16 ధ్వన్యాలోకః - తృతీయ - పు 177 - 8

17 ధ్వన్యాలోకః - తృతీయోద్యోతము

ర్తృత్వమును గుర్తెరింగి ద్వైతత్వమును పొందిన యోగి కూడ కృతకృత్యుడై అవాప్తసమస్తకాముడైనను ఈ లోకమున జీవన్ముక్తునివలె వసించుచునే యుండును. లౌకికకర్మలను చేయుచునే యుండును.

ఉ: శ్లో

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యమ్ వర్తఏవ చ కర్మణి. [18]

అట్లు దాన, దయా, ధర్మవీరముల వలె స్వార్థరహితప్రవృత్తి గల ఉత్సాహము శాంతరసపోషకారి యగును.

అభినవు డిట్లనును "స్వాత్మని కృతకృత్యస్య పరార్థఘటనాయామేవ ఉద్యమ ఇతి ఉత్సాహోఽస్య పరోపకారవిషయేచ్ఛాప్రయత్న రూపో దయారూపరపర్యాయః అత్యధికో ఽన్తరంగః అత ఏవ తత్కేచిత్ దయావీరత్వేన వ్యపదిశన్తి అన్యే తు ధర్మవీరత్వేన [19].

జుగుప్సా:-

"జుగుప్సేతి కేచిత్" అని అభినవభారతి నుడువు చున్నది. మోక్షమునకు వైరాగ్యమే ప్రధానమనియు అట్టి వైరాగ్యము లౌకికవిషయములపై జుగుప్సా భావము వలన కల్గు ననియు అదియే శాంతస్థాయి యనియు ఈ వాదసారాంశమై యుండనోపును. భట్టతౌతుడు ఈ భావమును కొంతవరకు ప్రపంచించెను. భరతుడు రసములలోని అంతర్భాగములను వివరించుచు బీభత్సవిషయమున

బీభత్సః క్షోభణః శుద్ధ ఉద్వేగే స్యాత్ ద్వితీయకః
విష్ఠాకృమిభి రుద్వేగో క్షోభణో రుధిరాదిజః .

భగవద్గీత III - 22
అభినవ భారతి:- 1, పు 333

బీభత్సము క్షోభణ మరియు ఉద్వేగి యనియును ద్వివిధము. క్షోభణ పదమునకు శుద్ధమని విశేషణము కలదు. కాన వ్యాఖ్యాతలు క్షోభణము శుద్ధ మరియు ఉద్వేగి అశుద్ధ మనియు వివరించిరి [20]

కాని భట్టతౌతుడు బీభత్సమును మూడువిధములుగ వచించును. 1 క్షోభణము 2 శుద్ధము 3 ఉద్వేగి అని విభాగించెను. ఇందు శుద్ధజుగుప్సయే మోక్షసాధకము. భరతుడు 'స్యాద్ద్వితీయకః' అని యనుట శుద్ధజుగుప్సయొక్క దుర్లభత్వమును అప్రాచుర్యమును సూచించును.

దీని నభినవు డిట్లు వివరించినాడు.

"రుధిరాంత్రాదిదర్శనాద్యో బీభత్సః ప్రక్షోభణశ్చాచ్ఛుద్ధః యస్తు విష్ఠాదిభ్యః స ఉద్వేగీ హృదయం చలయతి. సోఽశుద్ధః అశుద్ధవిభావకత్వాత్"

అభినవుడు వీనిని రెండు విధములే యనును. కాని ఉపాధ్యాయుని మతము నిట్లు వచించెను.

ఉపాధ్యాయ స్త్వాహ - బీభత్సః స్తావత్ విభావవిశేషాత్ యత్ర తు సంసారనాట్యనాయక రాగప్రతిపక్షతయా మోక్షసాధనత్వాత్ శుద్ధః - యదాహుః "శౌచాత్ స్వాఙ్గజుగుప్సా" (ఇతి యోగసూ II.40) "తథా వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్" ఇతి (యోగసూ II 33) తేన సోఽపి (బీభత్సోఽపి) పరమార్థతః త్రివిధ ఏవ.

శాంతరసము లేదనువారు కొందరు శాంతమును వీరబీభత్సాదులలో అంతర్భవింప చేయుదురు. దశరూపకావలోకమునందు

"అన్యే తు వీరబీభత్సాదౌ అన్తర్భావం వర్ణయన్తి"

అని వచింపబడెను

వీని నన్నింటిని కాదనుచు అభినవుడు లోచనమున

---

[20] లోచనాముద్రణమునందు 'స్యాత్తృతీయకః' అను పాఠము కన్పట్టును, కాని భట్టతౌతుని ఈ పాఠము [illegible]

అతో గ్రహణేన విషయజుగుప్సారూపత్వాత్ రతిత్వే ఽన్తర్భావః శక్యతే - సా త్వస్య వ్యభిచారిణీ భవతి న తు స్థాయితా మేతి. (పు 178)

అని వచించినారు.

అభినవభారతిలో "కేవలం యథా విప్రలంభే ఔత్సుక్యమ్ సంభోగేపి వా ప్రేమానమాప్తోత్సవమ్" ఇతి యథా చ రౌద్రే ఔగ్ర్యమ్ యథా చ కరుణ వీర భయానకాద్భుతేషు నిర్వేదధృత్యాదయః వ్యభిచారిణో ఽపి ప్రాధాన్యే నావ భాసన్తే తథా శాంతే జుగుప్సాదయః - సర్వ త్రైవ రాగప్రతిపక్షత్వాత్ పు 333.

విప్రలంభాదులలో ఔత్సుక్యాదుల వలె శాంతమందు జుగుప్సాదులు వ్యభిచారులయ్యును ప్రధానముగా నవభాసించును రాగప్రతిపక్షము లగుటయే దీనికి కారణము.

రతి

ప్రశమస్థాయికమగు శాంతమే శాంతరసస్థాయి యని కొందరు - నామ మాత్రమునను రతి యైనను ఈ రతిభావము స్త్రీపురుషవిషయికము కాదు. ఒక మానవు నకు సర్వజనవిషయకముగ సర్వజనసామాన్యముగ నుండెడు సమత్వరూపక మైన రతి. దీనికే ఆత్మరతి యనదగును. అది జుగుప్సావాదమునకు సన్నిహిత మైనదే. లౌకికజీవితముపై జుగుప్స యనగా సర్వత్ర ఆత్మప్రబోధముచే ఆత్మ అవ తరించి ఆత్మరతి యుత్పన్నమగును.

యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవానుపశ్యతి
సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే

ఈ భావమును భోజు డాదరించెను.

శాన్తో రసో న రసనీయతో ఆత్మరక్తేః (శృంగారప్రకాశః)

అభినవభారతి ఈ రతివాదమును ఈ క్రింది విధముగ వచించును.

తత్ర అనాహతానందమయస్యాత్మవిషయా రతి రేవ మోక్ష సాధన మితి సైవ శాంతే స్థాయినీ యథోక్తమ్

'యస్త్వాత్మరతి రేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః
ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే'

ఇతి భగవద్గీతా- కాని రతిని కూడ ఉత్సాహాదుల వలె ప్రధానము కాదని అభినవుడు త్రోసిపుచ్చెను. అత ఏవ ఈశ్వరప్రణిధానవిషయే భక్తిశ్రద్ధే స్మృతిమతిధృత్యుత్సాహానుప్రవిష్టే అన్యథైవాఙ్గమితి న తయోః పృథగ్రసత్వేన గణనమ్.

స్థాయ్యన్యతమము - (స్థాయులలో నొకటి)

భరతుడు చెప్పిన స్థాయిభావములందే యొకటి యలౌకిక విభావవిశేషసంశ్రయమై విచిత్రమై శాంతస్థాయి యగునని కొందరు వచించిరి. ఈ విషయమును అభినవుడే పేర్కొనెను.[31] కాని అభినవుడు దీని పూర్వపక్షమొనరించుచు స్థాయిభావము లన్నియు శాంతస్థాయి యగుటలో సమానప్రతిపత్తినే కల్గియున్నవనివాడు దాని నిట్లు వివరించినాడు. ఈ యభిప్రాయము ననుసరించియే వీరమునందు దయాధర్మములను, జుగుప్సలో శర్దజాగుప్సను, రతియందు ఆత్మరతిని శాంతరస స్థాయులుగా వచించిరి. ఈ స్థాయిభావములలో మిగిలినవి యితరము స్థాయులు కావను వనెడి పూర్వపక్షమును అభినవుడీ క్రిందరీతిని ప్రవచించుచున్నాడు.

ఏవం సమస్తవిషయం వైకృతం[1] పశ్యతః విశ్వం చ శోచ్యం[2] విలోకయతః సాంసారికం చ వృత్తమపకారిత్వేన ... పశ్యతః ... శయమ్ అసమ్మోహప్రధానం వీర్య[4]మాశ్రితవతః సర్వస్మాత్ విషయసార్థాత్ బిభ్యతః[5] సర్వలోకస్పృహణీయాదపి ప్రమదాదేః జుగుప్సమానస్య[6] అపూర్వ స్వాత్మాతిశయలాభాత్ విస్మయమానస్య[7]

---

31 అన్యే మన్యంతే రత్యాదయ ఏవ ... స్థాయి ... ఉక్తాః త ఏవ కథితవిభావవిలక్షణయా శ్రుతాద్యలౌకిక విభావవిశేషసంశ్రయా విచిత్రా ఏవ భవత్ – తత శ్చ తన్మధ్యా దేవ అన్యతమోఽత్ర స్థాయీ.

1. హాస 2. శోక 3. క్రోధ 4. ఉత్సాహ 5. భయ 6. జుగుప్సా 7. విస్మయము

మోక్షసిద్ధిప్రతిపాదినాం వివిధయోగానాం స్థాయిత్వమపి నిరూపణీయమ్. న చైతన్మునేః సమ్మతమ్. యావన్త ఏవ హి విశిష్టాన్ విభావాన్ పరిగణయతి రత్యాదిశబ్దేన చ తత్ప్రకారేణ అన్యాన్ గృహ్ణీతే తావన్త ఏవ తద్వ్యతిరిక్త-అలౌకిక హేతూపగతానాం రత్యాదీనామనుజానాత్యేవ అపరిగ్రహవిషయత్వమ్ -

ఏకవాదినాం తు సంస్కారమేవ విభావయతాం ఏకస్య స్థాయిత్వం విశిష్య ఏక - తదుపాయభేదాత్ తస్య తస్య స్థాయిత్వమిత్యపి రత్యమానం ప్రత్యక్షమేవ స్థాయిభేదే ప్రతిపురుషం రసస్యాప్యానంత్యాపత్తేః. మోక్షైకఫలత్వాదేకో రస ఇతి చేత్ పురుషార్థైకఫలత్వే వీర రౌద్రాదయో రసైకత్వం స్యాత్ పునః -7

సర్వస్థాయి సమ్మేళనము

కొందరు సర్వస్థాయి సమ్మేళనమే శాంతస్థాయిగా పేర్కొనిరి.[2] స్థాయి భావములు ఎనిమిదియు పానకరసము వలె సమ్మిళితమై శాంతరసస్థాయి యగు నని వచించిరి. ఈ భావమునే స్థాయిభావములను నిరూపించుచు శాంతరసస్థాయి విషయమున 6వ అధ్యాయమున "సర్వేషామేకత్వే" అని సూచించెను. ఇది కేవలము పూర్వపూర్వపక్షముగనే వచింపబడినది.[1] సర్వస్థాయిభావము లొక్కుమ్మడి ఒక్కసారిగా కలిసి వేరొక్క రసమునకు స్థాయిభావమగుట పొసగనిది. అవి అన్యోన్య విరుద్ధ భావములు కలిగినవి కాన రత్యాదులు సమకాలమున అవిభాజ్యములై యుండుట కుదురదు. ఇది మనోజ్ఞము కాదు, అన్నియు కలిసి మరొక స్థాయి యైనచో రత్యాదు

---

[2] అన్యే తు పానకరసవత్ అవిభాగం ప్రాప్తాః సర్వ ఏవ రత్యాదయోఽత్ర స్థాయిన ఇత్యాహుః -

[1] చిత్తవృత్తీనామయుగపద్భావాత్, అన్యోన్యం చ విరోధాత్ ఏతదపి న మనోజ్ఞమ్

లన్నియు వ్యభిచారులే యగును కాని స్థాయి కానేరవు. తత్త్వజ్ఞానలక్షణ మైన స్థాయిభావమునకు లౌకికము అలౌకికము నైన యీ చిత్తవృత్తికలాప మంతయు వ్యభిచారియే యగును.[24]

తత్త్వజ్ఞానము (సిద్ధాంతము)

ఇట్లు వీని నన్నిటిని పూర్వపక్ష మొనరించి, యింతకు అసలు శాంతమునకు స్థాయిభావ మేమి యని ప్రశ్నించుకొని తత్త్వజ్ఞానమే స్థాయిభావ మని వచించెను. తత్త్వజ్ఞానమే మోక్షసాధనము కావున స్థాయిభావముగా నుండుట కదియే తగినది. తత్త్వజ్ఞాన మనగా ఆత్మజ్ఞానమే.[25] కావున జ్ఞానము ఆనందము మొదలగు విశుద్ధ ధర్మములతో కూడినదియు కల్పింపబడిన విషయముల యొక్క ఉపభోగము లేనిదియు నైన ఆత్మయే శాంతమునకు స్థాయి భావము.[26]

ఈ విషయమునే అభినవుడు పూర్వమునుండియు చెప్పుచు వచ్చినాడు. రసము లను స్థాయిభావములను వివరించు సందర్భమున షష్ఠాధ్యాయమున నిట్లు వచించినాడు. త్రివర్గాత్మక ప్రవృత్తి ధర్మమునకు విపరీతమును, నివృత్తి ధర్మాత్మకమును మోక్షఫలము నైన శాంతము వచింపబడును. అందు స్వాత్మావేశము చేత రసచర్వణము కల్గును[27] అని. శాంతస్థాయి యైన యీ ఆత్మజ్ఞానము ఇతరము లైన రత్యాదుల వంటిది కాదు. వాని యన్నిటికంటె ఉన్నతస్థితిలో నున్నది. సర్వస్థాయిభావములకు భిత్తిస్థానీయ మైనది. రత్యాదులు ఆయా కారణాంతరముల యొక్క

---

24 తత్త్వజ్ఞానలక్షణస్య చ స్థాయినః సమస్తోఽయం లౌకికాలౌకికచిత్తవృత్తి కలాపో వ్యభిచారితా మభ్యేతి

25 ఇహ తత్త్వజ్ఞాన మేవ తావ న్మోక్షసాధన మితి తస్యైవ మోక్షే స్థాయితా యుక్తా. తత్త్వజ్ఞానం చ నామ ఆత్మజ్ఞాన మేవ.-నా. శా. పు 337

26 తేన ఆత్మైవ జ్ఞానానందాది విశుద్ధ ధర్మయోగీ, పరికల్పిత విషయోపభోగ రహితోఽత్ర స్థాయీ — నా. శా. పు 337

27 తత్ర త్రివర్గాత్మక ప్రవృత్తి ధర్మవిపరీత నివృత్తిధర్మాత్మకో మోక్ష ఫలః శాంతః తత్ర స్వాత్మావేశేన రసచర్వణేత్యుక్తమ్. నా. శా. పు 269

దయ ప్రలయములచే ఉత్పద్యమానములు విపద్యమానములు నగుచు అపేక్ష ననుసరించి కొంతకాలము స్థాయిరూప మైన ఆత్మ యనెడి భిత్తి నాశ్రయించినపై స్థాయి భావము లనబడు చున్నవి. తత్త్వజ్ఞాన మట్టిది కాదు."

అది సకల భావములకు భిత్తిస్థానీయము. [10] సర్వస్థాయి భావములకంటె స్థాయితమ మైనది. రత్యాది చిత్తవృత్తు లన్నియు దానికి వ్యభిచారి భావము లగును. కావున నే అది సిద్ధస్థాయి భావము. అందువలననే భరతుడు దానిని వేరుగ పరిగణింపక 49 భావములని చెప్పెను. రత్యాదులలో నొకటిగా భరతుడు ఆత్మజ్ఞానమును చెప్పకపోవుటయును విభావాదులను చెప్ప కుండుటయును కారణము వివేకంబె ఉత్తమ మైనది యగుటయే. ఈ విషయమును భట్టగోపాలుడు కావ్యప్రకాశవ్యాఖ్యలో

"విభావాద్య ప్రతిపాదనం తస్య పరమ పురుషార్థతయా
లోకయాత్రాతిక్రాంతత్వాత్"

(కావ్యప్రకాశము - తంజావూరు ముద్రణము - వ్యాఖ్య - పు 139)

అని పలికెను. ఆత్మజ్ఞానము పరమ పురుషార్థ మగుటచే లోకయాత్ర నతిక్రమించుట చేతనే వేరుగ విభావాదులను ప్రతి పాదింపలేదు.

భరతుడు కేవలము వ్యభిచారిభావములు కాగల స్థాయి భావములను మాత్రమే పేర్కొనినాడు. ఆత్మజ్ఞాన మనునది యెన్నడును వ్యభిచారి భావము కానేరదు. అట్లయినచో అవైచిత్ర్యము, అనౌచిత్యము కల్గును. ఈ ఆత్మజ్ఞానమే శమము. శాంతరసగ్రంథమునందు భరతుడు శమమే శాంతరసమునకు స్థాయిభావ మని వచించినట్లు

---

10. న చాస్య స్థాయితయా స్థాయిత్వం వచనీయమ్ - రత్యాదయోహి తత్తత్కారణాంతరోదయ, ప్రలయోత్పద్యమాన, విపద్యమాన, వృత్తయః కంచిత్కాల మాపేక్షితతయా స్థాయిరూపాత్మభిత్తి సంశ్రయాః స్థాయిన ఉచ్యన్తే - తత్త్వజ్ఞానం తు సకల భావాంతర భిత్తిస్థానీయం సర్వస్థాయిభ్యః స్థాయితమం సర్వా రత్యాదికాః చిత్తవృత్తీః వ్యభిచారీ భావయన్ నిసర్గత ఏవ సిద్ధస్థాయిభావ మితి తస్య వచనీయమ్ : అత ఏవ పృథగస్య గణనా న యుక్తా - న హి [illegible] గోత్వ మితి గణ్యతే -

కలదు. [39] అనగా తత్త్వజ్ఞానము ఆత్మస్వరూపము, ఆత్మస్వభావము, ఆత్మ శమము అనునవి పర్యాయపదములుగ గ్రహింపదగును.

తేన పశాన్న పంచాశద్భావా ఇత్య వ్యాహార మేవ-న చాస్య ఆత్మ స్వభావస్య వ్యభిచారిత్వమ్ - అసంభవాత్

ఇతర రసములు

ప్రేయోరసము

ప్రేయస్సును రసముగా పేర్కొనినవాడు రుద్రటుడు. ఇతడు కావ్యాలంకారము నందు 'దశమో రసః ప్రేయాన్' అని ప్రేయస్సును దశమ రసముగా సూచించెను. దానికి స్నేహము స్థాయిభావ మని వచించినాడు సంగత లయు నాయకుడుగా నుండును. స్నేహము సాహచర్యము వలన కలుగును. ఈ సాహచర్యము కూడ ఉపచార సంబంధము కలిగియుండును. ఈ సాహచర్యము మున్నగునవి విభావములు ప్రమదాశ్రుప్రభృతులు, స్ఫారలోచనాలోకములు ఆర్ద్రాంతః కరణత్వము మున్నగునవి యనుభావములు ఇట్లు చెప్పుటయే గాక రుద్రటుడు స్నేహితుల యన్యోన్య వ్యవహారము ప్రేయస్సని వివరించినాడు *

---

[39] వైచిత్ర్యాపహత్వాత్ ఉపాచిత్యాచ్చ - శమ ఆత్మస్వభావః

[40] అథ శాంతో నామ శమస్థాయి భావాత్మకః

* స్నేహప్రకృతిః ప్రేయాన్ సంగతశీలార్థనాయకో భవతి
స్నేహ స్తు సాహచర్యాత్ ప్రకృతే రుపచార సంబంధాత్
కావ్యాలంకారము 15-17

నిర్వ్యాజమనో వృత్తిః పనర్మ సద్భావపేశలాలాపాః
అన్యోన్యం ప్రతి సుహృదో ర్వ్యవహారోఽయం మత స్తత్ర
15-18

ప్రస్యంది ప్రమదా పుస్నిగ్ధస్ఫారలోచనాలోకః
ఆర్ద్రాంతః కరణతయా స్నేహపదే భవతి సర్వత్ర
15-19

రుద్రటు డిట్లు స్నేహస్థాయిక మగు ప్రేయస్సును వచింపగా మరికొందరు స్నేహమే రస మనియు, దానికి ఆర్ద్రత స్థాయిభావ మనియు వచించుచున్నట్లు అభినవభారతి మడువుచున్నది. రుద్రటుడు "ఆర్ద్రాంతఃకరణతయా స్నేహపదే భవతి సర్వత్ర" అని వచించుటచే ఈ యభిప్రాయమునకు మూల మైనట్లు తోచును. అభినవభారతి యీ యభిప్రాయమును ఖండించినది. ఆర్ద్రతాస్థాయిక మగు స్నేహము రస మనుట తప్పు. స్నేహము అభిషంగము మాత్రమే. అది రతి, ఉత్సాహము మున్నగు స్థాయిభావములలో అంతర్భవించును. బాలునకు మాతాపిత్రాదులపై నుండు స్నేహము భయములో నంతర్భవించును. యువకులైన మిత్రులలో నుండు స్నేహము రతియందును, లక్ష్మణాదిసోదరులలో నుండు స్నేహము ధర్మవీరమునందును అంతర్భవించును. ఇట్లు అభినవుడు స్నేహమును ఇతరములలో నంతర్భవింపజేసెను *

భక్తిరసము :-

రససంఖ్యానిర్ణయ మొనర్చునపుడు భక్తిని గూర్చి కూడ చర్చింపవలెను. భక్తి రస మగునా? కాదా? యని ప్రాచీనాలంకారికులలో మొదట చర్చించినవాడు ధనంజయుడు ఇతడు దశరూపకమున భక్తి రసము కాదనియు, కేవలము భావమాత్రమే యనియు వచించెను ప్రీతి, భక్తి మున్నగునవి భావములు అవి హర్షోత్సాహాదులలోనే యంతర్భవించును. వానిని వేరుగ రసములుగ పరిగణింప నవసరములేదు.[1] ఇట్లు ధనంజయుడు అంతర్భావవాదము నూతగా గొని భక్తిని రసము కాదని త్రోసిపుచ్చెను. పైగా దానిని భావమాత్రమే యనివాడు స్థాయిభావత్వము కాని రసత్వముకాని పొందలేదు.

---

* ఆర్ద్రతాస్థాయికః స్నేహో రస ఇతి త్వసత్. స్నేహో హ్యభిషంగః స చ రత్యుత్సాహాదా వేవ పర్యవస్యతి. తథాహి బాలస్య మాతాపిత్రాదౌ స్నేహో భయే విశ్రాంతః, యూనో మిత్రజనే రతౌ, లక్ష్మణాదౌ భ్రాతరి ధర్మవీర ఏవ

ప్రథమభాగము - పు 342

1 ప్రీతి భక్త్యాదయో భావా మృగయాక్షాదయో రసాః

హర్షోత్సాహాదిషు స్పష్ట మన్తర్భావా న్న కీర్తితాః

అభినవగుప్తుడు భక్తివిషయమున అంతర్భావవాదము నాశ్రయించి త్రోసిపుచ్చినాడు. స్మృతి, ధృతి, ఉత్సాహములతో కూడిన భక్తిశ్రద్ధలు ఈశ్వరప్రణిధానవిషయములో ఇతరరసములకు (శాంతమునకు) అంగ మగునే కాని వేరుగా రసములు కానక్కరలేదు. ఇట్లు అతడు భక్తిని శాంతమునందే అంతర్భవింపజేసెను. హేమచంద్రుడును భక్తిని తిరస్కరించినాడు. అతనికి మమ్మటుడే ఆదర్శప్రాయు డైనాడు.

మమ్మటుడు కావ్యప్రకాశికలో [1] దేవాదివిషయక మైన రతి, భావమే కాని రసము కాదని నిరసించెను. ముని, గురు నృపాది విషయక మైన రతి సయితము పరిపుష్టము గాక భావస్థితినే పొందునని ఆదిపదముచే సూచించినాడు.

ఈ భక్తిని మొదట రసముగా పరిగణించినవాడు రూపగోస్వామి. భరతుడు చెప్పిన అష్టరసములను శాంతమును వాత్సల్యమును, ప్రేమ, భక్తి యనువానిని అంగీకరించినాడు. ప్రేమను గూర్చి విశేషముగ వచించినవా డీతడే ప్రేమను అంగిరసముగను శృంగారమును అంగరసముగను వచించినాడు. సర్వరసములు సముద్రములోని తరంగముల వలె ప్రేమము నందు రసరూపముగా నిమజ్జన మగునని యాతని యభిప్రాయము. [2]

రూపగోస్వామి తరువాత సిద్ధాంతపరముగ భక్తిని ప్రతిపాదించినవాడు మధుసూదనసరస్వతి. ఇత డద్వైతి కృష్ణభక్తుడు. భగవద్భక్తిరసాయన మను గ్రంధమును వ్రాసిన వాడితడు. ఇతడు భక్తిని జ్ఞానమందు అంతర్భవింప జేయ దగదనినాడు. మానవ మనస్సులలో నుండు భేదముచే కొందరు జ్ఞానమును కొందరు భక్తిని ఆశ్రయింతురు. స్థిరచిత్తమున, నిర్వేదసాధన మొనర్చినవారు

---

[1] రతిర్దేవాదివిషయా వ్యభిచారీ తథాంజితః
భావః ప్రోక్తః కావ్యప్రకాశ 4-35

[2] ఉన్మజ్జన్తి నిమజ్జన్తి ప్రేమ్ణ్యఖండరసత్వతః
సర్వే రసాశ్చ భావాశ్చ తరంగా ఇవ వారిధౌ

జ్ఞానమార్గము నవలంబింతురు. ద్రుతచిత్తులయిన వారు భగవత్కథాశ్రవణము, భాగవతధర్మశ్రద్ధ కల్గి భక్తి నాశ్రయింతు రనియు వచించినాడు.[1]

ఈ విషయమున మధుసూదనుడు ఒక నూతన విషయమును ప్రతిపాదించినాడు ఈ భక్తికి భగవంతు డాలంబనము. తులసీచందనాదు లుద్దీపనవిభావములు. నేత్రవిక్రియాదు లనుభావములు. నిర్వేదాదులు వ్యభిచారులు. పూర్వులు దీనికి రతి స్థాయిభావ మని వచింపగా నీతడు భగవదాకారత స్థాయిభావ మనెను.[2] ఈ చిత్తవృత్తియే అనిర్వచనీయానందరూప మగు రసముగ పరిణమించును. ఇచట నొక సందేహము కల్గును. ఈతని దృష్టిలో పరమానంద స్వరూప రసము భగవంతుడే. భగవంతుడే ఆలంబనము. స్థాయిభావము నయితము భగవదాకార రూప మయిన చిత్తమే. ఇది యెట్లు పొసగు నని సందేహము కల్గును. దాని కిత డిట్లు సమాధానము చెప్పును.

[3] ఆలంబనము భగవంతుడే. ఆతడు స్వతంత్రుడు. ఆతడు బింబ ప్రాయుడు. మనలో గల స్థాయిభావము ప్రతిబింబరూప మైనది. కావున ఆలంబన స్థాయిభావముల కైక్యము చెప్పరాదు ఈశునకు జీవునకు వలె బింబప్రతిబింబ భావము రెంటికి ప్రసిద్ధము.

---

1 తత శ్చ అద్రుతచిత్తస్య నిర్వేదపూర్వకమ్ తత్త్వజ్ఞానమ్ ద్రుతచిత్తస్య తు భగవత్కథాశ్రవణాది భాగవతధర్మ శ్రద్ధాపూర్వికా భక్తి రితి అవధిత్వేన ద్వయ మప్యుపాత్తమ్ పు - 2

2 భగవాన్ పరమానందరూపః స్వయ మేవ హి
మనోగత స్తదాకార రసతా మేతి పుష్కలమ్

1-10 పు - 18

3 బింబ మేవ హ్యుపాధి విష్ఠత్వేన ప్రతీయమానం ప్రతిబింబ మిత్యుచ్యతే. పరమానంద శ్చ భగవాన్ మనసి ప్రతిబింబితః స్థాయిభావతా మాసాద్య రసతా మాపాదయతీతి భక్తిరసస్య పరమానంద స్వరూపం నిర్వివాదమ్. నాస్యాలంబన విభావ స్థాయిభావయో రైక్యం బింబప్రతిబింబ భావ స్యేవ భేదస్య వ్యవహారసిద్ధత్వాత్, ఈశజీవయో రివ పు18

దేవాది విషయికమైన రతి భావమే కాని రసము కాదను మమ్మటాదుల వాక్యముల నితడు ఖండించి వేరు అర్థము చెప్పినాడు దేవాది విషయక మనగా భగవత్సంబంధ మైనది కాదు. [1] ఇంద్రాది దేవతలకు సంబంధించినది. ఇంద్రాదిదేవతావిషయకమైన రతి భావమే కాగోపును. కావున భగవద్విషయక రతిని భావమాత్రముగా వచింపరాదు. భక్తియే నిజమైన రసము. సుఖదుఃఖస్పృష్టము కాని యనిర్వచనీయానందము భక్తి సమ వలననే లభ్యము. శృంగారాదుల దీనికి న్యూనములు. శృంగారాదులు మిణుగురుల వంటివి. భక్తి సూర్యుని వంటిది - ని ఇతని సిద్ధాన్తము. [2]

భక్తిరసవివేచనము

శాంతమును నవమ రసముగా అంగీకరించిన తర్వాత నవసంఖ్య అప్రతిహత మయినను, తరువాత అది పెరుగసాగినది. అంత నే కాలంకారికులు పూర్వపక్షము చేసి తిరస్కరించిన రసము భక్తిరసము.

"రతి ర్దేవాదివిషయా వ్యభిచారీ తథాంజితః
భావః ప్రోక్తః.... ...." [3]

రతి ర్దేవాదివిషయా వ్యభిచారీ తథోర్జితః
భావః ప్రోక్తః రసో నేతి యదుక్తం రసకోవిదైః

దేవాంతరేషు జీవత్వాత్ పరానందాప్రకాశనాత్
తద్యోజ్యం పరమానందరూపే న పరమాత్మని

II 75-6

కాన్తాదివిషయా వా యే రసాద్యా స్తత్ర నేదృశమ్
రసత్వం పుష్యతే పూర్ణసుఖాస్పర్శిత్వకారణాత్

పరిపూర్ణరసా క్షుద్రరసేభ్యో భగవద్రతిః
ఖద్యోతేభ్య ఇవాదిత్యప్రభేవ బలవత్తరా

II 77-8

[3] కావ్యప్రకాశము - చతుర్థోల్లాసము – శ్లో 35-36

అని దేవ-గురు-పుత్రాదివిషయక మయిన రతికి భావత్వమును కాంతావిషయక రతికి రసత్వము నంగీకరించిరి. కాంతావిషయకరతికే భావత్వము నంగీకరించి దేవాది విషయకరతికే రసత్వము నంగీకరింప వచ్చును కదా! అన్న శంకకు భరతముని వచనవ్యాఘాతత్వ మేర్పడును కావున అది తగ దని జగన్నాథుని సమాధానము.[2]

ఈ భక్తిని రసము కా దనువారు కొందరు కాగ కొందఱు ఇతర రసములలో అంతర్భవింప జేసిరి. మఱికొందరు భక్తి రసమే అని తీర్మానించిరి. అందు ప్రధానుడు మధుసూదన సరస్వతి. భగవద్భక్తి రసాయన మను భక్తిరససిద్ధాంత గ్రంథము నితడు రచించెను.

అనేక విధములుగా నితడు భక్తి రససిద్ధాంతమును స్థాపించి శృంగారాది రసములకన్న దాని కాధిక్యమును కల్పించినాడు. ఇతడు రూపగోస్వామి మున్నగు వారివలె భక్తిని శాంతాంతర్భావము చేయలేదు,

పారమార్థిక పర్యాలోచనము చేసినచో భరత వచనవ్యాఘాతత్వ మొక్కటియే భక్తికి రసత్వము నంగీకరించక పోవుటకు కారణ మగును. మరి యే యితర కారణములు కారణములు కాలేవు. కాంతా విషయకరతినే రస మని, భగవద్విషయకరతినే భావ మని వ్యవహరించుట శృంగార పక్షపాతము వలననే. యథార్థమునకు శృంగారము వయోధర్మము మాత్రమే భక్తికి వయో నియతి అవసరము లేదు. సర్వావస్థలందును భక్తిరసాస్వాదన తగియుండును. అంతియ గాక రసము అలౌకికానందమునకు మనోనైర్మల్యా నకును హేతువు. ఆ మనోనైర్మల్యము మిగిలిన రసముల విషయమున అలౌకిక దశయందు మాత్రమే యుద్భవించును. భక్తి విషయమున దు లౌకికదశయందు గూడ మనోనైర్మల్యమున కవకాశము ఉండును. శృంగారాదులు అలౌకికస్థితిలో కేవలము ఆనందప్రదములైన కావచ్చును. (కొందరి మతమున దుఃఖప్రదములు కూడ నగును కాని ఇష్టాధిక్య - అనిష్ట న్యూనతలు అనుసంధేయములు) కాని లౌకిక జీవితములో నివి ఒకచో దుఃఖప్రదములు కూడ నగును. కాని భక్తిలౌకికాలౌకికోభయ దశలయందును ఆనందహేతువే

---

[2] భరతాది మునివచనానా మేవ అత్ర రసభావాదివ్యవస్థాపక త్వేన స్వాతంత్ర్యయోగాత్, రసగంగాధరము - ప్రథమాననము పు 190-191.

మోక్షమునకు జ్ఞానమార్గ మాధార మని, జ్ఞానమార్గరూప మయిన శాంతమును ప్రకృతిరస మనియు, తదితరములు వికృతిరసము లన్నట్లు భక్తిమార్గము గూడ మోక్షమున కాధారము గాన భక్తిని ప్రకృతిరస మని మిగిలినవి వికృతిరసము లనుటలో విప్రతిపత్తి యేమి? మార్గద్వయమునకు ప్రకృతిద్వయము ఉండును. తద్భిన్నములు వికృతులు, భక్తి జ్ఞాన సాధనహేతు వని భక్తిని శాంతములో నంతర్భావించుట తగదు శాంతమున నిర్వేదము ప్రధాన స్థానమును వహింప వలయును. భక్తియందు నిర్వేద ముండవలసిన యవసరము లేదు. ఆత్మనివేదన ముండిన చాలును. భక్తికి స్థాయి యయిన రతికి స్థాయిత్వము సంభవింపక పోవచ్చు ననెడి యనుమానము గూడ అవసరము లేదు క్రోధ, జుగుప్స, భయ, విస్మయ, శమముల కున్నంత స్థాయిత్వము దానికి లేకపోలేదు. పై పెచ్చు వాటికన్నను మించిన స్థాయిత్వమే దీనికి సంభవించెడి అవకాశమున్నదనుట స్పష్టము. భక్తికి విభావ ప్రతిపత్తి గూడ సుహృద్యము, అనుపమానము. భావనావిషయజ మైన విభావము దార్శనిక మయిన విభావము రెండును గూడ సమప్రాధాన్యమును పొంది భక్తికి విభావములు కాగలవు. అనుభావాదులు సుప్రసిద్ధములే. ఇక సంచారులన్నచో నిర్వేదము, చింత, హర్షము, ధృతి, జడతా, ఔత్సుక్యము మొదలగున వన్నియు. కాగా ఇట్లు విభావానుభావవ్యభిచారి పుష్టత్వము, స్థాయిత్వము, అన్యరసములలో చేరకుండుట, ఇతరరసములకన్న వైలక్షణ్యమును కల్గియుండుట, వలసినచో నితరములే ఇందంతర్భావించుట అను నీ కారణములవలన భక్తికి రసత్వము నంగీకరించుటలో విప్రతిపత్తి లేదు. అంతియగాక భక్తిని రసముగ నంగీకరించుట భారతీయ సంస్కృతికి నొక ప్రతీకయు నగును.

ఆంధ్రసాహిత్యమున పోతనయే అలంకార గ్రంథములను రచించియుండినచో భక్తికి రసత్వమును సుస్థాపితమును చేసియుండెడి వాడు. శృంగారము కూడ భక్తికంగమై రెండింటి కలయిక వలన ఏర్పడిన నిర్మల ప్రణయతత్త్వము, శృంగారము నధిగమించెడి భక్తితత్త్వము రుక్మిణి కృష్ణునకై చేసిన ఆత్మనివేదనలో స్పష్టపడును.

సీ. ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని
కర్ణరంధ్రమ్ముల కలిమి యేల?
భువనమోహన! నిన్నుఁ బొడఁగానఁగా లేని
చక్షురింద్రియముల సత్త్వ మేల?

పురుషసింహామ ! నీవు భోగింపగా లేని
తనులతవలని సౌందర్య మేల ?
దయిత ! నీ యధరామృతం బానగా లేని
జిహ్వకు ఫలరస సిద్ధి యేల ?
ఆ॥ వె నీరజాత నయన ! నీ వనమాలికా
గంధమబ్బ లేని ఘ్రాణ మేల ?
నిఖిలలోక వంద్య ? నినుఁ బొందఁ గాలేని
జన్మ మేల ? వేయి జన్మలకును. [1]

మాయారసము :

మాయారసమును గూర్చి ప్రస్తావన మొనర్చినవాడు భానుదత్తుడు. ఇతడు రసతరంగిణిలో నీ ప్రస్తావన మొనర్చెను చిత్తవృత్తి రెండు విధములు. 1. ప్రవృత్తిరూపము 2. నివృత్తిరూపము. నివృత్తిరూపముచే శాంతము రస మగుచున్నది. శమదమాది భావములచే నది విశిష్ట మగుచున్నది. అట్లే ప్రవృత్తిరూపముచే మాయ రస మగుచున్నది. ఇది కామక్రోధాది భావములచే విశిష్టము. రతి, హాస, శోక, క్రోధ, ఉత్సాహ, భయ, జుగుప్సా విస్మయము లీ ప్రవృత్తి యందే పుట్టును. మెఱపుల వలె పుట్టుచు నశించుచుండును. అందుచే వీనిని మాయారసమునకు వ్యభిచారి భావములుగా పేర్కొనినాడు దీనికి స్థాయిభావము మిథ్యాజ్ఞానము. సాంసారిక భోగము నార్జించు ధర్మాధర్మములు విభావములు. పుత్రకళత్ర విజయసామ్రాజ్యాదులు అనుభావములు. ఈ మతమును మందార మరంద చంపువు కూడ బలపఱచెను.

ఈ మతమును కావ్యవిలాసమున చిరంజీవి భట్టాచార్యు డిట్లు ఖండించినాడు. 'మాయ అనాది యగుట వలన నది ఒకదానివలన పుట్టదుకాన రసము కాదు. రసములు జన్యములు మాయయే మిథ్యాజ్ఞానమునకు కారణ మగును. కాని మిథ్యాజ్ఞానము మాయకు కారణమెట్లగును ? శాస్త్రవిరుద్ధము కదా ! మరియు నాలంకారిక మతమున రసము నిత్యము. ఆనందరూపము. కావున బ్రహ్మస్వరూపము. అట్లగుచో

1 భాగవతము - రుక్మిణీకల్యాణము.

మాయకు రసత్వ మెట్లు కలుగును మాయ తుచ్ఛవినాశశాలిని బ్రహ్మకన్న భిన్నము కావుననే ప్రాచీనులు తొమ్మిదే రసములని సిద్ధాంతీకరించిరి

స. సూ. శా. నరసభూపాలీయ వ్యాఖ్య.

ఈ ఖండనము సరియైనది కాదు. మాయ బ్రహ్మకంటె భిన్న మను తలపుతో గదా రసత్వమును ఖండించినాడు. అట్టిచో రౌద్రబీభత్సాదులు కూడ తత్సమానములే కదా. వానిని మాత్రము రసము లని యేల యనవలెను ? కావున దీని ఖండన మిట్లు చేయరాదు.

మాయారసము ప్రత్యేకరసము కాదు శృంగారాద్యష్టరస సమ్మేళవమే మాయ. ఈ ఎనిమిదియు మాయారసపరిధిలోనికే చేరును. వీని యన్నిటికి మాయా నామము చెల్లును. ఇది శాంతరసప్రతిపక్షి యనదగును. కాని దీనికి మరల ప్రత్యేక స్థితి లేదు. కావున అష్టరసముల నంగీకరించి నపుడు వాని సమష్టిరూప మైన యీ మాయను అంగీకరింప నవసరము లేద.

రసచంద్రికలో విశ్వేశ్వరుడు మాయారసమును ఖండించిన తీరు మరొకరీతి నున్నది. సామాన్యముగ నేదేని రసత్వమును పొందవలె నన్నచో స్థాయిభావము విభావాదులచే ముందు ప్రబుద్ధమై వ్యభిచారులచే పరిపుష్టమై రసత్వమునొందును. మాయకు మిథ్యాజ్ఞానమును గదా స్థాయిభావ మనిరి. ఆ మిథ్యాజ్ఞానము ఎల్లప్పుడును ప్రబుద్ధ మయియే యుండును. దానికి విభావాదులచే ప్రబుద్ధ మొనర్పవలసిన పని లేదు. మరియు కావ్యజన్య మైన విషయజ్ఞానమాత్ర మేది యైనను రసత్వము నందవలసి వచ్చును. అందు చమత్కారము శూన్యము. మఱియు అపుడు స్థాయి వ్యభిచారి వ్యవస్థయే కుదురదు. అనగా ఇది స్థాయి భావము, ఇది వ్యభిచారి భావము అని వింగడించి చెప్పుట కుదురనే కుదురదు * కావున మాయ రస మనుట తగదని వచించినాడు.

---

* "మిథ్యాజ్ఞానవాసనాయా శ్చ సర్వదాపి ప్రబుద్ధత్వాత్ కావ్యాదిభ్యో జాయమానస్య విషయజ్ఞానమాత్రస్య రసత్వాపత్తే శ్చ. తత్ర చమత్కారస్య అననుభూయమానత్వాత్, వ్యభిచారిస్థాయిభావానాం వ్యవస్థానుపపత్తే శ్చేతి దిక్" రసచంద్రిక - పు 69

వత్సలరసము

విశ్వనాధుడు సాహిత్యదర్పణమునందు 'అథ, మునీంద్రసమ్మతో వత్సలో రసః' అని వత్సలరసమును పేర్కొనినాడు. ఈ రసమునందు స్ఫుట మైన చమత్కార మున్నది. కావున నిది రస మనవలసియున్నది. దీనికి స్థాయి వత్సలతా స్నేహము పుత్రాదు లాలంబనములు వారి చేష్ట లుద్దీపనములు ఆలింగనము, అంగసంస్పర్శనము, శిరశ్చుంబనము, మున్నగునవి అనుభావములు. అనిష్టశంక, గర్వము, హర్షము మున్నగునవి సంచారులు. భ్రాత్రాలంబనమునకు

దేశే దేశే కళత్రాణి దేశే దేశే చ బాంధవాః
తం తు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః

అను ప్రసిద్ధశ్లోక ముదాహరణప్రాయ మైనది.

భక్తికి రసత్వమును ఖండించి భావ మని వచించినట్లే, దీనిని సయితము జగన్నాథుడు ఖండించినాడు.

"ఏతేన వాత్సల్యాఖ్యం పుత్రాద్యాలంబనం రసాంతర మితి
పరాస్తమ్"

దీని వళిసపుడును రసముగా సూచింపలేదు.

ఉదాత్త – ఉద్ధతరసములు

ఉదాత్తరసమును, ఉద్ధతరసమును భోజుడు పేర్కొనినాడు. అతడు శృంగారాదు లెనిమిదింటిని, శాంతము, ప్రేయస్సు, ఉదాత్తము, ఉద్ధతము అనువానిని గ్రహించెను. సరస్వతీకంఠాభరణమున నీ యభిప్రాయము నీతడు వెలిబుచ్చెను. ఉదాత్తమునకు మతియును, ఉద్ధతమునకు గర్వమును, స్థాయిభావములు. ఉదాత్తమునకే ఊర్జస్వి యను నామాంతరము కలదు. ధీరోదాత్తు డాలంబనముగా గలది ఉదాత్తరస మనియు, ధీరోద్ధతు డాలంబనముగా గల్గినది ఉద్ధతరస మనియు భోజుని యభిప్రాయము. ఈ యభిప్రాయమును శృంగారప్రకాశమున ప్రకటించినాడు.

"న చాష్టావే వేతి నియమః" – యతః శాంతం ప్రేయాంస ముద్ధత మూర్జస్వినం చ కేచి ద్రస మాచక్షతే - తస్మాలా శ్చ కిల నాయకానాం ధీరశాంత, ధీరలలిత, ధీరోదాత్త వ్యపదేశాః– MSS VOL II 37-38

ఈ రసములను రెండింటిని రసార్ణవసుధాకరకర్త యగు సింగభూపాలుడు విమర్శించినాడు భరతముని వచనమునకు ప్రాధాన్యము నిచ్చి అష్టరసములను మాత్రమే యత డంగీకరించినాడు. 1

అభినవగుప్తుడు మిగిలిన రసము లన్నిటిని ఖండించి తొమ్మిదింటినే రసము లని సోపపత్తికముగ నిరూపించినాడు. పుమర్థోపయోగిత్వము రంజనాధిక్యము కల్గినవి నవరసము లని నిరూపించినాడు ఇతరములు భావస్థితి యందే యడగునని సూచించి నాడు. ఇంకను కొన్నిటిని రసములుగా కొందఱు పరిగణింతు రని అభినవ భారతి వలన దెలియుచున్నది. అందే అతడు వానిని ఖండించి వదలినాడు. వీనిని రసములు కావని నిరసించినాడు వీనికి పుమర్థోపయోగిత్వము రంజనాధిక్యము లేవనినాడు. కావున వీనిని భావము లనియే పేర్కొనినాడు.

గర్దస్థాయికమగు లౌల్యము
ఆర్ద్రీతాస్థాయికమగు స్నేహము
ఆసక్తిస్థాయికమగు వ్యసనము
అరతిస్థాయికమగు దుఃఖము
సంతోషస్థాయికమగు సుఖము

ఇవి అన్నియు భావములే కాని రసములు కావు ఇట్లే మృగయ, అక్షాదులును రసములు కావు.

రసానంత్యము

రససంఖ్యావిషయమున నేర్పడిన భిన్నాభిప్రాయములు ఆలంకారికులలో అభ్యుదయ భావములకు దారితీసినవి. కొంతమంది భరతుని యష్టరసపరిమితిని దాటుటకు జంకి సంప్రదాయ పాలనము గావించిరి. తరువాత ఆనందవర్ధనాభినవ గుప్తులచే నవరససంప్రదాయము ప్రతిష్ఠింపబడినది. అనంతరికు లైన భారతీయా లంకారికులు తత్సంప్రదాయమును నిలబెట్టుచునే వచ్చిరి. సంప్రదాయవాదు లొకవంక

శృంగార వీర కరుణ రౌద్రాద్భుత భయానకాః
బీభత్స హాస్య ప్రేయాంసః శాన్తోదాత్తోద్ధతా రసాః
V ch పు 164

యిట్లు గిరిగీచుకొని సంతోషించుచుండగా వీరిలో మరికొందరు అభ్యుదయభావనలతో ఇంకను కొన్ని భావములకు రసత్వమంగీకరించుచు వచ్చిరి. అట్లు అధికరసముల నంగీకరించిన వారిలో ప్రథముడు రుద్రటుడు. ఇతడు కావ్యాలంకారమున దశమ మగు ప్రేయోరసము నంగీకరించి యభ్యుదయ పథమున నడుగిడినాడు. ఇంతేగాక ఇతడు నిర్వేదాదివ్యభిచారులు సైతము రసములు కాదగు ననియు వచించినాడు. రస్యమానతాధర్మమును బట్టియే శృంగారాదులు రసములని పరిగణింపబడుచున్నవి. ఆ రస్యమానత నిర్వేదాదివ్యభిచారులయందు సహిత మున్నది. కావున వానిని సంతము రసము లన దగు నని సంచారులు ముప్పది మూడిటికి రసత్వ మాపాదించినాడు. భోజుడు సంచారులే గాక ఏ విధ మైన భావ మైనను రసము కాదగు నని మరొక ముందడుగు వేసినాడు అసలు వీరందరి కంటె ముందుగనే భట్ట లోల్లటుడు రసములకు ఆనంత్యమును సూచించినాడు అతడు నాట్యశాస్త్రము నకు వ్యాఖ్య వ్రాసినట్లు అందు రసానంత్యమును సూచించినట్లు అభినవభారతి వలన తెలియుచున్నది. ప్రతిభావమునకు రసత్వమును పొందు నర్హత యున్నను, పార్షదప్రసిద్ధి ననుసరించి భరతుడు అష్టరసములనే స్వీకరించినట్లు తన వ్యాఖ్యానమున సూచించినాడు. ఇట్లు ప్రాచీనుడైన భట్టలోల్లటుడే రసము లనంతము లని వచించినాడు. అపుడు స్థాయి వ్యభిచారి భేదమును ప్రపంచింప నావశ్యకమే లేదు. ఏ చిత్తవృత్తి యైనను రస మగు నంట విశృంఖలత్వ మగును. లోకప్రవృత్తికి నియమాచరణము ప్రాథమిక సూత్రము. దానిని విడచినచో అభ్యుదయదృష్టి కల్గినట్లు భావించుట యసమంజసము.

రస సమీకరణము

ఒకవంక రసము లెనిమిదియా? తొమ్మిదియా? లేక పదియా? యని కొందరు పెనగులాడుచు చివరకు ఆనంత్యము నంగీకరించి శాంతింపగా మరొక వంక ఆలంకారికులలో కొందరు ప్రకృతివికృతిరసము లని భేదపరిగణనము చేసి రస మొక్కటే యని నిశ్చయింప మొదలిడిరి

కరుణరసము :-

దీనికి నాంది పలికిన ప్రథముడు భారతీయ సాహిత్యము నందు భవభూతి. అతడు ఈ క్రిందిశ్లోకమున ఒక చక్కని సిద్ధాంతము చేసినాడు. ఉత్తరరామచరితము తృతీయాంకమున

ఏకో రసః కరుణ ఏవ నిమిత్తభేదా
ద్భిన్నః పృథ క్పృథగి వాశ్రయతే వివర్తాన్
ఆవర్తబుద్బుదతరంగమయాన్ వికారా
నంభో యథా సలిల మేవ హి తత్సమస్తమ్

కరుణ మొక్కటే రసము. నిమిత్తభేదము వలన వేర్వేరుగా రూపు కట్టును. జల మొక్కటే యయ్యును ఒక్కసారి బుడగలుగను మరొక్కసారి తరంగములు గను ఇంకొకసారి సుడిగుండములుగను కన్పట్టును. కాని యందలి అంతస్తత్త్వము మాత్రము జలమే. అట్లే రస మొక్కటే యుపాధిభేదముచే భిన్నమగును. లోక మంతయు శోకమయమే. లౌకికకావ్యసాహిత్యము సైతము శోకము నుండియే యుద్భవించినది. శోకమునందు మాధుర్యము, ఆర్ద్రత అధికముగ నుండును. ఈ రసమునందు చిత్తద్రుతి అధికముగ ననుభూత మగును. అనగా మనసు బాగుగా ద్రవించును. కావున కరుణ మొక్కటే రస మని భావము.

శాంతరసము -

రససమీకరణ వాదములలో నిది తృతీయము. దీని నభినవుడు ప్రతిపాదించినాడు. భరతుడును సూచించినట్లు చెప్పవచ్చును. శాంత మొక్కటే ప్రకృతి రసమనియు మిగిలినరసములు ఔపచారికము లనియు, అవి వికృతిరూపములనియు నభినవుని యభిప్రాయము. రత్యాదులు వికృతిరసములగు శృంగారాదులకు స్థాయి భావము కాగా శాంతస్థాయి యైన ఆత్మజ్ఞానము స్థాయితమ మని యాతని సిద్ధాంతము.

రంజకత్వమునకు తోడు పురుషార్థోపయోగిత్వము రసప్రయోజనముగా వర్ణింపబడినది. పురుషార్థములు నాల్గింటిలోను మోక్ష ముత్తమముగ నెంచబడు చున్నది. అట్టి మోక్షమును గూర్చి వచించునది శాంతము. మోక్షప్రవర్తకము శాంత మగుటచే నది ప్రకృతిరసము. ఏ రసాస్వాద మైనను ఆస్వాద సమయమున ఉపాధి గోచరము కాదు. నిర్విషయకముగ ఆస్వాద ముండును కావున శాంత ప్రాయ మైన ఆనందాస్వాద ముండును. విషయవిపరివృత్తియే దానికి కారణము. అందువలన గూడ శాంతము ప్రకృతిరస మనదగును ఈ వాదము భరతునకు గూడ నిష్ట మైనట్లు ఈ శ్లోకములు సాక్ష్యము పల్కును.

భావా వికారా రత్యాద్యాః శాంతస్తు ప్రకృతి ర్మత
వికారః ప్రకృతే ర్జాతః పున స్తత్రైవ లీయతే
స్వం స్వం నిమిత్త మాసాద్య శాంతా ద్భావః ప్రవర్తతే
పున ర్నిమిత్తా పాయే తు శాంత ఏవోపలీయతే

రతి, హాసము మున్నగు భావములు వికృతులు. శాంతమే ప్రకృతిరసము. వికారము ప్రకృతినుండియే పుట్టును. మరల అందే లీన మగును. నిమిత్తమును బట్టి శాంతమునుండి వికృతులు పుట్టి నిమిత్తనాశము కాగానే శాంతమందే లీన మగును. పూర్వప్రతులలో భరతగ్రంథమున శృంగారాదులకు పూర్వమే "స్థాయి భావాన్ రసత్వ ముపనేష్యామః" అనిన వెంటనే "శాంతో నామ శమస్థాయిభావాత్మకః" అను పాఠము కన్పట్టునని యభినవుడు వచించినాడు.

శృంగార రసము

రస సమీకరణవాదములలో విది మూడవది. భోజుడు శృంగార మొక్కటే రస మని నుడివినాడు. ఈ వాదము నితడు సరస్వతీ కంఠాభరణము పంచమాధ్యాయమునందు సూచించి శృంగారప్రకాశమునందు ప్రపంచించినాడు. భోజుడు నిర్దేశించిన శృంగారము నవరసములలో నొకటగు శృంగారము కాదు. ఇది విలక్షణమైనది. దీనికి అభిమానము, అహంకారము అనియును నామాంతరములు కలవు. పండితులు శాంతాదిదశరసములను, పేర్కొందురు. కాని రస్యమానతాహేతువుచే శృంగార మొక్కటే రసమని భోజుడు కంఠోక్తిగ చెప్పినాడు. [1] పైగా వీరాద్భుతా

'శృంగార ప్రకాశ' :

[1] శృంగార వీర కరుణాద్భుత రౌద్రహాస్య
బీభత్స వత్సలభయానక శాంతనామ్నః
ఆమ్నాసిషు ర్దశరసాన్ సుధియో వయం తు
శృంగార మేవ రసనా ద్రస మామనామః
వీరాద్భుతాదిషు చ యేహ రసప్రసిద్ధిః
సిద్ధా కుతోఽపి వటయక్షవ దావిభాతి

దులలో రసప్రసిద్ధి కేవలము వటయక్షన్యాయముగా మాత్ర మున్నది. గతానుగతికముగ [1] నందరు దాని ననుసరించుచున్నారు పరమార్థము నెవరును భావించుట లేదు. దానిని నివారించుటకే తన ప్రయత్నమని వచించినాడు. భోజుని దృష్టి ననుసరించి సర్వభావములందును అహంకార మనుస్యూతముగ నుండును. అది ఆత్మగుణము విశిష్టాదృష్ట జన్యము. ఈ యహంకారము వలననే మానవునకు తన మీద గాని ఇతరుల మీద గాని అనురాగాదులు కల్గుచుండును. ఇది ఆత్మరతి య పించుకొనును. ఈ ఆత్మరతి యొక్కటే రసపదవాచ్యము. మిగిలిన రతి హాసాదులు ఏతద్వ్యంజకములు భరతుడు పేర్కొనిన శృంగారము వేరు ఇది వేరు.

పై జెప్పిన యహంకారము బహుజన్మల సుకృతవిశేషము వలన నుద్భవించును. ఇది సాత్త్వికాహంకారము. లౌకికముగ ప్రయోగించు గర్వము కాదు. ఈ యహంకారమునే యభిమాన మని, శృంగార మని యందుము ఇది యొకటే రసము అని భోజుని వాదము.

అద్భుత రసము

రససమీకరణవాదములలో ఇది నాల్గవది. ఆదిమమానవుని చిత్తప్రవృత్తిలో అద్భుతము మిగుల చోటు చేసికొనినది. ఇతరరసములలో సహితము అద్భుతముయొక్క అంశ కలదు. అసలు ఆనందమే అద్భుతతత్త్వము. నాటకాదులందు అద్భుతమునకు ప్రాధాన్యము కలదు నిర్వహణసంధిలో అద్భుతము తప్పక అనుభవగోచరము కాదగునని భరతుడు వ్రాసుచిన్నాడు.

> సర్వేషాం కావ్యానాం నానారసభావయుక్తియుక్తానామ్
> నిర్వహణే కర్తవ్యో నిత్యం హి రసోద్భుతః తజ్జ్ఞైః
>
> నా. శా. 20–47

1 లోకే గతానుగతికత్వవశా దుపేతా
మేతాం నివర్తయితు మేష పరిశ్రమో నః

అతిశయోక్తి అలంకారము కూడ అద్భుతచ్ఛాయ కలది. రసమునకు సంబంధించిన సమీకరణవిషయసంబంధిగా సాహిత్యదర్పణ కారునిచే అద్భుతము వివరింపబడినది. ఇది నారాయణుని భావముగా నతడు సూచించినాడు. పైగా దీని కుపబలకముగ ధర్మదత్తుని క్రింది శ్లోక ముదాహరించినాడు.

చమత్కార శ్చిత్తవిస్తారరూపః, విస్మయాపరపర్యాయః తత్ప్రాణత్వంచ అస్మత్పితామహసహృదయగోష్ఠీ గరిష్ఠకవి పండితముఖ్య శ్రీమన్నారాయణపాదై రుక్తమ్ తదాహ ధర్మదత్తః స్వగ్రంథే

రసే సార శ్చమత్కారః సర్వత్రాప్యనుభూయతే
తచ్చమత్కారసారత్వే సర్వత్రాప్యద్భుతో రసః
తస్మా దద్భుతమేవాహ కృతీ నారాయణో రసమ్

సా. ద. 3

చమత్కారమే రసాస్వాద మని యిందు సూచింపబడినది ఈ చమత్కారమే విస్మయపారమై హృదయముల మీటును. అదియే అద్భుతరసపరిణామము నొందును శక్తిభద్రుని ఆశ్చర్యచూడామణి అద్భుతరస గ్రంథము.

ఈ యభిప్రాయమును రసప్రదీపకారుడు ఖండించినాడు. అతడు ధర్మదత్తుడు చెప్పిన యభిప్రాయము అనుభవవిరుద్ధ మని భావించుచు ఇట్లనినాడు అనుభవము అతని యభిప్రాయమునకు విలక్షణముగ నున్నది. ప్రకృతిభేదము కూడ కలదు. అద్భుత మన్ని రసములకు మూల మని చెప్పజాలము. రత్యాదులలో విస్మయము ఉండ నోపును గాని శోకాదులలో విస్మయ ముండు నవకాశము లేదు వ్యభిచారులకు స్థాయికి గల ప్రకృతిభేదము కూడ ఇతరరసములకు అద్భుతరసమునకు కనపట్టదు. *

---

* ఇతి నారాయణేన అద్భుత ఏవ రస ఇత్యభిహితమ్. ధర్మదత్తాదిభిశ్చ తదేవ అనుసృతమ్. తన్న సాధు - వైలక్షణ్యస్య అనుభవసిద్ధత్వాత్-ప్రకృతి భేదాచ్చ. నాపి వ్యభిచారిషు స్థాయిన ఇవ రత్యాదిషు విస్మయానుగమః శోకాదిషు తథాఽననుగమాత్' ఇత్యాది

P. 40 Princess of wales Saraswati Bhavan Texts.

ప్రే మ ము

శృంగార మొకటే రస మని భోజుడు ప్రేమమును సైతము సమీకరించి నాడు ప్రేమ మనగా భోజుని మతమున రత్యాదులకు మూలభూతము, ప్రాథమిక మైనది. మానవుడు నవ్వుటకు గాని, కోపపడుటకు గాని, యుద్ధాదులొనర్చుటకు గాని, తుదకు సంభాషణ మొనర్చుటకు గాని మానసిక మైన యిచ్ఛయే కారణము. ఆ యిచ్ఛ మానవునకు అంతర మైనది. ఆ యిచ్ఛయే స్వీ చేష్టలను వెలువరించును. ఈ రసమునకు భోజుడు మూడవస్థలను పేర్కొనెను 1 పూర్వావస్థ 2 మధ్య మావస్థ 3 ఉత్తరావస్థ. పూర్వావస్థయందిది కేవలము అహంకారమే మధ్య మావస్థయందు ఈ అహంకారము విభావానుభావపరిపుష్టము లైన భావములుగా పరిణ మించును ఉత్తరావస్థయందు ఈ భావములు ప్రేమముగా పరిపక్వము నందును. ఇది అహంకారరూప మనియు ననవచ్చును. ఇది సరస్వతీకంఠాభరణముననే గాక శృంగారప్రకాశమున సయితము రసం త్విహ ప్రేమాణ మేవ ఆమనన్తి' (C H XI P 352-3) అని వచించినాడు ఈ యభిప్రాయమును కవికర్ణపూరుడు అలంకారకౌస్తుభమునందును సూచించెను.

ఉన్మజ్జంతి నిమజ్జంతి ప్రేమ్ణ్యఖండరసత్వతః
సర్వే రసా శ్చ భావా శ్చ తరంగా ఇవ వారిధౌ

పు 147 - 48

ప్రేయః ప్రియతరాఖ్యాన మిత్యనేన సమస్త భావమూర్ధాభిషిక్తాయాః రతేః పరప్రకర్షాధిగమాత్ భావనాధిగమే భావరూపతా ముల్లంఘ్య ప్రేమరూపేణ పరిణతాయాః ఉపాదానాత్ భావాంతరాణా మపి పరప్రకర్షాధిగమే రసరూపేణ పరిణతి రితి జ్ఞాపయ న్నహం కారస్య ఉత్తరాంకోటి ముపలక్షయతి సర్వేషా మపి హి రత్యాదిప్రకర్షాణామ్ రతిప్రియ, రణప్రియ, పరిహాసప్రియ, అమర్షప్రియ ఇతి ప్రేమ్ణ్యేవ పర్యవసానం భవతి

స కం. పు 613

స్ఫ టి కో ప మ్య వా ద ము

ఈ రస సమీకరణమునకు కవికర్ణపూరుడు మరియొక ఉపమానమును సూచించినాడు. అదియే స్ఫటికోపమ్యవాదముగా ప్రసిద్ధి వహించినది. అలంకార కౌస్తుభము ఈ వాదమును వెలార్చినది.

మనస్సు రజస్తమోగుణస్పర్శ లేనిది.[1] ఆ సమయమున శుద్ధసత్త్వ స్వరూప మైన మనస్సునకు ఆస్వాదాంకురకంద మొకటి కల్గును. అదియే ఆనందము, ఇదే స్థాయిభావము కూడ. అనగా ఆనందము ఒకటే రసము. అయినను భిన్న భిన్నరసము లున్నవి. అయ్యును వాని కన్నిటికి స్థాయి ఆనంద మొక్కటే. ఇన్ని రసములకు ఒకటే స్థాయి యనుట యెట్లని యాశంకించుకొని యాత డిట్లు సమాధానపడినాడు. అలంకారకౌస్తుభవ్యాఖ్యానమున నిట్లున్నది.

యథైక ఏవ స్ఫటికః జపాకుసుమాది నానాపదార్థానామ్ సంగాత్ కదాచి ద్రక్తః కదాచిత్ పీతః కదాచిత్ శ్యామః ఇత్యాది వివిధాకారో భవతి. తథా ఏక ఏవ స్థాయిరూపో ధర్మః వీరరసాది పోషకానాం సంగాత్ కదాచి దుత్సాహరూపః కదాచి ద్విస్మయ రూపః కదాచిత్ శోకరూపః ఇత్యాదివివిధాకారో భవతీతి భావః

స్ఫటికము నిసర్గముగ నొకటియే, స్వచ్ఛ మైనది. అది జపాకుసుమాదుల సంపర్కముచే ఒకొక్కపుడు ఎఱ్ఱగను మఱొకప్పుడు పీతముగను, మరియొకప్పుడు శ్యామనీలముగను, వివిధరూపములతో భాసించును. అట్లే ఒకే స్థాయి వివిధ రసపోషకములైన వాని సంగముచే నొకప్పుడు ఉత్సాహముగను, మరియొకప్పుడు విస్మయముగను, ఇంకొకపుడు శోకరూపముగను భాసించును.

---

[1] ఆస్వాదాంకురకందో ఽస్తి ధర్మః కశ్చన చేతసః
రజస్తమోభ్యాం హీనస్య శుద్ధ సత్త్వతయా సతః
స స్థాయీ కథ్యతే విజ్ఞై ర్విభావస్య పృథక్తయా
పృథగ్విధత్వం యా త్యేష సామాజికతయా న్వాం

అనగా ఉపాధిభేదము సూచించినాడు. రసము ఆనందరూపధర్మ మైనది. కావున ఒకటే కాని ఉపాధిభేదముచే నానాత్వము పొందినది. ఉపాధులే రత్యాదులు. వాని సంగముచే ఒకే విధ మగు ఆనందము కూడ రత్యాదిరూపముగ భాసించుచున్నది. [1] ఈ భేదము ఉపాధిగతమే కాని ఆనందగతము కాదు. కావుననే శరుణాదులు సయితము ఆనందప్రదములే యని సిద్ధాంత మొనర్చినారు.

---

1. రసస్య ఆనందధర్మత్వాత్ ఏకత్వం భావ ఏవ హి ।
ఉపాధిభేదా న్నానాత్వం రత్యాదయ ఉపాధయః

రసరాజము

ప్రాచీనకాలమునుండి నేటివరకు శృంగారప్రాధాన్యము అప్రతిహతముగా కనప్పట్టుచున్నది. ఏ ఆలంకారికుడు రసములను నిర్వచించినను శృంగారమునకే పూర్వనిపాతత్వము కల్పించుట గమనార్హ మయిన విషయము. సంస్కృతాంధ్రాదిసాహిత్యము లన్నింటను శృంగారము ప్రధానము రమణీయము అయిన స్థానము పొందియుండుటకు కారణ మది సర్వులకు మనఃప్రహ్లాదన సమర్థమైన దగుటయే. కవులు ఆలంకారికులు కూడ శృంగారము ప్రముఖ మని వివరించియే యున్నారు.

శృంగార ఏవ మధురః పరః ప్రహ్లాదనో రసః।
తన్మయం కావ్య మాశ్రిత్య మాధుర్యం ప్రతితిష్ఠతి॥ [1]
ధ్వన్యాత్మభూతే శృంగారే యమకాది నిబన్ధనమ్।
శక్తా వపి ప్రమాదిత్వం విప్రలంభే విశేషతః॥ [2]

ఇది ఆనందవర్ధనుని యభిప్రాయము, శృంగారమే పరమప్రహ్లాదహేతు వయిన రస మనియు అదియే ధ్వన్యాత్మభూత మయిన దనియు ఆనందవర్ధనుడు శృంగారమునకు పట్టము గట్టినాడు. భోజుడును.

"రసోఽభిమానోఽహంకారః శృంగార ఇతి గీయతే" [3]

శృంగార హాస్య కరుణాద్భుతవీర రౌద్ర
బీభత్స వత్సల భయానక శాంతనామ్నః।
ఆమ్నాసిషుః దశరసా నపరే వయం తు
శృంగార మేవ రసనా ద్రస మామనామః॥ [4]

అనినాడు.

---

[1] ధ్వన్యాలోకము - ద్వితీయోద్యోతము 7 - 16 శ్లో

[2] 1. 2.

[3] సరస్వతీ కంఠాభరణము - పంచమప్రకాశము - 1 శ్లో

[4] శృంగార ప్రకాశము

అతడు చూపిన శృంగారమున స్వరూపభేద మున్నను శృంగారమునకు ప్రాధాన్యము అవ్యాహతమే. రస్యమానరసను బట్టి శృంగారము రస మనెడు మిగిలిన రసములు రస్యమానములు కావని ఇతని యభిప్రాయము కాదు. అయినను రస్యమానత శృంగారమున సార్వకాలికత సార్వజనీనతలకు ఆలవాలమై యుండవచ్చు నని కావచ్చును అలంకారగ్రంధరచయితలు కూడ వ్యభిచారిసాత్త్వికాదుల నుదాహరించుచు శృంగారమునకే అంగములను మిక్కుటముగా చూపుట శృంగార ప్రాధాన్యమునే వ్యక్తీకరించును.

దశరూపకములలో ప్రకృతి యైన నాటకము [1] నందు శృంగారవీరములలో నొక్కటియే ప్రధానరస మని నిర్ణయించుట. [2] అందును వీరరసప్రధానములు అత్యల్పములై శృంగారరసప్రధానములే అతిశయించుట కూడ శృంగారప్రాధాన్యమును ప్రకటిత మొనర్చుచున్నది.

పాశ్చాత్యులు ట్రాజెడీ కిచ్చినంత ప్రాధాన్యము నితరముల కివ్వలేదు. శృంగారరసప్రాధాన్యము ట్రాజెడీయందు నయితము గోచరించుచున్నది. ఏలన

"న వినా విప్రలంభేన సంయోగః పుష్టి మశ్నుతే-"

అని ఆలంకారికులు శృంగారమున నయితము విప్రలంభశృంగారము ప్రధాన మని అది లేక శృంగారమునకు పుష్టి లేదని వచించియున్నారు. కాన సుఖదుఃఖోభయ మిశ్రణము వలన నేర్పడిన శృంగారము అత్యంతప్రధానము, పర్యంతరమణీయము, అనవచ్చును.

శృంగార మీ రీతిని ప్రధానస్థానము వహించుటలో కల హేతువులను విచారింపవలయును.

సకలజనానుభవగోచరత :

అధిక సంఖ్యాకులచే ఈ రసము ఆస్వాదింపబడును. ఇది మొదటి హేతువు. ఈ విషయమును అభినవగుప్తుడు కూడ ప్రకటించినాడు. [3] అందుకే శాంత

---

[1] దశరూపకము - తృతీయప్రకాశము - 1 శ్లో

[2] ఏకో రసో ఉంగిక ర్తవ్యః శృంగారో వీర ఏవ వా.

- ద. రూ తృ. ప్ర - 33

[1] ధ్వన్యాలోకము - తృతీయోద్యోతము - పు 433

రసాభావవాదులు కొందరు సర్వజనానుభవ గోచరత లేక పోవుటను వారి సిద్ధాంతము నకు ఆధారముగా చూపిరి.[1] సర్వరసములను సర్వజనులకును జీవితములో అనుభవమునకు వచ్చుట కష్టము. శృంగారము కూడ అనుభవములో లేని వారు ఒక రిద్దరు కన్పింపవచ్చును. కాని ఆ సంఖ్య తక్కువ. అందుచే పురాణాదులలో పరమమహర్షులు కూడ చలిత మనస్కులై శృంగారవారిధిలో పడినట్లు వర్ణించుట కానవచ్చును. మేనకా, విశ్వామిత్రుల ప్రణయము శ్వేతకేతు వరవర్ణినుల ప్రణయము విట్టివే.

సుభాషితేన గీతేన యువతీనాం చ లీలయా।
చేతో న భిద్యతే యస్య, స వై ముక్తోఽథవా పశుః

అని కదా ఆర్యోక్తి.

స్వాభావసిద్ధత :

శృంగారము స్వభావసిద్ధ మయిన విషయము. కాని వాసనాత్మక మనుటను బట్టి సర్వప్రాణుల హృదయములో నుండక తప్పదు అయినచో శృంగార స్వరూప మయిన వాసన అతిత్వరితముగ నుద్బుద్ధ మగుట కవకాశము గలదు ఉద్బోధము ఆలంబనాశ్రితమగుటచే ఆలంబన రాహిత్యమే కారణము, కాని ఉద్బోధభేదనుట సంగతము కాదు. ఆలంబన మున్నచో సర్వరసములును ఉద్బుద్ధము లగును గదా అనవచ్చును. అదియు యుక్తమే కాని ఆలంబన ప్రతిపత్తి శృంగారమునకే మిక్కుటముగా లభించు నదగుట దీనికి సమాధానరూపము ఇది తరువాత విస్తరింపబడును. శిష్టరసములలో కొన్నింటికి విశేషప్రతిపత్తి కొంత అవసరము. కాని శృంగార విషయమున సామాన్యప్రతిపత్తియే రసాస్వాదనమునకు హేతు వగును. దేవతాస్తుత్యాదులలో కూడ శృంగార వర్ణనము సంస్కృతాంధ్ర సాహిత్యములలో మిక్కుటముగా కన్పించును. అది యనౌచిత్య మనలేము ఈ విషయమున ఆనంద

---

[1] తత్ర కామస్య సకలజాతి సులభతయా అత్యంతపరిచితత్వేన సర్వాన్ప్రతి హృద్యతేతి (హృద్యతేతి) పూర్వం శృంగారః

వర్ధనుడు కవిశక్తి తిరస్కృతము అనౌచిత్యమును స్ఫురింపజేయదని సమర్థించినాడు
1 అట్లు వర్ణించుటలో కారణము కవులకు గల శృంగారాభిమానమే. అంతమాత్రమున వారిని అనౌచిత్యప్రవృత్తు లనుట తగదు

మేఘై ర్మేదుర మంబరం వనభువ శ్శ్యామా స్తమాల ద్రుమై:
నక్తం భీరు రయం త్వ మేవ తదిమం రాధే! గృహం ప్రాపయ
ఇత్థం నందనిదేశత శ్చలితయో: ప్రత్యధ్వకుంజద్రుమం
రాధామాధవయో ర్జయంతి యమునాకూలే రహః కేలయః

(గీతగోవిందము)

ఈ శ్లోకమున రాధామాధవ శృంగారము నిబద్ధమయినను, అది దేవతా విషయ మైనను శృంగారము భక్త్యంగమై కవికి గల దేవతావిషయక భక్తిని ప్రకటించును. కాని సహజమయిన శృంగారాభిమానము గాని శృంగార ప్రాధాన్యము కాని పరిహృతము కాలేదు.

ఈ ష ణ త్ర య ము :

ఈషణత్రయములో కూడ రెండు శృంగార ప్రతిబింబములే. ధనేషణము, దారేషణము పుత్రేషణము. మానవ మనస్తత్వశాస్త్రము ననుసరించి అన్యూనా వ్యభిచరితములుగా చేయబడిన నిర్ణయము లివి. మానవ సహజము లయిన ఈ వాంఛలలో దారేషణము పుత్రేషణము రెండును శృంగార ప్రతిబింబ ప్రాయములే. తత్సాధనకు లౌకికముగ నుపకరించెడిది ధనేషణము.

అ రి ష డ్వ ర్గ ము :

కామక్రోధలోభమోహ మదమాత్సర్యములకు అరిషడ్వర్గ మని వ్యవహారము. అందుకామము మొట్టమొదటగా తెలుపబడినది. తత్కారణ మది అజయ్య మగుటయే

1 ధ్వన్యాలోకము - తృతీయ - పు 345

కావచ్చును. కామక్రోధాదులలో కామము తప్ప మిగిలిన అయిదింటిని అధిగ మించిన వారెందరో కలరు. కాని కామాతిక్రమణమే కష్టసాధ్యము. కనుక తొలిమెట్టు నెక్కిన వానికి మిగిలిన వన్నియు సుసాధ్యము లని నిరూపించుటకే కామమునకు పూర్వనిపాతత్వము జరిగినది. అంతియేగాక కామము తప్ప మిగిలిన అయిదును శాశ్వతవిషయములు గావు. ఇక సంకుచితార్థమున కామ మన్నచో యౌవన ప్రాదుర్భావ మాదిగ మానవుని జీవితముతో అవినాభావసంబంధమును కలిగి యుండెడిది.

పురుషార్థములు

అరిషడ్వర్గములో పఠింపబడిన యీ కామము ధర్మార్థకామమోక్షరూపము లైన పురుషార్థములలో కూడ కన్పట్టును. మానవ శత్రువుగా అరిషడ్వర్గములో పరిగణించి మరల పురుషార్థములలో పరిగణించుటకు బహుశః అది అనతిక్రమ ణీయ మగుటయే కారణము కావచ్చును అనగా శత్రువుతో సంధిచేసికొనుట వంటిది. శత్రువును లొంగదీసికొనుట కష్టసాధ్య మయి నపుడు సంధి చేసికొని ప్రమాదముల నుండి వైదొలగుట అర్థశాస్త్రప్రసిద్ధ మయిన విషయము. అట్టిదియే కామమునకు పురు షార్థములలో స్థానమును కల్పించుట కూడ. అనగా అది అనతిక్రమణీయము. సామాన్యజీవనములో కరుణ, శాంతాదుల ననుభవించని వారుందురేమోకాని శృంగా రము ననుభవించని వారుండరు. ఆశ్రమములలో గృహస్థాశ్రమమునకు ప్రాధాన్య మును కల్పించుట కూడ కామ పురుషార్థప్రాధాన్యమునే సూచించును. అనగా దొంగచేతికి తాళము నిచ్చినట్లు. ఇట్లు పురుషార్థములలో చతుర్విధాశ్రమములలో కామమునకు ప్రాధాన్యము స్పష్ట మగుచునే యున్నది.

సృష్టిస్థితికి మూలభూతము శృంగారమే. ప్రకృతిపురుషుల కలయికయే సృష్టి కారణ మనుట నిర్వివాదము. అది ఆధ్యాత్మికతత్త్వచింతనాత్మకము. లౌకికముగా కూడ ప్రకృతి పురుషప్రతిరూపము లైన స్త్రీపురుషుల కలయికయే సృష్టికి మూలము అది సంపూర్ణముగా కామ (శృంగార) ప్రధానము. సృష్టిస్థితిక్రమము విచ్ఛిన్నము కారా దని ఉపనిషత్తులు ఘోషించుచున్నవి.

"ఆచార్యాయ ప్రియం ధన మాహృత్య ప్రజాతన్తుం మావ్యవచ్ఛేత్సీః"[1]

1 తైత్తిరీయోపనిషత్ - ప్రథమవల్లి - ఏకాదశానువాకము

కావున కామము అనిరోధనీయము; తదతిక్రమణయత్నము కూడ విఫలమే యగు నని సారాంశము.

సృష్టిస్థితికి శృంగారము మూలకారణము కాగా కవితాసృష్టికి (ఆదికావ్యముగా పరిగణింపబడిన రామాయణసృష్టికి) మూలకారణము కరుణ మయినది.[1] కాని అందుకూడ "కామమోహితమ్" అనుపదము వాల్మీకి యాంతర్యమున గల శృంగార ప్రాముఖ్యమును సూచింపకపోదు. సృష్టిమూలభూత మయిన కామావస్థలో గల క్రౌంచద్వంద్వమును విడదీయుట వాల్మీకిని మిక్కిలిగా బాధించి యుండవచ్చును. అనగా వాల్మీకిలో భూతదయ లేదని కాదు - దానికి కూడ ఆ క్రౌంచ పక్షిలోని కామమోహితత్వము కారణమయియుండును.

శరీరతత్త్వము

శరీరతత్త్వము సర్వాత్మనాశృంగారానుకూలము. అందు ప్రధాన మయినది అధోరేతస్కత. కనుకనే మహర్షులకు ఊర్ధ్వరేతస్కు లని వ్యవహారము. అధోరేతస్కత అత్యంతము అపరిహార్యము, హాస్యము మున్నగు రసములలో నే రసమునకును ప్రత్యేకించి శరీరనిర్మాణము లేదు. కాని శృంగారరస విషయమునం దన్నచో తదనుకూలశరీరతత్త్వనిర్మితి కనిపించును. అనగా మానవునిలో కామానుకూలత దైవసృష్ట మయిన విషయమనుట నిర్వివాదము, ఇదియుకామప్రాధాన్యమును అంగీకరించుటయే.

కామము శృంగారము సమకక్షగతములా? లేక భిన్నకక్షగతములా? ఇవి రెండును సమానకక్షాంతర్గతములు. కాని వానికి లౌకికాలౌకికభేదము కన్పట్టుచుండును. అయినచో లౌకికముగా శృంగారము లేదందుమా? అని కాదు. కామము లౌకిక స్థితిని పొందిన పేరు. ఇక శృంగార మన్నచో కావ్యవ్యాపారవిషయమున ప్రత్యేక దృష్టితో నేర్పరచిన పేరు. కామము ఆధ్యాత్మిక మైన నామము. శృంగారము సౌందర్యవిశ్లేషణాత్మక మయిన నామము.

---

[1] మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీ స్సమాః।
యత్క్రౌంచ మిథునా దేక మవధీః కామమోహితమ్॥

మోక్షసాధనము

చతుర్విధపురుషార్థములలో పూర్వపురుషార్థముకన్న ఉత్తరోత్తరము ప్రబలము. ధర్మార్థ కామములు మోక్షసాధనములు. మోక్షము సాధ్యము. ధర్మార్థకామములలో గూడ ధర్మార్థములు కామసాధనములు. కామము సాధ్యము. అర్థము ధర్మసాధ్యము. ధర్మము సాధనము కాగా ధర్మార్థకామత్రయసాధ్యము మోక్షము. అందు సాధనత్రయమున ప్రధానము కామము. ఈ త్రయమున నే ఒకటి ¯పించి నను మోక్షము సాధ్యము కాదు. ఈ మూడును సుఖదుఃఖస్వరూపములు. ఈ సుఖదుఃఖములను సంపూర్ణముగా అనుభవింపక మోక్షము లభ్యము కాదు.

కామి గాక మోక్షకామి కాదు:

ఇది లోకవ్యాప్తమయిన విషయము. పర్యంతకామానుభూతి వైరాగ్యమునకే దారిచూపు వని ఆధ్యాత్మిక సాహిత్య తత్త్వములు రెండును ప్రకటించును. భక్తిప్రతిపాదకము లైన అనేక గ్రంథములలో ప్రథమమున కామిత్వము - అనంతరము మోక్షగామిత్వము సుప్రతిపాదితము.[1] అంతియ గాక ఏ విషయమునం దైనను పర్యంతానుభూతి యేర్పడిన పిదప తద్విరక్తియే అతిశయముగ కన్పట్టుచుండును. ఈ విషయము శృంగార విషయముననే స్పష్టము. భర్తృహరి రచించిన ఒక శ్లోకము ఈ విషయమును నిరూపించుచున్నది -

పురాభూ దస్మాకం ప్రథమ మవిభిన్నా తను రియం
తతో ను త్వం ప్రేయాన్ వయ మపి హతాశాః ప్రియతమాః
ఇదానీం నాథ స్త్వం వయ మపి కళత్రం కి మపరమ్
హతానాం ప్రాణానాం కులిశకఠినానాం ఫల మిదమ్ ॥ [2]

సర్వప్రవృత్తియు నివృత్తిలరు మగు నను ఆధ్యాత్మిక తత్త్వము కూడ దీనిని బలపఱచగలదు కావున కామప్రాధాన్యము అప్రతిహతమే

[1] శివరాత్రి మాహత్మ్యము - వైజయంతీ విలాసము మొ॥

[2] భర్తృహరి సుభాషితములు

శా శ్వ త వి భా వ స్థి తి :

ఆశ్రమములలో గృహస్థాశ్రమమునకు ప్రాధాన్యము నిచ్చుచున్నాము. దాంపత్యజీవన మనునది సకలప్రాణికోటికిని సహజము స్త్రీ పురుషులలో అన్యోన్యాలంబన ద్వారమున ఏర్పడునది (కామము) శృంగారము. అట్టి యాలంబనము స్త్రీ పురుషులకు దాంపత్యము ద్వారమున శాశ్వతముగా లభించుచున్నది. తదితర రసములు కట్టి శాశ్వతాలంబనము లభించదు. అవి తత్కాల జాతములై వెనువెంటనే అంతరించునవి. కామము (శృంగారము) అన్నచో శాశ్వతవిభావస్థితి యుండుటచే అవిచ్ఛిన్నముగా సమకూరును.

ఆ ద్య ం త హృ ద్య ము :

శృంగారము ఆద్యంతహృద్య మయినది. విభావావస్థనుండి రసీభావస్థితి వరకును చర్వ్యమాణత శృంగారమున కన్పట్టును. అలంకారికులచే దీనికి కల్పింపబడిన వైశిష్ట్యము మఱి యొకటి. సంభోగ, విప్రలంభరూపమున నిది ద్వివిధవిభక్తమై సంయుక్తబుద్ధియందు సంయోగ శృంగారముగను వియుక్తబుద్ధియందు విప్రలంభ శృంగారముగను వ్యవహృత మగుచున్నది. ఉభయావస్థలయందు నిది ఆస్వాద్యమాన మగును. ఇతర రసముల విషయమున నన్నచో అనుభవవేళయందు మాత్రమే యవి రసనీయములు, ఉద్భావ వేళయందు వానికి ఆస్వాద్యమానత లేదు. ఇది శృంగారమునకు ఇతర రసములకన్న గల వైశిష్ట్యమును స్ఫుటీకరించును.

కావ్యము యొక్క పరమప్రయోజనము ఆనందము. అది శృంగారము వలన సులభసాధ్యము. మిగిలిన రసము లగు కరుణాదులు స్థితియందొక రూపమున నుండి ఆనంద మను రూపాంతరము నందుచున్నవి. అందుకే కావ్యమున కరుణాదులకానందపర్యవసాయిత్వ మెట్లను చర్చలు, వానికి తగిన సమాధానములు ప్రాదుర్భవించినవి. శృంగారమునం దన్నచో నట్టి శంకకు తావే లేదు. కనుకనే అచేతనములకు కూడ చేతనత్వమును కల్పించి వర్ణించుట, (ఒకచో ఇతర రసములు కూడ అచేతనములలో వర్ణింపబడుచుండుట కానవచ్చును. కాని శృంగారమున విశేషముగ కన్పట్టును) వసుచరిత్ర కుమారసంభవము మొదలగునవి ఈ యభిప్రాయమునకు పోషకములు.

రససామగ్రి ప్రకృతిసిద్ధము :

శృంగారరసమునకు సామగ్రి ప్రకృతి సిద్ధము. ప్రకృతిలోని ప్రతిపదార్థము రమణీయము — రసనీయము - ఆహ్లాదహేతుకము, గాలి - పూలు - మేఘములు - మొదలగున వన్నియు శృంగారోద్దీపకములు -

మేఘాలోకే భవతి సుఖినో ఽ ప్యన్యథావృత్తి చేతః ।
కంఠాశ్లేష ప్రణయిని జనే కిం పున ర్దూరసంస్థే

ఇట్లు ఉద్దీపనము లన్నియు ప్రకృతిసిద్ధము లగుటచే కూడ నిది రమణీయము.

శృంగారము భౌతికము మానసికము కూడ, అందుకే సంయోగ - విప్రలంభ భేదముచే అది ద్విధావిభక్తము. ఇతరరసములు మానసికములె కాని భౌతికత కంత ప్రాధాన్యము లేదు. ఇంత ప్రాధాన్యముండుట వలననే రసికపదము అర్థసంకోచము నొంది శృంగారికి మాత్రమే పరిమితమై యున్నది.

శృంగారీ చే త్కవిః కావ్యే జాతం రసమయం జగత్
స ఏవ వీతరాగ శ్చేత్ నీరసం జాత మేవ తత్ ॥ 2

అని రసమయకావ్య జగత్తు సృష్టింపవలె నన్న కవి శృంగారి కావలె నని పలికినాడు.

భావము ఆనందప్రవాహమువలె సాగిపోవుటకు గూడ శృంగారరస ముప కరించినంతగా ఇతరరసము లుపకరింపక పోవచ్చును. శృంగారము వీరకృత్య ములను ప్రోత్సాహించును. వ్యక్తులలో ఉత్సాహమును రేకెత్తించును. పాశ్చా త్యశృంగారములో నిదే ప్రముఖస్థానమును వహించును.

"కామ మమనది పురోఽభివృద్ధిహేతు వని యూరోపియనుల భావన. ఎట్లన వరించు స్వాతంత్ర్య ముండబట్టి ఏదేని ఒక హృదయాకర్షక మగు విశేషము

---

1 మేఘదూతము ప్రథమ - 3

2 ధ్వన్యాలోలోకము - తృతీయ - పు. 530 (Chowkhamba edn)

కలిగియో నేర్చియో ఉన్న గాని లేనిచో ఏకాకులుగా జీవనము గడపవలసినదే. కాబట్టి స్త్రీల మెప్పుకొరకై ఎల్లరు శ్రమకోర్చి శక్త్యనుసారము గొప్పదన మంద జూతురు. మరియు స్త్రీలను తెలివితేటల తేలినవారు గాన అట్టివారి సాహసము శ్రేయోహేతువు"[1]

ఒడుదుడుకులు లేని జీవితము సామాన్యముగా శృంగారమును అతిక్రమిం చదు. లౌకికములు, భౌతికములు, శాస్త్రీయములు నగు నీ కారణములచే శృంగారమును రసరాజముగా నంగీకరించుట సహృదయహృద్య మగును.

---

(1) కవిత్వతత్త్వవిచారము - పు 86 - అం॥ యూ॥ ప్రచురణ.

ర ప భే ద ము లు

శృంగారము

శృంగారము సర్వరసములలోను ప్రథమమే గాక అగ్రస్థానమును నంది యుండుట గమనించియే యుంటిమి. దానికి ఆలంకారికులు చెప్పిన కారణములను నయితము పరిశీలించితిమి. కాని అట్టి శృంగారమున సంభోగశృంగారము సహృదయులకు ప్రీతిపాత్రమో లేక విప్రలంభము ప్రీతిపాత్రమో వివేచింపవలసియున్నది. "లోకో భిన్నరుచిః" అని సరిపెట్టుకొనినచో ప్రశ్నయే లేదు. కాని దీని విషయమై ఆలంకారికులలో గల అభిప్రాయములను పరిశీలించుట ఆవశ్యకము.

నిజజీవితమునందు ప్రతిమానవుడును సుఖాభిలాషియే. దుఃఖ మెవడును కోరుకొనడు. కాని సుఖదుఃఖములు పగలు రాత్రి వంటివి. పగటివిలువ రాత్రి యున్నపుడే తెలియును. అనగా కష్ట మెరిగినవానికే సుఖముయొక్క ప్రాముఖ్యము తెలియును. ఎప్పుడును సుఖమునే యనుభవించు అగర్భశ్రీమంతునకు దుఃఖము యొక్క అనుభవమే యుండదు. అపుడతనికి సుఖమునయితము వెగటుగా దోచును. రుచ్యము కాకపోవును. కావుననే "కష్టసుఖములు తెలిసిన వ్యక్తి" అనుట అతని సహృదయతకు నిదర్శనము. భోజ్యపదార్థములందు అన్నియు మధురము లయినచో మాధుర్యముయొక్క విలువ తగ్గును. పుష్కలముగ ఆస్వాద్యము కాదు. ఇతరరససమ్మేళనముచే మాధుర్యముయొక్క ప్రాముఖ్యము గమనార్హ మగును.

అట్లే ఉత్తమయువప్రకృతు లయిన స్త్రీపురుషుల సంభోగశృంగారము విప్రలంభసహకృత మగుచో మరింత శోభ చేకూర్చును. అది విప్రలంభముచే సహకృతము కావలెనే గాని పరిఘాతము కారాదు.

సంయోగ విప్రలంభముల సమ్మేళనమే సాతిశయ చమత్కారావహ మని అభినవగుప్తుడు విశదపరచెను

"అత ఏవ ఏతద్దశాద్వయమేళన ఏవ సత్యతః సాతిశయచమత్కారః యథా-

ఏకస్మిన్ శయనే పరాఙ్ముఖతయా వీతోత్తరం తామ్యతో
రన్యోన్యం హృదయస్థితే ఽప్యనునయే సంరక్షతో ర్గౌరవమ్

దంపత్యో శ్శనకై రపాంగవలనా న్మిశ్రీభవచ్చక్షుషో
ర్భగ్నో మానకలిః సహాసరభసవ్యాసక్తకంఠగ్రహమ్ [1]

భార్యాభర్తలు ఒకపాన్పునందే పొలయుకచే ఒండొరులకు పెడమొగ
ముగా పరుండి మౌనము దాల్చినవారై కుందుచు ఒకరి నొకరు మన్నింప వేడుకొన
గోరిక గలిగియున్నను బెట్టుచెడునను భయముచేత అట్లు వేడుకొనకయే యుండి,
అనంతరము అన్యోన్యభావపరీక్షార్థము కడకన్నుల నొకరి నొకరు చూచుకొని
చూపులు కలుపుకొని పరస్పరప్రసాదాపేక్ష నెరింగి తటాలున మహాసంతోషమున
నవ్వుచు సరిగా నొండొరుల వైపు తిరిగి, కంఠాశ్లేషము లొనరించి కడతేరిరి [2]

"తత్ర హి ఈర్ష్యావిప్రలంభసంభోగమేళనాత్మకై వైకప్రాణి
భూతోభయగత విభావానుభావవ్యభిచారికృతా సాతిశయా రసాను
భూతిః" [3]

ఇచ్చట ఈర్ష్యావిప్రలంభము, సంభోగము వీని మేళనముచే ఏకప్రాణి
భూతమై ఉభయగత మైన విభావానుభావవ్యభిచారిభావములచే పరిపుష్ట మైన రసాను
భూతి కలుగుచున్నది. ఇది యెంతయు సహజము పరమోత్కృష్టము నైన
యవస్థ. చీకటి వెడలిన యనంతర ముదయించు ఉషోరేఖ వంటిది ఈర్ష్యావిప్రలంభా
నంతర సంభోగము.

కావున విప్రలంభముతో కూడిన సంభోగశృంగారము సాతిశయచమత్కారా
పాది యగును. ఈ విషయమును ప్రపంచించుటకై సాహిత్యదర్పణకర్త ప్రాచీన
సమ్మతి నిట్లుదాహరించెను.

"న వినా విప్రలంభేన స భోగః పుష్టి మశ్నుతే।
కషాయితే హి వస్త్రాదౌ భూయాన్ రాగో వివర్ధతే॥

---

[1] అమరుక శతకము - 23

[2] వేదము వేంకటరాయశాస్త్రిగారి తెలుగుసేత.

[3] అభినవభారతి - 6వ అధ్యా - పు 303 Gack Edn.

విప్రలంభము లేనిదే సంభోగశృంగారము పుష్టి నొందదు. కషాయిత మైన వస్త్రమునందే రంగు వృద్ధినొందును.

సంభోగశృంగారము

పరస్పరానురక్తు లయిన యువతీయువకుల దర్శన, స్పర్శన, ఆలింగన, అధరపాన, చుంబనాదులచే దీపించునది. వీని అనంత్యముచే దీనిలో భేదపరిగణన మొనర్పలేదు.

సంఖ్యాతు మశక్యతయా చుంబనపరిరంభణాది బహుభేదాన్।
అయ మేక ఏవ ధీరైః కథితః సంభోగశృంగారః॥

అయినను కొంతమంది యొకానొక సూక్ష్మభేదమును పరిగణన మొనర్చిరి.

1. పూర్వరాగానంతర సంభోగము 2. మానానంతర సంభోగము 3. ప్రవాసానంతరసంభోగము 4. కరుణవిప్రలంభానంతర సంభోగము.[1] వీనికి క్రమముగ 1 సంక్షిప్తము 2. సంకీర్ణము 3. సంపన్నతరము 4. సమృద్ధిమంతము అను నామకరణములను గూడ రసార్ణవసుధాకరకర్త యొనర్చినాడు.

కావ్యప్రకాశకారుడు సంభోగశృంగారమునకు రెం డుదాహరణము లిచ్చెను. భేదమును వాచ్య మొనరింపలేదు. కాని ఒకటి నాయికారబ్ధశృంగారమునకును, మరియొకటి నాయకారబ్ధశృంగారమునకును ఉదాహరణములు. 'ఆదౌ వాచ్యః స్త్రియారాగః' అని యొక ఆలంకారికోక్తి స్త్రీపురుషులలో గల ప్రకృతితారతమ్యమే ఇట్లనుటకు కారణము. పురుషుడు ధీరప్రకృతి కలవాడు. స్త్రీ లలితప్రకృతికలది. కావున స్త్రీపురుషులలో స్త్రీకి గల యనురాగము ముందుగ ప్రకటింపబడును.

విప్రలంభశృంగారము

అయుక్తయోః తరుణయో ర్యోఽనురాగః పరస్పరమ్
అభీష్టాలింగనాదీనా మనవాప్తౌ ప్రకృష్యతే స విప్రలంభో జ్ఞేయః

[1] రసార్ణవ సుధాకరము - 2అ - 170.

పరస్పరము కలయిక పొంద జాలని యువతీయువకుల యనురాగము, అభీష్ట ములగు ఆలింగనాదులు లభింపమిచే ప్రకర్షను పొందినచో విప్రలంభము. పర స్పరానురక్తు లయిన నాయికానాయకులకు కల్గిన ఎడబాటు. అందు నాయికానాయకుల మనః ప్రవృత్తుల చిత్రణమే విప్రలంభ మగును. దీని వ్యుత్పత్తి నిట్లు వచించిరి.

"సంభోగసుఖాస్వాదలోభేన విశేషేణ ప్రలభ్యతే
ఆత్మా ౽ త్రేతి విప్రలంభః॥ [1]

సంభోగసుఖాస్వాదలోభముచేత ఆత్మ మిక్కిలిగా ప్రతారింపబడుటచే నీ యవస్థ విప్రలంభ మయినది.

విప్రలంభము నాల్గు విధము లని ఆలంకారికులు చాలమంది విభజించిరి.

1. పూర్వానురాగవిప్రలంభము 2. మానవిప్రలంభము 3 ప్రవాస విప్రలంభము 4. కరుణవిప్రలంభము. పూర్వానురాగవిప్రలంభమునే కొందరు అభిలాషవిప్రలంభ మనిరి.

ఈ చాతుర్విధ్యము సాహిత్యదర్పణ కారునిచే ప్రవచింపబడినది. కాని కావ్య ప్రకాశకారుడు విప్రలంభము పంచవిధముగ పేర్కొనెను.

1. అభిలాష విప్రలంభము
2. విరహ విప్రలంభము
3. ఈర్ష్యా విప్రలంభము
4 ప్రవాస విప్రలంభము
5. శాప విప్రలంభము

ఈ భేదములను దృష్టియందిడుకొని తెలుగున కావ్యాలంకార సంగ్రహ కర్త శాపవిప్రలంభమును విడిచి మిగిలిన నాలుగు భేదములను పేర్కొనెను.

రసాభరణకర్త విప్రలంభమునందు నల్గుభేదములను పేర్కొనెను. అవి అభిలాష - ఈర్ష్యా - విరహ - ప్రవాసములు. ఇట్లు పేర్కొని పిదప మతాంతర మును వివరించుచు కరుణము - మానము అను రెండు భేదము లుదాహరించెను.

భేదపరిగణనమున ఆలంకారికులలో భిన్నాభిప్రాయము లున్నవి. విప్రలంభ స్వరూపమునందు మాత్రము ఇట్టి అభిప్రాయభేదము లేదు.

---

[1] కావ్యానుశాసనము - 2-30 (హేమచంద్రుడు)

పూర్వరాగము (లేక) అభిలాషము :

"యత్రప్రేమసంగమాత్పూర్వం దర్శనశ్రవణాదిభిః
పూర్వరాగస్స విజ్ఞేయః" [1]

'కలయకమున్న రాగ మధికం బగునే నభిలాష' యని రసాభరణకర్త వచించెను.

పరస్పరానురక్తు లయిన యువతీయువకుల ప్రథమ సంభోగమునకు పూర్వావస్థ యిది. ఈ పూర్వరాగమున నాయికా నాయకులకు సంభోగము లేకుండుటచే శ్రవణదర్శనములు సహ్మతములు. శ్రవణము దూతసఖీముఖమున, అన్యతర గుణకథనము చేతను కలుగును. దర్శనము ఇంద్రజాలము నందును, చిత్రము నందును, స్వప్నమునందును కలుగును.

అయోగము, విప్రయోగము :

కొందరు 'విప్రలంభశృంగారము' అను భేదమును తన్నామముతో పేర్కొనరు. విప్రలంభ పదము ప్రయోగింపరు, సంభోగేతరమగు శృంగారము రెండు విధము లనియు అందొకటి అయోగ మనియు, రెండవది విప్రయోగ మనియు పేర్కొందురు. ఇందు అయోగశబ్దము పూర్వానురాగ వాచకము, విప్రయోగము మానాదివాచకము, అనియు చెప్పుదురు. విప్రలంభపదమును ప్రయోగింపక యీ అయోగ విప్రయోగములను ప్రయోగించుటలో గల కారణ మిది. ప్రలంభ మనగా వంచనము - ప్రతారణము అర్థము. 'వి' అను నుపసర్గముతో కూడిన ప్రలంభమునకు విశేషమైన మోసమని యర్థము చెప్పవలెను. ఈ యర్థ మన్ని స్థలములందును సమన్వయింపదు, నాయికానాయకులు సంకేత మేర్పరచుకొని యచటకు ఏ ఒకరేని రానపుడు ప్రలంభము ఉండును. అట్లే తద్వ్యతి క్రమమగు మరొక నాయికననుసరించునపుడును. మోస ముండును కావున అచట విప్రలంభశబ్దము ప్రయోగించుట యన్వర్థమగును కాని అయోగ, విప్రయోగస్థలము లందు విప్రలంభశబ్దము ఉపచారముగా ప్రయోగింపవలసి యున్నదే కాని అన్వర్థము కాజాలదు.

---

1 రసార్ణవ సుధాకరము, 2-171

ఈ యభిప్రాయమును రసార్ణవసుధాకరకర్త ఖండించినాడు [చతుర్విధము లగు విప్రలంభములందును వంచన రూపమైన యర్థము ప్రాముఖ్యము వహించును. కావున విప్రలంభపదమే సార్థకము,

1. వివిధమగు ప్రలంభము (వంచన (వ్రీళాదులచే) పూర్వానురాగ మగును.
2. విరుద్ధ మగు ప్రలంభము (ఈర్ష్యాయితాదులచే) ప్రవాస మగును.
3. వ్యావిద్ధ మగు ప్రలంభము (దీర్ఘ కాలముచే) ప్రవాస మగును.
4. వినిషిద్ధ మగు ప్రలంభము (కరుణచే) కరుణ మగును. [1]

ఇట్లు విప్రలంభదశ లగు నాల్గింటిలోను వంచన ముఖ్యము ననుట రసార్ణవ సుధాకరకర్త అభిప్రాయము. అనగా సహజస్థితి, ఆర్జవస్థితి యుండదని భావము. మొత్తము మీద విప్రలంభమున నాయికానాయకుల తీరని కోరిక వ్యాపించి యుండును. అదియే యిట వంచన మనవచ్చునేమో.

స్మ ర ద శ లు :

ఈ పూర్వానురాగ విప్రలంభమున అభిలాషాదులగు నాయికానాయకుల మనః ప్రవృత్తులు వర్ణితము లగుచుండును వీనిని స్మరదశ లని గాని, కామావస్థ లని గాని పేర్కొనదగెను. ఇవి పది యని రసార్ణవసుధాకరకర్త పేర్కొనెను. ఇవి సంచారి భావముల యౌత్కట్యముచే నేర్పడును. ఆ పది యివి –

అభిలాష, చింత, అనుస్మృతి, గుణసంకీర్తనము, ఉద్వేగము, విలాపము. ఉన్మాదము వ్యాధి, జడత, మృతి అనునవి దశవిధకామావస్థలు.

అ భి లా ష :

సంగమోపాయ ప్రయత్నము వలన సముద్భూతమైన సంకల్పమే యభి లాషము ఒకరి నొకరు చూచుకొనుటకై నాయికానాయకుల రాకపోకలు, రాగప్రకాశ నపరమైన చేష్టలు, ఆత్మాలంకరణము, వ్యాజోక్తులు, ఏకాంతస్థితి మున్నగు చేష్ట లిందుండును.

చి ం త :

ఏ యుపాయముచే కార్యము సిద్ధించును ? సమాగమ మెపుడు కల్గును ? దూతీముఖమున నేమి చెప్పవలయును ? మున్నగు రీతి నూహించుటయే చింతనము.

---

[1] రసార్ణవసుధాకరము - తెలుగు – బులుసు వేంకటరమణయ్యగారు.

సీవ్యాదుల స్పర్శము, శయ్యయందు ఇటునటు, దొరలుట సబాష్పకేకరాదృష్టియు, అంగుళీయక వివర్తనము లజ్జారహితముగ చూచుట మున్నగు వికృతు లిందుండును.

అ ను స్మృ తి :

దేశ, కాలానువర్తులు అనుభూతములు నగు విషయములను సతతము మనసున పరామర్శించుకొనుట యనుస్మృతి. నిశ్వాసము, ధ్యానము, కృత్యముల యెడ శక్తిహీనత, శయ్యాసనములందు విద్వేషము మున్నగు స్మరకల్పితములగు వనుభావము లుండును.

గు ణ కీ ర్త న ము :

సౌందర్యాది గుణములను శ్లాఘించుట గుణకీర్తన మగును. ఇందు రోమాంచము, గద్గదత్వము, భావమంథరమగు వీక్షణము, సఖితో తత్సంగమ చింతనము, చెక్కిలి చెమర్చుట మున్నగు ననుభావములు కల్గును.

ఉ ద్వే గ ము :

మనఃకంపమే యుద్వేగము. చిత్తసంతాపము, నిశ్వాసము, శయ్యాసనాదుల యందు ద్వేషము, స్తంభము, చింత, అశ్రువు, వైవర్ణ్యము, దైన్యము మున్నగు భావములు ఇందలి యనుభావములు.

వి లా ప ము :

"ఇచట నా కంట బడెను - ఇచట విర్చుండెను - ఇచట కూర్చుండెను - ఇచట మాట్లాడెను- ఇచట నివసించెను - ఇటు నుండియే మరలిపోయెను. మున్నగు వాక్యముల విన్యాసమే విలాపము. ఎచటికో పోవుట, ఎక్కడనో చూచుట, ఎక్కడెక్కడో వసించుట, ఎక్కడనో తిరుగుట మున్నగు అనవస్థితములగు చేష్ట లుండును.

ఉ న్మా ద ము :

అన్ని యవస్థలయందును అంతటను తదేకమనస్కత యుండును. దానివలన అతస్మిన్ తద్బుద్ధి అనెడి భ్రాంతియే విరహోద్భవ మగు నున్మాదము. తన కిష్ట మయిన వస్తువునందు సయితము ద్వేషము, మాటిమాటికి దీర్ఘనిశ్వాసము, అని మేషస్థితి, అకారణస్మితము, ధ్యానము, గానము, మోహము మున్నగు చేష్టలు కల్గును.

వ్యాధి :

అభీష్ట మగు సంగమము లభింపమి గల్గు సంతాపమే వ్యాధి. ఇందు సంతాపము, నిశ్వాసము, చల్లని వస్తువుల సేవించుట, జీవితముపై ఉపేక్షా భావము మోహము, మరణించవలె ననెడి భావము, ధృతి లేకపోవుట, ఎచ్చట నైనను పడిపోవుట, ప్రస్తాక్షత్వము కల్గును.

జడత :

ఇష్టానిష్టజ్ఞానము లేకుండుట, ప్రశ్నకు సమాధాన మీకుండుట, వినకుండుట, చూడకుండుట, నిస్సంగము కల్గిన జడత యగును. ఇందు స్పర్శజ్ఞానము లేకుండుట, వైవర్ణ్యము, శిథిలాంగత, అకాండహుంకారము, స్తంభము, నిశ్వాసము, కృశత మున్నగు నను భావములు కల్గును.

మరణము :

ఎన్నియో యుపాయములచేత కూడ ప్రియుని సమాగమము లభింపమి కామాగ్నివలన మరణోద్యోగమే మరణ మనబడును. సాక్షన్మరణ మిచట మరణ మనజెల్లదు. మరణప్రయత్నమే మరణ మనజెల్లును. ఇందు లీలాశుక చకోరాదులను సఖుల కప్పగించుట, కలకంఠకలధ్వని శ్రవణము, మందమలయానిలము నాదరించుట, జ్యోత్స్నాప్రవేశము, మాకందమంజరీ వీక్షణము మున్నగు చేష్ట లిందుండును.

ఈ మరణ విషయమున ఆలంకారికులలో కొంత చర్చ జరిగినది. నాయికా నాయకుల మరణవర్ణనముచే ఆలంబనము విచ్ఛిన్నమై చర్వణాస్వాదము భంగ మగు నను తలంపుతో కొందరు మరణము వర్ణింపరా దనియు, మరణోద్యోగమే మరణ మనియు నిర్వచించిరి. కాని అభినవగుప్తుడు మరింత అభ్యుదయ మార్గము ననుసరించినాడు మరణము వర్ణింపవచ్చును కాని అచిరకాలముననే మరల ప్రాప్తి యుండినచో నది దోషము కాదు. దానివలన ఆలంబనము విచ్ఛిన్నమయినట్లు కాదు, శోకావస్థితి కల్గదు. అది మరల చిరకాలస్థితి పొందినచో చర్వణ భంగమగును అందుచే వెంటనే కొలది కాలములోనే మరల బ్రతికినట్లు వర్ణిత మైనచో చర్వణ భంగము కాదు. కావున మరణము అచిరకాల ప్రత్యాపత్తిమయమే యిట గ్రహింపవలె నని అభినవుని వక్కాణ.

"మరణ మచిరకాలం ప్రత్యాపత్తిమయ మత్ర మన్తవ్యమ్, యేన శోకో౽వస్థాన మేవ న లభతే యథా -

తీర్థే తోయవ్యతికరభవే జహ్నుకన్యాసరయ్వోః
దేహత్యాగా దమరగణనాలేఖ్య మాసాద్య సద్యః ॥
పూర్వావస్థాధికచతురయా సంగతః కాన్తయా౽సౌ
లీలాగారే ష్వరమత పున ర్నందనాభ్యన్తరేషు ॥
— రఘువంశము 8-95

ఇందు మరణ మను పదము ప్రయోగింప బడకపోయినను దేహత్యాగ మను పర్యాయపదము ప్రయోగింప బడినది. అదియును అచిరకాలప్రత్యాపత్తిమయము గనుకనే ప్రయుక్తము. కాని దేహత్యాగమునకు పునస్సంగమమునకు మధ్య ఎంతో కాలము గడవలేదు. కనుక అచిరకాలప్రత్యాపత్తి కలదని యర్థము.

మరి కొందరి యభిప్రాయమును అభినవు డిట్లు వివరించెను. "మరణము అను పదము జీవితవియోగమును సూచింపదు. అది చైతన్యావస్థయే. ప్రాణత్యాగము చేయు తలపు మాత్రమే ఆత్మగా కలది ఈవిషయము నీ క్రింది వంక్తులు వెల్లడించుచున్నవి.

'అన్యే త్వాహుః మరణ మితి న జీవితవియోగ ఉచ్యతే అపితు చైతన్యావస్థైవ ప్రాణత్యాగకర్తృతాత్మికా యా సంబంధాద్యవసరగతా మన్తవ్యా వ్యభిచారిభావే నేతి సులభోదాహరణ మేత దితి".

కావుననే సాహిత్యదర్పణకారు డిట్లు వచించెను.

రసవిచ్ఛేదహేతుత్వా న్మరణం నైవ వర్ణ్యతే
జాతప్రాయం తు తద్వాచ్యం, చేతసా కాంక్షితం తథా
వర్ణ్యతే౽పి యది ప్రత్యుజ్జీవనం స్యా దదూరతః
అని మరణమును గూర్చి యభిప్రాయమును క్రోడీకరించెను.

కా మా వ స్థ లు

ఇవి దశవిధము లని యనేకులు వచింపగా కొందరు అభిలాషకు పూర్వము ఇచ్ఛ ఉత్కంఠ అను రెంటిని పఠించి ద్వాదశావస్థలను పేర్కొనిరి. కాని యుక్తి

నఘంజనము కాదు. ఇచ్ఛ అభిలాషకంటె భిన్నము కాదు. కోరికను పొందుటలో గల త్వరయే ఉత్కంఠ కదా! అది చింతకంటె భిన్నము కాదు. కావున దీనిని వేరుగా పరిగణింప నవసరము లేదని రసార్ణవసుధాకరకర్త నుడివెను.

కొంతమంది యీ దశావస్థలలో కించిద్భేదముగ్న వచింతురు.

"నయనప్రీతిః ప్రథమం చిత్తాసంగ స్తతోఽథ సంకల్పః
నిద్రాచ్ఛేద స్తనుతా విషయనివృత్తి స్త్రపానాశః
ఉన్మాదో మూర్ఛా మృతిరిత్యేతాః స్మరదశా దశైవ స్యుః"

ఈ యభిప్రాయమునకే ప్రతాపరుద్రీయకర్త మరి రెండు అవస్థలను చేర్చి కామశాస్త్రానుసారముగ ద్వాదశావస్థ లని పేర్కొనెను.

"అథ శృంగారస్య అంకురితత్వ, పల్లవితత్వ, కుసుమితత్వ, ఫలితత్వ హేతవో ద్వాదశావస్థా విరూప్యన్తే

చక్షుః ప్రీతిః మనస్సంగ స్సంకల్పో ఽథ ప్రలాపితా
జాగరః కార్శ్య మరతి ర్లజ్జాత్యాగో ఽథ సంజ్వరః
ఉన్మాదో మూర్ఛనం చైవ మరణం చరమం విదుః
అవస్థా ద్వాదశ మతాః కామశాస్త్రానుసారతః"

ఈ కామావస్థలు నాయికాగతములుగనే ఎక్కువగా వర్ణింపబడుచున్నవి. అయినను అవి నాయికలలో మాత్ర ముండెడివనియు నాయకులలో అసంగతము లనియు కావు స్మరదశలు ఇరువురకు సమానములే. ఏ కొన్నింటికో అనుభవవిషయమున అంతరతమభేద ముండిన నుండవచ్చును. కాని 'ఆదౌవాచ్యః స్త్రియారాగః' అను న్యాయమునకత్యంతప్రాధాన్యము నిచ్చి ఈ విధముగా స్మరావస్థలను నాయికాగతములుగనే వర్ణించినా రని యనవచ్చును. పారమార్థికపర్యాలోచనము గావించినచో స్మరదశలు నాయికానాయకుల కిరువురకును సమానమే. అంతియగాక ధీరోదాత్తుడైన నాయకుడు బహుకార్యవ్యాపృతుడై యుండును గావున ఈ దశలు చక్కగా ఆవిష్కరింపబడు అవకాశము తక్కువ. అదియును ఈ దశలను నాయికలకే ప్రాధాన్య మిచ్చి వర్ణించుటకో హేతు వగును.

అనురాగవిషయభేదము ననుసరించి యీ పూర్వానురాగము మువ్విధములు. 1. నీలీరాగము 2. కుసుంభరాగము 3. మంజిష్ఠారాగము.

నీలీరాగము

న చాతిశోభతే యన్నాపైతి ప్రేమమనోగతమ్।
తన్నీలీరాగ మాఖ్యాతం యథా శ్రీరామసీతయోః॥[1]

పైకి మిక్కిలి కన్పింపక మనోగతమగు ననురాగము వీడరానిదిగా నున్న యనురాగము నీలీరాగ మనబడును. సీతారాముల యనురాగ మిట్టిది.

కుసుంభరాగము

కుసుంభరాగం తత్ప్రాహు ర్య దపైతి చ శోభతే [2]

కుసుంభరాగము పైకి శోభించినను స్థిరము కాదు. కొంత కాలమున కంతరించును. క్షీణమైనచో నీరాగము నశించును. ఇది దేవహూతీకర్దముల యనురాగమని సన్నిధానము వారు.

మంజిష్ఠారాగము

"మంజిష్ఠారాగ మాహు స్తద్యన్నాపై త్యతిశోభతే" [3]

పైకి బాగుగా శోభించుచు క్షీణ మయ్యూ పీడనిది మంజిష్ఠారాగము. నలదమయంతుల యనురాగమిట్టిది. ఈవిభాగము ప్రథమమున ప్రతిపాదించిన వాడు శారదాతనయుడు. అతడు భావప్రకాశచతుర్థాధికరణమున వీనిలో జ్యేష్ఠ, మధ్యమ, అధమ, భేదములను నయికము వచించెను. జ్యేష్ఠము-శ్రేష్ఠము మంజిష్ఠారాగము. నీలీరాగము మధ్యమము. కుసుంభరాగము అధమము.

పారతంత్ర్య భావము :

ఈ పూర్వానురాగమున అనురాగము సంకల్ప రూపమున నుండును. వృత్తివృద్ధి పరతంత్రమై యుండును. కావున నిందు పారతంత్ర్యభావము కూడ చోటు చేసి

---

[1] సాహిత్యదర్పణము - 3 - 296,

[2] సాహిత్యదర్పణము - 3 - 297

[3] ,, 3 - 298

కొనును. ఆ పారతంత్ర్యము దైవకృతము కావచ్చును. మనుష్యకృతము కావచ్చును. కావున పారతంత్ర్యవశమున ఈ పూర్వానురాగము ద్వివిధము. 1) దైవపారతంత్ర్యము. 2) మానుష పారతంత్ర్యము. ఈ విభేదమును రసార్ణవ సుధాకరకర్త ప్రతిపాదించి దైవపారతంత్ర్యమునకు దీని నుదాహరించెను.

శైలాత్మజాపి పితు రుచ్ఛిరసోఽభిలాషం
వ్యర్థం సమీక్ష్య లలితం వపు రాత్మన శ్చ
సఖ్యాః సమక్ష మితి చాధికజాతలజ్జా
శూన్యా జగామ భవనాభిముఖీ కథంచిత్ ॥

పార్వతియును గొప్పవాడైన తండ్రియొక్క యభిలాష (శివుడు తన కల్లుడు కాగల డనుకోరిక) యు, తన యందమైన శరీరమును వ్యర్థము లని తెలిసికొని తన చెలికత్తె యెదుట నిట్లు జరుగుటకు మిక్కిలి లజ్జించినదై శూన్యహృదయముతో నింటి ముఖము పట్టి ఎట్టెటులో వెళ్లెను.

ఇచ్చటఁ దండ్రి మన్నగువారి యానుకూల్యమున్నను దైవపారతంత్ర్యము వలన పార్వతికి పూర్వానురాగము. [1]

మనుష్య పారతంత్ర్యము కూడ నిట్టిదే.
దుర్లభః ప్రియ స్తస్మిన్ భవ హృదయ నిరాశం
అహ్మో ! అపాంగో మే స్ఫురతి కిమపి వామః
ఏష స చిరదృష్టః కథం పున ర్ద్రష్టవ్యః
అహం పరాధీనా త్వం పున స్సతృష్ణమ్ ॥

ఓ హృదయమా! ప్రియుడు దుర్లభుడు, అతని యెడల ఆశను విడువుము అహ్మో! ఎడమకన్నదరుచున్నది. చాలకాలము క్రిందటఁ జూచిన యానాయకు నెట్లు మరలఁ జూడనగును? నేను పరాధీనురాలను. ఇది యెరింగియు నీ వాతనియెడ నభిలాషను కలిగియున్నావు. [2]

ఇచ్చట శర్మిష్ఠ దేవయానీపరతంత్ర యగుటచే నామెకు పూర్వానురాగము.

---

1 రసార్ణవ సుధాకరము - తెలుగు - బులుసు వేంకటరమణయ్యగారు.

2 రసార్ణవసుధాకరము - తెలుగు - బులుసు వేంకటరమణయ్యగారు.

మానవిప్రలంభము :

వలదు వలదనెడి ప్రతిషేధార్థములతో నభీష్టాలింగనాదుల నడ్డుపెట్టుట మాన మనబడును. ఇది సహేతుకము నిర్హేతుకము అని ద్వివిధము. అందు హేతుజము ఈర్ష్యవలన కల్గును. భర్త అన్యాసక్తుడు కాగా తద్విషయమును వినిగాని - యూహించి గాని - చూచిగాని సహింపకుండుట యీర్ష్య. ఈ యీర్ష్యామానమున నిర్వేదము. అవహిత్థ, గ్లాని, దైన్యము, చింత, చాపల్యము, జడత, మోహము మున్నగు వ్యభిచారిభావములు కల్గును. అనుమితి మరల త్రివిధము. భోగాంకమువలనను గోత్ర స్ఖలనము వలనను ఉత్స్వప్నమువలనను అనుమితి మూడు విధములుగ గల్గును.

కారణము లేకయే నాయికానాయకులకు కల్గిన మానము నిర్హేతుకమానము. ఈ నిర్హేతుకమానము స్మితాదులనే శమించును.

"నిర్హేతుక స్స్వయం శామ్యేత్ స్వయంగ్రాహిస్మితాదిభి,"

హేతుజమైన మానము యథాయోగముగ - సామ భేద దానములచేతను, ఉపేక్షాభావముచేతను, రసాంతరముచేతను శమించును. ప్రియోక్తికథనమే సామ మగును. సఖ్యాదులచే నుపాలంభప్రయోగము భేద మగును. ఏదో వ్యాజముతో భూషణాది ప్రదానము దాన మగును. పాదప్రణామమే నతి యనబడును. ఊరకుండుట యుపేక్ష, రసాంతరమన ఆకస్మికముగ భయాదులను కల్పించుట. ఇది యాదృచ్ఛికము, బుద్ధిపూర్వకము అని ద్వివిధము. అనుకూల మగు దైవముచే కల్పింపబడినది యాదృచ్ఛికము. ప్రత్యుత్పన్నబుద్ధిచే కల్పింపబడినది బుద్ధిపూర్వకము.

ఈర్ష్యావిప్రలంభమును నరసభూపాలీయకర్త యిట్లుదాహరించెను.

వదనాగ్రంబున వాణి యున్నది; మమున్ వాక్రువ్వ నీ విందిరా
మదిరాక్షీమణి యున్న దక్షు; మమునన్ మన్నించి వీక్షింప నీ
దదియుం గాక స్పృశింప ; నీ విపులబాహాశ్లేషమే నొంద నో
ర్వదు భూదేవి బహుప్రియావర! నినుం బ్రార్థింప నింకేటికిన్ !

ప్రవాసవిప్రలంభము :

పూర్వసంగతు లయిన యువతీయువకులకు దేశాంతరాదులచే కల్గు ఎడబాటు ప్రవాస మనబడును. తజ్జన్య మగువిప్రలంభము కూడ ప్రవాసమే. ఇందు హర్షము.

మదము గర్వము వ్రీడ యనునవి తప్ప మిగిలిన వ్యభిచారిభావము లన్నియును కల్గును.

ఈ ప్రవాసము కార్యజము, సంభ్రమజము, శాపజము అని మూడు విధములు. సన్నిధాన వ్యపేక్ష యున్నను బుద్ధి పూర్వకముగా కల్గినది కార్యజము. ఇది మరల వృత్త, వర్తిష్యమాణ, వర్తమాన భేదములచే త్రివిధము.

ధర్మార్థ సంగ్రాహక మగు బుద్ధిపూర్వక వ్యాపారమే కార్యము.

ఇక సంభ్రమజమన ఆవేగము. ఇది దివ్యాది భేదముచే అనేక విధములైనది. ఇది యుత్పాతమువలన కల్గును.ఈ యుత్పాతము దివ్య - నాభస - మానుష భేదములచే ముప్విధము అని కొందరు వర్ణించిరి.

ఇందు నాయికకు గాత్రమాలిన్యము, వస్త్రమాలిన్యము ఏకవేణీధారణము నిశ్వాసోచ్ఛ్వాసములు, రుదితము, భూమిపతనము మున్నగునవి కల్గును. మన్మథావస్థలీ క్రిందివి కల్గును, అంగములందసౌష్ఠవము, తాపము, పాండుత. కృశత్వము, అరుచి, అధైర్యము, అనాలంబము, తన్మయత, ఉన్మాదము. మూర్ఛ, మృతి అనునవి కల్గును. ప్రవాసానంతరము కల్గిన సమాగమమందు నత్యానంద మధికముగ నుండును

"ప్రవాసానంతరే తస్యాభ్యాగమే రాగ్ధ తేష్యతే।
తత్ర పుష్యపోషితై రన్న మివ నిర్విశ్యతే రతిః।"

శాపజము మరల ద్వివిధము, వైరూప్యము తాద్రూప్యము అను భేదము లందు గలవు. నాయకానాయకులకు శాపముచే వియోగము కల్గినపుడు రూపము కూడ మారినచో నావిప్రలంభము వైరూప్యశాపజ మగు విప్రలంభము. అహల్యా గౌతముల విప్రలంభము వైరూప్యాత్మకము తాద్రూప్యమన నారూపముతోడనే యుండి విరహ మేర్పడుట, మేఘదూత మందలి యక్షయక్షిణుల విరహ మిట్టిది. వారికి శరీరవైరూప్యము లేదు. తద్రూపమే కలదు. కావున వారి వియోగము తాద్రూప్యశాపజము.

కరుణవిప్రలంభము:

యూనో రేకతరస్మిన్ గతవతి లోకాన్తరం పునర్లభ్యే।
విమనాయతే యదైక స్తతో భవేత్ కరుణవిప్రలంభాఖ్యః॥

నాయికానాయకులలో నొకరు లోకాంతరమును పొందియు కాలాంతరమున నాశరీరముతోడనే మరల బ్రతుకు నవకాశ మున్నపుడు పొందెడి యవస్థ కరుణ విప్రలంభము. కాదంబరి యందలి మహాశ్వేతావృత్తాంతము.

తిరిగి జీవింపక పోయినను శరీరాంతరముతో తిరిగి వచ్చినను కరుణ రసమే యగును కాని విప్రలంభము కాదు.

మహాశ్వేతావృత్తాంతమందు ఆకాశవాణి మహాశ్వేతతో నీ భర్త జీవించునని చెప్పెను. ఆ ఆకాశసరస్వతీభాషణము తర్వాతనే ఆమెకు పుండరీకునియందు సంగమప్రత్యాశ కల్గినది. అపుడు రతి మరల ఉద్బుద్ధమైనది కావున అప్పటి నుండియు విప్రలంభశృంగారము అంతవరకును కరుణమే అని సాహిత్యదర్పణ కారుని యాశయము.

కరుణము - కరుణవిప్రలంభము

ఈ కరుణవిప్రలంభము శృంగారమునందలి భేదము. ఇందలి కరుణపదము సంశయమున కాస్పద మగుచున్నది. విప్రలంభము నందు స్థాయిభావము రతి యగును. కరుణమందు దనదో శోకము స్థాయిభావ మగును. ఈస్థాయిభావ నిర్ణయము దేనిని బట్టి ? యని ప్రశ్నించినచో దీనికి సమాధానము భరతుడే యిట్లు పేర్కొనెను.

'కరుణస్తు శాపక్లేశవినిపతితేష్టజనవిభవనాశవధ బంధసముత్థో నిర పేక్షభావః - ఔత్సుక్యచిన్తాసముత్థః సాపేక్షభావః విప్రలంభకృతః"

కరుణము శాపముచేత, క్లేశముచేత, వినిపాతముచేతను, ఇష్టజననాశము చేతను, విభవనాశముచేతను వధబంధములచేతను సముద్భవించునదై నిరపేక్షభావ ముతో కూడినది. విప్రలంభము ఔత్సుక్యచింతాసముత్థము సాపేక్షభావము కల్గినది.

జగన్నాథుడు కరుణవిప్రలంభము అను విభాగము నంగీకరింపడు. నాయికా నాయకులలో అన్యతర మృతత్వజ్ఞానమున్నచో నది కరుణమే యనియు, అట్లుగాక ప్రకారాంతరముచే పునస్సంగమజ్ఞాన మున్నచో నది ప్రవాసాదులవలె విప్రలంభమే యగుననియు, కొందరి మతమున కరుణవిప్రలంభము ప్రత్యేకరసముగ యు వచించెను.

ర. గ. I PP 142-43 (chow)

హాస్యము

ఇది హాస స్థాయిభావాత్మకము. దీని వర్ణము శ్వేతము ప్రమథాధిదైవతము. కావ్యాలంకారసంగ్రహకర్త భట్టుమూర్తి దీనికి గణనాథు దధిదైవత మని నుడివెను. వికృతాకారము, వికృతవేషము, వికృతాలంకారము, ధార్ష్ట్యము, లౌల్యము, కుహకము, అసత్ప్రలాపము, వ్యంగదర్శనము (వికలాంగదర్శనము) దోషోదాహరణము, సంకల్పము, నృత్యాదులు విభావములు. ఓష్ఠస్పందనము, నాసాస్పందనము, కపోలస్పందనము, దృష్టివికాసనిమీలనములు, ఆకుంచనము, స్వేదము, ఆస్యరాగము, పార్శ్వగ్రహణము మున్నగునవి యనుభావములు. అవహిత్థ ఆలస్యము, మోహము, స్వప్నము, ప్రబోధము, అసూయ మున్నగు నవి వ్యభిచారి భావములు. మున్ముందు హాస్యమునకు ద్వైవిధ్యము చెప్పబడుచున్నది. ఈ భేదములందు విభావాదివర్గము యథార్హము సంయోజనీయము.

ఆత్మస్థము - పరస్థము

ఈ హాస్యము ద్వివిధము. 1 ఆత్మస్థము 2 పరస్థము. విభావదర్శనముచే ద్రష్టకు కల్గిన హాస్యము ఆత్మస్థము. నవ్వుచున్న యొకనిని చూచి విభావదర్శనము లేకున్నను మరొకనికి కలిగిన హాస్యము పరస్థము. ఈ ఆత్మస్థ పరస్థ భేదము హాస్యమునకే విలక్షణమైనది. ఇది ఇతరరసముల విషయమున కన్పట్టదు. దీనికేపరిమితము ఇట్లగుట కొక మూలసూత్రమున్నది. ఇది హాస్యము. ఇతరరసముల వంటిది కాదు. ఇది సంక్రమణ స్వభావము కల్గినది. పుల్లని దానిమ్మ పండు మున్నగు వానిని ఇతరులు తినునపుడు వారలకే గాక చూచువారలకు కూడ నోరూరును. ఇది దాని యందలి సంక్రమణ శీలము. ఇట్లే హాసమును సంక్రమణస్వభావము కల్గినది. కావుననే యీ ఆత్మస్థ పరస్థభేదము.

హాస్య మూరు విధములు

ఈ హాస్యము ఉత్తమ, మధ్యమ, అధములను దృష్టియందిడుకొని షడ్విధమని ప్రపంచింప బడినది. ఉత్తములకు స్మితహసితములు మధ్యములకు విహసిత అవహసితములు. అధములకు అపహసితఅతిహసితములు కల్గును. అనుభావభేదముచే నీ షడ్విధమగు హాస్యము విభజింపదగును. ఉత్తములందు ఆత్మస్థమగు హాస్యము స్మితము. ఉత్తముల పరస్థమగు హాస్యము హసితము. ఇట్లే మధ్యముల ఆత్మస్థపరస్థములు విహసితావహసితములు. అధముల ఆత్మస్థపరస్థములు అపహసితాతిహసితములు.

స్మితము : ఇది ఉత్తములకు కల్గు ఆత్మస్థము.

ఈషద్వికసితైర్గండైః కటాక్షైః సౌష్ఠవాన్వితైః।
అలక్షితద్విజం ధీర ముత్తమానాం స్మితం భవేత్॥

కపోలములు కొంచెముగా వికసింపజేయుచు కన్నులు స్వల్పముగ పెద్దవి చేయుచు, దంతములు కన్పింపకుండ నవ్విన అది స్మిత మనబడును. దీనిని మధుర స్మిత మని యొకరు వచించిరి.

హసితము:

ఇది ఉత్తములకు పరస్థమైన హాస్యభేదము. సంక్రమణశీలము.

ఉత్ఫుల్లాననేత్రం తు గండైర్వికసితైరథ।
కించి ల్లక్షితదంతం చ హసితం త ద్విధీయతే

ముఖము, కనులు, కపోలములు వికసింపజేయుచు కొద్దిగా దంతములు కన్పడునట్లు నవ్విన అది హసిత మనబడును.

విహసితము :

ఇది మధ్యముల ఆత్మస్థమగు హాస్యము.

ఆకుంచితాక్షిగండం య త్సస్వనం మధురం తథా।
కాలాగతం సాస్యరాగం తద్వై విహసితం భవేత్॥

కనులు కపోలములు కుంచింపజేసి ఆస్యరాగముతో మధురస్వనయుక్తముగా నవ్విన నది విహసిత మగును.

ఉపహసితము:

దీనినే కొందరు అవహసిత మని పేర్కొనిరి. ఇది మధ్యముల పరస్థ హాస్యము. సంక్రమణ స్వభావము.

ఉత్ఫుల్లనాసికం యత్తు జిహ్మదృష్టినిరీక్షితమ్।
నికుంచితాంగకశిర స్త చ్చోపహసితం భవేత్॥

ముక్కుపుటము లెగురవేయుచు, వక్రదృష్టితో ఓరజూపు చూచుచు శిరస్సు కుంచించి నవ్విన అది ఉపహసిత మగును.

అపహసితము: ఇది అధముల ఆత్మస్థభేదము

అస్థాన హసితం యత్తు సాశ్రునేత్రం తథైవ చ।
ఉత్కంపితాంసకశిర స్తచ్చాపహసితం భవేత్॥

అకాలమున కల్గినదియు (శోకాదిసమయములందు) కనులనీరు వింటియు, ఉత్కంపితమగు భుజములు శిరస్సు కల్గి నవ్విన అది అపహసిత మనబడును.

అతిహసితము: ఇది అధముల పరస్థభేదము. సంక్రమణశీలము.

సంరబ్ధసాశ్రునేత్రం విక్రుష్టస్వర ముద్ధతమ్।
కరోపగూఢపార్శ్వం చ త చ్చాతిహాసితం భవేత్॥

సాశ్రునేత్రములతో, శ్రవణకటువైన స్వరముతో డొక్కలు పట్టుకొని నవ్విన అది అతిహసిత మగును. సామాన్యముగ నీ హాస్యము నీచప్రకృతుల యందే అధికముగ ప్రయోగింపవగును.

ఆలంబనైక ప్రతీతి:

రతి, క్రోధ, ఉత్సాహ, భయ, శోక, విస్మయ, నిర్వేదములకన్నను, ఈహాసమునకు, జుగుప్సకు కూడ కొంత వైశిష్ట్యము గలదు. రత్యాదులలో నన్నచో ఆలంబనప్రతీతి ఆశ్రయప్రతీతి రెండును అవసరము. హాస జుగుప్సలం దుభయప్రతీతి యవసరము లేదు. వీనిలో ఆలంబనప్రతీతి మాత్రమే రసస్ఫోరక మగును.

దుష్యంతుడు రతికి ఆశ్రయ మయినచో శకుంతల ఆ రతికి ఆలంబన మగు చున్నది. దశరథుడు శోకమున కాశ్రయ మయినచో, వనము కేగిన శ్రీరాముడు శోక మునకు ఆలంబన మగుచున్నాడు. కాని ఉత్తరుడు హాసమునకు ఆలంబనమయి ఆశ్రయాంతరాపేక్ష లేకయే హాస్యదీప్తిని కల్గించుచున్నాడు. కనుక హాసజుగుప్స లలో ఆలంబనాశ్రయోభయప్రతీతి కాక ఆలంబనప్రతీతియే పర్యాప్తమని పూర్వ పక్షము చేసి జగన్నాథుడు ఇట్లు సమాధాన మిచ్చినాడు.

"తదాశ్రయస్య ద్రష్టృపురుషవిశేషస్య తత్రతాత్త్వేవ్యత్వాత్ తద నపేక్షేతు - శ్రోతుః స్వీయకాంతాద్యనుసంధానాదేవ రసోద్బోధేబాధకాభావాత్ -[1]

హీనజాతువులు కాశ్రయముగా ఎవరైన లక్షింపవలయును (కల్పింపవలయును) లేదా శ్రోత స్వకాంతావర్ణనపద్యమును వినునపుడు అశ్రయాలంబనైక్యమున్నట్లు ప్రకృతమున తదైక్యము గాని అలంబనైక ప్రతీతి గాని దోషము కాదు.

కరుణాపము

ఇది శోకస్థాయి ప్రభవము. కపోతవర్ణము. అధిదేవత యముడు. ఇష్టనాశము వలనను, అనిష్టప్రాప్తివలనను కరుణరస ముద్భవించును.

"ఇష్టనాశా దనిష్టాప్తేః కరుణాఖ్యో రసో భవేత్"

అని సాహిత్యదర్పణము. ఈ కరుణశబ్దనిర్వచన మిట్లు భావప్రకాశమున చెప్పబడినది.

కరుః క్లేశ ఇతి ఖ్యాతః క్లేశం న సహతే యతః
యస్య ధీ కరుణా సాస్యా త్తన్నిష్ఠః కరుణో భవేత్
పరాశ్రితానాం క్లేశానాం అసహిష్ణుత యోచ్యతే
మనసా యాద్రశో భావః స వై కరుణ ఉచ్యతే[2]

ఇచట ఇష్టనాశ మనగా కేవలమరణమే కానక్కర లేదు. ఇష్టులవార్త యేమాత్రము తెలియకపోవుటచే గాని మరణించి రను ప్రత్యయ మేర్పడుటచే గాని వారి సమాగమము మరల లింప దనెడు భావము వలన కలిగ నిరపేక్షభావము ట్లుగాక సాపేక్షభావ స్నచో కరుణము గాక విప్రలంభభేదమగు కరుణవిప్రలంభ మగును.

---

[1] రసగంగాధరము - ప్రథమాననము పు 136-187 (chowkhamba)

[2] భావప్రకాశము - ద్వితీయాధికారము

శాపము క్లేశము, ఇష్టజన విప్రయోగము, విభవనాశము, వధ, బంధనము విద్రవము, ఉపఘాతము వ్యసనసంయోగము మున్నగునవి విభావములు. వీనిలో విభవనాశాదులు స్వాత్మగతము లయ్యును ఉత్తమప్రకృతులకు శోకమును కల్గింపజాలవు, మధ్యమాధమ ప్రకృతులకు మాత్రమే కల్గింపగాలును. ఆశావిచ్ఛేదము సర్వేంద్రియక్లమము ఇందుండును.

అశ్రుపాతము, పరిదేవనము ముఖశోషణము, వైవర్ణ్యము, స్రస్తగాత్రత నిశ్వాసము, స్మృతిలోపము, మున్నగునవి యనుభావములు. ఇందు స్మృతిలోప పదముచే స్తంభప్రళయములు గ్రహింపవలెను. సాత్త్వికభావములు అనుభావములుగను వ్యభిచారులుగను ప్రయోగింపబడును.

"ఏతే హ్యశ్రుప్రభృతయ, వ్యభిచారిత్వాదినేయత్వ ఉపజీవనా యైవ మధ్యే నిర్దిష్టా ఇత్యవోచామ వక్ష్యామశ్చ" అని అభినవభారతి నుడువుచున్నది. నిర్వేదము గ్లాని, చింత, ఔత్సుక్యము, ఆవేగము, భ్రమము, మోహము, శ్రమము, భయము విషాదము, దైన్యము. వ్యాధి, జడత. ఉన్మాదము, ఆలస్యము, అపస్మారము, త్రాసము, మరణము, స్తంభము వేపథువు, వైవర్ణ్యము. అశ్రువు, స్వరభేదము మున్నగునవి వ్యభిచారిభావములు. ఈ కరుణమున స్వనిష్ఠము, పరనిష్ఠము అని రెండు భేదములను భానుదత్తుడు రసతరంగిణి యందు పేర్కొనెను. తనయొక్క శాప, బంధన, క్లేశ, అనిష్టము లనెడి విభావములచే కల్గినది స్వనిష్ఠము. పరేష్టనాశ, శాప, బంధన, క్లేశాదుల దర్శన, స్మరణము, లనెడి విభావముల వలన కల్గినది పరనిష్ఠము.

భరతుడు కరుణమునందు మూడు భేదముల నుల్లేఖించెను. 1. ధర్మోపఘాతజము 2. అర్థాపచయోద్భవము 3. శోకకృతము. మొదటిది ధర్మహాని వలన నేర్పడినది. రెండవది అర్థహానివలన కల్గినది. మూడవది యిష్టులగు వారి మృత్యువధాదులవలన కల్గినది.

అగ్నిపురాణమునందు చిత్తగ్లానిజన్య మను మరొక భేదము చెప్పబడినది.

రౌద్రము

ఇది క్రోధస్థాయి భావాత్మకము. వర్ణము రక్తవర్ణము. రుద్రు డధిదైవతము. కరుణజనకము రౌద్రము. రాక్షసులు ఉద్ధతమనుష్యులు విశేషముగ రౌద్రకర్మానుగతులు. అన్యాయకారిత్వమే ప్రధానముగ క్రోధవిషయము, అన్యాయకారి యగు

పురుషుని గూర్చి - "వాడి రక్తం త్రాగినా తృప్తి కల్గదు" అనెడి పలుకుబడులు కలవు. మనుష్యులలో కొంతమంది యుద్ధతప్రకృతు లుందురు. వారికి రసచర్వణము సులభము. ఈ రసచర్వణము సర్వసామాన్యమయ్యును అట్టి ప్రకృతులపట్ల సౌలభ్యమును కలియుండును. భీము డట్టి ప్రకృతి కలవాడు. కావుననే అనుచిత మయ్యును రుధిరపాన మొనర్తునని ప్రతిజ్ఞ యొనరించినాడు. తన్నిర్వహణము కొరకై వేణీసంహారమున కవిచే రాక్షసాదిష్టానము కల్పింపబడినది. అట్టి ప్రకృతి కలవారు స్వభావముచే క్రోధనులు. ఈ క్రోధము సంగ్రామహేతుకము. స్వభావముచే క్రోధను లయిన వారికి కూడ ఉద్దీపనాదులు లేనిదే క్రోధ ముద్భూతము కాదు.

ఆలంబన విభావము శత్రువు. వాని వలన కల్గిన యపకారము, అధిక్షేపము. అనృతవచనము, ఉపఘాతము, వాక్పారుష్యము, అభిద్రోహము మాత్సర్యము మున్నగునవి యుద్దీపనవిభావములు. తాడనము, పాటనము, పీడనము, భేదనము ప్రహరణము, రుధిరాకర్షణము మున్నగునవి రౌద్రకర్మలు.

యుద్ధం రాజ్యభ్రంశో మరణం నగరోపరోధనం చైవ
అప్రత్యక్షకృతాని ప్రవేశకైస్సంవిధేయాని

అను నియమముచే నీ రౌద్రకర్మములు ప్రత్యక్షముగ ప్రదర్శింప దగవు. అందుచే వచనమాత్రమున వర్ణింపదగును. అనుభావములు మాత్రము ప్రదర్శన యోగ్యములు. అందుచే వేరుగా అనుభావములను భరతుడు చెప్పినాడు.

రక్తనయనములు, భ్రుకుటీకరణము, దంతపీడనము. ఓష్ఠ పీడనము, గండ స్ఫురణము, హస్తాగ్రవిక్షేపము మున్నగునవి అనుభావములు.

అసమ్మోహము, ఉత్సాహము, ఆవేశము, అమర్షము, చపలత, ఔగ్ర్యము, గర్వము, వేపథువు, రోమాంచము, గద్గదము మున్నగునవి వ్యభిచారులు.

ఈ రౌద్రము సర్వేంద్రియములకు ఔద్ధత్యము కల్గించును విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణి యందు రౌద్రము రెండు విధములని పేర్కొనెను.
1. మాత్సర్యక్రోధము 2. విద్వేష క్రోధము.

రౌద్రమునకు యుద్ధవీరమునకు భేదము :

వీరరస భేదములలో యుద్ధవీర మొందు కలదు. ఇది ఉత్సాహస్థాయికము. ఉద్ధతవృత్తికము. ఈ రసమునకు రౌద్రమునకు విభావములు సమానములు. వ్యభిచారులు నయితము చాలవరకు సమానములే. భేద మొక్కచో కన్పట్టును, దాని సాహిత్యదర్పణ మిట్లు నుడువుచున్నది.

"రక్తాస్యనేత్రతా చాత్ర భేదినీ యుద్ధవీరత ః"

రక్తనేత్రములు. రక్తాస్యము అనునవి రౌద్రమున నుండును. అవి దాని కను భావములు. యుద్ధవీరమున నవి యుండవు. అదియుగాక యుద్ధవీర ముత్సాహస్థాయికము. రౌద్రము క్రోధస్థాయికము. ఈ రెండింటికి నాయకభేదము కలదు. రౌద్రమునకు ధీరోద్ధతుడు నాయకుడు. యుద్ధవీరమునకు ధీరోదాత్తుడు నాయకుడు.

వీ ర ము

ఇది ఉత్సాహస్థాయి భావాత్మకము. ఉత్తమ నాయకము. ఇంద్రదైవత్యము. వర్ణము సువర్ణము. భానుదత్తుడు రసతరంగిణిలో దీనిని సర్వేంద్రియముల ప్రహర్ష స్థితి యని వర్ణించును.

అసమ్మోహము, అధ్యవసాయము, నయము, వినయము, బలము, పరాక్రమము, శక్తి, ప్రతాపము, ప్రభావము, అవిషాదము, ధైర్యశౌర్యాదులు విభావములు.

స్థైర్యము, ధైర్యము శౌర్యము, త్యాగము, వైశారద్యము మున్నగునవి యను భావములు. ధృతి, మతి, గర్వము ఆవేశము, ఔగ్ర్యము, అమర్షము, స్మృతి, రోమాంచము మున్నగునవి వ్యభిచారి భావములు.

భరతుడు దీనియందు మూడు భేదములను పేర్కొనెను. 1. దానవీరము 2. ధర్మవీరము 3. యుద్ధవీరము. ఇది త్రిగుణాశ్రయమై సామాజికులకు ఆనంద మిచ్చును. (వీరరసము P-53) దీనినుండి అద్భుతరసోత్పత్తి యైనదని భరతుడు పేర్కొనెను.

ప్రవృత్తిరూపమైన విశ్వ మంతయు క్రియాసాధనమందు సంలగ్నమై యుండును. తానుద్దేశించిన ఫలము సిద్ధించు వరకును ధీరులు విఘ్నవిహన్యమాను

లయ్యును ప్రారబ్ధార్థములను త్యజింపరు గదా! ఒట్టి అపూర్వకార్యసాధనకు ఉత్సాహము ప్రేరకమైనది. మానవుల స్వభావ భేదము ననుసరించి ఒక్కొక్క క్రియలో ఒక్కొక్కరికి ఉత్సాహ మధికముగా భాసించును. అది విభావాదిపరిపుష్టమై తత్తద్భేద పురస్కృతమైన వీరరసముగ పరిణమించుచున్నది. భరతుడు చెప్పిన వీరత్రయము నకు దయావీరమును కలిపి ధర్మవీరమును విడిచి ధనంజయుడు మూడు వీరభేదము లను ప్రపంచించెను. కాని విద్యానాథుడు మున్నగువారు ధర్మవీరముతో కలిపి వీరములో చాతుర్విధ్యమును ప్రకటించిరి. జగన్నాథుడు వీనికితోడు సత్యవీరము, పాండిత్యవీరము, క్షమావీరము, బలవీరము, అను వానిని చేర్చెను. అచ్యుత రాయలు సాహిత్యసారమున వీరమును మొదట ద్వాదశవిధముగా నొనర్చెను.

> యుద్ధ, దాన, దయా, ధర్మ, సత్య, విద్యా, తపో, బలైః
> త్యాగ, యోగ, క్షమా, జ్ఞానైః తదుపాధే ర్ద్విభేదతః

అతడే మరికొన్ని భేదములను చేర్చి ఇరువది ఒక్కటిగ తరువాత పెంచెను. (వీరరసము - P-66)

1. యుద్ధవీరము	2. దానవీరము	3. దయావీరము
4. ధర్మవీరము	5. సత్యవీరము	6. విద్యావీరము
7. తపోవీరము	8. బలవీరము (యత్న)	(పాండిత్య)
9. త్యాగవీరము	10. యోగవీరము	11. క్షమావీరము
12. జ్ఞానవీరము	13. సంపద్వీరము	14. రూపవీరము
15. కళావీరము	16. గానవీరము	17. అహింసావీరము
18. ఐశ్వర్యవీరము	19, కవిత్వవీరము	20. శ్రద్ధావీరము
21. శక్తివీరము.		

ఈ వీరము ధర్మప్రధాన మైనది. ధర్మనిష్ఠమైన ఉత్సాహభావమే వేరువేరు రూపములు చెంది వివిధభేదములు గల వీరరసముగ పరిణమించుచున్నది.

భయానకము

ఇది భయస్థాయిభావాత్మకము. ఈ భయము సాధారణముగ స్త్రీనీచబాలాదు లాలంబనముగ ప్రయోగింపదగును. ఉత్తమ, మధ్యమ, ప్రకృతుల యందు నిషిద్ధము. అట్టి వారల నాలంబనము చేసికొని గురురాజాదులయందు భయమును ప్రదర్శింపదగును. కావున రజస్తమః ప్రకృతు లయిన నీచులం దిది స్వభావజము. ఉత్తమమధ్యమ ప్రకృతులయందు కృతకము. ఇది సత్త్వసముత్థము, ప్రయత్న కృతము, దీనిని మృదుచేష్టితములచే ప్రయోగింపవలెను.

వికృతరవము, పిశాచదర్శనము, శివోలూకాదులదర్శనము, పరకృత త్రాసము, ఉద్వేగము, శూన్యాగారగమనము, అరణ్యగమనము, స్వజనవధ, బంధదర్శన శ్రుతి కథాదులు విభావములు.

కంపించు కర, చరణ, నయనహృదయములు, చాపల్యము, పులకలు, ముఖవైవర్ణ్యము, స్వరభేదము, శుష్కోష్ఠత మున్నగునవి యనుభావములు.

స్తంభము, స్వేదము, గద్గదము, రోమాంచము, వేపథువు స్వరభేదము వైవర్ణ్యము, శంక, మోహము, ఆవేశము, చపలత, జడత, త్రాసము, అపస్మారము మరణము మున్నగునవి వ్యభిచారిభావములు.

భానుదత్తుడు రసతరంగిణియందు ఈ భయానకమునకు స్వనిష్ఠము, పరనిష్ఠము అని ద్వైవిధ్యము నుగ్గడించినాడు. ఇది సర్వేంద్రియ విక్షోభాత్మక మైనదని యాతని యాశయము.

భరతుడు ఇందు మూడు భేదములను తెలిపెను. 1. వ్యాజజన్యము 2. అపరాధజము 3. విత్రాసితజము. ఆయా విషయభేదమును బట్టి భయానకాలంబనములు అనేకములని భర్తృహరి సుభాషితము తెలుపుచున్నది. [1]

---

[1] భోగే రాగభయం, కులే చ్యుతిభయం విత్తే నృపాలా ద్భయమ్
మానేదైన్యభయం, బలే రిపుభయం, రూపే జరాయా భయమ్
శాస్త్రే వాదభయం, గుణే ఖలభయం, కాలే కృతాంతా ద్భయమ్
సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం వైరాగ్యమే వాభయమ్.
భర్తృహరి - వైరాగ్యశతకమ్.

బీభత్సము

ఇది జుగుప్సాస్థాయిభావాత్మకము. సర్వేంద్రియముల సంకోచ మిందుం డును. నీలవర్ణము. మహాకాలు డధిదేవత. చంద్రు డని నరసభూపాలీయము. అహృద్యము, అప్రియము, అచోష్యము, అనిష్టము నగు వస్తువుల శ్రవణ, దర్శన, కీర్తనము లనెడి విభావములచే కల్గును.

సర్వాంగసంహారము, ముఖవికూణనము, నిష్ఠీవనము, ఉద్వేజనము మున్నగునవి యనుభావములు.

అపస్మారము, ఉద్వేగము, ఆవేగము, మోహము, వ్యాధి, మరణము, మున్నగునవి వ్యభిచారులు.

భరతుడు దీనియందు శుద్ధము, క్షోభణము, ఉద్వేగము అని మూడు భేదములు వివరించెను. దీనినే ధనంజయుడు దశరూపకమున అనుసరించెను. శారదాతనయుడు భావప్రకాశమున శుద్ధభేదమును విడచి కేవలము రెండు భేదములనే వివరించెను. భానుదత్తుడు రసతరంగిణియందు స్వనిష్ఠపరనిష్ఠములని ద్వైవిధ్యమును సూచించెను.

చిన్నకోటపెద్దన కావ్యాలంకారచూడామణి యందు బీభత్సము ద్వివిధమని పేర్కొనెను.

1. జుగుప్సాబీభత్సము. 2 వైరాగ్యబీభత్సము.

అద్భుతము

ఇది విస్మయస్థాయి భావాత్మకము. గంధర్వ డధిదేవత. బ్రహ్మ యని నరసభూపాలీయము, రసతరంగిణి నుడువుచున్నవి. పీతవర్ణము పుష్యరాగ మని నరసభూపాలీయము. సర్వేంద్రియముల తాటస్థ్యము ఇందుండును. దివ్యజనదర్శనము, ఈప్సితమనోరథావాప్తి, ఉపవన దేవకులాదిగమనము, సభావిమానమాయేంద్రజాలసంభావనము, అతిశయార్థయుక్త వాక్యశ్రవణము, శిల్పదర్శనము మున్నగునవి విభావములు. నయన విస్తారము, అనిమేషేక్షణము, స్వేదము, అశ్రువు, రోమాంచము, సాధువాదము, ఆహాకారము, బాహు-వదన-చేలాంగుళి భ్రమణము మున్నగునవి అభినయములు.

స్తంభము, అశ్రువు, స్వేదము, గద్గదము, రోమాంచము, ఆవేగము, సంభ్రమము, జడత, ప్రళయము, మున్నగునవి వ్యభిచారిభావములు.

భరతుడు దీనియందు రెండు భేదములను సూచించెను. 1 దివ్యము 2. ఆనందజము. దివ్యమందు సభావిమానములు అనుభావములు. ఆనందజమందు మనోరథావాప్త్యాదులు అనుభావములు.

భానుదత్తుడు రసతరంగిణియందు ఆత్మనిష్ఠము పరనిష్ఠము అని ద్వైవిధ్యము సూచించెను. నాటకములందు నిర్వహణసంధియందు అద్భుతరసమును ప్రయోగింతురు.

శాంతము

ఇది శమస్థాయి భావాత్మకము. దీని స్థాయిభావమును గూర్చి ఆలంకారికులలో భిన్నాభిప్రాయములు కలవు. నిర్వేదమని కొందరు, తత్త్వజ్ఞానజనిర్వేద మని కొందరు, ఆత్మజ్ఞాన మని కొందరు - ఇట్లు భిన్నాభిప్రాయము లున్నవి. వానిలో ఆత్మజ్ఞాన వాదము అభినవునిచే సిద్ధాంతీకరింపబడినది. దీనినే యిట గ్రహింతము. ఇది ప్రకృతిరసము. దీనివల్ల మిగిలిన రసములు వికృతి రసములు రత్యాదిభావము లన్నియు వికృతులు. శాంతము మాత్రము ప్రకృతి. ప్రకృతి నుండియే వికృతి పుట్టును. కార్యానంతరము మరల ప్రకృతియందే లయమగును.

భావా వికారా రత్యాద్యాః శాంత స్తు ప్రకృతి ర్మతః
వికారః ప్రకృతే ర్జాతః పున స్తత్రైవ లీయతే
స్వంస్వం నిమిత్త మాసాద్య శాంతా ద్భావః ప్రవర్తతే
పున ర్నిమిత్తాపాయే చ శాంత ఏ వోపలీయతే ॥

— నాట్యశాస్త్రము

ఇది మోక్షాధ్యాత్మసముత్థము. తత్త్వజ్ఞానార్థ హేతుసంయుక్తమునై శ్రేయసోపదిష్టమునైనది మరియు బుద్ధీంద్రియ, కర్మేంద్రియ సంరోధాత్మకము, అధ్యాత్మసంస్థిత్యుపేతము. సర్వప్రాణి సుఖహితము లన్నిటికి మించి మోక్షప్రవర్తకము.

తత్త్వజ్ఞానము, వైరాగ్యము, ఆశయశుద్ధి మున్నగునవి విభావములు.

యమ, నియమ, అధ్యాత్మ, ధ్యాన, ధారణ ఉపాసనములు, సర్వభూతదయ మున్నగునవి యనుభావములు.

నిర్వేదము, స్మృతి, ధృతి, సర్వాశ్రమ శౌచము, స్తంభము, రోమాంచము మున్నగునవి వ్యభిచారులు.

శాంతరసమున సుఖదుఃఖభావనము కాని. ద్వేషమాత్సర్యములు గాని లేక సర్వభూతసమత ప్రాధాన్యము వహించును. దీనిని గురించి వివరముగ శాంతరస ప్రకరణమున వివరింపబడినది.

చిన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి యందు శాంతము సర్వోత్తర రుచిమంతమనియు, దీనికి వైరమైత్రులు లేవనియు పేర్కొనెను.

జన్యజనక రసములు:

ఈ రసములలో నాల్గు రసములు మూల రసములని భరతుడు పేర్కొనెను. వానినుండి మరి నాల్గురసములు పుట్టినట్లు ఈ క్రింది శ్లోకము నుడువుచున్నది.

శృంగారాద్ధి భవే ద్ధాస్యో రౌద్రాచ్చ కరుణో రసః
వీరా చ్చైవాద్భు తోత్పత్తి ర్బీభత్సా చ్చ భయానకః

చిన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి యందు ఈ మూలరసములే వేదములనుండి యుద్భవించినవని ఒక నూతనాభిప్రాయమును వెలిబుచ్చెను.

ప్రథమరసము సామభవము, వీరంబు ఋ
గ్వేదసంభవంబు వెలయు రౌద్ర
రస మథర్వనిగమ రచితంబు బీభత్స
మది యజుః ప్రసూత మండ్రు బుధులు.

రసాభాసము

రసముయొక్క ఆభాసమే రసాభాసము. అనగా రసము ఆభాసరూపమున నుండుట ఇందు మొదట ఆభాసముయొక్క స్వరూప స్వభావములను గ్రహింప వలయును. భాస, భాసతే అను ధాతువుపై "అచ్" ప్రత్యయము. ఆఙ్ ఉపసర్గ పూర్వకము ఆభాసము. ఆభాసః (పుం) ఆభాసతే ఆ+భాస+అచ్ "ఉపాధి తుల్యతయా భాసమానే ప్రతిబింబే" అని వాచస్పత్యము.

భాస మనగా ప్రకాశము అని అర్థము. లోకమున "భాసించుట" అనగా కన్పించుట ప్రకాశించుట అను అర్థములందు రూఢియైనది. కాని అది ఆఙ్ అను నుపసర్గతో చేరి యిచట లేనిది ఉన్నట్లు భాసించుట అను నర్థము నిచ్చుచున్నది.

ఏదేనొక కార్యమును చెరచినపుడు రసాభాస మొనరించెననుట లోకమున ప్రచురముగ వినవచ్చుచున్నది. అనగా చేయదగిన కార్యము అశక్తతవలన సరిగ నిర్వహింపలేకపోయె నని అర్థము. కార్యసాధకమగు కారణము సంపూర్ణత్వము నొందక పోవుటయే దీనికి హేతువుగ గన్పట్టుచున్నది. అనుకున్న రీతిలో కార్య ప్రదర్శనము జరుగక పోయినను పై విధముగ ననుట కన్పట్టుచున్నది.

హేత్వాభాసము.

తర్కశాస్త్రమున ఐదు విధములైన హేత్వాభాసలు కలవు. హేతువు కానిది హేతువుగా ఆభాసించుటే హేత్వాభాసము. హేతువు సాధ్యమును సాధించును. ఇది సాధ్యమును సాధింపలేదు. కాని హేతువువలె భాసించును.

ఇట నొక విషయమును పరికింపవలయును హేతువు కానిది హేతువు వలె భాసించునది హేత్వాభాసమని కదా అంటిమి. హేత్వాభాసమందలి ఆభాస స్వభావమునకును, రసాభాసమందలి ఆభాస స్వభావమునకును భేదము కలదు. హేత్వాభాసము హేతువు కాదు కాని రసాభాసము రసస్వరూపమే (ఆనందరూపము)

రసాభాసము భ్రాంతిభిన్నము :

అయథార్థానుభవమే భ్రాంతి. ఇది సంశయ, విపర్యయ, తర్కాత్మకము. జ్ఞానేంద్రియములకు గోచరించినను యథార్థము కానిది భ్రాంతి. ఈ భ్రాంతికి ఉదాహరణముగ, రజ్జు — సర్పభ్రాంతి, రంగ — రజతభ్రాంతి మున్నగు

వానిని చెప్పుదురు. త్రాటిని తాకి సర్పమని భ్రమించుట మొదటిది. రెండవది ముత్యపుచిప్పను చూచి వెండి యనుకొనుట. మొదటిదానిలో స్పర్శనము భ్రాంతికి కారణము. రెండవదానిలో దర్శనము కారణము. కాని ఇవి రెండును అయథార్థములే. ఇట్టి అయథార్థానుభవమే భ్రాంతి. లౌకికదృష్టికి రసాభాసము కూడ భ్రాంతి వంటిదే యనిపించును. యాథార్థ్యము లేని చోట సంభావనము భ్రాంతి ఎట్లగునో రసము లేని చోట తత్సంభావనమే రసాభాస మనిపించును. కాని అది సరికాదు. రసాభాస మట్టి భ్రాంతితో తుల్యము కాదు. రజ్జుసర్పభ్రాంతిలో సర్పము లేకపోయినను సర్ప మను భ్రాంతి కలుగుచున్నది. లేనిసర్పము వలన భ్రాంతి కలుగుచున్నది. రసాభాసమున రసముండియు అనౌచిత్యజుష్ట మగుటచే రసాభాస మగుచున్నది. అదియునుగాక భ్రాంతి యనునది దోషము. రసాభాసము దోషము కాదు. దోషమైనచో "రసభంగ" మనియే వ్యవహరింతురు.

విరోధాభాసము - రసాభాసము

కావ్యశోభా హేతువు లైన అలంకారములలో విరోధాభాస మొకటి. ఇందు మొదట విరోధము కనపడి తదుపరి శ్లేషాదులచే పరిహరింపబడి చమత్కారాపాదకమగును. ఈ అలంకారమునందు ఆభాస పదము కలదు. కాని రసాభాసయందలి ఆభాస స్వరూపము, పై పదమునందలి ఆభాసస్వరూపమునకు భిన్నముగా నున్నది. (అ) విరోధాభాసాలంకారమునందు మొదట గోచరించిన విరోధము తరువాత శ్లేషాదులచే పరిహరింపబడిననే శోభాహేతు వగుచున్నది. రసాభాసమునం దట్లు లేదు. అనంతర కాలమందు రసము పరిహరింపబడుట లేదు. రసము పరిహరింపబడకయే రసాభాసము ఆనందస్వరూపమగుచున్నది. (ఆ) విరోధాభాసము విరోధము పరిహరింప బడక పూర్వము దోషము పరిహరింపబడిన తర్వాత అలంకారము. రసాభాసమున పరిహరించుట అనునదియే లేదు కావున తత్ప్రశంసయే లేదు.

భరతుడు రసాభాసమునుగూర్చి వచింపలేదు తరువాతి ఆలంకారికులలో ఈరసాభాసమును గూర్చి మొదట చెప్పినవాడు రుద్రటుడు. ఇతడు తన కావ్యాలంకారమునందు శృంగారాభాసమును గూర్చి వచించెను. ఇది ఇతరాభాసములకు ఉపలక్షకము కాగలదు. అతడు కావ్యాలంకారము చతుర్దశాధ్యాయమున

"శృంగారాభాస స్తతు యత్ర విరక్తేఽపి జాయతే రక్తః।
ఏకస్మి న్నపరో ఽసౌ నాభాష్యేషు ప్రయోక్తవ్యః॥"

అని తెలిపియున్నాడు. స్త్రీపురుషులలో నొకరు విరక్తులై మరొకరికి వారిపై అనురాగము కల్గినచో అది శృంగారాభాసమగును అన్యోన్యానురక్తులైన నాయికానాయకులు ఒకరి కొకరు విభావస్థాయ మగుదురు. వారి యనుభావ ప్రకటనముచే సహృదయుని లోని స్థాయి ఉత్థితమగును. అట్టిస్థాయి ఉత్థితమగుటకు నాయికానాయకు లిరువురియందును అనురాగము వ్యక్తము కావలయును. అట్టి అనురాగము ఒకరియందే వ్యక్తమై మరొకరియందు తద్వ్యతిరిక్తత గోచరించినచో అది రసాభాస మగును. అది అనురాగవిషయ మగుటచే శృంగారరసాభాస మగును. ఈ శృంగారాభాసను ఉదాత్తులైన నాయికానాయకులయందు ప్రయోగింపదగదు. ఉపనాయక, ప్రతినాయకులయందు ప్రయోగింపదగును. ఉదాత్తులయందు ప్రయోగించినచో ఔచిత్యము, ఉదాత్తత, నశించును. ఆస్వాదయోగ్యము కాదు. అందుచే వారిపట్ల శృంగారాభానమును రుద్రటుడు నిషేధించినాడు.

ఉద్భటుడు కావ్యాలంకారసారసంగ్రహమున రసభావముల యనౌచిత్యమును గూర్చి పేర్కొనెను. రసాభాసమని పేర్కొనలేదు. అతడు "ఊర్జస్వి" అలంకారమును తెల్పుచు నిట్లనినాడు.

"అనౌచిత్యప్రవృత్తానాం కామక్రోధాదికారణాత్।
భావానాం చ రసానాం చ బంధ ఊర్జస్వి కథ్యతే॥"

కామక్రోధాదుల వలన కలిగి అనౌచిత్యముగ వర్తిల్లిన రసభావముల బంధమే ఊర్జస్వి యనబడును. ఇట అనౌచిత్యస్ఫూర్తిని మాత్రమే సూచించినాడు ఉద్భటుడు. దీనితోపాటు ఆభాసపదముతో ప్రయోగించిన మొదటి ఆలంకారికుడు ఆనందవర్ధనుడు. రుద్రటుడు శృంగారాభాసమును ప్రయోగించెను కాని అది కేవలము శృంగారమునకే పరిమితము. సర్వరససామాన్యము కాదు.

ఆనందవర్ధనుడు రసభావముల రెండింటి యాభాసమును ప్రస్తావించుటయే గాక వానికి కారణమును కూడ పేర్కొనినాడు.

"రసభావ తదాభాస భావశాంత్యాది రక్రమః।
ధ్వనే రాత్మాంగిభావేన భాసమానో వ్యవస్థితః॥
అనౌచిత్యా దృతే నాన్యత్ రసభంగస్య కారణమ్।
ప్రసిద్ధౌచిత్యబంధ స్తు రస స్యోపనిష త్పరా॥"

అంగాగిభావములను అలక్ష్యసంలక్ష్యక్రమములను దృష్టియం దుంచుకొనియే యానందవర్ధనుడు రసాభాసభావాభాసలను పేర్కొనినట్లు కన్పట్టును. అతని ధ్వని ప్రస్థానమున కంతమాత్రమే పరిమితము. కాని దానిని గూర్చిన విపులచర్చ యసంగతము. ఏమైనను రసాభాసమునకు, రసభంగమునకు అనౌచిత్యమే కారణ మని పేర్కొనెను.

లోచనకారు డగు అభినవగుప్తుడును నిట్లు వివరించినాడు.

"ఔచిత్యేన ప్రవృత్తే చిత్తవృత్తే రాస్వాద్యత్వే స్థాయిన్యా రసః, వ్యభిచారిణ్యా భావః అనౌచిత్యేన తదాభాసః"

ఔచిత్యసహితమైన స్థాయిరూప చిత్తవృత్తి యాస్వాద్యమై రస మగును. వ్యభిచారిరూప చిత్తవృత్తి యాస్వాద్యమై భావ మగును. ఇదియే అనౌచిత్యప్రవృత్త(సహిత) మైనచో క్రమముగ రసాభాసము, భావాభాసము అనబడును. అనగా అనౌచిత్యజుష్ట మగు స్థాయిరూప చిత్తవృత్తి యాస్వాద్యమగుచో రసాభాసమును అనౌచిత్య యుతమగు వ్యభిచారిరూప చిత్తవృత్తి యాస్వాద్య మగుచో భావాభాసము నగును. కావ్యప్రకాశకారు డగు మమ్మటభట్టు "తదాభాసా అనౌచిత్యప్రవర్తితాః" అని అభినవగుప్తునే యనుసరించెను.

విద్యానాథుడు ప్రతాపరుద్రీయమున "శృంగార, వీరాద్భుతములకు లోకోత్తర నాయకాశ్రయత్వము వలన పరిపోషాతిశయము కల్గును కావుననే శృంగారము మ్లేచ్ఛాదివిషయమైనచో అభాసమగును" అని చెప్పి వృద్ధసమ్మతి నుదాహరించుచు నీశ్లోకమువ్రాసెను. ఇది శృంగారతిలకము లోనిది. ఇది ప్రచురముగా దక్షిణదేశస్థులు వ్రాసిన గ్రంథములందే కానవచ్చుచున్నది.

"పక్షత్రై(?) వానురాగ శ్చేత్ తిర్యఙ్మ్లేచ్ఛగతోఽపి వా।
యోషితో బహుసక్తి శ్చేత్ రసాభాస స్త్రిధా మతః॥"

ఇది కేవలము శృంగారరసవిషయకము. నాయికానాయకులలో ఒకరికే మరియొకరి పై అనురాగ ముండుట, మరొకరికి లేకుండుట, తిర్యక్కులయందు మ్లేచ్ఛులయందు అనురాగపోషణము, స్త్రీలకు బహునాయకులపై ఆసక్తి అని రసాభాసము మువ్విధములు.

ఏకత్రైవానురాగశ్చేత్ :

నాయికానాయకులలో నొకరికే అనురాగ ముండి మరొకరికి లేకుండుట. వరూధినీప్రవరులలో వరూధినికే ప్రవరునిపై యనురాగ మున్నది. కాని ప్రవరునికి వరూధినిపై అనురాగము లేదు. కావున నిట రసాభాసము. ఆంధ్రధ్వన్యాలోకమున శ్రీమాన్ వేదాల తిరువేంగళాచార్యులు గారు వరూధినీ గతమగు అనురాగము శృంగారమే కాని యాభాసము కాదని నుడివియున్నారు. వరూధిని గంధర్వుని దృష్టియందుకొని వారట్లు నుడివియున్నారు. నిజమునకు శర్ధంథము న తత్కృతయందు గంధర్వుడు నాయకుడు కాదగును. కాని యాతడు రెండాశ్వాసములు పూర్తి అయి మూడవఆశ్వాసము ప్రారంభ మయిన తదుపరి కాని పాఠకులకు గోచరము కాడు. అంతవరకు జరిగిన సన్నివేశ మంతయు కేవలము వరూధినీప్రవరులను సంబంధించిన ప్రణయమే. ఈప్రణయమును రసాభాస మందుమా? లేక రసమందుమా? అనునది ప్రశ్నము. వీరి ప్రణయము ప్రధానము కాకపోవచ్చును. ఆనుషంగికమే యనవచ్చును. ఇది మరొక సన్నివేశమునకు అంగమే యగును. అపుడైనను ఇది రసమో రసాభాసమో పరిశీలింపవలెను.

ప్రవరుని రూపసౌందర్యాదులు వరూధినికి అభిలాషోద్దీపకము లైనవి. పెద్దన ఇచ్చట ప్రవరుని రూపాదికము లేశమాత్రము ప్రపంచింపలేదు. పైదు మిక్కిలి వరూధిని వేషమును, లోహాయలును, తల్లావణ్యమును స్పృహణీయములుగా వర్ణించె. అయ్యును ఆవిషయము లేవియు ప్రవరు యభిలాష నుద్దీపింప జాలక పోయినవి. ఆమె అనుభావపరంపరయు వాబోనె పుణ్యమును నయితము ప్రవరుని ధర్మము ముందు తునాపనక లైనవి.

ఈఘట్టమున ప్రవరుని అనురాగ ముద్భవించకుండుట, వరూధినిలోని కట్టలు త్రెంచుకొని ప్రవహించుట కాననగును. ఏకత్ర ప్రవరునిలో అనురాగమే శూన్యముగా వర్ణింపబడినది కావున ఇది రసాభాసమే యనదగు ర భాసమో

దోషము కాని ఈపట్టను సహృదయరంజకమే కానోపును) మరియు మూడవ అభ్యాసమును చేసిన తర్వాత కాలప్రవరుడు నాయకుడు కాదను భావము ఏపాఠకునకు స్ఫురింపదు. స్ఫురించిన తరువాత నీసన్నివేశమును నెమరు వేసికొని అపుడు ఆనందమునుగాని తదాభాసమును గాని పొందుచున్నాడా? అను వితర్కము సహృదయరంజకము గాదు. ఆ సన్నివేశము నందైనను తత్సన్నివేశాంతమున నైనను అనౌచిత్యము స్ఫురింపదగును.

ఇట్లే ద్రౌపదీ కీచకుల సన్నివేశము. ద్రౌపదికి కీచకునిపై జుగుప్స. కీచకునకు ద్రౌపదిపై రతి, మోహము. ఇట గూడ పరస్పరానురాగము లేదు. కావున ఇదియు రసాభాస మైనది.

పై కారిక యందు చెప్పబడిన ఏకత్రానురాగమునకును, అనౌచిత్యమునకును వ్యాఖ్యానరూపముగ సాహిత్య దర్పణమున విశ్వనాథుడు శృంగారాభాసము నిట్లు నిర్దిష్టించినాడు.

"అనౌచిత్య ప్రవృత్తత్వే ఆభాసో రసభావయోః" అనౌచిత్యం చాత్ర రసానాం భరతాది ప్రణీత లక్షణానాం సామగ్రీరహితత్వే ఏకదేశయోగిత్వోపలక్షణ పరం - బోధ్యమ్" "రసభావములు అనౌచిత్య ప్రవృత్తములైనచో ఆభాసము లగును. అనౌచిత్య మనగా భరతుడు మున్నగు నాలంకారికులచే చెప్పబడిన సామగ్రి లేక ఏకదేశ మందుండుట. అనగా ఒకరియందే అనురాగ ముండుట - దీనినాత డిట్లు ప్రపంచించెను

"ఉపనాయకసంస్థాయాం మునిగురుపత్నీ గతాయాం చ
బహునాయకవిషయాయాం రతౌ తథానుభయనిష్ఠాయామ్
ప్రతినాయక నిష్ఠత్వే తద్వ దధమపాత్ర తిర్యగాదిగతే
శృంగారేఽ నౌచిత్యమ్"

1. ఉపనాయకవిషయమగు రతియు 2. మునిపత్ని గురుపత్ని యందున్న రతియు, 3. బహునాయకులయందు గల రతియు 4. ఒకరి యందే ఉన్న రతియు 5. ప్రతినాయకనిష్ఠమైన రతియు 6. తిర్యగాది గతమైన రతియు శృంగారమున అనౌచిత్యజుష్టము. వీని వలన శృంగారము ఆభాసమగును,

పీఠిలో అనౌచిత్యపదము వ్యాఖ్యానింప బడినది. అనౌచిత్యమునకు గాణో పలము సహృదయుల హృదయమే. సహృదయుల యాస్వాదనమునందు ఏ విష యము అనుచితముగా భాసించునో అది అనౌచిత్యజుష్ట మగును. ఇట్లు భాసించుటకు కారణమును గూర్చి జగన్నాథుడు విస్తృతముగా చర్చించెను. ఔచిత్యవిచారచర్చ యందు క్షేమేంద్రుడు ఔచిత్యనిర్వచన మిట్లిచ్చెను.

"ఉచితం ప్రాహు రాచార్యాః సదృశం కిల యస్య తత్
ఉచితస్య చ యో భావః త దౌచిత్యం ప్రచక్షతే"

య త్కిల య స్యానురూపః త దుచిత ముచ్యతే, తస్యభావ మౌచిత్యం కథయన్తి. తదనురూపమును తత్సదృశము నైనది యుచిత మనబడును. ఆ యు చితము యొక్క భావమే యౌచిత్యము

ఈ యౌచిత్యము లోకవ్యవహారము ననుసరించి యుండునని జగన్నాథుడు పేర్కొనెను.

"విధావాదా వనౌచిత్యం పునః లోకానాం వ్యవహారతో విజ్ఞేయమ్, యత్ర తేషా మనుచిత మితి ధీః ఇతికేచిత్ -" మొత్తము మీద ననౌచిత్యమ్ ఆభాసమునకు మూలకందము అని తెలియును.

ఏకత్రానురాగమును గూర్చి యభినవగుప్తుడు ఒక విశిష్టమైన యభిప్రాయము వెలిబుచ్చెను - "అత ః అఖిలా షేఏకతరవిశ్లేషేఽపి శృంగార శబ్దేన తత్ర తత్ర వ్యవహారః తదాభాసతయా మంతవ్యః"

లోచన - P. 187

నాయికానాయకులలో ఒకరికే ముందు అనురాగము కల్గి మరియొకరికి సంకు రింపని సమయమున సంగతము రసాభాస మగునని యాతని తలంపు.

ఈ విషయము సమీచీనముగ కన్పట్టదు. కుమారస్వామి రత్నాపణమందు ఈ అభిప్రాయమును ఖండించెను,

"ఏకత్రైవానురాగశ్చేత్" అనుచో "ఏకత్ర ఏవ" అని యొక అవధారణార్థ కము ప్రయోగింపబడినది. దానిని ఆధారముగా చేసికొని యాతడు పైయభిప్రాయ మున్ను పేరు చెప్పకయే ఖండించెను,

"అత్ర ఏవేత్యవధారణేన అన్యత్రానురాగాత్యంతా భావ సూచ్యతే యథా రావణే సీతాయా వేన ప్ర సంసయో రేకత్రానురాగే జాతే అన్యత్రానురాగ ప్రాగభావే చ విభావాది సంపూర్తిభావ యా నైవరసాభాసత్వ మితిభావ అన థా ప్రథమ మజాతానురాగే వత్సరాజే జాతానురాగాయా రత్నావళ్యా పూర్వానురాగస్య ఆభాసత్వ ప్రసంగాత్

ఈ కారికయందు ఏవ కారముచే అన్యత్రానురాగము యొక్క అత్యంతా భావము సూచింపబడినది అనగా ఒకయందు అనురాగముండి మరొకరియందు అనురాగము అత్యంతము లేకుండుట రావణునియందు సీతకు అనురాగము అత్యంతము లేకుండెను కావున ప్రథమమున ఒకరికే అనురాగము కల్గి మరొకరికి అనురాగము ఇంకను కలుగకయుండిన సమయమున విభావాది సంపూర్తి భావనచే రసాభాసత్వము కలుగదు అట్లే యనుచో ప్రథమమున అనురాగము కల్గిన రత్నావళి యనురాగము తరువాత అనురాగము కల్గిన వత్సరాజు నందు రాగమునెడ నాభాసమే యగును అనగా వత్సరాజునందు మొదట రత్నావళికి తరువాత ఆమె యందు వత్సరాజునకు అనురాగము కలుగును కొంతకాలము రత్నావళికి మాత్రమే అనురాగమున్నది కాని వత్సరాజునకు లేదు అట్టి సమయమున వారి యనురాగమును రసాభాస మనరాదు అది ప్రాగభావమే కాని అనురాగాత్యంతా భావము కాదు కావున అది రసమే కాని రసాభాసము కాదు

తిర్యఙ్ మ్లేచ్ఛగతో౽పి వా

రతి తిర్యగ్గతమైనను అనాగరక గతమైనను శృంగారాభాస మగును అనగా రతికి పశుపక్ష్యాదులు కాని అనాగరులు కాని ఆలంబనమగుచో అది శృంగారాభాస మగును కేవలము తిర్యగ్గతము మ్లేచ్ఛగతము నైనంత మాత్రమున ఆభాస మనుట కుదురదని విట్టనాథుని క్రౌంచదర్శనముచే వాల్మీకి కల్గినదియు నాభాసమే కాదగును తిక్కన భారతమునందలి కపోతోపాఖ్యానము విరాటమునందలి పక్షివర్ణనములును ఆభాసప్రసంగముచే కాదగును అట్టిభావము సహృదయుల కెవరికిని కలుగుట లేదు రసోదయమె యగుచున్నది మరి ఇట్లనుటకు కారణ మేమి దీనియందొక రహస్య మున్నది దాని పరికించుటకు ముందు తిర్యగ్గత మైనను మ్లేచ్ఛగతమైనను రసమే కాని రసాభాసము కాదను ఏకావలీకారుడైన విద్యాధరుని మతము నెంచుక పర్యాలోచింతము అతని వాదమును రసార్ణవసుధాకర కర్త పేర్కొని ఖండించినాడు

కొందరు పశుపక్షాదులయెడ రసాభాసమును చెప్పుచున్నారు కాని యది సరిగాదు వానియెడలను విభావాదు లుండుటచే నట్టి యది రసమే యగును కాని ఆభాసము కానేరదు జ్ఞానశూన్యములగు తిర్యక్కులు రసమున కర్హములు కావా లనుట తగదు అట్లయినచో జ్ఞానశూన్యులగు కొందరు మనుష్యుల యెడను రసాభాసము కావల వచ్చును రసమునకు విభావ సంభవము ప్రయోజకము కాని విభావాది జ్ఞానము ప్రయోజకము కాదు అవి విభావాదు లని తెలియ నక్కరలేదు) కావున తిర్యక్కులయందును రసమే కల దనవలయును

(బులుసు వేంకటరమణయ్య గారు)

విద్యార్థుని ఈ యభిప్రాయమును సర్వజ్ఞు డీవిధముగ ఖండించి యున్నాడు

తిర్యక్కుల విభావత్వము సంభవింపదు సముజ్జ్వలమును శుచియు దర్శనీయమును అగు వస్తువే శృంగారరసమునకు విభావ మగునని భరతముని నియమించి యున్నాడు తిర్యక్కులకు నలుగు స్నానము నలంకరణము లేనందున నుజ్జ్వలత శుచిత్వము దర్శనీయతయు సంభవింపకుండుట ప్రసిద్ధమే కదా

పూర్వశాస్త్ర విరుద్ధ మని ఖండించుటయే గాక మరియొక యుపపత్తిని కూడ చూపి విభావాది జ్ఞానమే కావలె నని నిరూపించినాడు

అథ స్వజాతి యోగ్య ధర్మై స్తిరశ్చాం కం ప్రతి విభావత్వ మితి చేత్ తస్యాం కక్ష్యాయాం కరిణీరాగం ప్రతి కారణత్వమేవ న పున ర్విభావత్వమ్ కించ జాతి యోగ్యై ర్ధర్మై ర్వస్తునో న విభావత్వమ్ అపితు భావకచిత్తోల్లాస హేతుభీ రతివిశిష్టై రేవ కించ విభావాది జ్ఞానం నామౌచిత్యవివేక స్తేన శూన్యా స్తిర్యంచో న విభావతాం యాంతి తర్హి విభావాది జ్ఞానరహితేషు మనుష్యేషు రసాభాసప్రసంగ ఇతి చేత్ నైష దోష వివేకరహిత జనోపలక్షణ మ్లేచ్ఛగతస్య రస స్యాభాసత్వే ప్యేష్టావాప్తే

కించ విభావాదిజ్ఞాన" మిత్యేత న్న యుజ్యతే - తథా విభావాదే ర్విశిష్టస్య వస్తుమాత్రస్య వా సంభవో రసం ప్రతి ప్రయోజక విశిష్టప్రయోజకత్వాంగీకారే

యోషితో బహుసక్తిశ్చేత్ :

ఒకే స్త్రీకి పలువురపై ఆసక్తి యున్నచో నాప్రవర్తనము "రసాభాసము" అనబడును. ఇట్లే ఒకపురుషునకు పలువురు స్త్రీలయందు ఆసక్తి యున్నచో నఉతము రసాభాసమే కానోపును. ఇందలి యాథార్థ్య మిది. ఒకస్త్రీకి పలువురు పురుషులపై ఆసక్తి ఎన్నడును నిలువదు. పలువురపై సమానురాగ ముండుట మానవ మాత్రుల కసాధ్యము. అట్టి విశేషము లెచ్చటనేని సాహిత్యమున కన్పట్టినచో అవి క్వాచిత్కములును విశేషమహిమాన్వితవ్యక్తు లాలంబనములుగా కల్గినవియునగు స్థలములే యగును. ద్రౌపది విషయ మట్టిదే కాదగును. ఇట్లే పురుషులకు అనేకస్త్రీలతోడి సంబంధమున్న శ్రీకృష్ణచరిత్రాదులు నయితము నని గ్రహింపవలయును.

"యోషితో బహుసక్తిః" అనునది ప్రధానముగ వేశ్యను దృష్టియం దుంచుకొని వచించిరేమో యనిపించును. వేశ్య పలువురతో సంభోగించు చుండును కాని యామెకు ఏ పురుషుని యందును "రతి" యనదగిన స్థాయిభావ ముండదు. వారి యనుభావములును కేవలము నటనలు మాత్రమే. ప్రేమసూత్రితములు కావు. ప్రేమరహితములైన యనుభావముల ప్రదర్శనము పాఠకునిలోను ప్రేక్షకునిలోను అనౌచిత్యమునే రేకెత్తించును గాని ఆస్వాద్యమానము కాదు. కావున ప్రేమరహితము లయిన అనుభావ ప్రకటనములు "రసాభాస" కారణములు కాజాలును.

వివేకాది ప్రవేశోఽంగీకృత ఇతి అస్మ దనుసరణ మేవ శరణం గతోఽసి "అత్ర వివేకం వినా తదితర విశేషవత్త్వం వైశిష్ట్య" మితి చేన్న.

విశేషాణాం ధర్మిణి పరమోత్కర్షాను సంధానతత్పరాణాం అన్యోన్య సహిష్ణూనాం ఇయత్తయా నియమాసంభవాత్ - అథ యది వస్తుమాత్రస్య - తర్హి! "అన్వాసీన మరుంధత్యా స్వాహయేవ హవిర్భుజమ్"

రఘువంశము

ఇత్యాదా వపి స్త్రీపుంసమాత్ర విభావసద్భావాత్ అన్వానేన లక్షణాభావ సంభవాచ్చ శృంగారః స్వదనీయః ప్రసజ్యేత కించ -

"యోషితో బహుసక్తి' - ఉపలక్షకము" :-

ఇట్లు స్త్రీలకే అనురాగరాహిత్యము కాని పురుషులకు అనేకవనితలతోడి సంబంధమున నట్టిస్థితి యుండదా ? అను ప్రశ్న ఉదయించును. రసాభాసమున అనురాగరాహిత్యము ప్రాధాన్యము వహించును గాన అది యున్నచోటుల నెల్ల రసాభాసమే యగును. పురుషులకును అనురాగరాహిత్య ముండ నవకాశము లేకపోలేదు. అట్టిచో విచట యె షిచ్చద్ది ముపలక్షక మని గ్రహింపవలయును. అనురాగరాహిత్య మున్నపట్టుల పురుషులును రసాభాసపు ఆలంబనము లగుదురు.

వేశ్య నాయిక కాదగునా ? అది రసాభాస మగునా ?

ఈవిషయమున రసార్ణవసుధాకరకర్త ఒకశంకను లేవదీసినాడు. సాహిత్య ప్రపంచమున వేశ్యను నాయికగా నంగీకరింపరా దను నభిప్రాయము ప్రబలితమై యున్నది. అట్లు నాయికాత్వము రసాభాసమగు ననియు నభిప్రాయపడిరి. ముందు దానినిట్లు వివరించుచున్నాడు. "వేశ్యకు గుణవంతుడగు నాయకుని యందుగూడ ననురాగ ముండదు. అట్టి యనురక్తను వర్ణించుట రసాభాసమునకే కారణము అగును. కావున వేశ్యను నాటకాదులందు నాయికగా వర్ణింపరాదని- వారిట్లును చెప్పుదురు:- వేశ్య సామాన్యవనిత ఆమె ప్రధానముగా ద్రవ్యమునే కోరును. ఆమెకు గుణహీనుని యెడ నవిష్ట ముండదు. గుణియెడ విష్టమును లేదు అట్టి వేశ్య యెడ శృంగారాభాసమే కాని శృంగార మెంతమాత్రము నుండదు." అని

(బులుసు వేంకటరమణయ్య గారి ఆంధ్రానువాదము)

వేశ్య యెడ భావానుబంధ రాహిత్యమే ప్రసక్తమగుచో నాయికాత్వమే నశించు నని సింగభూపాలు డిట్లు ఖండించినాడు. "కాని ధీమంతుడగు శ్రీసింగభూపతి యీమతము నంగీకరింపడు. ఏలయన వేశ్యకు భావానుబంధము లేనిచో నాయి-

---

"భార్యాం మోహనసుప్తాం మృతేతి మత్వా ధావితే హాలికే
దరస్ఫుటితఫలోదరాభిః హసిత మివ కార్పాసలతాభిః"

ఇత్యాదిషు స్త్రీపుంస వ్యక్తిమాత్ర విభావస్వాభావ్యే, తదవివేక జనిత హాస్య పంకనిర్మగ్నం శృంగారగంధగజ ముద్ధర్తుం త్వరతాం ఇత్యలం రసాభాసాలాప సంరంభేణ"

కాత్వమే నశించును. ఆమె ప్రకరణాదులయందు నాయికగా వర్ణింపబడి యున్నది కదా! నాయిక కాని దానిని నాయికగా వర్ణించినచో రసాభాసమే యగును. అట్టి వర్ణన వలన ప్రకరణములు రసాశ్రయములు గాకపోవలసి వచ్చును. కాని "నాటకప్రకరణాదులు పదియును రసాశ్రయములే" అని పెద్దలు వచించియున్నారు. కావున సామాన్యస్త్రీలగు వేశ్యలకు గుణవంతుడగు నాయకునియం దనురాగ ముండును. దీనిని రుద్రటుడు సంగీకరించెను. అతడిట్లు చెప్పెను

"నాయకునకు కులస్త్రీలయెడ నీసుండదు పరస్త్రీలయెడ విశ్శంకమగు రతియు నుండదు. వేశ్యలు మన్మథుని సర్వస్వ మగుటవలన వారి యెడల నీసు, సందేహము లేని రతియును కూడ సంభవము లగును."

దీనివలన తేలిన సారాంశ మిది - వేశ్యయు నాయికాస్థానమును పొందదగును అట్టిచో బహుసక్తి కాక ఒకే నాయకునియందు స్థిరానురాగ ముండవలెను. అప్పుడామె జాతిచే వేశ్య యైనను అనురాగ విషయమున సామాన్య యనజాలము. అది రసాభాస ప్రసంగము కాజాలదు.

సింగభూపాలుడు వేశ్యానాయికాత్వమునుగూర్చి చర్చించుచు ఆమె దివ్య యయినచో నాటకమునందు సైతము (ప్రకరణము నందే గాక) నాయికగా నుండ వచ్చునని విక్రమోర్వశీయము నుదాహరించెను.

రసాభాస ప్రయోజకములు.

పైవివరణ ననుసరించి రసాభాసము మూడు విధములని స్పష్టపడినది. అలంకారికులలో కొంతమంది నాల్గువిధము లని చెప్పినవారును కలరు. ఈరెండు పక్షములకు విభాగవిభేదమే కాని విషయవిభేదము లేదు. ఈమూడు విధములగు రసాభాసములకును ప్రయోజకము లేవి ? యనుట విచారణీయాంశము

మొదటి విధానమున ఏకత్రానురాగము రసాభాస మగు నంటిమి. ఒకరియందుండి మరొకరియందు అనురాగము (నాయికా నాయకులలో) లేనప్పుడు ఆనందాంశము కలుషిత మగుచున్న దన్నమాట. ఇట్లు కలుష మగుటకు సాంకేతిక మగు కారణము నిట నూహింపవలెను.

విభావానుభావసంచారులచే పరిపుష్టమైన స్థాయిభావము రసమగు నంటిమి కదా! ఇట ఏది లోపముచే లేక ఏది యనౌచిత్యముచే రసము గాక రసాభాస మేర్పడుచున్నదో తెలియవలెను. అప్పు డది తద్రసాభాస ప్రయోజకమగును.

నాయికానాయకు లిద్దరియందును పరస్పరకాంక్షాపూర్వక మగు రతి యుద్బుద్ధమై అది విభావాదులచే పరిపుష్టమై రస్యమానతావస్థను పొందును. ఇట్టి పరస్పర కాంక్షారూపమగు రతి యుద్బుద్ధమగుటకు నాయికానాయకుల రూపగుణావస్థాదులు పరస్పరప్రీతిదాయకములు స్పృహణీయములు అభిలషణీయములు కావలెను. అనగా ఒకరి రూపగుణావస్థాదులు మరొకరి కాంక్ష సముద్బోధకములు కావలెను. అపుడే కాంక్షారూపమగు రతి స్థాయి ఉద్బుద్ధమగును. అది పరిపుష్టమై రసమగును. అట్లుగాక వారి రూపగుణావస్థాదులు ఒకరికి ప్రీత్యుద్బోధకములు కాజాలకపోయినను కాంక్షాప్రతిబంధకములైనను రతి ఆభాసరూపమగును. అది రత్యాభాస మగును. ఆ రత్యాభాసము విభావాదిపరిపుష్ట మగుచో రసాభాసమగును. ఏకత్రానురాగ మిట్లు స్థాయి ఉద్బోధకత్వమునకు ప్రతిబంధక మేర్పడుటచే స్థాయికాలుష్య మేర్పడి రసాభాస మగుచున్న దనిఫలితాంశము. కావుననే నాయికానాయకులలో ఒకరికి రతీ యుదయించి మరొకరికి ఉచితవిభావాదిక మున్నను ఉద్బుద్ధము కానిచో అది రసాభాస మగుచున్నది.

రెండవ విధానము తిర్యఙ్ మ్లేచ్ఛగత మగుట స్థాయిరూప మగు రతి తిర్యగ్గతమైనను అనాగరికమ్లేచ్ఛగత మైనను రసాభాస మగునని దీని యర్థము కదా! అట్లగుటకు కారణము వారియందు విభావాదిజ్ఞానము పుష్కలముగ లేక అనుభావ ప్రకటనము కొరవడి యుండుట. ఉచితమైన అనుభావప్రకటనము లేక సంభోగాభిలాషను ప్రకటించుట అనౌచిత్య మని ఆనందవర్ధనుడు పేర్కొనియున్నాడు.

ఇట్లు ఉచితభంగివిన్యాసము లేనిదే సామాజికులలో రతి పరిపుష్టమై రసస్థితి కల్గదు. అదియే అనౌచిత్యము కావున రసాభాసహేతు వైనది. ఇట్లు ఉచితానుభావ బాహుళ్యము లేకపోవుట రసాభాసప్రయోజకమైనది. ఇంతియేగాక అనుచితాలంబనోద్దీపనములు కూడ స్థాయి కిట్టి స్థితినే కలిగించును. ఇచట శ్రీవేదాల తిరువేంగళాచార్యులుగారి పంక్తులు పరిశీలనీయములు.

"ఈ యాలంబనోద్దీపనముల యనౌచిత్యము నానావిధముల నుండును. ఒక్కొకెడ నాలంబనములలో ననుచితములై (పరస్పరము) అనౌచిత్యము నాపాదించును. ఒకప్పుడు ఆలంబనములు ఉద్దీపనములును పరస్పరానుచితము లగును. ఒకప్పుడివన్నియు తమలో తా ముచితములు గాకున్నను సామాజికుల ననుసరించియు, వక్తననుసరించియు ప్రకృతివారి ననుసరించియు ననుచితము లగుచుండును. ఇందు

సామాజికుల ననుసరించిన యనౌచిత్యమే పార్వతీపరమేశ్వరుల (కుమారసంభవములోని) కథాప్రసంగమునందు పేర్కొనబడినది. నాగరికతయు, జననీ, సోదర్యాది ధర్మ, నీతినియమములు లేని తిర్యగాదికాతులయందట్టి యనౌచిత్యకారణము లెక్కువగా సంభవించుట కవకాశము కలదు కావున నవి మొదట గ్రహింపబడినవి. అంతే గాని స్థలాంతరమునందు సంభవింపవని, సంభవింపగూడదని కాదు."

ఇందుచే ఈలక్షణమున తిర్యఙ్మ్లేచ్ఛ ఉపలక్షణ మని గ్రహింపవలెను. కావున (1) అనుచితములైన ఉద్దీపనాలంబనవిభావములు కల్గినదియు, (2) ఉచితానుభావబహుళము కానియదియు నగు రతి స్థాయి రసాభాస మగునని యర్థము.

మూడవది "యోషితో బహుసక్తిః" వేశ్యాదులు అనురాగము లేకపోయినను పలువురపై తమ కనురాగమున్నట్లు అనుభావప్రకటన మొనర్తురు. అది కేవలము నటన మాత్రమే. వారిలో అనురాగము శూన్యము. అట్టిచో సహృదయునకు అనుభావాది బాహుళ్యముచేతను, విభావాదిబాహుళ్యము చేతను గూడ ఆనందము కలుగుటలేదు. అట్లు కలుగకుండుటకు కారణము స్థాయిరూప మగు రతి వారియందు లేకపోవుటయే కటకకుండలాదులయందంతటను సువర్ణము వలెను, పూవులలో దారమువలెను, స్థాయి అనుభవము సామాజికుల కుండవలెను. అట్టి యనుభవము లేనపుడు కేవలనిర్వేదాదిభావముల వలన నిర్వేదాదులకు మూలమైన స్థాయి అనుభవము లేకపోవుటమే కారణము. అందుచే నిర్వేదాదుల యమూలకత గోచరమై రసానందము కల్గదు. రసాభాస మగును. అపు డది హాస్యహేతు వగును.

ఇట్లు మూడవస్థలలో రసాభాసము కల్గుచున్నది. (1) స్థాయినిష్పత్తి 2) స్థాయిపరిపోషము. 3) రస్యమానత. ఈ మూడవస్థలకును మూడు ప్రతిబంధకము లేర్పడి రసాభాస మగుచున్నది. అనగా 1) స్థాయినిష్పత్తి ప్రతిబంధక మగుటచే నేకత్రానురాగము రసాభాసప్రయోజకము అయినది. 2) స్థాయిపరిపోష ప్రతిబంధక మగుటచే తిర్యఙ్మ్లేచ్ఛగతమగు రతి రసాభాసప్రయోజక మైనది. 3) రస్యమానతాప్రతిబంధక మగుటచే యోషితమ బహుసక్తి రసాభాసప్రయోజక మైనది.

ఈలక్షణము కేవలము శృంగారసంబంధి యని పలువుర యభిప్రాయము. అయ్యును పైజెప్పిన మూలసూత్రము ననుసరించి ఇది శృంగారసంబంధి యయ్యును ఇతరరసములకు నుపలక్షక మని శ్రీమద్ వేలతిరువేంగళాచార్యుల వారు ధ్వన్యా

లోకమున నుడివియున్నాడు. శృంగారమును ఇతరరసముల కుపలక్షకముగ గ్రహించుట అలంకారశాస్త్రసంప్రదాయ మనియు, అది "శృంగారేణ వీరాదీనా మప్యాభాసతా ఉపలక్షితైవ" అని లోచనకారుని మాటలయందు నైతము వ్యక్త మగుచున్న దనియు వాడు వచించిరి.

ఈ రసాభాస లక్షణము ఎక్కువగా దక్షిణదేశస్థుల రచనలలందే కన్పట్టుచున్నది. అయ్యును శారదాతనయుడు భావప్రకాశము నందును, దాని ననుసరించి దక్షిణదేశస్థుడయ్యును రసార్ణవసుధాకరకర్తయును రసాభాసమును ఇతరరససంయోజనమును దృష్టియందుంచుకొని నిర్వచించి యున్నారు.

అంగేనాంగిరసః స్వేచ్ఛాప్రవృత్తివర్ధితస్య పదా

అమాత్యే నావినీతేన స్వామీ వాభాసతాం వ్రజేత్

ర సు. 21-262

అంగముగా అప్రధానముగా నుండవలసిన రసము స్వేచ్ఛాప్రవృత్తిచే విశృంఖలముగ విస్తృతిచెందినచో నపు డంగిరస మాభాసత నొందును. అవినీతుడైన మంత్రివలన రాజు నయిత మిట్లే యాభాసత నొందును. ఇచ్చట ఆభాసత ఇతర రససంయోజనాపేక్షచే నొసర్చబడినది.

హాస్యభూయిష్ఠ మగు శృంగారము శృంగారాభాస మగును. బీభత్సముతో నిండిన హాస్యము హాస్యాభాస మగును భయానకప్రాయ మగు వీరము వీరాభాస మగును. కరుణ మెక్కువ గల యద్భుత మద్భుతాభాస యగును. శోకభయముల తోడి రౌద్రము రౌద్రాభాస మగును. హాస్యముతో నిండిన కరుణము కరుణాభాస మగును. శృంగారముతోడి బీభత్సము బీభత్సాభాస మగును. రౌద్రవీరము లెక్కువగా గల భయానకము భయానకాభాస మగును. (శ్రీబులుసువేంకట రమణయ్య)

మొత్తముమీద విభావాదుల పరిపోషములో అనౌచిత్యముగాని, ప్రాధాన్యాప్రాధాన్యములలోని అనౌచిత్యముగాని రసాభాసకు కారణమగుచుండుట గమనార్హము

రసవ్యంజక నియమములు

ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకమున అసంలక్ష్యక్రమవ్యంగ్యమును వివరించుచు రసము వ్యంగ్యమగుటకు కొన్ని పోషక పరిస్థితుల నుదాహరించెను వానిని రస

వ్యంజకనియమము లందుప. అట్టివాని నైదింటిని అతడు పేర్కొనెను. అందు మొదటిది

"విభావ భావానుభావ సంచార్యౌచిత్య చారుణః
విధిః కథాశరీరస్య వృత్తస్యోత్ప్రేక్షితస్య వా"

కథాశరీరమగు నితివృత్తము ప్రసిద్ధమైనను కల్పితమైనను కావచ్చును. కాని దాని కనుగుణమగు నుచితమగు విభావములను, భావములను, అనుభావములను, సంచారులను కూర్పవలెను. అనగా 1) విభావౌచిత్యము 2) భావౌచిత్యము 3) అనుభావౌచిత్యము 4) సంచార్యౌచిత్యము అనునవి యుండవలెను.

విభావౌచిత్యము :-

కథాశరీరము అంతటను రసోద్బోధకము కావలెను రసోద్బోధకము కావలె నన్నచో విభావాద్యౌచిత్య పరిపుష్టమై యుండవలెను. కథ ప్రసిద్ధమై విభావాదిపరిపుష్ట మగునేని సరియే లేనిచో కవి ఆ కథయందలి యనౌచిత్యము తొలగించుట ఔచిత్యమును కల్పించుట మున్నగువానిచే విభావాద్యౌచిత్యమును సంపాదింపవలెను. కల్పితగాథ యయినను తద్రసానుగుణవిభావములనే సంతరింపవలెను. నాయికానాయకపరిగ్రహణముకూడ తదనుగుణముగనే యుండవలయును. శృంగార ప్రధానమగు కథను శ్రీకృష్ణాదులను, రౌద్రప్రధాన మగు కథను భీమాదులను గ్రహించుట యుక్తము రసానుగుణమైన ఆలంబన విభావౌచిత్య మిట్లేర్పరుపవలెను. ఉద్దీపనాదులు నిట్లే మెఱుంగునది. శృంగారమునకు ఉద్యానవిహార, పుష్పాపచయ, జలక్రీడాదులు; వీరరౌద్రాదులకు మంత్ర, ద్యూత, ప్రయాణాదులు వర్ణనీయములు.

భావౌచిత్యము -

ఇచట భావ మనగా స్థాయిభావమును గ్రహింపవలెను. వివిధములగు స్థాయి భావము లున్నవి వీనిని ఔచితీసంయుక్తములుగ వర్ణింపవలెను. ఇచట ఆనంద వర్ధనుడు భావౌచిత్యము అనగా స్థాయ్యౌచిత్య మని నుడువుటయే గాక అందు ముఖ్యముగ ప్రకృత్యౌచిత్యమే భావౌచిత్యమని నుడివి యున్నాడు. ప్రకృతి ఉత్తమ మధ్యమాధమము లని మూడు తెఱగులు మాత్రమే కాదు. దివ్యమనియు, మానుష మనియు కూడ భేదపరిగణన మావశ్యకము. ఆయాప్రకృతుల కుచితమగు స్థాయి భావమును వర్ణింపవలయును, ఇట్లు గాక వ్యతిరేకముగ వివర్ణించుటచే ఔచిత్య

నాశ మొదవ రసభంగ మగును. అనగా మానుషప్రకృతి గల నాయకుని యుత్సాహాదులను వర్ణించునపుడు సప్తార్ణవలంఘనాదులను వర్ణింపరాదు. అట్లు వర్ణించుటచే వినేయులకు ప్రతీతిఖండన మేర్పడును. అది అసంభావ్య మగును. అనృత మను భావ మేర్పడును. అపుడు ఆనందచర్వణము భగ్నమగును. అంతియగాక చతుర్వర్గోపాయమగు నుపదేశమునకు కూడ అళీకత్వము సహృదయుల మానసమున గోచరించును. కావున మానుషప్రకృతుల విషయమున దివ్యోచితవ్యాపారము కల్పింపరాదు. దివ్యుల విషయమున మానుషమాత్రవ్యాపారము కొఱగాదు. ఈ విభేదమును చక్కగా నెఱింగిన కవియే ఔచితీసంపాదకు డగును.

కొందఱు నాయకులు దివ్యప్రకృతిని, మానుషప్రకృతిని గూడ కల్గియుందురు వారిని దివ్యమానుషప్రకృతు లందుము. పాండవులు మున్నగువా రట్టివారే. వారి విషయమున ఉభయవిధమగు నౌచిత్యము యోచింతురు. మరియు చరిత్రప్రసిద్ధులగు పురుషుల విషయమున నాచరిత్రవిరుద్ధము కానట్లు వర్ణింపదగును. శాతవాహనుడు మున్నగు వారు కేవలమానుషప్రకృతులయ్యును నాగలోకగమనాదులు వర్ణించుట అనౌచిత్యము కానేరదు బృహత్కథలో అట్లు వర్ణింపబడుటయే దీనికి కారణము. దీనికి వ్యతిరిక్తముగ వర్ణింపబడినచో నది యనౌచిత్యదుష్ట మగును కావున మొత్తముపై నిందలి పరమార్థము ఈఅనౌచిత్యమే రసభంగహేతువు.

అనౌచిత్యా దృతే నాన్య ద్రసభంగస్యకారణమ్
ప్రసిద్ధౌచిత్యబంధస్తు రస స్యోపనిష త్పరా

ప్రసిద్ధమైన యౌచిత్యనిబంధనము రసోపనిషత్తగును. కావుననే నాటకమునందు ప్రబంధమునందును ప్రఖ్యాతుడును ఉదాత్తుడు నగు నాయకుని స్వీకరింపవలయునని భరతుని యాదేశము. ప్రఖ్యాతనాయకుడగుచో కవి మఱల కష్టపడవక్కర లేకుండ ఇతిహాసప్రసిద్ధిచే సామాజికులకు రసప్రతీతి కలిగింపగలడు. కవి భ్రమప్రమాదములకు గురికాడు.

తిక్కన యీ విషయమును గూర్చి యిట్లు వివరించినాడు :-

కథ జగత్ప్రసిద్ధ గావునం బూర్వప
ర్యాయర్థయుక్తి చేయునట్టి యెడల

యత్న మించు కంత యయినను వలవదు
వలసి నట్లు చెప్ప వచ్చి యుండు.

- విరాటపర్వము 1-42.

భారతము నందలి పూర్వాపర పర్వములలో కర్తృభేదమును బట్టి కథాభేద మేర్పడునేమో! తిక్కన నన్నయమార్గముననే పయనింపజాలడేమో అను సంశయము కలుగ నవసరములేదని కథయొక్క జగత్ప్రసిద్ధిని తత్కారణముగా చూపినాడు. జగత్ప్రసిద్ధ మయిన కారణముగా తద్గుణగణాదులును లోకసిద్ధములు అనుభవవిషయము లయియుండును. కావున కవి తదనుసారముగనే కవితారచనము చేయగలదనియు వైవిధ్యస్థితి కవకాశము లేదనియు తెలియజేసినాడు అనగా ప్రసిద్ధకథావిషయమున కవికి గల స్వేచ్ఛ అత్యల్పమని కవి లోకానుసారి కాకతప్పదనియు అది తత్సహకారియే కాని తత్ప్రతిభాప్రతిద్వంద్వి కాదనియు తిక్కన ఆశయము.

రత్యాదిస్థాయిభావము లన్నియు దివ్యుల ప్రకృతులను వర్ణించునపుడు భారతవర్షోచిత ఉత్తమప్రకృత్యనుగుణముగ వర్ణింపబడవలెనని సంప్రదాయము. కావ్యనాటకములందు ఉత్తమప్రకృతులగు నాయికానాయకులపట్ల గ్రామ్యసంభోగవర్ణన ముచితము కాదు. అదే మాతాపితరుల సంభోగవర్ణనమువలె అసభ్యమగును. ఇట్లే దివ్యప్రకృతుల విషయమున గ్రహింపవలెను.

సం చా ర్యౌ చి త్య ము :-

సంచారిభావవర్ణనములలో కవి ఔచిత్యమును పాటించవలయును. శృంగారమునకు స్మృతి, చింత, గ్లాని, ఔత్సుక్యము, శంక, అసూయ, ఆలస్యము, వ్రీడ, హర్షము, మొదలగు సంచారిభావములనే వర్ణించరాదు. మరణము ఆలంబనమునకు అత్యంతవినాశము. ఆలంబనవినాశ మేర్పడిన రసాస్వాదన కవకాశముండదు. కావున సంచారిభావ పోషణవిషయమునను కవి ఔచిత్యమును పాటించి తీరవలయును.

అ ను భా వౌ చి త్య ము :-

ఇది భరతశాస్త్రప్రసిద్ధము. భరతుడు నాట్యశాస్త్రమున నాయారసముల కుచితములగు ననుభావములను పేర్కొని యున్నాడు. వాని ననుసరించి యనుభావౌచిత్యమును పాటింపవలెను. శృంగారమునకు లీలావిలాసాదు లనుభావములు. వీని

యౌచిత్యము మహాకవుల కావ్యనాటక పరిశీలనమువలన కూడ నెఱుంగదగును. మొత్తముమీద కవి శాస్త్రమర్యాద ననుసరించియు కావ్యాద్యవేక్షణమువలనను, ప్రతిభాసామర్థ్యములచేతను విభావానుభావములందలి యనౌచిత్యమును ప్రయత్నపూర్వకముగ పరిహరింపవలయును.

కథాశరీరౌచిత్యము :-

కథాశరీరము సయితము ఔచిత్యశోభితమై యుండవలెను. అది ప్రసిద్ధమైనను, కల్పితమైనను కాదగును. ఇతిహాసాదులలో వివిధములగు కథలు ప్రసిద్ధములయినను వానియందు విభావాద్యౌచిత్యశోభితమయిన కథాశరీరమునే గ్రహింపదగును. ఇట్టి పట్టుల ప్రఖ్యాతేతివృత్తముకంటె కల్పితేతివృత్తమునెడ కవి మిక్కిలి యవధానమును ప్రదర్శింపవలెను. అట్లు అవధానమును ప్రదర్శింపనిచో కవికి అవ్యుత్పన్నుడను నింద యేర్పడును. కావున నుత్పాద్యవస్తువు సర్వత్ర రసపూర్ణ మగునట్లు కల్పింపవలెను. ఇట్టి రసపరిపూర్ణతకు విభావాద్యౌచిత్యము అనుసరణీయము.

ఇక ప్రఖ్యాతేతివృత్తవిషయమున కవి యంతస్వేచ్ఛ పాటింప వలసిన యావశ్యకము లేదు. రామాయణాదులు సిద్ధరస ప్రాయములు. వానిపట్టుల స్వేచ్ఛ యభిలషణీయము కాదు. ఒకచో నట్టిస్వేచ్ఛ యనుసరణీయ మగుచో రసవిరోధ మేర్పడ నంత వఱకే అనుసరణీయము. రామునకు ధీరలలితత్వమును కల్పించి నాటకకు నాయకునిగ చేయుట మిక్కిలి అసమంజస మగునుగదా.

2. రసవ్యంజక వియమములలో రెండవ దానిని గూర్చి యిట్లు చెప్పుచున్నాడు:

"ఇతివృత్తవశాయాతాం త్యక్త్వా ననుగుణాం స్థితిమ్
ఉత్ప్రేక్ష్యా ప్యన్తరాభీష్ట రసోచిత కథోన్నయః
సంధిసంధ్యంగఘటనం రసాభివ్యక్త్యపేక్షయా
న తు కేవలయా శాస్త్ర స్థితి సంపాదనేచ్ఛయా"

ఇతివృత్త వశమున సంభవించిన అననుకూలస్థితిని కథాశరీరమున విడువవలెను. అట్టిపట్టుల ఊహించియైనను అభీష్టరసమున కుచితమైన కథోన్నయ మొనర్పవలెను. ఇతిహాసాదులలో లేని అజవివాహాదివర్ణనములు రఘువంశమున ఇది రసోచిత కథోన్నయమే. కవి సర్వాత్మనా రసపరతంత్రుడు కావలెను,

ఇతివృత్తమున రసాననుగుణమగు స్థితి కన్పట్టినచో దానిని విడచి స్వాతంత్ర్యముతో అనుగుణమగు కథాంతరమును సయితము నిబంధింపదగును.

కావ్యనాటకములయందు సంధిసంధ్యంగఘటనము సయితము రసాభివ్యక్తి ననుసరించియే ఘటింపవలెను గాని, కేవలము శాస్త్రసంపాదనేచ్ఛచే చేయరాదు. అట్లు శాస్త్రసంపాదనముకొఱకే యొనరించిన విలాససంధ్యంగఘటనము వేణీసంహారమున నౌచిత్యభంగ మొదవించినది.

3. ఉద్దీపనప్రశమనే యథావసర మంతరా

రసమును సమయమున ఉద్దీపన మొనరించుటయు, శమింపజేయుటయు రసవ్యంజకోపయోగులగును. అనగా రసముల యుద్దీపన ప్రశమముల విషయమున అవసరౌచిత్యము గణనీయము. వీరాదులందు ఉద్దీపన ప్రశమనములు అవసరోచితములు కావలయును. అట్లుకాక అద్భుతపుష్పము వలె హఠాత్తుగా సాధ్యము లబ్ధమైనట్లు వర్ణితమగునేని యచట ఉపాయోపేయ (కార్యకారణ) భావము సమ్యక్ప్రదర్శితము కాదు. అట్టి హఠాల్లబ్ధము రసపరిపోషకము కాజాలదు. కావున ఆ సమయమున రసోద్దీపనము చేయరాదు. అట్లేప్రశమము సయితము సమయమున నొనర్పవలెను. అట్లుకాక రసము అనవరత పరిస్ఫురిత మగుచో సుకుమారమగు జాజి పూవువలె వాడిపోవును. అందు శృంగారము మరింత తేలికగా మ్లానమగును.

4. రస స్యారబ్ధవిశ్రాంతే రనుసంధాన మంగినః

పూర్వమారబ్ధమై విశ్రాంతినొందిన అంగిరసమును తిరిగి యనుసంధించుట రసవ్యంజక మగును. పూర్వ మొకరసము అంగిగా ప్రారంభింపబడి, కొంతవరకు పరిపుష్టమై నడుమ నొకచో విశ్రాంతినొంది యుండును. అట్టిచో అవసరమగు అంగరసము ప్రస్తావింపబడి యుండవచ్చును. అట్టిచో సమయమున మరల అంగిరసము అనుసంధింపబడుట కూడ రసవ్యంజక హేతువగును.

5. అలంకారౌచిత్యము.

అలంకారములను నిబంధించుట సయితము రసానుగుణముగనే యుండవలయును. అలంకారనిబంధనము వ్యసనము వంటిది. తద్వ్యసనమున రసబంధ మొక్కొక్కయెడ కవి యుపేక్షించును. అట్టి ప్రమాదము నొందరాదు.

రసవిరోధి జ్ఞానము.

కావ్యనాటకములందు పోషింపదగిన రసములకు వ్యంజకములైన విషయముల పరిజ్ఞాన మెట్లు కవికి ఆవశ్యకమో అట్లే రసవిరోధిపరిజ్ఞానము సయితము ఆవశ్యకమే. అనుసరించుటకు రసవ్యంజకవిషయపరిజ్ఞానమును, పరిహరించుటకు రసవిరోధివిషయ పరిజ్ఞానమును ఆవశ్యకములు. ఈ పరిజ్ఞానము ప్రబంధమందే కాక ముక్తకములందు సయితము కావలెను. ప్రబంధమునందు గాని ముక్తకమునందు గాని రసనిబంధ మొనరించు సుకవి రసవిరోధపరిహారము ప్రయత్నపూర్వకముగ నొనరింపవలెను. రస వ్యంజకనియమములు పంచధా విభక్త మైనట్లే ఈ రసవిరోధివిషయము సయితము పంచధావిభక్తము. అంతియేగాక పూర్వము వ్యంజకవిషయములకు విరోధులే యిట రసవిరోధులుగా పరిగృహీతములు.

రసవిరోధులు.

ఇవి రసవ్యంజకతకు విరోధులు. వీనిని పరిహరించిననే రసము ప్రబంధము నందుగాని, ముక్తకమునందుగాని వ్యంజితమగును.

1. విరోధిరససంబంధి విభావాది పరిగ్రహః

వర్ణ్యమగు ప్రధానరసమునకు విరోధియగు రసమునకు సంబంధించిన విభావాదులను పరిగ్రహించుట యొక రసవిరోధము. ఇది రసవ్యంజకనియమములలో మొదటిదానికి విరుద్ధమైనది. విభావభావానుభావాములచే మనోహరమైన యితివృత్త స్వీకరణమే రసాభివ్యక్తికి మొదటి సాధనము.

ఈ విరోధము దీనికి ప్రతికూలమైనది. సహజముగ శాంతశృంగారములు విరుద్ధరసములు. అట్టిచో శాంతరస విభావాదులు శాంతాంగములుగ వర్ణింపబడి వెను వెంటనే అవియే శృంగార విభావములుగ వర్ణింపబడుట, ప్రణయకుపితయయిన రమణిని వైరాగ్యకథాప్రసంగములచే ననునయించుట యిట్టిది. ప్రణయకుపితత్వము శృంగారమునకును, వైరాగ్యకథాప్రసంగము శాంతమునకును అంగమగుటచే విరోధి రస విభావమైనది. ఇట్లే ప్రణయకుపితయగు నాయికపై నాయకునకు గోపమొదవి రౌద్రావిష్టుడగుట తదనుభావములను ప్రకటించుట విరోధిరసానుభవ పరిగ్రహమగును. ఇట్లు విరోధిరసములకు సంబంధించిన విభావానుభావములు స్వీకరించుట రసప్రతిబంధకము,

2. "విస్తరే ణాన్వితస్యాపి వస్తునోఽ న్యస్య వర్ణనమ్"

"ప్రకృత కథావస్తువుతో నేకొంచమో సంబంధము కల్గిన ప్రకృతరసమునకు పోషకముకాని అన్యవస్తువును విస్తరించి వర్ణించుట" అనునది మరియొక రస విరోధము. ఇది రసవ్యంజక నియమములలో రెండవ దానికి విరుద్ధమైనది. ఇతి వృత్తమున అననుగుణస్థితిని తొలగించుట రసానుకూలమగు సంధిసంధ్యంగఘటన మొనర్చుట అనునది రెండవసాధనము. సరిగా దానికిది వ్యతిరేకము.

నాయకుని విప్రలంభశృంగారమును వర్ణింపమొదలిడిన కవి యమకాద్యలంకారాభిలాషముచే పర్వతాది వర్ణనము విస్తరించి చేయుట. ఇచట యమకాద్యలంకారము లలో పాఠకుని (సామాజికుని) మనస్సు లగ్నమై రసభంగ మొదవును.

3. అకాండ ఏవ విచ్ఛిత్తి రకాండే చ ప్రకాశనమ్.

"కానిసమయమున రసవిచ్ఛిత్తి యొనర్చుట, అసమయమున రసప్రకాశ మొన ర్చుట" ఈరెండును రసవిరోధములే. ఈ రెండును "ఉద్దీపనప్రశమనే యథావసర మంతరా" అను రసవ్యంజకనియమమునకు వ్యతిరేకమయినవి. ఇందు మొదటిది అసమయమున రసవిచ్ఛేదము. దీని కుదాహరణమును రత్నావళి నుండి యభినవ గుప్తుడు గ్రహించెను. సాగరిక ఉదయనులప్రేమ సమగ్ర దశలో నుండగా వారి సమాగమోపాయ మూహింపక కవి విజయవర్మ దండయాత్రా ప్రసంగమునొనర్చినాడు. ఇది అసమయవిచ్ఛిత్తి. రెండవది అసమయప్రకాశనము. ఇది వేణీసంహారమున నున్నది. భానుమతితోడి దుర్యోధనుని శృంగారవ్యవహార మిట్టిదే.

4. పరిపోషం గతస్యాపి పౌనఃపున్యేన దీపనమ్.

పరిపోషమును పొందిన రసమును విశ్రాంతి నొందనీయక మరల మరల ప్రకాశింపజేయుట. ఇదియు రసవిరోధి హేతువు. ఇది "రస స్యారబ్ధవిశ్రాంతే రను సంధాన మంగినః" అను రసవ్యంజక నియమమునకు విరుద్ధమైనది. పరిపుష్ట రసము నకు విశ్రాంతి కలింపక పునః పున రుద్దీపన మొనర్చినచో, పునః పునః పరామృశ్య మానమైన కుసుమము పరిమ్లానమైనట్లు లాలిత్యము కోల్పోవును.

5. (రసస్య స్యా ద్విరోధాయ) వృత్త్యనౌచిత్య మేవ చ

వృత్త్యనౌచిత్య మనగా వ్యవహారమున ననౌచిత్యము. ఈవ్యవహారానౌచిత్యము రసవిరోధి యగును. నాయిక ఉచితమగు అంగవిన్యాసము లేకుండగ (అనగ అనుభావప్రకటనము) నాయకునితో తనసంభోగాభిలాషను చెప్పుట వ్యవహారానౌచిత్య మగును. ఇది రసభంగ హేతువగును. గ్రామ్యతాపాదక మగును. ఇదియే వ్యంజితమగుచో దోషముకాదు. కేవల వాచ్యమగుట యిందలి దోషము.

ఈ వృత్త్యనౌచిత్యము నానందవర్ధనుడు మరొక విధమున కూడ వివరించెను. కైశిక్యాది వృత్తులు భరతశాస్త్ర ప్రసిద్ధములు. వీని ననుచితముగ ఘటించుట వ్యవహారానౌచిత్య మగును. అది రసభంగ హేతువు.

విరుద్ధరసములు – విరోధపరిహార ప్రకారములు.

నవరసములలో పరస్పరము కొన్నింటికి వైరుద్ధ్యము కల్పింపబడినది. అందులకు కారణము లౌకికములయిన భావానుభూతులలో పరస్పరము వైరుద్ధ్యము సహింపబడకుండుటయే. ఏకస్థాయిగతుడయిన ఒకవ్యక్తి కాలమహిమమున తద్విరుద్ధస్థాయిగతుడైనచో అందులకు కారణమును వెదకుట లోకసిద్ధమగు విషయము. అట్టి తత్త్వములను, అందులకు వెదకెడి కారణజాతములను సమగ్రపరచి పరస్పర విరుద్ధరసముల నియమించి తద్విరోధ పరిహార ప్రకార మాలంకారికప్రోక్తమయినది. A. అపరిచ్ఛిన్నములై వేద్యాన్తరస్పర్శశూన్యము లయిన రసములకు వైరుద్ధ్య మనుపపన్నము కాన రసమింకు స్థాయ్యుపలక్షకము

పరస్పరవిరుద్ధరసములు :-

శృంగారము - కరుణ బీభత్స రౌద్ర వీర భయానక రసములు.

హాస్యము - భయానక కరుణములు.

కరుణము - హాస్య శృంగారములు.

A. రసగంగాధరము

1. అద్యః కరుణబీభత్స రౌద్రవీరభయానకైః।
భయానకేన కరుణేనాపి హాస్యో విరోధభాక్॥
కరుణో హాస్యశృంగారరసాభ్యా మపి తాదృశః.

రౌద్ర - హాస్య శృంగార భయానకములు.

వీరము - భయానక శాంతరసములు.

భయానకము - శృంగార వీర రౌద్ర హాస్య శాంతములు.

శాంతము - వీర శృంగార రౌద్ర హాస్య భయానకములు.

బీభత్సము - శృంగారము.

అ ద్భు త ర స ము -

దీనికి విరుద్ధ రసము లేవియును లేవు. అలంకారికులలో నెవ్వరును అద్భుత రసమునకు విరుద్ధరసములను చూపలేదు. అనగా ఇది శృంగార శాంత బీభత్సాది సర్వరసములకును ప్రాగవస్థగా కన్పట్టుచుండును. అందుకే విరుద్ధములయిన శాంత శృంగారములను పోషింపవలసి వచ్చినపుడు మధ్యలో తదుభయావిరుద్ధమైన అద్భుతరసమే యెక్కువగా వాడబడు చుండుట గమనార్హము.

మనుచరిత్రాదులలో కూడ శాంతస్వరూపుడుగా నిరూపితుడైన ప్రవరుని చిత్రణము తరువాత శృంగారాభాసము పోషింపబడవలసి రాగా మధ్యమున అద్భుతరసమే పోషింపబడినది. భగవద్గీతలో గూడ శాంతముగానున్న అర్జునునిలో వీరమును రేకెత్తించుటకు విశ్వరూపసందర్శన రూపమయిన అద్భుతరసము పోషింపబడినది. ఇట్లు వివిధములైన రసములకు పరస్పరవిరుద్ధములైన విరోధపరిహారమునకై మధ్యలో విహితమగు అద్భుతము సర్వరసావిరుద్ధము కారతప్పదు.

రౌద్రస్తు హాస్యశృంగార భయానకరసైరపి॥
భయానకేన శాంతేన తథా వీరరసః స్మృతః।
శృంగార వీరరౌద్రాఖ్య హాస్యశాంతై ర్భయానకః।
శాంతస్తు వీరశృంగార రౌద్రహాస్య భయానకైః॥
శృంగారేణ తు బీభత్స ఇత్యాఖ్యాతా విరుద్ధతా।

— సాహిత్యదర్పణ - తృ. పరి. 244—248.

ర స వి రో ధ కా ర ణ ము :-

స్వతంత్రములయిన రెండురసములను ఏకప్రక్రమముగా వర్ణించుట. ఇవి రెండును స్వతంత్రము లగుటచే ఆస్వాదన పౌర్వాపర్యము అనుపపన్నము కావున అదిదోషము. ఒకరసముకాని, భావముకాని, ప్రధానమై యున్నపుడు రెండురస ములను గాని, భావములనుగాని, పరస్పర విరుద్ధములను తదంగత్వరూపమున పోషణము దోషము కాదు.

A ఆనందవర్ధనుడు, విశేషించి B రసార్ణవసుధాకరకర్తయు, C జగన్నాథుడను ఈవిషయమును ప్రపంచించియున్నారు. ఇట్లు పోషించుట ద్వారా ప్రవృత్తమయిన రసమునుగాని భావమునకుగాని దేనికి రూపబాహుళ్య ముండునో అదిస్థాయి అయి మిగిలినవి సంచారులగు అవకాశ ముండును. D. కాన అంగాంగిభావ కల్పనము వలనగాని ఆనందవర్ధనుని అభిప్రాయాను సారముగ బాధ్యబాధక కల్పనము వలనగాని కూడ ఈవిరోధమును పరిహరింప వచ్చును. అంతేకాదు - ఈవిరోధ పరిహారమునకు మరికొన్ని ఉపాయములు కూడ కలవు.

పరస్పర విరుద్ధము లయిన రెండు రసములు అన్యరస మంగిగా నుండగ పోషింపబడుట దోషముకాదు.

A. వివక్షితేరసే లబ్ధ ప్రతిష్ఠేతు విరోధినామ్।
బాధ్యానామంగ భావంవా ప్రాప్తానా ముక్తిరచ్ఛలా॥

— ధ్వన్యాలోకము - తృతీయ - 20.

B. ఏషామంగాంగి భావేన సంకరోమమ సమ్మతః

— రసార్ణవసుధాకరము - రసికోల్లాసము - 254.

C. రసగంగాధరము.

D. భావో వాపి రసో వాపి ప్రవృత్తి ర్వృత్తిరేవ వా।
బహూనాం సమవేతానాం రూపంయస్య భవేద్బహు॥
స మన్తవ్యోరసః స్థాయీ శేషాః సంచారిణో మతాః।

- నాట్యశాస్త్రము - 119 - ప్రక్షిప్తము.

A. అందు సుందోపసుంద న్యాయముగ రెండును ఉపహతములగును. లేదా రాజభృత్యన్యాయము ననుసరించి నిర్వీర్యములగును. అన్యోన్యవైరుధ్యము కలిగినను రాజానుగతులైన భృత్యులిరువురు నిర్వీర్యులై రాజుననుసరించుట చూచు చునే యున్నాము గదా! B. అంతియగాక ప్రతిపాద్యభావవిషయమున విధ్యనువాద వ్యవహారము చూపట్టుచుండును. విధులలో పరస్పర వైరుద్ధ్య మున్నను అనువాద విషయమున ఆ వైరుద్ధ్యము దోషహేతువుకాదు. C. ఇదియేగాక అనుభూత పూర్వము లయి ప్రకృతము స్మర్యమాణము లగుచున్నట్లుగా తుల్యబలరసద్వయ పోషణమును దోషము కాదు. ఆ యనుభూతి ప్రకృతరసమునకు అంగభావమునే భజించుట ఇందులకు హేతువు. D సాధారణ విశేష న్యాయముగ కూడ పర స్పర విరుద్ధములయిన రసములను పోషించుట దోషము కాదు. దీని నంతటిని అభిసంధానముచేసి మమ్మట డిట్లనినాడు - సమానబలముగల రసముల సాంకర్యము ఆస్వాదవిషయమున కూడ సాంకర్యయుతమై అరుంతుదత్వ హేతువగుటచే యుక్తము కాదు. అందు తత్పరిహారమునకై అంగాంగి భావపద్ధతిని ప్రవేశపెట్ట వలయును. అట్లు ప్రవేశపెట్టుట తద్దోషపరిహార హేతువగును

A స్మర్యమాణో విరుద్ధోఽపి సామ్యే నాథ వివక్షితః।
అంగి న్యంగత్వ మాప్తౌ యౌ తౌ న దుష్టౌ పరస్పరమ్॥

A. రసగంగాధరము - జగన్నాథుడు.

B. ధ్వన్యాలోకము - తృతీయ - 407

C. ధ్వన్యాలోకము - తృతీయ - 413

D. రసగంగాధరము.

A. కావ్యప్రకాశము - సప్తమోల్లాసము

దీనివిబట్టి స్వతంత్రప్రక్రమము లైన రెండురసములకు వైరుద్ధ్యము తొలగించు పద్ధతులివి.

1. సామ్యవివక్ష. 2. అంగాంగిభావము
3. బాధ్యబాధక భావము. 4. ఒకఅంగిలో రెండంగములు.
5. స్మర్యమాణములు. 6. సాధారణ విశేషభావము.

1. సామ్య వివక్ష - రెండును తుల్యములుగ వివక్షింపబడుట.

పరుఁ జూచున్ వరుఁ జూచు నొంప నలరింపన్ రోషరాగోదయా
విరతభ్రూకుటిమందహాసములతో వీరంబు శృంగారమున్
బరగం గన్నులఁ గెంపుసొంపుఁ బరగఁ జూడాన్ప్రసందోహమున్
పరసాలోకసమూహమున్ నెఱపుచుం జంద్రాస్య హేలాగతిన్.

ఇందు సత్యభామలో వీరశృంగారములు రెండును వర్ణింపబడినవి అవి పరస్పరవిరుద్ధము లయ్యు తుల్యాస్వాదనమున కవివివక్షితములు. కావున ఈ విధానము దుష్టముకాదు.

2. అంగాంగి భావమున వర్ణనము :-

ధరణి నెత్తుట దోఁగి అధరణకాయ
శస్త్రఖండజాలంబులఁ జాలనొప్పె
పలుచ గాకుండ కుంకుమ మలది పెక్కు
తెలుగు తొడవులఁ దొడిగిన తెఱవ వోలె. A.

ఇందు బీభత్స శృంగారములు వర్ణింపబడినవి. యుద్ధరంగవర్ణనము ప్రాకరణికమగుటచే బీభత్సము ప్రధానము. ఆ బీభత్సమున కంగభావము నంది దానివి పుష్టము కావించుచుండెడిది ద్వితీయార్ధము నందలి శృంగారరసము. ఇట్లు అంగాంగిభావముచే రసవర్ణనము దోషము కాదు.

B. భాగవతము - దశమస్కంధము - ఉత్తరభాగము - 178
A. మహాభారతము - భీష్మపర్వము - 3 - 162

ఈ అంగాంగిభావ విధానమున అంగము అంగిరసమునకు పోషకముగనే యుండవలయును. అట్టి పోషణము లేనిచో నది అంగత్వము నొందదు. అంగత్వము నందునని చెప్పినచో పానకరసమునందలి తృణసికతాదులు కూడ అంగములని చెప్పవలసి వచ్చును. కాని యట్లుచెప్పుట జరుగదు కదా! పానకరసమునందు ఏలాదులకు, తృణాదుల కంగత్వములేదు అట్లారసము అంగమయినంత మాత్రమున ప్రయోజనములేదు. పోషకముకావలయును A.

లాలాజలం స్రవతు వా దశనాస్థిపూర్ణ
మప్యస్తు వా రుధిరబంధురితాధరం వా।
సుస్నిగ్ధమాంసకలితోజ్జ్వలలోచనం వా
సంసారసార మిద మేవ ముఖం భవత్యాః। B.

దంతములను నెమ్ములను నిండి చొంగనీరు కారనిమ్ము. పెదవినుండి రక్తము చిమ్మనిమ్ము. సుస్నిగ్ధ మగు మాంసపు కండలతోఁ గన్నులుండనిమ్ము. ఈ నీ ముఖమే సంసారమునకు సార మని భావింతును C.

ఇందు బీభత్సము, శృంగారమును ఉన్నవి. ఇందు అంగి శృంగారము. బీభత్సము అంగము. కాని అంగాంగిభావస్థితిమాత్రమున ఇందు వైరుద్ధ్యపరిహారము నంగీకరించినచో ఈ శృంగారమునకు బీభత్సము పోషక మగునా? ఇట్టి

A. విరోధినోఽపి సాన్నిధ్యా దతిరస్కారలక్షణమ్।
పోషణం ప్రకృతస్యేతి చే దంగత్వం న తావతా॥
య త్కించి దుపకారిత్వా దంగ స్యాంగత్వ మంగివి।
త త్సన్నిధాన మాత్రేణ చర్వణానుపకారతః॥
అన్యథా పానకాదిషు శర్కరాదే రివాపతేత్।
అన్తరాపతితస్యాపి తృణాదే రుపకారితా॥

- రసార్ణవ సుధాకరము - రసికోల్లాస - 257 - 58 - 59.

B. రసార్ణవ సుధాకరము - రసికోల్లాస - 626, 27 పుట

C. రసార్ణవసుధా - అనువాదము - రసికోల్లాసము.

పరిస్థితులకు కుదరదు. అది శృంగారభంజకమే కాని రంజకము కాదు. కావున అంగాగిభావత్వ మున్నంతమాత్రమున ప్రయోజనము లేదు. ఆ అంగము అంగ్యుప స్కారముగ నున్నపుడే అది సార్థక మగు నని - సర్వజ్ఞసింగభూపాలుని అభి ప్రాయము.

౭. బాధ్యబాధకభావమున విరోధరసపోషణము :-

విరుద్ధరసములయ్యు ఒక దానిచే నొకటి బాధింపబడినచో నందు రసవైరుద్ధ్యము పరిహృత మగును.

చరిగొన్న వెలిపట్టు జన్నిదంబులతోడ
  రత్నాల తారహారము ధరించి
వలిప నీర్కావిధోవతిపై (బదార్వన్నె
  కళ యైన పసిడిమేఖల ఘటించి
గంగమట్టియ మీదఁ గస్తూరిరసమునఁ
  బుం(డ్రకంబు లలాటమున నమర్చి
విమలసన్మణిమండలములఁ బార్శ్వములందు
  లలితంబు లగు నొంటు లలవరించి

యాత్మవంశపరంపరాయాత మైన
వైదికాచారమార్గంబు వక్కణించి
యారజము రాచటికమును నలవరించి
నగరవీథులఁ జరియించుఁ (బెగడమతుడు. A.

ఇందు ప్రతిపాదమునను పూర్వార్ధమున శాంతాంగముల ద్వారా శాంతరసము పరిపుష్ట మయినది. ఉత్తరార్ధములందు శృంగారాంగముల ద్వారా శృంగారరసము పుష్ట మైనది. శాంతశృంగారములు పరస్పరవిరుద్ధము లయినను శాంతము శృంగారముచే బాధింపబడినది గాన బాధ్యబాధకభావముచే నందు దోషము పరిహృతము. ఇట్లే ఇతరరసవిషయములందును గ్రహింపదగును.

A. శివరాత్రిమాహాత్మ్యము - ద్వితీయాశ్వాసము - 90పద్యము.

4. ఒక అంగిరసమున రెండు రసము లంగము లగుట :-

తెలియని దానఁ గాదు జగతీవర! ద్రౌపదియందు ముందు మీ
రలు సమయంబు సేయుట ద్విజార్థము ధర్మజు పాన్పు టింటి ముం
గల (జని శస్త్రశాల విలు (గై కొనుటందు నిమిత్త మీవు వి
శ్చలమతి భూప్రదక్షిణము సల్పగ వచ్చుట నేనెఱుంగుదున్ A.

ఇందు వీరశాంతములు రెండును ఉలూచిగతమయిన శృంగారమున కంగము లైనవి. అట్లే -

కవిరాజు కంఠంబు కౌగిలించెను గదా
పురవీధి నెదురెండ పొగడదండ;
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరివాకిట నుండు నల్లగుండు;
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత
వియ్యమందెను గదా వెదురుగొడియ;
ఆంధ్రనైషధకర్తయంఘ్రియుగ్మంబునఁ
దగిలియుండెను గదా నిగళయుగము;

కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు దినిపోయె తిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి
నెట్లు చెల్లింతుఁ దంకంబు లేడు నూర్లు B

ఇందు కౌగిలించు, వియ్యమందు. మొదలుగా గల శృంగారానుభావములును, భుజాస్తంభ మెక్కు మొదలుగాగల వీరానుభావములును కరుణరసమున కంగము లైనవి. అనుభవ వర్ణనమాత్రమున గూడ రసాభివ్యక్తి అభినవాద్యంగీకృతమే A.

A. విజయవిలాసము - 1ఆ - 157

B. శ్రీనాథుని చాటుధార

A. అభినవ భారతి,

5. స్మర్యమాణము లయి ప్రకృతాంగము లగుట.

అరుణగభస్తిబింబ ముదయాద్రిపయిం పొడతేర గిన్నెలోఁ
బెరుగును వంటకంబు వడపిందియలుం గడవంగఁ బెట్టు ని
ర్భరకరుణాధురీణ యగు ప్రాణము ప్రాణము తల్లి యున్నదే
హరహర! యెవ్వ రింకఁ గడు పారసి పెట్టెద రీప్సితాన్నముల్ B.

ఇందు వాత్సల్యము స్మర్యమాణమై ప్రకృతకరుణరసమున కంగ మయి దానిని పోషించుచున్నది. అట్లే -

ఈ కవితాభిమానము వహించితి నేటికి ? శంభుపీఠిపై
నీ కవు లున్నయట్లువసియింపక దేవుని తోడ నేల వా
ర్వాక మొనర్చితిం గడుభరం బగు కుష్ఠరుజావిషాద మే
నే కరణిం ధరింతు నిక నెన్నఁడు చూచెద వెండిగుబ్బలిన్ C.

ఇందు ప్రకృతము శాంతము. పద్యమున వీరము వర్ణితము. నత్కీరుడు ఒకనాడు ఈశ్వరాధిక్షేపణముచే శాపగ్రస్తు డయినాడు. శాపానుభవసమయమున నాటి వీరమును తలచి బాధపడుచున్నాడు. ఆ వీరము స్మర్యమాణమై శాంతమున కంగ మగుచున్నది.

6. సాధారణవిశేషభావమున పోషణము -

యౌవనోన్మత్తచిత్తు లత్యంతరక్తు
లైన నీ వైరిబృందము లాహవమున
హ్మాతలేశ! వసుంధరఁ గౌఁగిలించి
కొంచు శయనించినారు వీక్షింపు మయ్య A.

ఇందు "యౌవనోన్మత్త, అత్యంతరక్త" విశేషణములు కరుణ, శృంగారోభయసాధారణములు. కనుక విశేషణములచే క్రమముగా కరుణశృంగారాభివ్యక్తి కలిగినను వానికి పరస్పరవైరుద్ధ్య మున్నను సాధారణవిశేషభావ మగుటచే నిందు దోషము పరాస్తము.

B. శివరాత్రి మాహాత్మ్యము - తృతీయాశ్వాస - 19

C. కాళహస్తిమాహాత్మ్యము - తృతీయాశ్వాస - 174

A. రసగంగాధరము - ధరణికోట వేంకటసుబ్బయ్య - పుట 251.

2. తుల్యబలముగల రెండు రసములకు సామానాధికరణ్యమును కల్పించుట.

3. తుల్యబలముగల రెండు రసములకు నైరంతర్యాభివ్యక్తిని కల్పించుట A.

వీనినే జగన్నాథుడు స్థితివిరోధము - జ్ఞానవిరోధము అని విభాగము చేసి చూపినాడు B. ఉభయవిధము లయిన ఈ విరుద్ధరసములను పోషించుటకు అనేక విధానములు కూడ ఆలంకారికనిర్దిష్టము లయి ఉన్నవి. అగ్నియందే కదా బంగారు యొక్క నైర్మల్యము గాని సౌవర్ణ్యము గాని వ్యక్తమగునది. అట్లే విరుద్ధరసము లుండి తజ్జయము కలిగినపుడే ప్రకృతరసమునకు పరిపుష్టి.

స్థితివిరోధము - తత్పరిహారము .-

సామానాధికరణ్యములుగా రెండు రసములను పోషించుట స్థితివిరోధము. ఒక ఒరలో రెండు కత్తు లిమడనట్లు ఒకవ్యక్తిలో రెండురసము లుండకూడదు. ఆశ్రయ మగుట అనునది అధికరణమున కర్థము ఏకాశ్రయములుగా ఏకపాత్రా శ్రయములుగా రెండురసములను పోషింపరాదు.

పోషింపవలసివచ్చినచో ఈ క్రిందినియమములద్వారా పోషింపవచ్చును.

"ఆశ్రయైక్యే విరుద్ధో యస్స కార్యో భిన్నసంశ్రయః" A

ఆశ్రయైక్యముచే నేర్పడిన దోషము రసములను భిన్నాశ్రయములను చేయుట ద్వారా, వైయధికరణ్యము కల్పించుట ద్వారా తొలగింపవచ్చును. ఈ విషయమును ఆనందవర్ధనుడు ముందే నిరూపించి ఆలంకారికమార్గదర్శి యయి ఉన్నాడు B. వైయధికరణ్యముచే విరుద్ధరసపోషణము నిపుడు పరిశీలింతము.

వీరభయానకములు పరస్పరవిరుద్ధములు కాని నాయకునియందు వీరము పరిపుష్టమై ప్రతినాయకునియందు భయానకము పరిపుష్ట మయినచో అందు దోషము వైయధికరణ్యమహిమచే తొలగిపోవును. అంతియగాక అది విశేషించి ప్రస్తుత రసమునకు పోషకము కూడ అగును

A. ఏకత్ర స్వైరిణోః తుల్యశక్త్యోర్యోగేవిరుద్ధతా - నాట్యదర్పణ - 3 - వివేక

B. రసగంగాధరము

A. కావ్యప్రకాశము - సప్తమోల్లాసము - 64

B ధ్వన్యాలోకము - తృతీయోద్ద్యోతము - 25

భీష్మద్రోణకృపాదిధన్వినికరాభీలంబు, దుర్యోధన
గ్రీష్మాదిత్యపటుప్రతాపవిసరాకీర్ణంబు, శస్త్రాస్త్రజా
లోష్మస్ఫారచతుర్విధోజ్జ్వలబలాత్యుగ్రం బుదగ్రధ్వజా
ర్చిష్మత్త్వాకలితంబు సైన్య మిది యేఁ జేరంగ శక్తుండనే! A.

ఇందు ప్రథమపాదము మొదలు చతుర్థారము వరకును వీరరస విభావము. లేదా రౌద్రరసవిభావము వర్ణింపబడినవి. అందు వీరము పుష్ట మగును. కాగా వెంటనే - 'ఏఁజేరంగ శక్తుండనే! అనుచు నది భయానక మైనది. భయానకమునకు ఆలంబనమై ఉత్తరునిలో భయమును కల్గించినది. ఇట్లు వైయధికరణ్యమహిమమున విరుద్ధ రసములను పోషించుట దోషము కాదు. ఇట్లే ఉత్తరరామాయణమున B కూడ చూడవచ్చును.

ఈ వైయధికరణ్యప్రధానముతో పరస్పరవిరుద్ధము లయిన శాంతశృంగారము లను పెద్దన వర్ణించిన తీరు మనోహరము C ప్రవరుడు శాంతస్వరూపుడు. వరూధిని కామశాస్త్రోపాధ్యాయి. వీరిద్దరి సంభాషణములు శాంతశృంగార స్ఫోరకములు. ఒక దానితో ఒకటి పొత్తు నందలేదు. అట్లే ప్రవరవరూథినులు కూడ. కనుక ఆ రెండురసములు అసంగతములు విరుద్ధములును, భిన్నాశ్రయము లగుట చేసి అన్యోన్యసంఘర్షితము లయి రసస్యందు లైనవి.

ప్రాంచద్భూషణబాహుమూలరుచితోఁ బాలిండ్లు పొంగార పై
యంచుల్ మోవఁగఁ గౌఁగిలించి యధరం బాసింప హాశ్రీహరీ!
యంచున్ బ్రాహ్మణుఁ డోరమోమిడి తదీయాంసద్వయం బంటి పొ
మ్మంచున్ ద్రోచెఁ గలంచునే సతులమాయల్ ధరచిత్తంబులన్ D.

A. భారతము - విరాటపర్వము - చతుర్థాశ్వాసము - 52

B. మాల్యవదాదులు అమరావతిపై దండెత్తు సందర్భము

C. మనచరిత్ర - ద్వితీయాశ్వాసము,

D. మనచరిత్ర - ద్వితీయాశ్వాస - 68

వరూధిని అధరం బాసించి కౌగిలించిన దట. అందునూ ప్రాంచద్భూషణ హుమూలరుచితో. ఇది ఉద్దీపనవిభావముకూడ. కనుక వరూథినిలో ఆలంబనోద్దీపన జన్యమైన కౌగిలింతయను అనుభావమును గూడ వర్ణించినాడు - అధరం బాసించి నది. అది ఉత్సుకత. ఇన్ని యున్నను ప్రవరుడు తదీయాంసద్వయం బంటి పొమ్మం చున్ త్రోచినాడు శాంతమునకు మహోత్కృష్ట మయిన అనుభావ మిది. ఇట్లు పరస్పరవిరుద్ధము లయిన శాంతశృంగారములు కూడ వైయధికరణ్యమహిమ వలన వైరుధ్యమును పాత్రపరముగా తొలగించు కొనలేకపోయినను శాస్త్రీయ సిద్ధాంతపరముగ తొలగించుకొని చర్వమాణము లగుచున్నవి

ఇట్లే పరస్పరవిరుద్ధము లయిన శాంతహాస్యముల పరిపోషణము ఉత్తరహరి వంశమున నాచనసోమన వైయధికరణ్యము వలననే సాధించినాడు. దుర్వాసుని యందు శాంతమును, హంసడిభికుల యందు హాస్యమును పోషించి రసవైరుధ్యమును పరిహరించినాడు B ఇది సామానాధికరణ్యాజన్య మైన రసవైరుధ్య పరిహార ప్రకారము.

ఇక జ్ఞాన విరోధము :

పరస్పరవిరుద్ధము లైన రసములు నైరన్తర్యక్రమమున చర్వితము లగుట జ్ఞానవిరోధము. "రసాన్తరేణాన్తరితో నైరన్తర్యేణయో రసః" A నైరంతర్య జన్య మైన ఏ వైరుధ్యము కలదో అది పరస్పరవిరుద్ధరసములు రసాంతరిత రాంతరితము లయినచో తొలగిపోవును. ఆనందవర్ధనుని మూలము

ఏకాశ్రయత్వే నిర్దోషో నైరన్తర్యే విరోధివాన్
రసాన్తరవ్యవధినా రసో వ్యంగ్యః సుమేధసా । B

పరస్పరవిరుద్ధరసములను ఏకాశ్రయములుగా వర్ణింపవలసి వచ్చినచో తదుభయవిరుద్ధములు కాని రసములను మధ్య పోషించుట యుక్తియుక్తము. ప్రాయకముగ అద్భుతమో, వీరమో అట్టి స్థానము నాక్రమించుట గమనార్హము.

B. ఉత్తరహరివంశము - నాచనసోమన - చతుర్థ ఆశ్వా - 42

A. కావ్యప్రకాశము - సప్తమోల్లాసము - 64

B. ధ్వన్యాలోకము - తృతీయోద్ద్యోతము - 26

సంస్కృతసాహిత్యమున శ్రీహర్షుడు నాగానందమున నిట్లు మనోహరతను సాధించుట బహ్వాలంకారికాంగీకృతము. C ఆంధ్రమున వైజయంతీవిలాసమును పరికింతము - విప్రనారాయణుడు పిన్ననాటినుండి సాధుమూర్తి, శాంతదీప్తి. శ్రీరంగని అనుగ్రహఫలితముగా జనియించిన వాడు కదా! పావనతులసీవనమును పెంచి జీవనమును దాని కంకితము గావించినవాడు, శ్రీధరసేవానిరతుడు.

> స్వాధ్యాయంబుఁ బఠించు సాంగకముగా సంధ్యాద్యనుష్ఠానముల్
> విధ్యుక్తక్రియ నాచరించుఁ దటితో వేల్పున్ బ్రపూతాత్ముడై
> మధ్యేరంగశయానమూర్తి కిరుసమ్యగ్భక్తితో మాలికల్
> మధ్యాహ్నంబునఁ గుక్షి భిక్షఁ దనుపున్ మాధూకర
> ప్రక్రియన్. A

ఇట్లు శాంతమూర్తిగా వర్ణింపబడిన విప్రనారాయణుడు దేవదేవీసహవాసమున కామదేవీప్రియు డైనాడు. అతనిలో కరిగిన వలపుతెరల తెమ్మెరతళుకులను చూడండి -

> ఆ విప్రోత్తము వజ్రపంజరనిభంబై నిశ్చలంబైన స
> ద్భావం బంగన సాహచర్యగుణసంపర్కంబునన్ లోహమై
> గ్రావంబై, దృఢదారువై తరుణవృక్షంబై. ఫలప్రాయమై,
> పూవై, తన్మకరందమై, కరఁగెఁబోఁ బో స్త్రీ కెల్లకుం బల్పనై. B

ఇది మంజులశృంగారము. కానీ పావన తులసీవనమును పెంచిన విప్రనారాయణుడు దేవదేవీసంపర్కమున వలపుల జీవనది యగుట ఆశ్చర్యావహము కాకుండుటకై కవి ముందు అతనినే ఆశ్చర్యపరచినాడు చూడుడు

C. ధ్వన్యాలోకము - రసగంగాధరము మొదలగు 11

A. వైజయంతీవిలాసము - ప్రథమాశ్వాసము - 49

B. వైజయంతీవిలాసము - ద్వితీయాశ్వాసము - 139

ఏఁ బ్రసాపడి తోఁట కేఁతెంచు నందాక
బనిసేయుఁ దాఁ బ్రసాపడను బోదు,
నేఁ జేతఁ బనివట్టితేఁ జూచి ముందుగాఁ
దా నందుకొను నొడల్ దాఁచుకొనదు,
నే మేల్కొనక మున్న తా మేలుకొని దేహ
శుద్ధయై తిరుమాళ్ళ శుద్ధిచేయు,
నే నిద్రపోవదాకా నిద్రపోవ దే
పని చెప్పునో యని పాయకుండు

విరతిమై నింట వేపుర విడచి వచ్చి
తోఁటపని పాట కొదిఁగి నాతోఁ బ్రయాస
పడుచునున్నది పరదేశిపడుచు, దీని
సాఁకకున్న నపేక్షాపచార మొదవు. A

ఇట్లు దేవదేవీచర్యల నద్భుత మనెను. అందుకే అతడు శృంగారి కాగలిగి నాడు. అద్భుతాంతరితములై ఇందు శాంతశృంగారములు పోషింపబడుట నిర్దోష హేతువు.

ఈ ప్రకారముగ రసవైరుద్ధ్యము - తత్పరిహార - ప్రకారములను వివిధ గతులలో ప్రదర్శింపబడినవి మానవమనస్తత్త్వము కఠోరనియమములకు కట్టుబడి యుండదు గాన - ఆ మనస్తత్త్వములో రమణీయములు నిర్దుష్టములను కున్నవాని కనుగుణముగా కళాతత్త్వమునకు దగ్గరగా నియమములను కల్పించుట అవసరము.

అనగా అనేకములయిన విరుద్ధభావములు మనస్సులో. చోటుచేసికొనుట సహజము. దానినెవ్వరు కాదనలేరు. పరిహరించలేరు. ఇనుక వాని వైరుద్ధ్యమును తొలగించి ఏకోన్ముఖతను కాని - ఏకకేంద్రతను గాని - ఏకసూత్రతను కాని కల్పింపవలయును. అట్టి విభిన్నతత్త్వములు విరుద్ధరసములమునపుడు ఈ ఏకీకృతి వైరుద్ధ్యపరిహార ప్రకారమగును

A. వైజయంతీ విలాసము - ద్వితీయాశ్వాసము 126.

రసదోషములు

విభావానుభావ సంచారులచే పరిపుష్టమై వాసనాత్మకమగు స్థాయి భావము రసముగా ప్రతీతమగుచున్నది. ఈ ప్రతీతి సామాజిక హృదయములలో కల్గుచున్నది. ప్రతీతియనుటచేతనే ఈ రసము వాచ్యముకాక వ్యంగ్యమనుభావ మేర్పడుచున్నది. ఏరసమైనను సహృదయుల కనుభూయమానము కావలెనని కేవల శబ్ద వేద్యత పనికిరాదు. విభావాది పరిపుష్టము కావలెను శృంగారాది పదములచే సామాజిక మనములలో శృంగార రసస్ఫురణము కల్గదు. తదుచితవిభావాది వర్ణనము చేతనే కల్గును - కావుననే రసము వ్యంజితము కావలయుననుట. అపుడే అది ధ్వనిపద వ్యపదేశ్యమునొంది రసధ్వని యగుచున్నది - అటు వ్యంగముగాక రసశబ్దముగాని, స్థాయిభావవ్యభిచార భావములు కాని స్వశబ్దవాచ్యములగుచో అది పమనాఖ్యదోషమని జగన్నాథాదులు వచించిరి. కాని అది పాక్షికసత్యమే - దీనినిట్లు గ్రహింపవచ్చును. విభావాది పరిపోషము లేక కేవల రసశబ్దవాచ్య మగునో నచట రసనిష్పత్తియే కల్గదు. అట్లు రసనిష్పత్తి కల్గకుండుట దోషమన జెల్లును. అంతియేకాని విభావాది పరిపోషముండి స్వశబ్దవాచ్యమైనచో రసనిష్పత్తికేమాత్రము భంగము కల్గదు. రసశబ్దము అపుడు వ్యర్థమగునేకాని దోషయుక్తము కాదు.

ఈ రసదోషములను గూర్చి మమ్మటుడు కావ్యప్రకాశమున నిట్లు వచించెను.

వ్యభిచారి రసస్థాయి భావానాం శబ్దవాచ్యతా
కష్టకల్పనయా వ్యక్తిరనుభావవిభావ యోః
ప్రతికూల విభావాది గ్రహోదీప్తిః పునః పునః
అకాండే ప్రథనచ్ఛేదౌ అఙ్గస్యాప్యతి విస్తృతిః
అంగినో ఽ ననుసంధానం ప్రకృతీనాం విపర్యయః
అనంగస్యాభిధానంచ రసేదోషాః స్యురీదృశాః

ఇవియే సాహిత్యదర్పణ కారుడును పేర్కొనెను - కాని చివర అర్థానౌచిత్యము నొకదాని నదనముగ జేర్చెను.

1. వ్యభిచారి రసస్థాయి భావనాం శబ్దవాచ్యతా

వ్యభిచారి భావములు గాని, రసముగాని, స్థాయిభావములు కాని వ్యంజితములు గావలెనేగాని స్వశబ్దములచే వాచ్యములు కారాదు. అట్లు వాచ్యములగుట దోషము. అనగా విభావాది ప్రతీతముకాకయే స్వశబ్దవాచ్యత దోషము. విభావాది ప్రతిపాదన ముండి, రసభావములు స్వశబ్దవాచ్యములగుచో దోషము కాదన్నను విప్రతిపత్తి యుండకపోవచ్చును.

2. కృష్టకల్పనయా వ్యక్తిరనుభావ విభావయోః

విభావానుభావములు కష్టకల్పనచే గుర్తింపబడుట - దీనినే జగన్నాథుడు విభావానుభావముల కృచ్ఛ్రప్రతీతియని పేర్కొనినాడు. విభావము గాని అనుభావము గాని వెంటనే స్ఫురింపకపోవుటచే రసము పరిపుష్టముకాక విలంబమేర్పడును. ఈ విలంబముచే ఆస్వాదమున కంతరాయము కల్గును. ఏకఘనమగు సంవిద్విశ్రాంతి లోపించును. ఇదియొక రసదోషము. అనగా ఇది రసనిష్పత్తిలో ఒక దోషము కవిదీనివల్ల జాగరూకుడుగా నుండదగును.

3. ప్రతికూల విభావాది గ్రహం,

ప్రతికూల రసముయొక్క విభావాదులను గ్రహించుటకూడ దోషము. శృంగారరసమున శాంతరస విభావానుభావముల గ్రహించుట దోషము. శృంగార శాంతములు విరుద్ధరసములు కదా! కాని వ్యభిచారుల విషయమున విరుద్ధరసవ్యభిచారులయ్యును బాధ్యబాధక భావముతో వ్యక్తమొనర్చిన నది దోషము కాదు.

4. దీప్తిః పునః పున,

రసమునకు పునః పునర్దీప్తి దోషము. రసము పునఃప్రకాశమానమైనచో పరిమ్లాన కుసుమమువలె లాలిత్యసౌరభ్యములను కోల్పోవును. కుమారసంభవమున రతి విలాసము ఇట్టిది.

5. అకాండే ప్రథనచ్ఛేదౌ:

కాని సమయమున రసమును ప్రకాశమొనర్చుట. వేణీసంహారమున భానుమతి తోడి దుర్యోధనుని శృంగారము. అకాండమున ప్రకాశము. అట్లే అసమయమున రసవిచ్ఛేదముకూడ దోషము.

6. అంగస్యాప్యతివిస్తృతిః

అంగరసము అంగిరసమును మించి విస్తరించిన అదియు దోషమే. హయగ్రీవ వధము. వీరమును మించిరౌద్రము వర్ణితము - రాజును మించి భృత్యుడు పరాక్రమించినట్లు.

7. అంగినోఽననుసంధానం

అంగిరసమును అనుసంధింపవలసిన స్థలమున అనుసంధింపకుండుట అంగిరసమున కుపకారకమగు అంగరసము వర్ణింపబడినను కావలసిన సమయమున అంగిరసము ననుసంధింపకుండుట యొక దోషము.

8. ప్రకృతీనాం విపర్యయః

ప్రకృతి విపర్యము కూడ దోషమే. ఈ ప్రకృతులు ముత్రివిధము. దివ్యప్రకృతి మానుషప్రకృతి. దివ్యమానుష ప్రకృతి. ఈ ప్రకృతులకనుగుణముగ వర్ణింపవలెను.

9. అనంగస్యాభిధానం చ (రసేదోషాస్స్యురీదృశాః)

అంగము కాని దానిని వర్ణించుట, అనగా అంగిరసమునకు ఉపకారకము కాని దానిని వర్ణించుట దోషము.

ఇట్లు రసదోషములు పెక్కులుండును. అన్నియు రసాస్వాదనమునకు అపకర్షకములే. ఇట్లే రసవిఘ్నములేడు కలవు. వీనివలన రసోత్పత్తి కల్గదు. దానిని విఘ్నసప్తక మందురు. ఈవిఘ్నములు కొన్ని సహృదయ కృతములు.

విఘ్నసప్తకము

రసాస్వాదనములో విఘ్నములు ఏడుకలవు. సామాజికునికి రసప్రతీతి కల్గుటకు ఏర్పడు విఘ్నము లివి. ఇతః పూర్వము చెప్పబడిన దోషములు కవికృతములు. ఇవి సహృదయకృతములు. కవి ఇతివృత్తమును ప్రతీతి యోగ్యముగ నిబంధించినను సహృదయునిలోగల లోపములచే ప్రతీతికి భంగము కల్గును. ఈ విఘ్నములు లేని యప్పుడే సహృదయునకు వీత విఘ్న ప్రతీత్యాత్మక మగు రసాస్వాదము కల్గును. ఈ విఘ్నములు ఏడని అభినవుడిట్లు వివరించెను,

విఘ్నాశ్చాస్యాం ప్రతి పత్తావ యోగ్యతా, సంభావనా విరహోనామ, స్వగతత్వ పరగతత్వ నియమేన దేశ కాలవిశేషా వేశో, నిజసుఖాది వివశీ భావః, ప్రతీత్యుపాయ వైకల్యం, స్ఫుటత్వాభావో, అప్రధానతా, సంశయయోగశ్చ.

1) ప్రతి పత్తియందయోగ్యత. ఇదియే సంభావనా విరహము. 2) స్వగతమగు దేశకాల విశేషావేశము. 3) పరగతమగు దేశకాల విశేషావేశము. 4) నిజసుఖాది వివశీభావము. 5) ప్రతీత్యుపాయ వైకల్యము. ఇదియే అస్ఫుటత్వము. 6) అప్రధానత 7) సంశయ యోగము. ఈ ఏడును విఘ్నములు. వీనినన్నిటికి విభావ ప్రవృత్త్యులే విఘ్నాప సారకములని యభినవుడు స్థూలముగ వర్ణించెను.

1. ప్రతిపత్తి యందు అయోగ్యత – సంభావనా విరహము.

రస ప్రతిపత్తియందు అయోగ్యత - ఇదియే సంభావనా విరహము. ఇది సహృదయుని పరముగా చెప్పబడినది. ఇది యొకటేగాదు. ఈ విఘ్నసప్తకమంతయు సహృదయ పరమైనదే. అందు ప్రధానమైనది సరిగా సామాజికుడు సంభావన మొనరింపలేక పోవుట ఇది సామాజికుని యసామార్థ్యమును నిరూపించును. సరిగా కావ్యార్థమును భావింపనేరని వానికి రసాస్వాదము కల్గదు. సంభావనా విరహము సామాన్యముగ ఇతివృత్తమునందలి అయోగ్యత వలన ఏర్పడును. ఇతివృత్తమునందు సహృదయుని సంభావనమున కయోగ్య మైన సన్నివేశము లుండుటచేగాని, సామాజికుని యసమర్థతచే గాని యీసంభావనా విరహ మేర్పడును. ద్వితీయ కారణమగు సామాజికుని యసమర్థత భాషాపరిజ్ఞాన విభావాది పోషణచే తొలగింప వచ్చును. ప్రథమమగు అయోగ్య సన్నివేశముచే గల్గు సంభావనా విరహము చారిత్ర ప్రసిద్ధిచేతను, లోకోత్తర నాయకనామధేయాది పరిగ్రహణము చేతను పరిహరింప వచ్చును అపుడు సామాజికులకు సంభావనా విరహ మేర్పడును. సామాన్యులకు సముద్రలంఘనాదులు వర్ణించినచో అది అసంభావ్య మగును. కాని లోకోత్తర పురుషుల పట్ల అట్టి అమానుష సన్నివేశములను వర్ణించిన సామాజికునకు సంభావనా విరహము కల్గదు.

2. స్వగతత్వ }
3. పరగతత్వ } నియమమున దేశకాల విశేషావేశము.

సామాజికుడు తనలో నున్న సుఖదుఃఖాది సంవిదాస్వాదనము చేయగడగి నచో - అవి తొలగి పోవునను భయము - వానిని కాపాడు కొనవలయు నను కాంక్ష- వాటిని దాచుకొనవలెనను వాంఛ- మొదలగునవన్నియు ప్రతి బంధకములయి మతొక సంవేదనమున కవకాశ మివ్వవు.

పరగతములను సుఖదుఃఖములగు ఆస్వాదించుచున్నను, తనయందు నియ తముగ సుఖదుఃఖాది రూపమయిన వేతొక జ్ఞానము సంభవించెడి అవకాశ ముం డును. కనుకనే ఇట్టి దోషములను తొలగించుటకే రంగమంటపాద్యలంకరణా దులు, సాధారణీ కరణము మొదలగునవి సహకరించును.

4. నిజసుఖాది వివశీ భావము.

సామాజికుడు తన సుఖదుఃఖములచే వివశీ భూతుడగుచో వస్త్వంతరమందు ఆత్మసంవిత్తును విశ్రమింపజేయలేడు. రసాస్వాద మొనరింపజాలడు. ఈ ప్రత్యూహమును పోగొట్టుటకే సాధారణీకరణము. ఈ సాధారణీకరణము ఆతోద్యగానాదులచే నుపరంజిత మగును. ఈసాధారణీకరణ మహిమచే హృదయ వైమల్యము ప్రాప్తించును.

5. ప్రతీత్యుపాయ వైకల్యము స్ఫుటత్వా భావము.

రసప్రతీత్యు పాయములు స్ఫుటముగా లేకపోయినచో సామాజికునకు రసా స్వాదము కల్గదు శబ్దములు కాని, లింగములు, చిహ్నములుకాని స్ఫుట ప్రతీతి కారులు కాదగును. అట్టి శబ్దలింగాదులు అస్ఫుటములగుచో ఆస్వాదము కల్గదు. ప్రత్యయ మెల్లప్పుడును ప్రత్యక్షోచితముగ నుండును. అనగా కనులకు ప్రత్యక్ష మైననే ఆస్వాద యోగ్యమగును. అట్లు ప్రత్యక్షీకరింప జాలని శబ్దసముదాయము, ఇతర ఉపాయ సముదాయము రసాస్వాదనమును కల్గింప జాలవు. ఈ విఘ్నాప సారణము కొరకే అభినయాదులు కల్పింపబడినవి. అభినయము ప్రత్యక్షవ్యాపార కల్పమేకదా !

6. అ ప్ర ధా న త.

అప్రధాన మైన వస్తువునందు ఎవరి మనస్సును లగ్నము కాదు. ప్రాధాన్య ముకల ఇతర వస్తువువైపు మనస్సు సంచరించును. కావుననే జడమగు విభావాను భావ వ్యభిచారి వర్గమంతయు అన్యముఖ సంప్రేక్షణ మగును. ఈ వర్గమంతయు

స్థాయి వైపు సంచరించును. కావున విభావాది వర్గము ప్రధానము- స్థాయిభావము ప్రాధాన్యము వహించినది అదియే చర్వణాపాత్ర మైనది.

7. సంశయ యోగము.

విభానుభావ వ్యభిచారులు ఈ రసమున కివియవి నియతములు గావు. సర్వ రసములకు సామాన్యములు ఒక్క వ్యాఘ్రమే ఒక్కొక్కచో క్రోధమునకు, ఒక్కొక్కచో భయమునకు విభావమగును. బాష్పము ఆనందము వలన, దుఃఖము వలన కూడ కల్గును ఇట్లే శ్రమ, చింత మున్నగు వ్యభిచారి భావములు ఉత్సాహ మునందును భయమునందు కల్గును. కావున వీనికి నియతిలేదు. ఈ అనియతిచే సంశయమేర్పడును. ఈ సంశయము తీరుటకే విభావానుభావ వ్యభిచారిభావముల సంయోగము గ్రహింపబడినది. వీనిసమాహారముచే శంక నివర్తిల్లును. అపుడవి ఏకవ్యంజకములగును.

ఆంధ్రుల వరివస్య

సంస్కృతము

అలంకార శాస్త్రవిషయమున కాశ్మీరదేశము తరువాత పేర్కొనదగినది ఆంధ్రదేశము. కావుననే ఆంధ్రేతరుడైన - అప్పయదీక్షితులు తెలుగునేలపై పుట్టుట, తెలుగుభాష మాట్లాడుట సామాన్యతపస్సుచే సాధింపరానివని అసూయ పడినాడు. "ఆంధ్రత్వ మాంధ్రభాషా చ నాల్పస్యతపసః ఫలమ్". పూర్వమునుండియు ఆంధ్ర దేశము వివిధరంగములలో తన ప్రత్యేకతను నిలబెట్టుకొనుచున్నది. సుస్వరముగ వేదోచ్చారణ విషయమున భారతజాతియంతయు నేటికిని ఆంధ్రులకు దాసోహమనియే అనును. వీరు కేవలము చిలుకపలుకలవలె వేదములను వల్లించుటయందే గాక సార్థముగ సాంగాధ్యయనమొనర్చుట యందును ప్రసిద్ధులు. వేదములకు భాష్య ప్రణేతయయిన విద్యారణ్యులు తెలుగు దేశీయుడే. నేటికిని విద్యారణ్యభాష్యము వేదములకు విలువైన భాష్యముగ పరిగణింపబడు చున్నది. ఉంచియాగక సూత్ర కర్తయైన ఆపస్తంబుడును ఆంధ్రుడగుట గర్వింపదగిన విషయము. ఇట్లు వైదిక విభాగమునందే గాక శాస్త్రవిభాగమందును ఆంధ్రులు పురోభాగిత్వమునే వహించిరి. వ్యాకరణమున శబ్దేందుశేఖరమును రచించిన నాగేశభట్టు, తర్కసంగ్రహమునకు న్యాయబోధిని వ్యాఖ్యరచియించిన ఉన్నంభట్టు, ఆంధ్రదేశఖ్యాతి ఇటీవలి కాలమున వ్యాకరణసాహిత్యశాస్త్రములలో ఇనుమడింపజేసిన తాతాసుబ్బరాయశాస్త్రిగారు నాంధ్రులే. ఇట్లు ఆంధ్రులు వేదశాస్త్రరంగములలో విఖ్యాతులైరి.

తెలుగు వారు రసికమునకు పేరగాంచిరి. గాథాసప్తశతి పుట్టిన నేలయిది. ఈ గాథాసప్తశతి నాటి సాంఘిక జీవనమునకు దర్పణప్రాయమైనది. అందలి ఒక్కొక్క శ్లోకము ఒక్కొక్క ధ్వని కావ్యము శ్లోకము చిన్నదయ్యును దాని వెనుక నుండి అనంతమైన భావము తొంగిచూచు చుండును. ఆనందవర్ధనుని ధ్వన్యాలోకమునకు లక్ష్యభూతమైనది గాథాసప్తశతి. తెలుగు నేలనేలిన రాజులు సయితము నీ గాథాసప్తశతియెడల మిగుల నాదరము ప్రకటించుచు వచ్చిరి. పెదకోమటి వేమభూపాలుడు గాథాసప్తశతీ సారము అను పేరిట 100రసగుళికల వంటి గాథలను తీసికొని సంస్కృతమున వ్యాఖ్య వ్రాసినాడు. రాజ్యపాలన మొనర్చుచు సాహిత్య ద్రష్టగా ప్రసిద్ధిచెందినవాడు కోమటి వేముడు. అతని రాజ్యములోని ప్రజలు సైతము అంతటి రసికత కలవారే.

వీరభద్రానుజుడైన వేమభూపాలుడు దానమిచ్చిన అగ్రహారములలోని భూసురులు నిర్మలధర్మకర్మ దీక్షా పరతంత్రులు మాత్రమే కాదు. వెండియు, పైడియు

వారి యిండ్ల తడబడుచున్నవి. వారు ధార్మికప్రవర్తనులయ్యును రసజ్ఞులు, సౌందర్యారాధకులునై యుండెడి వారట. దర్భలు ధరించిన వ్రేళ్ళకు రత్నాంగుళీకములు ధరించి వారట.

ధరియింప నేర్చిరి దర్భ పెట్టెడు వ్రేళ్ల
లీలమాణిక్యాంగుళీయకములఁ
గల్పింప నేర్చిరి గంగమట్టియ మీఁదఁ
గస్తూరికా పుండ్రకములు నొసల
సవరింప నేర్చిరి జన్నిదంబుల ప్రోలఁ
దారహారములు ముత్యాల సరులు
చెరువంగ నేర్చిరి శిఖల నెన్నడుములఁ
గమ్మని క్రొత్త చెంగల్వ విరులు

ధామముల వెండియును బైఁడి తడఁబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారముల యందు
వేమభూపాలు డనుజన్ము వీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీతటము నందు [1]

చరిత్ర పరికించినచో కృష్ణరాయలు మిగుల రసజ్ఞుడని చెప్పనవసరములేదు. పండితరాయలు రసస్రష్ట, రసద్రష్టయై యావద్భారత ఖ్యాతి నార్జించినాడు. ఇట్లు ఆంధ్రులు వేదశాస్త్రరంగములందును, సాహిత్య సామ్రాజ్యము నందును ఎనలేని ఖ్యాతి నార్జించినారు.

ఇచట వారి ప్రత్యేకతగా నొక విషయమును ప్రస్తావించుట అసమంజసము కానేరదు. భారతీయ సాహిత్య ప్రస్థానములలో రససిద్ధాంతము ప్రథమము అగ్రసరము నైనది. ఎన్ని ఇతర సిద్ధాంతములు వెలువడినను రససిద్ధాంతమునకు క్షతి లేదు.

1. భీమేశ్వర పురాణము - శ్రీనాథుడు - 1 - 41.

అన్ని సిద్ధాంతములును రససిద్ధాంతము ముందు సూర్యుని ముందు దివిటీల వలె నుండును. ఈ యభిప్రాయమును ఆంధ్రులే పోషించినట్లు కన్పట్టును. ఎన్ని ఇతర ప్రస్థానములు తరువాత పొడమూపినను ఆంధ్రులెవరును వాని నాదరింపలేదు. రసవిషయకమైన ప్రత్యేక గ్రంథములు సంస్కృతమున వెలసినట్లు తెలుగున సయితము ప్రత్యేక ప్రతిపత్తిగల గ్రంథములు వెలువడినవి. ఇతర ప్రస్థానముల కిట్టి గౌరవము దక్కలేదు. అవి యంతటి పదవి నధిరోహింపలేక పోయినవి. ఆది కవి యైన నన్నయ చింతామణి యందు "సాభ్యోగ్రారసో యథాతథం కవిభిః" అని రసప్రాధాన్య సూక్తమును తెలుగు సాహిత్య యుగోదయ కాలమందే గానమొనర్చి నాడు ఈ పంక్తిని తరువాతి సాహితీద్రష్టలు, సాహితీ స్రష్టలును అక్షరముల పాటించిరి.

మరియు ఆంధ్రులు రసములలో శృంగారమునకు ప్రాధాన్య మిచ్చిరి. రసికతా ముద్రకు శృంగారమే ఆలవాల మయినది. సాహితీస్రష్టలు తమ గ్రంథములకు నామకరణ మొనరించు సందర్భములందు సయితము మరువక తమ గ్రంథములకు శృంగార పదవ్య పదిష్టము లొనర్చిరి. శృంగార నైషధము శృంగార శాకుంతలము మొదలగునవిట్టివి. మహాకవులే గాక వారి సాహిత్యములోని సారమును ప్రకటించు లాక్షణికులు సయితము శృంగారమఞ్జరి, శృంగార రసాల వాలము మున్నగు నామములను తమ గ్రంథములకు పెట్టికొనిరి. ఈ ప్రాధాన్యమును ప్రాచీనులలో ఆనంద వర్ధనుడే గుర్తించినాడు.

"శృంగారీ చేత్కవిః కావ్యే జాతం రసమయం జగత్"

అనుటలోని ఆనందవర్ధనుని ఆశయము దాని ప్రాధాన్యతను సూచించుటయే అనదగును. అతడు వ్యంగ్యమర్యాదతో నట్లు చెప్పగా చమత్కార చంద్రికలో శృంగారము రసరాజమని ఎలుగెత్తి చాటినాడు.

మధురః సర్వ సమ్మతత్వా త్తిక్తాదిషు రసేష్వివ
హాస్యాదిషు సశృంగారో రస సామ్రాజ్య మర్హతి [1]

1. చమత్కార చంద్రిక - 5 - 6.

అన్ని రుచులలోను మాధుర్యము ప్రధానమని నెలిపినట్లు సర్వరసములందు శృంగారము నేతృత్వము వహించును. ఇది సర్వసమ్మతమని కూడా అందరి విషయమున నేతృత్వమును వహించినాడు విశ్వేశ్వరుడు.

ఇట్లు ఆంధ్రులందరును, రససిద్ధాంతము రసరాజమైన శృంగారమును సరస రీతి నాదరించిరి.

వే ద ప్రా మా ణ్య ము .-

భారతీయ సంస్కృతికి సంప్రదాయమునకు బీజ ప్రాయ మైనవి వేదములు. వాని ప్రభావము వేదాంగముల పై నేగాక సర్వశాస్త్రములపై నయితము పడినది. వేద ప్రామాణ్యము సంతరించుకొనని శాస్త్రము శాస్త్రముగా పరిగణింప బడదు. అందును అలంకార శాస్త్రము మొదట నుండి శాస్త్రత్వ సంపాదనమునకై చాలా పాటు బడ జొచ్చినది. ఈ విషయమున రాజశేఖరుడు చాలా శ్రమించినాడు.

అందు రస సిద్ధాంతమునకు నయితము వేదాంత శాస్త్రాను గుణ్యమును, వేదప్రామాణ్యమును సంఘటింప జేసిన వారు ఆంధ్రులే. రసము అలౌకికమని మాత్రమే పూర్వులు వచింపగా దానికి శ్రుతి ప్రామాణ్యమును విశ్వేశ్వరుడు పరోక్షముగా ఘటించినాడు. "సవై రస ఇతి ప్రోక్తః" అని చమత్కార చంద్రికలో పేర్కొనినాడు. దీనికి ధర్మసూరి సాహిత్య రత్నాకరమున ప్రత్యక్షముగ శ్రుతి ప్రామాణ్యము నిట్లు కల్పించినాడు.

"తస్య బ్రహ్మానంద రూపత్వ ముక్తం భవతి "రసో వై సః" ఇతి శ్రుతేః".

దీనినే జగన్నాథుడును అనుసరించినాడు. రససిద్ధాంతమునకు వేదప్రామాణ్యము సంఘటించిన ఖ్యాతి ఆంధ్రులకే దక్కినది. సాహిత్యరత్నాకరమున ధర్మసూరి వేదములందలి రసస్ఫోరకము లైన ఋక్కులనుదాహరించినాడు. ధర్మసూరి వేదాధ్యయన మొనర్చినవాడు. ఆలంకారికులలో వేదాధ్యయన మొనర్చి చారిత్రకదృష్టి కలవారరుదు. రసములకు మూలభూతము లైన లక్ష్యములు వేదములందే కలవని ప్రదర్శించినాడు.

ఇచ్చట మరొక ముఖ్యవిషయము. భారతీయాలంకారికు లందరు వైదిక మతానుయాయులే. కాని ఆంధ్రుడైన "అక్బర్‌షా" మహమ్మదీయ మతావలం

బడుడు అతడు శృంగార మంజరియను రస సిద్ధాంత ప్రవచనాత్మక మైన గ్రంథ మును వ్రాసినాడు.

రససిద్ధాంతము సార్వదేశికము, సార్వ కాలికమే కాక సర్వమతాంగీకృత మనియు దీనివలన తెలియును. ఇట్లే సిద్ధాంతఖ్యాతి విగమడింప జేసిన విఖ్యాతి సయితము ఆంధ్రులకే దక్కినది.

రససిద్ధాంతము భరతునితో ప్రారంభమై శాఖోపశాఖలుగా విస్తరిల్లినది. అట్టి సిద్ధాంత పీయూషమంతయు ఒక్కగుక్కలో ఆపోశనము పట్టిన ఖ్యాతి రస గంగాధర కర్తయైన జగన్నాథునకు సిద్ధించినది. అతడు రససిద్ధాంతమునకు తల మానికమైన గ్రంథమును వ్రాసిన తరువాత మరెవ్వరు రసమును గూర్చి ప్రస్తావింప లేదు. ప్రస్తావించు అవసరము లేకపోయినది. కీర్తికండూతిచే నొకరిద్దరు స్పృశించినను అవి సూర్యుని ముందు దివిటీలే కావున రససిద్ధాంత విషయమై ప్రత్యేకముగ సర్వోత్తమమైన గ్రంథమును ఆంధ్రుడే రచించిరని చెప్పనొప్పును. ఆంధ్రులకు రససిద్ధాంతముపై గల మక్కువ, అధికారములు నట్టివి.

ఆంతరంగికములు.

భారతీయాలంకారికులలో ప్రసిద్ధులందరు రసముల నిష్పత్తి విషయమై పానక రసన్యాయమునే ఆదరించిరి. కాని ఆంధ్రులు నవనీత సాదృశ్యము నిచ్చిరి. వెన్నముద్దను పాకవిధిచే ఘృతత్వము కలిగినట్లుగా స్థాయిభావములకు సంచార్యాది భావముల పరిపోషణముచే రసత్వము సిద్ధించుననినారు. ఈ యుపమానము మరింత హృద్యమని వేఱుగ వచింప నవసరము లేదు కదా!

కావ్యములో ఋతువర్ణనములు ఉద్దీపన విభావములుగా ఉపయుక్తములు. అందరు ఋతువర్ణనములే చెప్పిరికాని సాహిత్య చింతామణి కర్తయైన పెదకోమటి వేమ భూపాలుడు ఋతుక్రీడలను సయితము సరస హృదయంగమముగా వివరించినాడు.

ఇట్లు ఆంధ్రులు రసవిషయమున సైద్ధాంతికముగ తమ ప్రత్యేకతలను నిల్పు కొనిరి

విద్యానాథుడు - ప్రతాపరుద్ర యశోభూషణము

ఇతడు ప్రతాపరుద్రుని యాస్థానమున వెలసిన వాడు. ఇతనిని గూర్చి ప్రత్యేకముగ నేమియు తెలియవచ్చుట లేదు. ప్రతాపరుద్రునికే తన గ్రంథము

నంకిత మొనర్చి నాయక ప్రాధాన్యమును తన గ్రంథము ప్రపంచించినవా డీతడు. కాకతీయ చక్రవర్తులలో నీ ప్రతాపరుద్రు డేడవవాడు. ఇతడు రుద్రాంబయొక్క దౌహిత్రుడు. లభ్యమైన ఆధారములను బట్టి ప్రతాపరుద్రుడు 13 వ శతాబ్ది చివర భాగమునను 14 వ శతాబ్ది మొదటి భాగమునను రాజ్యపాలన మొనర్చినాడని తెలియుచున్నది. 1323 లో మహమ్మద్ తుగ్లక్ సేనలచే నీతడు పట్టుబడెను. అందుచేత ప్రతాపరుద్ర యశోభూషణము 14 వ శతాబ్ది ప్రారంభమున రచింపబడి యుండవలెనని P. V. కాణే మహాశయుడు వచించినాడు.

సమాహార గ్రంథము :

సాహిత్యశాస్త్రము తొలుత నుండియు విభిన్న ప్రస్థానములను ప్రతిపాదించుచు విస్తరిల్లినది. క్షేమేంద్రుని యౌచిత్య ప్రస్థానముతో అంతరించిన దీ విస్తరణము - తర్వాత నూతన ప్రస్థానము లేవియు ప్రతిపాదింప బడలేదు. ప్రతిపాదితములైన ప్రస్థానము లన్నియు రససిద్ధాంత పరిపోషకములుగనే వెలువడినవి. అయ్యు తత్తద్విశేషములను విపులీకరించునవై స్వాతంత్ర్యమును ప్రకటించు కొనినవి. మమ్మటుని కావ్యప్రకాశముతో నూత్నరీతి సంకలన గ్రంథములు వెలువడ జొచ్చినవి. అటనుండి వెలువడిన గ్రంథములెవ్వియును నూత్నసిద్ధాంతమును ప్రతిపాదించినవికావు. పూర్వులు ప్రతిపాదించిన ప్రస్థానముల సారమునంతయును సూక్ష్మ రూపమున సాకల్యముగ వివరింప దొడగినవి. అంతవరకు వెలువడిన సిద్ధాంతముల నన్నిటిని ఏకత్రసంకలన మొనర్చుటే వారి యుద్దేశము అట్టి గ్రంథసముదాయమునకు నాద్యమైనది కావ్యప్రకాశము. దాని యడుగుజాడలలో మరింత విస్తృతముగ రచితమైనది సాహిత్యదర్పణము ఆంధ్రదేశమున నట్టి గ్రంథము ప్రతాపరుద్ర యశోభూషణము. తెలుగునాట వెలువడిన మొదటి సమాహార గ్రంథమిదియని చెప్పనొప్పును. అర్వాచీన కాలమున దీని నాదర్శముగ గొని పలుగ్రంథములు వెలువడుటయు దీని ప్రాశస్త్యమునకు పోషకముగ నున్నది. నాటక లక్షణములు ఇందు ప్రత్యేకముగ వివరింపబడుటయు నీ యభిప్రాయమున కుపబలకముగ నున్నది.

రచనా ప్రణాళిక :

ప్రతాపరుద్ర యశోభూషణము 9ప్రకరణములుగా విభజింప బడినది. ముందు ఉపోద్ఘాతము కలదు. ప్రథమమున నిష్టదేవతా నమస్కారమొనర్చిన తరువాత సుకవి పురస్కారమును కూడ పొందుపరచినాడు. పూర్వులైన భామహాదులకు సాదర

ప్రణామముల నర్పించి యలంకారశాస్త్ర రచనమునకు గడంగినాడు. పూర్వకవిస్తుతి తెలుగు కవుల సంప్రదాయమును ముఖ్యముగా సూచించును. తరువాత తన గ్రంథము నందు వివరింపబడిన విషయములను సూచనామాత్రముగ తెల్పినాడు. అందు [1] రసప్రాధాన్యమును సయుక్తముగ్గడించినాడు. ఈ శాస్త్రమంతయు సోదాహరణముగ నిరూపించిననే గాని సహృదయ హృదయంగమము కాజాలదు. అట్లుదాహరించుటకు తగిన నాయకుని నెన్నుకొన దగును. కావున పుణ్యశ్లోకుడైన వాని చరిత్ర యుదాహరింప తగును. అట్టి నాయకుడు ఎవడును పూర్వులచే ప్రబంధాదరణీకృతుడు కాలేదు. పూర్వగ్రంథము లన్నియు ఏయొక్క నాయకుని ప్రధానముగా చేసికొని యుదాహరింప బడినవి కావు. ఈ గ్రంథమట్టిదికాక పుణ్యశ్లోకుడైన ప్రతాపరుద్రుని గుణములను నిరూపించుచు నుదాహరణముల నొసగును. [2] ప్రబంధముల యొక్కయు ప్రబంధకర్తలయొక్కయు కీర్తి ప్రతిష్ఠలకు అందు వర్ణింపబడిన నాయకుని గుణ నిరూపణమే కారణము. రామాయణము నందు రాముని వర్ణనమే వాల్మీకికి ప్రసిద్ధినాపాదించినది. కావ్యములేగాక శాస్త్రములు సయితమట్టివే వేదాంతము బ్రహ్మప్రతిపాదికము కావుననే పరమోత్కృష్టముగా పరిగణింపబడుచున్నది. కావున ప్రబంధరాశికి మహాపురుష గుణవర్ణనము పసిడికి పరిమళ మబ్బినట్లే యుండును. ప్రతాపరుద్రుని గుణముల నాశ్రయించుకొని నిర్మింపబడిన యీ గ్రంథము సహృదయులకు కర్ణోత్సవమగును గాక యని ఆశించినాడు. నాయకగుణ నిరూపణముచే గ్రంథమునకు కీర్తిప్రతిష్ఠలు కల్గుననుటకు వృద్ధసమ్మతి సయితము దాహరించినాడు. వారిలో దండిభామహ ఉద్భట రుద్రభట్ట భోజరాజులను సాహిత్య మీమాంసను పేర్కొనినాడు. ఇట్లు ఉపోద్ఘాతమును సమాప్త మొనర్చి నాయక ప్రకరణమును ప్రారంభించినాడు. ఈ యుపోద్ఘాతమున తన గ్రంథముయొక్క ప్రాశస్త్యము వైలక్షణ్యములను స్పష్టపరచినాడు

---

[1] రసప్రధానాశ్శబ్దార్థ గుణాలంకార వృత్తయ ః
రీతయశ్చేయతీశాస్త్రప్రమేయం కావ్యపద్ధతిః

(ప్ర. రు. 1-4)

[2] ప్రబంధానాం ప్రబంధౄణామపికీర్తి ప్రతిష్ఠయో ః
మూలం విషయభూతస్య నేతుర్గుణనిరూపణమ్ ॥

(ప్ర. రు. 1-7)

నా య క ప్ర క ర ణ ము :

నాయకు నాశ్రయించియే గ్రంథవైలక్షణ్యము స్ఫుటీకరింప బడుటచే సముచితముగ నున్నది. నాయక గుణములు నాయక విశేషములు (ధీరోదాత్తాదులు) శృంగార నాయకులు, శృంగార నాయికలు ముగ్దాది నాయికాత్రియము సోదాహరణముగ నిందు వర్ణితములు.

కా వ్య ప్ర క ర ణ ము :

మొట్టమొదట కావ్యస్వరూపమును నిరూపించినాడు. తరువాత శబ్దవృత్తులను ప్రపంచించినాడు. అభిధా లక్షణములను వ్యంజనావృత్తిని (అందు శబ్దార్థోభయ మూలకత్వములను) సోదాహరణముగ నిరూపించి కైశిక్యాది వృత్తులను రససందర్భములతో నుదాహరించినాడు. శృంగార కరుణము లత్యంత సుకుమారము లగుటచే కైశికీవృత్తియు, రౌద్రబీభత్సముల యెడ ఆరభటీ వృత్తియు వీరభయానకముల పట్ల సాత్వతియు నిర్వహింపదగును. హాస్యశాంతాద్భుతములయెడ భారతీ వృత్తియు నిర్వహింపదగును. రీతులు, శయ్య, ద్రాక్షాది పాకములు సోదాహరణముగ ప్రపంచితములు. తరువాత కావ్య విశేషములు ప్రస్తావితములు. వ్యంగ్యప్రాధాన్య అప్రాధాన్య, అస్ఫుటత్వములచే త్రివిధములైన కావ్యములను పేర్కొనినాడు. ఉత్తమకావ్యము ధ్వని కావ్యమనియు, మధ్యమకావ్యము గుణీభూత వ్యంగ్యమనియు, అథమ కావ్యము చిత్రకావ్యమనియు సోదాహరణముగ వివరించినాడు. ఈ విషయమున జగన్నాథుడు మరొక సోపాన మధిరోహించి ఉత్తమోత్తమ కావ్య విభజన మొనర్చినాడు. కావ్య విభాగములు నాల్గు నొనరించినాడు. ధ్వని విశేషములను వివరించినాడు. శుద్ధభేదములు 51 అని పేర్కొని కొన్నింటి కుదాహరణములు రచించినాడు. మొత్తము ధ్వని బేదములు 1305 గా నీతడు పేర్కొనినాడు. గుణీభూత వ్యంగ్యము నందలి అష్టవిధత్వమును సోదాహరణముగ ప్రపంచించినాడు. మహాకావ్య, ఉపకావ్యాది భేదములను వివరించినాడు.

నా ట క ప్ర క ర ణ ము :

ఈ గ్రంథవైశిష్ట్యమునకు కారణభూతమైన యంగములలో నీ ప్రకరణ రచన మొకటి. నాటకము రసాశ్రయ మనియు, చతుర్విధాభినయ ప్రధానమనియు, వచించి నృత్త నృత్య నాట్యముల భేదమును సూక్ష్మరూపమున పేర్కొనినాడు.

వస్తునాయక వైవిధ్యములచే నేర్పడు దశరూపకములను రససహితముగ నుట్టంకించి నాడు. సంధి పంచకము, తదంగములు తత్ప్రయోజనములు, అర్థోపక్షేపకములు, ఆముఖస్వరూపము, రచింపబడినది. పూర్వగ్రంథములందు గాని యర్వాచీన గ్రంథములందుగాని యట్టి నాటకముమ (ఉదాహరణముగా) రచించినట్లు కన్పట్టదు. ఇతడు నాటకమున కుదాహరణముగ నాటక లక్షణములను సమన్వయ పరచుచు ప్రతాపరుద్ర కల్యాణమను సాంగమైన యైదంకముల నాటకమును రచించినాడు. ఈ నాటకము అనేక చారిత్రాంశములకును, తద్వ్యాఖ్యాన మనేక నాట్యశాస్త్ర విశేషములకును తావలమై యొప్పుచున్నది.

రస ప్రకరణము: } ఇది ప్రత్యేకముగ విమృష్టము.
దోష ప్రకరణము: }

కావ్య జీవితభూతమైన రసమును నిరూపించిన తరువాత తదుపస్కారముక లైన గుణములను నిరూపించుచు ముందు తద్వివేకమునకై దోషములను తెల్పినాడు. శబ్దగత, అర్థగత దోషములు, శబ్దగతములలో పద, వాక్యగతములు సోదాహరణ ముగ వివరింపబడినవి. ఇతడు రసదోషములను పేర్కొనలేదు.

గుణ ప్రకరణము;

గుణలక్షణమును నిరూపించి గుణభేదపరిగణమున భోజుని మతము నవలంబించినాడు. 24 గుణములను సోదాహరణముగ వివరించినాడు.

శబ్దాలంకార ప్రకరణము:

అలంకార ప్రకరణ మీ గ్రంథమునందు విశిష్టమైనది. అలంకారముల కొర కీతడు 3 ప్రకరణములను ప్రత్యేకించినాడు. శబ్దాలంకారములు. అర్థాలంకార ములు, మిశ్రాలంకారములునని విభజించినాడు,

గ్రంథ ప్రాచుర్యము;

ఆంధ్రదేశమున వెలువడిన యలంకార శాస్త్ర గ్రంథములలో మొదటిది ప్రతాపరుద్ర యశోభూషణము. 13 వ శతాబ్దమున నిది రచింపబడినది. అప్పటి నుండి అవిచ్ఛిన్నముగ ఆంధ్రదేశము నందంతటను పఠనపాఠన ప్రాచుర్యము

నంది యున్నది. అతః పూర్వులు అంధ్రము కావ్యప్రకాశమును పఠించుచుండి యుందురు. తెలుగు దేశమున నెంత తక్కువ సాహిత్యపరిచయమున్నవాడైనను ప్రతాపరుద్ర యశోభూషణమును చదివియే యుండును. సంస్కృతమందలి అలంకారశాస్త్ర సంప్రదాయము లన్నియును అందు ప్రస్తావింపబడి యున్నవి. అలంకార శాస్త్ర పఠనమునకు నాందీప్రాయమైనది ప్రతాపరుద్ర యశోభూషణ పఠనము. సాహిత్య వటువునకి ఉపనయన భూతమైనది, కావున చాలమంది తెలుగు వారికిది విశ్యసారన భాజన మైనది. కుమారస్వామి రచించిన రత్నాపణ వ్యాఖ్యతోసహా ప్రతాపరుద్రీయ మంతయు కంఠస్థమై పారమొనరించు పండితులు నేటికిని తెలుగు దేశమున నుండుటయు నేతద్గ్రంథ ప్రాచుర్యమును భంగ్యంతరమున చాటుచున్నది. ప్రాథమికలైమైన యలంకార విషయమంతయు క్రోడీకరింపబడుటయే తత్ప్రాచుర్య హేతువు.

రస ప్రతిపత్తి :-

రస ప్రకరణారంభమున విద్యానాథుడు రసప్రాధాన్యము నుగ్గడించినాడు సర్వ ప్రబంధములకు జీవిత భూతమైనది రసమనియు, తత్స్వరూపము నిరూపింప బడుచున్నదనియు వచించినాడు. రసనిర్వచనము విషయమున కావ్య ప్రకాశ లక్షణ మును, దశరూపక లక్షణమును స్వీకరించినాడు రసనిష్పత్తిలో ప్రధాన స్థాన మాక్రమించునది స్థాయి భావముగనుక దశరూపకోక్తమైన స్థాయి భావ లక్షణమును వివరించినాడు. రస సంఖ్యా విషయమున బహుజన సమ్మతమైన నవరసములనే యంగీకరించినాడు. విభావానుభావ లక్షణములను, సాత్త్వీక భావముల లక్షణమును వృద్ధ సమ్మతి పూర్వకముగ వివరించినాడు.

ఇతడు నాయక ప్రాధాన్యమును సూచించినవాడు. శృంగారమునకు, వీరము నకు, రౌద్రమునకు, అద్భుతమునకు, లోకోత్తర నాయకాశ్రయత్వముచే పరిపోషి తిశయము కల్గును. అందులకే శృంగార విషయమున మ్లేచ్ఛాలంబనము ఆభాస మగునని శృంగార తిలకము నందలి "ఏకత్రైవా నురాగశ్చే" దిత్యాదిశ్లోకము మదా హరించినాడు. భావోదయ భావసంధి, భావశబలతలు వివరింప బడినవి. తొమ్మిది స్థాయిభావముల లక్షణములు సోదాహరణముగ వివరింపబడినవి.

విభావాను భావముల లక్షణములు, సాత్త్వీక వ్యభిచారి భావముల లక్షణములు లక్ష్యపురస్సరముగ వివరింపబడినవి. శృంగార చేష్టలు పదునెనిమిది, విప్రలంభ మున చతుర్విధ భేదములు రససంకరములు వివరింప బడినవి.

రసనిష్పత్తి విషయమున నితడు కొంత చర్చగావించి యున్నాడు. పూర్వులు వచించిన రససిద్ధాంతము నీచర్చ క్రోడీకరించు చున్నది. కావున నిటప్రసక్తము

రస నిష్పత్తి.

రస ప్రాదుర్భావము భావముల నుండి జరుగును. ఈ భావములు గుణాలంకారాది పరికరయుతములై యుద్బుద్ధములగును. అవి రసత్వమును పొందును. రసత్వము పొందినంతనే విగళిత వేద్యాంతరమగును అనగా ఇతరమేదియు తోచదు. బ్రహ్మానంద సబ్రహ్మచారి యగు ఆనందము అనుభవింప బడుచుండును. స్థాయిభావములు వాసనాప్రాప్తములు, లౌకికములు కావున సుఖదుఃఖ సమ్మిశ్రితములు. దుఃఖాత్మకములైన భావములు కూడ రసత్వసిద్ధిని పొందినంతనే అమందానందరూపము లగును. స్థాయి భావములకును రసములకును గల భేదమిదియే.

పదార్థములు వాక్యార్థమందు విశ్రాంతమయినట్లుగా విభావాదులు భావసముదాయము సర్వమును రసమునందు పర్యవసించును. (ఇచట విశ్రాంతి పదము ఆనంద పర్యాయముగ సయితము ప్రయుక్తము. భావములు క్రమక్రమ పరిపుష్టములై రసీభావము నొందును. తంతువులన్నియు కలసి పటమయినట్లుగా భావసముదాయ మంతయు పరిపుష్టమై రసీభావము నొందును.

ఈ భావములు (సంచారులు) సాగరమున తరంగముల వంటివి. స్థాయి సముద్రము వంటిది. (తదుత్థితమైన అమృతము వంటిది రసము). ఈరసము లోకమునందు అనుకార్యుని యందును, కావ్యనాటకముల యందు సామాజికుని యందును ఉండును.

ఇట్లు రస నిష్పత్తి విషయమునంతయు ఈ క్రింది మూడు శ్లోకములలో వచించినాడు.

1. గుణాలంకార శ్రీకృత పరికరో భావవిభవ
స్స్ఫుట్రా ప్రాదుర్భావః క్రమగళిత వేద్యాంతరమతిః
సుఖంవా దుఃఖంవా నిబిడయతు యూనోస్సహృదయే
త్వమందానందాత్మా పరిణమతి పూర్ణో రసభరః॥

2. రసో వాక్యార్థస్సన్ విలసతి పదార్థాః పునరమీ
విభావాద్యా యస్మిన్నిల దధతి విశ్రాంతిముచితామ్
అతోభావా ఏవ క్రమసముదితానోన్యవిభవాః
రసీభావం బిభ్రత్యథచ పటతాం తంతవఇవ

3. భావే స్థాయిని వర్ధమానవిభవే రత్యాదికే సింధువ
త్కల్లోలా ఇవ సంభవన్తి విలయంచాయాన్తిభావా ముహుః
నిర్వేదాద్యుపభోగ భావిత నిజస్వాదాతిరేకో రసో
లోకే స్యాదనుకార్య ఏవ కథితో నాట్యేతు సామాజికే.

ప్రసన్నత :-

ప్రతాపరుద్ర యశోభూషణమునకు దక్షిణ దేశమున ప్రచుర ప్రచారము కల్గుటకు మరియొక కారణము దాని రచన యందలి ప్రసన్నత. శ్లోకము రసానుగుణమగు రచనా విధానముతో రంజిల్లుటేగాక నన్నయ రచనలోని ప్రధాన గుణమగు ప్రసన్నతను పుణికి పుచ్చుకొనినది. సరళ పద ప్రయోగముతో పాఠకుల మనస్సులకు ఝటితి స్ఫూర్తి కల్గించును. రతియను స్థాయిభావమున కుదాహరించిన శ్లోకమును చూడుడు.

శృంగారైకరసః స్మరోఽస్తు జగదానందైక నిష్యంద భూ
రిందుస్తిష్ఠతు విభ్రమైక వసతిర్జాగర్తు పుష్పాకరః
సంత్వన్యేపి గుణప్రసాదితదిశఃకిం తైరశేషోన్నతో
జాతః కాకతివల్లభో మమపతిః కామస్య కామోత్సవః॥

(ప్ర. రు. 4. 10)

శృంగార కరుణముల కనుకూలమైన కైశికీవృత్తి నుదాహరించిన శ్లోకమును గూడ విచట ప్రస్తావించవచ్చును.

జితమదనవిలాసం కాకతీయాన్వయేందుం
నరపతి మనిమేషం ద్రష్టుమాశంసనీనామ్

సపది విరచితాసీ దంగనానా మపాంగై:
దివి కువలయదామ శ్యామలా తోరణశ్రీః॥

(ప్ర. రు. 2 - 19)

లౌ కి కా లౌ కి క ర స ము లు :-

రసచర్చ గావించిన యాలంకారికులు చాలామంది రసమలౌకిక మనియే నిర్వచించిరి. ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు మున్నగు ప్రాచీనులే గాక జగన్నాథుడు మున్నగు నర్వాచీనులును రస మలౌకికమనియే వచించి యున్నారు. కాని విద్యానాథుడు మాత్రము రసము అలౌకికము లౌకికమునని ద్వైవిధ్యమును సూచించెను. ఇట్లు ఇట్టి లౌకికరసమును వచించినవారు ఇతరాలంకారికులు కన్పట్టరు. విద్యానాథుని దృష్టిలో లౌకిక జీవనమున మానవుడనుభవించు ఆనందము లౌకికరసము. కావ్య నాటకములవలన సామాజికు డనుభవించు ఆనందము అలౌకికరసము. ఈ భావ ముల నాతడీ క్రింది పంక్తులలో సూచించినాడు.

"అత్ర రసో నాయకాశ్రయ ఏవ...."

(ప్ర. రు. 4. 242)

రసము నాయకాశ్రయమే. ఈ భావము భట్టలోల్లటుని సిద్ధాంతమునకు ప్రతిబింబమువలె కన్పట్టు చున్నది. కాని అది సరికాదు. తరువాత ఇతడే ఇట్లు చెప్పినాడు.

నిర్వేదాద్యుప భోగభావిత నిజాస్వాదాతిరేకోరసో,
లోకేస్వాదను కార్య ఏవ కథితో నాట్యేతు సామాజికే॥

నిర్వేదాద్యుపభోగముచే భావితమై యాస్వాద రూపమైన రసము లోకమందు అనుకార్య గతమని వచింప బడినది. అదియే నాట్యమందు అనగా కావ్యనాటకము లందు సామాజిక గతమై యుండును.

ఇట్లు లోకమునందు అనుభవించు ఆస్వాదమునకును కావ్యనాట్యము లందాస్వాదించు ఆస్వాదమునకును భేదమును సూచించినాడు. దీనిని కుమారస్వామి తన వ్యాఖ్యలో ప్రపంచించినాడు అతడే వాచికముగ లౌకికాలౌకిక రసములని నామకరణ మొనర్చినాడు.

"అయంచ రసో లౌకికా లౌకిక భేదేన ద్వివిధః
తత్రాద్యః కదళీ రసాలాది ఫలోస్వాద జన్యానంద సదృశః
- కార్యశ్చ. ఇతరో బ్రహ్మానంద సబ్రహ్మచారీ నిత్యశ్చ"

లౌకికరసము కదళీరసాదుల నాస్వాదించుట వలన గల్గిన ఆనందము వంటిది. మరియు కార్యరూప మైనది అలౌకికరస మట్టిదికాదు. ఇది బ్రహ్మానందసహోదరము. నిత్యము.

విశ్వేశ్వరుడు - చమత్కారచంద్రిక

ఇతడు సర్వజ్ఞసింగభూపాలుని యాస్థానమందు వెలసినవాడు, చమత్కార ప్రస్థాన ప్రవర్తకమైన చమత్కార చంద్రికను రచించినాడు. సింగభూపాలుడు సాహితీపోషకుడగుటయేగాక సాహితీస్రష్టకూడ. ఈతని ఆశ్రయమున సంస్కృత సాహిత్యము సముచిత గౌరవమును సంతరించు కొనినది. అతని ఆదరణమునకు పాత్రుడైనవాడు విశ్వేశ్వరుడు. విద్వాంసుడు మనీషి సత్కవియై సర్వజ్ఞ బిరుదాంచితుడైన సింగభూపాలుని మెప్పించుట నాడు పండితలోకమున పరమోత్కృష్ట పదవిగా పరిగణింపబడుచుండెడిది. అట్టి సింగభూపాలుని మెప్పు పొందినవాడు విశ్వేశ్వరుడు. ఇతడు చమత్కార చంద్రికలో -

అహో సాహిత్యసౌభాగ్యం శ్రీసింగధరణీపతేః
శ్లాఘాయై యస్య సన్నద్ధా వాచో విశ్వేశ్వరస్య మే.

చ. చ. 1 - ఉదా 5

అని సింగభూపతి శ్లాఘనకుపాత్రమైన తన సాహిత్యసౌభాగ్యమును ప్రకటించినాడు. కావుననే సరససాహిత్య చాతురీధురీణుడ నని ఆత్మప్రత్యయ పూర్వకముగ విలాసాంత గద్యలలో వాకొనియున్నాడు విశ్వేశ్వరుడు భారద్వాజ గోత్రుడు. రసమీమాంసాకర్తయైన కాశీశ్వర మిశ్రుడీతని గురువు [1].

---

[1]. తథాచోక్తమస్మదాచార్యైః కాశీశ్వరమిశ్రైః రసమీమాంసాయామ్
పు. 96 చ. చం. 5, 33.

అనవోతనాయకుని యాస్థానకవి నాగనాథుడీతని శిష్యుడు. నాగనాథుడు తన మదనవిలాస భాణమున విశ్వేశ్వరుని తన గురువుగను విజ్ఞానచతుర్ముఖునిగను ప్రస్తుతించెను ఇతడు వీరభద్ర విజృంభణమను డిమము రచించినట్లు రసార్ణవ సుధాకరమువలన తెలియుచున్నది. కరుణాకందళము కూడ నితనిదే కావచ్చునని శ్రీ P శ్రీరామమూర్తిగారి యూహ.[1] ఇవి యిపుడలభ్యములు.

చ మ త్కా ర చం ద్రి క :

విశ్వేశ్వరుడు సింగభూపాలుని కంకితముగ చమత్కారచంద్రికను రచించినాడు సాహిత్య సారమంతయు చమత్కారపూరితమైన దనియు, సకల సాహితీ ప్రస్థానము లలోను చమత్కార మనుస్యూతమై విద్వాంసుల కానందకారియగు చున్నదనియు నీతడు వివరించినాడు

చమత్కారస్తు విదుషామానన్ద పరివాహకృత్
గుణం రీతిం రసం వృత్తిం పాకం శయ్యామలంకృతిమ్
సప్తైతాని చమత్కారకారణం బ్రువతే బుధాః

1 - 6, 7

గుణరీత్యాది సప్తాంగములన్నియు చమత్కార కారణములనియు, సప్తాంగ సంగతమైన కావ్యము సామ్రాజ్యమువలె భాసించుననియు నుడివియున్నాడు.[2]

చమత్కారము - పూర్వాలంకారిక సమ్మతి :

ఈ చమత్కారమును గూర్చి ప్రప్రథమమున వచించినవాడు అభినవగుప్తుడు. అతడు నాట్యశాస్త్రవ్యాఖ్యానమైన అభినవభారతిలో రసపద పర్యాయముగా వాడినాడు.[3]

---

1 కరుణాకందళాఖ్యడిమశ్చాస్యైవ స్యాత్ - P XII introduction to Camatkara candrika

2 సప్తాంగసంగతం కావ్యం సామ్రాజ్య మివభాసతే 1-9

3 "సకలవిఘ్న వినిర్ముక్తా సంవిత్తిరేవ చమత్కారనిర్వేశ రసనాస్వాదన భోగసమాపత్తిలయవిశ్రాన్త్యాదిశబ్దైరభిధీయతే" P 280

సాహిత్య దర్పణకారుడు సయితము "చమత్కారః చిత్తవిస్తార రూపో విస్మయాపరపర్యాయః" (సా. ద. III - 3 P. 72) అని చిత్తవిస్తారరూపమైన విస్మయమే చమత్కారమని నుడివినాడు అంతియగాక ధర్మదత్తుని సమ్మతివిగూడ విశ్వనాథు డుదాహరించినాడు. రసమునందు సారభూతమైనది చమత్కార మనియు అదియే అంతట సహృదయులచే ననుభూతమగునని ధర్మదత్తుని యాశయము[1] క్షేమేంద్రుడు సయితము రసజీవితభూతము చమత్కారకారి యగునది ఔచిత్యమని వచించినాడు.[2] వీనిని దృష్టియందిడుకొనియే విశ్వేశ్వరుడును చమత్కారము విద్వాంసులకు ఆనందప్రవాహకారియనియు[3] సచమత్కారములయిన శబ్దార్థములే కావ్యమనియు[4] వచించినాడు గుణరీత్యాదులయిన సప్తాంగములను చమత్కారకారణములని సూచించినాడు

రస ప్రా ధా న్య ము

ఇతడు ప్రతిపాదించిన ప్రధానాంశము చమత్కారమయ్యును రసమున కితడు సముచితమును, సమున్నతమునైన స్థానమిచ్చినాడు. రససిద్ధాంతము నితడు అన్వయ వ్యతిరేకములచే సమర్థించినాడు. ప్రథమమున నన్వయరూపమును పరిశీలింతము. చమత్కారములో నితడు తరతమ భేదముతో మూడువిభాగము లొనర్చినాడు. 1. చమత్కారము 2. చమత్కార తరము 3. చమత్కారతమము. ఇవి యుత్తరోత్తరోత్కృష్టములు. వానిలో రసము చమత్కార తమమని నిరూపించినాడు.

"రస ఏవ సర్వోత్తరతయా ప్రతిపాద్యతే" అని సయితమొకచో నుడివి యున్నాడు. (P 96) ఇతరములకంటె రసోక్తులే కావ్య చమత్కార హేతువులని వచించినాడు. అవతారికలో కావ్యప్రస్తావన మొనర్చుచు కవిత రసమయ ప్రాణము కల్గినదనియు రమ్యోక్త్యర్థసముజ్జ్వల మనియు సూచించినాడు[1] వర్ణములు సయితము రసాదుల కుపకారము లనినాడు[2]

---

1 రవే సారశ్చమత్కారః సర్వత్రాప్యను భూయతే

2 ఔచిత్యస్య చమత్కారకారిణశ్చారు చర్వణే
రసజీవితభూతస్య విచారంకురుతేధునా - ఔచిత్య విచారచర్చ 1-3

3 చమత్కారస్తు విదుషామానంద పరివాహకృత్

4 శబ్దార్థౌ సచమత్కారౌ కావ్యమ్

ఇట్లన్వయరూపమున రసప్రాధాన్యమును స్పష్టపఱచుటేగాక వ్యతిరేక రూపమున నయితము ప్రస్తరించినాడు గుణాదులు వాగర్థములందు కావ్య మందంతటను విస్తరించి యున్నను, నీరసమైన వాగర్థములను సహృదయు లామోదింప రనియు, నట్టి వాగర్థములు పరస్పరానురాగ రహితులైన దంపతులవలె నుందురనియు వచించినాడు. [3] చివఱకు రసలక్ష్మి ననాదరించినచో నది కేవలము వాగాడంబరమే యగుననియు, నది యిక్షురసమును విడిచి పిప్పిని నములుటయే యగుననియి తన దేశపు యుక్తితో నాక్షేపించినాడు. [4] రసోక్తి అల్పమైనను కావ్యమునందుండ దగుననియు. కర్పూరము కొంతమంత యున్నను సర్వులను, సర్వప్రదేశములను సుగంధ బంధుర మొనర్చునట్లే స్వల్పమైనను నట్టియుక్తి శ్రియఃకల్పన సమర్థమనియు తెల్పియున్నాడు.

రసోక్తులు.

వక్రోక్త్యాదులు పెక్కులున్నను రసోక్తులు లేనిచో కావ్యము పరిగ్రాహ్యము కాదనియు, రసోక్తి అల్పముగ నున్నను కర్పూరమువలె విస్తరించి సుగంధ బంధుర మొనర్చు ననియు నీతని యాశయము. ఇతడు రసోక్తులని పది విభాగము లను వివరించినాడు. అవి 1. సత్త 2. స్ఫురత్త 3. అనుబంధము 4. నిష్పత్తి 5. పుష్టి 6. సంకరము 7. హ్రాసము 8. ఆభాసము 9. శమము 10 శేషము. ఈ రసోక్తి ప్రవచనమునకు ఈతనికి భోజుడు మార్గప్రవర్తకు డయ్యెను అతడు సరస్వతీ కంఠాభరణమున నీ ప్రస్తావన మొనర్చెను, భోజుడు ఇరువదినాలుగు రసోక్తులను పేర్కొనినాడు.

---

1. రమ్యోక్త్యర్థతనూజ్జ్వలా రసమయ ప్రాణా గుణోల్లాసినీ
చ. చం. 1-2

2. యదోచితమిమే వర్ణారసాదే రసయోగినః ચ. చం. 1-18

3. గుణాఢ్యైరపి వాగర్థౌ నీరసౌ కో ఽనుమోదతే
పరస్పరానురాగేణ రహితావివదమ్పతీ - చ. చం. 5-10

4. రసలక్ష్మి మనాదృత్య వాగాడంబరతోరణమ్
పుండ్రేక్షోరసవిద్వేషాదృజీషాను భవో యథా చ. చం. 5-33

"భావోజన్మను భోఽథ నిష్పత్తి : పుష్టిసంకరా
హ్రాసాభాసోశమశ్శేషో ....
నానాలంకార సంసృష్టే : ప్రకారాశ్చాస్య సోక్తయ :
చతుర్వింశతిత్యుక్తా : . .. "సరస్వతీ కంఠాభరణము V (
పు 555

భోజు డిట్లిరువ నాలుగింటిని పేర్కొనగా విశ్వేశ్వరుడు వానిలో తాను ప్రధానములని భావించిన పదింటిని మాత్రమే పేర్కొనినాడు. ఈ విషయమున విశ్వేశ్వరుడు భోజుని చాలవరకు ననుసరించినాడు కొన్ని నిర్వచనములను నయితము యథాతథముగ స్వీకరించినాడు. ఈ రసోక్తులను మొట్టమొదట తెల్పిన యాంధ్రుడు ఈతడే

ప్రతాపరుద్రీయాదు లితః పూర్వమే ఆంధ్రదేశమున రసప్రపంచ మొనరించి నను రసోక్తి వివరణ మొనర్పలేదు.

రసోక్తిభేదములు ;

1) సత్త :

విభావము ఆశ్రయము, ఉద్దీపనము సహకారి. అది త్రివర్గాత్మక మైనది. అట్టి కేవల విభావ సమగ్రతచే స్వాశ్రయమునందు కల్గిన రసపరిస్మేష మాత్రమే సత్త యనబడును. అది రత్యాదుల కేవల స్వరూప మాత్రముచే నిల్చును.

గుంజన్మంజుల చంచరీక మిథునే పుంస్కోకిలాలాపిని
ప్రారబ్ధస్మరపాదుకాగ్ర్చన విధే ర్మాకందమూలాంగణే
శ్యామాయా మధురాధరే మృగదృశి వ్యాలోలలీలాలకే
దూరాదానవపంకజే క్షితిభుజా వ్యాపారితే లోచనే.

ఇచట కేవలము విభావసామగ్రికథనముచేత నాయకుని అభిలాషమాత్రము ప్రతీయమాన మగుచుండుటచే నిది సత్త యనెడి రసోక్తి యగును

2. స్ఫురత్తి:

ఒకే ఒక అనుభావముయొక్క గాని, సాత్త్వికభావముయొక్క గాని ప్రాకట్యము సంస్కారపరిపాటిచే స్ఫురించినచో నది స్ఫురత్తి యనబడును.

కేయూరరత్న ముపలాలయతా నృపేణ
యత్రార్పితం నిజభుజవసనసన్నిధానే
శ్యామాపయోధరతటీ పరమాదరేణ
తస్యోత్తం కృతవతీ పులకప్రరోహాన్

ఇందు నాయికానాయకుల కేవలానుభావరూప ప్రాకట్యము వలన కలిగిన రసస్ఫురత్తి కలదు.


స్పర్శోత్సవేన నృపతేః ప్రమదా కుచాభ్యాం
రాగాంకురా ఇవ ధృతాః పులకప్రరోహాః
తత్సేచనార్థమివ తత్కరపల్లవో ఽపి
ప్రస్వేదవారికణికాః ప్రకటీకరోతి

ఇందు సాత్త్విక భావోత్పాదనరూప మైన స్ఫురత్తి.

రసాభాసము:

ఇతరాలంకారికులు వచించిన ట్లితడు రసాభాసమును ప్రత్యేకముగ పేర్కొన లేదు. కాని రసోక్తులలో ఆభాసము నొకదానిని వివరించినాడు ఆలంబనముయొక్క అనౌచిత్యముచేత కించిన్మాత్రముగ రసము వలె భాసించుట రసాభాస మనబడును.[1]

అందు శృంగారాభాసము నాల్గు విధములుగ నుండును 1. ఏకత్ర రాగాభావము 2 అనేకత్రరాగ భావము 3. తిర్యగాలంబనరూపము 4. మ్లేచ్ఛాలంబనరూపము. రాగాభావ మిచ్చట త్రివిధముగ నుండును. ఒకటి ప్రాగభావము, రెండు ప్రధ్వంసాభావము, మూడు అత్యంతాభావము ఈ మూడు అభావములలోను ప్రధ్వంసాభావ, అత్యంతాభావములే రసాభాస విషయములు, రాగప్రాగభావము రసాభాస విషయము కాజాలదు. దర్శనాద్యులు కలిగినపుడు



రాగోత్పత్తి యగును కావున ప్రాగభావము రసాభాసము కాజాలదు. ఇది సర్వులను అంగీకరించిన విషయము. అభినవగుప్తుడు మాత్రము దర్శ దులచే రాగోత్పత్తి పర్యంతము ఆభాసమే యగు నని నుడివినాడు అట్లయినచో రాగ మనునది ఆభాసముగా ముందుద్భవింపక రాగోత్పత్తి జరుగనేరదు. నాయికా నాయకులకు యుగపద్రాగోత్పత్తి వర్ణించుట సహజము కాదు. కావున ఇతరేతరరాగోత్పత్తి పర్యంతము ఆభాస మగుట శాస్త్రసమ్మత మైనను సహృదయసమ్మత మనరేము.

రస నిరూపణము :

రసనిరూపణమును గూర్చి యాతని యభిప్రాయము లిట్లున్నవి — సాహిత్య దేవతాపదారవిందముల నుపాసించు వాసనాభాగ్యము జనన సాహస్రసంపాదితము. అట్టి ప్రౌఢవాసనా పరిపాకముచే భావనావిశేషము సహృదయులకు సహకరించును. అట్టి వారి మనస్సులకు గోచరించునదై యేదే నాకారమున భాసించునది రసము. ఆ రసముయొక్క యాకార మేది అని ప్రశ్నించినచో అది స్వానుభవైకవేద్య మనియే సమాధానము. ఆత్మానుభవలక్షణ మైన రసమును మాబోంట్లు వాక్కు లెట్లు నిరూపింపగలవు ? ఆకంఠముగ క్షీరసాగరమును గ్రోలినవాడు ఎవడైనను ఆ మాధుర్యవిశేష మిట్టి దని నిర్దేశించి యితరులకు బోధింప శక్తుడు కాడు. కావున రసము వచోవ్యాపార నిర్దిష్టము కానిది, కాని విగళితవేద్యాంతర మైన దను వచనమును మనసున పునఃపునరను సంధాన మొనర్చుకొనుచు భావనాసిద్ధిపర్యంతము సంతోషింప తగును.

రసస్థితికి ప్రమాణము స్వానుభూతి విలసనమే, అయినను పరుల నీ వాగాడం బరవిడంబనము వివిధచర్చా వినోదకండూలధిషణా ప్రకాండు లయిన వారలయొక్క ప్రీతి కొఱకే వ్రాయబడుచున్నది. ఈ రసము సవికల్పక ప్రత్యక్షము మాత్రమే. నిర్వికల్పక ప్రత్యక్షము కాజాలదు. నిర్వికల్పకప్రత్యక్షము వస్తురూపమాత్రమే అవ

---

1. ఆలంబనస్యానౌచిత్యాద్ భవ న్నపి పరిస్ఫురన్
రసవ ద్భాసతే కించి దయ మాభాస ఈరితః

(ఇదియే పండితరాయల రసాభాస నిర్వచనమునకు - "అనుచిత విభావాలంబనత్వం రసాభాసత్వమ్" - అనుదానికి ప్రబోధకమై యుండనోపును.)

భాసించు స్వభావము కలది. కాని రస మట్టిది కాదు రసమునకు భావాది విశేషముల యనుసంధానపూర్వక మైన ప్రతీతిస్వభావము కలదు. కావున నీ రసము సవికల్పక ప్రత్యక్షమే యగును.

రసము అనుమానముచే నయితము నిరూపణీయము. సామాజికులు రసానుభవమును పొందుచున్నవారు. వివక్షిత చేష్టలు గల విశిష్టులు రసానుభూతి నందుచున్నారు. వీరు తత్త్వసాక్షాత్కారము ననుభవించు వారితో సమానులు, అనగా రససాక్షాత్కారానుభవము తత్త్వసాక్షాత్కారానుభవముతో తుల్య మైనది. సమాధి వేళయందు ఆనందముచే గాక బాష్పాదులను నయితము యోగులు పొందుదురు. అవి వారి యానందమునకు సూచకములు. ఈ భావము మహిమ్న స్తవమునందలి యీ క్రింది శ్లోకముతో సంవదించుచున్నది.

మనః ప్రత్యక్ చిత్తే సవిధమవధాయాత్తమరుతః
ప్రహృష్యద్రోమాణః ప్రమదసలిలోత్సంగిత దృశః
యదాలోక్యాహ్లాదహ్రద ఇవ నిమజ్జ్యామృతమయే
దధత్యంత స్తత్త్వం కమపి యమిన స్తత్కిల భవాన్

బాష్పాదులచే సమాధిస్థులైన వారి యానందము అనుమిత మైనట్లే సామాజికుల వివక్షితచేష్టా విశేషములచే వారి రసానుభవ మూహింపబడును. కావున రస మనుమానప్రామాణ్య సిద్ధము కూడనగును, గోసదృశ మయినది గవయ మవినట్లే తత్త్వసాక్షాత్కారసదృశ మయినది రసానుభవము. ఇట్లు ఉపమాన ప్రామాణ్యముచే కూడ రసము సిద్ధము.

ఇది అర్థాపత్తిచే కూడ ప్రమాణీకృతము, "దేవదత్తుడు బలిష్ఠుడుగా నున్నాడు. కాని పగలు భుజింపడు"." అనుచో రాత్రి భోజనము చేయు నవి యాపత్తి కలుగుచున్నది. భోజనము చేయనిచో బలిష్ఠత అనుపపన్న మగును. కావున రాత్రిభోజన మాపత్తి యగుచున్నది అట్లే విభావాదుల యనుపపన్నతచే రస మాపత్తి యగుచున్నది. అనగా రసము లేనిచో విభావాదు లుపపన్నములు కావు. విభావాదు లుండుటచే రస మున్నదనియె వచింపవలయును.

ఒక్కొక్కప్పుడు రసప్రతీతి లేకపోయినను విభావాదులు స్వతంత్రములుగనే ఆస్వాద్యము లగును కదా! అపుడు రసము లేకపోయినను విభావాదు లున్నవి గదా

యనినచో దానికి సమాధాన మిది. విభావాదులు స్వతంత్రముగ వ్యవహరించు ననుట కేవల మౌపచారికము (రాజపురుషునియందు రాజవ్యవహారము వలెనే రసమునందు విభావాది వ్యవహారము) రాజవ్యవహారములను రాజు నిర్వహింపవలయును రాజు లేనపుడు రాజపురుషులు రాజకార్యములను నిర్వహింతురు, కాని రాజు చేసినట్లే పరిగణింపబడును. అట్లే యిచటను ననుసంధింప వలయును.

శ్రుతి ప్రామాణ్య ఘటనము

అలంకారశాస్త్రరచనమున కాశ్మీరదేశము తరువాత ఆంధ్రదేశము పేరుగాంచినది అలంకారశాస్త్ర ప్రస్థానములలో రసము మూర్ధప్రాయ మైనది. శాస్త్రసమ్ప్రదాయమునకు శ్రుతి మూలభూతము, ప్రమాణప్రాయము నైనది. రససిద్ధాంతమును ప్రతిపాదించినవారు కాశ్మీరదేశస్థు లయినను అది యితరదేశములందుకంటె ఆంధ్రదేశమున ప్రచుర ప్రచారము నందిన దనుట సత్యదూరము కాదు. కాశ్మీరదేశస్థులు ప్రవచించిన ఈ సిద్ధాంతమునకు శ్రుతి ప్రామాణ్యమును సంఘటింపజేసిన వారాంధ్రులు. వారిలో మొదటివాడు విశ్వేశ్వరుడు అతడు -

"స వై రస ఇతి శ్రుత్యా బ్రహ్మణ స్సమకక్ష్యయా
ప్రోక్తః రస స్స్వయం భాగ్యా స్తైః కైశ్చి దేవానుభూయతే"

అని వచించినాడు శ్రుతిప్రామాణ్యము లేని సిద్ధాంతము సర్వసమ్మతము కాదని విశ్వేశ్వరుని యాశయము.

ఇతడు అష్టరసవాది రసమును శివునిగా రూపించి వాని అష్టమూర్తిత్వము వలెనే రసము నయిత మెనిమిదిరూపముల నుండునని వచించినాడు. [1]

శివో రస ఇతి ప్రోక్తః సత్యం భావకసత్తమైః
న చే ల్లోకోపకారాయ కథ మస్యాష్టమూర్తితా

అలంకార సంగ్రహము - అమృతానందయోగి:-

మన్మసిద్ధి యాస్థానమున నున్న యీతడు అలంకారసంగ్రహమును రచించినాడు. ఈ మన్మసిద్ధి శక్తిభూమిపతి కుమారుడు. మన్మసిద్ధి ప్రేరణచే అమృతానందయోగి ఈ అలంకార సంగ్రహమును రచించినాడు. ఈతడింకను "యోగిహృదయ దీపిక" అను గ్రంథమును నొకము రచించినాడు సాహి

త్యోపాసకుడుగా రసానందమును, పరబ్రహ్మోపాసకుడుగా బ్రహ్మానందమును చవి చూచిన యీతడు సాహిత్యవిద్యలో అలంకారసంగ్రహమును బ్రహ్మవిద్యలో యోగినీహృదయదీపికను రచించి ఉభయవిద్యలకు పుష్టిని, తుష్టిని చేకూర్చినాడు.

అలంకారసంగ్రహమునందు 11 పరిచ్ఛేదములు కలవు,వర్ణగణవిచారము, కవి భేదములు, నాయికానాయక భేదములు, రసము, వృత్తి, రీతి, గుణదోషములు, అలంకారములు, నాటకలక్షణము, దశరూపకములు, ఉపరూపకములు, నాట్యాలంకారములు, చాటుప్రబంధములు మున్నగునవి సర్వము ఇందు సంగ్రహింప బడినవి. ఇతడు రసమునకు తృతీయపరిచ్ఛేదమును ప్రత్యేకించినాడు. ఇందు రసనిష్పత్తి, రసభేదములు, విభావానుభావ సాత్త్విక వ్యభిచారిభావములు, మన్మథావస్థలు, రసముల వర్ణదేవతాదికము, వైరిరసములు మున్నగునవి చర్చింపబడినవి అన్నియు పూర్వాలంకారికులు చెప్పినవే కాని ఉదాహరణములు మాత్రము హృదయంగమముగా నున్నవి. రసోత్పత్తికి ఉదాహరణమును చెప్పుచు

నవనీతం యథా పాకాద్ ఘృతత్వం ప్రతిపద్యతే
శ్రూయమాణై ర్విభావాద్యైః కావ్యేషు రససంభవః

అని చెప్పుట మనోజ్ఞముగ నున్నది. పరిచ్ఛేదమును జ్ఞానోదయక్రమముతో ప్రారంభించుట గమనింపదగినది.

ఆత్మనో మనసా యోగే మన స్త్వింద్రియై స్సహ
ఇంద్రియాణాం తదర్థై రితి జ్ఞానోదయక్రమః

సిద్ధాంతవిషయమున అభినవుని అభివ్యక్తివాదమును గ్రహించినాడు. శాంత రసమును సర్వోత్తమరస మనియు దానికి మైత్రీవిరోధములు లేవని నిరూపించినాడు. రసవదలంకారమును సోదాహరణముగా నిరూపించినాడు. 13 వ శతాబ్దము వాడైన యితడు పూర్వుల సదభిప్రాయము లన్నిటిని సంగ్రహించి గ్రంథము నన్వర్థనామధేయ మొనర్చినాడు.

సింగభూపాలుడు – రసార్ణవ సుధాకరము :-

పరాక్రమమునకు ప్రతీక యైన వెలమ వంశమున జనించి సమరమునకే గాక సాహిత్యమునందును పరాక్రమ ప్రకటన మొనర్చినవాడు సింగభూపాలుడు

ఇతడు "సర్వజ్ఞ" బిరుదాంచితుడు. కవిసార్వభౌము డైన శ్రీనాథుడు ఇతని కొలువున చెప్పిన

" సర్వజ్ఞనామధేయము
శర్వునికే రావుసింగభూపాలునికే
యుర్వింజెల్లును"

అను పద్యమును బట్టియు,

ఎటుల మెప్పించెదో నన్ను నింక మీద
రావు సింగమహీపాలు ధీవిశాలు
విందు కొలువున నెలకొనియుండ నీవు
సరసద్గుణనికురుంబ శారదాంబ!

అనెడి పద్యమును బట్టియు శ్రీనాథు నంతటి కవీశ్వరునికి సయితము భీతిజనక మైనది సింగభూపాలుని పాండిత్య మని ప్రస్ఫుట మగుచున్నది.

ఇతడు 'రేచర్ల' వెలమవంశస్థుడు. అనపోతారెడ్డి కుమారుడు రాచకొండను రాజధానిగా చేసికొని తెలుగుదేశమును 14వ శతాబ్దిలో పరిపాలించినాడు. ఇతడు రసార్ణవసుధాకర మను ప్రసిద్ధాలంకార గ్రంథమును, కువలయావళి (రత్నపాంచాలిక) యను నాటకమును శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరమునకు సంగీత సుధాకర మనుపేర నొక వ్యాఖ్యయు రచించినాడు.

వైదుష్యము – విద్వత్పోషణము :-

ఇతడు సంస్కృతాంధ్రసాహిత్యము లందే కాక సంగీతమందును సవ్యసాచిత్వమును నెరపిన నరపాలుడు. సాహిత్యశాస్త్రమున పేరెన్నిక గన్న రసార్ణవసుధాకరమును రచించి సాహితీద్రష్టగను, "రత్నపాంచాలిక" యను నాటికను రచించి సాహితీస్రష్టగను ప్రసిద్ధి వహించినాడు. శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరమునకు సంగీతసుధాకరమను వ్యాఖ్య వ్రాసి సంగీతశాస్త్రమందు తనకు గల వైదుష్యమును సయితము చిరస్థాయి నొనర్చుకొనినాడు. ఈతని యాస్థానమందు పండితు డైన విశ్వేశ్వరుడు ఈతని పాండిత్యమును వ్యంగ్యమర్యాదతో ప్రశంసించినాడు.[1] సింగ

1. అహో సాహిత్యసౌభాగ్యం శ్రీసింగధరణీపతేః
శ్లాఘామై యస్య సన్నద్ధా వచో విశ్వేశ్వరస్య మే। (చమత్కార చంద్రిక 1-5)

భూపాలుని ప్రశంసించు పాత్ర మైన దన సాహిత్యసౌభాగ్యము ధన్య మైన దని సంతసించినాడు విశ్వేశ్వరుడు. దీనిని బట్టియు శ్రీనాథుని చాటువులను బట్టియు నాకాలమున సింగభూపాలుడు సాహితీస్రష్ట లెల్లరకు కల్పోపలప్రాయు డై యుండెడివాడని స్పష్టమగుచున్నది. కావుననే సర్వజ్ఞనామధేయాంచితు డైనాడు.

ఇతడు దానమున కర్ణు డనియు, దయాగుణమున దిలీపు డనియు, నీతిలో శుక్రు డనియు వినయమున రాము డనియు సర్వసద్గుణోపేతు డనియు ప్రసిద్ధి గాంచినాడు.[1]

విద్వత్తోషణము :-

ఇతడు కేవలము సాహితీస్రష్టయు ద్రష్టయు మాత్రమే కాదు. విద్వత్తోషణము నయితము విశిష్టరీతి నొనర్చినవాడు. ఈతని దర్శనార్థము ఆస్థానమునకు వచ్చు వారికి సాహిత్యమొకటే సహాయ మని ప్రసిద్ధి కల్గినది. దీనిని వివరించు చాటువు నయిత మొకటి కన్పట్టును.[2] సాహితీమండలి కితడు ముంగొంగు బసిడి వలె నుండెడివాడు. ఇతని యాస్థాన మలంకరించిన వారిలో ప్రథముడు ప్రధానుడు విశ్వేశ్వరుడు. ఇతడు "చమత్కారచంద్రిక"ను రచించినవాడు. చమత్కార చంద్రికను గూర్చి ప్రత్యేకము పరామర్శింపబడినది. రెండవవాడు బొమ్మకంటి అప్పయామాత్యుడు. అమరకోశమున కితడు వ్యాఖ్యానము రచించినాడు.

దానేన కర్ణో దయయా దిలీపో
నయేన కావ్యో వినయేన రామః
యది ప్రసిద్ధిం దధతా మహద్భిః
శ్రీసింగభూపో నిఖిలైః ప్రసిద్ధః।
కిం దారుణా కోంకరవంకరేణ
కిం వానసా చీకిరిబాకిరేణ
శ్రీసింగభూపాలవిలోకనాయ
వైదుష్యమేకం సుధియాం సహాయః॥

సింగభూపాలుని కృతులు :-

ఇతడు సంగీతసుధాకర మను పేర శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరమునకు వ్యాఖ్య వ్రాసినాడు. సంగీత రత్నాకరమునకు వ్రాయబడిన ప్రప్రథమ ప్రామాణిక వ్యాఖ్య ఇతనిదే. తరువాత కల్లినాథుడు మరొక వ్యాఖ్య వ్రాసినాడు. ఈ రెండు వ్యాఖ్యల తోడను సంగీతరత్నాకరము Adyar library వారు ముద్రించిరి. ఇతని వ్యాఖ్యావిధానము మల్లినాథుని తలపించుచుండును. ఇతడు తత్ప్రదర్శకమైన గ్రంథమును వ్రాసిన వాడయ్యును సంగీతరత్నాకర వ్యాఖ్య వ్రాయుచు స్వీయాభిప్రాయములనందు జొప్పింపలేదు "నామూలం లిఖ్యతే కించిత్" అను మల్లినాథుని యుక్తికి మార్గదర్శకప్రాయమైనాడు. సంగీత రత్నాకరము నవరసములను వివరించినది. సింగభూపాలుడు రసార్ణవసుధాకరమున అష్టరసములనే ఆదరించినాడు. అయ్యును స్వీయాభిప్రాయమేమాత్రమునందు జొప్పింపక నవరసవాదమునకే సమంజసముగ వ్యాఖ్య వ్రాసి సహృదయ శిరోమణి, అభ్యుదయవాది శిఖామణియనిపించుకొనినాడు.

మరియొక కృతి కువలయావళి నాటిక. దీనికి రత్నపాంచాలిక యను మరొక పేరుకూడ కలదు. ఇది నాల్గంకముల నాటిక. శ్రీకృష్ణుడు కువలయావళిని వివాహమాడిన వృత్తాంతమిందలి యితివృత్తము. ఈ నాటిక కథాభాగము చాలవరకు స్వప్నవాసవదత్తము దలపించును.

రసార్ణవ సుధాకరము :-

ఇతని మూడవకృతి రసార్ణవసుధాకరము. ఇదియే ఇతనికి సర్వజ్ఞబిరుదమును ప్రసాదించియుండును. అలంకారశాస్త్రమునందీ గ్రంథమునకెనలేని గౌరవము కలదు. పదవాక్యప్రమాణపారావారీణుడును, మహామహోపాధ్యాయుడును, వ్యాఖ్యాతృశిరోమణియునైన మల్లినాథసూరి తన వ్యాఖ్యానములందు పలుతావుల నీ రసార్ణవసుధాకరమును ప్రమాణభూతముగ గ్రహించి యుదాహరించి యున్నాడు. సుప్రసిద్ధాంధ్రవ్యాఖ్యాత యయిన కళాప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రిగారు ఈ గ్రంథమును గూర్చి "రసార్ణవసుధాకర మత్యుత్తమమైన అలంకారశాస్త్రము. మహా

విద్వాంసులు చదువు కొలదియలంకార గ్రంథములలో నొకటి" యని పేర్కొని యున్నారు [*].

నాటక విన్యాసమును గూర్చిన సంగ్రహణ గ్రంథము రసార్ణవ సుధాకరము నాటకము నందలి తత్తల్లక్షణముల కుదాహరణ భూతముగా ప్రాచీన ప్రసిద్ధనాటక ములనుండి కొన్ని ఘట్టములనే యెత్తిచూపుట యిందలి ప్రత్యేకత. అవి సముచిత ములు రసోచితములు నగుట గమనార్హము.

ప్ర క ర ణ వి భా గ ము లు .

రసార్ణవసుధాకరము మూడువిలాసముల గ్రంథము విలాసమునకు నామాంతరముగ ఉల్లాస మను పదమును కూడ కవి ప్రయోగించియున్నాడు. 1. రంజకోల్లాసము 2. రసికోల్లాసము 3. భావకోల్లాసము. వీవినే ప్రథమవిలాసము ద్వితీయవిలాసము, తృతీయవిలాసము నని పేర్కొనినాడు. ప్రథమ విలాసమున కృతికర్త వంశానుక్రమణికయు, నాయక లక్షణములు, ధీరో దాత్తాదిభేదములు, ఉపనాయకులు, నాయికా భేదములు, అష్టవిధశృగార నాయికలు మొ॥ సలక్షణముగ విర్దేశింపబడినవి. శృంగారనాయికలను చాలవరకు నీతడు స్వీయోదాహరణములనే స్వీకరించినాడు. రసమున కాలంబనము లైన నాయికా నాయకుల వివరణ మైన తరువాత ఉద్దీపనవిభావ భేదములను పేర్కొనినాడు. ఇతడు పేర్కొనినన్ని భేదముల నితరెవ్వరును పేర్కొనకుండుట గమనార్హము. అనుభావముల నితడు చిత్తారంభములు, గాత్రారంభములు (పౌరుషసాత్త్వికములు) వాగారంభములు, బుద్ధ్యారంభములు అని విభజించినాడు. రీతులు, వృత్తులు వివ రించుటే గాక యీ విలాసమున సాత్త్వికభావములు నయితము ప్రపంచింపబడినవి. సాత్త్వికభావములు కల్గుటకు హేతువులు కూడ వివరింపబడి తద్ధేతుపూర్వకముగ కొన్ని భేదము లుదాహరింపబడినవి

ద్వితీయవిలాస మగు రసికోల్లాసమునందు వ్యభిచారిభావములు, స్థాయి భావములు, అష్టరసములు, సప్రభేదముగ సోదాహరణముగ వివరింపబడినవి. రససాంకర్యము, రసవిరోధము, రసాభాసము మున్నగు రసానుషంగిక విషయములు ప్రస్తావించబడినవి.

---

*. రసార్ణవ సుధాకరము, పీఠిక పుట XI శ్రీగిడుగు సీతాపతి

తృతీయవిలాస మను భావకోల్లాసమునందు నాటకలక్షణ మంతయు సప్రభేద ముగను, సోదాహరణము గను వివరింపబడుటయేగాక కవులలో భేదములు, నాటక పరిభాషలు సయితము ప్రస్తావింపబడినవి మొత్తముమీద గ్రంథ మంతయు సమగ్ర రసవివేచన మనదగియున్నది.

వ్య భి చా రు లు :

వ్యభిచారిభావముల విషయమున భరతుడు ముప్పదిమూడని సంఖ్యానిర్దేశ మొనర్చినాడు, సుమారు సంస్కృతాలంకారికు లందరును నీ సంఖ్యానియమమును పాటించినవారే. భోజుడు మాత్రము కొన్నిటి నధికముగ భావకోటిలో చేర్చినాడు. ఉద్వేగము, స్నేహము, దంభము ఈర్ష్య మున్నగు చిత్తవృత్తులను వేరుగా పరిగ ణించి భావము లని నారు కొందరు. ఆ యభిప్రాయములను సోపపత్తికముగ ఖండించి యవి పై జెప్పిన ముప్పదిమూడింటిలోనే యంతర్భవించు నని సింగ భూపాలుడు నిర్ధరించినాడు, ఉద్వేగము సందర్భము ననుసరించి నిర్వేదమునందు గాని, విషాదము మొదలగువాని యందు గాని, యంతర్భవించు ననియు, దంభము పరప్రతాపరూప మగుటచే నసూయయందును, అవహిత్థ మందును నంతర్భవించు ననియు, స్నేహము చిత్తమును ద్రవింపజేయు లక్షణము గల దగుటచే హర్షము నందే యంతర్భవించు ననియు, ఈర్ష్య స్వవిషయకమైన దానమానాదులవలన నుద్భవించినచో నమర్షమందును, పరవిషయక మైన వానివలన నుద్భవించినచో అసూయయందు నంతర్భవించు ననియు సోపపత్తికముగ నిరూపించినాడు. తన యభిప్రాయమునకు వృద్ధసమ్మతిని నంతము సాక్ష్యముగా నుగ్గడించినాడు. [6].

ఈ వ్యభిచారులు పరస్పరము విభావముగను, అనుభావములుగను సంద ర్భము ననుసరించి వ్యవహరించుచుండు ననువిషయము నంగీకరించుటే గాక సోదా హరణముగ ప్రపంచించినాడు. విషాదము ఉత్పాతావేగవిషయముననను భావ మగుచున్నది. అట్లే స్తంభము విషయమున విభావ మగుచున్నది. ఇట్టి కార్య కారణ స్వభావము లోకమును బట్టియే నిర్ణయింపదగియున్నది.

---

6. చూడుడు - రసార్ణవ సుధాకరము - వేంకటరమణయ్య గారి ఆంధ్రానువాద సహితము P. 420

వ్యభిచారి భావములలో స్వాతంత్ర్య పారతంత్ర్య భేదము నీతడు సోదాహరణముగ వివరించినాడు. ఇతర భావమున కంగము లైనపుడు వ్యభిచారులు పారతంత్ర్యమును భజించుననియు, కానపుడు స్వతంత్రము లనియు తెల్పినాడు.

స్థా యి భా వ ము లు :-

ఇత డష్టరసవాది యగుటచే శాంతరసస్థాయిని విడచి మిగిలిన యెనిమిదింటిని పేర్కొనినాడు. నిర్వేదమునకు స్థాయిత్వము లేదనియు, తన్మూలమున శాంతరస మాస్వాదయోగ్యము కాదనియు తెల్పి యూర కుండక శాంతరస మాస్వాదయోగ్య మను వారి యాస్వాదము చిత్రములోని యరటిపండు రస మాస్వాదింప గోరు రామచిలకల వివేకముతో తుల్య మైన దని విమర్శించినాడు.

భోజుడు ప్రతిభావమును (చిత్తవృత్తియు) రస మగు ననుఆసంఖ్యసిద్ధాంతము నంగీకరించినవా డయ్యును గర్వ, స్నేహ, ధృతి, మతులు నాల్గును క్రమముగ ఉద్ధత, ప్రేయస్ శాంత, ఉదాత్తరసము లగు నని వచించినాడు. ఆ యభిప్రాయము నీతడు సహేతుకముగ ఖండించినాడు. గర్వము పరిపోషాసహ మగుటచే దానికి స్థాయిత్వమే లేదనినాడు. అట్టిచో రసత్వ మూహింప రానిది. స్నేహము రతియొక్క భేదమే కాని వేరుకా దని నిరూపించినాడు ధృతి మతులకు కూడ స్థాయిత్వము పొందు శక్తి లేదని నిరూపించినాడు. భయవిషయమును ప్రస్తావించుచు నీత డిచ్చిన విశేషము గమనింప దగినది.

భయ మనునది ఉత్తములకు అతిలౌకిక కారణములచే మాత్రమే కల్గు నని వచించుటయే గాక, యుత్తములకు హేతుజ మగు భయ ముండ దనుట పొసగ దనియు, వ్యతిరేక రూపమున నుదాహరించినాడు. ఇచట సోద్ధలకుమారుడు చెప్పిన కృత్రిమము, విత్రాసితకము లను భేదములను సహేతుకముగ ఖండించినాడు. కృత్రిమ మనునది భయకోటిలోనే చేర దనియు గుర్వాదులయెడ కనబరచునది వినయమే కాని భయము కాదనియు వివరించినాడు. తన సిద్ధాంతము భరతుని సిద్ధాంతమునకు వ్యతిరిక్తము కూడ కాదని చక్కని సమన్వయ మొనర్చినాడు. భీషణులు ముత్తెరగు లనియు, 1. ఆకృతిభీషణులు రాక్షసాదులు 2. క్రియాభీషణులు వీరభద్ర, పరశురామాదులు 3. మాహాత్మ్యభీషణులు దేవతలు రాజులు మున్నగువారు అని విభాగించుట సముచితముగను సహేతుకముగను నున్నది.

రసానుభూతి :-

రసానుభవ విషయమున నతనికి వ్యక్తి, భుక్తి, వాద భేద పరిగ్రహణము ఇష్టము కాదు. ఏ వాద మయినను సామాజికులే రసాశ్రయ మనినచో నితడు సంతుష్టు డగును. రెండుపక్షములందును సామాజికులే రసాశ్రయ మగుటవే రెండును అంగీకార యోగ్యములే యనియు తెల్పి భరతోక్త ప్రక్రియను వివరించినాడు. రసమును ప్రమాణాంతరముచే సిద్ధింపజేయ నవసరము లే దనియు, అది సకల సహృదయ సంవేదన సిద్ధ మనియు స్పష్టమొనర్చినాడు. అట్టి ప్రయత్నము కూడ ఉపయోగకారి కాదనినాడు. అష్టరసములలో శృంగారము రసరాజ మని యంగీకరించినాడు. అది సకల జనాహ్లాదక మగుటయే దానికి కారణ మనియు వివరించినాడు.

సహృదయలక్షణము :-

భరతముని పక్షమును వివరించుచు ఆనుషంగికముగ సహృదయుల లక్షణములను దెల్పినాడు. సామాజికులు 1. ధర్మకీర్తిరతులు 2. షడంగ నాట్య సమయజ్ఞులు 3. నానాదేశవేషభాషా విచక్షణులు 4. నిఖిలకలాకలాపకోవిదులు 5. సంత్యక్తమత్సరులు 6. సకల సిద్ధాంతవేదులు 7 రసభావవివేచకులు 8. కావ్యార్థనిహిత చేతస్కులు కావలె నని వచించినాడు. ఈ లక్షణములు చాలవరకు సంగీతరత్నాకర సామాజికలక్షణముల కాదర్శము పట్టినట్లున్నవి [7]

రస సంకరము :-

రెండురసములు కలసి పరిపుష్టములగుట రససంకర మగును. అట్లు కలియుటలో కొందరు సమాన బలము కల రెండు రసములు కలియవలె నని యందురు. కాని అది సమంజసము కాదని సింగభూపాలుడు ఖండించెను. రెండును సమాన

---

7. మధ్యస్థాః సావధానా శ్చ వాగ్మినో న్యాయవేదినః
త్రుటితాత్రుటితాభిజ్ఞా వినయానమ్రకంధరాః
అగర్వా రసభావజ్ఞా స్తౌర్యత్రితయకోవిదాః
గుణదోష విశేషజ్ఞా శ్చతురా మత్సరచ్ఛిదః
అమందరసనిష్యంద హృదయా స్సభ్య స్సభాసదః (సం. ర. 7)

బలములు కలిగినచో అహమహమికతో రసములు రెండును ముందు ఆస్వాదింప బడుటకు పోటీపడు ననియు నేకకాలమున రెండు రసములు నాస్వాద్యములు కాజాల వనియు ఖండించెను. ఒకటి ప్రధానముగను, మరియొకటి దాని కంగముగను నుండి నచో సంకర మగునని స్వీయా భిప్రాయమును వెల్లడించెను. ఈ అంగత్వ మనగా ప్రధాన రసచర్వణ కనురూప మైనదే గ్రహింపవలయు ననియు, అట్లుగాక ప్రతి అప్రధాన రసమును అంగభావమును పొంద దనియు అట్లు పొందినచో పానకాదులందు చక్కెరకే గాక తృణాదులకును నుపకారిత్వము సంభవించు ననియు, అది చర్వ ణాసహ మనియు, దానిని కూడ నాస్వాదింప నభిలషించినచో నాతడు సతృణాభ్య వహారి (పశువు) అగు ననియు ఖండించినాడు. ఇట్టి సునిశిత మైన విమర్శన శక్తి గ్రంథ మంతటను కన్పట్టును.

రసాభాసము :-

అంగరసము స్వేచ్ఛగా వృద్ధిచెంది అంగిరసము కంటె విజృంభించినచో అంగిరసము ఆభాసతను పొందును. ఇది అవినీతు డైన మంత్రి వలన ప్రభువు అవజ్ఞతను పొందినట్లుండును. తన యభిప్రాయమునకు భావప్రకాశికాకారుని సమ్మ తిని సాక్ష్యముగా నుదాహరించినాడు. శృంగారాభాసమునందు చాతుర్విధ్యమును ప్రపంచించినాడు. అరాగము, అనేకరాగము, తిర్యగ్రాగము, మ్లేచ్ఛరాగము అను భేదములచే శృంగారరసాభాసము నాలువిధములు. ఇరువురిలో ఒకరికి ప్రేమ యుదయింప నపుడు రసాభాస మనుట యనుచిత మని త్రోసిపుచ్చినాడు. శాస్త్ర దృష్టితో పరిశీలించిన నది యాభాసమే యని అభినవుడు వచించినాడు. అభినవుని సిద్ధాంతముపై ఆదరణము కల్గినవా డగుటచే నాతని నామమును దెల్పకయే యాతని యభిప్రాయమును మాత్రము ఖండించినాడు. అభావము మూడు విధము లనియు, 1. ప్రాగభావము 2. అత్యంతాభావము 3. ప్రధ్వంసాభావము అని వీనిలో ప్రాగభావము ఆభాసము కాజాల దని నిరూపించినాడు.

ఏకత్రరాగభావమును వివరించుచు స్త్రీకి రాగాభావ మున్నపుడే రసాభాస మని కొంద రందు రనియు, నది సమంజసము కాదనియు పురుషునకు స్త్రీయందు రాగము లేకపోయినను రస మాస్వాద్యము కాదనియు, నది రసాభాసమే యనియు స్పష్టపరచినాడు. వీని కుదాహరణప్రాయముగ నాగానంద ప్రథమశ్లోకమును వివ రించినాడు. ఒక స్త్రీకి అనేక పురుషుల పట్ల నను రాగ మున్నను ఒక పురుషునకు

అనేక స్త్రీలపట్ల అనురాగమున్నను రసాభాసమే యని నిష్కర్ష చేసినాడు దక్షిణ నాయకుని విషయము ప్రస్తావించి దక్షిణనాయకుడు అనేకస్త్రీలయం దనురాగము కల్గియున్నను ఆ యనురాగమున తరతమభేదము లుండు నని యు, తుల్యత్వము ప్రవృత్తియందే కాని అనురాగమునందు కాదనియు సూచించినాడు ఈ విషయ మునే తరువాత కుమారస్వామి మున్నగువారు గ్రహించిరి.

తిర్యగ్గత మగు అనురాగము రసాభాసము కాజాలదని ఏకావళీకర్త విద్యాధరుడు వచించినాడు. ఆ యభిప్రాయము నితడు సవిశతముగ ఖండించినాడు తిర్యక్కులకును విభావాదు లుంటుటం జేసి వాని యనురాగము ఆభాసము కాజాలదని విద్యాధరుని అభిప్రాయము. ఆభాసమునకు హేతువు విభావములు లేకుండుట కాదనియు, విభావాదిజ్ఞనము లేకుండుట యనియు, విభావాదిజ్ఞాన మనగా నౌచిత్య వివేకమనియు, ఆ వివేకము లేని తిర్యక్కులు విభావములు కాజాలవనియు, విభావాది జ్ఞానశూన్యు లయిన మనుష్యుల యనురాగములు నయితము రసాభాసమే యనియు విశదపరచినాడు.

అభ్యుదయ భావరీతి :-

సింగభూపాలు డిప్పటికి సుమారు ఆరువందల సంవత్సరములకు పూర్వము వాడు. అప్పటికి స్త్రీ పరదాలలో నణగిమణగి యున్నది. అట్టి సమయమున నయితము స్త్రీలపట్ల సింగభూపాలునకు చిన్నచూపు లేదు. కొందరు స్త్రీకి పలువురయెడ ననురాగ మున్న రసాభాస మనియు, పురుషునకు పలువురు స్త్రీల యెడల ననురాగ ముండుట దోషము కాదనియు నది రసాభాసము కాజాల దనియు కొందరు వివరింపగా దాని నితడు స్పష్టముగ ఖండించినాడు. ఎవరి కైనను (పురుషునకైనను, స్త్రీకైనను) పలువురపై యనురాగమున్న రసాభాసమే యని నిష్కర్షగా చెప్పుట యతని యభ్యుదయ భావములకు స్ఫోరకముగ నున్నది. మరియు కొందరు వేశ్య నాయికగా నాటకాదులందుండ రాదనియు, నామెకు గుణవంతుని యందు సహజము ననురాగముండ దనియు, ఉట్ల యరక్తత రసాభాసాశ్రయమే యగును గాన వర్జింపరాదనిరి. అది సరికాదని యితడు ఖండించినాడు. ఆమెకు భావానుబంధము లేదనినచో నాయికాత్వమే నశించు ననియు, ప్రకరణాదులలో నామె నాయికగా నుండుట సర్వసమ్మత మనియు, నదియును గాక సామాన్యులపు

గుణవంతులయందు రాగ ముండుననియు రుద్రటుని సాక్ష్య మిచ్చినాడు. కావుననే యితడు సామాన్యను రక్త యనియు అరక్త యనియు వింగడించినాడు. రక్త కుదాహరణముగ వసంతసేనను సూచింపతగును.

సాహిత్యచింతామణి

(పెదకోమటి వేమభూపాలుడు)

తెలుగుసాహిత్య మారంభకాలమునుండియు ప్రభువుల పరిపోషణమున పరిఢవిల్లినది. తెలుగు సాహిత్యమునకు గల్గిన యీ యాదరణమునకు మూలభూతమైనది నాటిరాజుల రసజ్ఞత. తెలుగు నేల నేలిన రాజులు కొందరిలో రసజ్ఞతకు తోడు రచనా వైదగ్ధ్యము సహితము రంగరించినది. కవి రాజుల పోషించుటయే కాక రాజకవులుగా కూడ విరాజిల్లినారు. అట్టివారిలో పెదకోమటి వేమభూపాలు డొకడు. ఇతడు పంటరెడ్ల వంశమునకు చెందినవాడు. క్రీ॥ శ॥ 1402 - 1420 ప్రాంతమున కొండవీడు రాజధానిగా తెలుగుదేశము నేలినవాడు- "జగనొబ్బగండ, సర్వజ్ఞచక్రవర్తి," "వీరనారాయణ" ఇత్యాది బిరుదముల వహించినవాడు. ఇతడు సంస్కృతాంధ్రభాషాపారంగతుడు. తన యాస్థానమున సంస్కృతాంధ్రకవి పండితుల కాశ్రయ మిచ్చినాడు. వామనభట్టబాణుడు మున్నగు సంస్కృత కవితల్లజులను శ్రీనాథాది తెలుగుకవిరాజులను నాదరించినాడు. "కవినా చ విభు ర్విభునా చ కవిః కవినా విభునా చ విభాతి సభా" అను సూక్తిని అక్షరశః సార్థకపరచిన దీతని యాస్థానము. ఈతని కవితాపోషణము గాక సాహితీభాషణము మాత్రమే యిట ప్రస్తావనార్హము.

ఇతడు సప్తశతీసారమునకు సంస్కృతమున భావదీపిక యను వ్యాఖ్యానమును, అమరమునకు శృంగారదీపిక యను వ్యాఖ్యానమును వ్రాసినాడు. ఈ రెండును ప్రచురితములు. ఈ వ్యాఖ్యానద్వయము ఈతని విమర్శనధోరణిని పట్టి యిచ్చును. అంతియే గాక యీతని యలంకారశాస్త్రపాండితీపాటవమును గూడ ప్రదర్శించును.

మూడవగ్రంథము అలంకారశాస్త్రగ్రంథము సాహిత్యచింతామణి. దీనికి వీరనారాయణమనియు నామాంతరము. ఇది ఇంతవరకు ప్రచురింపబడలేదు. తంజావూరు? సరస్వతీమహల్ లైబ్రరీలో లిఖితప్రతి కలదు, దాని ప్రతిక ఆంధ్రవిశ్వవిద్యాలయ

గ్రంథాలయమున నున్నది. దాని నాధారముగ చేసికొని యీ గ్రంథవిషయము పరిశీలింపబడుచున్నది. అచ్చటచ్చట నిచ్చిన పుటలసంఖ్యలు సయితము ఈ ప్రతికి సంబంధించినవే.

గ్రంథవిభాగాదికము :-

ఇది 13 అధ్యాయముల గ్రంథము. అలంకారశాస్త్రమునకు సంబంధించిన సర్వ విషయములు వివరింపబడినవి. శ్రవ్యదృశ్యకావ్యభేదములు సయితము ప్రపంచింపబడినవి. చాలవరకు కావ్యప్రకాశ పద్ధతిలో నడచినది. కావ్యప్రకాశము ధ్వనిని ప్రధానముగా చేసికొని వ్రాసిన గ్రంథము. అసంలక్ష్య క్రమవ్యంగ్యమునందు రస విషయ మంతయు ప్రపంచింపబడినది. ఇతడును అట్లే యొనరించినాడు

తనగ్రంథమును మంగళాది యొనర్పవలె నను సంకల్పముతో మొదట గణాధిపస్తుతి యొనర్చినాడు.

యస్య ప్రసాద మధిగమ్య సుధాశనానాం
నిర్విఘ్న మేవ నిరవర్తత కార్యజాతమ్
తం నారణానన మహం సకలాంతరాయ
విచ్ఛేదకం హృది భజే సకలార్థసిద్ధ్యై

B NO 10514 D NO 5308

విషయవిభాగము తర్కసహమై సహృదయరంజకముగ నున్నది. రాజకార్యవ్యగ్రు డయ్యును, సాహిత్యశాస్త్రముపై నింత యాసక్తి అధికారము నెఱపిన వ్యక్తి మరొక్కడు లేడు. అముద్రితగ్రంథ మగుటచే విషయవిభాగాదికమును ప్రకరణభేదములతో స్థూలముగ నిచ్చుచున్నాను

ధ్వనిభేదవివేకమునందు రసమును గూర్చి వచించినాడు. అసంలక్ష్యక్రమ సందర్భమున రసనిరూపణ మొనర్చినాడు. రసము ప్రధాన మైనచో అలంకార్య మనియు అప్రధాన మైనచో రసవదాద్యలంకార మగు ననియు, వింగడించినాడు. అప్రధానము లగు రసవ, త్ప్రేయ, ఊర్జస్వి, సమాహితాలంకారము లని ప్రతిపాదించి డు.

[1] ఇతడు కావ్యమునకు జీవితభూత మైనది రస మని వచించినాడు లౌకికాలౌకికరసములను పేర్కొనినాడు. లౌకికరసనిష్పత్తిని సయితము సూచించి నాడు. ఇతరాలంకారికులు అలౌకికరసనిష్పత్తినే వివరించిరి కాని లౌకికరస నిష్పత్తినిగూర్చి వచింపలేదు. ముఖ్యముగా ఈ లౌకికాలౌకికరసముల గూర్చి మిక్కుటముగ చెప్పిన వారాంధ్రులే. తెలుగుదేశమందు సంస్కృత గ్రంథములు వ్రాసినవా రీ రీతిని వచించినారు. కావ్యనాట్యములందు కారణాదులు విభావాది శబ్ద వ్యపదిష్టము లగు ననియు అలౌకికరసోత్పత్తిసాధకము లగు ననియు తెల్పినాడు

[1]. అథేదానీం కావ్యజీవితభూతస్య రసస్య స్వరూపాణి నిరూపయితు కామః తదుపయోగితయా ప్రథమం లోకమర్యాదామాహ (పు 88)

రసము యన్నిష్ఠ మను విషయమును సమంజసముగా చర్చించి సామాజికనిష్ఠ మను సముచితనిర్ణయ మొనర్చినాడు. ఈ చర్చావిషయమున ప్రాచీనుల తర్క కర్కశవాదముల స్పృశింపక సహృదయహృదయప్రామాణ్యముతో సమర్థించినాడు. రసము ప్రత్యక్షము కాదనియు, జ్ఞాప్యము కాదనియు కావ్యప్రకాశసాహిత్య దర్పణముల ధోరణిని పుణికిపుచ్చుకొని నట్లు వ్రాసినాడు

రససూత్రమునకు భాష్యాత్మక మయిన రసనిర్వచన మొసంగినా డితడు.

"విభావానుభావవ్యభిచారిసంబృంహితస్థాయిభావ ఏవ రసః" అని యీతని ప్రతిపాదనము

స్థాయి సవిషయకము :-

రస మలౌకిక మనియు స్థాయి సవిషయక మనియు వచించినాడు పూర్వు లందరు రసము అలౌకికమనియే వచించిరి. స్థాయి సవిషయకమని వాచ్యముగా చెప్పలేదు. ఇతడు దానిని చేర్చినాడు. దాని కిట్లుపపత్తి నిచ్చినాడు. "మాధవునికి మాలతియందు, దుష్యంతునకు శకుంతలయందు రామునకు సీతయందు వారికి (మాలత్యాదిస్త్రీలకు, వీ.యందు రతి కల్గినది. అట్లే భీమునకు దుశ్శాసనునియందు, పరశురామునికి క్షత్రియులందు క్రోధము కల్గినది. అజున ఇందుమతియందు, దశరథునకు రామునియందు శోకము కల్గినది. కావున స్థాయిభావము సవిషయిక మైనది. ఈ భావములు శృంగార రౌద్రాదులుగా పరిణమించి రసము లగుచున్నవి[1] ఈ విషయము నృసింహకవిమ్మ వాదమునకు సన్నిహితముగా నున్నది.

రసనిష్పత్తిక్రమము -

రసనిష్పత్తిని గూర్చి పూర్వసంప్రదాయరీతిలోనే వచించినాడు. నూతనము కాకపోయినను హృద్య మగుటచే నిచట పొందుపరచుచున్నాను. చిత్రతురగ న్యాయముచే వేషధారులైన నటులందు రామాదిప్రతీతి కల్గును. వారిచే ప్రకటిత

1. "మాధవస్య మాలత్యాం, దుష్యంతస్య శకుంతలాయాం, రామస్య సీతాయాం తాసామపి తేషు రతి రభూత్ ఏవం భీమస్య దుశ్శాసనే, పరశు-రామస్య క్షత్రియే క్రోధః. ఏవమజస్యేందుమత్యాం దశరథస్య రామే చ శోకః తస్మాత్సవిషయ ఏవస్థాయీ" పు 98

ములైన వాగభినయము, అంగాభినయము, సాత్త్వికాభినయము మొ॥ వానిచే అభివ్యక్తమైన రామాదుల రత్యాదిరూపమైన స్థాయి భావము క్రమపరిపోషము నొంది వస్తుసౌందర్యబలముచేతను, నృత్తగీతాదుల బలముచేతను ఏకాగ్రచిత్తులైన సామాజికులచే పానకరసన్యాయమున మిక్కిలి రస్యమానమై పరమానందకర మైనది రస మనబడును [1]

రస సంఖ్య :-

ఇతడు నవరసవాది. శాంతరసమునకు నిర్వేదము స్థాయిభావ మని వచించి నాడు. ఇట్టి విషయములందు కావ్యప్రకాశప్రభావ మీతనిపై మిక్కుటముగ గన్పట్టును. "రసా నవ" అని కంఠోక్తిగ చెప్పుటయే గాక ఇతరరసములను నిరసించినాడు. ఇతరరసములను భావము లని సూచించినాడు. రసాభాసము విష యమున అంగరసముచే అంగి పరిభవింపబడినచో అభాస మను వాదమును "ఏకత్రైవానురాగః" అను వాదమును రెంటిని స్వీకరించినాడు.

జన్య జనక రసములు :-

భరతుడు నాట్యశాస్త్రమున జన్యజనకరసములను పేర్కొనినాడు. నాల్గురస ములు ప్రధానము లనియు అందుండి మిగిలిన నాల్గురసములు నుద్భవించిన వనియు తెల్పినాడు.

రసములన్నియు అథర్వవేదసంగృహీతములని "రసానాథర్వణాదపి" అనియు వచించినాడు. కాని పెదకోమటి వేమభూపాలుడు శృంగారాదులకు సామాదివేదములు మూలభూతము లని వచించినాడు.

---

1. చిత్రతురగాదిన్యాయేన తాదృగ్రూపభాజాం ధర్మిణాం రామాదీనాం ప్రతీతౌ సత్యాం తత్ప్రకాశితైర్వాగంగసత్త్వాభినయైః అభివ్యక్తో రామాదీనాం ధర్మో రత్యాదిస్థాయిభావః క్రమేణ పరిపుష్టో వస్తుసౌందర్యబలాత్, నృత్తగీత వాద్యోపబృంహితబలాత్వా చ్చ, తదైకాగ్రచిత్తైః సామాజికైః పానకరసవ దత్యర్థం రస్యమానః పరమానందకరో రస ఇత్యభిధీయతే." పు 104,5

శృంగార, వీర, బీభత్స, రౌద్ర, హాస్యా, ద్భుతా స్తథా
భయానక శ్చ కరుణః శాంత శ్చేతి రసా నవ. పు 106

ఇతని రసముల క్రమ మిది. ఇందు శృంగారవీరబీభత్సరౌద్రముల నుండి హాస్యాద్భుతభయానకకరుణము లుద్భవిల్లినవి. ఇంతవరకు భరతసంప్రదాయాను సరణమే. ఇటు మీదిది నూతన వాదము. దీనిని విన్నకోట పెద్దన కూడ తెలుగున ననుసరించినాడు.

"తేషా ముత్పత్తివర్ణదైవతాః క్రమేణాహ సామ, ఋగ్యజు, రథర్వభ్యః చత్వారః ప్రథమే క్రమాత్ జాతా హాస్యాదయ స్తేభ్యః శాంతస్తూపనిషంగగాత్ సామాదిభ్యో రసానా ముత్పత్తిఃప్రాథమికీతి మంతవ్యమ్"

దీని ననుసరించియే విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణియందు

ప్రథమరసము సామభవము, వీరంబు ఋ
గ్వేదసంభవంబు, వెలయు రౌద్ర
రస మథర్వనిగమరచితంబు, బీభత్స
మది యజుఃప్రసూత మండ్రు బుధులు (2-136)

అని వాక్రుచ్చినాడు. ఇట్టి యభిప్రాయమును ప్రకటించిన వారిరువురును ఆంధ్రులే. పైగా సమకాలికులే కావున ఆనాడు మనదేశమున నట్టి సంప్రదాయము పరనపాఠనము లందుండి యుండును. శృంగారము సామవేదమునుండియు, వీరము ఋగ్వేదమునుండియు, బీభత్సము యజుర్వేదమునుండియు, రౌద్రము అథర్వ వేదమునుండియు నుద్భవించిన వని వీరి యభిప్రాయమునకు మూల మేమియు కన్పట్టదు. కాని సానుభూతితో పరిశీలన మొనర్చినచో నిట్లనుట యసమంజసము కాబోదు " లలితాత్మకము గేయరూప మయినది సామవేదము. కావున దానినుండి శృంగార ముద్భవించినది. అగ్ని, మరు, దింద్రాదుల మహిమను వర్ణనములతో నిండిన ఋగ్వేదమునుండి వీరము, పశువిశసనాది-అథర్వధర్మ ప్రతిపాదక మగు

యజుర్వేదమునుండి బీభత్సము, ఆదిభౌతిక విషయప్రధానమై అభిచారసూత్ర విషయక మగుటచే అథర్వవేదము ండి రౌద్రము నుద్భ ంచెనని యూ ంచి యుందురు. అలంకార శాస్త్రమునకు వేదప్రామాణ్యమును సంఘటింపజేయుటకు చేసిన ప్రయత్నములలో నిది యొకటి.

కరుణమునకు విప్రలంభమునకు భేదమును సోదాహరణముగా నిరూపించినాడు. చక్షుఃప్రీత్యాదిదశావస్థలను పేర్కొనుటే గాక వానిక్రమమును సయుక్తము విపరించి నాడు. ఇది మిగుల హృద్యముగా నున్నది. ఇతడు లక్ష్యములను కొన్నిటిని స్వీయ రచితముల నిచ్చును. మనోహరము లనుకొన్న కాళిదాసాదుల శ్లోకముల సయి తము నుదాహరించును. చక్షుఃప్రీతి శ్రవణప్రీతికి సయిత ముపలక్షకముగ నున్న దని యీ శ్లోకము నుదాహరించినాడు.

"ఉపాసనా మేత్య పితు స్స్మ రజ్యతే
దినే దినే సా వసరేషు వన్దినాం
పఠత్సు తేషు ప్రతిభూపతీ నలం
వినిద్రరోమాంచ మశృణ్వతీ నలమ్" (పు 123)

ఇది నైషధీయచరితమందలిది. ఇట్లు పూర్వకవుల శ్లోకముల సయిత ముదాహరించినాడు. శృంగార చేష్టలను సంచారి భావములను సయితము నిరూపించినాడు.

ఋ తు క్రీ డ లు :-

శృంగారరసమును ఇతరాలంకారికులు సప్రపంచముగ నిరూపించిరి కాని, ఋతుక్రీడలను చెప్పలేదు. శృంగారపోషకము లైన ఋతుక్రీడలను (అంటివి ఋతువున కొక్కటిగా) వర్ణించినాడు. వసంతమునకు

"వసంతే చూర్ణవిక్షేపో సావ్యా(త్యు)క్షే మన్మథార్చనం
హిందోళరాగగానం చ పుష్పాపచయ మేవ చ
డోళాకేళీ వివాహ శ్చ మాధవీసహకారయోః
అశోకవకులాదీనాం తరూణాం

ఇట్లు ఆరుఋతువులకు క్రీడలను వర్ణించినాడు. ఇవి నియమములు కావు కాని సాహిత్య సాగరావలోకనము వీని వెనుక ధ్వనించుచుండును

హాస్యోత్పత్తి :-

హాస్యోత్పత్తిమార్గములను చాలమంది ఆలంకారికులు "వికృతాకారవాగ్వేష వేష్టాదు" లని మాత్రమే వచించిరి. ఇతడు వానికి చాలవిశేషములను చేర్చి సూచించినాడు.

"దుర్లాల్యవికృతాకారనిర్లజ్జత్వాదితద్గుణైః
స్వరాణాం మృగపక్ష్యాదేః మనుష్యాణాం గిరా మపి
వేదశాస్త్రకళావిద్యాదేశభాషాదికస్య చ
విడంబనై రసంబద్ధా సత్ప్రలాపై శ్చ వాచికైః
పరక్రియానుకరణై ర్గంధర్వాద్యనచేష్టితైః
వ్యత్యస్తవికృతాశ్లీలై ర్వేషై రపి విభూషణైః" పు 147

హాస్యోత్పత్తి కారణము లివి. దుర్లాల్యము, వికృతాకారము, నిర్లజ్జత, మృగపక్ష్యాది స్వరములను, మానవవాక్యములను, వేదశాస్త్రకళావిద్యాదేశభాషాదికము లను అనుసరించుట- అసంబద్ధములు, అసత్ప్రలాపములు అయిన వాచికములు, పరక్రియానుసరణము, గంధర్వాదిచేష్టితములు, వ్యత్యస్తములు, వికృతములు శ్లీలము లైన వేషవిభూషణములు.

ఇట్లు విశేషములను వివరించిన ా డితడే. సాత్త్వికభావములను లక్ష్య రస్పరముగ నిర్వచించినాడు. "వినిశ్చేతుం శక్యో" అను భవభూతి శ్లోకమును శయమున కుదాహరించినాడు ఇట్లే సంచారిభావములలో మతి నుదాహరించుచు, అసంశయం క్షత్రపరిగ్రహక్షమా" అను శాకుంతల శ్లోకము నుదాహరించినాడు. ఇతడు చాలవరకు ప్రసిద్ధశ్లోకములనే యుదాహరించినాడు.

రసాభాసము :-

అనౌచిత్యప్రవర్తిత మైనదే యాభాస మను కావ్యప్రకాశలక్షణమును స్వీక రించినాడు మరియు అనౌచిత్య మనగా రసభావములకు అనుగుణమని ప్రసిద్ధ మైన విషయౌచిత్యము లేకుండుటే యనినాడు [1]

ఆభాసము శుక్తియందు రజతమువలె భాసించు నదియు తెల్పినాడు. శృంగారా భాసమునకు మాత్రము "ఏకస్మై స్త్రీవానురాగ శ్చే" దిత్యాదిశ్లోకమునే పఠించినాడు. తిర్యగ్గతమునకు "మధు ద్విరేఫః కుసుమైకపాత్రే" అను శ్లోకము నుదాహరించినాడు. పు 180

వీరాభాసము ధర్మమర్యాదోల్లంఘనాదుల వలన సంభవించునని లక్ష్యములతో నిరూపించినాడు.

భావశాంతి యనగా భావవముయొక్క నిమీలనదశ యని మాత్రమే నిర్వచించినాడు. పు 182

రసదోషములు కావ్యప్రకాశోక్తరీతిని వివరించినాడు. లక్ష్యములు భేదిల్లి నని ఉత్తరరామచరిత్రములో కరుణము కాదు విప్రలంభశృంగారమే అంగిరస మని వచించినాడు. దేవవిషయక శృంగారము వర్ణనీయము కాదని సంప్రదాయ పాలన మొనర్చినాడు.

ఇతని నిర్వచనములు సరసములు, సలక్షణములు, అవ్యాప్త్యతివ్యాప్తిదోష జుష్టములు కావు.

కావ్య నిర్వచనము :-

లోకోత్తరవర్ణనానిపుణస్య కవేః సరసశబ్దార్థసంఘటనాత్మకం య త్కర్మ తత్కావ్యమ్

ఆనంద నిర్వచనము :-

"ఆనందో విచిత్రార్థరసభావచమత్కార స్ఫూర్త్యాతిశయసుఖవిశేషః" సర్వత్ర రసప్రాధాన్యము విడువకుండుట గమనింపదగినది.

---

1. అనౌచిత్యం నామ తద్రసభావేనానుగుణ్యేన ప్రసిద్ధస్య విషయౌచిత్యస్య విరహః పు 179.

ఉదాహరణములు శైలి :-

ఇతని రచనము సరళ మైనది తర్కకర్కశమైన శైలి ఆలంకారికుల కలవాటు కాని ఇతని శైలి పరిణత మైనది. ఆనందవర్ధనుని శైలిని తలపించు నట్లుండును. భావనాశక్తియు నంతటిదే. రాజవిషయకరతి నుదాహరించుచు స్వీయ చరిత్రమును సూచించిన ప్రౌఢు డితడు

"భూదానం సగరాదయో నృపతయః ప్రాంచోప్యలంచక్రిరే
దాతారం పర మేక మేవ హి వయం వేమప్రభుం బ్రూమహే
యస్యాద్యాపి సమగ్రదానసలిలైః భూమే రధో వర్షిభిః
పాపమ్నిరసమగ్రదానమలిన స్స్నాతీవ వైరోచనః"

ఇట్టి యుత్తమాలంకారికగ్రంథము తెలుగువారికి గర్వకారణ మైనది. మొత్తముమీద ఇతడు రసవిషయము నంతయు సరసముగ సలక్షణముగ ప్రతిపాదించినాడు.

అచ్చటచ్చట ప్రసంగవశమున సయితము రసప్రాధాన్యమును మరువలేదితడు. మహాకావ్యలక్షణము నిర్వచించు "సముజ్జ్వలం రసై స్సర్వైః ...." అని వచించినాడు.

రసవిషయకము కాకపోయినను ఈ విషయము నూతనత్వప్రతిపత్తిచే నుగ్గడింపదగు. సంస్కృతాలంకారికులు కావ్యారంభమునందు నిబంధింపవలసిన వాని నిగా ఆశీర్నమస్క్రియాదులనే వచించిరి. ఇతడు వానిని చెప్పి కేచిన్మతముగా నీవిషయమును తెల్పినాడు.

"మహాకవీనా మాద్యానాం ప్రశంసా చాత్మన స్తథా
ప్రతివాద్యా ప్రతిజ్ఞా చ కుకవీనాం చ దూషణమ్"

పూర్వకవుల ప్రశంసయు, స్వీయప్రతిజ్ఞయు, కుకవినిందయు చేయవలయు నని కొందరి మతముగా తెల్పినాడు తెలుగుసాహిత్యమునందలి సంప్రదాయమును గ్రంథస్థ మొనరింపవలె ననెడి దృష్టియే యిందు గోచరించును,

సాహిత్యరత్నాకరము

వారణాసి ధర్మసూరి.

వారణాసి ధర్మసూరి యనియు, ధర్మసుధి యనియు పేర్లు గల యీతడు సాహిత్యరత్నాకరమును రచించినాడు. ధర్మసూరి పండితవంశమున జనించిన వాడు, ఇతని పూర్వులు చాలకాలము వారణాసియం దుండుటచే నితని యింటి పేరు వారణాసి వారని ప్రసిద్ధి చెందినది. ఇతడు కృష్ణాతీరమున వెదపులివట్టు గ్రామమున నివసించి నట్లు కొందరును, తెనాలి దగ్గర నొక గ్రామమున నివసించి నట్లు కొందరును వచింతురు. ఇతడు హరితసగోత్రుడు తండ్రి పర్వతనాధసూరి. తల్లి యల్లమాంబ. ఈతని తండ్రి యైన పర్వతనాధసూరి చక్కని పండితుడు. జనార్దనుడను పండితుని సభామధ్యమున నోడించి "వాదికేసరి" అను నాతని బిరుదమును గ్రహించెను. ధర్మసూరి తండ్రికడనే పాణినీయమును, కాణాదము నభ్యసించెను. న్యాయ, వేదాంతశాస్త్రములలో నిష్ణాతుడు అనిపించుకొనినాడు. ఇతడు 15 వ శతాబ్దపూర్వభాగమున నున్నట్లు తెలియును. రామభక్తిలో నీతడు పోతనను తలపింపజేయును. ఇతడు సంస్కృతాంధ్రములందే గాక ప్రాకృతమునందు నయితము ప్రావీణ్యమును గడించినాడు. ప్రాకృతములో హంససందేశ మను సందేశకావ్యమును రచించినాడు. ఇత డింకను కంసవధ, సూర్యశతకము, కృష్ణస్తుతి రచించినాడు. నరకాసురవిజయవ్యాయోగము రచించినట్లు సాహిత్యరత్నాకరము వలన తెలియుచున్నది. ఇతడు కొంతకాల మైన పిమ్మట సన్యాసాశ్రమము స్వీకరించినాడు. రామానంద, గోవిందానంద సరస్వతినామములతో నాశ్రమస్వీకారానంతరము వ్యవహరింపబడినాడు ఆశ్రమస్వీకార మొనరించిన తరువాత నితడు బ్రహ్మసూత్రభాష్యమునకు "రత్నప్రభ" అను వ్యాఖ్య వ్రాసినాడు.

సాహిత్యరత్నాకరము :-

ఇది పది పరిచ్ఛేదములు గల లక్షణగ్రంధము. పరిచ్ఛేదమున కితడు తరంగ మని పేరిడినాడు. తన గ్రంధము పేరు రత్నాకర మగుటచే పరిచ్ఛేదము తరంగ మగుట యన్వర్థ మైనది. ఇందున్న పది పరిచ్ఛేదములు ఇవి- 1. గ్రంథారంభసమర్థన తరంగము 2. అభిధాతరంగము 3. లక్షణాతరంగము 4. వ్యంజనాతరంగము 5. గుణతరంగము 6. శబ్దాలంకార తరంగము 7. అర్థాలంకార తరంగము 8. దోషతరంగము 9. ధ్వనితరంగము 10. రసతరంగము.

ఇతడు మొదటితరంగమునందు గ్రంథము వ్రాయు నుద్దేశ్యమును సమర్థించి ఆ తరంగమును గ్రంథారంభ సమర్థనతరంగ మని నామకరణము చేసినాడు. ఇతః పూర్వము దండి, మమ్మటాదులు ప్రసిద్ధము లైన యలంకార లక్షణగ్రంథములను రచించియున్నారు. అవి నాయకసహితములు గావు అనాయకములు. ఆంధ్రదేశీయు లైన విద్యానాథాదులు కొందఱు సనాయకములుగా ప్రతాపరుద్రీయాదులను రచించిరి. కాని వారు కుక్షింభరిత్వముచే వారి గ్రంథములను నరాంకితము లొనర్చియున్నారు. [1] కని యీ గ్రంథ మట్టిది కాదు. దివ్యోత్తమనాయకున కంకితము. దివ్యుడు ఉత్తముడు నైన శ్రీరామున కంకిత మీయబడుటచే నీ గ్రంథము సహృదయులకు ప్రీతిపాత్ర మగు నని యీతవి యాశయము. ఈ స్వభావము పోతనస్వభావమును దలపించుచున్నది

ఇతడు మొదటితరంగమునందు మరొక విశేషవిషయమును వక్కాణించి యున్నాడు. అలంకారశాస్త్రమునందు గుణరసాలంకారాదులు చర్చింపబడును. ఇవి కావ్యసంబంధము మాత్రమే కావు. వేదములందు నయితము గుణాలంకారాదులు కన్పట్టు నని తెల్పి యిట్లు దాహరించినాడు వేదములందు నయితము కావ్యలక్షణ లక్షితములును అదోషములును, గుణములును, సాలంకారములును నగు వాక్యములు గలవు గదా! "ఏకస్మిన్ యూపే ద్వే రశనే" మొదలగు మంత్రముల యందు అర్థవ్యక్త్యాది గుణములు కలవు. "ఆ తే గర్భో యోని మేతు పుమాన్ బాణ ఇవేషు ధిమ్" ఇత్యాదులందు ఉపమాలంకారము.

---

[1] అలంక్రియాః పూర్వతరైః ప్రణీతాః
స యోజితాః కాశ్చన నాయకేన
కైశ్చి త్తు కుక్షింభరిభి ర్నిబద్ధాః .
క్షోదీయసా కాశ్చన నాయకేన

దివ్యేనోత్తమనాయకేన ఘటితా పేయం మమాలంకృతి
స్సద్వృత్తాకృతినా విదేహతనయా వక్షోరుహస్థాయినా
తత్తాదృగ్గళకంఠకీర్తిపయసో నైల్యావహశ్రీజుషా
విస్ఫారిసేన మహేంద్రనీలమణి నోదారేణ సంశోభతే

స్వా. ర. తరంగము.

"త్రిగ్ శదస్యాజఘునం యో జనాని" మున్నగు చోట్ల అతిశయోక్తియును "ప్రాణాఉపరవా హనూ అధిపనణే" ఇత్యాదులందు రూపకాలంకారమును గలవు.

"యస్యా ముశంతః ప్రహరామ శేఫం, ఉపోపమే ప రామృశ జాయేవ పత్య ఉశతీ సువాసా" ఇత్యాదులందు శృంగారరసము సూచితము

"తేషా మసురాణాం త్రిస్రః పుర ఆసన్"

ఇత్యాదులందు వీరరసమును

"యో వా అస్య పశుమత్తి మాం సగ్ం సోత్తి"

ఇత్యాదులందు బీభత్సరసమును

"కో మోహః క స్తథా శోకః"

ఇత్యాదులందు శాంతరసమును అభివ్యక్తము లగుచున్నవి.

ఇట్లు వేదములయందే రసాదులు సూచితము లైనవని ప్రథమమున వచించిన ఖ్యాతి ధర్మసూరికే దక్కినది.

ద్వితీయ తరంగము అభిధాతరంగము. ఇందు నాయకగుణములు, ధీరోదాత్తాది విశేషములు, శృంగారనాయికానాయకులు, కావ్యసామగ్రి, కావ్యలక్షణము, అభిధా స్వరూపము వివరింపబడినది.

తృతీయ మైన లక్షణాతరంగమున లక్ష్యలక్షక తద్వ్యాప్తినిరూపణ మొనర్ప బడినది.

తురీయ మైన వ్యంజనాతరంగమున వ్యంగ్యవ్యంజకతద్వ్యాప్తి నిరూపణ మొనర్పబడినది. అయిదవ దగు గుణతరంగమునందు మాధుర్యాది గుణములు సోదాహరణముగ వివరింపబడినవి. కాని మూడుగుణము లనుటయే తన మనసునకు నచ్చు నని స్పష్టముగ పేర్కొనినాడు.

ఆరవ తరంగము శబ్దాలంకారతరంగము. ఇందు ఛేకాద్యనుప్రాసములే గాక పద్మ, చక్ర, గోమూత్రికాది బంధములును, నిరోష్ఠ్యనిస్తాలవ్యాది చిత్రాలంకారభేదములును, ద్వ్యక్షరేకాక్షర శ్లోకములును వివరింపబడినవి

సప్తమతరంగమున అర్థాలంకారము లన్నియు సోదాహరణముగ వివరింప బడినవి. రసవదాద్యలంకారములు సంసృష్టిసంకరములును వివృతములు.

దోషతరంగమందు దోషసామాన్య లక్షణమును వివరించినాడు. రసాపకర్ష హేతువే దోష మని వచించినాడు. పదదోషములు, వాక్యదోషములు, అర్థదోషములు వివరింపబడినవి.

ధ్వనితరంగమందు వ్యంగ్యప్రధాన మైనది ఉత్తమకావ్య మనియు, గుణీభూతవ్యంగ్యము మధ్యమకావ్య మనియు సోదాహరణముగ నిరూపించినాడు. రీతి, వృత్తులు శయ్య, పాకములు నిరూపింపబడినవి.

పదవతరంగము రసతరంగము ఇందు ప్రథమమున రసములు తొమ్మిది యని నిరూపించినాడు. రసముల స్నేహ, విరోధములు, శృంగారమున సంభోగ విప్రలంభభేదములును మన్మథావస్థాదులు వివరింప బడినవి. తరువాత మిగిలిన 8 రసములు సోదాహరణముగ వివరింపబడినవి. విభావానుభావాదుల స్వరూపము, భావహావాది శృంగారచేష్టలు వర్ణితములు.

గ్ర ం థ ర చ నా వి శే ష ము లు :

ఈ గ్రంథము సనాయకము. పైగా దివ్యోత్తమనాయకఘటితము. ఆంధ్రుడు వ్రాసిన రచనకు ఆంధ్రునిచే వ్యాఖ్య వ్రాయబడినది. ధర్మసూరి తాను వ్రాసిన శ్లోకముల కచ్చటచ్చట తానే వ్యాఖ్య వ్రాసికొనుచుండును. గ్రంథరచనము చాలవరకు తార్కికమర్యాదాయుతముగ నుండును హేతువాదపురస్కృత మైన రచనా ప్రణాళిక కల్గియున్నది

* రసజ్ఞు లైన వారికే రసానందము కల్గు ననియు, రసజ్ఞులకే కావ్యాస్వాదము సంభవ మనియు, చంద్రకాంతశిలలు మాత్రమే చంద్రకిరణప్రహారముచే ద్రవించును కాని ఇతరశిలలు ద్రవింప వని, అట్లే రసనిర్భరములైన కవివాక్ప్రసారములే మార్దవయుక్త మైన కావ్యామృతముచే ఆనందసంధాయకము లగుననియు తెల్పెను.

---

* రసప్రసరనిర్భరాః కవిగిరాం ప్రసారాః పరం
ముదం విదధతే హృది ప్రమదిమభాజికావ్యామృతైః
సుధాకరకరాంకురవ్యతిరేకణ చంద్రోపలా
ద్రవంతి శిరా శ్చ్యా దపి న వంధ్యవింధ్యోపలాః

లక్షణనిర్దేశములలో వాలవఱకు ప్రతాపరుద్రీయాదిపూర్వలక్షణ గ్రంథముల ననుసరించినాడు. కొన్నితావుల పూర్వుల లక్షణములను, మతములను తెల్పి తన యభిప్రాయమును సయితము వివరించియున్నాడు

నరస భూపాలీయము
(సంస్కృతము)

— సుబ్బు కృష్ణయజ్వ

తెనుగున నరసభూపాలీయము భట్టుమూర్తి విరచిత మైన ప్రసిద్ధాలంకార గ్రంథము. ఇది అళియ రామరాయల మేనల్లుడగు తొరగంటి నరస భూపాలుని కంకిత మీయబడినది తెలుగు నరసభూపాలీయము 1570-80 ప్రాంతమున రచింపబడి యుండును ఈ నరసరాయల తల్లి లక్కమాంబ ఆమెకు ఓబమాంబ యను నొక సోదరి కలదు. ఆమె గొబ్బూరి తిమ్మభూపతి వలన నరసభూపతి యను పుత్రుని గనెను. ఇతనికి అంకితముగా కృష్ణయజ్వ నరసభూపాలీయ మను నలంకార శాస్త్రమును సంస్కృతమున రచించినాడు ఆంధ్ర సంస్కృత నరస భూపాలీయముల కృతిభర్త లిరువురును పినతల్లి పెదతల్లి పుత్రులును సమకాలికులును నగుటచే నీ గ్రంథముల పౌర్వాపర్యములను స్పష్టముగ నిర్ణయింపలేము. అయ్యల రాజు రామభద్రునిచే రామాభ్యుదయ మంకితముగా గొన్న గొబ్బూరి నరసరా జితడే. కావున నీ సంస్కృతనరసభూపాలీయకృతిభర్త విద్వత్పక్షపాతి యనుట నిస్సం దేహము.

ఈ రెండు గ్రంథములను సమగ్రపరిశీలన మొనరించిన శ్రీ మానవల్లి రామకృష్ణ కవి సంస్కృత నరసభూపాలీయమే పూర్వకృతమయి యుండు నని యూహించిరి. (వారి వ్యాసమే సంస్కృతనరసభూపాలీయమును గూర్చిన ఈ విషయమునకు మూలము.)

సంస్కృతనరసభూపాలీయము సుబ్బు కృష్ణయజ్వచే రచింపబడినది ఇతడు వాధూలసగోత్రుడు. సూరిభట్టోపాధ్యాయుని పుత్రుడు. సర్వశాస్త్రరహస్యజ్ఞుడు. సర్వాలంకార కోవిదుడు. ఇతడు గద్యమున —

"శ్రీమద్వాధూలగోత్రతిలక సుబ్బుపదాంక సూరిభట్టోపా ధ్యాయ తనయ కృష్ణయజ్వవిరచితే అలంకారముక్తావళ్యపరపర్యాయే నృసింహభూపాలీయే"

అని చెప్పుకొనెను. నైషధపారిజాతీయాది గ్రంథములను రచించిన కృష్ణాధ్వరి యితడు కాడు. ఇతడు తంజాపూరి రఘునాధుని యాస్థానకవి. అతని కంటె నీ కృష్ణయజ్వ సాహిత్యశాస్త్రనిష్ణాతుడుగా కన్పట్టు నని మానవల్లి రామకృష్ణకవి యభిప్రాయము.

సంస్కృతనరసభూపాలీయము ఏడుల్లాసములు గల గ్రంథము. కాని మొదటి ఆరుల్లాసములు మాత్రమే దొరికినవి. అందు వర్ణగణ, శబ్దార్థప్రతిపాదన, ధ్వని నిరూపణ, వృత్తిస్వరూప, నాయకా గుణ విస్తరణ, రసవిచార, గుణదోష వివరణాలంకార లక్షణములు గలవు. చివరి అలంకారప్రకరణము దొరకలేదు. శుష్కతర్కవిన్యాసము లేక సాహిత్యశాస్త్రకర్యాక ననుసరించి మధురాక్షరములతో నుపాదేయాంశముల నిరూపించు నని మానవల్లిరామకృష్ణకవి తెలిపి యున్నాడు

ఇతడు లక్షణములను సామాన్యముగ విద్యానాధు ననుసరించియే చెప్పియున్నాడు. తగిన న్యూనాధికతలు లేని లక్ష్యముల నిచ్చును. ఒక్కొక్క లక్షణమునకు రెండేసి లక్ష్యము లొసంగుచుండును.

రససిద్ధాంతమునను సంబంధించి నంతవరకు నితడు వెలువరించిన యభిప్రాయములను మానవల్లి రామకృష్ణకవిగారి వ్యాసమాధారముగ నిట వివరించుచున్నాను.

ర సా భా స ము :-

రసాభాసలక్షణము విషయమున దక్షిణ దేశీయాలంకారికు లందరును సామాన్యముగ శృంగారతిలకలక్షణము ననుసరించిరి. శృంగారతిలకమున-

ఏకత్రైవానురాగ శ్చేత్ తిర్యఙ్మ్లేచ్ఛగతో౽పి వా
యోషితో బహుసక్తి శ్చే ద్రసాభాస స్త్రిధా మతః

అని చెప్పబడినది.

దీని ననుసరించియే విద్యానాధుడును, సింగభూపాలుడును, తిర్యక్కుల శృంగారము శృంగారాభాసము. నని వచించిరి. తెనుగున మూర్తికవి కూడా రసాభాసమునకు విద్యానాధు డుదాహరించిన పద్యమునే యనగా తిర్యగ్గత మైన శృంగారమునే తెనుగున ననువదించి యుదాహరించినాడు. కాని కృష్ణయజ్వ యిప్పట్టున క్రొత్త సిద్ధాంతమును ప్రతిపాదించినాడు. తిర్యగ్గత మైన శృంగారము

నయితము రసమే కాని రసాభాసము కాదనినాడు. దాని కుపబలకముగ దండి యుదాహరణమగు

కలక్వణితగర్భేణ కణ్ఠేనా ఘూర్ణితేక్షణః
పారావతః పరిక్రమ్య రిరంసు శ్చుంబతి ప్రియామ్

అను శ్లోకమును సూచించినాడు. అంతియే గాక రసాభాసమునకు క్రొత్తలక్షణమును నిర్వచించినాడు.

బాధో ముఖ్యరసస్య స్యా దున్మర్యాద ప్రవృత్తినా
యత్ర హ్యఙ్గరసే నైష రసాభాసః ప్రకీర్తితః

అంగరసము హద్దుమీరి అంగిరసమును బాధించినచో అది రసాభాస మన బడును. ఈ లక్షణమునకు శృంగారతిలక లక్షణమునకు పోలికయే లేదు. కాని లక్షణనిర్వచనము దోషయుక్తము కాదు. అంతమాత్రమున సమగ్రమును కాదు.

వాలవరసు విరువురును ప్రతాపరుద్రయశోభూషణము ననుసరించిన వారగుటచే సంవాదబహులములైన ఘట్టములు కన్పట్టును

కటాక్షవర్ణనము సంస్కృతమున

సాభిప్రాయైః సదరహసితైః సత్రపైః స్సానురాగైః
లీలాలోలై రలసవలితై రాదరానందగర్భైః
కందర్పాణా మయుత మనిశం కల్ప యద్భిఃకటాక్షైః
శ్రీగొబ్బూరి నరసనృపతిం ప్రేక్షతే పంకజాక్షీ

అది యుండగా తెలుగున నీరూపు నందినది.

అలసాలోలములై యచంచలములై యాకేకరాగ్రంబులై
యలఘుప్రీడములై యనిందితములై యానదపూర్ణంబులై
సులభాసూయములై సుతీక్ష్ణరుచులై సువ్యక్తరాగంబులై
చెలువం బొందెడు చూపు లింత నెరపెన్ శ్రీనారసింహేం
ద్రుపైన్

ఇందు సంస్కృతమున చూడుక్కలు నానావిధమదనరాగజనకములు కాగా తెనుగున ప్రణయసాపప్రసాదసూచకము లగుట గమనార్హము, ప్రతిభాస్ఫోరకము. సంస్కృతము నందలి భావములకు మూర్తికవి మెరుగులు దిద్ది యుండుట గమనింప దగినది.

అవతారికలలో నాత్మప్రాగల్భ్యము నిరువురు నిట్లు చాటుకొనిరి.

మాఘస్యాఘనిరాకృతౌ నిపుణతాం కాంతే ర్భరం భారవే
ర్బాణ స్యార్జవ ముజ్జ్వలం మధురిమోత్కర్షం మయూరధ్వనేః
హర్షస్యానుసరన్ ప్రకర్ష మసమం కుర్వన్ మురారేః పద
ధ్యానం కాంచిదలంక్రియాం ప్రథయతే (?) ప్రీత్యై
నృసింహప్రభో॥

బాణువేగంబును భవభూతిసుకుమార
తయు మాఘునైత్యంబు దండిసమత
యల మయూరు సువర్ణకలన చోరుని యర్థ
సంగ్రహమ్ము మురారి శయ్యనేర్పు
సోము ప్రసాదంబు సోమయాజుల నియ
మఁబు భాస్కరుని సన్మార్గఘటన
శ్రీనాథుని పదప్రసిద్ధధారాశుద్ధి
యమరేశ్వరుని సహస్రముఖదృష్టి
నీక కలదాటుగాన ననేకవదన
సదనసంచారఖేదంబు సడలు పఱచి
భారతీదేవి నీ జిహ్వఁ బాదుకొనియె
మూర్తికవిచంద్ర! విఖ్యాతకీర్తిసాంద్ర!

సంస్కృతాంధ్రముల రెంటను శ్లేషమీది మోహముచే తత్తత్కవులకు ముఖ్యగుణములు కానివి వర్ణితములు.

ఈ క్రింది శ్లోకమునకును పద్యమునకును జన్యజనకభావము లేకున్నను సాదృశ్యరేఖ లేకపోలేదు. ఉద్దీపనవిభావమునను కృష్ణయజ్వ -

ఆభాత్యంబరచుంబి చంపకరజో న సీరరేణూపమం
లీలాకాహళికూజితస్య కురుతే పుంస్కోకిలానాం స్వనమ్
ధాటీమూన మటత్యయుగ్మవిశిఖః సాకం వసంతేన త
త్కాంతానాం కుచశైలభూ ర్విరహిణాం యూనాం గతిర్నాపరా.

మూర్తికవి —

చిగురుం గటారితోఁ జెఱకుసింగిణితో న రంప గుంపుతో
నిగనిగ మించు చెంగలువ నేజముతో వడిజిల్క తేరిపై
మగటిమి నెక్కి శూరుఁడయి మారుఁడు కోకిలకంఠకాహళుల్
నెగడ లాతాంగిపై వెడలె నేమ నృసింహ! యెఱుంగ జెప్పితిన్.

ఆంధ్రపద్యమును రసికజనమనోరంజన కారుడు అనుకరించినాడు.

ఇట్లు సంవదింప బట్టను న్నను కొన్ని చోట్ల భేదించిన ఘట్టములును లేకపోలేదు.

విరహావస్థల వర్ణనవిషయమున కృష్ణయజ్వ ద్వాదశావస్థలను నిరూపించినాడు. కాని మూర్తికవి తెలుగున దశావస్థలనే వివరించినాడు. మరణమును మాని ధన్యత నుదాహరించినాడు

రసగంగాధరము - జగన్నాథుడు

జన్మాదికములు :

ఆంధ్ర వేగినాటి కుటుంబమునకు చెందిన తెలుగు బ్రాహ్మణుడితడు. తండ్రి పేరుభట్టు లేక పేరమభట్టు. ఇతని గ్రంథమగు ప్రాణాభరణమునందును, [1]

---

[1] తైలంగాన్వయ మండలాలయ మహాలక్ష్మీదయాలాలిత ః
శ్రీమత్పేరమభట్టసూను ర శం విద్యాల్లలాటంతప ః
సంతుష్టః కమతాదిపన్య కవితా మాకర్ణ్య తద్వర్ణనం
శ్రీమత్పండితరాజ! పండితజగన్నాథో వ్యధాపీ దిదమ్ ॥

రసగంగాధరమందును[2] ఈ విషయములు స్పష్టము లగుచున్నవి. ప్రాణా భరణమునందలి శ్లోకమును బట్టి పరిశీలించినచో "పండితరాజ" బిరుదము జగన్నాథునకు షాజహాన్ చక్రవర్తిదత్త మనిపించును.[3]

P. V. కాణే అభిప్రాయమును బట్టి జగన్నాథుని కాలము 1620 నుండి 1665 వరకు అని నిర్ణయింపబడుచున్నది.

రసగంగాధరకృతి ఇతని ఆనందవర్ధన, మమ్మటాదులకు సమానస్థాయిలో నిలుపలిగినది.

పాండిత్యము :

పరిష్కుర్వన్త్వర్థాన్ సహృదయధురీణాః కతిపయే
తథాపి క్లేశో మే కథమపి గతార్థో న భవితా
తిమీంద్రాః సంక్షోభం విదధతు పయోధేః పున రిమే
కిమేతే నాయాసో భవతి విఫలో మన్దరగిరేః అని[1]

జగన్నాథుడు చెప్పుకొనినాడు. మునికవివలె ఇతడును తన క్లేశమును ప్రస్తావించినాడు. అంతియ గాదు తన రచనా విధానములోని వైవిధ్యమును, వైశిష్ట్యమును అత డిట్లు వంచిచినాడు—

నిర్మాయ నూతన ముదాహరణానురూపం
కావ్యం మయాఽత్ర నిహితం న పరస్య కించిత్
కిం సేవ్యతే సుమనసాం మనసాఽపి గన్ధః
కస్తూరికాజననశక్తిభృతా మృగేణ[2]

తన గ్రంథమున స్వీయోదాహరణములనే తాను స్వీకరించినాడు, తాను రచియించినాడు. ఉదాహరణము లన్నియు శృంగారకరుణాదులలో ఏ రసము వందైనను తత్తద్రసానుకూలముగా తత్తద్భావానుకూలముగా రచనచేయ గల శక్తి ఇతని కున్నది

---

² శ్రీమద్జ్ఞానేంద్ర:కో రధిగతసకల బ్రహ్మవిద్యాప్రపంచః ...
.........తం వన్దే పేరుభట్టాఖ్యం లక్ష్మీకాన్తం మహాగురుమ్ ॥

³ History of Sanskrit Poetics - P. V. Kane. P. 323-24

¹ & ² ర. గం. ప్రథమాననము

రసగుళికలవలె సర్వశ్లోకములును ఆస్వాదనీయములు. భాష శైలి ఈ రెంటియందును ఇతడు నిరుపమానప్రజ్ఞను ప్రదర్శింప గలడు. పద్యరచనమునందే గాక గద్యరచనమును గూడ మాధుర్యము విరాజిల్లును. భామినీవిలాసము న తన కవితామాధుర్యమును తానే శ్లాఘించుకొనినాడు -

> ధుర్యైరపి మాధుర్యైః ద్రాక్షాక్షీరేక్షుమాక్షికసుధానామ్
> వన్ద్యైవ మాధురీయం పండితరాజస్య కవితాయాః ॥

ఇతని కవితలో ఎంత తీపి ? అనర్గళమైన తన వాగ్ధోరణితో అనందవర్ధనాదులను కూడ ఇత దక్కడక్కడ ఖండించుటకు వెనుకాడలేదు.[1] అలంకారికులెల్లరును ఉత్తమకావ్య మని ఆదరించెడి అమరుకుని - 'శూన్యం వాసగృహం విలోక్య' మొదలుగా గల శ్లోకము నితడు నిర్భయముగ ఖండించి కవియొక్క నిర్మాణ సామగ్రీదారిద్ర్యమును వ్యక్తీకరించుచున్న దని పలికినాడు.[2] ఉత్తమాలంకారికులలో ఇతనిని అభివర్ణించుటలో ఇతని అర్వాచీనత ప్రతిబంధకము కాలేదు.

రసగంగాధరము :

దీనినిగురించి సంక్షేపము, సమగ్రరూపము వివ్వగలుగుట కష్టసాధ్యము అన్ని కోణములనుండియు ఇది తన వైశిష్ట్యమును చాటుకొనుచుండును. ఇది ప్రథమాననము - ద్వితీయాననము - అని రెండు ఆననములు గల గ్రంథము. ఇది బహుశః లుప్తశేషము కావచ్చును. ప్రథమాననము కావ్యలక్షణముతో ఆరంభించి అసంలక్ష్యక్రమధ్వని నిరూపణముతో ముగియును. ద్వితీయాననము సంలక్ష్యక్రమధ్వనితో ప్రారంభించి ఉత్తరాలంకారముతో ముగియును.

ప్రాచీనుల కావ్యలక్షణము లన్నింటిని ఖండించి ఇతడు - "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్" అని స్వీయ కావ్యలక్షణమును వచించెను.

---

1 రసగంగాధరము - రూపకధ్వని

కావ్యలక్షణఖండనము - మమ్మట, విశ్వనాథులు

2 రసగంగాధరము - ప్రథమాననము.

ఇది దండికావ్యలక్షణము ననుసరించిన దనుటలో అతిశయోక్తి లేదు [3] ఇతడు రసధ్వని ప్రధానకావ్యముతో బాటు వస్త్వలంకారధ్వని ప్రధానకావ్యములు కూడ ఉత్తమకావ్యము లని పరిగణించెను. [4]

ఇతని కావ్యవిభాగము కూడ విలక్షణ మయినది- ఉత్తమోత్తమ - ఉత్తమ- మధ్యమ - అధమ - కావ్యము లని ఇతడు విభజించును. ఏకాక్షరబంధకవిత్వములు అధమాధమములుగా వ్యవహరింపదగినవి కాని వానిలో కావ్యసామాన్యలక్షణమే లేనందున ఆ విభాగ మాశ్రితము కాదని యితని యభిప్రాయము [1].

రససిద్ధాంతము :-

రససిద్ధాంతము నితడు విపులముగా, సమగ్రముగా చర్చించినాడు. అభినవ గుప్తుని రససిద్ధాంతమునకు చక్కని పొందికను ఏర్పరచినాడు. అభినవగుప్త- భట్టనాయక - శ్రీశంకుక-భట్టలోల్లటుల మతముల నుగ్గడించుటయే గాక అప్రధానము లైన మరికొన్ని వాదములను గూడ ఇతడు చూపినాడు .[2] వాటికాధారము అభినవ గుప్తుని ధ్వన్యాలోక వ్యాఖ్య లోచనము -

"అన్యేతు శుద్ధం విభావం, అపరే శుద్ధ మనుభావం, కేచిత్తు స్థాయిమాత్రమ్, ఇతరే వ్యభిచారిణమ్,అన్యే తత్సంయోగమ్, ఏకేఽను కార్యమ్, కేచన సకలమేవ సముదాయం రసమాహుః-" [3]

ఈ వివాదములను అభినవ గుప్తుని తరువాత మరల స్పృశించిన దితడే.

"నవ్యాస్తు- కావ్యేనాట్యే చ కవినా నటేన చ ప్రకాశితేషు విభావాదిషు వ్యంజనావ్యాపారేణ దుష్యంతాదౌ శకుంతలాదిరతౌ

---

[3] 'శరీరం తావదిష్టార్థవ్యవచ్ఛిన్నపదావళీ'

కావ్యాదర్శము 1-10

[4] వాక్యం రసాత్మకం కావ్యం - ఖండన - ర. గ ప్రథమాననము

[1]. [2]. - ర. గ. ప్రథమాననము

[3]. ధ్వన్యాలోకము - లోచనము - 196-97 పు.

గృహీతాయా మనన్తరం చ సహృదయోల్లాసితస్య భావనా విశేష రూపస్య - దోషస్య - మహిమ్నా కల్పితదుష్యంతత్వావచ్ఛాదితే స్వాత్మన్యజ్ఞానావచ్ఛిన్నే శుక్తికా శకల ఇవ రజతఖండః సముత్పద్య మానో ఽ నిర్వచనీయః సాక్షిభాస్యశకుంతలాదివిషయకరత్యాది రేవ రసః —[1]

ఇది జగన్నాధ సమ్మతరససిద్ధాంతము కావచ్చును. ఈ మతము ననుసరించి కావ్యవ్యాపార మయిన భావన దోష మయినది. అనగా రసానుభూతి కూడ ఒక దోష మనవలసి వచ్చుచున్నది. ఇట్లు భావనను దోషముగా మరేమతము నంగీకరించినట్లు కన్పట్టదు. అది నిర్వికల్పసవికల్పాదుల కన్న విశిష్టమై లోకోత్తరత్వ మునకు పోషక మనిరి కాని దోష మని అంగీకరించలేదు. అంతియ గాక "రసో వై సః" మొదలగు శ్రుతుల నాధారము చేసికొని రసానందమునకు బ్రహ్మానంద సబ్రహ్మచారిత్వమును కల్పించి దానిని దోష మనుట యుక్తమా? అయినచో బ్రహ్మా నందమును దోషప్రాయము కాదా? అందలి భావన కూడా దుష్టము కాదా? అనునది విమర్శనీయమైన విషయము.

ఈ విషయమున శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు గారి అభిప్రాయ మిది —

"కావ్యమునందుఁ గాని రసానుభవవిషయమునందుఁ గాని భావన దోష మనుట కడమ వారెవ్వ రంగీకరింపరు. అంగీకరింపఁ దగదు కూడ. ఏమనగా; రసానుభవముతో సమానయోగక్షేమ మగు బ్రహ్మానుభవమునందుఁ గూడ భావనను దోషమే యనవలసివచ్చును. అది - మన్తవ్యో నిదిధ్యాసితవ్యః - అను శ్రుతికి విరుద్ధము. శ్రుతి దోష మొనర్ప మనదు గదా ! అని యస్వారస్యము" 1

1. ర. గం. ప్రథమాననము.

2. ఆంధ్రరస గంగాధరము - శర్వాణీ వ్యాఖ్య - 128 పుట

రతి విశేష్యము - విశేషణము :-

అభినవాదుల రససిద్ధాంతము ననుసరించి- "భగ్నావరణచిద్విశిష్టరత్యాదిరేవ రసః అని జగన్నాధుడు సంక్షిప్తముగా పలికినాడు. దీని ననుసరించి యిందు రత్యాదులు విశేష్యము లగుచున్నవి. భగ్నావరణమైన చిత్తు (జ్ఞానము) విశేషణమయినది. కాని జగన్నాధుడు దీనిని నివర్తింపజేసి "రత్యాద్యవచ్ఛిన్నా భగ్నావరణా చిదేవ రసః" అని రత్యాదులతో కూడిన భగ్నావరణచిత్తే రస మనినాడు. "వస్తుతస్తు-వక్ష్యమాణశ్రుతిస్వారస్యేన- రత్యాద్యవచ్ఛిన్నా భగ్నావరణా చిదేవ రసః" అని రత్యాదులకు విశేషణత్వమును జ్ఞానమునకు విశేష్యత్వమును సంపాదించినాడు.

ర సో చి త శై లి :-

ఆనందవర్ధనాదులు సంక్షేపముగా పలికిన వర్జనీయ వర్ణాదుల నితడు అతివిపులముగా చర్చించినాడు.

శషౌ సరేఫసంయోగౌ ఢకారశ్చాపిభూయసా
విరోధినః స్యుః శృంగారే తేన వర్ణా రసచ్యుతః
త ఏవ తు నివేశ్యంతే బీభత్సాదౌ రసే యదా
తదా తం దీపయన్త్యేవ తేన వర్ణారసచ్యుతః [1]

దీనిని జగన్నాథుడు విశేషించి ఏ యే రసములలో ఏ యే అక్షరములు, ఏ యే పదముల సంయోగములును విసర్జింపబడవలయునో సోదాహరణముగా వివరించినాడు. అందు సామాన్యముగా వర్జనీయములు, విశేషముగా రసానుకూలముగా వర్జనీయములు అని విభాగము చేసిచూపినాడు [2].

భావశాంత్యాదులు - భావధ్వని :-

భావశాంతి - భావోదయ - భావసంధి - భావశబలతలు కూడ భావధ్వనులే యనియు విద్యమానావస్థలో భావధ్వను లయినపుడు ప్రశమాభిధాతత్వ -

---

[1]. ధ్వన్యాలోకము - తృతీయ - 3, 4. [2]. ర. గ. ప్రథమాననము

ఉత్పత్త్యవఛిన్నత్వ-సంధీయమానత్వ - శబలత్వావచ్ఛిన్నత్వము అయిన భావములు భావధ్వనులే యనియు ఇతడు వచియించినాడు. వానిని కూడ సమగ్రము అయిన ఉదాహరణములతో సూచించినాడు.

రసాభాసము :-

"అనుచితవిభావాలంబనత్వం రసాభాసత్వమ్" అని రసాభాసమును నిర్వచించినాడు.

- ఇతడు తిర్యగ్గతత్వమునకు రసత్వమునే అంగీకరించినట్లు కన్పట్టును. భావధ్వనులలో మోహమును ఇతడు దాహరించుచు,

శుణ్డాదండం కుండలీకృత్య కూలే
కల్లోలిన్యాః కించిదాకుంచితాక్షః
నైవాకర్షత్యంబు నైవాంబుజాలిం
కాన్తాపేతః కృత్యశూన్యో గజేంద్రః ॥ 2.

అని శ్లోకమును చూపినాడు. ఇందు తిర్యగ్గతముగ మోహము వర్ణింపబడినది దీని ననుసరించి తిర్యగ్గతమయిన రసము రసాభాసము కాదను విద్యాధరుని[3] అభిప్రాయము నితడంగీకరించి యుండుననుట వచ్చును. కనుకనే అనుచితవిభావాలంబనత్వ మనియేకాని మరే లక్షణము నితడు వచింపలేదు.

ద్వితీయాననమున సంలక్ష్యక్రమధ్వనితో ప్రారంభించి అభిధాలక్షణావ్యంజనలను నిర్వచించి ఆపై ఉపమాలంకారముతో అలంకార వివరణము నారంభించును. ప్రతి లక్షణకథనము నందును ఇతని వైశిష్ట్యము గోచరించును. ప్రాయికముగా సర్వవిషయములందు నితడు తన లక్షణమును తెలిపి, వెంటనే ప్రాచీనుల లక్షణముల

---

1. శృంగారతిలకము - రుద్రభట్టు 2. రసగంగాధరము-ప్రథమ

3. "ఏకావళీ" గ్రంథకర్త.

నన్నింటిని (ఏడ్వవ భాగము) ఖండించి ఆ పై నుదాహరణములను చూపు చుండును. సంస్కృతాలంకారికులలో నితడే గణనీయుడు -అంతిముడు అని చెప్ప వచ్చును. అది ఆంధ్రులు చేసికొన్న మహద్భాగ్యము. ఆంధ్రుల కీర్తి కౌముది కితడు చంద్రుడు.

ఆ తర్వాత కొన్ని గ్రంథములు వెలువడినను అవి లెక్కలోనికి తీసికొన బడలేదు కాన నితని నదిగమించు ఆలంకారికులా పై లేరని తెలియుచున్నది.

శృంగారమంజరి - అక్బర్‌షా

భరతునిచే ప్రవచింపబడిన రస ద్ధాంతము తరువాతి ఆలంకారికులచే అను సరింపబడి వివిధ రీతుల విస్తరిల్లినది. భానుదత్తుడు ప్రత్యేకముగా రసమును గూర్చి రసతరంగిణి యను నలంకార గ్రంథమును రచించినాడు.

రసమునకు ఆలంబన విభావము లయిన నాయికా నాయకులను గూర్చి ప్రత్యేక గ్రంథమును నయితము అతడు రచించినాడు అదియే రసమంజరి. అందు కేవలము నాయికా నాయకభేదములు రసానుకూలురయిన నాయికానాయకులు మాత్రమే వర్ణితములు. ఈ విధానము తెలుగుదేశమున చాలమందిచే అనుసరింపబడినది. తెలుగున అంకిత విధానము ప్రసిద్ధమైనది. కావ్యములే గాక అలంకార గ్రంథములు నయితము నాయకు నుద్దేశించి అతని యశఃకీర్తనమున కయి రచింపబడినవి. ప్రతాపరుద్రీయాదులు అట్లు నాయక గుణవర్ణనము చేసినవి. నాయక ప్రకరణ మాత్రమున వచింపబడిన రసమంజరి తెలుగువారిచే బహుధా ఆదరింపబడినది కావుననే రసమంజరికి తెలుగున చాల అనువాదములు వెలసినవి. దాని నొరవడిగా జేసికొని రచింపబడినదీ శృంగారమంజరి.

దీనిని హైదరాబాదునందు 17 వ శతాబ్దము నందున్న అక్బర్‌షా రచిం చెను. ఇతని పూర్తి పేరు "హజరత్ సయ్యద్ అక్బర్‌షా హుసేని" ఇతనికి "బడే సాహెబ్" అను నామాంతరమును కలదు. భారతీయాలంకారికులలో నూటికి కొంబదిపాళ్ళు వైదికమతానుయాయులే. ఇతడు మహమ్మదీయ మతస్థుడు ఆంధ్రుడు. సంస్కృతాంధ్రములపై అమిత మయిన ఆదరము కలవాడు. తాను

రచించుటే గాక చాలమంది సాహితీవరులను పోషించినారు. తెలుగుదేశము నేలిన రాజులు సంస్థానాధీశులు చాలమంది సంస్కృతాంధ్రములను పోషించిరి. కావి మహమ్మదీయప్రభు విట్లు సంస్కృతాంధ్రముల రెంటను విష్టాతుడై రెండు బాసల లోను సాహిత్యగ్రంథరచన మొనర్చుట యరిది. సంస్కృత సాహిత్యమంతయు వైదికమతముతో పెనవేసికొనిపోయిన దను ప్రవాదమున్న కీతని రచన మపవాద ప్రాయ మయినది. ఇతడు గ్రంథారంభమునందు ఇష్టదేవతాప్రార్థన మొనరించి దుః

> గురుం గణపతిం దుర్గాం వటుకం శివ మచ్యుతం
>
> బ్రహ్మాణం గిరిజాం లక్ష్మీం వాణీం వందే విభూతయే ॥

మహమ్మదీయు డయ్యును విట్టి ప్రార్థన మొనర్చి మతసహనమును ప్రదర్శించి యుదాత్తతను ప్రస్ఫుట మొనర్చినాడు. వెనువెంటనే గురు నమస్కార మొనర్చినాడు

> యస్యాంఘ్రి కమలద్వంద్వ ద్వంద్వతాపనివారణం ।
>
> తాం తం విపదాం (ద్దే) వ ద్యత గురుం ప్రణమామ్యహం॥

ఆంధ్ర గ్రంథము :-

లభ్యమయిన శృంగారమంజరి డా॥ వి. రాఘవన్‌గారిచే పరిష్కృతమై విపులపీఠికతో ప్రకటింపబడినది. ఇది సంస్కృత గ్రంథము. ఇతఃపూర్వము ఈ గ్రంథకర్తయే తెలుగున శృంగారమంజరిని రచించినాడు. తెలుగు ఉదాహరణములనే యిచ్చినాడు. మన దురదృష్టవశమున అది యింతవరకు లభ్యము కాలేదు. ఈ శృంగారమంజరి యా తెలుగుగ్రంథమునకు సంస్కృతీకరణ మని ఈ క్రింది విషయమును బట్టి తెలియుచున్నది

> తేనాంధ్ర భాషయాయా రచితః శృంగారమంజరీ గ్రంథః
>
> స్వయ మక్బరేణ భూపన్మకట న నిరంతరా క్రమికమలేన
>
> తద్విరచితాంధ్ర భాషాకలితాం శృంగారమంజరీ ఛాయామ్
>
> సేవధ్వం సురవాణీరచితాం రసతోషితా రసికభృంగాః

శృంగారమంజరి - 15-16 శ్లో॥

రచనా విధానము :-

భానుదత్తుడు రసమంజరిని రచింపగా గురజాల రంగశాయి దానికి ఆమోద మను పేరిట వ్యాఖ్య వ్రాసినాడు ఇతడు రసమంజరి పద్ధతిలో గ్రంథరచన మొనర్చి నాడు. పలుమారులు రసమంజరిని, ఆమోదమును పలుతావుల పేర్కొనినాడు, అవ సరమయిన తావులందు వానిని కర్కశముగ విమర్శించినాడు తన రచనా విధాన మును గూర్చి చెప్పుకొనిన మాటలు విలువైనవి. పూర్వరచిత గ్రంథముల నెన్నిటినో పరిశీలించినాడు. వానిలో యుక్తిసహము లయిన లక్షణములను సంగ్రహించి, యుక్తి దూరము లయిన వానిని విడచినాడు. పూర్వగ్రంథములలో లేని లక్షణములను ఇతడు వివరించినాడు. అయుక్తమయిన నామకరణ మొనర్చిన స్థలములం దితడు యుక్తియుక్తమయిన నామకరణ మొనర్చినాడు. విస్తరింపవలసిన స్థలముల విస్త రించి క్లుప్త మొనర్పవలసిన స్థలముల సంక్షిప్తపరచినాడు. ఇతడు పరిశీలించిన గ్రంథజాలమిది - రసమంజరీ, ఆమోద పరిమళ, శృంగారతిలక, రసికప్రియ, రసార్ణవ ప్రతాపరుద్రీయ, సుందర శృంగా , నరసకావ్య, దశరూపక, విలాసరత్నా కర, కావ్యపరీక్ష, కావ్యప్రకాశ ప్రభృతులు

నవరసముల నిత డాదరించినాడు.

నవరసేషు శృంగారస్య ప్రాధాన్యాత్

అని రసరాజముగా శృంగారమును పేర్కొనినాడు. రసానుకూలము లయిన సాత్త్వికభావములను సోదాహరణముగా వివరించినాడు. శృంగారరసమునకు నాయికా నాయకు లాలంబన విభావము లగుటచే వారిని సప్రభేదముగ నిరూపించినాడు.

ఇతడు లౌకికాలౌకిక రసములను పేర్కొనినాడు లౌకికరసము నాయికా నాయకులందును అలౌకికరసము కావ్యనాట్యములందు సామాజికగత మయి యుండు నని స్పష్టపరచినాడు. లౌకిక సంభాషణము మున్నగు బాహ్యాభ్యంతర సంభోగములచేత పారవశ్యకర మయిన సుఖము నాయికా నాయకులకే కలుగును కావ్యనాట్యములందు ఆకర్ణనావలోకనములచేతను, వచనరచనాభినయములచేతను నాయికా నాయకుల కటాక్షభుజాక్షేపాదులు, లజ్జాస్మితాదులు సామాజికులచే అనుభ వింపబడును [1],

అనురాగమున కితడు హృదయంగమ మయిన నిర్వచన మొసగినాడు. నాయికా నాయకులు కలసి యున్నపుడు పరస్పరానురక్తు లగుట మాత్రమే అనురాగము కాదు. వియోగసమయమున వేదనాజనక మగుటయు, సంగమాభిలాష యందు, అన్యాభిలాష గలుగకుండ ప్రవర్తింపజేయు(ట) గల్గినది అనురాగమని వచించినాడు. సహృదయతకు ఇతని ఆస్తిక్యబుద్ధి వన్నెబెట్టినది. అనురాగోద యమునకు కారణము దైవయోగ మనియు సౌందర్యాదిగుణములు కావనియు వచించినాడు. సౌందర్యాదు లుద్దీపకము లని తెల్పినాడు [1].

రసనిర్వచన విషయమున కావ్యప్రకాశలక్షణమును స్వీకరించినాడు.

నాయికా భేదములు రసమంజరి ననుసరించి యుదాహరించు చేగాక కొక్కోక మునకామ సూత్రముల ననుసరించి పద్మిన్యాది జాతులను సోదాహరణముగా వివరించినాడు.

పద్మిని సౌరభముతో గ్రంథమును ముగించినాడు —

---

1. న చ లౌకికోఽలౌకిక శ్చేతి ద్విధా. లౌకిక స్తు నాయికానాయకయోః అన్యస్తు కావ్యనాట్యయోః సామాజికేషు ప్రకాశతే. కథ మితిచేత్, లౌకిక సంభాషణాది బాహ్యాంతర సంభోగైః పారవశ్యకరసుఖోత్పత్తి ర్నాయికానాయకయో రేవ జాయతే ఇతి నాయికానాయకనిష్ఠ ఏవ లౌకికో రసః. కావ్యనాట్యయో రాకర్ణనావలోకనై ర్వచనరచనాభినయన ద్వారా నాయికానాయకయోః కటాక్షభుజక్షేపాదిలజ్జాస్మితాదయః సామాజికై రనుభూయన్తే. తేన తేషా మానందోఽభివ్యక్త ఇత్యలౌకిక స్సామాజికనిష్ఠ ఏవేతి రసమంజరీకార స్యాభిమతమ్.

2. అనురాగో నామ వియోగే వేదనాజక స్సన్ యత్సంగమాభిలాషే యోఽన్యాభిలాషం న జనయతి సతస్మిన్ అనురాగః — శృంగారమంజరి పు. 52 Hyderabad Archaeological Department Pub ication

ఏవం విధానురాగోదయే దైవయోగ ఏవ కారణం న సౌందర్యాది గుణాః ... అనురాగం ప్రతి దైవయోగ ఏవ కారణం సౌందర్యాదిగుణా స్తూద్దీపన విభావ ఏవోపయుక్తాః — పు, 52

అప్పారాయ యశశ్చంద్రోదయము

- ఆదివిళ్ళ వేంకటశాస్త్రి

అప్పారాయయశశ్చంద్రోదయమును ఆదివిళ్ళ వేంకటశాస్త్రి రచించినాడు. ఇతడు కాకరపర్రు గ్రామనివాసి. షడ్దర్శనీపారగు డయిన యజ్ఞనారాయణుని కుమారుడు. ఉద్దండపండితుడుగా ప్రసిద్ధి గన్నవాడు. సాహిత్యమందే గాక మీమాంసా, జ్యోతిషములలో గూడ సర్వతోముఖపాండిత్యము గలవాడు. పాండిత్యముతో పాటు కవితాపాటవమును నలవడినది. సంస్కృతమునందు "చిత్రబంధరామాయణము" వ్రాసినాడు ఇది యమకములతోను బంధకవిత్వములతోడను గూడిన రచన. ఈతని యీ కావ్యమునకు ఇతని తండ్రి యజ్ఞనారాయణుడు వ్యాఖ్యానము వ్రాసినాడు. వేంకటశాస్త్రి నూజివీటి నరసప్పారావుగారి కకింతముగా "అప్పారాయయశశ్చంద్రోదయము" అనెడి అలంకారగ్రంథమును రచించినాడు.

సర్కారులలోని సంస్థానములలో నూజివీడు సాహిత్యపోషణవిషయమున పేర్కొనదగినది. సాహితీపోషకు లయిన నూజివీటిప్రభువులలో మేకా నరసప్పారావు గారు ప్రసిద్ధులు. వీరు నూజివీటినగరనిర్మాత లయిన ఇమ్మడి విజయఅప్పారావుగారి మనుమలు ఈ నరసింహ అప్పారావుగారు వేంకటాద్ర్యప్పారావు, రమణాంబ గారల పుత్రుడు. కుమార ధూర్జటి, దిట్టకవి పాపరాజు మున్నగు కవులీతని వాల్లభ్యమున విలసిల్లిరి. వీరి ప్రాపులోనే కాకరపర్తి పండితులు ప్రసిద్ధిచెందిరి. వేంకటశాస్త్రిగారు 1735 ప్రాంతమువారు.

అప్పారాయయశశ్చంద్రోదయము

ఇది యొక యలంకారగ్రంధము ఇది నూజివీటి ప్రభువరు డయిన శ్రీ నారసింహాప్పరాయ యశోవర్ణనాత్మకముగా రచింపబడినది. వారి వంశీయు లయిన నారయ్యప్పారావు, సింహాద్ర్యప్పారావు గారలచే 1915లో ముద్రింపబడినది.

చంద్రోదయ మను గ్రంథనామమునకు అనుగుణముగ వింధలి పరిచ్ఛేదములు కళలుగ పేర్కొనబడినవి. చంద్రుడు షోడశకళాత్మకు డగుటచే గ్రంథము 16 భాగములుగా విభజింపబడినది.

[1] 1. గ్రంథారంభ సమర్థనము

2. వర్ణగణ వివేచనము

3. నాయక నిరూపణము

4. వాచ్యవాచక తద్వృత్తినిరూపణము

5. లక్ష్యలక్షక తద్వృత్తినిరూపణము

6. వ్యంగ్యవ్యంజక తద్వృత్తినిరూపణము

7. దోషనిరూపణము

8. గుణ నిరూపణము

9. శబ్దాలంకార నిరూపణము

10 అర్థాలంకార నిరూపణము

11. ఉత్తమకావ్య నిరూపణము

12. మధ్యమకావ్య నిరూపణము

13, అధమకావ్య నిరూపణము

14. వృత్త్యాది నిరూపణము

15. శ్రవ్యప్రబంధ నిరూపణము

16. దృశ్యకావ్యలక్షణ నిరూపణము

అంకిత విధానము అలంకార శాస్త్రరచనలలో ఆంధ్రుల ప్రత్యేకత. నాయకుని వర్ణనముచే గ్రంథమున ఉత్కర్ష పెరుగును. లోకోత్తరుడయిన నాయకుని వర్ణించుటచే కవియొక్క అల్పమయిన వాగ్వృత్తి సఫలము విద్వాంసులకు కర్ణావతంస మగునని భోజుడు వచించినాడు. అట్లే యితడును నరసింహభూపాలుని నాయకునిగా నొనర్చి ఈ శాస్త్రగ్రంథమును రచించునట్లు గ్రంథారంభ సమర్థనమంతయు వచించియున్నాడు. ఇదని యితరొక విశేషమును ప్రశంసించినారు. కాదంబరీవచన రచనమును దలపించు నటుల నాయకుని వర్ణనమునొనర్చినాడు. ప్రతాపరుద్రీయమున నాయకుని గూర్చి వర్ణించినను ఇట్లు వచనరచనమును చేయలేదు.

ఇందు రససంబంధమయిన పరిచ్ఛేదము ఉత్తమకావ్య నిరూపణము. రసము అసంలక్ష్యక్రమవ్యంగ్య మగుటచే దాని నుత్తమకావ్యముగా పరిగణించినాడు. రస సిద్ధాంత విషయమునం దితడు చాలవఱకు జగన్నాథు ననుసరించినాడు. రసరాజముగా శృంగారమును పరిగణించి ధ్వనికారుని శ్లోక ముదాహరించినాడు. ఇతడు నవరసవాది. దేవాది విషయకమయిన రతి భావమే కాని రసము కాదని భక్తికి రసత్వము నిర సించినాడు.

రసాభాసము

రసాభాసమందలి త్రైవిధ్యము నితడు "ఏకత్రైవానురాగశ్చే" దిత్యాది శ్లోక ముచే సూచించినాడు. కాని కొందరి మతముగా తిర్యగ్గత మయిన రతి రసమనియే వచించినాడు. దాని కుదాహరణముగా

దదౌ రసా త్పంకజరేణుగన్ధి
గజాయ గండూషజలం కరేణుః
అర్ధోపభుక్తేన బిసేన జాయాం
సమ్భావయామాస రథాంగనామా

అను కుమారసంభవశ్లోకము నుదాహరించినాడు. ఇతడు ప్రతిప్రకరణమునకు చివర వేర్వేరు శ్లోకములను వ్రాయక మకుటప్రాయమయిన ఒకే శ్లోకమును నిబంధించి నాడు. అందలి రూపకము శ్లేషమనోహరముగ నుండుటయే దానికి హేతువు.

ఏష స్వప్రసరై స్సదా కువలయోల్లాసప్రద స్సద్విజ
గ్రామాస్వాదితవైభవో నిజకళాసందోహసంస్ఫూర్తితః
దూరాపాస్తతమస్తతి శ్చిరతరం పక్షద్వయే వ్యక్షతో
నిర్దోషో నరసింహభూపతి యశశ్చంద్రోదయో ద్యోతతామ్

కల్లినాథుడు

స్వతంత్ర గ్రంథములను వ్రాసి కొందఱాంధ్రులు అలంకార శాస్త్రమునకు సేవచేయగా మఱికొందఱు సంస్కృత గ్రంథముల వ్యాఖ్యానములను వెలువరించి సేవచేసిరి. స్వీయాభిప్రాయ ప్రకటనము కంటె పరేంగితావగాహిత్వము ఒక విధ

ముగా విశిష్టమైనది. దీనిని సులభసుందరముగను, విశిష్టవిషయ సంకలితముగను ప్రక టించుట వ్యాఖ్యానమునకు ఆయువుపట్టు. దాని నెరిగిన వ్యాఖ్యాతలలో కల్లినాధుడు మొదటివాడు.

లక్ష్మీధరుని కుమారుడయిన కల్లినాధుడు ఇమ్మడి దేవరాయల కాలములో నుండెను. అనగా పదిహేనవ శతాబ్దము. సంగీత రత్నాకరమునకు ఇతడు కళానిధి అను పేరిట వ్యాఖ్య వ్రాసెను. ఇంతకు ముందే సంగీత రత్నాకరమునకు సర్వజ్ఞ సింగ భూపాలునిచే సుధానిధి వ్యాఖ్య వ్రాయబడినది. శాస్త్ర వ్యాఖ్యా రచనములో రెండు విభిన్న పద్ధతులు గలవు. మూలమును వివరణాత్మకముగా దృష్టాంత పూర్వకముగా విశేష విషయ సమన్వితముగా తీర్చిదిద్దు పద్ధతి ఒకటి. ఇది అభినవ గుప్తాదులు ఆదరించిన పద్ధతి. అట్లుకాక మూలమును సులభపరచుచు టీకా రూప మున వ్రాయు పద్ధతి మరియొకటి. సంగీత రత్నాకరమునకు వెలసిన వ్యాఖ్యలు రెండునూ ఈ రెండవ పద్ధతినే ఎక్కువగా అనుసరించినవి. అయిననూ కల్లినాథుడు శాస్త్రార్థమును విస్పష్టముగా విశదీకరించి చూపును.

సంగీత రత్నాకరమున సప్తమాధ్యాయమున నవరసములు వివరింపబడి నవి. వాని కన్నిటికి సులభతరమగు టీక వ్రాసినాడితడు. విరుద్ధరసములను వివ రించి చివరకు సారాంశమును ఇట్లు తేల్చి చెప్పెను.

ఉయర్థమ :- శృంగార బీభత్సాదీనాం ఏకాశ్రయత్వే విరోధో దుర్నివార ఏవ- భిన్నాశ్రయత్వేతు విరోధో నాస్తీతి.

మొత్తము మీద ఈతని వ్యాఖ్య "నామూలం లిఖ్యతే కించిత్

నానపేక్షిత ముచ్యతే" అను మల్లినాథుని సూక్తికి నిదర్శనప్రాయముగా మున్నది.

మల్లినాథుడు

కాళిదాసు కావ్యపరిమళములకు గంధవహుడయిన మల్లినాథుడు శాస్త్ర వ్యాఖ్యాతగా కూడ ప్రసిద్ధివహించినాడు. విద్యాధరుడు వ్రాసిన ఏకావళికి తరల వ్యాఖ్యానమును రచించినాడు. కాళిదాసు కావ్యసౌరభములను సమగ్రముగ నాస్వ

దించిన వాడగుటచే కాబోలు ప్రార్థనా శ్లోకమును సయితము కావ్యధోరణిలో రచించినాడు.

అగ్రే కృత్వా ప్రియ సహచరీ మంతికం సంప్రయాంతీం
వ్రీడాభారా దవనతముఖీ మంబికా మాదరేణ
లీలాపాంగాం ప్రణయమధురం లోచనాన్తేన పశ్యన్
అంతస్తుష్య న్నవతు భగవా నంబికావల్లభో నః

ఉమాశంకరుల అలౌకిక శృంగారము ఇందు సూచింపబడినది.

మల్లినాథుని [1] సవిషయక మైన యూహలు తెలియవలె నన్నచో అసంలక్ష్య క్రమ వ్యంగ్య భేదము లను తృతీయోన్మేషము న దర్శింపదగును. శృంగారవీర కరుణాదుల యనుక్రమమునందు గల పరమార్థమును ఇట్లు సూచించినాడు.

"అత్ర కామస్య సకల జీవలోకానంద కందలన క్షమతయా సర్వాన్ప్రతి హృద్యత్వేన తన్మూలః పూర్వం నిర్దిష్టః శృంగారః తదనుగామితయా హాస్యః తన్నిరపేక్షభావత్వాత్ తద్విపరీతః కరుణః తత స్తన్నిమిత్త మర్థప్రధానః రౌద్రః- అథ కామార్థయో ర్ధర్మమూలత్వాత్ ధర్మప్రధానో వీరః తస్య భీ భయ ప్రధాన సార త్వాత్ వీరానంతరం భయానకః తద్విభావ సాధారణ సంభవా చ్చ తద్ధేతుః తతో బీభత్స ఇతి యద్వీరేణాక్షిప్తం వీరస్య పర్యంతే అద్భుతః ఫల మితి తదనువాదాం- తతః త్రివర్గాత్మక ప్రవృత్తి ధర్మ విపరీతనివృత్తి ధర్మాత్మకః అపవర్గఫలశ్శాంతః -

1. ఈ సమన్వయము కుమారసమును మార్గదర్శక మైనది దీనికి అభినవ భారతి మూలమయ్యును [2], దానికంటె ఇది సుప్రసన్నరీతి నాశ్రయించిన దగుట సహృదయైకవేద్యము

1. చూడుడు - ప్రతాపరుద్రీయము - రత్నాపణవ్యాఖ్య పు 185
2. చూడుడు - అభినవభారతి - భారతి - అధ్యా - 6 పు 267

రసాభాస విషయమున తండ్రి కొడుకు లిద్దరును విరుద్ధ విషయకములైన గ్రంథములకు వ్యాఖ్యానములు వ్రాసినారు. తిర్యగత మైన రతి శృంగారమే కాని రసాభాసము కాదని విద్యాధరుడు. దానికి వ్యాఖ్యానము మల్లినాథుడు వ్రాసినాడు. తిర్యగ్గతరతి రసాభాస మనిన ప్రతాపరుద్రీయమునకు కుమారుడు వ్యాఖ్యానము వ్రాసినాడు. పరస్పర విరుద్ధ విషయములగు గ్రంథములకు వ్యాఖ్యానము వ్రాసిన వారయ్యును మూలకర్తల యభిప్రాయములకు పోషకమైన వ్యాఖ్యానములు వ్రాసిరి కాని ఖండింపలేదు.

భావశబలతకు ప్రసిద్ధమైన శ్లోకమునే విద్యాధరు డుదాహరించినాడు

క్వాకార్యం శశలక్ష్మణః క్వచ కులం భూయోఽపి దృశ్యేత సా
దోషాణా ముపశాంతయే శ్రుత మహో కోపేపి కాంతం ముఖం
కిం వక్ష్యం త్యపకల్మషాః కృతధియః స్వప్నేపి సా దుర్లభా
చేతస్స్వాస్థ్య ముపైహి కః ఖలు యువా ధన్యోఽధరం పాస్యతి

ఈ శ్లోకమునకు అవతర సన్నివేశములను పలువురు పలువిధములుగ నూహించిరి చాలమంది ఊర్వశిని చూచిన పురూరవుని యూహ లనిరి మల్లా లక్ష్మణశాస్త్రి కావ్యప్రకాశ వ్యాఖ్యలో[1] దేవయానిని చూచిన యయాతి భావములుగా నుదాహరించినాడు. ఈ రెండు భావములకు భిన్నముగా మల్లినాథుడు "శకుంతలను చూచిన దుష్యంతుని వాక్యములుగా పేర్కొనినాడు. మల్లినాథుని వ్యాఖ్యకు శ్రీ జమ్మలమడక మాధవరామశర్మగారి యనువాదము నిట చూపుచున్నాను.

"దీని సంగతిని నిర్దేశించుటలో నిట్టి భావము లున్నవి. ఊర్వశియందాసక్తుడయిన పురూరవుని భావము లిట్లున్న వని కొందరు పూర్వతను లనిరి. వ్యాఖ్యా రచయిత మల్లినాథు డిట్లనుచున్నాడు- శకుంతల యే కులమున జన్మించినదో తెలియకుండగనే ఆసక్తుడయిన దుష్యంతుడు బ్రాహ్మణీ శంకాకలిత చేతస్కుడై యిట్లు పలుకుట భావనీయము" అని.

---

[1]. కావ్యప్రకాశవ్యాఖ్య - పు 98 - వావిళ్ళవారి ప్రతి-చతుర్థోల్లాసము.

శ్లోక మెచ్చటి దైనను దాని నితడు శాస్త్రాప్తకముగ వింగడించిన తీరు సుప్రసన్నమై పాఠకులకు సుబోధకముగ నున్నది. శాస్త్రకాఠిన్యమును పలుచన చేయు శక్తి మల్లినాథునకు వెన్నతో పెట్టిన విద్య యనిపించును.

ఇతడు రసమున కావ్యదవస్థ చమత్కారి కాదు కావున రసశాంతి యుండ దని తిరస్కరించినాడు.

మల్లినాథుడు వ్యాఖ్యా విధానమునకు పరససుందరమైన మార్గమును ఆయత్తపరచి సిద్ధాంత విశ్లేషణమునకు దోహద మొనర్చినాడు.

కుమారస్వామి సోమ పీథి –

సాహిత్య శాస్త్రము నభ్యసింప మొదలిడిన జిజ్ఞాసువులు ప్రథమమున చేతబట్టు గ్రంథము ప్రతాపరుద్రీయము దానికి ప్రసిద్ధమైన రత్నాపణ వ్యాఖ్య వ్రాసిన వాడు కుమారస్వామి. ఇతడు సోమపీథి. ఇతడు పదవాక్య ప్రమాణపారావారీణుడని మహామహోపాధ్యాయుడని ప్రసిద్ధివహించిన వ్యాఖ్యాతృశిరోమణి మల్లినాథుని కుమారుడు. తండ్రివలెనే "నామూలం లిఖ్యతే కించి న్నానపేక్షిత ముచ్యతే" అను సూక్తి నాదరించిన వాడు కుమారస్వామి - కావున ఈతని స్వతంత్రాభిప్రాయములని వేనిని స్పష్టముగ పేర్కొనలేము. కాని వీరైనంతలో ఈతని అభిప్రాయములని కొన్నిటిని సూచనామాత్రముగ చూపగలము. వాని నిట పొందుపరతును.

అలంకార శాస్త్రమునకు ప్రమేయమును సూచించుచు నిట్లనినాడు. రసాలంకారాద్యనేక విషయక మయ్యును ఈ శాస్త్రమును అలంకార శాస్త్ర మనుట ఛత్రిన్యాయానుసారమే యనినాడు. ఇచట "సర్వస్వం రసాదిప్రమేయం సంగృహ్యతే. సంక్షేప వైశద్యాభ్యాం రసాది సర్వప్రమేయ ప్రతిపాదనాత్సర్వోత్కృష్ట స్స్వగ్రంథఇతి సూచితో భవతి" అని రసప్రాధాన్యమును తెల్పినాడు.

"రసప్రధానా శ్శబ్దార్థాః" అను శ్లోకమునకు వ్యాఖ్య వ్రాయుచు "స్వాత్మమాత్ర విశ్రాంతత్వేన ప్రాధాన్యా ద్రసస్యైవ ముఖ్యం జీవితత్వం – వస్త్వలంకారవ్యంగ్యయో స్తు సర్వధా రసపర్యవసానేనా ప్రాధాన్యా త్తదభావేపి,.... ...., ...,

రసము స్వాత్మమాత్ర విశ్రాంత లక్షణము కలదగుటచే అది కావ్యాత్మ యనియు వస్త్వలంకార ధ్వనులు రసపర్యవసానముచే అప్రాధాన్యమునే భజించు ననియు స్పష్టపరచినాడు.

వ్యాఖ్యాకారు డగుటచే సర్వగ్రంథముల పరిచయము మాత్రమే గాక తద్గ్రంథ విషయము లు సయితము ఉపస్థితిలో నున్నవాడు.

[1]. నిరుపాధికమైన బ్రహ్మానందముతో తుల్యమైన రసమునకు సన్నిహిత పూర్వావస్థయే స్థాయిభావము -కాని స్థాయిభావము ఉపాది సహితము కదా వీనికి అవస్థాసంబంధ మెట్లని ఆశంకించుకొని చక్కని సమాధాన మిచ్చినాడు చంద్రు డాకాశముపై ప్రకాశించుచున్నాడు. నీటిలో ప్రతిఫలించుచున్నాడు.

నీరు కదలినది. చంద్రుడును కదలినాడు. నిజమునకు చంద్రున కుపాధి లేదు. నీటిలో ప్రతిఫలనము ఉపాధిభూతము - దానివలన చంద్రుడును కదలినట్లు తోచుచున్నాడు. రమ్యమయిన యుదాహరణము నిచ్చి వేదాంతశాస్త్ర పారీణతను స్పష్టపరచినాడు.

రస సార్వ భౌ మ ము -

రసములను గూర్చి, తత్సంఖ్యను గూర్చి ఆలంకారికులు పలువిధములైన అభిప్రాయములను వ్యక్తపరచిరి. కాని రస రాజము ఏది అను విషయమై చాలమంది శృంగారమునే సూచించిరి. "శృంగార ఏవ మధురః పరః ప్రహ్లాదనో రసః "అని ఆనందవర్ధనుడు తెల్పినాడు. ఆ విషయ మీతనికి మిక్కిలి నచ్చియుండును. మూల మున సందర్భము లేకున్నను సందర్భమును కల్పించుకొని తన వ్యాఖ్యానసూచన చేసినాడు. కావ్యప్రకరణమున కైశికీవృత్తి కిచ్చిన యుదాహరణ శ్లోకమును వ్యాఖ్యా నించుచు శృంగారము రససార్వభౌమ మని సూచించినాడు. [1]. ఆంధ్రుడైన విశ్వే శ్వరుడును శృంగారము రససామ్రాజ్యార్హమైన దని నుడివియున్నాడు.

---

[1]. వస్తుతః భేదమాత్రశంకాకళంకరహితస్య నిరుపాధికస్య సన్మాత్రస్యావస్థా సంబంధః కథ మితి శంకనీయం- గగనమధ్య మధ్యాసీనస్య సుధానిధే రుద కాద్యుపాధి సంబంధ నిబంధన చాంచల్యాదివదుపపత్తేః

రత్నాపణము - పు 184

ఇతడు సందర్భవశమున చాలమంది పూర్వాలంకారికులను పేర్కొనినాడు. భరతుడు, ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు, శారదాతనయుడు, హేమచంద్రుడు, సర్వజ్ఞ సింగభూపాలుడు మున్నగు వారిని స్మరించినాడు. మహోపాధ్యాయ నరహరి సూరి యని యొక గ్రంథకర్తను (పు 24౧) పేర్కొనినాడు. అతని గ్రంథమేమియో తెలియదు.

వ్యాఖ్యానరీతి :- 'వ్యాఖ్యాతృశిరోమణి' యనిపించుకొనిన మల్లినాథుని యాత్మజుడు కదా! కుమారస్వామి - అతడు కాళిదాసు కావ్యత్రయమునకు వ్యాఖ్యలు వ్రాసినాడు. ఇచట ఒక విషయము ప్రస్తావనార్హము. సంస్కృతమున కావ్యవ్యాఖ్యానములు మూలమును సుబోధ మొనర్చుటకు సరసతా సంపాదనమునకు వెలువడినవి. ఆ విధానము మల్లినాథునకు సుపరిచితమైనది. తానా మార్గమున వెడలి ఇతరుల ఘంటాపథమును తీర్చిదిద్దినాడు. శాస్త్రవ్యాఖ్యానము దీనికి విరుద్ధముగ నుండును. విషయ బాహుళ్య నివేదనమునకు, దళసార్థక్య నివేదనమునకు, శాస్త్రపారిభాషిక సంప్రదాయముల సమన్వయమునకు శాస్త్రవ్యాఖ్యానము లేర్పడినవి. ఇట్టివి వ్యాకరణాది శాస్త్రముల కేర్పడిన వ్యాఖ్యానములు. కాని అలంకార శాస్త్రమున కట్టి వ్యాఖ్యానములు హృదయంగమములు కావు. కారణమా శాస్త్ర పద్ధతియే. అలంకారశాస్త్రము కర్కశమైన శాస్త్రముకాదు. సుందరమైన కావ్యమును కాదు. లలితమైన శాస్త్రము, ప్రౌఢమైన కావ్యము కావున శాస్త్రవ్యాఖ్యల కావ్యధోరణులు రెండును సంతరించుకొనిన అలంకారశాస్త్రమునకు మధ్యేమార్గ మావశ్యకమయినది. దానికి కూడ మల్లినాథుడు మార్గదర్శకుడైనాడు. ఏకావళికి తరలవ్యాఖ్య వ్రాసినాడు. అదే మార్గమున పయనించి కుమారస్వామి తండ్రిని మించిన కొడుకయినాడు. రసనిష్పత్తిని సూచించునపుడు ఈతని వ్యాఖ్య పరిశీలించినచో పై విషయము స్పష్టపడును.

వింగడింపు : వ్యాఖ్యాకారునకు సామాన్యముగ మూలకర్తపై సానుభూతి యుండుట సహజము. అంతమాత్రమున వ్యాఖ్యాత మూలకర్త యశము నినుమడింపజేయలేదు. క్లిష్టఘట్టములందు స్వవచోవ్యాఘాత దోషము మూలకర్తకు చెందనీయక విషయమును వేర్పాగా వింగడించు సామర్థ్యము కావలెను. అది ప్రతిభాసంపాద్యము వ్యుత్పత్తి పరిపుష్టము. కుమారస్వామి వ్యాఖ్యాన మీ రెండు శక్తులకు నిలయమై వెలయుచున్నది. కావుననే నేటికిని ఆంధ్రదేశమున రత్నాపణవ్యాఖ్యలో ప్రతాపరుద్రీయపఠనపాఠనములు సాగుటయు మీదు మిక్కిలి ప్రతాపరుద్రీయమూల

ముతో సహా రత్నాపణవ్యాఖ్యను నయితము కంఠస్థ మొనరించుటయు జరుగుచున్నది. ఒక్క ఉదాహరణమును పరికించుడు.

ప్రతాపరుద్రీయమున రససాంకర్యము నుదాహరించి వెంటనే "అత్ర రసో నాయకాశ్రయ ఏవ" అని కంఠోక్తిగా రసము నాయకాశ్రయమని వచించి అది నిపుణులైన నటుల చేష్టలచేతను, కావ్యశ్రవణము వలనను సామాజికులచే బాగుగా భావింపబడును; కావున పరగతమైన రసముయొక్క సమ్యగ్భావనముచే నిరతిశయా నందము కల్గుననినాడు [1]. ఇందు రసము నాయకాశ్రయ మనుట దోషముగా పొడ కట్టును. వెనువెంటనే అది సామాజికులకు ఆనంద జనక మనుటయు స్వవచోవ్యా ఘాత మనిపించును ఇది మూలమున నున్న వైరుధ్యము. నిజమున కిది వైరుధ్యము కాదు. పూర్వాపరగ్రంథపరిచితి కల్గి సమన్వయజ్ఞాన మున్నచో దీనిని తొల గింపవచ్చును. అది వ్యాఖ్యాతృకృత్యము. దాని నితడు చక్కగా నిర్వహించి నాడు. రసము లౌకిక మనియు, అలౌకిక మనియు ద్వివిధ మనినాడు లౌకిక రసము నాయకాశ్రయము, కావ్యనాట్యములలో సామాజికగతము, అది అలౌకికము అని వింగడించినాడు. వైరుధ్యము తొలగినది. వైశిష్ట్యము పెరిగినది. ఇట్టి స్థలములు ఇతని వ్యాఖ్యానమునకు వన్నె తెచ్చిన వనుట అత్యుక్తి కాదు.

మూలకర్త రసవిషయమై ఎక్కువగా శృంగార తిలకమును స్మరింపగా నీతడు తన్మూలమైన నాట్యశాస్త్ర, ధ్వన్యాలోక, లోచనములను మిక్కిలి స్మరించును.

"రసాభిజ్ఞానయోగ్యత్వం భావ ఇత్యభిధీయతే" అను కారికను వ్యాఖ్యా నించుచు "బాల్య యౌవనసంధావుత్పన్నః శృంగార విషయః ప్రథమోఽంతః కరణ వికారో భావః" (నవయౌవన శైశవముల నడిమి వయసున గలిగిన శృంగార విష యికమైన అంతఃకరణవికారమే భావము) అనుట సమంజసముగ నున్నది. మూల భావమును విశేషవిషయ పరిపుష్ట మొనర్చినది.

ఇట్లు కుమారస్వామి వ్యాఖ్యాత యయ్యును రససిద్ధాంత పరిపోషణవిషయ మున స్వతంత్ర గ్రంథకర్త స్థాయిని చేరుకొనినాడు.

---

[1] అత్ర రసో నాయకాశ్రయ ఏవ. యది పరం నిపుణనటచేష్టయా తథావిధ కావ్యశ్రవణబలేన సామాజికైః స్పాక్షాద్భావ్యతే తథా పర[illegible]ప్యపి సమ్యగ్భా వనయా పరత్ర నిరతిశయానంద జనన మవిరుద్ధమ్ పు 241.

మల్లాది లక్ష్మణశాస్త్రి

సంస్కృతాలంకార గ్రంథములలో ప్రామాణిక గ్రంథమయిన కావ్యప్రకాశమునకు వెలువడిన అసంఖ్యేయ వ్యాఖ్యానములలో మల్లాది లక్ష్మణశాస్త్రి వెలయించిన బుధమనోరంజనీ వ్యాఖ్య యొకటి. కాశ్మీరదేశీయుని గ్రంథమునకు ఆంధ్రుడు వ్యాఖ్యను గూర్చి శోభను కల్గించినాడు. ఒకనాటి సమాజమున కావ్య ప్రకాశమునకు వ్యాఖ్యను వెలవరించినవాడు మహా మహోపాధ్యాయ బిరుదముతో సత్కరింపబడెడివాడు. అట్టి ఖ్యాతినందిన గ్రంథమునకు ఆంధ్రుడుగా మల్లాది లక్ష్మణశాస్త్రి వ్యాఖ్యాన మొనర్చుట మనకు గర్వకారణమయిన విషయము.

మందరము - బుధమనోరంజని

ఈ వ్యాఖ్యాతయే ధర్మసూరి సాహిత్య రత్నాకరమునకు మందరము వ్యాఖ్యానమును నయితము రచియించెను. ఆనాటి కతని మనస్థితి యింకను స్వోత్కర్షను ప్రదర్శించుటలో నగ్నమై యుండెను. నౌకానామక మయిన తత్పూర్వ వ్యాఖ్యానము నతడు నిరాదరించుచు పలికిన శ్లోకములను జూడుడు —

సాహిత్యరత్నాకరతత్త్వబోధే
నాలం హి నౌకేతి విరేము రేకే
కేచి ద్విమోహా న్మృగతృష్ణికాయాం
వాతాయువ స్తత్ర ముధా భ్రమంతి ॥
సాహిత్యరత్నాకర మప్రమేయం
మథామథిత్వా మమ మంధరేణ
గృహ్ణన్తు సర్వే విబుధా యథేచ్ఛం
గుణాదిరత్నాని రసామృతం చ॥

(మందరము-సాహిత్యరత్నాకరవ్యాఖ్య- శ్లో 6-7-SKT Acadamy Edition)

కాని కావ్యప్రకాశ వ్యాఖ్యానమున నిట్టి స్వోత్కర్షపరాపకర్షలు రెండును గన్పింపవు. పరిణతమన స్థితితో నిష్పాక్షిక దృక్పథముతో రచించిన వ్యాఖ్య బుధ

మనోరంజని. సంస్కృతాలంకార గ్రంథములలో ప్రమాణ గ్రంథముగా పరిగణింప బడు కావ్య ప్రకాశమునకు పరిణత మనస్వినొండి వ్యాఖ్య వెలువడుట ఆనందదాయకము తత్కర్త ఆంధ్రుడగుట మనకు గర్వకారణము.

వ్యాఖ్యా విధానము :—

మల్లాది లక్ష్మణశాస్త్రి వ్యాఖ్యావిధానము ఒక విశిష్ట విస్పష్ట విధానములో నుండును. ఈ వ్యాఖ్యావిధానమున మూలవిషయ సమన్వయమునకయి నూతనోదాహరణముల నివ్వగలుగుట, బహు గ్రంథములనుండి విషయములను క్రోడీకరింపగల్గుట, మొదలగు విషయము లవశ్యసమాదరణీయములు. "సకల ప్రయోజన మౌళిభూతం సమనంతరమేవ రసాస్వాదన సముద్భూతం విగళిత వేద్యాంతరం పరమానందం"—దీనిని వ్యాఖ్యానించుచు - విగళిత వేద్యాంతరం – విగళితాని జీర్ణపర్ణ ప్రతిపాట్యాత్రుటితాని వేద్యాంతరాణి విషయాంతర సంస్పర్శరహిత మితి యావత్ ...అని వ్యాఖ్యానించెను.

ఈ భావమును "ఉర్వారుక మివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్" అను వైదిక ప్రార్థనమును తలపించుచున్నది.

విషయమును సూక్ష్మదృష్టితో పరిశీలించి వివరించుట యీ వ్యాఖ్యాత విశిష్టత. రససూత్ర వ్యాఖ్యానమున భట్టలోల్లటుని మతమును వివరించుచు రసమనను విభావాదులలో నొక్కొక్కదానితో నొక్కొక్క సంబంధమును వచియించినాడు.

సూత్రే సంయోగపదం - విభావైః కార్యకారణ సంబంధపరం - అనుభావైః జ్ఞాప్య జ్ఞాపక సంబంధపరం - వ్యభిచారిభిశ్చ పోష్యపోషకరూప సంబంధపరం - నిష్పత్తిపదం చ యథాక్రమం-ఉత్పత్తి-జ్ఞప్తి-పుష్టి పరం బోధ్యమ్(2)

అభినవగుప్తుని మతమున సంయోగ పదమునకు సంవలనార్థము నిచ్చినాడు. "సూత్రస్థ సంయోగపదం సంవలనపరం—(3)

---

1. కావ్య ప్రకాశవ్యాఖ్య - పు - 11
2. ,, పు - 68
3. ,, పు - 75

ఇతని వ్యాఖ్యావిధానములో ఆధునికత స్పష్టముగా గోచర మగుచుండును. శైలిలోగాని, విషయవ్యక్తీకృతిలోగాని కుటిలత గోచరింపదు. చెప్పదలచిన విషయమును సూటిగ సుందరముగ వివరించును. అది ఆధునికత వలన ఏర్పడినదే యన వచ్చును. ప్రాచీన వ్యాఖ్యానముల నొకచో మూలముకన్న వ్యాఖ్య కష్టమయిన సందర్భములను లేకపోలేదు. అట్టి పరిస్థితిని కల్పింపక ఇతడు సువ్యక్త ధోరణిలో వ్యాఖ్యను గూర్చినాడు. శ్రీ శంకుకుని మతమును వివరించుచు "సమ్యక్, మిథ్యా, సంశయ, సాదృశ్య ప్రతీతులకన్న వైలక్షణ్యమును రసప్రతీతికి సాధించెడి సందర్భమున ఇతని పంక్తులు.

"లోకే ప్రతీతి శ్చతుర్విధా సమ్యక్, మిథ్యా, సంశయ, సాదృశ్య భేదాత్. తద్విలక్షణా ప్రతీతీ రసానుకూలేతి ప్రతిపాదయితుం ప్రతీతేః చాతుర్విధ్యం తావ ద్వక్తుం సమ్యక్ప్రతీతిః ప్రథమం దర్శయతి..........యథా చిత్రతురంగ ప్రతీతిః ప్రతీత్యాంతర విలక్షణా తథా నటే రామప్రతీతి రితి భావః ॥

(కావ్య ప్రకాశవ్యాఖ్య పు - 68, 69

చర్ల వేంకటసూరి

వారణాసి ధర్మసూరి సాహిత్యరత్నాకరమునకు "నౌకా" అను పేర వ్యాఖ్యానము రచియించిన మనీషి చర్ల వేంకటసూరి. వీరు ఆంధ్రుల పంట. సాహిత్యరత్నాకరమునకు ఇరువురు ఆంధ్రులు వ్యాఖ్యానములు వ్రాయుట ఆంధ్రలోకమునకు ముదావహమయిన విషయము. వీరిని గురించిన విశేషములు

"The Authors of the Nauka commentary Che ala Venkata Suri lived in the second half of she 18 th century. He was the son of Lakhmanaraya and Surimamba. He was a pupil of Anivilla Venkata Sastry of Kakaraparti Agrahara. West Godavari District - Andhra Pradesh"

(Preface to Sahitya Ratnakara by B. R. Sastry)

(Skt, Academmy Edition).

వీరు వైష్ణవులయ్యును హరిహరాభేదతత్త్వము నవగతము చేసికొనినారు. నౌకా వ్యాఖ్యారంభమున వీరి చంద్రశేఖరస్తుతి రూపమున శ్లోకమును చూడుడు.

"చూడాల మిందు కలయా కలయామి యామి
యామిన్యధీశనయనం జయిన పురాం చ
మందాకినీ చటుల తాంగతరంగ సంగ
త్వంగ జ్జటాఽమవశం శరణం గిరీశమ్"

(సాహిత్య రత్నాకరము పు-1)

వీరి వ్యాఖ్య సయితము సారళ్యమును ప్రోదిచేసికొన్నది. వీరు వలయు తావుల పద్యాంతరములను లక్షణ రూపముల నుదాహరించుచు అవసరమైన వ్యాకరణ విషయములను, కోశాదికములను ముచ్చటించుచు సుబోధకముగ వ్యాఖ్యను ప్రకటించిరి. ఇదియు మంథరముతో కలిపియే ప్రకటింపబడినది. ఇది సంస్కృత అకాడెమీ, ఉస్మానియా యూనివర్శిటీ హైదరాబాద్ వారిచే ముద్రితము.

ఆంధ్రుల వరివస్య-
తెలుగు

తెలుగు లక్షణ గ్రంథములు - రసపరామర్శ

సంస్కృతమున రసశాస్త్రము సమగ్ర పరిణతి నందిన దినములలో తెలుగు లక్షణ గ్రంథములు పొడసూపినవి. అట్లు తెలుగున వెలువడిన లక్షణ గ్రంథములలో మొదటిది ఆంధ్రశబ్ద చింతామణి. 11వ శతాబ్దమున నన్నయ దీనిని రచించినట్లు పలువుర యభిప్రాయము. తెలుగునకు సంస్కృతమున వెలసిన లక్షణ గ్రంథ మిది. నన్నయ కృతమని పరిగణింపబడుచున్నది. సంస్కృత భాషలో ఆర్యా శ్లోకములలో వ్రాయబడిన వింవలి సూత్రములు. నన్నయ తెలుగు భాషకు లక్షణము వ్రాయుచు ప్రథమమున కావ్య లక్షణమును ప్రయోజనమును విశదీకరించెను. సర్వలక్షణములును ప్రయోగాశ్రయములే కదా ! ప్రయోగాత్మకములు కావ్యములు. నన్నయలేఖిని నుండి భారతము తెలుగున కావ్యరూపమున వెలువడినది. కవి వృషభులు మహాకావ్యమని సంస్కృత భారతమును కీర్తింతురో లేదో కాని తెలుగు భారతమును మాత్రము తప్పక కావ్యమనియే కొనియాడుదురు. (సంస్కృతమున మహాభారతము కావ్యముగా గాక ఇతిహాసముగా ప్రసిద్ధికెక్కినది. కావ్యాంశ లేకపోలేదు కాని దానికి కావ్యాంశవలన తత్ప్రసిద్ధి సంక్రమింపలేదు) తెనుగున మాత్రము ఇతరాంశముల కంటె కావ్యాంశము చేతనే ప్రశస్తి కల్గినది. కావున కావ్య లక్షణమును ప్రథమమున నన్నయ స్పృశింపవలసి వచ్చినదనుట సమంజసము కాకపోదు. అట్టి కావ్య లక్షణమును స్పృశించిన తరువాత రస పరామర్శ చేసినాడు. కావ్యమున కాత్మభూతమైనది రసమగుననియే యాతని తలంపు. "విశ్వశ్రేయః కావ్యమ్" అని కావ్య నిర్వచనమును ప్రయోజన దృష్టితో నొనరించినాడు. తదదోషౌ పరిష్కృతౌ చ వాగర్థౌ" అని కావ్య శరీరమును నిర్వచించినాడు. ఈ సూత్రము "అదోషౌ సగుణౌ వనలంకృతీ పునః క్వాపి" అను మమ్మటుని నిర్వచనమును తలపించుచున్నది. వెనువెంటనే అతడు "సా వాగ్యా రసవృత్తిః, సాధ్యో హి రసో యథాయథం కవిభిః" అని వచించెను. శరీర లక్షణమును నిర్వచించి అది రసవృత్తి యని ప్రాణ లక్షణమును తెల్పెను. అట్టి రసము కవులచే సాధింపదగినదనియు కూడ వచించెను.

ఇట్లు తెలుగు లక్షణ గ్రంథములలో ఆనుషంగికముగ మొదట పరామర్శ చేసిన ఖ్యాతి నన్నయకే దక్కినది —

(a)అంతే గాక రసప్రసారభావులై, స్వస్థానవేషభాషాభిమానులైన సజ్జనులు వైకృత కావ్యములను నయితము అనితరాపేక్షులై శ్లాఘింతు రనెడి శ్లాఘనమునకు కారణము రసప్రలోభ మనుట గమనార్హము.

ఆంధ్రశబ్ద చింతామణికి ఎలకూచి బాలసరస్వతి మొట్టమొదట తెలుగులో టీక వ్రాసినాడు. ఇతనికి మహోపాధ్యాయుడనియు, సకల భాషా కవితా స్వతంత్ర భట్టారకు డనియు బిరుదు లున్నట్లు బాలసరస్వతీయ పరిచ్ఛేదాంత గద్యలవలన తెలియుచున్నది. ఇతడు తెలుగులో నుదాహరణముల నిచ్చి సులభమగు టీక వ్రాసినాడు. బాలసరస్వతి పై సూత్రములకు టీక వ్రాయుచు నిట్లు వచించినాడు. "భగవత్పరములు, జ్ఞానపరములు, సత్పురుషపరములు, ధర్మప్రవృత్తిపరములు నైన రసవత్కావ్యములు రసబలముచేత బలవదిష్టాను బంధులైన విషయములగు గ్రామ్యములగును అని వచించినాడు.

దేశభాషా కావ్యములకు రసప్రశస్తిచే వేదప్రామాణ్యమును సంఘటింపజేసినాడు.

కవిశిరోభూషణము లేక అహోబల పండితీయము అను పేర ఆంధ్రశబ్ద చింతామణికి సంస్కృతమునందే తెలుగు ఉదాహరణములతో వ్యాఖ్య వ్రాసినది అహోబలపతి. ఇతడు 16వ శతాబ్దమువాడు. ఆ దినములలో ఆంధ్రభాష పైనను, ఆంధ్ర కవితపైనను గల యనాదరమును సరసముగ నిరసించినాడు. తన్నిరసనమున కాధారముగ రసరామణీయకమును గ్రహించినాడు. (b)"అజ్ఞులు కొందఱాంధ్రకవితను నిందింతురు. అంతమాత్రమున దాని కెట్టి లోపమును రాదు. ఆ యా రసములతో నొప్పుచు మంజులములగు పదములతో వెలయు నాంధ్రకవిత నట్టువకత్తెవలె సహృదయుల నెల్లర నానందింపజేయును." (చిలుమర్తి రంగాచార్యులవారి యనువాదము)

---

a) స్వస్థాన వేషభాషాభిమతా స్సంతో రసప్రలుబ్ధధియః
లోకే బహుమన్యంతే వైకృతకావ్యాని చా న్యదపహాయ
(అహో పం 1-82 శ్లో కృత్యాది)

b) ఏతా మాంధ్ర పదాంకితాం సుకవితాం నిందంతి కేచిజ్జనాః
గాఢాజ్ఞాన విజృంభితా న హి తతో న్యూనత్వ మస్యా భవేత్
శైలూషీవ సభాసదో విరచయ త్యానంద పూర్ణాన్ సతః
సర్వానంద్రమయీ సువాగ్భిహారిణీ తత్తద్రసామోదినీ

ఇతడు రసవిషయమున అభినవగుప్తుని, మమ్మటుని తఱచు పరామర్శించు చుండును. ఇతడు పై సూత్రములకు వ్యాఖ్య వ్రాయుచు రససిద్ధాంతము నంతయు సంగ్రహముగ వచించెను. రససూత్రమును కావ్యప్రకాశమునుండి సంగ్రహించినాడు. భరతుడు రససూత్రమునకు ప్రథమప్రవక్త యయ్యును, భరతుని గ్రంథము అలంకార శాస్త్రగ్రంథముల పఠన పాఠన ప్రాచుర్యమును నంది యుండలేదు. అట్టి పఠన పాఠన ప్రాచుర్యమును యావద్దేశమునందును సంతరించుకొనినది కావ్యప్రకాశము. కావుననే దానికి ఇతర గ్రంథములకు వేనికి లేనన్ని వ్యాఖ్యలు వెలువడినవి. (a)ఈ నడుమనే వెలువడిన వార్తనుబట్టి మమ్మటుడే స్వయముగా కావ్యప్రకాశమునకు వ్యాఖ్య వ్రాసికొనినట్లు తెలియుచున్నది.

కావ్యప్రకాశమునకు వ్యాఖ్యవ్రాయుట యన నలంకారశాస్త్రమును సర్వము నవలోడన మొనరించుటగా నాడు పరిగణింపబడుట మైనది. ఈ ప్రాశస్త్యమును పురస్కరించుకొని అహోబలపతి ధ్వని మార్గానుయాయియై ధ్వని స్థాపన మొనర్చి తత్స్వాభిప్రాయ మైన రసమును నిరూపించినాడు. ఇతడు తాత్పర్యశక్తికి, వ్యంజనాశక్తికి భేదము లేదని వచించెను. తస్మిన్ పరాః తత్పరాః రసాదులయందు ఆసక్తములు తత్పరములనియు తద్భావమే తాత్పర్యమనియు గాన తాత్పర్య వ్యంజనా శక్తులు రెండును సమానములే యనియు జెప్పెను. రస మలక్ష్యక్రమ మని వివరించినాడు. విభావము ఆలంబన, ఉద్దీపన భేదములచే ద్వివిధమనియు, ఆలంబనము నాయికా నాయకు లనియు జెప్పి నాయికల భేదములు నాయకుల గుణములు, నాయక భేదములు ధీరోదాత్తాదుల లక్షణము తదనుగుణరసముల ప్రాధాన్యము, శృంగార నాయకులు, నాయక సహాయులు, ఉద్దీపన విభావములలో వాతువైవిధ్యము (గుణచేష్టాలంకార తటస్థులు అను భావములు, సాత్త్వికభావములు. వ్యభిచారి భావములు (33) పేర్కొనెను రససంఖ్యను, రస సమీకరణవాదమును, శాంతరసవాదమును, చిత్తవికాస విస్తర క్షోభ విక్షోభములను కలిగించు రసములు రసాభాసము (విద్యాధరుని రసాభాసాభిప్రాయము) పేర్కొనెను ఇది గాక వేర్వేరుగ నవరసములను భేద సహితముగ వివరించెను. శృంగారమును వివరించుచు శృంగార రస ప్రాధాన్యము సూచించెను. సంభోగ విప్రలంభ భేదములను జెప్పి సంభోగము సప్తవిధ మని

(a, 14-5-77వ తేదీ ఆంధ్రప్రభ

ప్రేమము, అభిలాషము, రాగము, స్నేహము, ప్రేమము, రతి, శృంగారము అను వానిని పేర్కొనెను

(ఇందు మొదటి ప్రేమము దిదృక్షయనియు రెండవది వియోగాసహిష్ణుత యనియు వివృతము)

మన్మథావస్థలను తెల్పి మరణము గాక మరణోద్యోగము వర్ణనీయమని సోదాహరణముగ తెల్పెను. రసముల జన్యజనక భావమును సూచించెను.

శాంతరసము శమస్థాయి భావాత్మక మని వచించెను. రసాధి దేవతలు వర్ణములు, వేదములు, సూచింపబడినవి అంతియగాక రససాంకర్యము భావోదయ భావ శాంత్యాదులు సయితము స్పృశింపబడినవి. కావ్యజీవితము రసధ్వని యని సప్రమాణముగ నిరూపింపబడినది.

నన్నయ సూత్రములకు వార్తికప్రాయములయిన కారికలను వ్రాసిన అథర్వణుడు సయితము

(a)"ప్రకృత్యుక్త ప్రకారేణ రచనా రసర జనీ ......
తత్తత్వం పరిగ్రాహ్యం యద్యత్సహృదయే హితమ్"

అని వ్యాకరణమునకు సయితము రసరంజనిమైన రచన మభిలషణీయమని వచించెను. దానికి వ్యాఖ్యవ్రాయుచు అహోబలపతి వివిధ రసములలో శబ్దముల యోగాయోగములను గూర్చి వచించి ఆయా రసములందు వికటి పదములు సయితము సహృదయహృదయాహ్లాదకత్వమును బట్టి పరిగ్రాహ్యము లని వచించెను. (b)

---

a) అథర్వణ కారికావళి. అజంత పరిచ్ఛేదము 91 - 93

b) కామం సంతు పరశ్శతం సుకవయో గంభీర వాగ్గుంభనా
రంభోజ్జృంభిలవై భవా మదుదితం వాక్యం శ్రుణుధ్వం పరం
విద్వాంసః కవయ స్త్సహోబలపతేః కోవాంధ్ర భాషామతే
ర్విజ్ఞానే సదృశో విచక్షణమతిః సర్వావనీమండలే,

కాకునూరి అప్పకవి

ఇతడు ఏసమ వెంగనార్యుల పుత్రుడు. కామేపల్లి నివాసుడు. 16వ శతాబ్ది వాడు. చింతామణికి పద్యములలో వ్యాఖ్య వ్రాసినాడు. ఇతడు "సా వాచ్యా రస వృత్తిః" అను సూత్రమునకు వ్యాఖ్య వ్రాయుచు రసవిషయ వివేచన మొనరించి నాడు. తత్పూర్వపీతవి గ్రంథము నుండి తెలియదగిన విశేషాంశమొండు కలదు. సార్వ గ్రంథనామ సంగ్రహమను పేరిట నిట్లు పేర్కొనెను.

"సంస్కృతమునకు నాంధ్రభాషకును దొల్లి
లక్షణములు శాకల్లె మల్లన సుధీంద్ర
చిన్నకోట పెద్దన్న సు విప్రముఖులు
క్షితి నొనర్చిరి లోకోపకృతికిఁ బెక్కు

(1 - 109)

"అప్పయ్యని యనిసం బ్రతాపరుద్రీయంబును, కువలయానందమును, రసమంజరియును, సాహిత్య చంద్రోదయంబును, సాహిత్య రత్నాకరంబును, వృత్త రత్నాకరంబును, చమత్కార చంద్రికయును, షడ్భాషాచంద్రికయును, షడ్భాషా వివరణంబును, త్రివిక్రమవృత్తియు, హేమచంద్ర ఫక్కియును, గవిభల్లట ఫక్కియును నధోక్షజ ఫక్కియును, శబ్దాను శాసనీయంబును, గవిరాక్షసీయంబును, గవి కంఠ పాశంబును, గవిమూషక మార్జాలంబును గవిగజాంకుశంబును, గవిసర్పగారుడంబును గవిజనాశ్రయంబును గవిలోకసంజీవనియును, గవికంఠాభరణంబును, గావ్యాలంకార చూడామణియును, గావ్యచింతామణియు, నథర్వణచ్ఛందంబును, గోకర్ణఛంధంబును, శ్రీధరఛందంబును, ననంతామాత్యఛందంబును, ఛందోదర్పణంబును, నలంకార సంగ్రహంబును, నలంకార రత్నావళియు, నాంధ్రభాషాభూషణంబును, రేఫఱకార నిర్ణయంబును, లక్షణ విలాసంబును, సులక్షణసారంబును, సర్వలక్షణసార సంగ్రహంబును, లక్షణదీపికయు, శారదాదీపికయును, శారదా ముకుటంబును, శారదా తిలకంబును, నగేంద్రచూడామణియును, నరసభూపాలీయంబును మొదలుగా వీక్షింప లక్షణ గ్రంథంబులు లక్షోపలక్షలు గలవందు (1-110)

పై పట్టికయందు భాషాభేదమును బట్టి కొన్ని సంస్కృతభాషలో వెలువడిన గ్రంథములు మరికొన్ని ప్రాకృత భాషా గ్రంథములు. కొన్ని యాంధ్రభాషా గ్రంథములు

విషయవిభేదమును బట్టి కొన్ని అలంకార గ్రంథములు - కొన్ని ఛందోగ్రంథములు. మరికొన్ని వ్యాకరణగ్రంథములు ఈ గ్రంథముల పట్టికలో కాలక్రమముగాని, విషయక్రమము గాని, కన్పట్టదు కాని, భాషాక్రమ మున్నట్లు గోచరించును వీనిలో కొన్ని గ్రంథముల నామములు కూడ ఇతరత్ర తెలియరాకున్నవి. సంస్కృతమున సాహిత్యచంద్రోదయము నెవరు వ్రాసిరో తెలియరాదు అప్లే శారదాదీపిక మున్నగునవి యాంధ్రమున కన్పట్ట రాకున్నవి. వీనిలో ఒకదాని కంటె మరొకటి విశేషము నుగ్గడించునవి. ఈ గ్రంథము లన్నియు చదువక లక్షణప్రపంచము తెలియదని అప్పకవి అభిప్రాయము [1]. అందుచే వాని యన్నింటిసారమును తన గ్రంథము నందు నిబంధించితి ననియు, నిది చదివినపిమ్మట నేరికిని ఇతరగ్రంథములు చదువు నూహ జనింపదనియు వచించెను. పర్వతము లన్నియు ఒక దర్పణమునందు కన్పట్టు రీతిని కవిత్వోపయోగలక్షణము లన్నియు సరళరీతిలో తన గ్రంథమున పొందుపరచినాడు. [2]

ఇక ఇతడు ప్రవచించిన రసవిషయము శబ్ద మనగా రసయుక్త మైనదే యనియు, తద్విదులు మాత్రమే రసికు లనబడుదు రనియు, నిట్లొకచో వచించినాడు [3]. రసాశ్రయవాక్యసముదాయము కూర్చు వారలే కవిశబ్ద చ్యు లని

---

1. ఒకదానికంటె మఱి వే
ఱొకటి విశేషంబుఁ జెప్పుచుండు కతమునన్
సకల గ్రంథములును జదు
వక తెలియునె లక్షణప్రపంచంబెల్లన్

2. పర్వతము లెల్ల నొక్క దర్పణమునందుఁ
జూపెడు తెలంగునను గవిత్వోపయోగ
లక్షణము లన్నియును సరళంబు గాఁగ
నెఱుఁగబడు నిందుఁ దెలియ నూహించిరేని

3. రసమునకు నాశ్రయంబై
యదశ మగు నెద్ది యది గదా శబ్దము రా
క్షసదమన! రసికు లనగా
వసుమతి తద్విదము నెఱుగు వారలు సుమ్మీ!

నిష్కర్షగా నుడివినాడు [1]. ప్రథమమున పంచవిధభావములను పేర్కొనినాడు. శాంతమునకు శమమును స్థాయిభావముగా పేర్కొనినాడు. వివిధరసముల వర్ణములు, అధిదేవతలు, వేదము, వృత్తి, అనుకూలప్రతికూలరసముల నన్నియు సీసమాలికలో వచించెను. ఒకచో భయానకరసమును దారుణరస మని వర్ణించినాడు. పూర్వులలో నిట్టినామము ఎవరును ప్రయోగింపలేదు. విన్నకోట పెద్దన యొకచో భయానకమునకు బదులు ఘోరరస మని వాడినాడు సంస్కృతాలంకారికు లెవ్వరును ఇట్టి నామభేద మెచ్చటను ప్రయోగింపలేదు సంకేతికపదజాలము నెడ వీరి దృష్టి యట్టిది.

తెలుగు ఆలంకారికులలో ఇంత నిష్కర్ష కన్పట్టదు. సంస్కృతసాహిత్యమున భవభూతి ఉత్తరరామచరితమున దారుణరస మని ప్రయోగించెను [2]. కాని అర్థాంతరమున ప్రయుక్తము.

శృంగారమున సంభోగవిప్రలంభభేదములు చెప్పెను. విప్రలంభము మూడు విధములు 1) ఇంగప్రఘాతము 2) అయత్నసంభవము 3) నైసర్గికము అనియు, అందు మరల అంగజాతము 3 భేదములు - అప్రయత్నము 7 భేదములు - నైసర్గికము 10 భేదములు మొత్తము 20 భేదములనియు వచించెను. చక్షుఃప్రీత్యాది మన్మథావస్థలు 12 అనియు రతిరహస్యకళాప్రవీణులు 0 గా తెల్పుదు రనియు, కథా

తగ రసాశ్రయ వాక్యసంతతులు గూర్చి
కావ్యము లొనర్చు వారవో కవు లనంగ
నట్లు గావున నే భాష నైనఁ గవిత
పలుకు వారికి సాధింప వలయు రసము.

లవచంద్రకేతులు ఒకరినొకరు చూచి యిట్లనుకొందురు.

కింత్వాక్రాంతకఠోరతేజసి గతిః కా నామ శస్త్రం వినా?
శస్త్రేణాపి హ తేన కిం న విషయో జాయేత యస్యే దృశః?
కిం వక్ష్యత్యయ మేవ యుద్ధవిముఖం మా ముద్యతే౽ప్యాయుధే?
వీరాణాం సమయో హి దారుణరస స్స్నేహక్రమం బాధతే. (5-19)

సమాప్తికరము, నకులము నగుటచే ద్వాదశదశ మరణమును వర్ణింప రనియు, పురాతన కథాక్రమమున వర్ణింతు రనియు పేర్కొనెను.

ఇతరరసములలో భరతోక్తరీతిని తత్తద్భేదములు విభావానుభావాదులు చెప్పినాడు శాంతరసమునకు శమము స్థాయి యనియు, చంద్రసన్నిభ మనియు, దానికి ఏ రసము తోడను వైరము లేదనియు అధిదేవత పరబ్రహ్మ మనియు వచించినాడు. నాయకభేదములు, నాయకసహాయులు, నాయికాభేదములు, అష్టవిధశృంగారనాయికలు, నాయికాసహాయులు మున్నగువానిని వివరించినాడు.

విన్నకోట పెద్దన ననుసరించి యితడును స్థాయిరసముల సంబంధమును వచించినాడు.

వెన్న ముద్దకుఁ బాకవిధిచే ఘృతత్వంబు
దనరు భంగిని నవస్థాయిభావ
ములకు విభావప్రముఖ్యభావంబుల
వలన రసత్వంబు గలుగుచుండు.

రసము సహృదయగతమే కాని నటగతము కాదని వచించినాడు.

వినునార్యులకుఁ గావ్యవృత్తంబులను గను
గొను రసజ్ఞులకు నర్తనములందు
గలుగు గాని రసంబు గలుగదా రోప్యంబు
గావున నటియించు కాంతలందు.

(సీసమాలిక - అప్పకవీయము 1-141)

ఇట్లు రసవిశేషములను సంగ్రహరూపమున వచించినాడు.

లక్షణగ్రంథములలో గల రసవిషయము నిపుడు పరామర్శించితిని. తరువాతి ప్రకరణమున తెలుగున అలంకార గ్రంథములను వ్రాసిన వారిని ముచ్చటింతును.

విన్నకోట పెద్దన

ఇతడు కావ్యాలంకారచూడామణిని రచించెను. రాజరాజనరేంద్రుని వంశము వాడును, ఉపేంద్రనందనుడును, లక్కమాంబ సుతుడు నైన విశ్వేశ్వరమహీపతికి కావ్యాలంకారచూడామణి నంకితమొనర్చెను. ఈ విశ్వేశ్వరచక్రవర్తి రాజనీతివిశారదుడే గాక సంగీత సాహిత్యసరణులలో కూడ సరసధోరణి కలవాడు. అప్పటప్పటమున్న కావ్యాగమముల నన్నిటిని పఠనసౌకర్యసిద్ధి కొరకు ఒక్క చోటనే చేకూర్ప మత్సహించి విన్నకోట పెద్దనను రావించి సవినయముతో నాదరించి అలంకారశాస్త్ర రచనకు ప్రేరేపించినాడు. భావరసప్రపంచముతో నొప్పు నలంకారలక్షణమును, ఛందోవిచ్ఛిత్తిప్రచారమును, కుతూహలము గల్పించు ఆంధ్రభాషాప్రసంగముల చందమును గావింపుటయే చతురత్వ మని ప్రోత్సహించినాడు.[1] అతని ప్రోత్సాహ మాత్మనీతి మూధారముగ రసరత్నాకరమను గబ్బ్రమణుల సంధింప సమకట్టినాడు పెద్దన. కావ్యాలంకార చూడామణి ప్రథమాంధ్రాలంకారగ్రంథము.

నన్నయకర్తృకముగ పరిగణింపబడు చున్న ఆంధ్రశబ్దచింతామణి వ్యాకరణ పరిమితమగుటచే, అ నవచంది కేతనరచితమైన ఆంధ్రభాషా భూషణము వ్యాకరణమునకే పరిమితమగుట చేతను, మల్లియ రేచన కృతమగు కవిజనాశ్రయము ఛందో విషయకమగుటచేతను, రసవిషయము నిందు నియందంతగా పరామృష్టము కాలేదు అలంకార లక్షణమును ప్రథమమున చెప్పిన తెలుగు లక్షణ గ్రంథము కావ్యాలంకార చూడామణియే.

సంకీర్ణగ్రంథము :-

తెలుగున వెలసిన లక్షణగ్రంథములు చాలవరకు ఛందోలంకారవ్యాకరణసంకీర్ణములుగ నున్నవి. వీని రచనాప్రణాళికావిషయమున సంస్కృతప్రభావ మంతగా కన్పట్టలేదు. సంస్కృతమున ఛందస్సునకు, అలంకారమునకు వ్యాకరణమునకు వేర్వేరుగా గ్రంథములు రచింపబడినవి. వానిపేర ప్రత్యేకశాస్త్రములే ఛందశ్శాస్త్రము,

---

[1] "భావరసప్రపంచమునఁ బర్వనలంకృతిలక్షణంబు ఛం
దోవిచిత్రిప్రచారము, గుతూహలదస్ఫురదంధ్రదేశభా
షావివిధప్రసంగముల చందము సందము నొనర్చి వి
ద్యావిధి గావింపుట గదా చతురత్వ మనంగ మేదినిన్"
కావ్యాలంకార చూడామణి 1-11

అలంకారశాస్త్రము, వ్యాకరణశాస్త్రము అని విస్తరించి ప్రశస్తి కెక్కినవి. కాని తెలుగురచనాప్రణాళిక తద్విరుద్ధముగ నున్నది ఛందస్సు గాని, అలంకారము గాని, వ్యాకరణము గాని, కావ్యరచనాసంబంధమే కావ రచనకు ఈ మూడింటి ఆవశ్యకము నున్న వీనిని వేర్వేరుగ నుడి వచో వేర్వేరు గ్రంథ ల నిర్మింపవలసివచ్చును. అది సమగ్రతను కుంటుపఱచునని యాంధ్రాలంకారికులు లాక్షణికులు తలంచిరి. కావున కావ్యావశ్యకము లైన ఛందో లంకార వ్యాకరణవిష యము లన్నిటిని నొకచో చేర్చి గ్రంథముల రచించిరి. వీనిలో ప్రథమస్థానము నాక్ర మించినది విన్నకోట పెద్దన కృత మగు కావ్యాలంకారచూడామణి. చూడామణి కృతి భర్త యగు విశ్వేశ్వరుడు భావరసప్రపంచమున బహువ నలంక తిలక్షణమును ఛందో విచిత్రప్రచారమును, భాషా వివిధ ప్రసంగముల దంవ - పక పి వచించుటయే చతు రత యని పెద్దనను ప్రోత్సహించినాడు. ఈ సంకీర్ణలక్షణమునే పరమప్రామాణిక మైన అప్పకవియు నాదరించెను. సంకీర్ణతాలక్షణము నందొక్కొక్క భాగము కొలదిగా ప్రాధాన్యము వహించి నట్లగపడును. చూడామణిలో అలంకారభాగము అప్పకవీ యములో ఛందోభాగము ప్రాధాన్యము వహించినవి.

రసప్రాధాన్యము :-

సంకీర్ణలక్షణగ్రంథ మయ్యును ఒక్కొక్కభాగమున కొకింత ప్రాధాన్యము కన్పట్టుచున్నట్లు నుడివియున్నాను గదా! కావ్యాలంకారచూడామణి తొమ్మిదియుల్లా సములు గల గ్రంథము. అందు ఆరు ఉల్లాసములు అలంకారమునకు ప్రత్యేకింప బడినవి. మిగిలిన మూడింటిలో రెండు ఛందస్సునకు చివరిది వ్యాకరణమునకును కేటాయింపపడినవి. గ్రంథ - నందు మూడింట రెండువంతు - అలంకారమునకే ప్రత్యేకింపబడుట తత్ప్రాధాన్యము స్పష్టమగుచున్నది. అందును అలంకారవిభాగము నందును భావమును రసమును ప్రథమమున పేర్కొనుట గూడ తత్ప్రాధాన్యసూచ కమే. పెద్దన తనగ్రంథము నుపక్రమించుచు రసప్రాధాన్యము నుగ్గడించెను. కావ్య మునకు ప్రాణభూత మైనది రస మగుటచే కవులచే రసము ఎల్లెడను సాధింపదగిన దని.యాతని యాశయము ఈ ఆశయము "సాధ్యో హి రసో యథాయథం కవిభిః" అనుసూత్రమును తలపింప జేయుచున్నది [1] ఉచ్చారణప్రశస్త మైనది వర్ణ

---

[1] "సరళవిరాజదుచ్చరణశస్తము వర్ణము, వర్ణపంక్తి వి
స్తరము పదంబు, తత్పదవితానము వాక్యము, వాక్యభేద సుం
దరతర మర్థసత్త్వవిబుద్ధము భావ మట్టి భా
వరుచిరసుప్రసన్నవిభవంబు రసం బొదగూర్ప నేర్చినన్" (1.17)

మనియు, వర్ణసంఘములనే విస్తర మైనది పద మనియు, ఆ పదముల సముదాయమే వాక్య మనియు, వాక్యమునకు సౌందర్యాపాదక మర్థ మనియు, అట్టి యర్థతత్త్వవిబుద్ధమే భావ మనియు, భావములచే ప్రసన్నవిభవమే రస మనియు, నది యొడగూర్చ నేర్చుట సముచిత మనియు వక్కాణించెను.

నామౌచిత్యము :-

చిన్నకోట పెద్దన తన గ్రంథమునకు కావ్యాలంకారచూడామణి యని పేరిడినాడు. పెద్దిరాజు అలంకార మనియు వ్యవహారము కలదు. చూడామణి యన శిరోరత్న మని యర్థము. కావ్యాలంకారములను చెప్పు గ్రంథములలో శిరోరత్నము వంటిదీ గ్రంథ మని యాతని యభిప్రాయము. కావుననే యందలి పరిచ్ఛేదములకు ఉల్లాసములని పేరిడినాడు. ఉల్లాసమనగా కాంతి యని యర్థము. చూడామణి కాంతులను ప్రసరించుట నైజ మగుట సముచిత మీ నామకరణము.

ఏకనాయకము -

సంస్కృత వాఙ్మయమున చాలవరకు అంకితప్రక్రియ కానరాదు. తన కృతిని కన్యగా భావించి, తన్నాదరించిన నృపాలుని తద్భర్తగా భావించి కన్యను తగిన వరున కిచ్చి సంభావించునట్లుగ కృతిని నృపాలున కంకిత మిచ్చుట తెలుగు దేశమునందే కానవచ్చును. సంస్కృతాలంకారగ్రంథములు (ప్రాచీన) అట్టి ప్రక్రియచే ప్రభావితములు కావేమో. కావున ఉదాహరణము లన్నియు విభిన్ననాయకాశ్రయములై యుండును. ఎక్కడికి యుదాహరణమునకు ఏ నాయకుడు సముచిత మని భావించిన అతనిని నాయకునిగా వర్ణించినారు. కాని తెలుగు వాఙ్మయారంభకాలము నుండియు అంకిత మిచ్చు పద్ధతి విశేషప్రచారము నందియున్నదే. రాజరాజనరేంద్రుడు నన్నయను భారతము నాంధ్రీకరింపుమని కోరగా నన్నయ భారతమును తెనిగించి రాజరాజునకే యంకిత మిచ్చెను. నరాంకిత మొసర్చ నిష్టము లేని కృతికర్తలు తమ కావ్యములను భగవదంకితములు నొనర్చినారు. తిక్కన భారతమును హరిహరనాథునకును, పోతన శ్రీరామచంద్రునకు అంకిత మిచ్చి తరించినారు. ఇట్లంకిత మిచ్చుట దక్షిణదేశభాషాసంప్రదాయముగ కన్పట్టును. సంస్కృతభాషాప్రభావ మిందిసుమంతయు గోచరింపదు. పైగా ఆంధ్రదేశమున రచితము లైన సంస్కృత కావ్యములును అంకితవిధానమునకు లోబడి ఆంధ్రతాముద్రను ప్రకటింపజేయు

మున్నవి. అలంకారగ్రంథములు నయిత మిట్టి యాచారముచే ప్రభావితము లైనవి. విద్యానాథుడు ప్రతాపరుద్రయశోభూషణమును ప్రతాపరుద్రునకంకితమిచ్చినాడు. తరువాతివారైన నరసభూపాలుడు, విశ్వేశ్వరుడు కృష్ణయజ్వ మున్నగు వారీ విధానము ననుసరించిరి. అలంకారికు లందరును ఈ ప్రక్రియ నాదరించినవారే యనుట కంటె ఈ ప్రక్రియచే ప్రభావితులైన వారే యనుట సత్యసన్నిహితము.

పెద్దన నయితము తన కావ్యాలంకారచూడామణిని చాళుక్యవిశ్వభూపతి ప్రోత్సాహముచే రచించినట్లు చెప్పుకొనినాడు. తన గ్రంథము నీతని కంకిత మిచ్చినాడు. (ఆంధ్రకావ్యాలంకారములను పాటించి షష్ఠ్యంతములను నయితము రచించినాడు. ఇష్టదేవతాప్రార్థనయు నయితము చాళుక్యవిభుని శ్రేయోర్థమై చేయబడెను.) చాళుక్య విశ్వనాథుని నాయకునిగా సర్వోదాహరణములను రచించినాడు. ఇట్లు నిజనాయకుని మొదలు యుదాహరణముల రచించుటలో క్లిష్టత, ఒక్కొక్కచో ఉదాహరణ లివ్వలేకపోవుట మున్నగు కష్టము లున్నను సంప్రదాయప్రభావమువలనే పెద్దన దీని ననుసరించుట గమనార్హము. అయినను చాల యుదాహరణములు చమత్కారభరితములై వెలయుచున్నవి. ఇది యాతని రచనానైపుణ్యమును, కవిత్వపాటవమును ప్రకటించును. "నాస్తి పృథివీపతిః శృంగారో విష్ణుదైవత్యః" అను సూత్రమును దెలిపి చెప్పుచున్న ఈ క్రిందిపద్యము నరయుడు.

శ్రీవిండారగ లోకరక్షకొఱకై సిద్ధించుటం జేసి ల
క్ష్మీనాథుం డగు నయ్యుపేంద్రుడు డయి లేరన్ గన నీ నూతన
క్ష్మానాథుం డగు విశ్వనాథునకు శృంగారాధినాథత్వ మెం తే
నొప్పుం బ్రణుతింప నంచు కవులుత్ప్రేక్షింతు రెల్లప్పుడున్

(కా. చూ. 2-2)

లోకరక్షకొఱకై యవతరించిన లక్ష్మీనాథుడైన యుపేంద్రుడు లోకసంచారార్థ మేగె ననియు ఇతడు నూతనక్ష్మానాథుం డనియు, అతడు కేవల ముపేంద్రుడనియు ఈతడు సర్వవిశ్వమునకు నాథుడనియు, కావున శృంగారాదినాథత్వ మొప్పునని చమత్కరించినాడు. (తెలుగుకవులు అర్థవశమును సైతము విడచి చమత్కారమును పోషించి రనుట కిట్టి రచనలే నిదర్శనప్రాయము లైనవి.)

అభివ్యక్తిసిద్ధాంతము -

తెలుగున కావ్యములు గాని అలంకారగ్రంథములు గాని వెలువడిన సమయము నకే సంస్కృతమున అలంకారశాస్త్రము శాఖోపశాఖలుగ విస్తరిల్లినది. అంతియగాక వివిధసంప్రదాయములలో తత్ప్రవర్తకము అయిన సిద్ధాంతగ్రంథములు వెలువడినవి. రససిద్ధాంతవిషయమున గూడ పూర్వమతము లన్నిటికి సంపూర్ణముగ నవలోడన మొనర్చి యానవ డపుడు అభివ్యక్తివాదమును నెలకొల్పి సిద్ధాంతీకరించినాడు. అర్వాచీనాలంకారికులకు ప్రామాణికశేఖరుడైనాడు. కావున నప్పటినుండి నూతన వాదములను ప్రతిపాదింప నవకాశము కలుగలేదు. అవసరమును లేకపోయినది. తెలుగు ఆలంకారికులు నయితము అనూనానముగ సంప్రదాయముగ స్థిరపడిన అభివ్యక్తి సిద్ధాంతమునే యాదరించిరి. వేరుగ హేతుపురస్సరములైన వాదప్రవాదముల నొన రించు నావశ్యకము వారికి గలుగలేదు. పెద్దన నయితము అభివ్యక్తివాదము నాదరించి నాడు. విభావాదులచే స్థాయిభావములు సువ్యక్తములై రసత్వము నొందునని వచించి నాడు. సువ్యక్తపదము అభివ్యక్తిపర్యాయ మనుట సువిదితము.

"ఉక్తవిభావాదులచే
భక్తనవస్థాయిరూపభావంబులు సు
వ్యక్తములై నిజగుణసం
సక్తములై రసము లన రసత్వము నొందున్." 2-4

విభావము - అనుభవము :

నిఖిలరసవిబోధనిర్మాణకరణము [1] విభావ మని పారిభాషికపటిష్ఠతతో వచించి నాడు. ఈ విభావమందలి ద్వైవిధ్యమును వివరించినాడు ఉద్దీపనవిభావము ఆలంబన విభావము అని. ఆలంబనవిభావమును వివరించుచు నాయికానాయకు లాలంబనము లని వచింపక (రల)రూప యౌవన కాంతి శ్రీ లావణ్యాదికము నుదాహరించినాడు. పూర్వు లందరును నాయికానాయకు లాలంబన మని వచించిరి కాని వారి యుద్దేశము

---

[1] అవిభావ మొప్పు నాలంబనంబు ను
ద్దీపనంబు నాఁగ ద్వివిధ మగుచు
నిఖిలరసవిబోధనిర్మాణకరణంబు
లిత్తెఱంగు లెల్ల దెలుగవలయు 1-22

కూడ రూప,యౌవనాది విశిష్టులైన నాయికానాయకు లనియే. ఆ భావ ము నితడు సవ్యక్త మొనర్చుటకు నాయికానాయకు లనక రూప,యౌవన,కాంతి,శ్రీలావణ్యాదిక మనినాడు ఇంతమాత్రమున నాయికానాయకు లాలంబనములు కాదని యాతని యభిప్రాయము కాదు తృతీయాశ్వాసమున నాయకప్రకరణ మారంభించుచు " శృంగారాదిరసోదయంబునకు సంసిద్ధాస్పదం బైన సుందరంగన్నాయకనాయికా విచయముం దత్తద్గుణశ్రేణిచేఁబొంగారనివ్వరింతు " అని వ్రాసినాడు. ఉదాహరణమునందు నాయికానాయకుల యీ విశేషణాపు వర్ణించినాడు.

ఉద్దీపనవిభావభేదములను, ఆలంబనగుణము లు చేష్టితములు, అలంకరణములు, ఉత్సవములు [1] అని పేర్కొనెను. శృంగారతిలకమున 1) ఆలంబన గుణములు(2 చేష్టలు 3 అలంకృతులు 4 తటస్థములు అని నాలుగింటిని పేర్కొనగా నీతడు తటస్థపదమునకు బదులు ఉత్సవశీలలు విహారములని పేర్కొనెను. తటస్థ మనుటకంటె ఈ పదములు రమణీయతాపాదకములని కవితలంపు గాఁబోవు.

చేష్టాసముద్భూతమై, అనుమితమై రసము సొంపొందటచే అనుభావ మనబడు నని యనుభావ నిర్వచన మొనర్చెను ఇది లలితవ క్తాకృతితోచునవి వివరించినాడు (1-28)

సాత్త్వికములు : వ్యభిచారులు :

భరతుడు "సత్త్వము మనఃప్రభవ మనియు, అది సమాహిత మనస్త్వము వలన వచింపబడు ననియు మనస్సమాధియందే సత్త్వనిష్పత్తి జరుగు ననియు [2] వచించెను. "సత్త్వ మన మనోవృత్తి, తజ్జంబు లైన భావములు సాత్త్వికము" అని వచించెను.

---

1. ఆలంబనోక్తగుణములు
నాలంబనచేష్టితములు హారాలంకా
రాళియు నుత్సవశీలలు
నోలిన్ చతురాహ్వయంబు లుద్దీపనముల్ (1-26 కా.చూ.)

2. ఇహ హి సత్త్వం నామ మనఃప్రభవమ్-తచ్చ సమాహిత మనస్త్వా దుచ్యతే. మనసః సమాధేస్సత్త్వనిష్పత్తి ర్భవతి

(నా శా 7-94 శ్లోకగద్య)

వ్యభిచారులను వివరించుచు ప్రసిద్ధమగు లవణాకరతరంగ దృష్టాంతమును చూపెను ఇవి అనిత్యము లని వ్యభిచరించునవి యనియు, పోదముదు నడగుచు నుండునవియు లక్షణము లన్నియు వచించెను (1-47) పూర్వుల వలెనే సంఖ్యానియమమున త్రయస్త్రింశత్వమునే యాదరించెను.

స్థా యి భా వ ము లు

ఆత్మసంభావితవిభావాదులచే సువ్యక్తంగు లైన భావములు స్థాయిభావము లని వచించెను. నవరసముల నంగీకరించిన వాడగుటచే నవస్థాయిభావములను వివరించినాడు. శాంతమునకు శమమును స్థాయిభావముగా నంగీకరించినాడు భయము ప్రాణివికరములకు నియత మనియే గాక పూరుషత్వవ్యయకరణ మనియు వచించెను. భావకదంబమునకు నొక యుల్లాసమును ప్రత్యేకించిన దగుటచే నింతలో ప్రథమోల్లాసమును ముగించెను. ఈ యుల్లాసమున కితడు భావప్రపంచప్రకటననముద్దేశ మని నామకరణము చేసినాడు

స్థాయి – రసము :–

స్థాయిభావము విభావాదులచే పరిపుష్టమై రసత్వస్థితి నందును. దీనికి పానకరసన్యాయ ముదాహరింతురు. ఈన్యాయము సంస్కృతాలంకారశాస్త్రప్రసిద్ధము కాని పెద్దన సంస్కృతాలంకారికు లెవరును స్పృశింపని మరొక న్యాయమును దృష్టాంతముగ చూపెను. స్థాయిభావము వెన్న వంటిది. రసము నేయి వంటిది పాక సంప్రాప్తిచే నవనీతము ఘృత మగుచున్నది. అట్లే విభావాదిపరిపుష్టమై స్థాయిభావము రస మగుచున్నది

స్థాయిభావంబులకు ననుసారు లైన
తద్విభావాదులను రసత్వంబు గలుగుఁ
బరఁగ వెన్నకుఁ బాకసంప్రాప్తిఁ జేసి
తగు ఘృతత్వంబు గలుగు చందమున నపుడు

(కా చూ। 2-5)

1. ఇదే భావమును కాకునూరి అప్పకవియు అనుసరించెను. దీనిని బట్టి అర్వాచీనాంధ్రాలంకారికులలో పెద్దన ప్రభావము, పెద్దనపై గల గౌరవము వ్యక్తమగుచున్నది.

ఇతడు రసానుభూతిని గూర్చిన వివిధ వాదములను ప్రదర్శింపలేదు. కాని సిద్ధాంతభూత మైన రసము సామాజికనిష్ఠ మను విషయమును ప్రస్తావించెను. సామాజికులలో శ్రేష్ఠు లైన వారిని ప్రౌఢలని వచించెను. వారికి కావ్యములయందు సయితము రస మనుభూత మగు ననియు మిగిలినవారు ద్రష్టలుగా నాట్యమునందు రసానుభూతి నొందుదు రనియు స్పష్టీకరించెను [2] ఈ భావము అభినవగుప్తుని యీ పంక్తులకు సూక్ష్మభాష్య ప్రాయ మైనది.

1 సీ॥ వెన్నముద్దకుఁ బాకవిధిచే ఘృతత్వంబు
దనరు భంగిని నవస్థాయి భావ
ములకు విభావప్రముఖ్య భావంబుల
వలన రసత్వంబు గలుగు చుండు.

శృంగారసీసమాలిక. అప్ప 1-141

ప్రౌఢలకుఁ గావ్యములయందుఁ బొందు రసము
ద్రష్టలకు నాట్యములయందుఁ దనరు రసము
స్ఫుటవిభావానుభావ సంఘటనచేత
సాత్త్వికవ్యభిచారిసంసక్తిచేత

(2-7 కా॥ చూ॥)

పారిభాషిక పద ప్రయోగము :-

తెలుగు అలంకారికులు పారిభాషికపదములయెడ మిగుల కార్కశ్యమును వహించిన వారు కారు. రసనామములకు సంస్కృతాలంకారికు లెవరును పర్యాయ పదములను ప్రయోగింపలేదు. కాని తెలుగువారు అచ్చటచ్చట రసములకు పర్యాయ పదముల సయితము ప్రయోగించిరి. పెద్దన తన కావ్యాలంకారచూడామణిలో భయానక

పదమునకు మారుగా ఘోర మను పర్యాయపదమును ప్రయోగించెను.[1] దీని ననుస రించి అప్పకవియు భయానకమునకు దారుణ మని ప్రయోగించెను.[2]

శృంగారరసవిభాగము :

శృంగారము సంభోగ, విప్రలంభ భేదములచే ద్వివిధ మనియు, సంభోగ శృంగారమున శంకరుడు రోషమిరువదింటిలోను అంగజాతములు మూడనియు, అయత్న సంభవములు ఏడనియు, నైసర్గికములు పది యనియు విభాగ మొనరించెను.

భావమునకు సంస్కృతాలంకారికులు "నిర్వికారాత్మకే చిత్తే భావః ప్రథమ విక్రియా" అని నిర్వచనము నొసగిరి. అట్లే పెద్దన

"అ నిర్వికారచేతో
గతవృత్తివిశేష మరయగా సత్త్వము, త
త్ప్రతివాక్క్రియ భావము
సతతాలంకారకారి చను దెలియంగన్"

అని వివరించెను.

[3] విప్రలంభశృంగారమున మన్మథవస్థలను పండ్రెండని వర్ణించినాడు. 1)చక్షు ప్రీతి (2)చిత్తసంగమము (3)సంకల్పము (4)ప్రలాపము (5)జాగరము

---

[1] క్రమమున శృంగారము హా
స్యము(గరుణము రౌద్రవీరసంజ్ఞంబులు ఘో
రము బీభత్సము నద్భుత
సమాఖ్య శాంతములు ననగ(జను నవరసముల్

(కా। చూ। 2-88)

[2] గను నా రసము శృంగారంబు హాస్యంబు
రౌద్రంబు కరుణ వీరంబు నద్భు
తంబు బీభత్సంబు దారుణంబును శాంత
మను నాగ నవవిధంబుల మెలంగు

(అప్ప-శృంగారరససీసమాలిక 1-14)

[3] ఆచార్యభోజదేవుడు మన్మథావస్థలు పండ్రెండని సరస్వతీకంఠాభరణమున మొదటగా చెప్పినాడు

(6)కార్శ్యము (7)ద్వేషము (8)త్రపానాశము (9)సంజ్వరము (10)మోహము (11)మూర్ఛ(12)మరణము.

ద్వాదశావస్థలను దెల్పియు, "పదియ దశ లండ్రు కొందఱు ప్రౌఢజనులు" అని మతభేదమును సూచించినాడు. మరణ మను ద్వాదశదశను సమర్థించుచు ప్రియుడు బహువిధోపాయములచే నయితము సాదరుడు కాక పోయి నపుడు మానిని కీ దశ కల్గు నని యార్యులు చెప్పినట్లు వచించినాడు.

"ద్వాదశదశయుం గలుగుఁ ద
లోదరికిం బ్రియుడు బహువిధోపాయముల౯
సాదరుడు గాక తక్కిన
నా దశ యున్నట్లు చెప్పి రార్యులు కృతుల౯"

హాసభేదములను ప్రాచీనుల వలెనే షడ్విధములుగ వచించినాడు. ఇప్పట్టున అందరును భరతమతానుయాయులే. రౌద్రమున మాత్సర్యరౌద్రము, విద్వేష రౌద్రము నని ద్వైవిధ్యము నుదాహరించెను. వీరభేదములను మూడింటిని మాత్రమే ప్రవచించెను. దాన, దయా, యుద్ధ, వీరము లని-బీభత్సమున జుగుప్సా బీభత్సము, వైరాగ్యబీభత్సము అని రెండు భేదములను ప్రదర్శించెను.

శాంతము :

ఇతడు నవరసవాది. అంతియే గాక అభినవగుప్తప్రోక్తమైన ప్రకృతి వికృతి రసవాదము నాదరించినట్లు కన్పట్టును. శాంతమున కీతడు శమమును స్థాయిభావ మని తెల్పినాడు. [1] శాంతము సర్వోత్తరరుచిమంత మనియు, అందుచే దీనికి వైరమైత్రులు లేరనముతోడ ను లేవనియు వచించెను ప్రకృతిరసము శాంత మనుటను పరోక్షముగ తెల్పిన దీ భావము. శాంతము పరబ్రహ్మాదిదైవతక మనియు నిర్మలస్ఫటికనిభ మనియు వివరించెను.

"శాంతము సర్వోత్తరరుచి
మంతం బట్లగుట వైరమైత్రులు లే, వీ
చింతన మెఱుగని కవి కవ
గంతవ్యం బగునె రసవికాసప్రతిభల్"

జన్యజనకభావము -రసములు .

రసములలో కొన్ని కొన్నిటినుంచి జనించినట్లు భరతుడే వచించినాడు.

"శృంగారాద్ధి భవే ద్ధాస్యో రౌద్రా చ్చ కరుణో రసః
వీరా చ్చైవాద్భుతోత్పత్తి ర్బీభత్సా చ్చ భయానకః"

(నా శా॥ 6-39)

శృంగారము నుండి హాస్యమును, రౌద్రమునుండి కరుణమును. వీరమునుండి యద్భుతమును, బీభత్సము నుండి భయానము నుద్భవించెను. ఈ విషయమును యథాతథముగ పెద్దన యాంధ్రీకరించినాడు.

"ఆదిశృంగారజాతంబు హాస్యరసము
రూఢ రౌద్రోద్భవంబు కారుణ్యరసము
పుట్టె వీరంబువలన నద్భుతసమాఖ్య
మడరు బీభత్సమునను భయానకంబు" (2-137)

ఈ విషయము నితడు మరియొక నూతన విషయమును ప్రవచించెను. భరతుడు సర్వరసములు నథర్వణవేదోదితములుగా వచింపగా [1] ఇత డొక నూతనవిషయమును ప్రతిపాదించెను. శృంగారము సామవేదమునుండియు, వీరము ఋగ్వేదము నుండియు, రౌద్రము అథర్వవేదము నుండియు బీభత్సము యజుర్వేదము నుండియు జనించినవని వచించుచున్నాడు [2]

ఇవియే గాక ఇతడు రసముల యధిదేవతలు,వర్ణములు, తత్తద్రసముల కుపయుక్తములగు ననుభావ, సంచారి, సాత్త్వికభావములను సయితము వివరించినాడు.

---

[1] రసా నాథర్వణా దపి నా శా॥ 1-17

[2] ప్రథమరసము సామభవము, వీరంబు ఋ
గ్వేదసంభవంబు, వెలయు రౌద్ర
రస మథర్వనిగమరచితంబు బీభత్స
మది యజుఃప్రసూత మండ్రు బుధులు (1-136)

సంస్కృతమున సాహిత్యచింతామణి రచించిన పెదకోమటి వేమభూపాలు డీ విషయమును తన గ్రంథమున సూచించినాడు

ద్వితీయోల్లాసమున రసవిరోధములు కూడ స్పృశించినాడు. శృంగార బీభత్సములు వీరభయానకములు, రౌద్రాద్భుతములు, హాస్యకరుణములును, పరస్పర వైరు లని స్పష్టపరచినాడు (2-39)

చివరకు అంగాంగిరసములను కూడ సూచించినాడు. భావకదంబముచే నమరునవి రసము లనియు, అంగము లన్నిటికంటె పరిస్ఫుటమైన ఆకారముతో సంతోషమును గూర్చునది యంగిరస మనియు విశదపరచెను (2-140)

తృతీయోల్లాసమున రసవదలంకారసందర్భమున మరల నవరసముల వివరించినాడు

రసాభరణము

రససిద్ధాంతమును భారతీయులకు ప్రసాదించిన వాడు భరతుడు. అతడు తన నాట్యశాస్త్రమున 6,7 అధ్యాయములను రసభావములకు ప్రత్యేకించెను నాట్యసంబంధమైన వివిధ విషయములకు నాట్యశాస్త్ర మాద్య మైన యాకరము. వివిధవిషయప్రతిపాదక మగుటచే నది సంకీర్ణగ్రంథముగ పరిగణింపబడుచున్నది. కావ్యనాట్యములకు ప్రాణభూతమైన రసమునకు ప్రత్యేకప్రతిపత్తిని కల్పించిన అర్వాచీనులు శారదా తనయుడు భానుదత్తుడు,ఉల్లరాజు,విశ్వేశ్వరుడు-వారి గ్రంథములు భావప్రకాశము,రసతరంగిణి రసరత్నప్రదీపిక రసచంద్రిక మున్నగునవి. తెనుగున మొదటి లంకారగ్రంథమైన కావ్యాలంకారచూడామణి నయితము సంకీర్ణవిధానముచే యనుసరించినది. కావ్యసంబంధులైన రసా,లంకార.ఛందో, వ్యాకరణ విషయము లందు గలవు. అన్నియు కావ్యసంబంధు లగుటచే వాని యేకత్రానుసంధానమునకు కారణము కావచ్చును. రసాభరణ మట్టిది కాదు. కావ్యసంబంధులైన ఇతర విషయములు ఛందో వ్యాకరణాదుల వంక కన్నెత్తి చూడలేదు సరి గదా అలంకారిక సంప్రదాయము లైన ఇతరధ్వన్యౌచిత్యాదిసంప్రదాయములను కూడ స్పృశింపలేదు. కేవల రససంప్రదాయమునే తుదముట్ట ప్రవచించెను. ఇట్లు రస సిద్ధాంతమునకు ప్రత్యేకప్రతిపత్తిని సముచిత స్థానమును కల్పించిన లక్షణగ్రంథములు ఇతఃపూర్వ మాంధ్రభాషలో వెలువడలేదు. అనంతుని యీ రసాభరణము ననుసరించి తెలుగులో నర్వాచీనులైన మరికొందరు శృంగారరసాల వాలము మున్నగు లక్షణగ్రంథములను రచించియున్నారు. కాని సంఖ్యావిషయమున చాల స్వల్పము. తెలుగు అలంకారగ్రంథములు చాలావరకు సంకీర్ణగ్రంథములే కారణము దక్షిణదేశభాషలలో లంను ముఖ్యముగ నాంధ్రమున ప్రతావరుద్రీయమునకు గల్గ పఠన పాఠన ప్రచారమే ప్రతాపరుద్రీయము

సంస్కృతమున వెలసిన ఆలంకారికసంప్రదాయముల నన్నిటిని స్పృశించినది. కావున సంకీర్ణగ్రంథ మైనది. దాని ప్రభావము తెలుగు లక్షణగ్రంథములపై చాలావరకు ప్రసరించినది. కాని అనంతునిపై ప్రసరింపకుండుట గమనార్హము. ఇతడు ఛందోగ్రంథమును వేఱుగ రచించినాడు.

స్థా యి భా వ ము :-

అనంతుడు తన కావ్యమును శృంగార హాస్యేత్యాది రస నవక శ్లోకముతో ప్రారంభించినాడు. రసములకు వాసనాప్రాయములు సంస్కారకల్పములు నైన స్థాయి భావములను వెనువెంటనే ప్రపంచించినాడు 9 రసములకు 9 స్థాయి భావములను పూర్వాలంకారికులు చెప్పినట్లుగనే చెప్పి చివర స్థాయి, రసములకు గల సంబంధమును హృద్యముగ నిర్వచించినాడు.

> ఇట్లు నవరసములకు నూహింపఁ గలిగి
> యంచిత స్థాయి భావంబు లతిశయిల్లుఁ
> బ్రసవఫలరాసులకుఁ బాదపంబు లట్లు

పుష్పములకు ఫలములకు వృక్షము లెట్లు మూలస్థానీయములో అట్లు రసములకు స్థాయిభావములు మూలములని స్పష్టపరచెను. ఈ యుదాహరణము సంస్కృతాలంకారికు లెవ్వరును చూపలేదు. భరతుడు మాత్రము భావములకును రసములకును గల సంబంధమును తెల్పుచు బీజమునుండి వృక్షమును, వృక్షమునుండి పుష్పఫలములను ఉద్భవించినట్లే రసము లన్నిటికి మూలము లనియు వాని నుండి భావములు వ్యవస్థితము లై నవనియు ప్రసంగాంతరమున కించిద్భేదభావముతో నుదాహరించెను [1].

ఆ భావము ననంతుడు సముచితస్థానమున ప్రశస్తరీతిని మలచికొనినాడు. రతిస్థాయిభావమునకు నుదాహరణ మిచ్చిన పద్యము మనోహరముగ నున్నది. కావుననే భావుకచక్రవర్తి యైన భట్టుమూర్తికి నయితము అనుసరణీయమైనది.

---

1. యథా బీజాద్భవే ద్వృక్షో వృక్షా త్పుష్పం ఫలం యథా
తథా మూలం రసా స్సర్వే తేభ్యో భావా వ్యవస్థితాః

నా॥ శా॥ 6-38

"మారుఁడు రూపవంతుఁడు హిమద్యుతి చల్లనివాఁడు రమ్యసం
చారవినోదశీలుఁడు వసంతుఁడు, వెండియు సద్గుణాఢ్యులు
న్నారు మహేశు, లెవ్వరును నాహృదయంబున కింపుగారు నా
కోరిక సర్వసేవ్యుఁ డగు గోకులనాయకుడే తలోదరీ!" (1-5)

అని అనంతుడు రచించినపద్యమును భట్టుమూర్తి

"చల్లదనంబె చంద్రునకు జక్కదనంబె ప్రసూనధన్వికిన్
సల్లలితోరుసౌరభమె చైత్రున కొక్కని కొక్క మేలిమే
తెల్లను గాక నం పతి యుదీర్ణగుణాఢ్యుఁడు నారసింహభూ
వల్లభు డొక్కు సర్వగుణవైభవ మెవ్వరి కైన గల్గునే'' (3-10)

ఇవి తన కావ్యమున అర్థికసంవాద మొనర్చినాడు. సజాతీయవిజాతీయస్థాయి భావములను చెప్పినాడు.

విభావానుభావములు తార్కికదృష్టి } ఉద్దీపనవిభావము రసమునకు నిమిత్తకారణ మనియు ఆలం

బనవిభావము సమవాయికారణ మనియు వచించినాడు. అంతలో ముగింపక తన శాస్త్రదృష్టి ప్రకటింపబడునట్లుగ నిమిత్త, సమవాయి కారణములను వివరించినాడు. ఇది యాతని తర్కశాస్త్రపరిజ్ఞానమును ప్రకటింప చేయుచున్నది.

తొలగదు కార్యము మొదలం
గలసియుఁ జేయు సమవాయుకారణ మది తాఁ
గలయక కార్య మొనర్చును
నలి దొలగు నిమిత్తకారణం బనునది తాన్ (1-29)

కార్యము పుట్టినపిదప కూడ తొలగనిది సమవాయికారణ మనియు, కార్యము పుట్టిన వెనుక నశించునది నిమిత్తకారణ మనియు, కార్యము పుట్టిన వెనుక నశించునది నిమిత్తకారణ మనియు వివరించినాడు. అంతియ గాక వాని కిట్లుదాహరణములు గూడ చెప్పెను.

ఆలంబనంబు నాయకనాయికాకృతి
రససమవాయికారణము దాన
ఘటకల్పనకు మృత్తికయుఁ బోలె నెండియు
ద్దీపనమ్మను నాల్గు తెలుగు లందు
... ...
దండచక్రముల గతి నిమిత్తకారణములు (2-9)

ఘటమునకు మృత్తికవలె రసమునకు నాయికానాయకు లాలంబన విభావము లగుదు రనియు వారు సమువాయికారణము లనియు, ఉద్దీపనవిభావములు దండచక్రముల వలె నిమిత్తకారణము లనియు స్పష్టపఱచెను. విభావానుభావసంచారులను కారణకార్యసహకారులనుగా రూపొందించినాడు.

రసముల జన్యజనకభావమును రసములలో పరస్పరవైరుధ్యమును చెప్పినాడు.

వాగ్రూపక్రియారసములు :-

పూర్వు లెవరును ప్రతిపాదింపని నూత్నభేదము నీతడు ప్రతిపాదించెను. రసములు తొమ్మిదియే యని చెప్పి యా తొమ్మిదియు త్రివిధలక్షణములతో దీపించు ననియు, నవి రూపరసము, వాగ్రసము, క్రియారసము అనియు, రూపముచే నొప్పినచో రూపరస మనియు, వాక్ప్రవృత్తిచే తోచినచో వాగ్రస మనియు క్రియలయందు గన్పడిన క్రియారస మనియు వచించెను

త్రివిధలక్షణముల దీపించు నన్నియు
రూపమున దలిర్ప రూపరసము
వాక్ప్రవృత్తిఁ దోప వాగ్రసంబగుఁ గ్రియ
లందు గానఁబడు గ్రియారసంబు (1-35)

ఈ భేదము లర్వాచీనులు సయిత మెవరును వచింపలేదు. రసముల వర్ణాధిదైవతములను భరతోక్తరీతిని వచించినాడు. శాంతము అస్వామిపరతతో వెలయు ననియు, నందు నిర్వేదము, ధృతి యను భావములు (సంచారులుగా నోపు) నొప్పు ననియు వచించినాడు.

రసోదాహరణములు – ఔచిత్యము :-

నవరసములను నితడు నవ్యరీతిలో నుదాహరణప్రదర్శన మొనరించెను. శృంగారాదిరసములకు అధిదేవతలుగా నెవరిని పేర్కొనినాడో వారి నాశ్రయముగా చేసికొనియే ఉదాహరణముల నిచ్చినాడు. శృంగారాధినాథుడగుటచే శృంగారమునకు కృష్ణుని ఆలంబన మొనర్చి యుదాహరించినాడు. ఇట్లే మిగిలిన రసములకును ప్రతిపాదించినాడు. శాంత మస్వామికమని వచించుటచే "తరుణీజనులందును ప్రాకు లందును" సమదర్శను లైన మహాత్ముల నాలంబన మొనర్చి యుదాహరించినాడు. ఈ విధానము సహృదయాహ్లాదకముగా నున్నది. అర్వాచీను లెవరును దీని ననుకరింపలేదు. తెలుగులక్షణగ్రంథములు చాలవరకు నేదో రాజునకో అంకిత మగుటయు పద్యములన్నియు నాతని నాయకత్వ ప్రస్థాపనముతో వచించుటయే కారణముగా నోపును.

రసము సామాజికనిష్ఠము :-

రసానుభూతిని గూర్చి వివరించుచు సామాజికనిష్ఠ మని, యుపసంహరించినాడు. ఇప్పట్టున ప్రతాపరుద్రయశోభూషణమును పూర్తిగా అనువదించినాడు.

"రసము నాయకసమాశ్రయమున ప్రావీణ్యు
డగు నటుచేష్టల నైన దత్క
థాకర్ణంబున నైన సామాజిక
ప్రకరానుభావ్యమై బరగుచుండు
బరగతం బయ్యు సద్భావనచే రసో
దయవిశేషముపరుద్ధంబు గాదు"

ఈ విషయము కేవల మీ క్రిందిపంక్తుల కనువాదరూపమే.

"అత్ర రసో నాయకాశ్రయ ఏవ – యది పరంనిపుణనటచేష్టయా, తథావిధకావ్యశ్రవణబలేన స సామాజికై స్సాస్వాద్యో భవత్యేతే తదా పరగత స్యాపి రసస్య సమ్యగ్భావనయా పరత్ర నిరతిశయానంద జనన మవిరుద్ధమ్"

ఇంకను ప్రతాప ద్రయశోభూషణము ననుస ంచి సామాజికసముద్దైన నటు నిచే అనుభావా క మెట్లు ప్రకటింపబడు నను ప్రశ్నకు సమాధానముగా అది యతనికి అభ్యాసజనితనైపుణి యని సమాధానించినాడు.

ప్రకటన.ు డరయ సామా
జిక ము కగు నేని వానిచే ననుభావా
దిక మెట్లొదవు న వా
నికి ి ది యభ్యాసజనితనిపుణత యయ్యెన్ (1-49.)

రసాభా ్ ము :-

శృంగారతిలకక ర్త రసాభాసమును గూర్చి చెప్పిన శ్లోకము దక్షిణదేశమున మిగుల ప్రసిద్ధి కెక్కినది. ప్రతాపరుద్రీయాముల న్నియు నా శ్లోకమునే యాదరించి రసాభాసమున త్రైవిధ్యమును ప్రవచించి వి అది కేవల ము శృంగారర నంబం ధిగా తోచును. ఐయినను అందు సర్వరససంబంధిసూత్ర మిమిడి యున్న దని వేదాల తిరువేంగళాచార్యుల వారు తమ ఆంధ్రధ్వన్యాలోకమున దృష్టాంతపూర్వ కముగ ిరూపించియున్నారు. ఆ శ్లోకతాత్పర్యము నితడు హృద్యముగ ననువ దించినాడు.

"వాసన నొప్పు ప్రేమ మిరువంకల లే కొకవంక(జెప్పిరే
నే సతి యైన(బ వ్వరకు నిచ్చ యొనర్చుట(జెప్పి రేనిత
ద్భాసురలీల మ్లేచ్ఛమృగపక్షిగతంబు(జెప్పిరే రసా
భాసముగా నెఱుంగుదురు భావకు లీ త్రివిధప్రయోగమున్"

ద్వితీయాశ్వాసమున శృంగారర విశేషములను, భావహావాదులను, ఉద్దీపన విభావములను, సాత్త్వికభావములను, త్రయస్త్రింశద్వ్యభిచారులను సోదాహరణముగ ప్రపంచించెను

శృంగారభక్తివాత్సల్యములు .

రతి యను స్థాయిభావమే ఆలంబనభేదముచే త్రివిధములుగా రసీభవించునని వివరించినాడు రసస్థితికి మితిలే దని కూడ వివరించినాడు రతి చే నాయకనాయికాది

పర మైనప్పుడు శృంగారముగా రంజిల్లును. దేవ గురు,ద్విజాదిపరమై నపుడు భక్తి గాను: సుత,మిత్రా,శ్రిత,సోదరాది పరమైనప్పుడు వాత్సల్యముగను, వ్యక్త మగును. వీని కుదాహరణప్రాయములుగా గోపికల ప్రేమమును, పారలౌకము, భక్తియు, దేవకీవసుదేవుల పుత్రభావనను నుదాహరించినాడు.

"ప్రేమం జూచిరి ప్రాణనాథు డనుచున్ బింబాధరంరత్నముల్
స్వామిత్వప్రతిపత్తిమైఁ గొలిచి రోజం బౌరలోకంబు చే
తో మోదంబునఁ బుత్రభావన గడుం దోతేర నంతన్ ఘన
శ్రీమీఱ న్వసుదేవదేవకులు లోనన్ సేవించి రా వెన్నునిన్

శృంగారచేష్టలను పదునెనిమిదింటిని ప్రతాపరుద్రీయము ననుసరించి పేర్కొని నాడు. అందు మొదటి భావలక్షణమును "రసాభిజ్ఞానయోగ్యత్వం భావ ఇత్యభిధీ యతే" అను ప్రతాపరుద్రీయలక్షణము నాధారముగ చేసికొని వివరించినాడు. ఈ లక్ష ణములు చాలావరకు ప్రతాపరుద్రీయానుసారములే తటస్థములలో పికములను, మృదు వాయువులను, విపంచి మున్నగు వానిని పేర్కొనినాడు.

సాత్త్విక భావలక్షణము కూడ ప్రతాపరుద్రీయానుసారిగనే చెప్పబడినది. "పర గతసుఖాది భావనయా భావితాంతఃకరణత్వం సత్త్వం, తతో భవా స్సాత్త్వికాః" అనిప్రతాపరుద్రీయమున వచింపబడినది.

రసరాజము - శృంగారము :

రససంఖ్యావిషయమున భారతీయాలంకారికులలో మతభేదములు వివిధములుగ పొడసూపినట్లే రసరాజవిషయమున కూడ మతభేదములు కన్పట్టినవి. తెలుగు ఆలం కారికులలో మొదటివాడైన విన్నకోట పెద్దన శాంతమును సర్వోత్తమముగ భావించి నాడు. కాని అనంతమాత్యుడు (భోజమతము ననుసరించి)శృంగారము సర్వరసో త్కర్ష మని వచించినాడు. ఇది బహుళజనాదృతమైన సిద్ధాంతముగా పరిగణింపబడు చున్నది.

"మఱి సర్వరసోత్కర్షత నరయుచు బహుసంపదలకు నత్యా స్పదమై మెఱసిన శృంగారము" అని వచించినాడు. (3-2)

విప్రలంభ భేదములు

విప్రలంభమునందు పూర్వులు కొందఱు నాల్గు భేదములను, మఱికొందఱు అయిదు భేదములను వచించిరి. ఇతడు చతుర్విధవాదమునే ఆదరించినాడు. అభిలాష, ఈర్ష్య, విరహ, ప్రవాస భేదము లంగీకరించినాడు వీనిని సోదాహరణముగ ప్రపంచించి మతభేదము సయుక్తము వ్యాఖ్యానించినాడు. ఇది ప్రతాపరుద్రీయమతానుసారముగ వచింపబడినది. మఱియొక మతమున కరుణ విప్రలంభము, మానవిప్రలంభము కూడ కలవని సోదాహరణముగ నిరూపించినాడు.

మన్మథావస్థ లితడు పండ్రెండింటిని వచించినాడు. అది కామశాస్త్రానుసారమని పేర్కొనినాడు. కొందఱ మతమున దశవిధావస్థ లనియు మతభేదమును పేర్కొనెను. [1] మరణమునకు బదులు ధన్యత నుదాహరించినాడు. అది లెస్స. పూర్వాలంకారికులెవ్వరును ధన్యతను పరిగణించినట్లులేదు.

పంచవిధసంభోగశృంగారము :

సంభోగశృంగారము నందు భేదములు ఆలింగనచుంబనాది భేదములచే ననంతములుగా నుండుటచే పూర్వు లెవరును, నీ భేదము లిన్ని యని పేర్కొనలేదు. తెలుగున చిన్నకోట పెద్దన సయితము సంభోగశృంగారమున భేదములను పేర్కొనలేదు. రససిద్ధాంతమున కాద్యప్రవక్తయైన భరతుడు మాత్రము శృంగారము వాఙ్నైపథ్యక్రియాత్మక భేదముచే త్రివిధ మని సుడివియున్నాడు. [1] ఈ భేదములను సంస్కృతాలంకారికు లెవరును ప్రతిపాదించరేమ కాని భరతుని మతమును భూమికాప్రాయముగ గైకొన యీతడు పంచవిధ సంభోగశృంగారమును ప్రవచించినాడు. 1)వాగ్వ్యాప్తి (2)నైపథ్యము (3)అంగక్రియ లేక క్రియ (4)సంకీర్ణము (5)మిశ్రము.


ఇందు వాగ్వ్యాప్తియు, సంకీర్ణము, అంగక్రియయు, ఒక్కొక్కవిధముగనే యుండును. నైపథ్యము 5 విధములుగ నుండును. మిశ్రము 3 విధములుగ నుండును. మొత్తము మీద నుదాత్తశృంగారము ఏకాదశభేదములుగ గల్గియుండును. ఈ భేద సూచికను పట్టికగా నొసగుచున్నాను.

---

[1] సరస్వతీకంఠాభరణము.

[1] శృంగారం త్రివిధం విద్యా ద్వాఙ్నైపథ్యక్రియాత్మకమ్ (6-77)

సంభోగశృంగారము



A చతుర్విధ శృంగార మనగా పూర్వమున చెప్పబడిన అనులేపనాదులు నాల్గును కలిసినదని భావము.

B సంకీర్ణ మనగా నైపథ్యము, వాగ్వృత్తి, అంగక్రియ అను నీ మూడింటి కలయిక గను వర్ణింపబడును.

C— మిశ్ర మనగా వాగ్నైపథ్యక్రియాత్మకములు మూడింటిలో నే రెండింటి కలయిక యైనను మిశ్ర మనబడును. నైపథ్యము అంగక్రియ కలిపినది నైపథ్యక్రియాత్మకము. ఇట్లే మిగిలిన రెండు నెఱుగునది.

భావోదయాదులు – రససంకరము :

సర్వపూర్వాలంకారికోక్త మయిన భావోదయ,భావశాంతి,భావసంధి, భావశబలతలను నాల్గింటిని సోదాహరణముగ వివరించినాడు. రసవిరోధములను ప్రథమాశ్వాసముననే చెప్పియున్నాడు. ఇచ్చట రససంకరమును ప్రస్తావించియున్నాడు. శృంగార రసమునకు బీభత్సమునకు పరస్పరవైరుద్ధ్యము కలదు గాన బీభత్సమును వదలి మిగిలిన ఏడు రసములతోను, శృంగారరససాంకర్యమును సోదాహరణముగ వర్ణించినాడు. రౌద్రమునకు సూచనా ప్రాయముగ బీభత్సముతోటి సాంకర్యము నుదాహరించినాడు. విరోధిరసము తప్పించి మిగిలిన రసము లన్నిటికి అన్నిరసముల తోడను సాంకర్యమందదగునని వచించెను. ఇతరాలంకారికులు నిర్వచించినట్లు రస వైరుద్ధ్యము నంతగా పాటించినట్లు కన్పట్టదు.

అరయంగ మఱియు రససం
కరము లిటులు విస్తరింపఁ గలుగును మహి స
ర్వరసాంతములయందును
విరోధిరస మొకటు దక్క విశ్రుతకృతులన్

(రసాభరణము 3-75)

చతుర్థాశ్వాసమున నాయికానాయకభేదములు సోదాహరణముగ వివరింపబడినవి. రసమునకు ఆశ్రయభూతు లైనవారు నాయికానాయకు లగుటచే తద్భేదములు నిరూపింపబడినవి. ఆలంకారికగ్రంథములలో రసమునకు ప్రత్యేకప్రతిపత్తి నిచ్చినవి రసమంజరి మున్నగునవి. వానియందు సైతము రసాలంబనభూతు లైన నాయికానాయకుల వర్ణనము గలదు తదనుసారియై పెద్దన యిచ్చట నీ భేదములను వివరించినాడు. నాయకులు ముత్తెఱగులుగా నుందురు. (1)ప్రథాననాయకులు (2)సర్వరససాధారణనాయకులు (3)కేవలశృంగారనాయకులు-ఇందు ప్రథాననాయకుడు కావ్యాలంకారవ్యక్తు డగుటచే నిచ్చట పెద్దన వివరింపలేదు. సర్వరససాధారణనాయకులు (1 ధీరోదాత్తుడు (2)ధీరోద్ధతుడు (3)ధీరలలితుడు (4)ధీరశాంతుడు వీరు నల్వురు సర్వరససాధారణులు. శృంగారనాయకులు(1)అనుకూలుడు(2)దక్షిణుడు(3)ధృష్టుడు (4)శఠుడు అను నల్వురు. వీరికి స్మరలీలలో (1)విటుడు(2)పీఠమర్దకుడు 3)నాగరకుడు(4)విదూషకుడు నను వారు విశ్వాసులగు సహాయులు.

నాయికాభేదములను గూడ వివరించినాడు. అష్టవిధశృంగారనాయికలను సోదాహరణముగ వర్ణించినాడు. మరియొక విశేషము ఉత్తమమధ్యమాధమనాయకుల లక్షణములనే గాక తన్నాయికల వచనము కోపము,ప్రసన్నతలను సయితము వచించినాడు చాతుర్వర్ణ్యగృహిణులు సయితము వర్ణింపబడిరి.

మన్మథమాహాత్మ్యము :

ఇతరలాక్షణికగ్రంథములం దెచ్చటను గాన రాని మన్మథమాహాత్మ్య మిచట ప్రపంచింపబడి ది. మన్మథునిరాజ్యము,అతనిదేవి, వాహనము, సారధి, ఆయుధము, సేనలు, దళవాయి మున్నగువానిని వివరించినాడు. వీనితో , తడు కైలాసనాథునైన సాధించునని తెల్పినాడు. మన్మథుని పంచబాణములను వ ం ఁచే గాక వానికి లక్ష్యభూతము లగు స్త్రీల యవయవములను సయితము వివరించినాడు.

కన్నుల శోకమునకు గుఱి
చన్నులు చూతమున కరుణ సరసిజమునకు
జెన్నుగ నుర మది దిరిసెము
నున్నఁ మస్తకము యోని యుత్పఁ మునకున్ (4 92)

ఇంతతొ నాగక అవి చేయు కార్యములను గూడ తెల్పినాడు.

కూడుమగించు నశోకము
వాడించును నల్లెవిరి వివర్ణత చేయుం
జూడగ జూతము తలపులు
జోడించును దమ్మి, చంపిచూఫం గలువల్ (4-93)

రసశ్రీ వింతాను నట్లుగ రచించి యానందాబ్దమున ధ్రువపట్టణాధిపున కర్పించుట సముచితముగ నున్నది.

నరసభూపాలీయము (భట్టుమూర్తి)

నరసభూపాలీయ మని ప్రసిద్ధి గాంచిన ఈ గ్రంథమునకు కవి పెట్టిన పేరు కావ్యాలంకారసంగ్రహ ౹ము. దీని రచయిత రామరాజభూషణుడుగా ప్రసిద్ధిచెందిన భట్టుమూర్తి. ౹ త ౼ నరసభూపాలునకు తన శాస్త్రగ్రంథము నంకితమొనర్చినాడు.

ఉదాహరణపద్యములం దంతటను నరసభూపాలునే ఆశ్రయ మొనర్చినాడు. ఇతడు రాయల తర్వాతి కాలము వాడు అళియరామరాయల తమ్ము డైన తిరుమలరాయల కంకితముగా శ్లేషప్రబంధ మైన వసుచరిత్ర మంకితమొనర్చి యాతనిచే రత్నాభిషేక గౌరవ మందినాడు అళియరామరాయల మేనల్లుడే యీ నరసభూపాలుడు. అతని కంకిత మీ గ్రంథము. ఇతడు సారస్వతాలంకారబిరుదాంచితుడు. జగత్త్రాణనందన కారుణ్యకటాక్షలబ్ధకవితాధారాసుధారాశి కలవాడు. అవధానవిద్యాపారీణుడు. నిరంకుశ ప్రతిభాబంధురుడు. ఘటికాసద్యశ్కృతగ్రంథకర్త.

ప్ర క ర ణ వి భా గ ము -

ఇది యైదాశ్వాసముల గ్రంథము. మొదటి యాశ్వాసమున నిష్టదేవతా ప్రార్థనానంతరము సుకవిప్రశంసయు కుకవి నిందయు, నాంధ్రసంప్రదాయాను సారముగా నొనర్చినాడు. ఉపోద్ఘాతములో అలంకారశాస్త్రప్రమేయమును దెల్పి, కావ్య మహిమను దెల్పినాడు. కృతిపతి వంశాభివర్ణన మొనర్చి నాయక గుణములతో గ్రంథప్రారంభ మొనర్చినాడు. నాయకగుణములు, నాయకస్వరూపములతో ప్రథమా శ్వాసమును ముగించినాడు ద్వితీయాశ్వాసమున నాయక భేదములు, ధీరోదాత్తాదుల లక్షణములు, నాయకసహాయులు నాయికాభేదములు తల్లక్షణములు, అష్టవిధశృంగార నాయికలు, కావ్యస్వరూపము, శబ్దవృత్తులు, వ్యంజనాభేదములు, కావ్యభేదములు, క్షుద్రప్రబంధములు సోదాహరణముగ వివరింపబడినవి. తృతీయాశ్వాసము రసము నకు ప్రత్యేకింపబడినది. చతుర్థాశ్వాసమున దోషములు, గుణములు వివరింపబడి నవి. పంచమాశ్వాసమున అర్థాలంకారములు వివరింపబడినవి. చివరగా అలం కారములు సంసృష్టిసంకరములు వివరింపబడినవి.

ప్ర తి జ్ఞ :-

ఇతడు రసచర్చకై యొక యాశ్వాసమును ప్రత్యేకించెను. ప్రబంధమునకు జీవితభూత మైనది రస మని భావించినాడు. నవరసములను నవరత్నగుంభగంభీర తర వచోజృంభణములతో నెరిగింతు నని వ్రాకుచ్చినాడు. ముమ్మొదట రసమును దెల్పి యనంతరము స్థాయిభావ నిర్వచన మొనర్చినాడు. రసవివరణమున పానక రసన్యాయమును స్వీకరించినాడు. ఈతడు నవరసవాది. శాంతమునకు శమమును స్థాయిభావముగా స్వీకరించినాడు. రసములకు స్థాయిభావములకు రస శాస్త్రవేత్తలౌ

నో నను నట్లుగా లక్షణలక్ష్యము లిత్తు నని ప్రతిజ్ఞచేసినాడు.

విభావాదిసామగ్రి :-

స్థాయిభావముల నుదాహరించిన పిమ్మట విభావస్వరూపమును ఉద్దీపన, ఆలంబనద్వైవిధ్యమును ఉద్దీపమునందు చాతుర్విధ్యమును ప్రకటించినాడు. ఉద్దీపనములు నాల్గింటిలోను తటస్థములలో మదనుని గూడ చెప్పినాడు. సంస్కృతాంధ్రములం దాలంకారికులెవ్వరును మలయానిలచంద్రాదులనే తటస్థములుగ పరిగణించిరి కాని మన్మథుని పరిగణింపలేదు చంద్రుడు మున్నగు వానిలో నితడు మరింత ముందడుగు వైచి మన్మథుని కూడ దర్శించినాడు. ఆంధ్రసాహిత్యమున విరహావస్థలో చంద్రోపాలంభనమే కాక మన్మథోపాలంభనమును చేయుట కలదు. ఆలంబన విభావమును ఉనుభావమును, సాత్త్వికవ్యభిచారిభావములను సోదాహరణముగా నిర్వచించినాడు వ్యభిచారుల విషయమున భరతోక్తమైన త్రయస్త్రింశత్సంఖ్యనే యాదరించినాడు. శృంగారచేష్టలను 18 ని తెల్పినాడు దశావస్థలను, విప్రలంభభేదములను ప్రపంచించినాడు.

రసాభాసము :-

నాయికానాయకులలో నొకరికే అనురాగమున్న రసాభాస మగు నని ప్రాచీనులనగా ఇందు ఒక స్త్రీకి చాలమందిపై ననురాగము రసాభాస మని చెప్పి మరికొంత యూహ చేసి "పలువుర కొక భామినిపై తలపు" [1] కూడ రసాభాస మని విశేషమును తెల్పినాడు. వీని కన్నిటికి ననౌచిత్యమే మూలకారణము. భావోదయాదుల నితడు స్పష్ట మొనర్చినాడు.

---

1. పలువుర కొక భామినిపై
దలఁపును నొక వారసతికి దగఁ బలువురపై
వలపును మృగవిహగాదుల
కెలవు రసాభాస మయ్యె క్షితి నెల్లన్నన్

కావ్యా। సం। 3-145

రసాధిదేవతాదికము :-

భరతుడు నాట్యశాస్త్రమున రసాధిదేవతలను వర్ణములను వివరించినాడు. అతని ననుసరించి యాలంకారికు లందరును వానిని చెప్పియున్నారు అట్లే ఇతడును అధిదేవతల నొక సీసమున వర్ణముల నొక సీసమున, వర్ణించినాడు. శ్లేషతో వర్ణించుట మరింత శోభాహేతువు. శాంతము నితడు శాంతి యనియు వ్యవహరించినాడు.

హరికి శృంగారలీలాధిపత్య మొసర్చు
గణనాథు హాస్యసంగతుఁ జేయు
నలికలోచనునిపై నధికరౌద్రము నిల్పు
శక్రుపై వీరరసంబు నెఱపు
యముపై శోకమయత్వంబు ఘటియించు
జగతి మహాకాలుఁ భయముఁ జేయు
శర్వరీంద్రుని జుగుప్సారసాప్తుఁ జేయు
శతధృతి నద్భుతాన్వితు నొనర్చు

శాంతి బ్రహ్మంబుఁ జేర్చు నిచ్చుట నృసింహు
భువనభరణంబు నరవిష్ణునిఁ హాహారణ
మీశతయు భోగము ననేకనృపతిహృతియు
ననియు యశమును మతియు బోధాతిశయము

శృంగారము —	హరి	హాస్యము —	గణనాథుడు
కరుణము —	యముడు	రౌద్రము —	శివుడు
వీరము —	ఇంద్రుడు	భయానకము -	మహాకాలుడు
బీభత్సము —	చంద్రుడు	అద్భుతము -	బ్రహ్మ
శాంతము —	బ్రహ్మము		

శాంతరసమున కితడు పరబ్రహ్మము నధిదేవతగా పేర్కొనినాడు.

రస చర్చ :-

.. చివరగా రసనిష్పత్తిని గూర్చి చర్చించినాడు. భావము రసముగా మారి నపుడు వినివారితేతరవిశేష మగు ననియు, కావున సుఖ మైనను దుఃఖ మైనను సహృదయాత్మలయందు కేవలము హర్షదాయకమే యగు ననియు, రసము లౌకిక ముగ రామాదులయందే యుండును, కాని నాట్యమున సన్యావాసమై యుండుననియు మూడు పద్యములలో వచించినాడు. పదార్థములు వాక్యార్థమందు పర్యవసించినట్లుగా భావము లన్నియు రసమందు పర్యవసించు ననియు తంతువులు గూడి పటమగు నట్లే యనియు వివరించినాడు.[1]

ఈ భావములకు ఈ క్రింది ప్రతాపరుద్రీయ శ్లోకము లాధారములు (ఈత డిట్లు ప్రాచీనుల భావపరంపరను చాలవరకు సముచితరీతిలో ప్రపంచించినాడు

[2] గుణాలంకారశ్రీకృతపరికరో భావవిభవ
స్ఫురత్త్వాదుర్భావః క్రమగళితవేద్యాంతరమతిః
సుఖం వా దుఃఖం వా నిబిడయతు యానో స్సహృదయే
త్వమందానందాత్మా పరిణమతి పూర్ణోద్భరః

రసో వాక్యార్థ స్స న్విలసతి పదార్థాః పున రమీ
విభావాద్యా యస్మి న్నిఖిల దధతి విశ్రాంతి ముచితాం
అతో భావా ఏవ క్రమసముదితానోన్యవిభవాః
రసీభావం బిభ్ర త్యథ చ పటతాం తంతవ ఇవ-

(ప్ర రు 4-109)

భావే స్థాయిని వర్ధమానవిభవే రత్యాదికే సింధువ
త్కల్లోలా ఇవ సంభవంతి విలయం చాయాంతి భావా ముహుః

---

1. కావ్యాలంకార సంగ్రహము - తృతీయాశ్వాసము 152, 3, 4
2. ప్ర। రు। 4-108

నిర్వేదాద్యుపభోగభావితనిజాస్వాదాతిరేకో రసో
లోకే స్యా దనుకార్య ఏవ కథితో నాట్యే తు సామాజికే
(ప్ర। రు॥ 4.110)

రస దోషములు :-

ఇతడు దోషప్రకరణమునందు చాలవరకు ప్రతాపరుద్రీయమునే యనుస రించినాడు. ప్రతాపరుద్రీయమునందు విద్యానాథుడు దోషప్రకరణాంతమున "ఏవం దోషాంతరాణి యథాసంభవ మూహ్యాని-రసభావాదీనాం స్వశబ్దవాచ్యతా దుష్టవేవ" అని యొక చిన్నవాక్యమును వ్రాసినాడు దానిని కూడ వితడు విడువక

రసములు వాచ్యము లైనను
వెస నదియును దోష మయ్యె, పులోగ్రరణం
బసదృశబీభత్సరసో
ల్లసితము శృంగారసహిత లలన యనంగన్.

అని సోదాహరణముగా వివరించినాడు. రసము ధ్వన్యమానము కావలెనే కాని వాచ్యము కారాదని ప్రాజ్ఞుల యభిప్రాయము. వాక్యదోషములలో ఆ రీతిలక్షణము చెప్పుచు "రసమునకు అనుచిత మగు పదవిసర మరీతి" యని వచించినాడు. ఇట్లు సర్వత్ర రసప్రాధాన్యమును సూచించుచునే వచ్చినాడు.

రస సాంకర్యము :-

రసములను, రసాభాసమును, భావోదయాదులను వచించి వెనువెంటనే నవ రససంకరము నుదాహరించినాడు. కావ్యమునందును, వాక్యమునందును, పదము నందును, పదైకదేశమునందును చివరకు వర్ణమునందును రసాభివ్యక్తి కల్గుచుండు నని ప్రాచీనాలంకారికులు సవిస్తరముగ నిరూపించిరి. దాని వితడు పరోక్షముగ నవరససంకరమున రూపించినాడు.

జయలక్ష్మీరసమై ప్రతాపయుతమై శత్రుచ్ఛిదాధుర్యమై
ప్రియతార్తావనమై కవీంద్రగతియై, రక్తార్ద్రమై, నిర్ఘనో

దయవిద్యున్నిభమై, సకంప మయి, వందారుస్పృహాశూన్యమై
నయ మొప్పన్ నరసింహు ఖడ్గ మమరన్ నానారస
ప్రక్రియన్ [1]

ఇందు నరసింహుని ఖడ్గ మాలంబనముగా రసస కర ము దాహరింపబడినది. జయలక్ష్మిరతమై యనుచో శృంగారమును, ప్రతాపయుక్తమై యనుచో వీరమును, శత్రుచ్ఛిదాధుర్యమైయనుచో రౌద్రమును, ప్రయతార్తావనమై యనునెడ కరుణమును, కపీంద్రగతియై యను తఱి హాస్యమును, రక్తార్ద్రమై యనుచో బీభత్సమును, విఘ్నో దయ విద్యున్నిభమై యనుచో అద్భుతమును సకంప మయి యనుచో భయానక మును, వందారుస్పృహాశూన్యమై యనుచో శాంతమును స్ఫురించుచున్నవి.

సంస్కృతప్రతాపరుద్రీయకర్త రససాంకర్యమును నుదాహరించెనే కాని నవ రససాంకర్యమును చెప్పలేదు. ఆతడు శృంగారకరుణములకు రౌద్రబీభత్సములకు సంక రము నుదాహరించినాడు.

శృంగారరసాలవాలము
వెణుతుర్ల వడ్డి కవి

తెలుగు భాషలో వెలువడిన రససిద్ధాంతగ్రంథములలో నిది యొకటి. భాను దత్తుని రసమంజరి తెలుగున చాలమందిచే అనువదింపబడినది. రసస్వరూపమును స్థూలముగ దెల్పి నాయికానాయకులకు సంబంధించిన సర్వవిషయములను అందు వివరింపబడినవి. తెలుగున అంకిత విధానము విలక్షణమైనది. నాయకప్రాధాన్యమును పరోక్షముగ వ్యక్తీకరించునది తెలుగుగ్రంథము లన్నిటికి రాజాదరణమే వెలుగుజూపినది, కావున నాయకవర్ణనోత్పాదకమైన రసమంజరికి చాల అనువాదములు తెలుగున వెలసినవి. అట్టివానిలో నిది యొకటి యని చెప్పవచ్చును. అయ్యును దీని కొక వైశిష్ట్యము గలదు. దానిని పరిశీలించుటయే యిందలి విషయము.

ఈ గ్రంథమును వ్రాసిన కవి వెణుతుర్ల వడ్డికవి. ఇతడింకను బాలగోపాల విలాసము గూడ వ్రాసినాడు. ఈ రెండు గ్రంథములును దైవాంకితములు వీనిని బట్టి యితని దేశకాలము లంతగా తెలియరావు. వెణుతుర్లగ్రామము కర్నూలు జిల్లాలో

---

[1] కావ్యాలంకారసంగ్రహము,

నున్నది. ఈతడా యూరికి చెందినవాడై యుండు ననియు, 1600 ప్రాంతము వాడై యుండు ననియు చాగంటి శేషయ్య గా రూహించిరి.

గ్రంథవిభాగాదికము.

ఈ గ్రంథము 3 ఆశ్వాసముల పరిమితి కలది ప్రథమాశ్వాసమున రసస్వరూపము, నవరసము లు సూక్ష్మముగ వివరింపబడినవి. ద్వితీయాశ్వాసమున, తృతీయాశ్వాసమున సగము నాయికాభేదములు సోదాహరణముగ తెలుపబడినవి. తృతీయాశ్వాసమున మిగిలినభాగమందు నాయకలక్షణములు, నాయకభేదములు వర్ణితములు. ఇందు ప్రథమాశ్వాసమే ర ప్రతిపాదక మైనది. అదియే యిందు విమృష్టము

ప్రతిజ్ఞ.

ఈతడు తన గ్రంథమును జగద్ధితముగా రచింతు ననినాడు. రసము లన్నిటిలో శృంగారము మేలైనది కావున శృంగారమునే సప్రభేదముగ రచింతునని ప్రతిజ్ఞ చేసినాడు

రసము లం దెల్ల శృంగారరసము రసను
శ్రేష్ఠమగు గానఁ దద్రసస్థితు లనేక
భేదరీతులు వర్తించు పెంపెసంగి
యే రచించెదఁ గావ్యవం దెట్టు లనిన 1-8

కావ్యాత్మ

కావ్యమునకు ఆత్మ ఏది అనెడి విషయమున ఆలంకారికులలో భేదాభిప్రాయములు గలవు. వాని నన్నిటిని ఈతడు క్రోడీకరింపలేదు గాని ప్రసంగవశమున శబ్దార్థాత్మకమైన కావ్యమునకు ప్రాణము రసము అని స్పష్టపరచినాడు.

ధర శబ్దార్థాత్మకమై
పరగెడు కావ్యమున జీవభావస్ఫురణన్
గర మొప్పు రసము కారటు
లెరిగి నిరూపి పఁ గవుల కిష్టము వానిన్ 1-6

నాయికాప్రాధమ్యము :

శృంగారమున నాయికా నాయకులు రసాలంబనములు. వారిని వివరించుటలో ప్రాధమ్యము నాయిక కొసంగినాడు. దానికి సరసమైన కారణ మొసంగినాడు. నాయిక శృంగార చేష్టలు 18 గలిగినది. రహస్యసౌఖ్యకాలము నందు ఎంతటి చక్రవర్తి యైనను పదములబ్రాలను వేడికొనును. అపు డామె మిగుల శోభిల్లును. "క్రోపేఽపి కాంతం ముఖమ్" అనజెల్లును. అందుచే ఆమె పూర్వమున వర్ణింప బడినది అని నాడు. రసిక పాఠకులను సరసోక్తులను ప్రదర్శించినాడు.

"ఇల బరవిభావనాహ్లాద శృంగార
ముననుప్రీపురుషులు ముఖ్యాకార
ణము వేట మున్నుగా నాయికాఖ్యానంబు
సేయక శృంగారచేష్టలు పదు
నెనిమిది గలది నాయిక గావున రహస్య
సౌఖ్యకాలమున నే సార్వభౌము
డైన పదానతుడై వేడికొనఁ జేయు
చెల్వంబు శోభిల్ల శ్రేష్ఠ యగును
కోపమునఁ బాయ వేడినఁ గూర్మి డాయ
మోహనోపాయ యగు గాన మొదట నిచట
నాయికా రీతులెల్ల వర్ణన మొనర్ప
నిష్టమగు గాన తచ్చేష్ట లెట్టి వనిన 1-38

నిర్వచనములు :

లక్షణనిర్వచనముల పట్ల ఈ కవికి లౌకికదృష్టియే కాని శాస్త్రదృష్టి అంతగా గన్పట్టదు. కావుననే ఆంధ్రాలంకార ప్రచరితముగు బులుసు వేంకటరమణయ్యగారు ఇందలి లక్షణములు స్వతంత్రములై యున్నవని విమర్శించినారు. కరుణమున కిచ్చిన నిర్వచనము సరిగా లేదు. విప్రలంభశృంగారమునకు కరుణమునకు ఈతని దృష్టిలో భేద మంతగా గన్పట్టదు. "ఇష్టహానివ్యధ మెనయ శోకము"(1-11)అని నిర్వచించినాడు. ఇది కేవలము విప్రలంభ సూచకమే. లక్ష్యప్రదర్శనము నైతము విప్రలంభ నిరూపకముగనే యున్నది

ఁంచనిచే దొలంగి చన ఎల్లన వల్లభ లెల్ల చోటులం
గాచ కను గొనన్ వశముగా కల క తని కాక కోర్వలే
కెంచుచు నీరు కన్గవల నించుక ని చుక దైన్య వృత్తిఁ బ్రా
ర్థించిన వచ్చె శౌరి మణి దియ్యని నెయ్యము
మీారనవ్వుచన్ 1-15

కతిపయస్థలములం దిట్లున్నను స్వాతంత్ర్యము తోపాటు శాస్త్రమర్యాదను సయి తము పాటించిన స్థలములు లేకపోలేదు. సాత్త్వికలక్షణము చెప్పుచు "అనుభావ భావనములై ఘనరస కార్యములగు" నని వివరించినాడు

నరసభూపాలీయానుసరణములు :

క్షణనిర్వచనమందును, విషయవిభాగమందును తుదకు ఉదాహరణప్రదర్శన మందును ఈతడు నరసభూపాలీయము నాదర్శముగా గ్రహించినట్లు తోచును. స్థాయి భావలక్షణము విభావానుభావ్యాదులు పరికించినచో పై విషయము స్పష్టము గాగలదు. నరసభూపాలీయమున-

వని-యుఁ బతియును నాలం
బన మగు నుద్దీపనంబు బ్రాయంబును సా
మ్యమగు చేష్టలు మదనాదులు
ననఁదగు నేర్పరతు వీనికగు లక్ష్యంబుల్ 3-28

అన్న పద్యమును సుమారు యథాతథముగ స్వీకరించి స్వీయ మొనర్చుకొనినాడు.

వనితయుఁ బతి యగు నాలం
బనంబు నుద్దీపనంబుఁ బ్రాయంబును సా
మ్యమగు చేష్టలు మలయానిల
వనజాతబక చంద్రముఖు లవారణ నెన్నన్ 1-23

వ్యభిచారి భావములను పేర్కొను విషయమున సైతము క్రమము తప్పక సరస భూపాలీయమునే యనుసరించినాడు. భేదము ఒక్కటే. కట్టుమూర్తి శార్దూలవిక్రీడిత మొనరింపగా నితడు సీసప్రస్తార మొనర్చినాడు.

ఉదాహరణములందును సరసభూపాలీయ భావములనే మిక్కిలిగా గ్రహించినాడు.

రససంఖ్య :

ఇతడు రసములు తొమ్మిది యనియే పేర్కొనినాడు. శాంతమునకు శమమునే స్థాయిభావముగా పేర్కొనినాడు. వ్యభిచారిభావములలో ఉన్మాదవిషయమున కాయిక వాచిక భేదములను పేర్కొనినాడు.

ద్వితీయ తృతీయాశ్వాసములలో నాయికానాయకభేదములను ప్రపంచించినాడు. రసవిషయికమైన చర్చ యిందు లేకపోయినను శృంగారరసమునకు నాయికానాయకు లాలంబన మగుటచే వానిని విస్తృతరీతిని వివరించినాడు. ముఖ్యముగా నాయికాభేదములను మిక్కుటముగా వివరించినాడు. పూర్వాలంకారికు లెవ్వరును ఇంత విస్తృత ప్రాతిపదికపై నాయికానిరూపన మొనర్పలేదు. విషయవిస్తృతిచే పాఠకుడు విసుగు చెందకుండునట్లు సరసశైలి కాపాడినది.

ఇచట ఒక విషయము పరిశీలనార్హము. ఇన్ని భేదములను తెల్పుటకు కవి పరమభావుకుడైనను కావలయును. లేదా మిగుల ననుభవజ్ఞుడైనను కావలయును. ఒక్కొక్కచో నితడు రెండుశక్తులును కలిపిన వ్యక్తియా యనిపించును. వీని యుదాహరణప్రదర్శననైపుణ్య మట్లనిపించును. తన గ్రంథమునకు శృంగారరసాల వాల మని నామకరణము చేయుట కూడ నాయికాప్రాధాన్యము ననుసరించియే అని తోచును.

మొత్తము మీద ఇతనికి శాస్త్రదృష్టికంటె లౌకికదృష్టి మెండు అనిపించును. తాను శ్రీరఘువీరభక్తరససింధువిహారుడనని భక్తిరసమును పేర్కొని వాచ్యము చేసినాడు. స్థాయిభావములు రసములు మున్నగువానిని సైతము స్వశబ్దనివేద్యము లొనర్చినాడు. ఆశ్వాసాంతములందు తన గ్రంథము సరసలక్షణప్రబంధమని వచించినాడు. ఇది శృంగారరసప్రాధాన్యమును సూచించును.

తెలుగున వెలసిన లక్షణగ్రంథములలో రసప్రాధాన్యసూచకములైనవి రెండు విధములుగా కన్పట్టుచున్నవి. ఒకటి- రసనిరూపణమును ప్రదర్శించునవి. రెండవది

భానుదత్తుని రజమంజరి పద్ధతిలో రసాలంబనమైన నాయకుని గూర్చి వచించునవి. ఈగ్రంథము ఈరెండు విధానములను సంగ్రహించి రసమునకు ప్రత్యేకప్రతిపత్తి నిచ్చిన ఆంధ్రగ్రంథములలో సమాహారగ్రంథ మనవచ్చును.

ఆంధ్రుల వరివస్య – ఆధునిక కాలము :-

పద్యకృతులలో అలంకారశాస్త్ర నిర్మాణము సంస్కృతభాషయందువలె ఆంధ్రభాషయందు సైతము ఆధునికకాలమున ఆగిపోయినది పద్యకృతులు కొరవడి నను అలంకారశాస్త్రజిజ్ఞాస మాత్రము ఆంధ్రులలో పెరిగినది. ప్రాచీనకాలమునుండియు ఆంధ్రమున స్వతంత్రసాహిత్యవిమర్శనగ్రంథములు లేవనుట సర్వవిదితమే అట్లే అధునికకాలమున సయితము స్వతంత్రగ్రంథములు వెలువడలేదు. కాని సంస్కృతా లంకారగ్రంథములను వివిధరీతులలో మలచి ఆమలుపులలోని మాధుర్యము సు చవి చూచుట ఆంధ్రులకు అలవడినది. ఆమలుపులే వివిధశాఖలుగ విరాజిల్లినవి.

కొందరు అలంకారశాస్త్రచరిత్రమును తెలుగున ఆమూలాగ్రముగ వ్రాయ ప్రయత్నించిరి అలంకార శాస్త్రచరిత్రకర్త మేదేపల్లి వేంకటరమణాచార్యులు, ఆంధ్రా లంకారవాఙ్మయచరిత్రమును వ్రాసిన శ్రీబులుసు వేంకటరమణయ్యగారు పేర్కొన దగినవారు

మరికొందరు ఆంధ్రభాషయందలి అలంకార గ్రంథములనే ఆధారముగ గ్రహించి సంస్కృత భాషయందలి వివిధ విషయములను విస్తృతముగ వివరించిరి. విశిష్టరీతిలో వెలసిన వ్యాఖ్యానము లియ్యవి. సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి గారి కావ్యాలంకార సంగ్రహవ్యాఖ్య ఈ కోవకు చెందినది. సంస్కృతమునగల వివిధశాస్త్ర సంప్రదాయములకు అద్దము పట్టిన దీగ్రంథము.

సంస్కృతాలంకారగ్రంథములకు ఆంధ్రీకరణములు వెలువరించుట మరొక పద్ధతి. శ్లోకములకు పద్యములు, గద్యములకు గద్యములు వ్రాసిన గ్రంథము లధి కముగా కలవు. కాని ఉదాహరణ శ్లోకముల విషయమున తెలుగు గ్రంథములందలి యుదాహరణపద్యముల నిచ్చి నూతన మార్గమును చూపించిన ఆంధ్రధ్వన్యాలోకము తెలుగు పాఠకులను బాగుగ అలరించినది. పద్యాపేక్షలేకుండ శ్లోకములకును తెలుగున గద్యములనే వ్రాసిన అనువాదము వేదమువారి సాహిత్యదర్పణము.

కొందరు సంస్కృతవ్యాఖ్యానములతో సహా అలంకారగ్రంథములను అనువ దించిరి జమ్ములమడక మాధవరామశర్మగారి నాట్యవేదము (అభినవభారతితో సహా)

పంతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారి లోచనానువాదము నిట్టివి. ధరణికోట వేంకట సుబ్బయ్యగారి రసగంగాధరము కూడ పేర్కొనదగినది.

కొందరు వివిధాలంకారగ్రంథములందలి విషయము లన్నింటిని సమీకరించి సంహితాగ్రంథములను రచించిరి. అలంకారశాస్త్రమును ఆంధ్రపాఠకులు అనాయాసముగ అవగతము చేసికొనుటకు ఈగ్రంథములు బాగుగ ఉపకరించుచున్నవి. వీనిలో పింగళి లక్ష్మీకాంతముగారి సాహిత్య శిల్పసమీక్షయును, కాకర్ల వేంకటరామనరసింహముగారి సాహిత్యదర్శనమును, వాకర్ల వేంకటావధానిగారి సాహిత్యసోపానములను చర్ల గణపతిశాస్త్రిగారి సాహిత్యసౌందర్యదర్శనమును పేర్కొనదగినవి. వీనిలో యథావసరముగ రససిద్ధాంతము వివరింపబడుట మాత్రమేగాక ఆంగ్లేయుల అభిప్రాయములు కూడ నటనట స్పృశింపబడుట గమనార్హమైన విషయము.

మరికొందరు పీఠికల రూపమునను వ్యాసములరూపమునను ఎనలేని సేవ చేసిరి.

పైన పేర్కొనిన వన్నియును ఒకదృష్టితో చూచినచో అనువాదాత్మకములే. కాని లోతైన వివేచనతో పారిభాషికపదజాలముల క్లిష్టత లేకుండ సాగి స్వతంత్ర గ్రంథమా అనిపింపదగిన గ్రంథము విశ్వనాధ సత్యనారాయణగారి "కావ్యానందము", అనుభూతుల అంచులను పరామర్శించుచు రససిద్ధాంతముయొక్క లోతులను స్పృశించిన ఘనత వీరికే దక్కినది. తెలుగులోనే కాదు సంస్కృతమునందును ఇట్టి విశిష్టగ్రంథము వెలువడలేదు.

ఇట్లు శాస్త్రవిషయరూపముననే గాక కావ్యవిషయరూపమునకూడ తెలుగు కవులసేవ స్థాలీపులాకముగ స్పృశించుట యుక్తము.

తెలుగు కవుల రసదృష్టి

భారతీయ సాహిత్యప్రపంచమున రససిద్ధాంతము ఆద్యము హృద్యము నైన దగుటచే ఆనందవర్ధన, అభినవగుప్తులు తత్సిద్ధాంతమునకు సముచితపదవిని గల్పించినారు. అభినవుడు లోచనము, అభినవభారతి వ్రాసి సిద్ధాంతఖ్యాతి నినుమడింప జేసినాడు. అప్పటికింకను పూర్తిగా తెలుగున సాహిత్యయుగోదయము గాలేదు. ఉషోరేఖలు మాత్రము గోచరించినవి. కొలది సమయమునకే తెలుగు కావ్యావతరణము జరిగినది. భారత మావిర్భవింపుటకు నన్నయకు రాజరాజు ప్రోత్సాహము లభించినది. ఆంధ్రుల నోము ఫలించినది. నన్నయ రసబంధురమైన మహాకావ్యము నందించినాడు.

అనగా రససిద్ధాంతము శాఖోపశాఖలుగా విస్తరిల్లి యావద్భారతము జాజ్వల్యమానముగా వెలుగొందుచుండిన కాలమున తెలుగుభారత ముద్భవించినది. అట్టిచో రస సిద్ధాంత ప్రభావము తెలుగువాఙ్మయముపై పడకుండ నుండదు. దానిని పరిశీలింపవలసి యున్నది.

దానికిముందు తెలుగుకవులు రసమునకు సంబంధించి తమ కావ్యములందు వెలిబుచ్చిన అభిప్రాయములను పరిశీలించుట యుక్తము. ఈ పరిశీలనము సైతము తెలుగుకవుల రసదృష్టిని సూక్ష్మముగ వెలువరింపక పోదు. కావున తెలుగుకవుల కావ్యావతారికలలో వెలువరింపబడిన రసదృష్టిని వివరింతము.

నన్నయను కావ్యరచనకు ప్రేరేపించిన రాజరాజు కావ్యగీతప్రియుడు. అతని ఆస్థానమునందు మృదుమధురరసభావనవార్థవచనరచనావిశారదు లయిన మహాకవులున్నారు. కావుననే అతడు ఉదాత్తరసాన్వితకావ్యనాటకక్రమములు పెక్కు చూడగల్గినాడు. ఉభయభాషా కావ్యరచనాభిశోభితుని ప్రోత్సాహపరచినాడు. నన్నయ అక్షరరమ్యతను పాటించినవాడు. అక్షరరమ్యత రసపర్యవసాయియే.

తిక్కన రసాభ్యుచితబంధమునకు పేర్వడసినవాడు. కవిత్వతత్త్వ విరతిశయానుభావానంద భరితాంతఃకరణుడు. కావుననే నానారసాభ్యుదయోల్లాసి యైన ప్రబంధమండలిని రచించినాడు. అంకితముగొన్న హరిహరనాథుడు గూడ" "రసాభిజ్ఞహృదయకమలహంసు"డని తిక్కన వచించినాడు.

ఎఱ్ఱన భక్తిరసవాది "గిరిశపదభక్తిరసతత్పరభావము గలిగినవాడు. అతడానందసౌందర్యధుర్యు డగుట నందరిని ఆనందసిద్ధి చెందుడని యుద్బోధించినాడు.

తిక్కన నితడు బాగుగా నర్థము చేసికొనెనేమో. సోమన సరసపదవిశిష్టమైన బిరుదే కలదు సాహిత్యరసపోషణ దతడు.

నన్నెచోడుడు కుకవినిందలో రసప్రాధాన్యము నగ్గడించినాడు. అతని కవిత్వమున రసములు దళుకొత్తి రాలువారు నట. నవరసభావ భరితమైనది తన కృతియట. శైవకవులలో ప్రసిద్ధుడైన పాల్కురికికి జానుతెనుగు కావలయును. అది కూడ రసయుక్తమైనదే సరసమైనదే కావలయును. దానితో పాఠకులకు ప్రసాదానందలబ్ధి కలుగునని యాతని యాశయము.

శ్రీనాథుడు నైషధమును నవరసభావానుబంధ బంధురముగ వ్రాయ దలచినవాడు. చిట్టచివర దాని రసంబు పోషించితి నని చెప్పినాడు. శ్రీనాథునిలో గుర్తింప వలసిన దొకటి గలదు. తిక్కన తాను వ్రాసిన గ్రంథమును హరిహరనాథున కంకిత మిచ్చినాడుగదా. హరిహరనాథుని తిక్కన బ్రహ్మానందస్థితిని గోరినాడు. కావున పర్వాంతమునందు పద్యము నానందపదాంకిత మొనర్చినాడు. ఈ అభిప్రాయమును శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు వెలిబుచ్చిరి. కాని యింతకుముందే శ్రీనాథుడు గుర్తించెనేమో యనిపించును.

శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యములో మొదటి చివరి ఆశ్వాసాంతములు ఆనంద పదాంకితము లొనర్చినాడు. అన్ని ఆశ్వాసములు చేయవచ్చును గదా యనిన ఆయాశ్వాసము లందలి ఇతివృత్తభేదమును పురస్కరించికొని శ్రీనాథు డట్లొనర్చినాడు.

తెలుగుకవులందరు శృంగారమును రసరాజముగా నంగీకరించినవారే విశేషించి శ్రీనాథుడు తననైషధమునకు శృంగారనైషధ మనియే నామకరణ మొనర్చినాడు. దీనిని బట్టియే శృంగారశాకుంతలమును వెలసినది.

అందరిని తన కృతిచే మెప్పించగల పోతన భాగవతపురాణఫలమే రసాస్వాదన మని యుద్ఘోషించినాడు. పెద్దనగారు తన గ్రంథమును రససముచితమైన దని, రసస్ఫురణముగల కథలతో నిండినదని సూచించినారు.

వసుచరిత్రకారుడు, సాహిత్యరసపోషణ బిరుదాంచితుడు. నిజమున కీతడు శ్లేషలతో ప్రథావితుడయ్యె గాని లేనిచో నిరంతరరసప్రవాహమందు పాఠకుల

గొంలాడించెడివాడనిపించును. శ్లేషయోగముతో సైతము రసప్రాధాన్యమును సరస
తిలో వెలువరించినాడు.

సతి సాహిత్యరహస్య మీమాంసలనన్ సాధించి తోడ్తోన త
త్ప్రతికిం బ్రత్యుపదేశమిచ్చె నతులప్రౌఢిన్ ధ్వనివ్యక్తి ద
ద్ద్యుతికిం జొన్పుచు లోచనాంజనరసప్రోన్మేషముల్ తన్ముఖో
ద్గతముల్ సేయుచు బ్రత్యలంకరణమాహార్యంబు దీపింపగన్

వసు. 6-94

భూనాథాగ్రణికిన్ వధూమణికి సంభోగాంతసౌఖ్యంబు బ్ర
హ్మానందానుభవంబు దెల్పె నవవద్యంబై యవేద్యాంతరం
బై నిర్లేపకలాపమై క్రమవిముక్తానేకబంధానుసం
ధానంబై యపునర్భవప్రభవఖేదంబై విజృంభించుచున్

సూరన అత్యపూర్వ కథాసంవిధానవైచిత్రి మహనీయ మని వచించి
'పూర్ణోదయమును వెంటనే శృంగారరసప్రాయ మనినాడు. రసభావములను
స్యమైన రీతినే అమర్చినాడు. అత్యంతసరసమైన ప్రభావతీప్రద్యుమ్నము నందించి
వి.

కవికర్ణరసాయనకర్త సహజవైరములైన శాంతశృంగారములకు ఆలంబన
'యు డైనాడు. నీరసములైన కావ్యములను శవప్రాయములుగా దూరముననే
హరించినాడు.

దక్షిణాంధ్రయుగకవు లందఱును రసపోషణ కొఱకే గ్రంథములు వ్రాసిన
నిపించును. వీరందరికి రఘునాథుడు నాయకుఁడు. అతడు రసపరిపాటిఁ దేట
టల గవిత్వము రచించు మేటికవి. రససింధువులైన కవితలతో అవురా యని
ంచును.

ఆధునిక యుగమునను ప్రతినిధియైన విశ్వనాథను కూడ "రసము వేయి రెట్లు
న్పది".

ఇట్లు తెలుగుకవులలో కొందరు. కంఠోక్తిగ రసప్రాధాన్యమును చెప్పినారు. మిగిలిన వారు కంఠోక్తిగ చెప్పక పోయినను కావ్యము నంతయును రససిద్ధాంతమునకు లక్ష్యభూతముగా నొనర్చిన వారే ఇట్లు కవిసముదాయ మంతయు రసమునెడ మక్కువను ప్రదర్శించినవారే !

ఇంతదనుక తెలుగుకవుల కవిత్వాశయములు పురస్కరించికొని వారి రస దృష్టిని స్థూలముగ సూచించితిని. ఇపుడు వారి కావ్యము లాధారముగ వారు వేర్వేరు రసములకిచ్చిన ప్రతిపత్తి దాని తాత్త్వికవివేచనము చేయుదును

శృం గా ర ము :

"శృంగార ఏవ మధురః పరప్రహ్లాదనో రసః" అని ఆనంద వర్ధను డుద్ఘోషించి సహృదయ లోకమునకు సార్థక నామధేయు డైనాడు. తెలుగు కవులంద రును శృంగారమునకు సమున్నతస్థాన మిచ్చినారనియే చెప్పవలయును. భారతము సంస్కృతమున నితిహాసముగా పరిగణింపఁబడినను, తెలుగు భారతము కావ్యముగను ప్రబంధమండలిగను తత్కవులచే పేర్కొనబడినది. ఐతిహాసికప్రతిపత్తిని విడచి కావ్యప్రతిపత్తిని సంతరింపజేయుటలో ప్రధానాశయము కాంతాసమ్మితత్వమే. ఇదియే కావ్యప్రయోజనములైన ఉపదేశానందముల రెంటిలోను ఆనందప్రాధాన్యమును సూచించుచున్నది. ఈ కాంతాసమ్మితత్వ లక్షణము శృంగారమునందే యెక్కువ ప్రతి భాసించును. అందుచేతను సర్వప్రాణిసులభము నిసర్గము నగుటచేతను సహృదయ హృదయములకు త్వరితముగ ఆకర్షకమగుట చేతను తెలుగు కవులు శృంగారము నధికముగ నాదరించిరి.

ఇచ్చట మరొక విషయము ప్రస్తావించుట ప్రాసంగికమే యగును. తెలుగు వారు పరమభావుకులు. భావనాలోకములలో విహరించు నైపుణ్యము ఉగ్గుపాలతోనే ఒదిగి వచ్చును. నేలనుండియే నింగి మీది చందమామను ఆహ్వానించి పూలు పండ్లు తెమ్మని తదాస్వాదము చేయునేర్పు తెలుగుతల్లి తన బిడ్డలకు చిఱుప్రాయమునందే యొసగును. ఇది తెలుగు జాతికి నిసర్గము. దానినుండియే తెలుగుజాతి సహృదయ తా నిధిగా అందును రసికతకు చిహ్నముగ వెలసినది. తెలుగువారి రసికజీవనము భావు కతారామణీయకమై గాథాసప్తశతిలో ప్రతిఫలించును. ముఖ్యముగా గ్రామ్యరాసిక్యము గోచ రించును. ముక్తక ప్రాయములైన ఆ చిన్నచిన్న పద్యములు విరిపొట్లముల వంటివి భావుకులైన వానికి ఆ పొట్లము తనంతతానే విచ్చుకొని స్వీయపరిమళమును వెద

చల్లును. భావనా పరంపరను ప్రేరేపించును ఒక ఉదాత్త రమణీయమైన నాగరిక జీవన ప్రతిబింబప్రాయమైన రసన్నివేశమును ఆ పద్యములు తమ వెనుక పొదిగి కొనినవని కావుననే ఆనందవర్ధనునకు ఇవి పరమలక్ష్యము లైనవి. ధ్వనిమనన్వయము నకు గాథాసప్తశతి అమరుకము భూరి లక్ష్యములు.

అట్టి గ్రంథములకు తెలుగురాజు వేమభూపాలుడు వ్యాఖ్యానములు వ్రాయుటకు వానిపైని తదుద్దిష్టమైన రసికజీవనముపైని యాదరమే కారణము.

రాసిక్యమనినచో నిఘంటువునకు సహృదయత రసజ్ఞత యనియే యర్థమయ్యును అది చాలమంది నోట శృంగారరసికునకే పరిమితమైనది. ఈ పరిమితత్వము సైతము శృంగారప్రాధాన్యమును సూచించునే యున్నది.

కవిత్రయములో శృంగార రసపోషణము సంయమనమును సముచితత్వమును సంతరించుకొన్నది. వారిలో లౌకికదృష్టికంటె ఆధ్యాత్మికదృష్టి మెండు అయ్యును కొన్నిపట్టుల కథానంవిధానము ననుసరించి శాంతము శృంగారముచే అభిభవింపబడిన సందర్భములను సైతము పోషించిరి. మేనకా విశ్వామిత్రము మున్నగున వట్టివి. నన్నయ చేతిలో శకుంతలాదుష్యంతులయు తపతీసంవరణులయు, శృంగారము ఉదాత్తతనే కాక సంప్రదాయ పాలనమును నయితము సమకూర్చుకొనినది. తిక్కన గారి ప్రబంధమండలి శృంగారరసాభాసముతో మొదలైనది. ఇది యాతని ఆధ్యాత్మిక దృష్టిని బలపరచునేమో !

ఎఱ్ఱన శృంగార పోషణము సత్త్వప్రధానమైనదని శ్రీయస్వీ జోగారావుగారి యూహ, (చూ. భారతి May 52) ఇదియును ఎఱ్ఱన చూపు ఆధ్యాత్మికత వైపే ప్రసరించునట్లు తెల్పును

నాచనసోముడు శృంగారమును అందును రసాభాస ఘట్టమును సముచితముగా పోషించినాడు. అతని చేతిలో శృంగారము పలు వన్నెలు చిన్నెలు పోయినది చమత్కారములు చూపినది. ఒయ్యారములు వెలార్చినది. సాహిత్యరసపోషణ బిరుద ప్రదాన మొనర్చినది.

శ్రీనాథు డనగనే శృంగారనైషధము గన్పట్టును. స్వీయశృంగార పోషణ వైశిష్ట్యమును ప్రకటించుకొను తపన కూడ ఆ పేరలో గోచరించును. ఇక వాని

గ్రంథమే పరికించినచో బోలెడంత శృంగారము. నలదమయంతుల పరస్పర శ్రవణ ముతో నుద్బుద్ధమైన శృంగారము వారి కేళీవిహారములందు బుష్పపు బంతియందు పరిణతమైనది. నారికేళాటవీ నవపుష్పసహాశికావితతి కన్నెరికములు నెరపియు. ద్రాక్షా రామ చళుక్యభీమవర గంధర్వాప్సరోభామినీ వక్షోజద్వయ కుంభికుంభములపై నధ్య క్షించియు సప్తగోదావరీ ప్రవాహమైనది. అయ్యును అతవి శృంగారము చీలికలై పాయలై విదాపునదీపూరమై బ్రహ్మజ్ఞానకళానిధాను నొనర్చినది. శివరాత్రి మాహాత్మ్య ములో ఆనందపర్యవసాయిత్వము పొందినది.

శృంగారమునకు భక్తిని జోడించెనా లేక భక్తికి శృంగారమును జోడించెనా అను సందేహము గలుగునట్లు రూపుదిద్దుకొనినది పోతన శృంగారము. మెఱుగు చెంగట నున్న మేఘముగా ముందు ప్రతిభాసించియు రుక్మిణిచే ప్రేమలేఖ వ్రాయించు ప్రాగల్భ్యమును కల్పించుకొనినది విప్రలంభమును గూడ వెలార్చినది.

శ్లో ఘనుఁడా భూసురుఁ డేగెనో నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో
వినికృష్ణుం డది తప్పుగా తలచెనో విచ్చేయునో యీశ్వరుం
డను కూలింప దలంచునో దలపడో ఆర్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో ఎఱుగదో నాభాగ్య మెట్లున్నదో

అని భావశబలతారూపమైన విప్రలంభమును ప్రదర్శించినది. చివర కది భక్తి పర్యవసాయి అను వారును లేకపోలేదు. అయినను అది పరిణత దశ.

ఇక పెద్దన్న నాటికి ఒక ఒయ్యారమును పొందినది. ఆభాసమయ్యును రసమే అనిపించుకొనినది. శాంతముచే పరిభవింపబడినను ఉనికివి ప్రత్యేకతను పోగొట్టుగొన లేదు. తిమ్మనాదులకడ శృంగారము మూడుపువ్వు లారు కాయలుగా విలసిల్లినది. విప్ర లంభము సమంజసముగ పోషింపబడినది. జలజాతాసన వాసవాదిసురపూజాభాజనంబై తనర్చు లతాంతాయుధు కన్నతండ్రి శిరమును వామపాదముతో దొలగద్రోచి రస సామ్రాజ్యము నధిరోహించి రసికప్రీతిని సంపాదించుకొనినది.

రాయలు పైతము శృంగారప్రీతిని సముచితరీతిలో ప్రదర్శించిన వాడే. ద్రవి డాంగనల సందర్భమునందును ప్రపాపాలికల సాన్నిహిత్యమునందును శృంగారము తొంగిచూచును. సంపసాలవారు జోడుగుఱ్ఱాల స్వారి చేసినారు. ఇది వాల రమణీయ

మైనది. యతిని నయితము విటు నొనర్చినారు. నీరసుల జోలికి పోలేదు. సరిగదా వారిని దూరముగనే పరిహరించిరి.

ఇక దక్షిణాంధ్ర యుగమున శృంగారము వేసిన వేషములు ఇన్ని అన్ని కావు. వెఱ్ఱితలలు వేసిన దను నప్రతిష్ఠ యున్నను ఉద్ధృతముగ ఉవ్వెత్తుగ శృంగారరస ప్రవాహ మీకాలముననే సాగినది. ఇది యానాటి సామాజిక జీవనమును సైతము ప్రతిఫలించుచున్నది. వేశ్యా శృంగారము రాణులను సైతము ధిక్కరించినది. "ఏ వనితల్ మముందలప నేమిపనో" యని ఎదిరించినది. రససామ్రాజ్యము నేలినది. ఇట్లు ప్రాచీన సాహిత్య మంతయు శృంగారము వెల్లివిరిసినది. కొన్ని కావ్యములు బూతులబుంగ లను అపవాదమును సైతము పొందినది.

హాస్యము : భారతీయ సాహిత్య శాస్త్రమున హాస్యము ద్వితీయ రసముగా పరిగణింపబడినది. శృంగారము తరువాత భరతుడు హాస్యమునే పేర్కొనినాడు. తరువాతి ఆలంకారికు లందరును హాస్యమును పేర్కొనినవారే. కాని సాహిత్యము నందు అంగి రస ప్రతిపత్తి లేదు. అంగరసముగా సైతము అంతగా పోషింపబడి నట్లు కన్పట్టదు. కావ్య సాహిత్యమున వెదకి వెదకి సన్నివేశముల నేరుకొని హాస్య స్ఫోరకములుగా ప్రతిఫలింపజేయవలసిన యగత్య మేర్పడుచున్నది. రామాయణమున శూర్పణఖ వృత్తాంతము కడను ఆంజనేయుడు సీతను చూచినపుడు ప్రదర్శించిన అనుభావబాహుళ్యమునందును (ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛమ్ ఇత్యాదులు) హాస్యరసమును వెదుకవలసివచ్చుచున్నది. నాటకములందు సైతము ఈ రసమునకు ప్రత్యేకస్థానము ప్రథమస్థానము నిచ్చినట్లు కన్పట్టదు. విదూషకాది పాత్ర లాధార ముగ నాటకములందును ప్రహసనము లందును మాత్రము స్వల్పముగ హాస్యము కన్పడును. దీనికి కారణమిట్లూహింప వచ్చును కథాశరీరమునందు ఉదాత్తత సన్న గిల్లువనెడి ఊహచే హాస్యమునకు అంతటి ప్రతిపత్తి కల్గించలేదు.

ఇదే స్థితి తెలుగు సాహిత్యమునందును గోచరించును. ఎన్నియో హాస్యస్ఫోర కములయిన సన్నివేశములకు ఆలంబనప్రాయుడైన తెనాలి రామకృష్ణుని కావ్యమందును హాస్యమును వెదుకవలసినదే. ఈ కథలకు కావ్యములకు హాస్య సూత్రములను అను సంధింప వీలులేదు. దీనికంతకు కారణ మొండు కలదు. నిజ జీవితములో కవుల ప్రవ ర్తనకు కావ్యరసపోషణకు సంబంధము లేదు. అట్టి సంబంధ మేర్పరచుకొన్నచో కావ్యము యొక్క ఔపదేశిక ప్రతిపత్తి, ఉదాత్తత కుంటుపడునని వారి యూహ,

మరియును మన దేశమున సాహిత్యము యొక్క ప్రభావమే సమాజముపై ఎక్కువగా పడును గాని సమాజప్రభావము సాహిత్యముపై తక్కువగాపడును అలక్ష్యముగా పడును. ప్రాచీనవారు సాహిత్యమునకు సార్వకాలికత్వమును అనుసంధించిరి. ఈ ప్రభావము గూడ భారతీయ సాహిత్యమున హాస్యము తక్కువ యగుటకు కారణమగుచున్నది.

అయ్యును హాస్యము ఆధునిక సాహిత్యమున చక్కగా పోషింపబడినది ఈ కృషి ప్రాచీన సాహిత్యమునకు పరిమితమగుట నది యిక్కడ ప్రసక్తము గాదు. ప్రాచీన సాహిత్యమున నక్కడక్కడగల సన్నివేశములను స్థూలముగ పరామర్శింతము.

తెలుగున కాదికావ్యమైన భారతములో నన్నయగారు సున్నితమయిన హాస్యమును ప్రదర్శించిరి. అసలితడు ఏ రసమును ఉజ్జ్వలముగా ప్రదర్శింపడు నిగ్రహము సంయమనము ఆయన ప్రకృతి. జీవితమునందే కాక వ్యంగ్యవైభవ పురస్కృతం బయిన సాహితీ జీవనమునందును నిగ్రహము గన్పట్టును. అధిక్షేప విధానము నన్నయకు హాస్యోత్పాదక సన్నివేశమయినది.

"వీ రెవ్వరయ్య ! ద్రుపదమహా
మహారాజులు! యిట్లు కృపణులయి పట్టువడన్
వీరికి వలసెనె యహహా ! మ
హారాజ్యమదాంధకార మది వాసెనొకో"

అను నుల్లసనములో నన్నయగారి హాస్యధోరణి ప్రస్ఫుటము ఇట్లే మయసభలో దుర్యోధనుని ప్రవర్తనము ద్రౌపదీ స్వయంవరమున బ్రాహ్మణుల ప్రవర్తనము అందును హాస్యము చోటుచేసికొనినది.

తిక్కనగారి హాస్యము వ్యంగ్యవైభవముతో నిండియుండును. ద్రౌపది యనుకొని భీముని జేరిన కీచకునితో భీముని నర్తనశాలలో ననుచున్న మాటలు.

ఇట్టి వాఁడవు గావున నీవు నిన్ను
బొగడి కొనఁదగు నకట నా పోల్కి యాఁడు
దాని వెదకియు నెయ్యెడ నైన నీకుఁ
బడయవచ్చునె యెఱుఁగక పలికి తిట్లు.

నా యొడలు చేర్చినప్పుడు
నీయొడ లెట్లగునో దాని నీవెఱిఁగెదు న
న్నేయబలలతోడిదిగాఁ
జేయఁదలంచితివి తప్పు సేసితి గంటే - 4-2-338

నను ముట్టి నీవు వెఱచియు
వనితల సంగతికిఁ బోవువాఁడవ యైనన్
దనువేఁ బడసిన ఫలమే
కనియెద విదె చిత్తభవ వికారము లెల్లన్". 4-2-339

నీ విట్టివాఁడవు గనుకనే నిన్ను నీవు పొగడుకొనగల్గితివి. నావంటి యాఁడుదానిని నీవెందును పొందలేవు. తెలియక యేమేమో మాట్లాడు చుంటివి. నా శరీరమును తాకినంతనే నీ శరీరమేమగునో నీ కిపుడే తెలియును. నను సామాన్య స్త్రీ గా తలంచి తప్పొనర్చితివి. నన్ను స్పృశించిన తరువాత నీవు మరి వనితల సంగతికి పోఁజాలవు చిత్తభవవికారము లన్నియు నిపుడే కనియెదవు అని వ్యంగ్యరీతి నుల్లాసమాడినాడు. మృదురీతిలో నిట్లు నిగూఢభాషణ మొనరించుట అటు ద్రౌపదికి నిటు పాఠకులకు హాస్య వ్యంజకముగా నున్నది.

శ్రీనాథుని కావ్యములలో హరవిలాసమున పార్వతీసహనావటువుల సంభాషణమునందును గోచరించును. అది నిజమునకు భక్తి పరీక్షయే. అతని గ్రంథములలో కంటె చాటువులలో హాస్యప్రీతి మిక్కుటముగ గన్పట్టును. హాస్యధోరణికి శివుడు అడ్డము రాలేదు. తిరిపెమున కిద్దరాండ్రా అని పరిహాస మాడినాడు. రామయ మంత్రి భోజన పరాక్రమమును తాళఫలప్రమాణ మని యూహచేసినాడు. అదిగొప్పలలో గుడిమీది కోతితోడను, గుడి లోపలి నంబివారి కోడలితోడను నడివీధి లంజతోడను అడిగినట్లు పరాచిక మాడినాడు.

పోతనలో హాస్యము భక్తి శృంగారములతో మిళితమైనది శ్రీకృష్ణుని చిఱుత ప్రాయపు లీలలందును యౌవన విలాసములందును హాస్యము ప్రతిఫలించును.

నన్నెచోడుడు శృంగారహాస్య సంశ్లిష్టరూపమైన సంఘటనము కల్పించినాడు. శివునిమీద కేగెడు మన్మధుని నివారించుటలో రతి పల్కిన పల్కులలో అది గోచరించును. "అదుదాన నబలను" అను పద్యమున రసద్వయ సమ్మేళనము సరస రీతిలో కొనసాగినది.

సోమనలో హాస్యము దుర్వాసుసంతటి వానికే గోచు లూడవెరికించినది.

ఈ హాస్యము ప్రబంధకవులలో నాయకుని చూచుటకు తహతహపడుచు వెళ్ళుచున్న కాళ్ళకు చేతులకు అపసవ్యతను ప్రసాదించినది కూడ. మళ్ళీ కొంతకు కొంత వేమన చేతిలో చక్కగా పోషింపబడినది

ఏమైనను ఆధునిక కవులు హాస్యమునందు గుర్తించిన బహుళ ప్రయోజనములను పూర్వకవులు గుర్తింపలేదు. ఆధునిక కాలమందు పాశ్చాత్యసాహిత్య ప్రభావమున చాలమంది హాస్యమును బాగుగా పోషించిరి కందుకూరి పానుగంటి చిలకమర్తి భమిడిపాటి మునిమాణిక్యం, మొక్కపాటి మున్నగువారి చేతులలో చాల విలాసముల వెలయించినది ఇంకను ఆధునికులలో పారడీలు, వ్యంగ్యచిత్రాలు, రేడియో కార్టూనులు మున్నగు నూతన రూపాలు కూడ ధరించినది

కరుణము :

"కావ్య స్యాత్మా సఏవార్థ స్తథా చాదికవేః పురా
క్రౌంచద్వంద్వవియోగోత్థః శోకః శ్లోకత్వ మాగతః

(ధ్వన్యాలోకము- ప్రథమోద్ద్యోతము)

అని ఆనందవర్ధనుని అభిభాషణము శోకము నుండియే శ్లోకప్రాదుర్భావ మని అట్లుధ్వనించిన అర్థమే కావ్యాత్మ యని అభిప్రాయము. అనగా చిత్తద్రుతి కారణముగా ఏర్పడిన సాత్త్వికానుభూతియే కావ్యాత్మ అనగా రసము. శృంగార, శాంత, కరుణముల వలన ఏర్పడెడిది చిత్తద్రుతియే అయినను అందలి తరతమభావ వివేచనము చేసినపుడు కరుణముదే పైచేయి.

శృంగారే విప్రలంభాఖ్యే కరుణే చ ప్రకర్షవత్
మాధుర్య మార్ద్రతాం యాతి యత స్తత్రాధికం మనః॥

(ధ్వన్యాలోకము- ద్వితీయోద్ద్యోతము)

కావ్యప్రకాశమున అష్టమోల్లాసమున, పై శ్లోకభావమగు శాంతరసమునకు గల చిత్తద్రుత్యాధిక్యమును, సర్వాంగీకృతముగా నంగీకరింపక కరుణమునే చిత్తద్రుతి హేతువుగా నిరూపించిరి. ఇట్లు హృదయస్పందన గలిగించగల కరుణరసమునకు శృంగారరసమునకు వలె అంగిరసముగ సాహిత్యమున ప్రాధాన్యము లేదు. అందులకు కారణముల విచారింప వలయును.

మనస్సు సుఖాభిలాషి- దుఃఖానుభవ మంత తేలికయిన విషయము గాదు. లక్ష్మిజనించినపుడు దేవదానవు లందరు అఱ్ఱులు చాచిరి. కాని హాలాహల ముద్భవించినపు డొక్క యీశ్వరుడే అందరకును గతి యైనాడు. కనుక సుఖము నాస్వాదించినంత అనాయాసముగ కరుణమును హృదయము భరింపలేదు. కనుకనే దాని ననుభవింపగల గుండెదిటవును కుదుర్చుకొనెడి అవకాశమును కల్పించవలెనని మన సంస్కృతి సైతము సుఖదుఃఖములను సమప్రతిపత్తిని కల్పించినది. కలిమిలేములు కావడికుండలు అని సామెత. ఆ నమ్మిక నరముల జీర్ణించుకొనిపోయి బాధ కల్గినను అంతమున సుఖమను భ్రాంతి, లేక, విశ్వాసము వలన దాని నపేక్షించి దాని కిచ్చినంత ప్రాధాన్యమును కరుణమున కివ్వలేదు.

> కళ్యాణి బత గాథేయం లౌకికీ ప్రతిభాతిమే
> ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి.
>
> (రామాయణము - సుందరకాండ)

అని వాల్మీకి నయితము వ్రాసినాడు.

పైని నిరూపింపబడిన తత్త్వమే భారతీయుల కరుణరసమున కంగిత్వము నివ్వలేక పోవుటకు మూలభూత మైనది. సంస్కృత సాహిత్యమున భవభూతి కరుణమున కంతటి ప్రాధాన్యము నిచ్చినను అతని ననుసరించిన వారు లేరైరి. అలంకార శాస్త్ర నియమానుసారముగ కరుణమువలన నయితము ఆనందానుభూతియే కదా కలుగునది. ఇట్టిచో అంగిత్వమును కల్పించుటలో ఆక్షేపమేమిః అన వచ్చును. కాని కరుణమువలన ఆనందానుభూతియే కలుగు ననుటలో కొందరకు విప్రతిపత్తి కలదు. విప్రతిపత్తి లేకిపోయినను ఆ ఆనందమునకు గల ఆశ్రయభేదమును బట్టి ఆనందము భిన్నముగాక పోయినను భిన్నమయినట్లుగ స్వీకరించుట తగదు. లేనిచో ఆనంద రూపమైన ఏకఘనమునే రసమని మిగిలిన రసభేదముల నన్నింటిని తొలగింపవచ్చును.

పాశ్చాత్యసాహిత్యములో "Tragedy" లు కరుణప్రధాన మైనవి. వానికి విషాదాంతములు, విషాదాత్మకములు నని అర్థద్వయము. కాని ఇటువంటి సాహిత్యమును ఆంధ్రసాహిత్యమున లేదు. పాశ్చాత్య సాహిత్యప్రయోజనము ప్రధానముగా "Pity and fear" గావున కరుణరసము తప్పక వారి సాహిత్యమున చోటు చేసికొనవలెను. ప్రాచ్యతత్త్వమునం దన్నిటిలో ఉపదేశమే ప్రధానము గావున కరుణమున కంతగా ప్రాధాన్య మివ్వబడలేదు. అనగా అంగిరసముగా ఆదరింపబడలేదు

తెలుగుసాహిత్యములో కరుణము చాలవరకు అంగరసముగనే పోషింపబడినది. భారతమున కపోతోపాఖ్యానము, స్త్రీపర్వము మున్నగు ప్రదేశములందు అంగరసత్వమునే భజించినది. అభిమన్యువధ ఘట్టము సమగ్రము కరుణరసపోషకము. తిక్కనగారి నిర్వహణ మిప్పట్టున అత్యద్భుతముగ నున్నది. అందలి పద్యము

హా! యను ధర్మరాజతనయా యను నన్నెడబాయ నీకుఁ జ
న్నే యను తల్లి నేపజనునే యను కృష్ణుఁడు వీఁడె వచ్చె రా
వే యను నొంటి బోక తగవే యను నేగతి పోవువాఁడ నే
నో యభిమన్యుఁడా యను ప్రియోక్తుల నుత్తర దేర్పవే యనన్

(ద్రోణ - 2 - 242)

ఈ పద్యమునందలి రసపుష్టిని వీడి కేవల శబ్దచమత్కారమునే గ్రహించి పులిని చూచి నక్క వాత పెట్టుకొన్నట్లు చాలమంది అనుకరించిరి కాని హాస్యభాజనులే యైనారు.

విప్రలంభము నందు కంటె కరుణమునందు చిత్తద్రుతి యెక్కువగా నుండును. లోకమునందు ఏ వస్తు వైనను లేనపుడే దాని విలువ బాగుగా తెలియును. కరుణరసము చిత్తద్రుతి హేతువగుటలోని యాంతర్య మిది. ఈ యాంతర్యమును శ్రీనాథుడు బాగుగ గ్రహించినాడు. కాశీఖండము ప్రారంభము కరుణముతో నొనర్చి, అంతము నందును కరుణమునే పోషించెను. ఆలంబనములు మాత్రము భేదిల్లినవి. మొదట ఆలంబనము అగస్త్యుడు. చివర ఆలంబనము వ్యాసుడు. ఇద్దరును కాశినెడబాయుదురు. అగస్త్యుడు

"కలహంసి! రారాదె కదలి నాతోఁగూడి
నీవేల వత్తమ్మ నెమ్మి నుండి

కదళీకాకాంతారా! కదలిరా నను గూడి
నీవేల వస్తమ్మ నెమ్మి నుండి"

అని విలపించును. అగస్త్య నంతటి మహర్షినే కాశీవియోగము కదలించి వేసినది.

రామకథను వాదకములైన రామాభ్యుదయము మున్నగు గ్రంథములందును కరుణము గన్పట్టును. ఆధునిక కావ్యములలో ఫిరదౌసి శివభారతము మున్నగు గ్రంథములు కరుణరసమునకు తప్పక పేర్కొనదగినవి.

వీరకథా వాఙ్మయము నందలి యితివృత్తము లన్నియు కరుణరసపర్యవసాయు లగుట గమనార్హమైన విషయము. ఆధునిక యుగమున విశ్వనాథవారే కరుణమునకు నడుముగట్టిరి. వారి వరలక్ష్మిత్రిశతి ఇచ్చట పేర్కొనదగినది. ఆత్మాశ్రయకవిత్వమైన ఆధునిక శతకసాహిత్యమునందు కరుణము కొంతకు కొంత ప్రాధాన్యము వహించినది.

ఏమైనను తెలుగు సాహిత్యమునందు కరుణరసమునకు తగినంత పోషణ లభింపలేదనియే చెప్పవచ్చును.

కరుణము పర్యంతమున ఆనందప్రదమే అయ్యును దాని పరిపోషదశ యందు విషాదాపాదిత దశయే యుండును. అది మానవుని గుండెల కదలించును. దానిని చాలమంది సుకుమారహృదయులు భరింపజాలరు. కావున మన సాహిత్యమున అంతగా కరుణరసపోషణము జరుగలేదనుట దోషముగాదు.

రౌద్రము

"తన కోపమె తన శత్రువు" ఈ సుమతి వాక్యము లౌకికమే. కావ్యనాట్యములందు లౌకిక మయినపుడు మిత్రము ఆనందప్రదము కూడ నగును. అది అలౌకికత్వసంపాదనము వలన కలిగిన మేలు. రౌద్రమునకు క్రోధము స్థాయిభావము. లోకమున ఉద్ధతప్రకృతులలో ఈ కోప ముండును. కొంత మందిలో హెచ్చుగ నుండును. కొంత మందిలో తక్కువగ నుండును. లౌకికముగ అట్టి హెచ్చుక్రోధము గల వ్యక్తి జనబాహుళ్యమునకు శత్రు వగుచున్నాడు. కావుననే అరిషడ్వర్గములో క్రోధమును ద్వితీయముగ పరిగణించి యున్నారు. దాని వలన

మనఃప్రజ్వలనము కల్గును - దానిని సయితము కల్యాణావహమైన ఆనంద ప్రదమైన భావముగ నూహించినాడు భరతుడు - రసస్థితి కల్గు మార్గ ముపదేశించి నాడు. భరతు డెట్టి భావములను రసస్థితి నూహించినాడో ఈ క్రింది విశ్వనాథవారి పంక్తులలో వ్యక్తము కాగలదు "ఏ భావములు మానవ సృష్టిని పట్టి పాలార్చు చున్నవో, ఏవి యగాధములో, ఏవి పరిహరింపరానివో, ఏవి మానవస్వభావమునందు నిరూఢములై యున్నవో, ఏవి లేనిచో బ్రదుకుట యన్నదుండదో, ఏవి యన్నిటికంటె ముఖ్యములో, వానిని దీసికొని రసనిర్ణయముచేసినాడు" (కావ్యానందము పుట 215,

క్రోధము సయితము ఆనందప్రదమగుట రసమార్గమున - అలౌకికత్వ సంపాదనము వలన. లోకమున నిద్దరు వ్యక్తులు ఒకరి నొకరు కొట్టికొనుట దూషించుకొనుట ప్రత్యక్షముగ చూచినచో భీతి కల్గును. కాని భారతమున ఆ విషయమునే భీమదుశ్శాసనుల విషయమున చూచినపుడు మన కానందమే కల్గుచున్నది- ఇది కావ్యగత మగుట వలననే -

ఆంధ్రసాహిత్యమున నన్నయ చేతికి చిక్కిన భారతభాగమందు రౌద్ర ప్రాధాన్య మంతగా గోచరింపదు- అయ్యును బకాసురవధ ద్రౌపదీ వస్త్రాపహరణము మున్నగు ఘట్టములందు భీము నాలంబనముగ చేసికొని రౌద్రము ప్రదర్శింపబడినది. అదియును అంగరసముగనే - తెలుగు సాహిత్యము నందు సామాన్యముగ ఈ రసము అంగిరసముగ కన్పట్టదు - అచ్చటచ్చట ఉద్ధత ప్రకృతు లాలంబనముగ అంగరసమాత్రముగ గన్పట్టును - తిక్కన భారతమున యుద్ధపర్వములన్నియు రౌద్రమునకు ప్రధానఘట్టములు. ఇందు కల దందు లేదని సందేహము లేక పలు తావుల గోచరించున దీ రౌద్రమే, అయ్యును అది అంగరసముగనే భీముడు శల్యుడు, దుశ్శాసనుడు మున్నగు వీరుల నాలంబనముగ చేసికొని రౌద్రమును వివిధ రీతుల మలచినాడు తిక్కన. యుద్ధపర్వములందు రౌద్ర మిట్లు విశ్వరూపము ప్రదర్శించినది.

"గద లన్యోన్యహతిన్ మిణుఁగుఱుల్ గ్రక్కంగ సారించుచుం
గదయుం బాయక వ్రేటు దప్ప నసుల న్గా నేర్పు లంగంబులం
దొదవన్ ఘోరపరస్పరప్రహతు లత్యుగ్రంబుగా నెత్తురుల్
సెదరం బన్ బదశబ్దహుంకృతులు దిక్చక్రంబులన్ దాటఁగన్ -

ద్రోణ - 1-185

నన్నెచోడుని దక్షాధ్వరధ్వంసము నంతయు నాచనసోముని హంసడిభకో పాఖ్యానము నందును కొంతకు కొంత రౌద్రము చోటు చేసికొన్నది - ప్రబంధయుగ మున అచ్చటచ్చట స్వల్పసందర్భములలో ఔచిత్యమును పురస్కరించుకొని పోషింప బడినది -శ్రీనాధుడు కాశీఖండమున వింధ్యపర్వత విజృంభణసమయమున రౌద్రము నతిమనోహరముగ పోషించినాడు.

అడుసు లోపల తాటిపం డదిమి నట్లు
అదుముదునె కాక .. ....

అను వింధ్యవచనములలో శ్రీనాధుని యాత్మీయత సయితము గోచరించు నని ప్రాజ్ఞుల భావన -

ఆధునికకావ్యములలో శివభారతము, శివార్పణము మున్నగు కావ్యములలో కూడ ఇది పొడచూపును ఏమైనను తెలుగుకవులు శృంగార వీరములవలె రౌద్రమును పోషించినవారు కారు - మరల జానపదగేయములలో నీ రౌద్రము కన్పట్టును- వీరగాధలందును దీని వైవిధ్యము గోచరించును.

ఇందలి తత్త్వ మిది - రౌద్రమునకు స్థాయిభావము క్రోధము - అది రస స్థితిని పొందినపుడే రౌద్రమై ఆస్వాద్యమగును - భావస్థితియం దున్నంత కాలము మనస్సును దహింపజేయును - ప్రజ్వలింపజేయును. అట్టి స్థితిని సమకూర్చు నేర్పు మహాకవులకుగాని యుండదు - తిక్కనాది మహాకవులు దాని విశ్వరూపమును ప్రద ర్శింపనే ప్రదర్శించిరి. మిగిలిన సామాన్యులకు అది సన్నిహితము కాదు - మరియు అది ఉద్ధతప్రకృతులకు మాత్రమే విశేషముగా ఆస్వాద్య మగుటచే అంతగా ప్రాధా న్యమును సంతరించుకొన లేక పోయినది.

వీ ర ర స ము :

లోకవ్యవహార మంతయు ప్రవృత్తిరూపమైనది ప్రవృత్తి క్రియారూప మైనది. దానికి ఉద్యమము సాధనము. "ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి న మనోరథైః" అని కదా ఆర్యోక్తి అందును పుణమయులైన వారు ఎన్ని విఘ్న ములు గల్గినను నిశ్చితార్థమును విడువరు. ఇది ఔత్సాహికుల లక్షణము. కావున క్రియా త్మకమైన ప్రవృత్తి సర్వము ఉత్సాహ రూపమైనది. ఆ ఉత్సాహము మానవునకు జన్మతః సిద్ధము. అది లేనిచో దేశమంతయు నిర్వీర్యము గానోపును. మానవుని

శక్తిని ప్రజ్వలింపజేసి క్రియాత్మక సత్ఫలితముల ప్రసాదించునది ఉత్సాహము. అది సమగ్ర పరిపోషము నొందిన వీరరసావిర్భావము జరుగును. ఇది లౌకికమైనచో ఆలంబనభూతుడే అనుభవించును. అలౌకికమైనచో అనగా కావ్యనాటకములం దయినచో సాధారణీకరణ ప్రభావముచే సామాజికుడే యనుభవించును.

ఈ వీరరసము నాటకవాఙ్మయమునందు మిగుల పోషింపబడినది. "ఏకో రసోంగీ కర్తవ్యః శృంగారో వీర ఏవ వా" అని వీరశృంగారములలో ఒకటి మాత్రమే అంగిరసముగా నిబంధింపబడు నని సామాన్యలక్షణ నిర్దేశము చేసిరి నాటక వాఙ్మయమున వీరము స్థానమట్టిది. జానపదుల సాహిత్యము నందును పల్లె సీమల వినిపించు పదములందును చాలవరకు ఉత్సాహమే తొణికిస లాడుచుండును.

శృంగారము సకలప్రాణిసులభ మగుటచే ప్రాథమ్యము వహించినదని యభిన వుని వక్కాణ. కాని ఉత్సాహ స్థాయిక మగు వీరము సకలావస్థా సౌలభ్యమును సంత రించుకొనినది. బాలుర వృద్ధుల సయితము ఈ ఉత్సాహమును రసరూపము నొందించి యనుభవించుట సులభ మని డా। జి - వి - సుబ్రహ్మణ్యం గారు వీర రసము అను గ్రంథమున వచించినారు. ఇది తద్రసముయొక్క ప్రాధాన్యము నుగ్గ డించునదే - దీని యునికి ఆంధ్రసాహిత్యమున నెట్టిదో పరిశీలింతము

తెలుగులో కావ్యరచనము భారతముతో నారంభ మైనది. సంస్కృతమం దయినచో రామాయణముతో నారంభ మైనది. సంస్కృతరామాయణమును వాల్మీకి కరుణరస ప్రధానముగ వచించినను అంగరసముగ నైనను వీరము ప్రధానస్థానము నాక్రమించిన దనియే చెప్పవలయును. శ్రీరాముడు లక్ష్మణుడు ఆలంబనములుగా అనేక ఘట్టములందు వీరరసము పోషింపబడినది. అసలు రామాయణమునందు సయితము వీరరసమే ప్రధానమైనదని కొందరు వ్యాఖ్యాతలు దెలిపియున్నారు. తెలుగు భారత మునందు కూడ అంగిరసము వీరమనియే డా. జి. వి. సుబ్రహ్మణ్యంగారి యూహ. ఆనందవర్ధనాదులు శాంత మనిరి. అయ్యును పర్యంతఫలమును గాక వ్యాప్తిని పురస్క రించుకొని భావించినచో వీరరసమే ప్రాధాన్యము వహించునని చెప్పక తప్పదు. శాంతము ప్రధాన మనువారి పక్షమునందు సైతము వీరమునకు అంగిరసముగా గాక పోయినను అంగరసముగా భారతమున ప్రముఖస్థానము గలదు. ధర్మజుడు అర్జునుడు అభిమన్యుడు మున్నగు వారి నాశ్రయముగా జేసికొని వీరము పలుచోట్ల పోషింప బడినది. ఈపోషణమునందు సయితము నన్నయలో విగ్రహము అధికముగ గన్న

ట్టును. తిక్కనలో కొంతకుకొంత స్వేచ్ఛ అనుభావబాహుళ్యము సాక్షాత్కరించును. ఈవీరమున భరతుడు దాన, ధర్మ, యుద్ధ, వీరము లను భేదములను దెల్పియున్నాడు. ఇందు భారతమున ధర్మ యుద్ధ వీరములు మిగుల పోషింపబడినను అటనట దానవీర మును పోషింపబడినది.

అర్జును నాలంబనముగా చేసికొని తిక్కన ఉత్తరగోగ్రహణమున యుద్ధవీర మును శిల్పాభిరామముగ పోషించినాడు. చిత్రాంగదప్రభృతి కురుకుమారుల ముందు నిర్జించి అర్జునుడు కర్ణునితో తలపడినాడు. కర్ణుడు మహాపరాక్రమముతో నర్జును నెదిరించి నిలిచినాడు. పోరు ఘోరముగ సాగినది.

శిరము లలాటమ్మును గం
ధరమును బాహువులు నురము దండడి గ్రయ్యన్
గిరిపైఁ బిడుగులు దొరఁగెడు
పగుసున దృఢదీప్తశాతభల్లము నేసెన్- 4-5 101.

దెబ్బకు తట్టుకొన లేక కర్ణుడు కయ్యంబు విడిచి పారిపోయినాడు. అపుడు అర్జునుడు ఉత్తరునితో కర్ణుని గూర్చి వచింపగా ఉత్తరు డిట్లనుచున్నాడు ఇచట ఉత్తరుడు లౌకికముగ యుద్ధవీరము నాస్వాదించుచున్నాడు. సామాజికతుల్యుడు. కాని లౌకిక మగుటచే తన్మయత్వము కల్గును గాని పూర్ణమైన ఆనందము గలుగదు. దానికి కారణము భీతి. కావ్యనాట్యములందు దా భీతి నతిక్రమింతురు. తిక్కన సామా జికుల ఆనందమును నయిత మూహించి ఉత్తరునిలో లౌకికప్రతిఫలన మొనరించి నాడు. ఇది మహాకవుల లక్షణము, నేర్పు. తిక్కన శిల్పములలో నిది యొకటి యన జెల్లును

"వెక్కసపాటు భీతియును విహ్వలభావము నొంది యిట్లను
న్మిక్కిలియైన శౌర్యమును నిర్భరతేజము నంతకంత కి
న్నెక్కుడ లావుఁజూచి మది యెంతయు బెగ్గిలె మేను చేష్టలం
దక్కె నృకం మింకిట రథవంహోరము నిరోహింపఁగన్.

కాన చోద్యమంది యంతరంగ మవశత బొందిన కతన వింద్రియముల కడక దక్క. ఇది యుత్తరుని యనుభవము. లౌకికము కావున అంతరంగము అవశత్వమును పొందినది. ఇంద్రియములు పరిమూఢము లైనవి. అయినను పూర్తిగా ఇంకను భీతి పోలేదు కావున ఆనందస్పర్శ కలుగలేదు. అలౌకిక మయినచో ఆభీతి యుండదు. ఆనందధామము వెంటనే అందును.

ఇందు యుద్ధవీరము అనుభవదృష్టాంతముగ వర్ణింపబడినది. పోషింపబడినది.

యుద్ధవీరపరిపోషణమునందు వీరులఉపాలంభములు పాఠకునకు చమత్కారాధాయకములుగ నుండును. తిక్కన వాని యౌచిత్యమును బాగుగా నెఱింగినవాడు. పాఠకుని మనస్తత్వము బాగుగా నాకళించి కొన్నవాడు.

అశ్వత్థామ, ద్రోణుడు, భీష్ముడు మున్నగు వారితో యుద్ధమొనర్చి రారాజు నొక్క శరమున నొంచెను. ఆతడు యుద్ధవిముఖుడై పారినాడు. అంత నరుడు దుర్యోధనుని ఇట్లనినాడు.

వీనుంగు నెక్కి పెక్కేనుంగు లిరుగడ
రాఁ బురవీధులఁ గ్రాలఁగలవె
మణిమయం బైన భూషణజాలముల నొప్పి
యొడ్డోలగంబున నుండఁ గలవె
కర్పూర చందన కస్తూరికాదుల
వింపుసొంపార భోగింపఁ గలవె
యతిమనోహర లగు చతురాంగనలతోడి
సంగతి వేడ్కలు సలుపఁ గలవె

కయ్యమున నోడి పాఱిన కౌరవేంద్ర!
వినుము నాబుద్ధి మరలి యీతనువు విడచి
సుగతి వడయుము తొల్లింటి చూఱగలదె
జూద మిచ్చట నాడంగ రాదు సుమ్ము!

ఈ యుపాలంభముతో యుద్ధవీరము పరాకాష్ఠ నందినది. పాఠకునకు చమత్కారాధాయకమైనది. రసనిష్పత్తికి పరిపోషము నిచ్చినది. ఇట్టి చమత్కారము లెన్నియో తిక్కన తన భారతమునే పొందుపరచినాడు.

ఇట్లు తిక్కన వీరరసపోషణమునందు వైయక్తిక ప్రతిభ నాధారము చేసి కొని వైశిష్ట్యమును ప్రతిష్ఠించి కొనినాడు. ఎఱ్ఱనాదులు తిక్కననే యనుసరించిరి.

శ్రీనాథుడు జక్కన అనంతుడు పోతన మున్నగు వారికడ వీరము మరికొన్ని విశేషములను సంతరించుకొన్నది. శ్రీనాథుడు దేశీయేతివృత్తమును సయితము వీర మునకు పోషకముగా గ్రహించినాడు. పలనాటివీరచరిత్రమున బాలచంద్రుని ఇతర వీరులను ఆలంబనముగా చేసికొని వీరరసపోషణ మొనర్చినాడు. రసపోషణమునకు అలంకారసాహాయ్యము నాదరించినారు వీరందరును. అంగఘటనమునకై అర్థించిన అలంకారసహాయము రసపోషణమునకు వినియోగించుకొనినారు. అలంకారాదులన్నియు రసపర్యవసాయులని పరోక్షముగ నిరూపించినారు. బాలచంద్రుడు తండ్రితో యుద్ధ మునుగూర్చి అనిన పలుకులు.

పిడుగు చిన్నది కాదె భేదించు కొండ
చిన్న మిర్యము నందు చెడునె కారంబు
ఘనకపాలము కెక్కె కాక నొందించు
మానక నోరంత మండును లెస్స!
కాల దావాగ్నికి కారడ వెదురె

ఇందలి అలంకారము సయితము రసపోషకమే. శ్రీనాథుని యుగమునందలి కవులు చాలవరకు శ్రీనాథుని అడుగుజాడలలో నడచిన వారే.

పోతన వీరశృంగారములకు సరసమైన జోడింపు కుదిర్చినాడు. భాగవతమున నరకాసురఘట్టమున నిది విదితము.

తరువాతి కవులలో శృంగారమున కున్న ప్రాధాన్యము వీరమున కంతగా కన్ప ట్టదు. పైగా ద్వ్యర్థికావ్య రచనాప్రక్రియ రససిద్ధాంతమునుండి విముఖుల నొనర్చి నది. వీరరసప్రధానము లైన కధలకు జోడించియు రసదృష్టి లేక శ్లేషకొఱకే పాట్లు పడినారు. చివరకు వారి సృష్టిఫలితము చిల్లరదేవుళ్ళకు మ్రొక్కిన ట్లయినది.

మరల ఆధునికయుగమున చక్కని వీరరసప్రధాన కావ్యములు వెలువడినవి. చారిత్రక కావ్యములుగా అవి ప్రసిద్ధి కెక్కినవి. శివభారతము, రాణాప్రతాపసింహ

చరిత్ర, పద్మనాయకచారిత్రము మున్నగునవి వట్టివి. నాటకములందు సయితము బొబ్బిలియుద్ధము, పాండవోద్యోగము విజయము మిక్కిలి రసపుష్టి కలిగి ప్రసిద్ధి కెక్కినవి

వీరరసప్రస్తావన సందర్భమున వీరగీతములను సయితము పేర్కొన దగును. జానపదసాహిత్యమున ఇవి ప్రధానస్థానము నాక్రమించును. తెలుగువారి వీరత్వము నకు నిదర్శనములైన లక్ష్యము లివియే యన జెల్లును. "వీరసంఘటన జరిగిన వెంటనే వీరగీత ముద్భవించును. ఆ సన్నివేశమును కన్నులార గాంచియో లేక చెవులార వినియో జానపదు డుద్వేగముతో గాన మొనర్చును. ఆపాట యంతట ప్రాకి పోవును" అని బి రామరాజు గారు వ్రాసియున్నారు. దీనిని బట్టి వీరగీతముల ప్రాధాన్యము స్పష్టపడును. ఇట్టివానిలో ప్రసిద్ధములైనవి కాటమరాజు కథలు దేశింగు రాజు కథ మున్నగునవి.

ఆధునిక గేయసాహిత్యమునందు ప్రబోధగేయములను పేరిట వీరప్రధానగేయ ములు వెలువడుచున్నవి.

ప్రాచీనులు వీరమును మూడునుండి 24విధములుగ విభజించిరి. ఎవ రెన్ని విధములుగ ప్రపంచించినను మూలభూతమైన విషయ మొక్కటియే. అదిఉత్సాహము అది ప్రవృత్తిరూప మైనది. ఉత్సాహ ప్రభు మంత్ర శక్తులలో అది ఆద్య మైనది అదియే జనావళికి వాంఛనీయము.

భ యా న క ము : దీప్తచైతన్యము ప్రధానముగా గల మానవ మనస్తత్త్వమునకు చైతన్యనియామకము వంటిది భయానకము. ఇదిజీవితమునకు సుఖజీవితమునకు సమాజసహజీవితమునకు అత్యంతము ఆవశ్యకము గనుకనే అరిష ద్వర్గములలో కాని మరే నిషిద్ధభావములలో గాని దీనికి స్థానములేదు. పై పెచ్చు తెలుగుతల్లులు చనుబాలు త్రావువయస్సునుండి పిల్లలకు వీరముతో బాటు భయమును సయితము అలవాటు చేయుచుందురు. లౌకికముగా భయప్రవృత్తి పరిహరణీయమని కొందరన్నను అది సరికాదు. నైతికములైన విలువలను పెంపొందించుకొనుటకు భయ మత్యంత మావశ్యకము. ఇది మానవభయమునకు సంబంధించిన విషయము. కాని ప్రాణభయము సర్వప్రాణులకును సహజము. కనుకనే శరీరనిర్మాణమునందు గూడ అసంకల్పిత ప్రతీకారచర్యల కానవాల్కు మెందేని కలదు.

భయము మనస్సులలో స్థిరనివాస మేర్పరచుకొన్న దయినను వీలయినంత రకును దాని తలపులను తెరువకూడ దనియే మానవుడు ప్రయత్నించుచుండును. ఆ లపులు తెలుచుకొన్న సమయమున మిగిలిన అనుభూతులకు అవకాశ ముండదు. ది ఆనంద హేతువు గాదు. కాని కావ్యనాట్యసమర్పిత మైనపుడు ఇతరభావముల లె ఇదియును రసభావమును పొంది అలౌకికానంద హేతువే యగును. ఉత్తమ కృతులలో సామాన్యముగా మానభయమే వర్ణింపబడుచుండును. కాని ప్రాణభయ మునకు తావుండదు. అధమప్రకృతులలో ప్రాణభయము ప్రధాన స్థానమును వహిం చును. "బ్రతికి యుండిన సుఖములు బడయ వచ్చు" నన్నది వారి సిద్ధాంతము

సాహిత్యములో నయితము పై ప్రకృతి నియమములే ఉనుసరింపబడుచున్నవి. నన్నయభారతములోని దుష్యంతుడు అంతఃపురమందు గాంధర్వవిధిని పెండ్లాడిన శకుం తలను పురజనుల సమక్షమున పుత్రునితో బాటు స్వీకరించుటకు భయపడినాడు. ఇది మానభయము. అదే తిక్కన భారతములోని కీచకుడు "పరసతీసంగమున వచ్చు పాపమున కైన సైపగలను" అని మానభయమును విడచినాడు. దుష్యంతుడు ధీరో దాత్తుడు. కీచకుడు ధీరోద్ధతు డగుటయే యిందులకు కారణము. నన్నయ సృష్టించిన పాత్రుడు బకుని ఎదుర్కొనుటలో ఎట్టి సంశయమును చూపలేదు. అదే తిక్కనభారత ములో ఉత్తరుడు

"కౌరవసేనఁ జూచి వడకన్ దొడఁగెన్ మదిలోన మేను నీ
వూరక పోవుచుంటి యిది యొప్పునె యిప్పటిభంగిఁ జూచినన్
వీరల నేను మార్కొనమి నిశ్చయ మట్లగుటన్ రయంబునన్
దేరు మరల్పు ప్రాణములు దీపన మున్ వినవే బృహన్నలా!
విరాట - చతుర్థ

అని వాపోయినాడు. ఇందు ప్రాణభయము ప్రస్ఫుటము. అదే సన్నివేశము అర్జునునకు ఉత్సాహహేతు వైనది.

వీరశైవవాఙ్మయరచనములలో పాపభీతి కెక్కువ ప్రాధాన్యము కన్పట్టు చుండును. శివునకు సమర్పింపబడు పూవుల కోసినందుకు పూజారిపడతి ముక్కు కోయగా ఆమె భర్తయేతనే నటికించుట పాపభీతికి పరాకాష్ఠ ఇట్లే శ్రీనాథుని కృతు

లలో సైతము పాపభీతిని విడనాడి ప్రథమమున ప్రవర్తించుట. ఆతర్వాత తత్ఫలితముల ననుభవించుట వర్ణ్యమానము లగుచుండును. ఇవి సామాజికునిలో పాపభీతిని రేకెత్తించును. పాశ్చాత్య సాహిత్య తత్త్వములోని "Pity and fear" ఈ కృతులలో చక్కగ కన్పట్టును.

పోతన భాగవతమున కృష్ణుని వెన్నంటిన రుక్మి శిశుపాలాదులు పారిపోవుటలో భయానకము చక్కగ వర్ణింపబడినది. అంతేగాక పాపభీతికి సంబంధించిన సామగ్రి పోతన భాగవతమున సైతము గన్పట్టును. అంతేకాదు. పోతన భాగవతములో పాపభీతియే అవసరముగాని ప్రాణభయము పరిత్యాజ్యమనియు అందు మన కర్తృత్వము లేదు అను సిద్ధాంతమును సైతము గజేంద్రమోక్షము మొదలగు కథలమూలమున నిరూపించును. ప్రహ్లాదుని రాక్షసులు బాధించు సందర్భము సయితము భయానకము.

ఆముక్తమాల్యద యందు మాలదాసరి నియమభంగ మగునేమో యని భయపడును ఇదియును పాపభీతికి సంబంధించిన విషయమే. నిత్యము విష్ణుపూజ చేయువారు ఆదినము చేయక పోవుట పాపహేతు వని అతని భయము. ఇక ప్రబంధవాఙ్మయములో, దక్షిణాంధ్ర వాఙ్మయములో చంద్ర మదనులవలన నాయికలు భయపడుట విప్రలంభశృంగారములో వర్ణింపబడుచున్నది కళా పూర్ణోదయములో రాక్షసునిచే తరుమబడు అభినవకౌముదిలో ప్రాణభయము వర్ణింపబడినది.

భయానకము ప్రాయికముగ వీరమునకు ప్రతిద్వంద్విగను కరుణమునకు అత్యంత సహచరమైన అంగముగను గన్పట్టును. నలునిచే జిక్కిన హంసరోదనము భయమూలముగా ఏర్పడిన కరుణరసము. అగస్త్యుడు కాశిని బాయుటలో పుణ్యక్షీణ భయమూలముగ ఏర్పడిన కరుణము గన్పట్టును

జానపదసాహిత్యములో వీరరసప్రధానములైన పేరంటాళ్ల కథలయందును రాక్షసాదివృత్తాంతములుగల అద్భుతరస ప్రధానసాహిత్యమునందును భయానకము చక్కగా పోషింపబడుచుండును.

ఆహారనిద్రాభయములు మానవునకు సహజములు. ఎవరి బోధయు నక్కరలేదు. కావున ఆ భయభావమునుండి భరతుడు రసమార్గమును కనుగొనినాడు. ఈ భావము అపరిహార్యము కాని ఉదాత్త ప్రకృతులలోను ధీరస్వభావులలోను ఇది

మానాత్మకమయి యుండును. వినయాత్మక మయి యుండును. సామాన్యులలో మరింత హెచ్చుగా విశేషరూపమున నుండును. ఎవ్వరును దీనిని పరిహరింప లేరు.

బీ భ త్స ము :

రమ్యం జుగుప్సిత ముదార మథాఽపి నీచ
ముగ్రం ప్రసాది గహనం వికృతం చ వస్తు
యద్వా ప్యవస్తు కవిభావుక భావ్యమానం
తన్నాస్తి య న్న రసభావ ముపైతి లోకే (దశరూపకము)

కావ్యము శిల్పముతో ననల్ప మైనపుడు రమ్యతాజుగుప్సల తారతమ్యపరీక్షల కవకాశము లేదు. రెండును రసనీయములే. రమణీయములే. సిరిమల్లెల మాలలు చూచినపుడును తెగిపడిన ప్రేవులు చూచినపుడును రంగస్థలమున సమానముగనే ఆనందము కలుగును. అందుకే రసములలో శృంగారమునకేకాక బీభత్సమునకు కూడస్థాన మేర్పడినది.

సాహిత్యములో బీభత్సరసపోషణము ప్రాయికముగ అత్యల్ప మన వచ్చును. భావనామయజీవనమునకు ప్రాధాన్యము నిచ్చి వ్రాయబడెడి సాహిత్యములో జుగుప్సాభావనమునకు స్థానము కొంత తక్కువే కదా! ఏ యుద్ధవర్ణనములో లేక ఏ ప్రతినాయకుని దౌష్ట్యములో చూచినపుడు చూడలేని కారణముగ మొదటి విషయమున, అసహ్యకారణముగ రెండవ విషయమున జుగుప్సకలిగి బీభత్సముగ పరిణమించును. కాని రెండవవిషయమున జుగుప్స కన్న ఆయారసముల ఆభాసములు ప్రాధాన్యమును వహించుచుండును.

ఆంధ్రసాహిత్యములో తిక్కన బీభత్సరసపోషణమును రమణీయముగ చేసినాడు. యుద్ధపర్వములలో శృంగార సామానాధికరణ్యము తోడను రౌద్రసామానాధికరణ్యముతోడను పలుమార్లు బీభత్సమును పోషించి రమ్యతరత్వము నాపాదించి పెట్టినాడు. రౌద్రబీభత్సములను కలిపి వర్ణించి తర్వాత వానిని శబ్దావ్యములను చేయుట తిక్కన పరిపాటి. బీభత్స వర్ణనములలో సైతము తిక్కన రమ్యత్వమునే పరికించుచుండును,

"నెత్తుటఁ దోగి నేల మెఱని-గి తెఱఁగున నుండె నక్కువ
కో త్తముఁడందు, జంద్రుక్రియ నొప్పె సితాయుధఖండభూషఁ
దా త్తమణిప్రతానములు తారల చందము నొంది యందమై
యత్తఱి నల్లసిల్లె వసుధాధిప చూడఁజూడిక్కి కింపుగన్

ఎఱ్ఱన సైంధవ పరాభవ ఘట్టమునను నాచన సోముని హంస డిభకోపాఖ్యానము నందును బీభత్సము చోటు చేసికొనినది. నన్నెచోడుని కుమారసంభవమందును తుదకు శృంగార ప్రబంధమైన వసుచరిత్రమునందును సన్నగా చోటుచేసుకొనది. ఆముక్తమాల్యదలో రాక్షస వర్ణనమునందును కాళహస్తిమాహాత్మ్యమున నత్కీరుని కుష్ఠవ్యాధి వర్ణనమునందును ఇంకను పలుతావుల విది గోచరించును.

ఆధునిక సాహిత్యమున జాషువా స్మశానవర్ణన దీనికొక చక్కని విదర్శనము బీభత్సములో సయితము రమ్యత రూపుదిద్దుకొన్నది.

దీని తత్త్వము సయితము రౌద్రతత్త్వము వంటిదే. రౌద్రము మనస్సు ప్రజ్వలింపజేయును. బీభత్సము విక్షోభము గల్గించును. సుకుమారప్రకృతులీ విక్షోభమును లౌకికముగ భరింపజాలరు కాన భావస్థితిలో విది యెక్కుడుగ ఆస్వాద్యము గాదు. దానికి రసత్వసిద్ధి కల్గించినపుడు ఆస్వాద్యమే యగును ఈమర్మము తెలిసి తిక్కనగారు దానిని రౌద్రాదులతో సమ్మేళనమొనర్చి చక్కగా ఆస్వాద్య మొనరినారు.

అద్భుతము :

సాహిత్యజగత్తులో అద్భుత మొక విశిష్టరసము. ఇది లలితసుకుమార ప్రకృతులచే ఎక్కుడుగ ఆస్వాదింపబడును. అంతమాత్రమున ధీరప్రకృతులకు ఆస్వాద్యము కాదని కాదు. కాని ఉద్ధత ప్రకృతులకు మాత్రము అత్యంత సన్నికృష్టము గాదు.

కథాకల్పనమునందును రసపోషణమునందును అద్భుతరసమునకు ప్రాధాన్య మెక్కువ. కథాంతమున అద్భుతరసమును తప్పక అనుసంధింపవలయునని భరతోక్తి "పర్యన్తే కర్తవ్యో నిత్యం హి రసోఽద్భుతః" (నాట్యశాస్త్రము) ప్రాయకముగ కథారంభమునను, కథామధ్యభాగమునను గూడ అద్భుతరసపోషణ మపేక్షితముగ యుండును. కథాబీజమును నాటుట యందును గర్భనిర్వహణములందును ఇ

యవశ్య మాదరణీయముగదా. "కుర్యా న్నిర్వహణే ఽద్భుతమ్" అని గదా అలంకారికాభిభాషణము.

రసపోషణవిషయమున సయితము రెండు విరుద్ధరసములకు వైరుధ్యమును తొలగించి పోషించుట కుపకరించెడిది ప్రధానముగ నద్భుతమే. దీనికి మిగిలిన ఏ రసముతోడను వైరోధ్యము లేదు కనుక ఎట్టి విరుద్ధరసములైనను వైరుధ్యమును తొలగించుట కుపకరించును. నాగానంద నాటకమున శాంతశృంగారములను ఏకనాయకాశ్రయములనుగ పోషించుట కుపకరించి దీ అద్భుతమే. లౌకికముగ సయితము సముచిత కారణవర్ణనమున విస్మయావహులు కాని వ్యక్తులు అరుదు.

ఆశ్చర్య చూడామణి యనురూపకము తప్ప మరే ప్రబంధమును అద్భుత రసప్రాధాన్యమును వహించుట కన్పట్టదు. సాహిత్యమునందంతటను అది అంగరసముగనే పరిపుష్టము.

నన్నయ అద్భుతరసము ననేకప్రదేశముల వర్ణించినాడు. శృంగారపోషణమునకు పూర్వరంగముగ పలుతావుల నన్నయ అద్భుతమును వర్ణించియున్నాడు. పరమ మహర్షి అయిన జరత్కారుఁడు వివాహము చేసికొన సమ్మతించుటకు ముందుగ అద్భుత రసమును పోషించినాడు. "మూషికవిలూనంబయి యొక్క మూలంబు తక్కియున్న వీరణతృణ స్తంభంబు నవలంబించి తలక్రిందై యాదిత్య కిరణంబు లాహారంబుగా వ్రేలుచున్న ఋషులను చూచుట చూచి ....

కడు నుగ్రము దలక్రిందుగ
బడి వ్రేలుట యిదియు నొక తపంబో కో నాకే
ర్పడఁ జెప్పుడీ తపంబేఁ
దొడఁగెద నసవుడు నధ్యధోముఖవిప్రుల్. 1-2-.40

అని విస్మయావహుడై ప్రశ్నించుటయంతయు నద్భుతరసమే. అపై నాతడు వివాహేచ్ఛను బడయును. ఇట్లే దుష్యంతు డాశ్రమప్రవేశము చేసిన యనంతర మందును శకుంతలను గాంచి యామెతో గాంధర్వవివాహ మగుటకుముందునుఅద్భుత రసము పోషింపబడినది,

సహజ వైరివర్గంబులయు సహవాస మపుడు
సూచి మునిశక్తి కెంతయు జోద్య మంది" 1-4-23

తిక్కన రచనకు ననంతముగా అద్భుత రసపోషణము గన్పట్టును. పదునైదు పర్వములలో నవరసములను సమగ్రముగ పోషించుట కవకాశము గల్గినపుడు మిగిలిన ఎనిమిది రసములతోడను మైత్రికల అద్భుతరసపోషణము అనంతముగ సాగుట నిస్సంశయము. అయినను అది అన్యాంగముగనే - అభిమన్యుడు పద్మవ్యూహమును జొచ్చుకొని పోయిన సమయమును పరికింపుడు.

మెఱుగు మెఱసినట్లు మెఱయంగ నరదంబు
కర్ణికారకేతు కాంతి వెలుఁగ
నంపగముల గురుని నలయించి కడచి యిం
ద్రజుని కొడుకు మొగ్గరంబు సొచ్చె - (ద్రోణ-2-17)

ఇందు మెఱపు మెఱిసినట్లు రథము ప్రకాశించుట మొదలగునవి అతని గమనమునందలి వేగాధిక్యమును వ్యక్తముచేసి శ్రోతల నద్భుతపరవశుల జేయును. ఇది వెను వెంటనే పోషింపబడుచున్న రౌద్రరసమున కంగత్వమును పొంది దాని నుద్దీపింపజేయును. శృంగారరసాంగముగా తిక్కన అద్భుతమును పోషించిన తీరును చూడుడు.

ఎందును నిట్టిరూపు నరు లెవ్వరుఁ గాంచిరె నాకుఁ గాదు సం
క్రందనసూతికిం దగిలికన్గొన జాలదె దాన నిందిరా
నందను నాజ్ఞయేచి భువనంబులఁ బ్రబ్బదె యిత్తలోదరిం
జెందగఁ గాన్పు గాదె ఫలసిద్ధి పురాతన పుణ్యబుద్ధికిన్.

(విరాట-ద్వి-26)

సైరంధ్రిని గాంచి కీచకుడు తలంచిన తలంపిది

ఎఱ్ఱన మహాభారత భాగమనను హరివంశమున ఉష చెలి అయిన చిత్రలేఖ చేష్టలు - అనిరుద్ధుని సంగ్రహించి తెచ్చుట, మున్నగు వాని యందును అద్భుతరస పోషణము గన్పట్టును.

శైవవాఙ్మయములో అద్భుతరసమునకు చాల ప్రాధాన్యము గలదు. ఆన్నియు శివభక్తిని వివిధరూపములలో చిత్రించి, ఆ మాశివ హాత్మ్యమును చాటుట వాఙ్మయ లక్ష్యమైన కారణముగ అత్యద్భుతము లయిన కథలు ఆ సాహిత్యమున గన్పట్టును. జానపద పామరసాహిత్యమున వీరరస ప్రధానములయిన అత్యద్భుత కథలున్నట్లు శైవవాఙ్మయమున భక్తి ప్రధానములగు న అత్యద్భుత కథలు గన్పట్టును. తిన్నని కథ, గొడగూచి కథ - చిఱుతొండనంబి కథ మొదలగున వెన్నియో ఆకోవకు జెందినవి. బసవపురాణము అట్టి కథలకు ఆటపట్టు.

శ్రీనాథ పోతనల సాహిత్యములలో అద్భుతరసస్ఫోరకము లనంతములు - శృంగారనైషధములోని పంచనళీయ ఘట్టము అత్యంత మద్భుతావహము - శ్రీనాథ పోతనల కవిత శివభక్తి విష్ణుభక్తి ప్రధానము. కాని వీరశైవము వీరవైష్ణవము గాదు. ఇరువురి కవితలను భక్తిశృంగారములు ప్రధానము లయి అద్భుతము దాని కంగ మగును - పోతన భాగవతములోని "ఇంతింతై వటు డింతయై" అను పద్యము అద్భుతరసమునకు రమణీయోదాహరణము.

శ్రీకృష్ణుని చేష్టల వర్ణించుటలో ఈ అద్భుతము ప్రధాన స్థానమును వహించును.

వీరరస ప్రధానములైన విక్రమార్కచరిత్రము మొదలగు వానిలో జక్కనాదులు అద్భుతరసమునకు తగిన స్థానము నిచ్చిరి.

ఇక ప్రబంధయుగమున అద్భుతము ఉపక్రమ నిర్వహణములలో పోషింపబడుట సర్వవిదితమే. వినుకలియో కనుకలియో కారణముగ లోకోత్తర సౌందర్యవతియైన కాంత కలదని తెలిసినపుడు నాయకుని ఆశ్చర్యమున కంతు ఉండదు. అట్లే ఏ చెలుల వలననో చారులవలననో, నాయక గుణగణములను విన్నపుడు నాయికకు ఆశ్చర్యము కలుగకమానదు. అట్లే అంతమున సయితము ఆలంకారిక నియమాను సారముగను కథానుగుణముగను అద్భుతమవశ్యమాదరణీయమే. ఇది సర్వ ప్రబంధ సామాన్యలక్షణమనుట అసంగతమేమియు కాదు. మనుచరిత్రమున.

ఎక్కడి వాఁడో ! యక్షతనయేందుజయంత వసంతకంతులన్
జక్కఁదనంబునం గెలువఁ జాలినవాఁడు మహీసురాన్వయం
బెక్కడ యాతనూవిభవ మెక్కడ గేలనిబంటు నాఁ మగన్
డక్కఁగొనంగ రాదె యకటా నను వీఁడు పరిగ్రహించినన్

(మను - ద్వి)

ఈ అద్భుతరసము శృంగారాంగమే.

ఇక ప్రబంధయుగములో అద్భుత రసమునకు రసనీయత లభించిన విశిష్టస్థాన మొకటి గలదు. అది కళాపూర్ణోదయము. కథను కాలక్రమ పద్ధతిని గాకుండ - కార్యక్రమ పద్ధతిని నిబంధించుట, రంభాద్వయమును నలకూబరయుగ్మమును కల్పించుట, కలభాషిణీమణికంధరు లిరువురును నలకూబర రంభాభిలాష కలవారయినను ఇరువురి ఆసలు తీరక కలభాషిణీ మణికంధరులే కలియుట, మొదలగున దంతయు ఎంతో విచిత్రముగ గన్పించి పాఠకుని మనస్సులో అత్యంతాద్భుతమును గల్గించును. పర్యంతమున నిదంతయు సరసనల్లాపము వలన బుట్టినదని తెలిసినపుడు ఆ విషయమును సమగ్రముగ చదివినపుడు పాఠకుకు కొన్ని నిముషములు నోటమాట రాక నిలిచిపోవుట నిక్కువము. ఈ యద్భుతమునకు దోడు మరియొక యద్భుతము. అదే కాలమున పాశ్చాత్యనాటకకర్త Shakespeare ఇట్టి కథాకల్పనముతోడనే The comedy of errors అను ప్రహసనమును రచించుట.

ఇది గాక పంచతంత్రము భోజరాజీయము నీతిచంద్రికల వంటి గ్రంథములు అద్భుతరసమునకు వైశిష్ట్యము నిచ్చుచున్నవి. అందు పాత్రములు పశుపక్ష్యాదులే అయిన కారణమున సర్వమును అద్భుతముగ గోచరించి ఒక విశిష్ట స్ఫూర్తికి అవకాశ మేర్పడును.

ఇక జానపద పామర సాహిత్యములలో అద్భుతము అంగిరస మనవచ్చును. నాయకునిలో వీరమును వర్ణించినను శృంగారమును వర్ణించినను అది సామాన్యరూపమున గన్పట్టును. ఒక విధమయిన అద్భుతదశయందే కన్పట్టును. కనుకనే వానిని బాలలు, బాలమనస్తత్వమును దాటని యితరులును ఎక్కువగా ఆదరించుట వారికొఱకై అవి ప్రధానముగ నిర్దిష్టములగుట - ఇతరులు నొకచో ఆదరింపవచ్చును. కాని ప్రధానముగ కాదు.

ఇట్లు కాగా ఆంధ్ర సాహిత్యమున పండిత వాఙ్మయమునందు కన్నను పామర వాఙ్మయమున అద్భుతము తనస్థానమును పెంచుకొని నాటికిని నేటికిని అప్రతిహతముగా ఆస్వాద్యమాన మగుచున్నది.

ఈ రసవిషయమున వక్తవ్య మొందుకలదు. అద్భుత మనునది విస్మయ స్థాయికము. అది చమత్కారజన్యము. తత్ప్రస్థాన ప్రవర్తకుడు తెలుగువాడు - మరియు "రసే సారశ్చమత్కారః ......సర్వత్రా ప్యద్భుతో రసః" అనిన నారాయణుడు "విస్మయము రసస్థితికి సమీపస్థితి - అది చాలతీవ్రంగ కల్గును. కాని క్షణికము-శాబ్దిక" మగుటచే మనకవులు అద్భుతమునకు అంగరసప్రతిపత్తియే కల్పించినారనియు మరియు అది ధీరప్రకృతికి విరుద్ధము - దూరము - అగుటచే నయితము దాని కట్టి ప్రతిపత్తినే కల్పించి రనుటయు యుక్తిదూరము కాదు.

శాంతము :

ఇది ప్రకృతిరసము. ఆయాకారణముల నూతగగొని శాంతముకంటె భావము లుద్భవించి మరల ఆ హేతువు నశింపగనే అశాంతమున అంతర్లీన మగును.

జీవితములో చిన్ననాటనుండి ఎన్ని రసములను అనుభవించినను అంతిమస్థితి శాంతస్వరూపమే. ఈ సిద్ధాంతము నాధారముగఁ జేసికొని దానిని కావ్యమున సంక్రమింపజేసి ఆనందవర్ధనుడు మహాభారతమున శాంతము ప్రధానరస మని నిరాఘాటముగ పలికినాడు. మహాభారతమున వృష్ణిపాండవాది వర్ణనము లెన్నియున్నను తుట్టతుద హరివంశవర్ణన ముండుట - వైరస్యమును కల్పించుట మొదలగునవి వైరాగ్యరూపమయిన శాంతమునకు గల ప్రాధాన్యమునే వ్యక్తీకరించుచున్నవి. లోకతంత్ర మెప్పు డసారమగునో అప్పుడు తప్పక శాంతమే కలుగునని అతని అభిప్రాయము.

ఆంధ్రమహాభారతమున శాంతము ప్రధానమనుటకు పలువు రంగీకరింపరు. వారు వీరము ప్రధానమందురు. "ఋషి వంటి నన్నయ్య రెండవ వాల్మీకి" (శ్రీమద్రామాయణ కల్పవృక్షము - అవతారిక) వంటి వాడయినపుడు అతని గ్రంథమున రచనమున శాంతము కొఱవడునా! అంగిరసముగా నన్నయ శాంతమును వచింపక పోయినను సర్వరసపోషణము లందును నన్నయ శాంతస్థితి వ్యక్తమగుచున్నది. శృంగారరసము నయినను సరే శాంతస్వరూపముననే చిత్రించును.

దుష్యంతుడు శకుంతలను చూచినపుడును, వారిరువురును గాంధర్వవిధి పెండ్లి యైనపుడును ఇతరకవులవలె భావ వికారములకు తావీయక వారిరువురను విందుకుందలవలెనే చిత్రించినాడు. అంతటి సంయమిత్వ మీయన రచనలో గలదు ఋష్యశృంగాదుల మహత్త్వమును, జరత్కారుడు మున్నగు వారి లోని విరీహత త్త్వమును, ఉదంకుడు మున్నగు వారిలోని భక్తితత్త్వమును శాంతమునకే అంగములు. శాంతము అందు ప్రధానము. నన్నపార్యుడును భారతావతారికలో .... "అష్టాదశ పురాణంబులును, నీతిధర్మశాస్త్రార్థతత్వంబులును . శ్రీకృష్ణుని మాహాత్మ్యంబును పాండవాది మహావీరుల మహాగుణంబును" .... అనుటను బట్టి ఆనందవర్ధనుని విధానముతో నాలోచించిన నన్నయ కభిమతమైనది భారతమున శాంతము అనవలసి వచ్చును.

తిక్కయజ్వమతానుసారముగ భారతమున శాంతము ప్రధానము కాదేమో అని స్థూలముగా తోచును.

అని రచనా కౌతుకమున
మన మలరఁగ నీ ప్రబంధమండలి కధినా
ధునిగా నే పురుషునిఁ జే
ర్కొను వాఁడనొ యను తలంపు గూడిన మదితోన్

(విరాటపర్వము 1-8)

అని ప్రబంధమండలి అని వ్యవహరించినాడు. ప్రబంధములు శృంగార రస ప్రధానములుగా నుండుట తిక్కయజ్వయెఱుఁగఁడా ! ఆ నాటికి సంస్కృతాలంకార శాస్త్రము వ్యాప్తమేగదా ! అందుకే ప్రబంధమండలి అనినాడు - అనవచ్చును. కాని తుదను

వేదములకు నఖిలస్మృతి
వాదములకు బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా
మూదల ధర్మార్థ కామ మోక్షస్థితికిన్ – (విరాట -1 - 29)

అని వచియించుట శాంత ప్రాధాన్యమునే సూచించును. ధర్మార్థ కామమోక్ష స్థితులకు శాంతము మూలమైనను ధర్మార్థ కామములు లౌకికములు అప్రధానములు. మోక్షము అలౌకికము ప్రధానము. కావున మోక్ష ప్రాధాన్యము సిద్ధించి శాంతము ప్రధానమగును. అంతియగాక - "ఇది యనన్యసామాన్యకరణంబు పరమ ధర్మ ప్రకారంబు" అని వచించుట నయితము భారతమున శాంత రసప్రాధాన్యమును సూచించుటయే, తిక్కయజ్వ యభీష్టమన వలయును. మహాభారతములోని భగవద్గీతా పారానువాదము, శాంతిస్వర్గారోహణపర్వములు శాంతరసమును అంతమునపోషించుచు శాంత ప్రాధాన్యమును వక్కాణించుచున్నవి.

ఎఱ్ఱన హరివంశమున నయితము శాంతరసమే ప్రబంధ ధ్వని రూపము. శృంగారవీర రౌద్రాది రస పోషణమున్నను అది శ్రీకృష్ణభక్త్యంగమేగాని అన్యము గాదు. కృష్ణమాహాత్మ్య ప్రతిపాదకమే. కాగా సర్వము నందం తర్భావమును పొంది శాంత ప్రాధాన్యమును వ్యక్తీకరింపగలవు. నృసింహ పురాణమును భక్తి పారమ్య బోధకమైన పురాణ గ్రంథమగుటచే శాంతరస ప్రధానమైనదని చెప్పవచ్చును.

ఆంధ్ర సాహిత్యములో భక్తి ప్రధాన సాహిత్యము చాల కన్పట్టుచుండును. వీరశైవ వాఙ్మయము - శ్రీనాథుని కాశీఖండ, భీమఖండ, హరవిలాస శివరాత్రి మాహాత్మ్యములు, పోతన భాగవతము మొదలగున వన్నియు భక్తి ప్రతిపాదకములే. భక్తి మోక్షమార్గము గాన భక్తి ప్రధాన కావ్యములలో భక్తిని రసముగా అంగీకరించిన పక్షమున భక్తి రస ప్రధానమనియు దాని నంగీకరింపలేనిచో శాంత ప్రధానమనియు ననవచ్చును. ఆ భక్తి గ్రంథములలో పైతము ఈహాతత్త్వమున్నచో శాంతము ప్రధానముగాదు. నిరీహాతత్త్వమున్నపుడే శాంతము ప్రధానమగును. పోతన భాగవతారంభముననే

శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తరక్షణ కళా సంరంభకున్ . . . . . అని

కైవల్య ప్రాప్త్యుపాయముగ కావ్యము ను స్వీకరించుట అందలి శాంతరస ప్రాధాన్యమును వ్యక్తీకరించుచున్నది. శ్రీనాథ కృతులలో పైతము మధ్య మధ్య శృంగారరసము మిక్కుటముగా వర్ణింపబడినను అదంతయు శాంతరస పర్యవసాయియే యగుట గమనార్హము.

నంది మల్లన ఘంట సింగనల ప్రబోధ చంద్రోదయము కేవలము శాంతప్రధానమే. ఇది సంస్కృతమున కనువాదము. సంస్కృతమున కృష్ణమిశ్రుడు దానిని రచించెను. నాసికేతూపాఖ్యానము దుగ్గనరచించినది సయితము శాంతరస ప్రాధాన్యమే యగును. ప్రబంధ యుగమునగూడ ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యము రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచలమాహాత్మ్యము, ఉద్భటారాధ్య చరిత్రము, శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద మొదలగున వన్నియు భక్తిరూపములైన శాంత రసప్రధాన కావ్యములు. వైజయంతీ విలాసము వంటివి సయితము శాంత ప్రధానములే.

సంకుసాలనృసింహకవి రచించిన కవికర్ణ రసాయనమున శాంతరస పోషణము గన్పట్టును

యతి విటుఁడు కాక పోవుటెట్లు మదీయ
కావ్యశృంగార వర్ణనా కర్ణనమున
విటుఁడు యతికాక పోవునే వెస మదీయ
కావ్యవైరాగ్య వర్ణనా కర్ణనమున

అని శృంగార శాంతములకు సమప్రాధాన్యము నిచ్చినాడు. కాని ప్రారంభమున శృంగారమును అంతమున శాంతమును వర్ణించుట శాంత రస ప్రాధాన్యమును కవి యంగీకరించినట్లు సూచించును.

ఆంధ్రవాఙ్మయములో విశిష్టస్థానమును వహించిన శతకములలో శాంత పోషణము గన్పట్టుచుండును సమాజముపై జాలి, అహంభావముపై ఏవగింపు మొదలగు భావములు శతకకర్తల గుండెలలో చోటుచేసికొని శతకములను భక్తిప్రధానముగా గాని శాంతరస ప్రధానములుగా గాని తీర్చిదిద్దుట కవకాశముల నిచ్చుచున్నవి. ఆధునిక కాలములో విశేషించి ఈశతక సాహిత్యము మిక్కుటమగుచున్నది. వానిలో శాంతరస ప్రధానములలో తలమానికము లనఁదగినవి శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారి విశ్వనాథ మధ్యాక్కరలు మొదలగునవి. వీరి రామాయణ కల్పవృక్షము సయితము ఆధునిక సాహిత్యములోని ప్రబంధములలో శాంతరస పోషణమునకు నికషముగా మన్నది.

"వ్రాసిన రామచంద్రుకథ వ్రాసితి నం చనిపించుకో వృథా
యాసము గాక కట్టుకత లైహికమా పరమా...."

యను జనకుల యుద్బోధ నూతగా గొని పరమార్థసాధనరూపమున రామచంద్రుని కథను వ్రాసి శాంతరసమునకు ప్రాధాన్యము నిచ్చినారు.

ఈ శాంతప్రాధాన్యము జానపద సాహిత్యమునందును యక్షగానాదులయందును కూడ కన్పట్టును. వివేకవిజయము రాజరంజనవిద్యావిలాసము మొదలగు యక్షగానము లీ కోవకు జెందినవి.

వీనిలో ఒక రహస్య మున్నది. మానవులలో చాలమంది వయస్సు మళ్ళినంతనే మోక్షపథిగాము లగుదురు. అప్పటికి బుద్ధి పరిణత మగును. అపుడు వారి నాకర్షించునది శాంతమే కాని ఇతర రసములు గావు కావుననే

భారత కవిత్వరుచి పట్టుబడెడు నరకె
ఇతరకావ్యాలు తడవు సాహిత్యవటువు


అనినారు పింగళివారు. నేటికిని పల్లెపట్టులలోను పండితమండలిలోను భారతము చదువవిదే నిద్రపోని వారెందరో కలరు. ఈవిషయము మన జీవనముపై శాంతరస ప్రభావమును సూచించును.

ఉ ప సం హా ర ము :

ఈ రసము లన్నియు ఆనందప్రదములయ్యును వివిధములైన ఉపాధిభేదములచే వేరుగా నామకరణ మొనర్పబడినవి. తెలుగుకవు లందరును సహృదయులకు రసానందమును తమ శక్తికొలది పంచి యిచ్చినారు.

కామోత్కంఠత గోపికల్; భయమునం గంసుండు; వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్; సంబంధులై వృష్ణులున్;
ప్రేమన్ మీరలు; భక్తినేము; నిదె చక్రిం గంటి మెల్లైన ను
ద్దామధ్యానగరిష్ఠులైన హరిఁ జేంరన్ వచ్చు ధాత్రీశ్వరా!

అన్నట్లు ఏరసమైనను ఉద్దామధ్యానముచే భావనముచే పర్యంతమున ఆనందప్రద మగును. ఆ యానందమే అభిలషణీయము. అట్టి ఆనందలక్షణప్రదర్శనమునకు తెలుగువారి వరివస్యాప్రతిఫలనమునకును నైన యీకృషికి సహృదయ పరితోషమే ఫలము.



ఉపయుక్త గ్రంథసూచి

సంస్కృతము :

1. అప్పారాయ యశశ్చంద్రోదయము.
2. ఆంధ్రశబ్దచింతామణి.
3. ఉజ్జ్వలనీలమణి.
4. ఏకావళి.
5. ఔచిత్యవిచారచర్చ.
6. కవికంఠాభరణము.
7. కావ్యప్రకాశము.
8. కావ్యమీమాంస.
9. కావ్యాదర్శము.
10. కావ్యానుశాసనము.
11. కావ్యాలంకారము(భామహ)
12. కావ్యాలంకారము(వాగ్భట)
13. కావ్యాలంకారము(రుద్రట)
14. కావ్యాలంకారసూత్రవృత్తి.
15. చంద్రాలోకము.
16. చమత్కారచంద్రిక.
17. దశరూపకము.
18. ధ్వన్యాలోకము.
19. నాట్యదర్పణము.
20. నాట్యశాస్త్రము(gaekwad Orien tal Series).
21. ప్రతాపరుద్రయశోభూషణము.
22 భక్తిరసాయనము.
23. భావప్రకాశము
24. రసగంగాధరము,
25. రసచంద్రిక.
26. రసతరంగిణి.
27. రసరత్నప్రదీపిక.
28. రసవివేకము.
29. రసార్ణవసుధాకరము.
30. వక్రోక్తిజీవితము.
31. వ్యక్తివివేకము
32. శృంగారతిలకము.
33. శృంగారప్రకాశము.
34. శృంగారమంజరి.
35. సరస్వతీ కంఠాభరణము
36. సాహిత్యదర్పణము
37. సాహిత్యచింతామణి. (Paper manuscript)
38. సంగీత రత్నాకరము.
39. సాహిత్య రత్నాకరము.
40. అభినవభారతి.
41. అవలోకము. (దశరూపకవ్యాఖ్య).
42. చంద్రిక (రసగంగాధరవ్యాఖ్య).
43. తరళము (మల్లినాథునివ్యాఖ్య).
44. నాగేశ్వరి.(కావ్యప్రకాశవ్యాఖ్య)
45. బుధరంజని(కావ్య ప్రకాశవ్యాఖ్య)
46. మందరము - నౌక(సాహిత్యరత్నాకరవ్యాఖ్యలు)
47. రత్నాపణము(ప్రతాపరుద్రీయ ")

48. లోచనము(ధ్వన్యాలోకవ్యాఖ్య)
49. కవిశిరోభూషణము(చింతామణి ")
50. అగ్నిపురాణము.
51. ఉత్తరరామచరితము
52. కఠోపనిషత్తు
53. కాదంబరి.
54 కుమారసంభవము
55. తైత్తిరీయోపనిషత్తు
56. నాగానందము
57. పాణిని వ్యాకరణము.
58. మహాభారతము.
59. మేఘదూతము.
60. రఘువంశము.
61. రామాయణము.
62. విష్ణుపురాణము
63 అభిజ్ఞానశాకుంతలము
64 శ్రీమద్భగవద్గీత.
65. సుభాషితత్రిశతి.
66. శబ్దకల్పద్రుమము.
67. తర్కసంగ్రహము.

తెలుగు

1. అప్పకవీయము
2. అలంకారశాస్త్రచరిత్ర
3. ఆంధ్రకవుల ఔచిత్యవిచారణ
4. ఆంధ్రధ్వన్యాలోకము (వేదాల)
5. ఆముక్తమాల్యద
6. కళాపూర్ణోదయము
7. కవికర్ణరసాయనము
8. కాళహస్తిమాహాత్మ్యము
9. కాశీఖండము
10. కావ్యాత్మ
11. కావ్యాదర్శము
12. కావ్యానందము
13. కావ్యాలంకారచూడామణి
14. కావ్యాలంకారసంగ్రహము
15. కావ్యలక్షణము
16. కావ్యశిల్పము
17. కావ్యస్వరూపము
18. కుమారసంభవము
19. క్రీడాభిరామము
20. నాట్యవేదము
22. పారిజాతాపహరణము
23. పాండురంగమాహాత్మ్యము
24. ప్రతాపరుద్రయశోభూషణము
25. భీమేశ్వరపురాణము
26. మనహాస్యము
27. మనుచరిత్ర
28. మహాభారతము
29. రసగంగాధరము (జ.మా. శర్మ)
30. ,, (వే.తి.ఆచార్యులు)
31. ,, (ధ.వేం.సు.)
32. రసమంజరి
33. రసాభరణము
34. రసార్ణవసుధాకరము

35. వసుచరిత్రము
36. విక్రమార్కచరిత్రము
37. విశ్వనాథసాహిత్యోపన్యాసములు
38. వీరరసము
39. వైజయంతీ విలాసము
40. శివరాత్రిమాహాత్మ్యము
41. శ్రీమదాంధ్రభాగవతము
42. శృంగారప్రకాశము
43. శృంగారాంధ్రరసమంజరి
44. శృంగారనైషధము
45. శృంగారశాకుంతలము
46 శృంగారరసాలవాలము
47. సాహిత్యదర్శనము
48. సాహిత్యశిల్పసమీక్ష
49 సాహిత్యసోపానములు
50. సాహిత్యసౌందర్యము
51 సాహితీ సౌరభము
52. సాహిత్యదర్పణము
53 సాహిత్యవిమర్శ
54. హరివంశము (ఎఱ్ఱన)
55 హరివంశము (నా.సో.)
56. తెలుగుసాహిత్యములో హాస్యరసము

ENGLISH

1. Aesthetic Experence according to Abhinavagupta
2. Indian Aesthetics
3. The Number of Rasas
4. The Contribution of Andhras to Sanskrit Literature
5. History of Sanskrit poetics
6. Sansk[illegible] ctics
7. An Introduction to Bhavaprakasa of Saradatanaya

